# HISTORY OF MODERN ANDHRA (1765 TO 1956)

## (DH25)

## (MA-HISTORY)

## ACHARYA NAGARJUNA UNIVERSITY

### CENTRE FOR DISTANCE EDUCATION

### NAGARJUNA NAGAR,

### GUNTUR

### ANDHRA PRADESH

M.A. History 2nd Year

SYLLABUS

# Paper - V : History of Modern Andhra (1765-1956)

**UNIT - I :**

European Settlements in Andhra - The Anglo-French rivalry and Carnatic Wars - The British acquiring the Northern circars and Ceded Districts - Revolts against the British and their suppression - The British Consolidation of Power.

**UNIT - II :**

Administration of East India Company - Revenue systems at the time - The Zamindari and ryotwari settlements - irrigational Works - Growth of Education - Telangana under the Asafjahis - Reforms by Dewan Salar Jung.

**UNIT - III :**

Social Reforms Movements in Andhra - Brahmo Samaj - Veeresalingam - Venkataratnam Naidu - Gurazada Appa Rao - Arya Samaj - Andhra under the Crown - Growth of press and Public Opinion.

**UNIT - IV :**

Factors for the Growth of Nationalism in Andhra - Vandemateram Movement - House Rule League - Gandhian Era - The Chriala - Perala Movements - Forest Satyagraha - No - Tax Campaign at pednandipadu - The Ramu Rebellion - Salt Satyagraha - Quit India Movement.

**UNIT - V :**

Freedom Movement in Talangana - Movement for a Separate Andhra State Emergence of Andhra Pradesh.

## Text Books :

1. Rao, P.R. : History of Modern Andhra
2. Venkatarangaih,M., : Freedom Struggle in Andhra Pradesh
3. Venkatarangaiah, M., : Freedom Struggle in Telangana
4. Narayana Rao, K.V., : Emergence of Andhra Pradesh
5. Sarojini Regani : Highlights of Freedom Movement.

## Reference Books :

1. Kesavanarayana, B., : Political and Social Factors in Modern Andhra.
2. Baker, C.J. and Washbrook, D.A. : South Indian Political Institutions and Political Charges 1880-1848
3. Frykendurg : Guntur District
4. Baden powel, B.H., : Land Revenue in British Indian
5. Narayana Rao, K.V., : Telangana
6. Irshick, E.E., : Political and Social Conflict in South India.
7. Ramakrishna. V., : Social Reform Movement in Andhra.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఆంధ్రాలో ఆంగ్ల రాజ్య స్థాపన | 1.1 - 1.16 |
| 2. | కంపెనీ పాలనపై తిరుగుబాట్లు | 2.1 - 2.10 |
| 3. | భూమిశిస్తు విధానాలు | 3.1 - 3.11 |
| 4. | నీటిపారుదల సౌకర్యాలు | 4.1 - 4.9 |
| 5. | ఆంధ్రలో విద్యాభివృద్ధి | 5.1 - 5.21 |
| 6. | అసఫ్ జాహీల యుగం | 6.1 - 6.10 |
| 7. | సాలార్‌జంగ్ - సంస్కరణలు | 7.1 - 7.7 |
| 8. | ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణోద్యమాలు | 8.1 - 8.13 |
| 9. | ఆంధ్రలో జాతీయభావము | 9.1 - 9.11 |
| 10. | వందేమాతరం - హోమ్‌రూల్ ఉద్యమాలు | 10.1 - 10.10 |
| 11. | సహాయ నిరాకరణోద్యమము | 11.1 - 11.12 |
| 12. | అల్లూరి సీతారామరాజు - రంప ఉద్యమం | 12.1 - 12.8 |
| 13. | శాసనోల్లంఘన ఉద్యమం (1930-34) | 13.1 - 13.14 |
| 14. | ఆంధ్రలో క్విట్ ఇండియా ఉద్యమం | 14.1-14.13 |
| 15. | తెలంగాణా స్వాతంత్రోద్యమం | 15.1 - 15.17 |
| 16. | ఆంధ్రోద్యమం | 16.1 - 16.21 |
| 17. | ఆంధ్రప్రదేశ్ అవతరణ | 17.1 - 17.12 |
| 18. | కమ్యూనిస్టు ఉద్యమం | 18.1 - 18.11 |
| 19. | రైతు ఉద్యమాలు | 19.1 - 19.14 |
| 20. | ఆధునిక ఆంధ్రదేశంలో సాహిత్య, సాంస్కృతిక పరిణామాలు | 20.1-20.10 |

పాఠం- 1

# ఆంధ్రాలో ఆంగ్ల రాజ్య స్థాపన

## 1.1 లక్ష్యం

ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాలు ఏ విధంగా ఐరోపా పాలనలోకి వచ్చాయో, ఏ విధంగా ఈ ప్రాంతాల్లో బ్రిటిష్ పాలన ఏర్పడిందో తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం. బ్రిటిష్ పాలనకు దోహదం చేసిన పరిస్థితులను, ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధాలను, ఈ పాఠం వివరిస్తుంది.

## విషయ క్రమం


1.1 లక్ష్యం

1.2 పరిచయం

1.3 పద్దెనిమిదవ శతాబ్దపు ఆంధ్ర పరిస్థితులు

1.4 ఐరోపావాసుల రాక

1.5 ఆంధ్రదేశంలో ఐరోపా వారి స్థావరాలు

- 1.5.1 పోర్చుగీస్
- 1.5.2 డచ్
- 1.5.3 బ్రిటిష్ ఇండియా వర్తక సంఘం
- 1.5.4 ఫ్రెంచి కంపెనీ

1.6 కర్నాటక యుద్ధాలు

- 1.6.1 మొదటి కర్నాటక యుద్ధం
- 1.6.2 రెండవ కర్నాటక యుద్ధం
- 1.6.3 దక్కన్‌లో బుస్సీ
- 1.6.4 ఆంధ్రాలో ఫ్రెంచి పాలన
- 1.6.5 బొబ్బిలి యుద్ధం
- 1.6.6 మూడవ కర్నాటక యుద్ధం

1.7 ఫ్రెంచి పతనం

1.8 ఫ్రెంచి విధానాలు

1.9 ఆంధ్రాలో ఆంగ్ల సామ్రాజ్య స్థాపన

- 9.1 మే 14, 1759 సంధి
- 1.9.2 మొగల్ ఫర్మాన్ ఆగష్టు 12, 1765
- 1.9.3 నిజాంతో సంధి నవంబరు 12, 1766
- 1.9.4 నిజాంతో తిరిగి సంధి, ఫిబ్రవరి 23, 1768
- 1.9.5 కొండవీడు సర్కారు ఆక్రమణ, 1788
- 1.9.6 రాయలసీమ ఆక్రమణ, 1800
- 1.9.7 నెల్లూరు - చిత్తూరు ఆక్రమణ, 1802

1.10 సమీక్ష

1.11 నమూనా ప్రశ్నలు

1.12 ఉపయుక్త గ్రంథాలు

## 1.2 పరిచయం

వర్తక, వ్యాపారాలకై తూర్పు ఆంధ్రా ప్రాంతానికి విదేశీ కంపెనీలు వచ్చాయి. వాటిమధ్య గల పోటీ యుద్ధాలకు దారితీయడం, యుద్ధ విజేతలుగా మారిన ఆంగ్ల వర్తక కంపెనీ, స్థానిక అధికారులతో ఒప్పందాలను చేసికొని, రాజ్యాన్ని స్థాపించడం జరిగింది. పద్దెనిమిదవ శతాబ్ద రాజకీయ పరిస్థితులు అందుకు అనుకూలించాయి. తొలుతగా సర్కారులు, తరవాత రాయలసీమ ప్రాంతం, ఆ తరవాత కర్నాటక రాజ్య భాగమైన నెల్లూరు, చిత్తూరు ప్రాంతాలు ఆంగ్ల కంపెనీ ఆధిపత్యంలోకి వచ్చాయి. తెలంగాణా ప్రాంతం మాత్రం స్వదేశీ సంస్థాన పాలనలోనే కొనసాగింది. భాషా ప్రయుక్త రాష్ట్ర నినాదంతో 1956లో తెలంగాణా ఆంధ్రాతో చేరి, విశాలాంధ్రగా ఏర్పడింది.

## 1.3 పద్దెనిమిదవ శతాబ్దపు ఆంధ్ర పరిస్థితులు :

పద్దెనిమిదవ శతాబ్దంలో ఆంధ్రా ప్రాంతంలో ఆంతరంగిక పరిస్థితులు సంక్షోభంలో ఉన్నాయి. సుస్థిరమైన రాజకీయ అధికారం లేకపోవడంతో, అధికార వ్యవస్థలు, అధికార చిహ్నాలు మరుగున పడ్డాయి.

### రాజకీయ పరిస్థితులు :

నేటి ఆంధ్రప్రదేశ్ ప్రాంతమంతా మొగల్ చక్రవర్తి ఆధీనంలో ఉండేది. అయితే అతడు నియమించిన ముబ్రిజ్ ఖాన్‌పై షకర్ ఖేడా యుద్ధభూమిలో 1724లో నిజాం ఉల్‌ముల్క్ అసఫ్‌జా విజయం సాధించడంతో, దక్కన్‌లో అసఫ్ జాహీ వంశస్థుల పాలనకు అంకురార్పణ జరిగింది. మొగలాయీ అధికారం నామమాత్రంగానే మిగిలింది.

నిజాం ఉల్‌ముల్క్‌ని దక్కన్, కర్నాటక ప్రాంతాలకు సుబేదారుగా మొగల్ చక్రవర్తి అంగీకరించాడు. నిజాం ఉల్‌ముల్క్ కూడా మొగలు సామ్రాజ్యంతో తెగతెంపులు చేసికోలేదు. దక్కన్‌లో నిజాంలు సుస్థిరతను నెలకొలుపుకుంటూ, అధికార విస్తరణకై ప్రయత్నించసాగారు.

ఈ ప్రయత్నంలో వారితో మహారాష్ట్రులు, మైసూరు సుల్తానులు పోటీపడ్డారు. మామూలు పరిస్థితుల్లో అయితే ఈ ముగ్గురిలో, ఏ ఒక్కరో విజాయన్ని సాధించి, సార్వభౌమత్వాన్ని స్థాపించేవారు. కాని ఈ ఫలితం రాకపోవడానికి కారణం విదేశీ వర్తక సంస్థల ప్రమేయం. ఫ్రెంచి, ఆంగ్ల వర్తక కంపెనీలు స్వదేశీ రాజ్యాలతో స్నేహ సంబంధాలు పెంపొందించుకోవడమే గాక, వారి యుద్ధాలలో సహితము కలుగజేసుకొన్నారు. దీనివలన స్వదేశీ రాజ్యాలయిన దక్కను, మహారాష్ట్ర, మైసూరు రాజ్య అధికారం కాక ఆంధ్రాలో తొలుతగా ఫ్రెంచి, తరవాత ఆంగ్ల అధికారం విస్తరించింది.

ఔరంగజేబు తరవాత వచ్చిన మొగలాయీ రాజులెవరూ విదేశీ కంపెనీలపై అధికారాన్ని చాటలేకపోయారు. ఆంగ్ల కంపెనీ స్వతంత్రంగా వ్యవహరిస్తోందని భావించిన ఔరంగజేబు చక్రవర్తి వారి ఆస్తిని, ఫాక్టరీలని స్వాధీనం చేసికొని, తన రాజ్యాన్ని వదలి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. ఒక ఏడాది తరువాత మాత్రమే (అక్టోబరు 15, 1689 - డిసెంబరు 28, 1690) తిరిగి వారికి వారి ఫాక్టరీలు దక్కాయి. స్వేచ్ఛా వ్యాపారం, శాంతియుత జీవనం, రాజు - ప్రజలతో సుహృద్భావం - ఇవే ఆంగ్లేయ కంపెనీ తొలుతగా ఆశించిన విషయాలు. ఔరంగజేబు వారసులెవరూ విదేశీ కంపెనీలపై అటువంటి అధికారాన్ని చూపలేకపోయారు.

దూరదృష్టి గల రాజకీయ నాయకులు లేకపోవడం పద్దెనిమిదవ శతాబ్ద లక్షణం. వ్యాపార నిమిత్తమై వచ్చిన విదేశీ కంపెనీల మద్దతుతో ఇతర పోటీదార్లను నివారించాలనే ఆశ తప్ప, వారి చేతులలో పావులుగా మారుతున్నామన్న భావం వారికి లేదు.

బలహీనమయిన రాజులు రాజ్యమేలడంతో ప్రతీ స్థాయిలోనూ అధికారాన్ని ఎదిరించడం కనిపిస్తుంది. మొగల్ చక్రవర్తి అధికారాన్ని నిజాం, నిజాం అధికారాన్ని ఫౌజ్‌దార్లు, ఫౌజ్‌దార్లను స్థానిక అధికారులు ఎదిరించేవారు. ఈ విధంగా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య

ఉండవలసిన సుహృద్భావ వాతావరణం కొరవడింది. ప్రజల సంక్షేమాన్ని రాజు పట్టించుకునేవాడు కాదు; అందుచేత ప్రజలు కూడా అధికార మార్పిడిని సరుకు చేసేవారు కాదు. రాజుకు, అధికారులకు, ప్రజలకు మధ్య అగాథమేర్పడింది.

ఈ ప్రజామోదం లేని ప్రభుత్వం బలహీనమైన సైన్యంపై ఆధారపడేది. మధ్య యుగాల ఆయుధాలయిన కత్తి, విల్లు, బాణాలు ఉపయోగిస్తూ, ఆధునిక తుపాకి - మందుగుండు సామాగ్రిని వాడే విదేశీ శక్తుల నెదిరించి, పరాజయం పాలయ్యారు. బొబ్బిలి యుద్ధంలో ఫ్రెంచి నుంచి, పద్మనాభ యుద్ధంలో ఆంగ్లేయుల నుంచి, స్వదేశీ రాజ్యాలు పరాజయం పొందాయి.

### ఆర్థిక పరిస్థితులు

పద్దెనిమిదవ శతాబ్దం వరకు ఆంధ్రాలో ఆర్థిక పరిస్థితులు సంతృప్తికరంగానే ఉండేవి. గోదావరి, కృష్ణా నదులు, సారవంతమయిన భూమి, నీటి పారుదల సౌకర్యాలు, రకరకాల పంటలు, పశు సంపదతో అనుకూల వాతావరణం ఉండేది. గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉండేవి. పన్నులు అధికమయిన్పటికీ, అది ప్రజోపయోగ కార్యక్రమాల ద్వారా తిరిగి ప్రజలకే చేరేది.

అనేక పరిశ్రమలు ఆంధ్రాలో వర్ధిల్లాయి. చేనేత పరిశ్రమ ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. మచిలీపట్టణం చింజీలు, పాలెంపోరులు, కలంకారీలు, విశ్వవిఖ్యాతి పొందాయి. బరంపురం పట్టుబట్టలు; శ్రీకాకుళం నేతలు, గోదావరి తీరంలోని మాడసాల్లెం, ఇంజరం, బెండమూర్లంక వంటి చేనేత కేంద్రాలలో నేసి, అద్దిన ముతక వస్త్రాలు ప్రసిద్ధాలు. రుమాళ్ళు, దుప్పట్లు, తెల్లని నూలు వస్త్రాలు ఐరోపా దేశాలకు ఎగుమతి అయ్యేవి.

చేనేత పరిశ్రమతో పాటు ఆంధ్రా హస్తకళలు వివిధ దేశాల దృష్టిని ఆకర్షించాయి. గోదావరీ తీరాన జాతి టేకు కలప లభ్యమవడంతో నౌకా పరిశ్రమ అభివృద్ధి చెందింది. ఈ మంచి రకం టేకుతో ఏటేటా 500 దోనెలు, పడవలు, 50 నుంచి 300 టన్నుల దాకా ఉండే చిన్నచిన్న ఓడలు తయారు చేయడానికి పనికి వచ్చేది. కోరింగ, నరసాపురం ప్రసిద్ధ రేవులు. విశాఖపట్నం, మచిలీపట్నం నౌకా నిర్మాణ కేంద్రాలు; ప్రఖ్యాతి చెందిన రేవు పట్టణాలు. ఇక్కడ 50,000 టన్నుల ఓడలు కూడా నిర్మించబడేవి. విదేశీ నౌకలు కూడా మరమ్మత్తుల కోసం కోరింగ వంటి రేవుల వద్దకు వచ్చి ఆగేవి.

విశాఖపట్నంలో నల్లటి నునుపైన చెక్కతోనూ, దంతంతోనూ నగిషీతో చేసిన రకరకాల హస్తకళలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించి, విదేశాలకు ఎగుమతి అయ్యేవి.

## 1.4 ఐరోపావాసుల రాక

క్రైస్తవ శకమునకు పూర్వము నుండి భారతదేశనకును ఐరోపా రాజ్యాలకు మధ్య వాణిజ్య, సాంస్కృతిక సంబంధములు కొన్ని శతాబ్దాలలో తీవ్రంగాను, మరికొన్ని శతాబ్దములలో మందకొడిగాను ఈ సంబంధాలు సాగాయి. క్రీ.శ. 15వ శతాబ్దం వరకు అరబ్బులు, ఇతర మహమ్మదీయ వర్తకులు భారతీయ వస్తువులను ముఖ్యంగా వస్త్రాలను ఐరోపా వారికి విక్రయించుట ద్వారా విపరీత లాభాలు సంపాదించేవారు. మరీ ముఖ్యంగా ఐరోపా వాసులు, వారి ఆహార పదార్థాలలో ఉపయోగించే ఉప్పు, చక్కెర, మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలు భారతదేశము నుండి మహమ్మదీయ వర్తకుల ద్వారా, కాన్‌స్టాంటినోపుల్ మీదుగా, ఇటలీలోని జెనీవా, వెనిస్ నగరాలకు సరఫరా చేసేవారు. కనుక భారతీయ వస్తువులకు ఐరోపా మార్కెట్లో ఎక్కువ గిరాకీ వుండేది.

అప్పటికే తురుష్కుల, క్రైస్తవుల మధ్య మత యుద్ధాలు జరుగుతుండేవి. క్రీ.శ. 1453లో తురుష్కులు కాన్‌స్టాంటి నోపుల్‌ను ఆక్రమించి, ఐరోపా వారు ఈ పట్టణము ద్వారా తూర్పు తీర దేశాలతో నడుపుతున్న వర్తక వ్యాపారాలకు అడ్డుకట్టవేశారు. ఈ దిగ్బంధం వలన సుగంధ ద్రవ్యాల సరఫరా నిలిచిపోయింది. ఐరోపా వారి జీవన విధానంలోనే గొప్ప అంతరాయం ఏర్పడింది. దీని వల్ల ఆసియా దేశాల కంటే ఐరోపా దేశాలకే ఎక్కువ నష్టం కల్గింది. మత యుద్ధాలు కూడా ముగిసాయి. తూర్పు దేశాలతో, మరీముఖ్యంగా హిందూదేశంతో, సంబంధ బాంధవ్యాలను పునరుద్ధరించుకొను ఆవశ్యకత ఏర్పడింది. భూ మార్గం ద్వారా భారతదేశములో ప్రవేశించుట సాధ్యంకాని పని. కనుక ఐరోపావారు భారతదేశంను చేరుటకు నూతన సముద్ర మార్గాన్ని అన్వేషించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. నూతన సముద్ర

మార్గాన్వేషకులకు పోర్చుగల్ రాజు నాల్గవ హెన్రీ ఎక్కువ ప్రోత్సాహాన్ని ఇచ్చాడు. నావికా శిక్షణా కేంద్రాన్ని కూడా స్థాపించాడు. అందువలన అతనిని 'హెన్రీ ది నావిగేటర్' అనే బిరుదుతో సత్కరించారు. మార్కోపోలో కావించిన నౌకాయాన కథలు కూడా ఉపయోగపడ్డాయి. ఈ ప్రోత్సాహక ఫలితంగా వాస్కోడిగామా అను పోర్చుగీసు నావికుడు ఆఫ్రికా చివరనున్న "కేప్ ఆఫ్ స్టార్మ్స్" దాటుటచే, దానిని "కేప్ ఆఫ్ గుడ్ హోప్" అంటారు. ఆఫ్రికా ఖండమును చుట్టిన వాస్కోడిగామా క్రీ.శ. 1498 మే నెల 27వ తేదీన భారతదేశములోని పశ్చిమతీరాన గల, కేరళ రాష్ట్రంలోని కాలికట్‌నకు సమీపమున గల 'కపడ్' అను గ్రామములో తొలిసారిగా అడుగిడినాడు. భారతదేశమునకు నూతన సముద్ర మార్గం కనుగొనబడుట ద్వారా ఐరోపా దేశాలకు, భారతదేశానికి మధ్యగల సంబంధాలు పునరుద్ధరించబడుట ద్వారా, భారత చరిత్రలో నూతన శకం ప్రారంభమైంది. వాస్కోడిగామా కనిపెట్టిన నూతన సముద్ర మార్గం ద్వారా భారతదేశమును చేరుట మాత్రమే కాదుగాని ఈ దేశంతో ప్రత్యక్ష వర్తక వ్యాపారాలు వివిధ ఐరోపా దేశస్థులు చేయగలిగారు. తురుష్కుల మధ్యవర్తిత్వం అంతరించింది.

## 1.5 ఆంధ్రదేశంలో ఐరోపా వారి స్థావరాలు

భారతదేశంలో వర్తక, వ్యాపారాలకు వచ్చిన ఐరోపా దేశీయులు ఆంధ్రదేశంలో కూడా ప్రవేశించారు. ప్రాచీన కాలం నుండి ఆంధ్రదేశానికి ఐరోపా దేశాలకు వర్తక, వ్యాపార సంబంధాలు ఉండేవి. ఆంధ్ర శాతవాహనుల కాలంలో ఆంధ్రదేశానికి ఐరోపాలోని రోమ్, ఇటలీ, గ్రీస్ దేశాలతో వాణిజ్య సాంస్కృతిక సంబంధాలు వుండేవి. ఆంధ్ర దేశం సారవంతమైన తీరప్రాంతమగుటచే అనేక ఐరోపా రాజ్యాలను ఆకర్షించింది. ఆంధ్ర దేశంలోని భీముని పట్నం, విశాఖపట్నం, కాకినాడ, నర్సాపురం, మోటుపల్లి, మచిలీపట్నం మొదలగు రేవు పట్టణాలు కొన్ని శతాబ్దములనుండి విదేశీ వ్యాపారానికి పేరు గాంచాయి. హ్యుయాన్ త్సాంగ్, మార్కోపోలోల రచనలలో ఆంధ్రదేశంను పేర్కొన్నారు. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆంధ్రదేశం సుసంపన్నంగా నున్నట్లు నికోలోకోంటి (ఇటలీ), న్యూనిజ్ (పోర్చుగల్), అబ్దుల్ రజాక్ (పర్షియా) మొదలగు వారు పేర్కొన్నారు. ఐరోపా దేశాలు మచిలీపట్నంలో వారి వారి వర్తక స్థావరాలను స్థాపించునాటికి ఆంధ్రదేశం మొగల్ చక్రవర్తి అయిన ఔరంగజేబు పాలనలో ఉంది. నిజాం ఉల్ ముల్క్, దక్కన్, దక్షిణ భారత దేశమునకు సుబేదార్‌గా వుండేవాడు; హైదరాబాద్ అతని రాజధాని. గోల్కొండ రాజ్యానికి ప్రధాన రేవుపట్టణమైన మచిలీపట్నంలో ఐరోపా వారు తమ తమ ఫ్యాక్టరీలను నిర్మించుటచే అది వారందరికి కేంద్ర స్థానమైంది.

**1.5.1 పోర్చుగీస్** : తూర్పు దేశాలకు ముఖ్యంగా భారతదేశానికి నూతన సముద్ర మార్గంను కనుగొనవలసిన అవశ్యకత ఏర్పడింది. ఆయా దేశాల రాజులు కూడా ఆసక్తిని కనపరిచారు. కనుక నూతన మార్గాన్వేషణ ప్రారంభమైంది. అట్టి సమయంలో పోర్చుగల్ రాజైన హెన్రీ నావికులను ప్రోత్సహించి అన్వేషకులకు తగిన సదుపాయాలను కల్పించాడు. అంత మాత్రమే గాక సముద్రయానంనకు ఉపకరించు నావికా శిక్షణా కేంద్రాన్ని కూడా స్థాపించాడు. మార్కోపోలో రచనలు సముద్ర మార్గాన్వేషకులకు ఎంతో ఉపకరించాయి. పోర్చుగల్‌కు చెందిన బర్తలోమియో డయజ్ అను నావికుడు అట్లాంటిక్ సముద్రం మీదుగా ప్రయాణించి ఆఫ్రికా కొనవరకు చేరాడు. తరువాత అదే దేశము నుండి బయలుదేరిన వాస్కోడిగామా అదే మార్గంలో ప్రయాణించి కేప్ ఆఫ్ స్టార్మ్స్ దాటి మెడగాస్కర్‌ను చుట్టి హిందూ దేశమునకు చేరగలిగాడు. ఈ విధంగా తూర్పు దేశాలకు నూతన సముద్ర మార్గాన్వేషణలో విజయం సాధించిన మొదటి దేశం పోర్చుగల్. ఇది గొప్ప చారిత్రక సంఘటన. ఈ అన్వేషణ ద్వారా భారతదేశం మీదుగా ఆగ్నేయాసియా, చైనా దేశాలకు వర్తక వ్యాపారాలను విస్తరింపజేయు అవకాశమేర్పడింది. అంతేకాదు పోర్చుగీసు వారికి హిందూ మహాసముద్రంపై ఆధిపత్యం కూడా లభించింది.

పోర్చుగల్ చాలా చిన్న రాజ్యమైనందున వలస రాజ్య స్థాపనకంటె వర్తక వ్యాపారాభివృద్ధికే ప్రయత్నించింది. ఆనాటి గవర్నర్ అయిన డి ఆల్‌మీడా సముద్రంపై ఆధిపత్యాన్ని సంపాదించుటకు 'బ్లూ వాటర్ పాలసీ' (సముద్రాధిపత్య విధానము) ననుసరించాడు. అయితే అతని తరువాత వచ్చిన గవర్నర్ ఆల్ బుకారక్ వ్యాపారానికి బదులు వలస రాజ్యస్థాపనకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. గోవా, మలకాలను ఆక్రమించాడు. దక్షిణ భారతదేశంలో పేరెన్నికగన్న విజయనగర చక్రవర్తియైన శ్రీకృష్ణదేవరాయలుతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్నాడు. సంధి షరతుల ప్రకారం పోర్చుగీసువారు శ్రీకృష్ణదేవరాయలుకు అశ్విక బలాన్ని సమకూర్చాలి. పర్యవసానంగా పోర్చుగీసు వారికి తూర్పు తీరప్రాంతాలలో వర్తకం చేసికొనుటకు అనుమతి లభించింది. సాళువ, తుళువ వంశాలకు చెందిన విజయనగర రాజుల ఆదరణ కూడా లభించింది. ఆంధ్రలో మచిలీపట్నం వీరి ముఖ్య స్థావరం.

పోర్చుగల్ మిక్కిలి చిన్న దేశమగుటచే తక్కువ జనాభా, పరిమిత సంపద కలిగిన దేశం. కనుక రాజ్యస్థాపనార్థం వచ్చిన ఇతర ఐరోపా రాజ్యాల పోటీకి నిలువలేక పోయింది. స్పెయిన్ పోర్చుగల్‌ను జయించి తనలో విలీనపరచుకుంది. పోర్చుగల్‌ను విలీన పరచుకున్న స్పెయిన్ కూడా భారతేదశం విషయంలో ఆసక్తిని చూపలేకపోయింది.

**1.5.2 డచ్ :** పోర్చుగీస్ తర్వాత మనదేశమునకు వచ్చిన ఐరోపావారిలో రెండవవారు డచ్‌వారు. వీరు హాలెండ్ దేశస్థులు. ఇది స్పెయిన్ దేశమునకు వలసగా ఉండేది. ఐరోపానుండి భారతదేశమునకున్న సముద్రమార్గం పోర్చుగీసువారి ఆధీనంలోనుంది. కనుక పోర్చుగీస్ వారిని ప్రతిఘటించి తూర్పు సముద్ర మార్గాల ద్వారానే భారతదేశంతో వాణిజ్యం కొనసాగించాలని డచ్‌వారు ప్రయత్నించారు. పోర్చుగల్, స్పెయిన్ దేశాలు రోమన్ కేథలిక్స్ కాగా, హాలెండ్, ఇంగ్లండ్ దేశాలు ప్రొటెస్టంట్స్, కనుక హాలెండ్ ఇంగ్లండ్‌ల మధ్య గల మైత్రితోనే వారిరువురు మలయా ద్వీపకల్పంలో వ్యాపారం సాగించారు. క్రమక్రమంగా పోర్చుగీస్‌వారి ప్రాబల్యం తగ్గి డచ్‌వారి ప్రాబల్యం పెరగసాగింది, 'డచ్ ఈస్ట్ ఇండియా కంపెనీ' ద్వారా తమ వర్తకంను భారతదేశంలో సాగించారు.

గోల్కొండ నవాబు ద్వారా ఆంధ్రదేశంలోని కాకినాడ దగ్గర జగన్నాథపురం, మచిలీపట్నంలలో తమ వర్తక స్థావరాలను నిర్మించుకొనుటకును, వర్తకము చేసికొనుటకును అనుమతిపొంది, క్రమక్రమంగా పెటపోలి, పులికాట్, నరసాపురం, భీమునిపట్నం మొదలగు ప్రాంతాలలో తమ వర్తకస్థావరాలను నెలకొల్పారు. వీనిలో పులికాట్ డచ్‌వారి వర్తకకేంద్రంగా పేరు గాంచింది. పన్నుల చెల్లింపు విషయంలో వెసులుబాటు, తమ స్వంత నాణేలను ముద్రించుకొనుటకు అనుమతిని పొందారు. ఈ విధంగా ఆంధ్ర దేశంలో వారి వర్తక స్థావరాలను వ్యాపింప చేసారు. అయితే వారికి ఆగ్నేయ - ఆసియా మీద ఎక్కువ మక్కువ ఉండుటచే భారతదేశ వ్యాపారంపై తగు శ్రద్ధ చూపలేక పోయారు. హాలెండ్ చిన్న దేశమగుటచే ఆంగ్లేయుల పోటీకి తట్టుకొనలేక పోయింది.

**1.5.3 బ్రిటిష్ ఇండియా వర్తక సంఘం :** సాహసోపేతమైన సాగర యాత్రలు పోర్చుగీస్, డచ్చి సాగిస్తున్నప్పటికి, ఇంగ్లండ్ రాణి అయిన మొదటి ఎలిజబెత్ ప్రభుత్వ ధనాన్ని ఆ వర్తకంలో పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడలేదు. లండన్‌లోని కొందరు వర్తకులు తాము తూర్పు దేశాలతో వర్తకం సాగించడానికి అనుమతి ఇవ్వమని కోరారు. రాణి అనుమతిని ఇవ్వగా డిసెంబరు 31, 1600వ సంవత్సరంలో తూర్పు ఇండియా వర్తక సంఘం ఏర్పడింది. కంపెనీ వ్యవహారాలు చూడడానికి ఒక గవర్నరుని, 24 మంది సభ్యులతో కూడిన డైరక్టర్ల సంఘాన్ని, వీరి పనితీరుని గమనించే పెట్టుబడిదారుల సంఘాన్ని (ప్రొప్రైటర్ల సంఘం) ఏర్పరచుకున్నారు.

ఆంగ్ల కంపెనీ తొలి రెండు ప్రయత్నాలు విజయవంతం కాలేదు. మూడో ప్రయాణం 1608లో సూరత్ చేరింది. దీని కమాండర్ కెప్టెన్ హాకిన్స్ జహంగీర్ చక్రవర్తిని కలసి, సూరత్ వద్ద వర్తక కేంద్రానికి అనుమతిని సంపాదించాడు. అయితే పోర్చుగీస్ వారి ప్రమేయంతో ఆ అనుమతి కొంతకాలానికే రద్దు చేయబడింది. ఆగ్నేయాసియా దేశాలలో బ్రిటిష్ ఉన్ని వస్త్రాలకు మార్కెట్టు లేదని, కాని భారతీయ వస్త్రాలకు అధిక డిమాండు ఉందని కంపెనీ గ్రహించింది. అందుచేత పోర్చుగీస్, డచ్ వ్యతిరేకత ఉన్నప్పటికి భారతీయ వస్త్ర వ్యాపారంలోకి ప్రవేశించాలని నిర్ణయించుకుంది.

తూర్పు కోస్తా ప్రాంతంలో మద్రాసును ఆంగ్ల కంపెనీ సంపాదించడం ఒక ప్రసిద్ధ ఘట్టం. మచిలీపట్నంలో థామస్ క్లార్క్ ఆంగ్ల ఏజెంటుగా ఉన్నప్పుడు, ఆర్మగాంలో ఫ్రాన్సిస్ డే అతని క్రింది స్థాయి ఉద్యోగిగా ఉన్నాడు. ఆర్మగాం ఫాక్టరీని వదిలిపెట్టాలని డైరక్టర్లు నిర్ణయించినప్పుడు ఫ్రాన్సిస్ డే పాండిచ్చేరి చుట్టుప్రక్కల ప్రాంతాలను పరిశీలించాడు. శ్రీకాళహస్తికి చెందిన వెలుగోటి కుటుంబీకులు అగు దామెర్ల సోదరులు - దామెర్ల వెంకటాద్రి, దామెర్ల అయ్యప్పలతో సంప్రదించాడు. చంద్రగిరి రాజుకి దామెర్ల వెంకటాద్రి గవర్నరుగా ఉండేవాడు. ఆంగ్ల కంపెనీ కనుక ఆ పరిసరాల్లో వచ్చినట్లైతే అక్కడ తయారయ్యే అధిక వస్త్రాలకు మార్కెటు ఏర్పడుతుందని, తద్వారా లాభాలు పొందవచ్చని అతడు భావించాడు. పూనమలై ప్రాంతంలో దామెర్ల అయ్యప్ప ఉండేవాడు. మద్రాసు వద్ద ఆంగ్ల ఫాక్టరీ ఏర్పాటు చేసికోడానికి చంద్రగిరి రాజు జూలై 22, 1639న అనుమతించాడు. మార్చి 1, 1640 నుంచి ఫోర్ట్ సెయింట్ జార్జి కోట కట్టడం ఆరంభమయింది. ఈ ప్రాంతానికి చుట్టుప్రక్కల అనేకమంది నేత పనివారు వచ్చి స్థిరపడసాగారు. తూర్పు కోస్తా ప్రాంతాన గల అన్ని ఫాక్టరీలకు మద్రాసు ఫాక్టరీయే ముఖ్య స్థావరంగా సెప్టెంబరు 24, 1641న ప్రకటించబడింది

కోస్తా ఆంధ్రాలో ఆంగ్ల కంపెనీ ఫాక్టరీలను ఏర్పాటు చేయడం పదిహేడో శతాబ్దిలోనే ఆరంభమయింది. నిజాం పట్నం లేక పెట్టాపోలి రేవు పట్టణానికి 1611న ఆంగ్ల కంపెనీ నౌక వచ్చింది. ఆంగ్లేయులు ఆంధ్రాలో ప్రథమంగా కాలూనిన ప్రదేశం ఇదే. తూర్పు తీర రేవు పట్టణాలని పరిశీలించి, ఎక్కడ ఆంగ్ల వ్యాపారానికి అనుకూలంగా ఉంటుందో తెలుసుకోమని క్రీ.శ. 1611లో ఆంగ్ల కంపెనీ కెప్టెన్ హిప్పన్ నాయకత్వంలో గ్లోబ్ అను నౌకను పంపారు. ఆ నౌక గోల్కొండ నవాబు మహమ్మద్ కూలీ కుతుబ్‌షా రాజ్యంలోని ప్రధాన రేవు పట్టణమయిన మచిలీపట్నంని 1611లో చేరింది. ఈ ప్రదేశం అప్పటికే అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన స్థలం. ఈ రేవు నుంచే కాలికోలు, చింజీలు, పాలంపోరులు మొదలయిన కలంకారీ వస్త్రాలు, రత్నాలు ఎగుమతి అయ్యేవి. విదేశీ వ్యతిరేకత, పోటీ ఎదురయినప్పటికి కుతుబ్‌షాహీల ఆదరణతో ఆంగ్లేయులు 1621లో మచిలీపట్నంలోనూ, నిజాం పట్నంలోనూ ఫాక్టరీలు స్థాపించారు. ఇతర ఆంధ్రా ప్రాంతాలగు ఇంజరం, వీరవాసరం, మాడపాలెం, వైజాగ్ పట్టణాలలో కూడా ఫాక్టరీలను ఆరంభించి, వ్యాపారాన్ని చేయసాగారు.

**1.5.4** ఫ్రెంచి కంపెనీ : భారతదేశమునకు వర్తక వ్యాపారములకై వచ్చిన ఐరోపాదేశీయులలో ఫ్రెంచ్‌వారు చివరివారు. ఫ్రాంకాయిస్ బెర్నియర్‌ను వారి రాయబారిగా భారతదేశమునకు పంపారు. పదునాల్గవ లూయీ ఆర్థిక మంత్రియైన కోల్బర్ట్ ఫ్రెంచి తూర్పు ఇండియా వర్తక సంఘమును క్రీ.శ. 1664లో స్థాపించినాడు. ఈ సంఘమునకు నాయకుడు ఫ్రాన్సిస్ కారన్. అతడు సూరత్ చేరి మొఘలు చక్రవర్తి ఔరంగజేబ్ అనుమతిపొంది, అక్కడ ఫ్రెంచ్ ఫ్యాక్టరీని నిర్మించినాడు. అనంతరము గోల్కొండ నవాబు అనుగ్రహమును పొంది ఆంధ్రాలోని మచిలీపట్టణమునందు క్రీ.శ. 1669 మరియొక ఫ్రాక్టరీని నిర్మించాడు. అంతమాత్రమే కాక, తమ వస్తువులను భారతదేశమునకు దిగుమతి చేయుటలోను, భారతీయ వస్తువులను ఎగుమతి చేయుటలోను శిస్తు మినహాయింపు పొందగలిగాడు. కొద్దికాలం తర్వాత కోస్తా ఆంధ్రాలో కాకినాడ దగ్గర గల యానాంలో గూడ వారి స్థావరమును నెలకొల్పారు. పుదుచ్చేరి (పాండిచ్చేరి)ని ముఖ్య స్థావరముగా చేసికొని ఫ్రెంచివారు విస్తరించుచున్న సమయములో ఆంగ్లేయులతో పోటీ ఏర్పడి కర్ణాటక యుద్ధములకు దారితీసింది. చందనాగూర్, మాహే, కారైకాల్ వారి ఇతర స్థావరాలు.

## 1.6 కర్నాటక యుద్ధాలు :

ఆంధ్రా ప్రాంతంలో స్థావరాల నేర్పరచుకొని వ్యాపారం సాగిస్తున్న ఫ్రెంచి, ఆంగ్ల కంపెనీల మధ్య, పద్దెనిమిదవ శతాబ్దంలో, వైరుధ్యం ఏర్పడి, మూడు యుద్ధాలు జరిగాయి. వీటికి ప్రధాన కారణం వ్యాపార ప్రయోజనాలతో పాటు రాజకీయ ప్రాబల్యం సంపాదించాలనే కాంక్ష కూడా. ఐరోపాలో వారసత్వ యుద్ధాలు ప్రబలడం, వానిలో ఆంగ్ల, ఫ్రెంచి ప్రభుత్వాలు శత్రుపక్షాలు వహించడంతో, వలసలలో కూడా ఆ రెండు కంపెనీలమధ్య యుద్ధాలు జరిగాయి. ఆంధ్రలో అప్పటి అస్థిర రాజకీయ రంగం కూడా వారిని ఈ యుద్ధాలకు పురికొలిపింది.

మొగల్ చక్రవర్తి అధికారం నామమాత్రంగానే కొనసాగుతోంది. దక్కన్, కర్నాటకలపై నిజాం అధికారం సుస్థిరం చేసుకొనే ప్రయత్నంలో ఉన్నాడు. చిలుక సరస్సు నుంచి గుండ్లకమ్మ వరకు గల ప్రాంతం ఐదు సర్కారులుగా విభజింపబడి ఉండేది. అవి చికాకోల్, రాజమండ్రి, ఏలూరు, ముస్తఫానగర్ లేదా కొండపల్లి, గుంటూరు లేదా మూర్తుజానగర్. ప్రతీ సర్కారు ఒక ఫౌజ్‌దార్ అనబడు అధికారి వశంలో ఉండేవి. ఆదాయాన్ని వసూలు చేయడం, అవసర సమయాలలో నిజాంకి సైన్యంతో వచ్చి, సహకారం చేయడం అతని విధులు. ప్రస్తుత నెల్లూరు, చిత్తూరు జిల్లాలు నిజాం సామంతుడయిన ఆర్కాట్ నవాబు ఆధీనంలో ఉండి, కర్నాటక భాగాలుగా ఉండేవి. రాయలసీమ జిల్లాలయిన కడప, కర్నూలు, అనంతపురం, నిజాం సామంతులగు, కడప, కర్నూలు, ఆదోని నవాబుల ఆధీనంలో ఉండేవి. ఈ అధికారులంతా నిజాం అధికారాన్ని అవకాశం వచ్చినప్పుడల్లా ఎదిరిస్తూనే ఉండేవారు. ఫౌజుదార్లు, క్రింద అనేకమంది రాజులు, జమీందార్లు, శిస్తు వసూలు దారులుగా ఉండేవారు. తరుతరాలుగా వసూలు హక్కుగల అధికారులుగా, శాంతి భద్రతల పర్యవేక్షకులుగా వీరి స్థానిక అధికారం బలమైనది. రాయలసీమ ప్రాంతంలో ఆ అధికారాలను పాలెగార్లు నిర్వహించేవారు. ఆదాయంలో ఒక భాగాన్ని వారికై తీసికొని, మిగిలిన

సొమ్మును నిర్ణీత కాలాలలో పై అధికారులకి వీరు జమ చేయాలి. అయితే వీరంతా తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప చెల్లింపులను జమ చేసే వారు కాదు; ఎల్లప్పుడూ బకాయీలనే ఉంచేవారు.

ఆంగ్లేయ వర్తక కంపెనీ ఆంధ్రా ప్రాంతాలను మూడు కర్నాటక యుద్ధాలు చేయడం ద్వారా పొంద గలిగింది. ఈ యుద్ధాలలో ప్రధాన వైరం ఆంగ్ల కంపెనీకి, ఫ్రెంచి కంపెనీకి మధ్య ఉన్నది మాత్రమే; స్వదేశీ రాజులు, వారి ప్రయోజనాలు ద్వితీయ స్థాయిలోనే ఉన్నాయి.

**1.6.1 మొదటి కర్నాటక యుద్ధం (1744-1748)** : ఐరోపాలో జరిగిన ఆస్ట్రియా వారసత్వ యుద్ధ ప్రభావం దక్షిణ భారతదేశంపై ప్రసరించింది. కర్నాటక నవాబు అన్వరుద్దీన్ ఫ్రెంచి, ఆంగ్ల కంపెనీలను తన రాజ్యంలో యుద్ధం చేయవద్దని స్పష్టం చేసినప్పటికి, ఆ ఆజ్ఞను ఆంగ్ల ఫ్రెంచి కంపెనీలు ఖాతరు చేయలేదు. మొదటిగా ఫ్రెంచి గవర్నరగు డూప్లే శాంతినే కోరుకుని, ఇంగ్లండు వారు యుద్ధమునకు దిగకుండా నవాబు జోక్యం చేసికోవాలని అర్థించాడు. వారి అభ్యర్థన మేరకు అన్వరుద్దీన్ జోక్యం చేసికొని, బార్నెట్ నాయకత్వంలోని తూర్పు తీరం చేరిన బ్రిటిష్ నౌకాదళాన్ని వెనుకకు తిప్పి పంపించాడు.

కానీ డూప్లే బ్రిటిష్‌వారిపై దెబ్బతీయడానికే నిశ్చయించుకున్నాడు. మారిషస్ ద్వీపాల నుంచి ఫ్రెంచి సైనిక నాయకుడయిన "లబుర్డనేయిస్" సైనిక నౌకాదళంతో, డూప్లేకి సహాయంగా వచ్చాడు. ఇంతలో బర్నాట్ తూర్పుతీరంలోని నాగపట్నం వద్ద క్రీ.శ. 1746లో ఫ్రెంచి నౌకలను ముట్టడించడంతో ఉభయుల మధ్య యుద్ధం ప్రారంభమయింది.

ఎనిమిది యుద్ధనౌకలతో లబుర్డనేయిస్ రాగానే, నవాబు హెచ్చరికలను త్రోసివేసి, డూప్లే క్రీ.శ. 1746 లో ఇంగ్లీషు స్థావరమైన మద్రాసును ముట్టడించారు. మద్రాసును ఫ్రెంచి వశపరచుకోవడం అయింది.

హెచ్చరికలను ఖాతరు చేయకపోవడంతో అన్వరుద్దీన్ పదివేలమంది ఆర్కాటు సైనికులతో మద్రాసును ముట్టడించాడు. కెప్టెన్ పారడైజ్ నాయకత్వంలో ఫ్రెంచి సేనలు ఆర్కాటు నవాబు సైన్యమును అడయారు వద్దగల శాంతోమ్‌నందు చిత్తుగా ఓడించాయి. మద్రాసు ఫ్రెంచివారి వశమయింది. సైన్యములో ఫిరంగిదళం ప్రాధాన్యత వెల్లడి అయింది. ఐరోపా తుపాకులు, మందుగుండు సామాగ్రితో అధిక సంఖ్యలో గల భారతీయ సైన్యాలను ఓడించడం తేలికని రుజువయింది. ఇంతలో ఆంగ్ల - ఫ్రెంచి ప్రభుత్వాల మధ్య 1748లో ఒప్పందం కుదిరి, యథాతథ పరిస్థితులు నెలకొన్నాయి. మద్రాసు ఆంగ్లేయులకు తిరిగి లభించింది.

**1.6.2 రెండవ కర్నాటక యుద్ధం** : ఐరోపాలో యుద్ధంలేకున్నా, దక్షిణ భారత ప్రాంతంలో ఆంగ్లేయులకి ఫ్రెంచి వారికి మధ్య జరిగిన యుద్ధమిది. వారసత్వ యుద్ధాల మూలంగా కర్నాటక, దక్కనులలో అశాంతి చెలరేగగా, ఐరోపా దేశాలు రాజకీయ ప్రత్యర్థులకు మద్దతు ప్రకటిస్తూ తమ ప్రయోజనాలను పెంపొందించుకునే ప్రయత్నాన్ని చేశాయి.

దక్కన్‌లో నిజాం ఉల్‌ముల్క్, జూన్ 2, 1748న మరణించగా రాజ్యం కోసమై యుద్ధం చెలరేగింది. నిజాం ఉల్‌ముల్క్ కుమారుడగు నాసిర్‌జంగ్‌కి, నిజాం మనుమడగు (కుమార్తె కొడుకు) ముజఫర్ జంగ్‌కి మధ్య పోటీ ప్రబలింది. ఇటువంటి వారసత్వపోటీయే కర్నాటక సింహాసనానికై చందా సాహెబ్, అన్వరుద్దీన్‌ల మధ్య సాగింది.

ఈ వారసత్వ యుద్ధాలలో ఫ్రెంచి, ఆంగ్ల కంపెనీలు తలదూర్చి, తమ బలాన్ని పెంచుకోవడానికి పూర్తిగా నిమగ్నమయ్యాయి. ఫ్రెంచి కంపెనీ దక్కన్ రాజ్యానికి ముజఫర్‌జంగ్‌ని, కర్నాటక రాజ్యానికి చందా సాహెబ్‌ని బలపరచి సంపూర్ణ సహకారాలను అందించింది. ఇదే విధమయిన మద్దతును ఆంగ్ల కంపెనీ దక్కను రాజ్యానికి నాసిర్‌జంగ్‌ని, కర్నాటక రాజ్యానికి అన్వరుద్దీన్‌ని తరువాత అతని కుమారుడయిన మొహమ్మదు ఆలీని బలపరచడం ద్వారా ఇచ్చింది.

ఫ్రెంచి మద్దతు ఇచ్చిన పోటీదారులే విజయాలను పొందడం ఆరంభించారు. అన్వరుద్దీన్ అంబూరు వద్ద 1749లో చందా సాహెబ్‌తో జరిగిన యుద్ధంలో మరణించాడు. అతని కుమారుడయిన మొహమ్మద్ ఆలీ భీతిచెంది, యుద్ధ భూమి నుంచి పారిపోయాడు. దీనితో కర్నాటక చందాసాహెబ్ వశమయింది; ఫ్రెంచి ప్రాబల్యం పెరిగింది.

దక్కన్ సింహాసనాన్ని నాసిర్‌జంగ్ తొలుతగా చేజిక్కించుకున్నప్పటికీ, అధికారాన్ని సుస్థిరం చేసికోలేకపోయాడు. కడప, కర్నూలు నవాబులు నాసిర్‌జంగ్‌ని హత్య చేయడంతో, ముజఫర్ జంగ్‌కి అడ్డు తొలగింది. పాండిచ్చేరి గవర్నరగు డూప్లే ముజఫర్ జంగ్‌ని దక్కన్ రాజుగా ప్రకటించాడు. ముజఫర్ కృతజ్ఞతా పూర్వకంగా డూప్లేని కృష్ణానది దక్షిణ భాగానికంతటికీ గవర్నరుగా ప్రకటించాడు. నిజాంపట్నంని అతనికి ఇచ్చాడు. చందాసాహేబ్ రాజయినప్పుడే, తన స్నేహితునికి ఇచ్చిన మద్దతుకు బహుమతిగా, ముజఫర్‌జంగ్ ఫ్రెంచివారికి మచిలీపట్నంని, దివి ప్రాంతాన్ని బహూకరించాడు. ఈ విధంగా ఆంధ్రప్రాంతం ఫ్రెంచి ఆధీనంలోకి మారడం ఆరంభమయింది.

నిజాం రాజుగా ప్రకటించబడిన ముజఫర్‌జంగ్ పాండిచ్చేరినుంచి గోల్కొండ వెళ్ళడానికి ఫ్రెంచి సైన్య సహాయాన్ని అర్థించాడు. దీనికి అంగీకరించిన డూప్లే బుస్సీ జనరల్‌గా గల ఫ్రెంచి సైన్యాన్ని తోడుగా పంపాడు. అయినప్పటికీ ఈ రక్షణ ఏర్పాట్లు ఏమీ విజయవంతం కాలేదు. దారిలో, రాయచోటి వద్ద కడప, కర్నూలు నవాబులు ముజఫర్ జంగ్‌ని అంతం చేశారు. అస్థిరమైన వాతావరణాన్ని బుస్సీ నిగ్రహించగలిగాడు. ముజఫర్ సోదరుడయిన సలబత్ జంగ్‌ని సుబేదారుగా ప్రకటించాడు. కొత్త నిజాం కూడా బుస్సీ సహాయ సహకారాలపై ఆధారపడసాగాడు. బుస్సీ అతనితో రాజధాని వరకు తోడుగా ప్రయాణించడమే గాక, రాజుగా అతడిని సింహాసనంపై నిలిపాడు. దీనికి ప్రతిఫలంగా మచిలీపట్నం చుట్టు ప్రక్కల గ్రామాలను పొందాడు.

**1.6.3 దక్కన్‌లో బుస్సీ :** నిజాం ఆస్థానంలో బుస్సీ నాయకత్వాన గల ఫ్రెంచి దళం 1751 నుంచి 1758 వరకు ఉంది. సలబత్‌కి అంతర్గత శత్రువులనుండి చుట్టుప్రక్కల రాజ్యాలనుంచి రక్షణ కల్పిస్తూ ఉండేది. ముఖ్యంగా మరాఠాలతోనూ, మైసూరు రాజులతోనూ వచ్చిన యుద్ధాల్లో ఫ్రెంచి సైన్యం సలబత్‌కి బాసటగా ఉండేది. దీనికి ప్రతిఫలంగా 1752లో కొండవీడు సర్కారుని ఫ్రెంచి వారికిచ్చారు. దీనిని దక్కించుకోవడం ఫ్రెంచి కంపెనీకి రెండు విధాలా లాభించింది. ఐరోపా మార్కెట్లకు అవసరమయ్యే ప్రఖ్యాత వస్త్రాలు మచిలీపట్నం, ఇతర చుట్టుప్రక్కల ప్రాంతాలలో లభించసాగాయి. ఈ సర్కారులో మూడు ప్రధాన రేవు పట్టణాలగు మచిలీపట్నం, నిజాంపట్నం, మోటుపల్లి ఫ్రెంచి ఆధీనంలోకి వచ్చాయి.

దక్కను రాజ్యంలో ఫ్రెంచి ఆధిపత్యం కొందరు ఉద్యోగులకు కంటగింపుగానే ఉండేది. అందుచేత వారు నిజాంకు బుస్సీపై చాడీలు చెప్పసాగారు. ఫ్రెంచి దళానికి అయ్యే సైనిక ఖర్చుల నిమిత్తం నెలకు రెండు లక్షల రూపాయిలు నిజాం ప్రభుత్వం చెల్లించాలి. అధికారులగు ఆర్థికమంత్రి ధనవజ్ ఖాన్, ప్రధామంత్రి లష్కర్ ఖాన్‌లు ప్రతి నెలా ఫ్రెంచిని ఇబ్బందులకు గురిచేసేవారు. దీనితో అందవలసిన సొమ్ము సమయానికి అందేది కాదు. ఆలస్యమవడం, బకాయిలు అధికమవడం మొదలయింది. దీనితో విసుగు చెందిన బుస్సీ 1753లో సలబత్ జంగ్‌తో ఒక ఒప్పందానికి వచ్చాడు. ప్రతినెలా ఇచ్చే రొక్కానికి బదులు, ఒకేసారి ఉత్తర సర్కారులను గంజాం నుంచి గుంటూరు సర్కారుల వరకు గల ప్రాంతాన్ని, తమ ఆధీనం చేయమని, శిస్తుని తామే వసూలు చేసుకుంటామని తెలియజేశాడు. ఫ్రెంచి సైన్యం ఇకనుంచి నిజాం అధికారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసిన అవసరం లేకుండా పోయింది. చికాకోలు, రాజమండ్రి, ఏలూరు, కొండపల్లి, కొండవీడు సర్కారుల నుంచి వచ్చే ఆదాయ వనరుల ద్వారా బుస్సీ సైన్యాన్ని పోషించుకొనవచ్చును.

**1.6.4 ఆంధ్రాలో ఫ్రెంచి పాలన :** ఉత్తర సర్కారులు, ఫ్రెంచి ఆధీనంలోకి జనవరి 26, 1753న వచ్చాయి. ఇతర జాగీర్దార్లతో సమానమైన హోదా ఫ్రెంచి వారికి కల్పించబడింది.

అయితే ఫ్రెంచి అధికారంపై అసంతృప్తి స్థానిక నేతలలో వ్యక్తమయింది. చికాకోల్, రాజమండ్రి సర్కారుల అధిపతి అయిన జఫర్ ఆలీ విజయనగరం అధిపతియైన విజయ రామరాజును కలిసి ఫ్రెంచి ఆధిపత్యాన్ని వ్యతిరేకించారు. మచిలీపట్నంలోని ఫ్రెంచి అధికారి అయిన మొరాసిన్ తన దౌత్యాన్ని ప్రదర్శించి, వారిని వేరు చేశాడు. విజయరామరాజుని చికాకోల్, రాజమండ్రి సర్కారులకు అధిపతిని చేస్తానని ఆశపెట్టి విడదీశాడు. ఒంటరి అయిన జఫర్ ఆలీ మరాఠా సహాయాన్ని కోరి పొందగలిగాడు. ఫ్రెంచి విజయనగర సేనలు తుమ్మపాలెం వద్ద జఫర్ ఆలీని, మరాఠా సైన్యాన్ని ఓడించాయి.

ఫ్రెంచి ఆధిక్యత రాజ దర్బారులో కొందరికి కంటగింపు అయింది. వారి కుట్రలు ఫలించి, బుస్సీని ఆస్థానాన్ని వీడి వెళ్ళమని సలబత్ ఆజ్ఞాపించాడు. ఉత్తర సర్కారులలోని శిస్తు వసూలుదార్లకు నిజాం 1756లో ఫ్రెంచి వారికి శిస్తు చెల్లించనక్కరలేదని ఆజ్ఞలు జారీ చేశాడు. దీనితో, విజయనగర రాజు తప్ప, ఇతర జమీందారులందరూ ఫ్రెంచి వారికి పన్నులు కట్టడం మానేశారు.

బుస్సీకి సహాయంగా డూప్లే ఫ్రెంచి దళాన్ని పంపడంతో వారు సైనిక కవాతు నిర్వహించారు. దీనితో భీతిల్లిన సలబత్ జంగ్ తిరిగి బుస్సీని తన ఆస్థానానికి ఆహ్వానించాడు. త్వరలోనే బుస్సీ తన ఆధిక్యతను పొందినప్పటికి ఫ్రెంచి అధికారాన్ని తిరిగి ఆంధ్ర ప్రాంతంపై నెలకొల్పవలసిన అవసరాన్ని గుర్తించాడు. దీనితోబాటు, బెంగాల్ నుంచి సిరాజ్ ఉద్దౌలా ఉమ్మడి శత్రువగు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సహాయాన్ని అర్థించాడు. దీనితో బుస్సీ ఉత్తర సర్కారులలో పర్యటించాలని, ఫ్రెంచి ఆధిక్యతను పునః ప్రతిష్ఠించాలని నిర్ణయించాడు.

**1.6.5 బొబ్బిలి యుద్ధం, జనవరి 24, 1757 :** ఉత్తర సర్కారుల యాత్రకు బయల్దేరిన బుస్సీ ప్రయాణంలో ప్రధాన ఘట్టం బొబ్బిలితో చేసిన యుద్ధం. దీని వివరాలలోనికి వెళ్ళినట్లైతే బొబ్బిలి రంగారావుకి, విజయనగర విజయ రామరాజుకి సరిహద్దు తగాదాలు ఉన్నాయి. పూసపాటి కుటుంబానికి చెందిన క్షత్రియులు విజయనగరాన్ని పాలిస్తుండగా, రావు కుటుంబానికి చెందిన వెలమలు బొబ్బిలి సంస్థానాధిపతులు. ఇతర రాజులు జమీందారులవలెనే రంగారావు ఫ్రెంచి కంపెనీకి శిస్తు బకాయిలు చెల్లించలేదు. రాజమండ్రి వద్దకు వచ్చి, తనను కలిసి బకాయీలు చెల్లించవలసిందని బుస్సీ ఇచ్చిన ఆజ్ఞను అతడు పాటించలేదు. ఐదువందల మంది యూరోపియన్లతోను, నాలుగు వేలమంది సిపాయిలతోనూ బుస్సీ నవంబరు 16, 1756న గోల్కొండ నుంచి బయలుదేరాడు.

విజయనగర రాజగు విజయరామరాజు బుస్సీని రాజమండ్రి వద్దకే వచ్చి కలిసాడు. బకాయీలను చెల్లించడమే గాక, బొబ్బిలి రంగారావుపై తనకు గల వ్యక్తిగత వైరంతో బుస్సీని బొబ్బిలిపై యుద్ధం చేయుటకు ప్రేరేపించాడు. దీనికి తోడు బుస్సీ సిపాయిలు రంగారావు రాజ్యం నుంచి ప్రయాణిస్తుండగా, కొందరు గాయపడి, మరికొందరు మరణించారు. ఫ్రెంచి వ్యతిరేక చర్యగా దీనిని భావించిన బుస్సీ బొబ్బిలిపై దండెత్తడానికి నిర్ణయించుకున్నాడు.

బొబ్బిలి కోటపై యుద్ధం జనవరి 24, 1757న జరిగింది. గోపాలకృష్ణ రంగారావు శాంతి ప్రయత్నాలు ఫలించలేదు. రంగారావు, అతని అనుచరులు వీరోచితమైన యుద్ధాన్ని చేసినప్పటికి, పరాజయం తప్పలేదు. దిట్టకవి నారాయణ కవి రచించిన రంగారాయ చరిత్రము బొబ్బిలి నగర నిర్మాణాన్ని దానిని వరుసగా పాలించిన రాజుల గురించి, తెలియజేయడమే గాక, బొబ్బిలి యుద్ధంలో వీరుల పౌరుషాన్ని తెలియజేస్తోంది. యుద్ధంలో బొబ్బిలి పరాజయం స్పష్టమవగానే, అనేకమంది వీరులు మరణించగానే స్త్రీలందరూ కూడా మరణించారు. వీరు స్వచ్ఛందముగా ఆత్మాహుతి చేసుకొన్నారని ఒక అభిప్రాయం, రంగారావే ఓటమి తథ్యమని తెలియగానే స్త్రీల అంతఃపురాన్ని మంటలతో రగిలించి, వధించమని ఆజ్ఞాపించినట్లు మరొక అభిప్రాయం. ఏది కారణమయినప్పటికి "కుటుంబ గౌరవాన్ని" నిలిపే నిమిత్తం బొబ్బిలి మహిళలు ఆహుతి అయినట్లు తెలుస్తోంది. బొబ్బిలిపై కక్షతీర్చుకొన్న విజయరామరాజు కూడా తనప్రాణాలు కోల్పోయాడు. బొబ్బిలి వీరులలో ఒకడు, గుడారంలో నిద్రిస్తున్న విజయరామరాజుపై దాడిచేసి హత్య చేశాడు. ఫ్రెంచివారు, ముఖ్యంగా బుస్సీ, ఈ వరుస సంఘటనలను చూసి చలించి, రంగారావు కొడుకయిన చిన రంగారవును బొబ్బిలి వారసునిగా గుర్తించి, వెనుదిరిగారు. బొబ్బిలిని విజయనగర ఆధీనంలో ఉంచకపోవడంతో, మరణించిన విజయరామరాజు కొడుకు, వారసుడు అయిన ఆనందగజపతి ఫ్రెంచి వారితో వైరం బూని, ఆంగ్లేయుల పక్షాన చేరాడు.

బొబ్బిలిపై విజయం ఫ్రెంచి అధికారాన్ని తిరిగి ప్రతిష్ఠించింది. ఇతర రాజులు జమీందారులు ఫ్రెంచి ఆధిపత్యాన్ని అంగీకరించి ఆయుధాలు పరిత్యజించి, బకాయీలు చెల్లించారు. విదేశీ ఆధిపత్యాన్ని ఎదిరించిన స్థానిక రాజ్యంగా బొబ్బిలి ప్రసిద్ధి చెందింది. అందుచేతనే ఓటమి పొందినప్పటికి, బొబ్బిలి రంగారావు దిట్టకవి నారాయణకవి రచించిన చారిత్రక ప్రబంధమగు రంగరాయ చరిత్రములో నాయకునిగా ఎంచుకోబడ్డాడు.

బొబ్బిలి విజయం తరువాత బుస్సీ ఆంగ్లేయుల స్థావరాలను ఆక్రమించే ప్రయత్నం చేశాడు. మాడపాలెం, బెండమూర్లంక, ఇంజరంలలో ఉన్న ఆంగ్ల ఫ్యాక్టరీలను స్వాధీనం చేసికోమని, రాజమండ్రి వద్దగల ఫ్రెంచి వారిని ఆజ్ఞాపించాడు. తానే స్వయంగా విశాఖపట్నంలోని ఫాక్టరీని జూన్ 24, 1757న ఆక్రమించాడు. గంజాంలోని గుంసూర్ రాజుమాత్రం ఫ్రెంచిని అంగీకరించకపోవడంతో, బుస్సీ అక్కడికి వెళ్ళి ఆ రాజ్యాన్ని వశం చేసికొని, 1758 ప్రారంభ సమయానికి తిరిగి గోల్కొండ చేరాడు. అయితే బుస్సీ ఘనవిజయాలు తాత్కాలికాలే అయ్యాయి.

**1.6.6 మూడవ కర్నాటక యుద్ధం (1756-1763)** : ఐరోపాలోని సప్తవర్ష సంగ్రామం ప్రతిధ్వనులు ఇండియాలో కూడా వినిపించాయి. ఆంగ్ల - ఫ్రెంచి కంపెనీలు ఆధిపత్య పోరాటానికై తిరిగి సిద్ధపడ్డాయి. ఫ్రెంచి ప్రభుత్వం డూప్లేని స్వదేశానికి పిలిచి, కౌంట్ డి లాలీని పాండిచ్చేరి గవర్నరుగా పంపారు. కౌంట్ డి ఏక్ ని నౌకాధిపతిగా నియమించారు. ఈ యుద్ధం ఫ్రెంచి అధికారానికి ముగింపునిచ్చి, ఆంధ్ర ప్రాంతాన్ని ఆంగ్లేయుల అధికారానికి మళ్ళించింది. ఈ యుద్ధానికి ముగింపు పారిస్ సంధి (1763) యిచ్చింది. అప్పటికి ఆంగ్ల ఫ్రెంచి ప్రభుత్వాలు యిరువురు సలబత్ జంగ్‌ని దక్కన్ సుబేదారుగానూ, మహమ్మద్ ఆలీని కర్నాటక నవాబుగానూ అంగీకరించాయి.

## 1.7 ఫ్రెంచి పతనం

ఆంధ్రాలో ఫ్రెంచి కంపెనీ ఐదు సంవత్సరాల పాలన చేసి, యుద్ధాలలో సంభవించిన పరాజయం ద్వారా ఓటమి నంగీకరించింది. సలబత్ జంగ్ 1759లో ఆంగ్లేయులతో చేసికొన్న ఒప్పందంతో ఫ్రెంచి అధికారం అస్తమించింది. ఫ్రెంచి పతనానికి కారణాలు :

1. ఫ్రెంచి అధికారం పై నుంచి, అంటే సుల్తానులు అధికారుల ద్వారా, నెలకొల్పబడినదే తప్ప, క్రింది స్థాయి నుంచి నిర్మితమయింది కాదు. అందుచేత ఎంత త్వరగా నెలకొన్నదో, అంత త్వరగా అస్తమించినా, దీని ప్రభావం ప్రజలపై ఏమీ లేదు.
2. ఫ్రెంచి కీర్తి అధికారులయిన డూప్లే, బుస్సీల వ్యక్తిత్వం నుంచి వచ్చింది. ఫ్రెంచి ప్రభుత్వం డూప్లేని వెనుకకి పిలిపించడం, బుస్సీని దక్కన్ వదలమని 1758లో ఆజ్ఞాపించడం వారి అధికారపతనానికి దారితీసింది. వీరిద్దరూ లేకపోవడంతో వారి ప్రభావమూ మాయమయింది.
3. ఫ్రెంచి ప్రభుత్వం, దక్కన్ కంటే, కర్నాటకకే ప్రాధాన్యత నిచ్చింది. అస్థిరమైన కర్నాటక కంటే, దొరికిన దక్కన్‌పై అధికారాన్ని నిలబెట్టుకోవాలని బుస్సీ చేసిన విజ్ఞప్తులను ఖాతరు చేయక, కౌంట్ డి లాలీ బుస్సీని కర్నాటక యుద్ధంలో పాల్గొనవలసినదిగా ఆజ్ఞాపించాడు.
4. విజయనగర రాజ్యం, ఇదివరలో, ఫ్రెంచి వారికి మద్దతు నిచ్చింది. కాని ఆనంద గజపతి రాజ్యానికి వచ్చినప్పటి నుంచి, అతడు ఫ్రెంచికి విరోధిగా మారాడు. ఫ్రెంచివారు తన తండ్రికి ఇస్తానన్న బొబ్బిలి రాజ్యాన్ని ఇవ్వక, ఆ వారసుడునే రాజుగా గుర్తించడం ఆనందగజపతి వ్యతిరేకించాడు. బొబ్బిలి రాజ్యంలోని శిస్తు వసూలును తనకు దాఖలు పరచనందుకు అతడు ఆగ్రహించాడు. విశాఖపట్టణంలోని ఫ్రెంచి ఫాక్టరీని సెప్టెంబరు 2, 1758న ఆక్రమించి ఫ్రెంచి వారిని తరమడానికి ఆంగ్లేయ ప్రభుత్వానికి తన సహాయాన్ని తెలియజేసాడు. మద్రాసు ప్రభుత్వం నుంచి ఎట్టి ప్రతిస్పందన లేకపోయేసరికి, బెంగాలు ప్రభుత్వానికి తన సహాయాన్ని తెలియజేస్తూ జాబు రాశాడు. రాబర్ట్‌క్లైవ్ అప్పటికి ప్లాసీ యుద్ధంలో విజయం సాధించడంతో, రెట్టించిన ఉత్సాహంతో, కల్నల్ ఫోర్డ్ నాయకత్వంలో ఆంగ్ల దళాన్ని పంపాడు.
5. కల్నల్ ఫోర్డ్ నాయకత్వ ప్రతిభ ఆంగ్ల బలాలకు విజయం చేకూర్చింది.

ఫోర్డ్ నాయకత్వంలో బయలుదేరిన సైన్యం విజయనగర రాజుగు ఆనందరాజుని కశింకోట వద్ద కలిసి, ఉమ్మడి సైన్యాలు రాజమండ్రి దిశగా కదిలాయి. అక్కడ ఇరువురికి జరిగిన ఒప్పందం ప్రకారం దోచుకున్న సంపదను ఇరువురు సమంగా పంచుకోవాలని, జయించిన ప్రాంతాలు విజయనగర రాజుకి చెందాలని, అతడే అక్కడ ఆదాయాన్ని వసూలు చేసికోవచ్చని, నదీముఖద్వారాన ఉండే రేవులు, పట్టణాలు ఆంగ్లేయులవని నిర్ణయించారు. వాటినుంచి వచ్చే ఆదాయం కంపెనీకే చెందాలని అంగీకరించారు. నూతనంగా

రాబోయే ప్రాంతాలపై నిర్ణయాలు ఇరువురుకలసి తీసికోవాలని, ఆంగ్లేయ సైన్య ఖర్చుల నిమిత్తం నెలకి రాజు రూ. 50,000 ఇవ్వాలని అంగీకరించారు. ఈ ఒప్పందం యిరు పక్షాల సమాన స్థాయిని చాటుతుంది.

రాజమండ్రి నుంచి బయలుదేరిన ఈ ఉమ్మడి సైన్యాలకు చందుర్తి వద్ద ఫ్రెంచి సేనలు ఎదురయ్యాయి. అక్కడ జరిగిన యుద్ధంలో ఫ్రెంచి వారు ఓటమిని చూవిచూసి, అక్కడి నుంచి పారిపోయారు. ఈ యుద్ధాన్నే కొందరు చరిత్రకారులు కొండూరు యుద్ధమని వ్యవహరిస్తారు.

ఫ్రెంచి సేనలను తరుముతూ మచిలీపట్నంపై దాడికి ఉమ్మడి సైన్యాలు ఉపక్రమించాయి. కోటలో ఉన్న ఫ్రెంచిపై ఆంగ్ల సైన్యాలు దాడి ఆరంభించాయి. ఆంగ్లేయుల మందుగుండు సామాగ్రి అయిపోవస్తున్నప్పటికీ, చివరి రౌండ్ వరకు ఉపయోగించాలనే ఫోర్డ్ నిర్ణయించాడు. ఇదే సమయానికి ఫ్రెంచి వారి సహాయార్థం అక్కడికి సలబత్ జంగ్ వచ్చాడు. ఆనందగజపతిని ఆ స్థలం వీడి విజయనగరం వెళ్ళమని ఆజ్ఞాపించాడు. దీనితో ఆనంద గజపతి వెళ్లడానికే నిశ్చయించుకొని, రాజమండ్రి వద్ద మరొక ఆంగ్ల సైన్యం ఉండడంతో, ఫోర్డ్‌తోనే ఉండాలని నిర్ణయించుకొని, వెనుతిరిగి వచ్చాడు. ఈ విధంగా ఒత్తిడి ఉన్నప్పటికి ఆయుధ సామాగ్రి అయిపోవస్తున్నప్పటికి, ఫోర్డ్ విజయం కోసం సర్వస్వం ఒడ్డడానికే నిశ్చయించుకున్నాడు. కోటలో ఉన్న ఫ్రెంచి సైన్యం, మొరాసిన్ నాయకత్వంలో ఏప్రిల్ 8, 1759న వశమయింది. ఈ మార్పుని గమనించిన సలబత్ ఫ్రెంచితో బంధాన్ని వీడి, ఆంగ్లేయులతో సంధికి అంగీకరించాడు. ఫ్రెంచి ఓటమితో, వారికిచ్చిన ఉత్తర సర్కారులు తిరిగి సలబత్‌కే సంక్రమించడం వలన అతడు కూడా లాభపడ్డాడు. ఫ్రెంచి సంరక్షణ నుంచి బయట పడ్డాడు.

సలబత్ మే 14, 1759 న ఆంగ్లేయులతో ఒప్పందం చేసుకున్నాడు. నిజాంపట్నం, మచిలీపట్నం సర్కారులోని కొన్ని భాగాలు, కొండపల్లి ఆంగ్లేయులకు ఇచ్చి, ఫ్రెంచి వారిని పదిహేను రోజుల లోగా తన రాజ్యాన్ని వీడమని ఆజ్ఞాపించాడు. ఈ విధంగా ఫ్రెంచి అధికారం అస్తమించింది.

## 1.8 ఫ్రెంచి విధానాలు

ఆంధ్రాలో ఫ్రెంచి అనుసరించిన విధానాలు వారి వారసులగు ఆంగ్లేయులకు ఉపకరించాయి అవి :

1. విభజించి - పాలించు విధానానికి ఫ్రెంచి ప్రభుత్వమే నాంది పలికింది. విజయ రామరాజుని జఫర్ ఆలీ నుంచి వేరు చేయడానికి, అతనికి చికాకోల్ సర్కారుపై శిస్తు వసూలు ఆశ చూపారు.

2. యుద్ధం ద్వారా కాక తమ దేశ ప్రభావాన్ని శిస్తు వసూలు ద్వారా విస్తరింపజేయడం ఫ్రెంచి వారు ఆరంభించారు. డూప్లే మచిలీపట్నంలోని ఏజెంటు అగు ఫ్రిల్‌కి మార్చి 26, 1751 న జాబు రాస్తూ రాజమండ్రి, ఏలూరు, కొండపల్లి శిస్తు వసూలు హక్కుకి ప్రయత్నించమని రాశాడు. పరిపాలనా బాధ్యత లేకుండానే ప్రాంత ఆదాయంపై హక్కు ఏర్పడుతుంది.

3. నిజాంకి "సహాయం" పేరుతో సైనిక దళాన్ని, నిజాం ఖర్చుతోనే, నిలిపే పద్ధతిని ఫ్రెంచి ప్రభుత్వం ఆరంభించింది. నిజాంపై అదుపుకోసమని గాక స్నేహ పూర్వకమైన విధానంగా దీనిని ఆరంభించారు. డూప్లే బుస్సీకి రాసిన ఉత్తరంలో వారి విధానం స్పష్టమవుతోంది. ఎక్కువ బలపడుతున్న కొద్దీ, మరీ ఎక్కువ విధేయతతోనూ, రాజు క్షేమానికే ఎక్కువ ఆతృత పడుతున్నట్లు అతని ఆజ్ఞలను పాటించడానికి ఎక్కువ సిద్ధమవుతున్నట్లు ప్రవర్తించమని బుస్సీకి తెలియజేశాడు.

ఫ్రెంచి విధానాలు ఆంగ్లేయులకి మార్గదర్శకమయ్యాయి.

## 1.9 ఆంధ్రాలో ఆంగ్ల సామ్రాజ్య స్థాపన

నిజాంలతో కుదుర్చుకున్న వరుస ఒప్పందాల ద్వారా ఆంధ్రాలో ఆంగ్ల సామ్రాజ్యం ఏర్పడింది. బెంగాలు వలెనే మొట్టమొదట ఆంగ్లేయులు ఆక్రమించిన ప్రాంతంలో ఆంధ్రా ప్రాంతం ఒకటి. చట్టబద్ధంగా ఆక్రమించినటువంటి భూభాగమిది. ఉత్తర సర్కారులు ఆంగ్లేయుల ఆధీనంలోకి రావడానికి నిజాంతో అనేక సంధులు చేసికోవలసి వచ్చింది. రాయలసీమ, నెల్లూరు మరికొంత కాలం పట్టింది.

**1.9.1 మే 14, 1759 సంధి :** ఆంగ్లేయులకి, సలబత్ జంగ్‌కి మధ్య జరిగిన సంధి ఇది. మచిలీపట్నం, కొండపల్లిలలోని కొన్ని భాగాలను, నిజాం పట్నంను ఆంగ్లేయులకు సలబత్ ఇవ్వడం జరిగింది. సర్కారుల నుంచి ఫ్రెంచిని తరిమి వెయ్యడానికి అతడు అంగీకరించాడు.

అయితే 1760 లోనే సలబత్ జంగ్‌ని సింహాసనం నుంచి తొలగించి, అతని తమ్ముడయిన నిజాం ఆలీ సుబేదారు అయ్యాడు. ఇతడు రాజ్యాన్ని అధిష్టించిన వెంటనే ఆంగ్ల సైన్య సహకారాన్ని అర్థించాడు. మరాఠా సైన్యాన్ని ఎదుర్కొనే నిమిత్తం ఆంగ్ల సైనికులను కనుక తనకిచ్చినట్లైతే, సర్కారులన్నిటిని ఇస్తానని తెలియజేశాడు. అయితే అప్పుడు ఆంగ్లేయులు మూడవ కర్నాటక యుద్ధంలో తలమునకలుగా ఉండడంతో ఈ ప్రతిపాదనని అంగీకరించలేదు. తరువాత ఆంగ్లేయులు నిజాంని లెక్కజేయక సర్కారులపై ఆధిపత్యాన్ని పొందే ప్రయత్నాన్ని చేశారు. అయినప్పటికీ వారు విజయాన్ని పొందలేకపోయారు. ఆంగ్లేయులు 1763లో నిజాంతో ఒప్పందానికి వచ్చే ప్రతిపాదన చేసినా, నిజాం అంగీకరించలేదు.

**1.9.2 మొగల్ ఫర్మాన్ ఆగష్టు 12, 1765 :** పరిస్థితులు ఈ విధంగా ఉన్నప్పుడు, ఆంగ్లేయులు 1757లో ప్లాసీ యుద్ధంలోనూ, 1764లో బక్సర్ యుద్ధంలోనూ కీలక విజయాన్ని సాధించారు. ఓడిన మొగల్ చక్రవర్తి అగు షా ఆలం నుంచి, బెంగాల్ గవర్నరగు రాబర్ట్ క్లైవ్ 1765లో ఒక ఫర్మానుని సంపాదించాడు. దీని వలన చికాకోల్, రాజమండ్రి, ఏలూరు, కొండపల్లి, కొండవీడు సర్కారులను ఆంగ్లేయులకు 'ఈనాం'గా ఇవ్వడం జరిగింది. మొగల్ చక్రవర్తి అనుమతిలేని ఫ్రెంచి ఆక్రమణ నుంచి, ఆ ప్రదేశాలను విముక్తి చేసినందుకు ప్రతిఫలంగా చక్రవర్తి ఇచ్చిన బహుమతి ఇది. ఉత్తరాన చిలుక సముద్రం నుంచి దక్షిణాన గుండ్లకమ్మ వరకు గల భూభాగం చట్టబద్ధంగా ఆంగ్లేయుల చేతికందింది.

**1.9.3 నిజాంతో సంధి నవంబరు 12, 1766 :** తనకు అధికారి అయిన మొగల్ చక్రవర్తి ఫర్మానాను సహితం నిజాం లెక్కజేయలేదు; ఆంగ్లేయులకు ఆ సర్కారులను అప్పగించనూ లేదు. అప్పుడు మచిలీపట్నంలోని జాన్ సైబస్ కాంగ్రేగుల జోగిపంతులును దుబాసిగా పంపి, సర్కారుల విషయం ప్రస్తావించారు. ఇతడిపట్ల నిజాం దివానగు రుక్నుద్దౌలాకు గౌరవం, గురి ఉండేవి. అప్పటికీ నిజాం అంగీకరించలేదు. గొల్లపూడిలోని నిజాం సైనికులు జీతం బకాయీలకై ఆందోళన చేయగా, నిజాం దివానులు రాజమండ్రికి వెళ్ళారు. జోగిపంతులు కూడా అక్కడికి వెళ్ళి, ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. సర్కారులను ఈనాంగా కాక, కౌలుకు ఇచ్చినట్లైతే ఆంగ్లేయుల నుంచి శిస్తు వస్తుందని నిజాంని అంగీకరింపజేశాడు. రాజమండ్రి, ఏలూరు, ముస్తఫానగర్ సర్కారులకు కలిపి ఐదు లక్షల రూపాయలు, చికాకోలుకి రూ. 2 లక్షలు, మూర్తజానగర్‌కి రూ. 2 లక్షలు చొప్పున మొత్తం ఏడాదికి రూ.9 లక్షలు అద్దె చెల్లించేటట్లు అంగీకరించారు.

అయితే అప్పటికే మూర్తజానగర్ సర్కారుని నిజాం ఆలీ తన తమ్ముడయిన బసాలత్ జంగ్‌కి జీవిత జాగీర్‌గా ఇచ్చాడు. ఆంగ్ల కంపెనీ దీనిని గౌరవిస్తూ, బసాలత్ జీవిత కాలం మూర్తజానగర్ సర్కారుని ఆధీనంలో ఉంచుకోమని, అతని మరణం తరవాత దానిని తమకు నిజాం సమర్పించాలని కోరారు. తమ ఆధీనంలోకి వచ్చినప్పటి నుంచి దానికి అద్దె చెల్లిస్తామని అన్నారు.

ఈ సంధిలో అద్దె విషయమే తప్ప, క్లైవ్ - షా ఆలంల మధ్య జరిగిన 1765 సంధి విషయం ఎక్కడా ప్రస్తావించబడలేదు. స్వతంత్రంగా నిజాం ఆంగ్లేయులతో కుదుర్చుకున్న ఒప్పందంలాగే కనిపిస్తుంది.

**1.9.4 నిజాంతో తిరిగి సంధి, ఫిబ్రవరి 23, 1768 :** ఆంగ్లేయులకు, నిజాంకు మధ్య 1766లో సంధి జరిగినప్పటికి, వారి మధ్య సత్సంబంధాలు కొనసాగలేదు. మైసూరు రాజగు హైదరాలీతో నిజాం ఒప్పందం 1767లో చేసుకొని, ఆంగ్లేయులపై యుద్ధాన్ని ప్రకటించాడు. దీనితో ఆగ్రహించిన ఆంగ్లసేనలు ఖమ్మం, హనుమకొండ ప్రాంతాలను ఆక్రమించడమే గాక, హైదరాబాదుపై దండెత్తే ప్రయత్నం చేశాయి.

దీనితో నిజాం తిరిగి ఆంగ్లేయులతో స్నేహ సంబంధాలు పునరుద్ధరించుకొనేందుకు సంధి చేసుకొన్నాడు. దీని ద్వారా ఇది వరకు అద్దెకు ఇచ్చిన ప్రాంతాన్ని గంజాంనుంచి గుంటూరు - ఖరారు చేశాడు. క్లైవ్ - షా ఆలంలు 1765లో చేసికొన్న సంధిని కూడా దీనిలో పేర్కొన్నారు. దీని వలన మద్రాసు ప్రభుత్వం రాబర్ట్ క్లైవ్ అధికారాన్ని, నిజాం మొగల్ చక్రవర్తి అధికారాన్ని అంగీకరించినట్లయింది.

గుంటూరు బసాలత్ జంగ్ ఆధీనంలో ఉంది. అతడు మైసూరు హైదరాలీతో కలసి ఆంగ్ల వ్యతిరేకత తెలియజేయడమే గాక, ఫ్రెంచి వారిని ఆదరించి, ఫ్రెంచి సైన్యాన్ని నిలుపుకునే ప్రయత్నం చేయసాగాడు. నిజాం యొక్క అంగీకారంతో దానిని ఆక్రమించ గలిగినప్పటికి, ఆంగ్లేయులు స్నేహపూర్వకంగా, బసాలత్ జీవితాంతం ఆ సర్కారుని తన ఆధీనంలో ఉంచుకోవచ్చని, అతని మరణం తరువాత నిజాం ఆ సర్కారుని స్వాధీన పరచాలని తెలిపారు. నిజాంతో సుహృద్భావ సంబంధాలకై కంపెనీ రెండు వాయిదాలలో, రెండు లక్షల రూపాయలను మద్రాసు వద్దగాని, మచిలీపట్నం వద్దగాని, 1768 నుంచి ఆరు సంవత్సరాల వరకు, చెల్లించడానికి అంగీకరించింది. ఇది అంగీకారం కాని పక్షంలో ప్రతీ ఏడాది రెండు లక్షల రూపాయల చొప్పున, కొండవీడు స్వాధీనంలోకి వచ్చినప్పటి నుంచి మరో లక్ష రూపాయిలు ఎక్కువ చొప్పున ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ విధంగా శాంతియుతంగా సర్కారులను స్వాధీనం చేసికొనే ప్రయత్నాన్ని కంపెనీ చేసింది. ఈ సంధి నిజాం ఆలీఖాన్ యొక్క దౌత్యనీతిని, వారెన్ హేస్టింగ్స్ సమస్యల పరిష్కారంలో చూపే నిపుణతను తెలియజేస్తోంది. దీనితో కొండవీడు తప్ప ఇతర సర్కారులు ఆంగ్ల ఆధిపత్యంలోకి వచ్చాయి.

**1.9.5 కొండవీడు సర్కారు ఆక్రమణ 1788 :** ఈ సర్కారు కూడా కంపెనీ ఆధిపత్యంలోకి వచ్చినట్లైతే కొన్ని ప్రయోజనాలు కలుగుతాయి. సర్కారులనుంచి కంపెనీ పొందే ఆదాయం అధికమవుతుంది. గంజాం నుంచి మద్రాసు వరకు ఉన్న మార్గం సుగమమవుతుంది. బ్రిటిష్ వ్యతిరేక శక్తులనుంచి ఆ ప్రాంతం విముక్తమవుతుంది.

బసాలత్ జంగ్‌తో ఒక అంగీకారానికి రమ్మని, ముఖ్యంగా ఫ్రెంచి దళాన్ని తొలగించమని మోటుపల్లి రేవుని అద్దెకివ్వవలసిందిగా కోరమని, మచిలీపట్నం కౌన్సిల్ 1775లో మద్రాసు ప్రభుత్వానికి విజ్ఞాపన చేసింది. కాని మద్రాసు ప్రభుత్వం ఆ విషయాన్ని నిర్లక్ష్యం చేసింది. అయితే కలకత్తాలోని సుప్రీం కౌన్సిల్ బసాలత్ నుంచి సర్కారుని స్వాధీనం చేసికోమని, ఫ్రెంచి వారిని తొలగించాలని నిజాంని ఒప్పించవలసిందిగా మద్రాసు ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది.

ఇదే సమయంలో మరో యుద్ధం ఆరంభమయ్యే సూచనలు కనపడసాగాయి. ఆంగ్లో - ఫ్రెంచి యుద్ధం ఆరంభమయితే, మైసూరుకి చెందిన హైదరాలీ ఫ్రెంచి సాయంతో కొండవీడు సర్కారుని కబళిస్తాడని భయపడిన బసాలత్ జంగ్ ఆంగ్లేయులతో ఒప్పందానికి సిద్ధపడ్డాడు. మద్రాసులోని రంబోల్డ్ ప్రభుత్వంతో 1779లో ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం బసాలత్ కొండవీడుని కంపెనీకి అద్దెకివ్వడానికి, ఫ్రెంచి సైన్యాన్ని తొలగించడానికి అంగీకరించాడు. మద్రాసు ప్రభుత్వం ఈ సర్కారుని నిజాం సామంతుడగు కర్నాటక నవాబుకి పది సంవత్సరాల వరకు కౌలుకిచ్చాడు. ఈ ఒప్పందం ప్రాముఖ్యత ఏమిటంటే బసాలత్ తన అధికారి అగు నిజాం అనుమతిని గాని, మద్రాసు ప్రభుత్వం బెంగాలు ప్రభుత్వ అనుమతిని గాని పొందకుండానే, స్వతంత్రంగా వ్యవహరించారు. బెంగాలు ప్రభుత్వం ఈ వివరాలు కూడా తెలియని నిజాంని ఓదార్చే ప్రయత్నం చేసింది. నిజాంని నిర్లక్ష్యం చేసినందుకు మద్రాసు ప్రభుత్వాన్ని విమర్శించి, కొండవీడు సర్కారుని తిరిగి బసాలత్ జంగ్‌కే ఇమ్మంది. గోల్కొండ ఆస్థానంలో బ్రిటిష్ రెసిడెంట్‌గా మద్రాసు ప్రభుత్వం తొలగించిన హోలెండ్‌ని తిరిగి నియమించింది. రంబోల్డ్ ప్రభుత్వాన్ని తొలగించారు. నిజాం ఏప్రిల్ 4, 1780న రాసిన జాబులో హోలెండ్ నియామకాన్ని స్వాగతించాడు. సర్ ఐర్ కూట్‌కి జనవరి 16, 1781న రాసిన జాబులో నిజాం కంపెనీపై తన అభ్యంతరాలను తెలియజేసాడు. రంబోల్డ్, వైట్‌హిల్ గవర్నర్ల పదవులలో

ఉండగా కంపెనీ బకాయిలు ప్రధానమైనవి. మరాఠా రఘునాథరావుతో జరిగిన యుద్ధంలో ఆంగ్ల సహాయం రాకపోవడాన్ని నిజాం ప్రస్తావించాడు. కొండవీడు సర్కారు విషయంలో తన ప్రమేయం లేకపోవడాన్ని తెలియజేసాడు.

నిజాం వ్యవహారంతో విసిగిన గవర్నరు - జనరల్ వారెన్ హేస్టింగ్స్ జూలై 1781లో సర్కారులను పూర్తిగా నిజాంకి ఇవ్వాలనే యోచన చేసాడు. అయితే 1768 కి పూర్వం కంపెనీకి గల ఫాక్టరీలు, కోటలు, రేవులు మొదలయినవన్నీ ఆంగ్లేయులకే ఉంటాయని తెలియజేసాడు. శాంతియుత పరిస్థితులలో కూడా సర్కారుల నుంచి వచ్చే ఆదాయం, వాటిని నిలబెట్టుకునే ప్రయత్నానికి చాలడంలేదని తెలిపాడు. సర్కారుల కంటే కార్నటక మంచిదేమోనని అన్నాడు. అయితే అప్పటి మద్రాసు గవర్నరగు లార్డ్ మెకార్నే ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకించాడు. అంత శ్రమ, ఖర్చు, కాలాన్ని వెచ్చించి, అందరి అనుమతితో పొందిన సర్కారులను పోగొట్టుకోవడం ఉచితం కాదని తెలిపి, అంగీకరింపజేసాడు.

ఈ నేపథ్యంలో, నిజాం 1766, 1768 సంధులకు వ్యతిరేకంగా కొండవీడు సర్కారుని బసాలత్ జంగ్ 1782లో మరణించినప్పటికి, తన వద్దనే పెట్టుకున్నాడు తప్ప, ఆంగ్ల కంపెనీకి ఇవ్వలేదు. దీనివలన ఇతర సర్కారులపై ఇవ్వవలసిన అద్దెను మద్రాసు ప్రభుత్వం ఇవ్వక, బకాయిలను పెంచింది. ఈ విధంగా ఇరుపక్షాలు తమ సంధి షరతులను అతిక్రమించాయి. నిజాంతో కొత్తగా మరో సంధికి కోర్టు ఆఫ్ డైరెక్టర్లు ఆసక్తి చూపలేదు.

కొత్త గవర్నరు - జనరల్ అయిన లార్డ్ కారన్ వాలీస్ కాప్టెన్ కెన్నవేని హైదరాబాదు రెసిడెంట్‌గా 1788లో పంపాడు. కెన్నవే సెప్టెంబరు 18, 1788న నిజాంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడు. కొండవీడు సర్కారు ఆంగ్ల కంపెనీకి ఇవ్వడం జరిగింది. గవర్నరు - జనరల్ మద్రాసు ప్రభుత్వం చెల్లింపవలసిన బకాయిలు సుమారు 9,16,665 ఇవ్వడానికి అంగీకరించాడు. దీనితో సర్కారులపై జరిగిన దీర్ఘ చర్చలు కొలిక్కి వచ్చాయి.

ఆంగ్ల కంపెనీకి, నిజాంకి గల ఆర్థిక సంబంధాలు 1831తో ముగిసాయి. పామర్ కంపెనీకి అప్పుపడిన నిజాం దాని నుంచి బయట పడడానికి ఆంగ్ల కంపెనీ నుంచి రూ.1,66,66,666 లు తీసికొని ఏటా సర్కారులనుంచి రావలసిన ఆదాయాన్ని వదులుకున్నాడు.

**1.9.6. రాయలసీమ ఆక్రమణ 1800** : కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరుతో కూడిన బళ్ళారి ప్రాంతం నిజాం సుబాలోని అంతర్భాగం. అయితే కడప, కర్నూలు, ఆదోని నవాబులు నిజాం - ఉల్ - ముల్కు మరణం తరవాత స్వతంత్రంగా వ్యవహరిస్తూ ఉండేవారు.

ఈ ప్రాంతాలు తరచుగా మరాఠుల దాడులకు గురి అయ్యేవి. సండూరు, పెనుగొండ, గుత్తి, గుఱ్ఱం కొండలలోని కోటలను ఆక్రమించారు. చౌత్ పన్నును ఆ ప్రాంతాల నుంచి వసూలు చేసేవారు.

క్రమంగా, మరాఠా అదికారం నుంచి ఈ ప్రాంతాలు మైసూరు ఆధీనంలోకి రాసాగాయి. హైదరాలీ, టిప్పుసుల్తానులు 1790 తరువాత ఈ ప్రాంతాన్నంతటిని మైసూరు రాజ్యంలో విలీనం చేసారు.

మూడవ ఆంగ్లో - మైసూరు యుద్ధంలో నిజాం ఆంగ్లేయుల తరపున పోరాడాడు. మైసూరు రాజగు టిప్పు సుల్తానుకు వ్యతిరేకంగా మరాఠాలు, నిజాం, ఆంగ్లేయులు త్రిపక్ష సంధిని 1790లో చేసికొన్నాయి. 1790 నుంచి 1792 వరకు సాగిన ఈ యుద్ధంలో టిప్పు సుల్తాను తన రాజ్యంలో సగభాగాన్ని పోగొట్టుకున్నాడు. గుత్తి, కడప, పరిసర ప్రాంతాలతోబాటు ఒక కోటి రూపాయిల నగదు నిజాంకి దక్కింది.

నిజాం మరాఠాలు ఒకే పక్షాన పోరాడినప్పటికి, వారిద్దరి మధ్య సఖ్యత లేదు. మరాఠాలు చౌత్, సర్దేశిముఖ్ పన్నులను వసూలు చేయడం నిజాంకి నచ్చలేదు. దౌత్యం వలన సమస్య పరిష్కరించబడేది కాకపోవడంతో యిరు పక్షాలు యుద్ధానికి దిగాయి. ఖర్దా వద్ద

నిజాంని మరాఠులు ఓడించారు. మూడు కోట్ల రూపాయిల చౌత్ వసూలు చేసికొనేందుకు, రెండు కోట్ల రూపాయిలు నష్టపరిహారం వారికి చెల్లించేందుకు నిజాం అంగీకరించాడు.

ఖర్దా ఓటమి తరువాత నిజాం ఆలీకి మరొక కష్టం ఎదురయింది. అతని కుమారుడగు ఆలీజా తిరుగుబాటు చేశాడు. దీనిని ఫ్రెంచి నాయకుడగు రేమాండ్ వద్ద శిక్షణ పొందిన సైన్యం త్వరలోనే అణచింది. ఫ్రెంచి పలుకుబడి ఆంగ్లేయులకు ఆందోళన కలిగించింది. అందులో వారు తీవ్రంగా మైసూరు టిప్పుసుల్తానుని అణచే కార్యక్రమంలో ఉన్నారు.

నిజాంని ఆకర్షించే నిమిత్తం బ్రిటిష్ రెసిడెంటగు కెప్టెన్ అఖిలెస్ కిర్క్ పాట్రిక్ శాశ్విత సైన్య సహకారాన్ని అందిస్తానని ఆశ పెట్టాడు. అందుచేత నిజాం 1800వ సంవత్సరంలో వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకారపద్ధతికి అంగీకారం తెలిపాడు. తన కొలువునుంచి ఫ్రెంచి సైన్యాలకు ఉద్వాసన చెప్పడానికి, బ్రిటిష్ కంపెనీ తన ఆస్థానాన నిలిపే ఆంగ్ల సైన్యాన్ని పోషించడానికి, నిజాం సంసిద్ధత తెలిపాడు.

నాలుగవ ఆంగ్లో - మైసూరు యుద్ధంలో నిజాం ఆంగ్లేయులకు పూర్తి సహకారాన్ని అందజేసాడు. టిప్పుసుల్తాన్ మరణంతో అతని రాజ్యంలోని సగ భాగం నిజాంకి సంక్రమించింది.

అయితే దీనిని పూర్తిగా అనుభవించే అవకాశం నిజాంకి రాలేదు. వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిలోకి ప్రవేశించిన మొదటి సంస్థానం గోల్కొండ రాజ్యమే. దీనివలన నూతన ఆంగ్ల సైన్యపోషణ నిమిత్తం నిజాం 1800వ సంవత్సరంలో కడప, కర్నూలు, అనంతపురం, బళ్ళారి ప్రాంతాలను ఆంగ్లేయులకు ఇచ్చాడు. అప్పటి నుంచి ఆ ప్రాంతాన్ని దత్త మండలాలుగా వ్యవహరించసాగారు.

**1.9.7 నెల్లూరు - చిత్తూరు ఆక్రమణ 1802** : నెల్లూరు, చిత్తూరు ప్రాంతాలు ముహమ్మద్ ఆలీ పాలించే కర్నాటకలోని భాగాలు. ముహమ్మద్ ఆలీ దుబారాతో కోశాగారం దివాలా తీసింది. ఇతర భూభాగాల లాగే, ఈ ప్రాంతం అతని దుష్పరిపాలనలో మగ్గింది. అతని మరణం తరవాత కూడా దుష్పరిపాలనే కొనసాగింది. గవర్నరు - జనరల్ అగు లార్డ్ వెల్లస్లీ కర్నాటకను బ్రిటిష్ రాజ్యానికి 1802లో కలిపివేయడంతో, నెల్లూరు చిత్తూరులు ప్రత్యక్ష ఆంగ్ల పాలన క్రిందకు వచ్చాయి.

ఈ విధంగా 1802 నాటికి ఉత్తర సర్కారులుగా పిలువబడే కోస్తా ఆంధ్రా, రాయలసీమ, నడుమనగల నెల్లూరు - చిత్తూరు ప్రాంతాలు ప్రత్యక్ష బ్రిటిష్ పాలనలోకి వచ్చాయి. తెలంగాణా ప్రాంతాలు స్వదేశీ సంస్థానమగు గోల్కొండ రాజ్యంగా కొనసాగింది.

ఆంధ్రాలోని ఒక్కొక్క ప్రాంతాన్ని నిజాంని నష్టపరుస్తూనే ఆంగ్ల కంపెనీ సంపాదించింది. నిజాం ప్రతిఘటించినప్పటికి, ఆ ఎదిరింపు తాత్కాలికమే అయింది తప్ప సమర్థవంతంగానూ, అవిశ్రాంతంగానూ సాగలేదు. దీనికి కారణం పద్దెనిమిదవ శతాబ్దపు పరిస్థితులే. దక్కన్‌లో సుబేదారు పదవే సుస్థిరంగా లేక అనేక పోటీ దార్లతో, అడుగడుగునా కుట్రలతో ఉండేది. రక్త సంబంధీకులతోనే అధికారం కోసం, పోరాడవలసి వచ్చేది. మరాఠుల, మైసూరు సుల్తానుల దాడులను ఎదుర్కోవలసి వచ్చింది. అందుచేత బ్రిటిష్ సైన్య సహకారాన్ని ఆశిస్తూ, ఈ ప్రాంతాలను కోల్పోవలసి వచ్చింది.

## 1.10 సమీక్ష

ఈ విధంగా ఆంగ్ల వర్తక కంపెనీ క్రమక్రమంగా తన అధికారాన్ని ఆంధ్రాలోనూ, రాయలసీమలోనూ విస్తరించింది. స్థానిక రాజుల ఆమోదంతోనూ, మొగల్ చక్రవర్తి అనుమతితోనూ అధికారాన్ని పొందగలిగింది. గంజాం నుంచి గుంటూరు వరకుగ ల ఐదు సర్కారులను, పరిపాలనా కేంద్రమగు మద్రాసుకు ఉత్తరాన ఉండుట వలన, వాటిని ఉత్తర సర్కారులని వ్యవహరించసాగారు. రాయలసీమ ప్రాంతాలను, నిజాం సైన్యసహకార పద్ధతికి లోబడి, ఇవ్వడంతో వాటిని దత్త మండలాలుగా వ్యవహరించసాగారు. నిజాం ఆధీనంలో ఉన్న తెలంగాణా ప్రాంతం స్వదేశీ సంస్థాన భాగంగానే, విశాలాంధ్ర ఏర్పడేవరకు కొనసాగింది.

## 1.11 నమూనా ప్రశ్నలు

1. పద్దెనిమిదవ శతాబ్ద ఆంధ్ర పరిస్థితులను, అక్కడి ఐరోపావాసుల స్థావరములను వివరించుము.
2. ఆంధ్రాలో ఫ్రెంచి రాజ్య స్థాపనకు దారితీసిన పరిస్థితులను వర్ణించుము.
3. కర్నాటక యుద్ధాలను, ఫలితాలను తెలియజేయుము.
4. ఫ్రెంచి రాజ్య ఆధిక్యతను, పతనాన్ని తెలియజేయుము.
5. ఆంధ్రాలో ఫ్రెంచి పాలనను, ప్రభావాన్ని వివరించుము.
6. ఆంధ్రాలో ఆంగ్ల రాజ్య స్థాపన ఏ విధంగా జరిగిందీ తెలియజేయుము.
7. ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాలు ఆంగ్లేయుల పాలనలోకి వచ్చిన విధానాన్ని తెలియజేయండి.

## 1.12 ఉపయుక్త గ్రంథాలు

1. Malleson, G.B - The Decisive Battles of India (1746-1840) London, 1914.
2. Martineau, A. - Bussy in Deccan Pondicherry, 1941.
3. Sarojini Regani - Nizam - British Relations (Hyderabad, 1963)
4. M. Venkata Rangaiah - The Freedom Struggle in Andhra Pradesh - Vol. I (1800 - 1905) (Hyderabad, 1965)

- డా. టి. ఎస్. వి. ప్రసాదరావు

పాఠం- 2

# కంపెనీ పాలనపై తిరుగుబాట్లు

## 2.1 లక్ష్యం :

బ్రిటిష్ పాలనను వ్యతిరేకించి వచ్చిన తిరుగుబాటులను, వాని ధోరణులను పరిశీలించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయ క్రమం


2.1 లక్ష్యం

2.2 పరిచయం

2.3 గంజాం జిల్లా తిరుగుబాట్లు

2.3.1 పర్లాకిమిడి

2.3.2 గుంసూరు

2.4 విశాఖపట్నం జిల్లాలో తిరుగుబాట్లు

2.4.1 పద్మనాభ యుద్ధం

2.4.2 ఇతర తిరుగుబాట్లు

2.5 గోదావరి జిల్లాలో తిరుగుబాట్లు

2.5.1 గూటాల

2.5.2 మొగల్తూరు

2.5.3 పోలవరం

2.6 కృష్ణా, గుంటూరు జిల్లాలు

2.7 రాయలసీమ తిరుగుబాట్లు

2.8 1857 తిరుగుబాటు కాలంలో ఆంధ్రా

2.9 సమీక్ష

2.10 నమూనా ప్రశ్నలు

2.11 ఉపయుక్త గ్రంథాలు


## 2.2 పరిచయం :

ఆంగ్ల వర్తక కంపెనీ ఉత్తర సర్కారులను, రాయలసీమ ప్రాంతాన్ని చట్టరీత్యా తన ఆధీనంలోకి తెచ్చుకున్నప్పటికీ, తన అధికారాన్ని సుస్థిరం చేసికోడానికి కొన్ని దశాబ్దాల కాలం పట్టింది. స్థానికంగా ఉన్న రాజుల, జమీందారులు పాలెగారుల వ్యతిరేకత దీనికి కారణం. వీరందరు వంశ పారంపర్య హక్కు కలిగి, అధిక సైన్యాన్ని పోషిస్తూ, సురక్షితమైన కోటలలో నివసిస్తూ, శతాబ్దాలకు పూర్వమున్న వంశాలకు చెందిన వారసులుగా ప్రకటించుకుంటూ ఉండేవారు. వారు తమ స్వతంత్రతను తెలియజేస్తూ, పూర్తి వత్తిడి ఉంటేనే పన్నులు చెల్లిస్తూ ఉండేవారు. ఫ్రెంచి-ఆంగ్ల కంపెనీల విరోధం సమయంలో వారు మరింతగా తమ బలాన్ని పెంచుకున్నారు.

## 2.3. గంజాం జిల్లా తిరుగుబాట్లు

గంజాం జిల్లాలో అనేక మైదాన భూములతోబాటు, కొండ ప్రాంతాలూ ఉన్నాయి. అక్కడ నివసించే అనేక మంది కోయలు, సవరలు మైదాన ప్రాంతాలలో ఉండే రాజులపట్ల భక్తితో ఉండేవారు. వారసత్వ యుద్ధాల వలనగాని, ఆంగ్ల కంపెనీ బకాయిలు చెల్లించలేని స్థితిలో రక్షణకోరి వచ్చిన సమయాలలో గాని, వీరు తోడుగా నిలిచేవారు. ఆంగ్ల కంపెనీ, అందువలన గంజాం జిల్లాలో, రాజులతోనూ, వారి సేవలో ఉండే బిస్సువాయిలతోనూ, కొండ దొరలతోనూ వ్యవహరించవలసి వచ్చింది. మైదాన రాజులు, తమ రక్షణకై, ఈ బిస్సు వాయిలపై ఆధారపడేవారు. వీరు కొండ జాతులకు చెందిన వారే. తన రక్షణ కోసం రాజు వీరిపై ఆధారపడేవారు. వారు చేసే సేవకు బదులుగా భూములను, కోటలను యిచ్చేవారు.

క్రీ.శ. 1768 నుంచి దాదాపు ఏభై, అరవై సంవత్సరాల కాలంలో, ప్రతీ ఏడాది బ్రిటిష్ వారు, ఆదాయ వసూలు నిమిత్తం సైన్యాన్ని పంపవలసి వచ్చింది. పెద్దా, చిన్న జమీందారీలన్నీ బ్రిటిష్ వ్యతిరేకతనే చూపాయి. కటక్ నుంచి మరాఠాసైన్యం గంజాంపై దండెత్తుతుందని భావించి 1780వ సంవత్సరంలో రాజులందరు తిరుగుబాటు చేసారు. కలెక్టరగు థామస్ స్నోడ్ గ్రాస్ దుష్పరిపాలన వలన కూడా 1800-1801 సంవత్సరంలో జమీందారులందరు తిరుగుబాటు చేశారు. వీనికి తోడు కొండ దొరల తిరుగుబాటులు కూడా జరుగుతూనే ఉండేవి.

**2.3.1. పర్లాకిమిడి :** దీనిని పాలించే రాజులు ఒరిస్సా గజపతుల వంశానికి చెందినవారమని భావించేవారు. సర్కారులు ఆంగ్లేయుల అధికారానికి మారినప్పుడు, నారాయణ దేవు రాజుగా ఉండేవాడు. అతడు 1766కి పూర్వం నుంచి కూడా బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలలో ఉండేవాడు. అందుచేత 1768లోనే కంపెనీ కల్నల్ పీచ్‌ని మచిలీపట్నం నుంచి వెళ్ళి, అతనిని ఓడించమని పంపింది. అతడు నారాయణ దేవుని మే 1768లో జల్మర్ యుద్ధంలో ఓడించినాడు. అప్పుడు అతడు కొండ ప్రాంతాలకి పారిపోయాడు. అతని కుమారుడగు గజపతి దేవుని రాజుగా, కంపెనీ, ప్రకటించింది. అయితే కంపెనీ సైన్యం వెనుతిరగగానే, నారాయణ దేవు తిరిగి రాజ్యానికి వచ్చి, కటక్‌లోని మరాఠా వారితో కుట్రలు చేయసాగాడు.

నారాయణ దేవుని కుమారుడగు గజపతి దేవు సోదరుడగు జగన్నాథ దేవులు కొంత కాలం రాజులుగా గుర్తింపబడినప్పటికీ, వారు ఆంగ్ల వ్యతిరేక కార్యక్రమాలలోనే ఉండేవారు. వారిని తొలగించి, కొంత కాలం, నారాయణదేవుని రాజుగా పునః ప్రతిష్ఠించారు. కలెక్టరు ఆజ్ఞలను ధిక్కరించి అతడు ఆదాయాన్ని చెల్లించేవాడు కాదు. అందుచేత కలెక్టరు 1798లో ప్రజలను రాజుతో చేరవద్దనీ, ఆంగ్ల వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఒక దిపకటన చేసాడు. అప్పుడు కలెక్టరు వ్యతిరేకులందరిని సైన్యం ఆధీనంలో ఉంచే ప్రయత్నం చేయగా, పెద్ద తిరుగుబాటు సంభవించింది. గజపతి దేవు 1802లో మరణించినప్పుడు, అతని కుమారుడగు పురుషోత్తమ నారాయణదేవు రాజయ్యాడు. అప్పుడు అతని బాబాయిగు జగన్నాథదేవు శాంతిని భంగం చేయసాగాడు.

ఈ అస్థిరతను చూసిన ప్రభుత్వం 1805లో ఈ ఎస్టేటును కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆధీనంలోకి తీసికొంది. కాని పరిపాలనను పాత మేనేజరు అగు పద్మనాభ దేవుకే వదలిపెట్టింది. ఈ మేనేజరుకి ప్రజామోదం లేకపోవడంతోనూ, అంతఃపుర కుట్రలవలన తిరిగి 1813లో అలజడులు చెలరేగాయి. దీని ఫలితంగా మేనేజరుని తొలగించగా అతడు 1816లో మరిన్ని అలజడులు రేపాడు. ఈ కల్లోలాలను అణచడానికి మార్షల్ లా ని ప్రకటించి, తిరుగుబాట్లని అణచడమయింది.

గంజాం జిల్లాలోని అలజడులకు ప్రధాన కారణం అక్కడ ప్రజలకు గల స్వతంత్ర ప్రవృత్తి. వారిపై అధికారాన్ని మోపి, ఆదాయం చెల్లించే ప్రయత్నాన్ని చేసిన ఆంగ్ల ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రతిఘటించారు. రెండో కారణం అంతఃకలహాల మూలంగా బిస్సువాయిలు, దొరలు వర్గాలుగా చీలి శాంతిని భగ్నపరచసాగారు. దీనివలన శాంతి భద్రతలు కరువవడంతో, 1829లో ప్రభుత్వం జమీందారీని వశపరచుకొని, కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆధీనంలోకి మార్చి, పద్మనాథ దేవుని తిరిగి మేనేజరుగా నియమించింది. దీనితో రాజు, రాణి, వారి సేనలు ఒకవైపు, మేనేజరు రెండోవైపు ఉండి, తిరుగుబాటు తీవ్రమయింది. ఈ సందడిలో జమీందారీని ఇతర తిరుగుబాటు దారులు ఆక్రమించ ప్రయత్నించారు

గంజాం ప్రాంతంలోని సంక్లిష్ట పరిస్థితిని అప్పుడు గుర్తించిన మద్రాసు ప్రభుత్వం 1832లో జార్జి రస్సెల్‌ని స్పెషల్ కమీషనర్‌గా నియమించి, ప్రత్యేక అధికారాలనిచ్చి, శాంతి భద్రతలను కాపాడమని పంపింది. రస్సెల్ సైన్యంతో వచ్చి, ముఖ్య నాయకులను బంధించి, అభేద్యమైన కోటలను వశపరచుకొని, శాంతిని స్థాపించగలిగాడు. ముఖ్య నాయకులను ఉరితీయుంచుట, అనేకమందిని వెల్లూరు జైలుకి పంపుట, రస్సెల్ చేసాడు. గుమ, రాయగుడ్డ, జరింగి మొదలగు కోటలను వశపరచుకొని, తిరుగుబాటు దారులను భయ భ్రాంతులను చేశాడు. ఈ విధంగా 1834 నాటికి శాంతిని స్థాపించగలిగాడు. బిస్సువాయిలకు, దొరలకు, రాజులకు ఆంగ్ల ప్రభుత్వంపట్ల విధేయత కలిగేటట్లు చేశాడు.

**2.3.2. గుంసూరు :** పర్లాకిమిడి రాజులవలెనే, గుంసూరు రాజులు కూడా బ్రిటీష్ వ్యతిరేకతనే చూపారు. వీరికి అనేక దుర్భేద్యమయిన కోటలు ఉండేవి. వీరు గంజాం రాజులందరిలోకి అతి పురాతనమైన, అతిశక్తి వంతమయిన రాజ్యాన్ని పదకొండువేల సైన్య బలాన్ని కలిగి ఉండేవారు.

మొదటి ఆంగ్ల రెసిడెంట్ గంజాంకి 1768లో వచ్చే నాటికి, ఈ రాజ్యం బలమైన రాజ్యంగా ఉంది. కిస్సన్ భంజ్ రాజు 1759 నుంచి 1767 లోపల తన జమీందారి వెలుపల 23 హవేలీ గ్రామాలను స్వంతం చేసికొన్నాడు. ఇంగ్లీషు రెసిడెంట్ వాటిని స్వాధీనం చేయమని అడగగా, అందులో 13 గ్రామాలను మాత్రమే తిరిగి ఇచ్చాడు. కిస్సన్ భంజ్ రాజు 1773లో మరణించినప్పటి నుంచి ఈ రాజ్యంలో ఉద్రిక్తత పెరిగింది. కొత్త రాజగు విక్రమభంజ్ 1773 నుంచి 1778 వరకు ఎటువంటి ఆదాయము చెల్లించలేదు. అప్పుడు ఆంగ్ల సైన్యం అతని రాజ్యంలో ప్రవేశించి, విక్రమ భంజ్‌ని తరిమింది. అతడు మరాఠా ప్రాంతానికి పారిపోయి, వారి సహాయంతో కొన్ని కోటలను గెలుచుకుని, కుట్రలు చేయసాగాడు. తిరిగి ఆంగ్ల సైన్యం అతనిని వెంటాడడంతో మద్రాసుకు 1779లో చేరి, తనను తిరిగి రాజుగా చేయమని మద్రాసు కౌన్సిల్‌ని కోరసాగాడు. ఇతని కోర్కెను లెక్కజేయక, ఇతని తమ్ముడగు లక్ష్మణ భంజ్‌నే రాజుగా గుర్తించారు. అతడు ప్రతి ఏటా లక్ష రూపాయలు ఆంగ్ల ప్రభుత్వానికి చెల్లించడానికి అంగీకరించడంతో ఈ ఒప్పందం కుదిరింది. ఇతడు 1788లో మరణించేంత వరకూ పదవిలో కొనసాగాడు. ఇతని పుత్రుడగు శ్రీకారభంజ్‌కు లక్ష రూపాయల చెల్లింపు భారంగా తోచింది. ఇతడు 1797 నుంచి 1800 వరకు బకాయి పడ్డాడు.

శ్రీకార భంజ్ 1800 వ సంవత్సరంలో ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ఆరంభించాడు. ప్రతాపగిరి రాజగు మణి దేవుని జతపరచుకున్నాడు. అతి కష్టంతో ఈ రాజుని తరిమి, అతని కుమారుడగు ధనంజయ భంజ్‌ని రాజుగా బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికి శ్రీకారభంజ్ తన అల్లరులను ఆపలేదు. చివరకు ప్రభుత్వం దిగివచ్చి, అతని పోషణ నిమిత్తమై కొన్ని ప్రాంతాలను వదిలారు. ధనంజయభంజ్ 1808 నాటికి తండ్రిని ఒప్పించి తీర్థయాత్రకై పంపాడు. అయితే ధనంజయ భంజ్ కూడా అన్ని క్రూర కృత్యాలను చేయడంతో ప్రభుత్వం 1815 వ సంవత్సరంలో జమీందారీని వశం చేసికొని, అతడిని ఖైదీగా చెంగల్పట్టు పంపింది. తిరిగి ప్రభుత్వం శ్రీకార భంజ్‌ని 1819లోనూ అతడు 1830-31లలో బకాయీలు చెల్లించలేనప్పుడు తిరిగి ధనంజయభంజ్‌కి జమీందారీకి అధిపతులను చేసింది. ధనంజయ కూడా బకాయీలు చెల్లింపక పోవడంతో, జమీందారీని వశపరచుకునే నిమిత్తమై, సైన్యాన్ని 1835లో పంపింది. అతడు చాలా వరకు పోరాడిన తరువాత కొండ ప్రాంతాలకి పారిపోయి, వారి రక్షణలో చేరాడు.

మద్రాసు ప్రభుత్వం ధనంజయభంజ్ తిరుగుబాటు ఎదుర్కొనడానికి తిరిగి జార్జి రస్సెల్‌ని ప్రత్యేక అధికారిగా నియమించింది. అతడు తన సైన్యంతో, ప్రత్యేక అధికారాలతో బయలుదేరి మొదటి యత్నంగా పటిష్టమైన కల్లాడ, గొవేరి, దుర్గాప్రసాద్ కోటలను ఆక్రమించాడు. రెండో యత్నంగా తిరుగుబాటు దార్లను తరుముతూ కొండలమ అధిరోహించి, ఎదురించిన ఖాండులకు గుణపాఠం చెప్పాడు. తిరుగుబాటును 1837కి అణచివేసారు. జమీందారీని జప్తు చేయడం, తిరుగుబాటు దార్లను తీవ్రంగా శిక్షించడం జరిగింది.

ఈ విధంగా బ్రిటిష్ వ్యతిరేకత శిస్తు బకాయిలు శాంతి భద్రతల భగ్నత గంజాం రాజుల తిరుగుబాటు అణచివేతకు కారణాలయ్యాయి.

## 2.4. విశాఖపట్నం జిల్లాలో తిరుగుబాట్లు :

ఈ ప్రాంతంలోని తిరుగుబాట్లలో విజయనగర రాజగు విజయరామరాజుతో 1798లో జరిగిన పద్మనాభ యుద్ధానికి ప్రముఖమైనది.

ఈ రాజ్యం బ్రిటిష్ ఆధీనంలోకి వచ్చేసరికి విశాక ప్రాంతంలో అత్యంత శక్తివంతమైన రాజ్యంగా ఉంది. కల్నల్ ఫోర్డ్ స్నేహితుడగు ఆనందరాజు కుమారుడు విజయరామరాజు రాజ్యానికి వచ్చాడు. అతని దివానగు సీతారామరాజు ప్రక్క జమీందారీలపై దండెత్తి, వారిని ఓడించి విజయనగర్ జమీందారిని అన్నింటికన్నా పెద్దదిగా చేసాడు. సామంతులుగా మార్చబడిన వారిలో జయపూర్, శృంగవరపుకోట, సాలూరు, కోటపాలెం, కురుపాం, అనకాపల్లి, సత్యవరం, గోలుగొండ, పాలకొండ, ఆంధ్ర, రేగులవలస, త్యాడ పాచిపెంట, సంగమవలస, చముడు రాజాం, బొబ్బిలి నరవలకు చెందిన ప్రముఖులున్నారు. గంజాంలోని పర్లాకిమికి జమీపై దండెత్తి, దానిని ఆక్రమించాడు. రాజమండ్రి ప్రాంతాన్ని ఓడించి, దానిని విజయనగర్ భాగంగా మలచాడు.

ఆంగ్ల వర్తక కంపెనీ 1766లో రాజుతో ఒప్పందం చేసుకుంటూ, ప్రతి ఏడూ మూడు లక్షల రూపాయలు పేష్కష్ చెల్లించాలని నిర్ణయించింది.

విజయనగర రాజ్యానికి, ఆంగ్ల కంపెనీకి విభేదాలు రావడానికి అనేక కారణాలు దోహదం చేసాయి. అవి : 1) దివాను సీతారామరాజు ఆంతరంగిక పరిపాలనలో నియంతవలె వ్యవహరించడంతో ప్రజామోదం పొందలేదు. రాజుగు విజయరామరాజుని సహితం నియంత్రించ సాగాడు. దానితో అతడిని దివాన్‌గిరీ నుంచి తొలగించారు. అతడు మద్రాసు వెళ్ళి, లంచగొండి రంబోల్ ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి, వారిచే దివాన్‌గా నియమించబడినట్లు అధికార పత్రాన్ని తెచ్చాడు. దీనిని రాజ్యాధికారులు స్థానిక ప్రజలు వ్యతిరేకించారు.

2). మద్రాసు గవర్నరగు సర్ థామస్ రంబోల్డ్ జమీందారుల నందరినీ మద్రాసు స్వయంగా వచ్చి, పేష్కష్ నిర్ణయించకోమని తెలియజేసాడు. దీనికి రాజు తాను మద్రాసు ప్రయాణ నిమిత్తం అన్ని రోజులు జమీని వదలిఉండలేనని, వైజాగ్ పట్నంలోని ఆంగ్ల ఫ్యాక్టరీ వారితో మాట్లాడి నిర్ణయించుకోడానికి సిద్ధమని తెలియజేసాడు. దీనికి రంబోల్డ్ అంగీకరించలేదు. సీతారామరాజుని దివానుగా నియమించి, రాజుపై కసిని తీర్చుకున్నాడు. గవర్నరు ప్రవర్తన విజయనగర రాజుని బాధించింది. ఈ వ్యవహారంపై హౌస్ ఆఫ్ కామన్స్ ఏప్రిల్ 25, 1782న గవర్నరు ప్రవర్తనని విమర్శిస్తూ తీర్మానాన్ని చేసింది. విజయనగర రాజుని తీవ్రమైన అవమానానికి క్రూర వైఖరికి గురిచేసినట్లు లండన్ పార్లమెంటు సభ భావించి, ఖండించడం విశేషం. లంచగొండి తనం నిరూపించబడడంతో రంబోల్డ్‌ని తొలగించారు.

3) సర్కారులపై విపులమైన నివేదికను సమర్పించమని నియమించిన సర్క్యూట్ కమిటీ విజయనగరానికి వచ్చి, వివరాలను పరిశీలించి, సూచించిన మార్పులు కూడా విజయనగర ఆంగ్ల ప్రభుత్వ విభేదాలను పెంచేవిగానే ఉన్నాయి. జయపూరుని ప్రత్యేక సంస్థానంగా ఏర్పాటు చేయాలని కమిటీ కోరింది.

4) రాజు వద్ద ఉన్న సైనిక బలాన్ని తగ్గించమని కమిటీ తెలిపింది. అప్పుడు 12,000 మంది సైనికులు ఉండగా, వారిని 760కి తగ్గించమని చెప్పింది. అదనంగా 2,000 మంది సైనికులను రాజ్యమార్పు రక్షణకై ఉపయోగించవచ్చనీ, 50 గుర్రాలతో కూడిన దళాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపింది. ఇది కూడా రాజవంశ గౌరవ ప్రతిష్టలను దృష్టిలో పెట్టుకొని కమిటీ చేసిన ప్రతిపాదన. కాని సైనిక తగ్గింపు ప్రతిపాదనను రాజు అవమానంగా భావించాడు.

5) సైనిక బలాన్ని కుదించడంతో కలిగే ఐదు లక్షల రూపాయల పొదుపు సొమ్మును ఏటా చెల్లించవలసిన పేష్కష్‌కి జత చేయమని కమిటీ నిర్దేశించింది. ఈ ప్రతిపాదనను రాజు తీవ్రంగా వ్యతిరేకించాడు.

6) విజయరామరాజుని దుబారా చేసే వ్యక్తిగా ఆంగ్ల ప్రభుత్వం భావించింది. రాజ్యం నుంచి బ్రిటిష్ ప్రభుత్వానికి ఇవ్వవలసిన చెల్లింపులు జరుగక, బకాయిలు అధికమయ్యాయి. రాజు వాయిదాలలో బకాయిలను చెల్లిస్తానని చెప్పినప్పటికి, వైజాగ్ పట్నం కౌన్సిల్ రాజు పట్ల ఉదారంగానూ, మర్యాదగానూ వ్యవహరించాలని తెలిపినప్పటికి మద్రాసు ప్రభుత్వం మొండిగా సంస్థానాన్ని స్వాధీనం చేసికోవాలని తీర్మానించింది. విజయనగర కోటను ఆగష్టు 2, 1793న ఆంగ్ల ప్రభుత్వం ఆక్రమించింది. జమీందారీని మూడు భాగాలుగా చేసి ముగ్గురు

కలెక్టర్ల ఆధీనంలో ఉంచింది. ఈ విధంగా రాజుని తొలగించి, జమీందారీని స్వాధీన పరచుకోవడం సామంతులు, ప్రజలు అవమానకరమైన చర్యగా భావించారు.

7) రాజు నుంచి పొందిన జమీందారీని కౌలుకి తీసికోడానికి ఎవరూ ముందుకి రాలేదు. దీనితో ఆగ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం రాజుని స్వస్థలం వదలి మచిలీపట్నం ప్రాంతాలకి పింఛనుపై వెళ్ళమని అడిగింది. రాజు స్థానికంగా ఉండడం వలననే ఎవరూ ప్రభుత్వానికి సహకరించడం లేదని వారు భావించి, విజయరామరాజు వెంటనే విజయనగరాన్ని వీడి, మచిలీపట్నం వెళ్ళాలని కోరారు.

8) బ్రిటీష్ ప్రభుత్వం రాజుకి పింఛను నిర్ణయించడంలో కూడా అన్యాయం చేసింది. రాజుకి నెలకి రూ. 1200ల పింఛనుగానూ, అతని మాజీ దివానగు సీతారామరాజుకి నెలకి రూ. 5,000 లు పింఛనుగానూ నిర్ణయించింది.

**2.4.1. పద్మనాభ యుద్ధం : జూలై 10, 1794 :** ఎన్నో అవమానాలను భరించిన విజయరామరాజు చివరకు ఎదురు తిరగడానికి నిశ్చయించుకొన్నాడు. విజయనగరానికి, భీమునిపట్నానికి మధ్యగల పద్మనాభం వైపు సాగాడు. అక్కడ అతనిని ఇతర క్షత్రియ బంధువులు, పాత సైనికులు కలిసారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆ స్థితిలో చర్చలు ఆరంభించాలని తలంచినా అవి ఫలించలేదు. జూలై 10, 1794న బ్రిటీష్ సైన్యాన్ని పంపారు. అప్పుడు జరిగిన యుద్ధంలో విజయరామరాజు ఓటమిని పొంది, మూడు వందలమంది బంధుగణంతో మరణించారు. మధ్యయుగ ఆయుధాలతో చేసిన యుద్ధం ఆధునిక సాంకేతిక సైన్యం ముందు ఓడింది.

ఫలితాలు : 1) విజయరామరాజు కుమారుడగు నారాయణ బాబు ఆంగ్ల ప్రభుత్వ వ్యతిరేకిగా మారి, బ్రిటీష్ శత్రువులగు కాశీపురం జమీందారుని, మక్కువ రాజుని రక్షణ కోరడంతో, బ్రిటిష్ సైన్యానికి కొండ ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం ఏర్పడింది. దీనిలోని ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం చర్చలను ఆరంభించి, నారాయణ బాబుని వారసునిగా గుర్తించి, పాత బకాయిల నిమిత్తం నాలుగు లక్షల రూపాయిలు చెల్లించాలని నిర్ణయించింది.

2) జమీందారీ తగ్గించబడింది. జయపురం, బొబ్బిలి, పాలకొండ, కురుపాం, సంగమవలస, చెముడు, సాలూరు, ఆంధ్ర, భీమవరం, గోలుకొండ జమీలను వారసులకు అప్పచెప్పడం జరిగింది.

3) పద్మనాభ యుద్ధం ఇతర జమీందారులకు ఒక గుణపాఠమైంది. బ్రిటీష్‌ని ఎదిరించడానికి జమీందారులు జంకసాగారు.

4) ఫ్రెంచిని ఎదిరించిన బొబ్బిలి రంగారావువలెనే, ఆంగ్లేయుల నెదిరించిన విజయరామరాజు చరిత్ర ప్రసిద్ధుడయ్యాడు. చక్రాతి లక్ష్మీనరసకవి పద్దెనిమిదవ శతాబ్దంలో పద్మనాభ యుద్ధమనే తెలుగు ప్రబంధంలో విజయరామరాజు పోరాటాన్ని వివరించాడు.

**2.4.2. ఇతర తిరుగుబాట్లు :** విజయనగర స్థాయిలో కాకపోయినప్పటికీ, వైజాగ్ పట్నం ప్రాంతంలోని ఇతర చిన్న జమీందారులు కూడా బ్రిటిష్‌ని ఎదిరించారు. వారిలో కాశీపురం జమీందారగు వీరభద్రరాజు ప్రముఖుడు. ఇతడు 1830 నుంచి ఆరంభించిన తిరుగుబాటు 1832లో ఉద్రిక్తమవడంతో, 1832 లో జార్జి రస్సెల్‌ని ప్రత్యేక కమీషనర్‌గా పంపారు జమీందారుల చిట్టడవిలోకి పారిపోయాడు. చివరకు మార్షల్ లాని ప్రకటించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాశీపురం రాజు 1833లో లభించగా, ఆయనని జీవిత ఖైదీగా చేసి, తిరుగుబాటుని అణచివేసారు.

అనకాపల్లి, సత్యవరం జమీందారీలను ఆశించిన జగన్నాథరాజు 1832-34లో బ్రిటీష్‌పై తిరుగుబాటు చేశాడు. గోలుకొండ దివానగు నాగన్న దొర అతడికి సహాయం చేసేవాడు. జార్జి రస్సెల్ రాకతో 1834లో జగన్నాథరాజుని ఉరితీయడంలో తిరుగుబాటు అంతమయింది.

పాలకొండ జమీందారీలో కూడా అల్లరులు, తిరుగుబాట్లు జరిగాయి. వారసత్వ తగాదాలు, పేష్కష్ బకాయీలు, అంతఃపుర కలహాలు ప్రధాన కారణాలు. ఇక్కడకు కూడా జార్జి రస్సెల్‌ని పంపి, శాంతి భద్రతను పునరుద్ధరించారు. జమీందారీని ఆక్రమించి, ప్రభుత్వ భూములకే కలపడయింది.

గోలుగొండ ప్రాంతంలో 1845లో ఫితూరీలు జరిగాయి. భూపతి కుటుంబాన్ని రాజులుగా అంగీకరించమని కోరుతూ, గ్రామాలను దోచుకోవడం చేశారు. శిస్తులను చెల్లించేవారు కాదు. అయితే 1848లో [illegible]ానికి అంగీకరించి, అల్లరులను ఆపారు.

## 2.5. గోదావరి జిల్లాలో తిరుగుబాట్లు :

గంజాం జిల్లాలో జరిగినన్ని తిరుగుబాట్లు లేకపోయినా, గోదావరి జిల్లాలో కూడా బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాట్లు జరిగాయి. ఈ జిల్లాలో కూడా మైదాన ప్రాంతాల రాజులు, జమీందారులు ఉండగా, కొండ ప్రాంతాల నాయకులు కూడా బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనేవారు. పోలవరం, గూటాల, కొత్తపల్లి జమీందారులందరూ ఒకే కుటుంబానికి చెందినవారు. ఇతర మైదాన జమీందారీలలో పెద్దాపురం, పిఠాపురం, కోటరామచంద్రాపురం, మొగల్తూరు ప్రధానమైనవి.

తిరుగుబాట్లకు ప్రధాన కారణాలు బ్రిటిష్ ప్రభుత్వం శిస్తు వసూలు చేసే విధానం; బకాయిలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకపోవడం; శిస్తులు బకాయిపడకుండా ఉండడానికి జమీందారుల ఆంతరంగిక తగాదాలలో సహితం కలుగజేసుకోడం మొదలయినవి.

**2.5.1. గూటాల :** నాగవరం కొండ దుర్గాన్ని పాలించే దాసురెడ్డి 1785లో గూటాలపై దానిని పాలించే రాజుని, అతని తల్లిని బందీలుగా చేసి కల్లోలం సృష్టించాడు. ఇదే సమయంలో కొత్తపల్లిని కూడా కొందరు ఆక్రమించారు. బ్రిటిష్ ప్రభుత్వం ఏడు కంపెనీల సైన్యాన్ని పంపి, శాంతి భద్రతలు రక్షించింది. గూటాలనుంచి 1788లో రావలసిన సొమ్ము బకాయిపడడంతో తిరిగి సమస్యలు ఆరంభమయ్యాయి. జమీందారీని పోలవరం దివాను ఆధీనంలోకి, సుపరిపాలనకోసమై, బ్రిటిష్ వారు మార్చారు. దీనితో అలిగిన మైనరు రాజుతల్లి 1790లో ఒక ఫితూరీని చేసింది. అప్పుడు ఆంగ్ల ప్రభుత్వం సైన్యాన్ని పంపి ఆమెని, ఆమె సహాయకులగు కొండ దొరలను ఓడించారు. ఆ జమిందారీని ఆమె సవతికొడుకు, పోలవరం రాజు అగు మంగపతి దేవుకి ఆంగ్ల ప్రభుత్వం ఇచ్చింది.

**2.5.2. మొగల్తూరు :** ఈ జమీందారీలో జగ్గరాజు అను వ్యక్తి భూపయ్య అను కౌలుదారుతో కలసి కుట్రచేసి, 1791లో తిరుగుబాటు చేసాడు. కొంత సైన్యాన్ని పంపడం ద్వారా పరిస్థితిని అదుపులోకి తీసికొని వచ్చారు. భూపయ్య మరొక కౌలుదారగు వెంకటరమణరాజుతో కలసి, శిస్తులను చెల్లింపక ఆపి, ఆందోళన సాగించగా ప్రభుత్వం వారిద్దరిని ఖైదు చేసింది. అయితే అక్కడనుంచి తప్పించుకున్న భూపయ్య భద్రాచలం పారిపోయి, అక్కడ రెండువేలమంది సైనికులను చేర్చి, మొగల్తూరుకి దండెత్తి వచ్చాడు. అతడిని ఓడించి, తిరిగి భద్రాచలంకి తరిమివేశారు.

**2.5.3. పోలవరం :** దీనికి రాజైన మంగపతి దేవునుంచి, అతని సోదరుడయిన విజయగోపాల దేవు నుంచి 1799-1800ల మధ్య సమస్యలు వచ్చాయి. విజయగోపాల దేవు రంప ప్రాంతానికి వెళ్ళి, అక్కడ కోయ మద్దతు దార్లతో పోలవరం గ్రామాలను దోచసాగాడు. వారికి మంగపతి దేవు కూడా సహాయపడసాగాడు. దీనితో బ్రిటీష్ ప్రభుత్వం కొంత సేనను పంపి, పోలవరం కోటను ఆక్రమించి, అల్లరులను అణచివేసింది. మంగపతి దేవు నిజాం రాజ్యానికి పారిపోయాడు. ఎస్టేటుని మంగపతి బంధువులకు అప్పగించడం జరిగింది.

## 2.6. కృష్ణా, గుంటూరు జిల్లాలు :

ఈ జిల్లాలో తిరుగుబాట్లు, ఇతర జిల్లాలతో పోల్చినప్పుడు తక్కువే. చార్ మహల్ జమీందారీ ప్రభుత్వానికి ఇవ్వవలసిన బకాయిలు ఎక్కువవడంతో జమీందారగు శోభనాద్రిరావుని తొలగించి, కలెక్టరు జమీందారీ పాలనా బాధ్యతను స్వీకరించాడు.

నూజివీడు జమీందారీ ఎక్కువ కాలం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించింది. వీరి తిరుగుబాటు రెండు కారణాల వలన సంభవించింది. అదిజీక పేష్కష్ చెల్లింపుల వలన నరసింహ అప్పారావు, జమీందారీలో వాటాను కోరి రామచంద్ర అప్పారావు బ్రిటిష్‌పై తిరుగుబాటు చేసారు. నరసింహ అప్పారావు నుంచి బకాయిలు రాబట్టడానికి, కోట స్వాధీనానికి ఆంగ్ల ప్రభుత్వం దళాన్ని పంపింది. ఆంగ్ల ప్రభుత్వ అధికారులగు వైట్‌హిల్, హాడ్జెస్‌ల నుంచి అప్పు తీసికొని, అప్పారావు బకాయిలు చెల్లించాడు. మూడేండ్ల తరువాత అతడు మద్రాసుకి వెళ్ళి, పేష్కష్ తగ్గించమని కోరాడు. అయితే మద్రాసు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో, నరసింహ అప్పారావు ఆంగ్ల ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాడు. నిజాం రాజ్యంలోకి పారిపోయి, తన తిరుగుబాటుని కొనసాగించాడు. కోటను ఆంగ్లేయులు నవంబరు 1784లో ఆక్రమించి, నరసింహ అప్పారావు తొలగింపుని ప్రకటించారు. అతని కుమారుడగు నరసింహ అప్పారావుని కొత్త జమీందారుగా కంపెనీ గుర్తించింది.

భద్రాచలం నుంచి పాత జమీందారు సమస్యలను సృష్టిస్తూనే ఉన్నాడు. కొంత కాలానికి అతడిని కుమారునితో కలసి ఉండడానికి ఆంగ్ల ప్రభుత్వం అంగీకరించింది. అయితే అతడు అతని వర్గమూ జమీందారీపై ఆధిపత్యం చేయడంతో 1789లో మద్రాసుకి వెళ్ళమని ఆజ్ఞాపించారు. అతడు అక్కడ మరణించాడు. అయినప్పటికీ అతని భార్య అగు చిన్న వెంకమ్మ తన కుమారుడయిన రామచంద్ర అప్పారావు వాటాకై సమస్యలు సృష్టించసాగింది. నరసింహ అప్పారావు, ఈ సమస్యలను తట్టుకోలేక, మచిలీపట్నంలో తలదాచుకున్నాడు. కంపెనీ 1802లో రామచంద్ర అప్పారావు వాటాకి అంగీకరించడంతో నూజివీడులో శాంతి భద్రతలు నెలకొన్నాయి.

వాసిరెడ్డి జమీందారీకి చెందిన వెంకటాద్రి నాయుడు శక్తివంతుడయినప్పటికీ కంపెనీ వారితో వైరాన్ని పెంచుకోలేదు. ప్రభుత్వానికి జమ చేయవలసిన సొత్తుని ముందుగానే చెల్లిస్తూ, వారి జోక్యాన్ని నివారించుకున్నాడు. అయితే అతని మరణానంతరం వారసత్వ హక్కుకై పోటీపడిన దత్త పుత్రులు శిస్తు బాకీ పడ్డారు. అప్పుడు ప్రభుత్వము సంస్థానాన్ని జప్తు చేయనారంభించింది. జమీందారీని 1846లో ప్రభుత్వం వేలం వేసి, వారే కొన్నారు. చిలకలూరిపేటకు, సత్తెనపల్లికి అధిపతులగు మానూరి కుటుంబం, నరసరావుపేట పాలించిన మల్రాజు కుటుంబం రాచూరు - రేపల్లె పాలించిన మాణిక్యరావు కుటుంబము, ఒక్కొక్క సమయాన, ఒడుదుడుకులకు లోనైనప్పటికి, తిరుగుబాటు చూపలేదు. ఒక్కొక్కప్పుడు ఈ ప్రాంతాలు కోర్ట్ ఆఫ్ వార్డ్స్‌లోకి వెళ్ళడం, కొన్ని సమయాల్లో జప్తు కావడం జరిగినా, మొత్తం మీద ప్రశాంత వాతావరణమే కొనసాగింది.

## 2.7. రాయలసీమ తిరుగుబాట్లు :

ఆంగ్ల తూర్పు ఇండియా కంపెనీకి 1800లలో నిజాం ఇచ్చిన రాయలసీమ ప్రాంతంలో ఎనభైమంది పాలెగారులు ఉండేవారు. ఉత్తర సర్కారులలోని రాజులు, జమీందారులవలెనే శక్తి వంతులు; స్థానిక సైన్యానికి అధిపతులు, బలవత్తరమైన కోటలు కట్టుకొని, అందులో నివసించేవారు. శిస్తులు వసూలు చేసే అధికారం వారికి ఉండేది. నిజాంకి అవసరమైనప్పుడు సైన్యాన్ని సరఫరా చేయడం, మిగిలిన సమయాలలో నిర్ణీత కాలంలో వసూలు చేసిన శిస్తులను జమ చేయడం వారి బాధ్యతలు. పద్దెనిమిదవ శతాబ్దములో తరచూ వారి అధిపతులు మారుతూ రావడంతో, పై అధికారులను లెక్క చేసేవారు కాదు. నిజాం, మరాఠా, మైసూరు రాజుల అధికారంవలెనే బ్రిటీష్ అధికారం కూడా తాత్కాలికమే అని వారు భ్రమపడ్డారు.

దత్తమండల జిల్లాలకు ప్రధాన కలెక్టరుగా వచ్చిన మేజర్ థామస్ మన్రో పేష్కష్ చెల్లింపమని ఇచ్చిన ఆజ్ఞలను వీరు ధిక్కరించారు. ఏ పాలెగారు అయినా కోట రక్షణలు పెంచినా, సైన్యాన్ని పోషించినా, కొత్త పన్నులు విధించినా అతనిని తిరుగుబాటు దారుగా పరిగణిస్తామని సర్‌థామస్ మన్రో ఒక ప్రకటన చేశాడు. ఎవరు ధిక్కరించినా, వారిపై సైన్యాన్ని పంపి, విధేయులుగా మార్చాడు. పాలెగారులను సంపూర్ణంగా అణచడానికి మన్రోకి పద్దెనిమిది నెలల కాలం పట్టింది.

ఆదోని డివిజనులోని తరణికల్లు పటేలు 1801లో సబ్ కలెక్టరు ఆఫీస్‌ని ముట్టడించి, పట్టపగలే కొందరిని చంపాడు. తిరిగి తన కోటకు చేరుకుని, ఎదిరించ వచ్చిన బ్రిటీష్ సైన్యాన్ని ఓడించాడు. మరింత పెద్ద సైన్యాన్ని పంపడం ద్వారా, అతడిని ఓడించి ఉరితీసారు.

సుల్తాన్‌ఖాన్ 1803లో కొన్ని వందల రౌతు దళంతో అకస్మాత్తుగా కడపపై దాడి చేసి, దాన్ని ఆక్రమించాలని ప్రయత్నం చేసాడు. ఈ వార్త ముందుగానే తెలిసిన మన్రో తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసికొని, కడపని రక్షించుకోవడమేగాక, సుల్తాన్ ఖాన్‌ని బంధించాడు.

ఇదే విధంగా 1804లో ఒక కుట్ర జరిగింది. బళ్ళారి కోటను, ఆదోని ప్రాంతాన్ని పూర్తిగా ఆక్రమించి పూర్వపు కుటుంబానికి చెందిన వ్యక్తిని జాగీర్దారుని చేసే ప్రయత్నం మన్రో చాక చక్యంతో విఫలమయింది.

అదే సంవత్సరంలో గుత్తికోటను స్వాధీనం చేసికొని, బ్రిటిష్‌ని వ్యతిరేకిస్తున్న మరాఠా వారికి యిచ్చే ప్రయత్నం జరిగింది. ఈ యత్నం కూడా భగ్నమై, కుట్ర దారులందరూ ఖైదు చేయబడ్డారు.

చిత్తూరు జిల్లాలోని పాలిగార్లు ఆర్కాటు నవాబు పాలనలో స్వతంత్రత అనుభవించిన వాళ్ళు. పేష్కష్ చెల్లించమని బ్రిటీష్ ప్రభుత్వం కోరినప్పుడు, సాంప్రదాయకంగా వారు ప్రజలనుంచి వసూలు చేసే కావలి పన్నును బ్రిటిష్ ప్రభుత్వం వదులుకోమన్నప్పుడు, వారు ఆయుధాలను పూని ఎదిరించసాగారు. వీరిలో నరగతి పాలిగారు శిస్తులను ఆపి, తిరుగుబాటు ఆరంభించాడు. కలెక్టరు అతనిని బంధించినప్పటికి, బకాయిలను తీరుస్తానని నమ్మించి, విడుదల పొందాడు. అయినప్పటికి అతడు శిస్తులు చెల్లించే ప్రయత్నమేమీ చేయకపోయేసరికి, సైనిక దళాన్ని బ్రిటిష్ ప్రభుత్వం పంపింది. చివరకు నాగపట్ల వద్ద జరిగిన భీకర పోరాటంలో అనేక మంది పాలెగారులు ఓటమి చవిచూసారు. దీనిలో కల్లూరు, పులిచెర్ల, పుల్లూరు పాలెగారులు ప్రముఖులు. ఈ సమయానికే అనేకమంది పాలెగారులు స్వస్థానాల నుంచి తరమబడి, అడవులలో తిరుగుతూ, గ్రామాలను దోచుకుంటూ, తిరుపతి వెళ్ళే యాత్రీకులను ఇబ్బందులకు గురిచేసేవారు. తిరుపతి దేవాలయాలపై వారు దండెత్తబోతున్నారని తెలియగానే బ్రిటిష్ ప్రభుత్వం సైనిక దళాన్ని పంపి, ఆందోళనలను అణచివేసింది.

పాలెగారులతో వ్యవహరించడానికి ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన స్పెషల్ కమీషన్‌ని నియమించింది. శాంతియుత మార్గాన్ని అనుసరించాలని భావించిన కమీషన్ పాలెగారులందరిని ఒప్పందానికి రావలసిందిగా కోరింది. సైనిక దళాన్ని తొలగించాలని, కోట రక్షణ సదుపాయాలను నాశనం చేయాలని, బాకీలు లేకుండా శిస్తులను నిర్ణీత ప్రకారం చెల్లిస్తామని, శాంతి భద్రతలకు ఇబ్బంది కలుగజేయమని మాట ఇవ్వాలని కమిషన్ నిబంధనలను విధించింది. దీనికి వారు అంగీకరించక పోవడంతో, యుద్ధ మార్గాన్నే ఎంచుకుంది. అది కొద్ది మంది పాలెగారులు మాత్రమే బ్రిటిష్‌కి వశమయ్యారు. ఇతరులు తీవ్రమైన యుద్ధాలను చేసి, ఓటమి పొందాక మాత్రమే బ్రిటిష్ ప్రభుత్వానికి లోబడ్డారు. పాలెగారుల రెండు సంవత్సరాల యుద్ధం పరిసమాప్తమై, బ్రిటిష్ ఆధిపత్యాన్ని అంగీకరించారు. వారి ఎస్టేటులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది. రాయలసీమ ప్రాంతంలో రైత్వారీ భూమిశిస్తు విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

ఈ విధంగా ఆంధ్రాలో రాజులు, జమీందారులు, దత్తమండలాలలో పాలెగారులు బ్రిటిష్ ఆధిపత్యాన్ని ఎదిరించినప్పటికి, చివరకు అంగీకరించక తప్పలేదు.

## 2.8 1857 తిరుగుబాటు కాలంలో ఆంధ్రా :

భారత దేశ చరిత్రలో 1857వ సంవత్సరంలో ప్రముఖ చారిత్రక సంఘటన  జరిగింది. ఉత్తర భారతీయులు ఆంగ్ల తూర్పు ఇండియా వర్తక సంఘం పట్ల తీవ్ర అసంతృప్తిని, సిపాయిల తిరుగుబాటు ద్వారా వ్యక్తపరచిన సంవత్సరమది. బ్రిటిష్ అధికారాన్ని ఎదిరిస్తూ, మొగలాయీ ఆధిపత్యాన్ని తిరిగి నెలకొలిపే ప్రయత్నమది. అయితే ఆంధ్రాలో బ్రిటిష్ వ్యతిరేకత కనపడకపోగా, పాశ్చాత్యవిద్యనేర్చిన వర్గం బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయత ప్రకటించడం కనిపిస్తుంది. అక్కడక్కడ రెండు మూడు సంఘటనలలో బ్రిటీష్ వ్యతిరేకత వ్యక్త మయినప్పటికీ, ఉత్తర భారత దేశంలో జరిగిన సంఘటనలతో సంబంధమున్నవి కావు.

పర్లాకిమిడి జమీందారీలోని సవర ప్రాంత సమీపంలోగల గిభ నాయకుడయిన దండసేనుడు తన సవర అనుయాయులతో గ్రామాలను దోచుకోవడం వంటి కృత్యాలు చేశాడు. సవర లోతట్టు ప్రాంతాల వరకు బ్రిటిష్ సైన్యాన్ని పంపి పరిస్థితిని అదుపు చేయడం జరిగింది. దండసేనుడిని పట్టి, ఉరితీసి, తిరుగుబాటుని అణచివేసారు.

గోదావరి ఏజెన్సీ ప్రాంతమైన ఎర్నాగూడెంలో మరొక తిరుగుబాటు జరిగింది. కొరటూరు గ్రామపెద్ద అయిన కారుకొండ సుబ్బారెడ్డికి, బుట్టాయగూడెం గ్రామ మున్సబు అయిన సుంకరస్వామికి నడుమగల వ్యక్తిగత విరోధం ఆ ప్రాంతంలోని శాంత భద్రతల భంగానికి దారి తీసింది. రాజమండ్రిలోని అసిస్టెంట్ మాజిస్ట్రేట్ ఆ ప్రాంతానికి వెళ్ళగా సుబ్బారెడ్డి, తన కుమారులు, విల్లంబులు ధరించిన ఇతర కోదాడ తెగల అనుయాయులతో చుట్టు ముట్టాడు. దీనితో ఆ ఉద్యోగి ఓడి, వెను తిరిగిరాగా, కలెక్టరు రెండు దళాలను తిరిగి ఆ ప్రాంతానికి పంపాడు. వారు ఎర్నాగూడెం ని ఆక్రమించి కొండ ప్రాంతాల దాగున్న తిరుగుబాటు దారులను ఓడించి, సుబ్బారెడ్డి తదితర నాయకులను బంధించి, శిక్షించడంతో, తిరుగుబాటు అణచబడింది. మాజిస్ట్రేట్ సుబ్బారెడ్డిని ప్రశ్నించినప్పుడు, అతడు బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలకు

సేనతో తరలివస్తున్న నానా సాహెబ్ సహాయం ఉంటుందని ఆశించానని తెలిపాడు. ఉత్తర భారతంలో జరిగిన సంగ్రామానితో సంబంధముందేమో అని భావించే సంఘటన ఇదొక్కటే.

ముస్లింలు అధిక సంఖ్యలోగల ప్రదేశాలలో బ్రిటిష్ వ్యతిరేక కార్యక్రమాలు జరిగాయి. మచిలీపట్నంలో ఒక పెద్ద ఆకుపచ్చ జండాని కనుగొన్నారు. దానితోపాటు ఉన్న అట్టపై మహ్మద్ అనుయాయులందరు ముస్లిమేతరులను సంహరించాలని పిలుపు వుంది. ఢిల్లీ పాదుషా విజయాన్ని కోరుతూ మసీదుల్లో ప్రార్థనలు జరిగాయి. జిల్లా కలెక్టరు స్పందిస్తూ ఈ పిలుపు నిచ్చిన వ్యక్తిని గుర్తించిన వారికి రూ. 500 లు బహుమతి ప్రకటించాడు.

వైజాగ్ పట్నంలో కూడా ఒక ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది. రాబోయే మొహరంలో వైజాగపట్నం పేరుని మహమ్మద్ పటంగా మార్చాలని, మొత్తం పట్టణాన్నే నేలమట్టం చేస్తామని దీనికి అందరూ సహకరించాలని కోరారు. అయితే ఈ ప్రయత్నం ఫలించలేదు.

నిజాం రాజ్యంలోని రోహిల్లాలు, అరబ్బులు ఆంధ్రా సరిహద్దులలోకి ప్రవేశించి, నష్టం కలుగజేయడం జరుగుతూ ఉండేది. 1857వ సంవత్సరంలో అటువంటివి అనేకం జరిగాయి. కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటలోని ట్రెజరీ ఆఫీస్‌కి నష్టం కలిగించడం జరిగింది. కచ్చేరీలోని హవల్దారుతో సహా డ్యూటీలో ఉన్న మరో ముగ్గురిని చంపారు; ఖజానాను దోచుకున్నారు. కడప జిల్లాలోని రుద్రార్ గ్రామాన్ని 400 మంది రోహిల్లాలు దోచుకొని, ముగ్గురిని చంపారు. కర్నూలుపై కూడా దండెత్తి, దోచుకోసాగారు. కర్నూలుపై కూడా దండెత్తి, దోచుకోసాగారు. హైదరాబాదులోని రెసిడెన్సీపై కూడా వీరు దండెత్తారు.

మద్రాసు రెజిమెంటు కూడా బ్రిటిష్ విధేయతనే ప్రదర్శించింది. ఉదాహరణకు బళ్ళారి రెజిమెంట్ తన విధేయతను ప్రకటిస్తూ అవిధేయత చూపిన బెంగాల్ సిపాయీలపై యుద్ధానికి వెళ్ళడానికి సంసిద్ధత వ్యక్త పరచింది.

ఆంధ్రా పౌరులు బ్రిటిష్ రాజ్యానికే విధేయతను ప్రకటించారు. ముఖ్య నగరాలయిన బెజవాడ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, రాజమండ్రి, వైజాగ్‌పట్నం నగరాలలో ప్రజలు సభలలో పాల్గొని, బ్రిటిష్ పరిపాలనవలన పొందిన ప్రయోజనాలను జ్ఞాపకం చేసుకొని, బ్రిటిష్ పరిపాలనకు మద్దతు తెలిపారు. చిత్తూరు ప్రజలు మద్రాసు ప్రెసిడెన్సీ గవర్నరు-ఇన్-కౌన్సిల్‌కి పంపిన విధేయతా పత్రంలో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు కలిగిన రక్షణను, విద్యాసంస్థల ఏర్పాటును, పక్షపాత రహిత న్యాయ వ్యవస్థను పేర్కొంటూ, ఇవి తమను బ్రిటిష్ ప్రభుత్వానికి కృతజ్ఞతతో కూడిన విధేయతా బంధానికి కట్టివేసాయని తెలిపారు. ధవళేశ్వరం నుంచి పౌరులు సమర్పించిన పత్రంలో కూడా శాంతి, భద్రతలను, న్యాయ వ్యవస్థను, రోడ్ల నిర్మాణాన్ని, ఆనకట్ట నిర్మాణాలను, ఉద్యోగులకిచ్చే పెన్షన్‌ను, పోస్టు ఆఫీస్ వ్యవస్థని పేర్కొంటూ తాము ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛలోనూ, సంతోషంలోను ఉన్నట్లు తెలియజేసారు. బెజవాడ నుండి వచ్చిన పత్రంలో గోదావరి, కృష్ణా ఆనకట్టల నిర్మాణం వలన కలిగిన సంక్షేమాన్ని జ్ఞాపకం చేసుకొన్నారు. అణచివేత నిరంకుశత్వం అనే పదాలని బ్రిటిష్ పాలనలో మరచిపోయామని తెలిపారు. రక్షణ, శాంతి భద్రతలు, సౌకర్యాలు బ్రిటిష్ పాలనలో మాత్రమే లభించాయని తెలిపారు.

కంపెనీవలన అనేక వర్గాల ప్రజలను పేదరికంలోకి నెట్టినప్పటికి, ప్రజలనుంచి ఇంత విధేయత లభించడానికి కొన్ని కారణాలు ఉన్నాయి :

1) ప్రభుత్వ మార్పిడి ద్వారా మంచి మార్పు తెచ్చుకోవచ్చనే రాజకీయ చైతన్యం అప్పటికి లేదు.

2) ఉత్తర భారత దేశంలో సిపాయిలే తిరుగుబాటు ఆరంభించినప్పటికీ, మద్రాసు ప్రెసిడెన్సీలోని సిపాయిలు పూర్తి విధేయులుగా ఉండి, ఎక్కడ, ఎప్పుడు వారి సేవలు అవసరమనుకుంటే అక్కడికి వెళ్ళడానికి తాము సిద్ధమని తెలియజేసారు.

3) స్వదేశీ రాజులగు నిజాంలు, మరాఠాలు, మైసూరు సుల్తానులు, ఆర్కాటు రాజుల పాలనా జ్ఞాపకాలు ఆంధ్ర ప్రజలకు ఓదార్పు నిచ్చేవి కాకపోవుటతో, వారు బ్రిటీష్ పాలననే బలపరచారు.

4) నాయకత్వ లేమి ప్రధాన లోపం. జమీందారులు, ప్రభువులు వారికివ్వబడిన హోదాలతో సంతృప్తిని చెందగా, పాశ్చాత్య విద్య నభ్యసించిన మధ్యతరగతి వర్గం ఇంకా ఏర్పడలేదు. మద్రాసు విశ్వ విద్యాలయ స్థాపన 1857లో జరగడంతో ఉన్నత విద్యనభ్యసించిన వర్గం ఇంకా రాలేదు.

(3)

## 2.9. సమీక్ష :

బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు ధోరణులను పరిశీలిస్తే ప్రధాన కారణం జమీందార్లకి, కంపెనీకి గల ఆర్థిక లావాదేవీలు. ఎక్కువ ఆదాయాన్ని నిర్ణీత కాలంలో వసూలు చేయడమే కంపెనీ లక్ష్యం కనుక వారసత్వపు తగాదాలలో జోక్యం చేసికోసాగింది. వారసునిగా ఒకరిని గుర్తించడం, బకాయీలతో కూడిన పేష్కష్‌ని చెల్లించవలసిన బాధ్యతను అతనిపై పెట్టడం, శాంతి భద్రతకై సైనిక బలాన్ని వినియోగించడం, అనేక మారులు జమీని జప్తు చేయడం చేయసాగింది. ఈ చర్యలను జమీందారులు వ్యతిరేకించడంతో సంబంధాలు తీవ్ర రూపం దాల్చేవి. ఉత్తర భారతంలో 1857లో తీవ్ర తిరుగుబాటు చెలరేగగా, ఆంధ్రాలో కంపెనీ పాలనకే మద్దతు లభించింది.

## 2.10. నమూనా ప్రశ్నలు :

1. గంజాం జిల్లాలోని బ్రిటీష్ వ్యతిరేక తిరుగుబాట్లను వర్ణించండి.
2. పద్మనాభ యుద్ధానికి దారితీసిన పరిస్థితులను, ఫలితాలను వివరించండి.
3. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటులపై ఒక వ్యాసం రాయండి.
4. రాయలసీమలోని పాలెగారుల తిరుగుబాటుపై వ్యాసం రాయండి.
5. 1857 తిరుగుబాటుకి ఆంధ్రాలో వచ్చిన ప్రతిధ్వనులపై విమర్శనాత్మక వ్యాసం రాయండి.

## 2.11. ఉపయుక్త గ్రంథాలు :


1. M. Venkatarangaiya : The Freedom Struggle in Andhra Pradesh, (Andhra) Vol. I (1800-1905)
2. Leman : Ganjam District Manual
3. Gorden Mackenzir : A Manual of the Krishna District
4. Morris Henry : A Descriptive and Historical Account of the Godavary District
5. Charmichael, D.F. : A Manual of the District of Vizagapatnam
6. చక్రాతి లక్ష్మీనరసకవి : పద్మనాభ యుద్ధము


డా॥ టి.ఎస్.వి. ప్రసాదరావు

పాఠము - 3

# భూమిశిస్తు విధానాలు

**3.0 లక్ష్యం :**

బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన భూమిశిస్తు విధానాలను వివరించి, వాటి ఫలితాలను విశ్లేషించడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయక్రమం :**


3.1 పరిచయం

3.2 పద్దెనిమిదవ శతాబ్ద గ్రామస్వరూపం

3.3 తొలి రెవెన్యూ విధానాలు

3.4 శాశ్విత శిస్తువిధానము

3.4.1 లక్షణాలు

3.4.2 లాభాలు

3.4.3 లోపాలు

3.5 రైత్వారీ విధానము

3.5.1 ముఖ్య అంశాలు

3.5.2 ప్రయోజనాలు

3.5.3 నష్టాలు

3.5.4 రైత్వారీ పద్ధతి విస్తరణ

3.6 మహల్వారీ పద్ధతి

3.7 భూమిశిస్తు విధానాల ఫలితములు

3.8 సమీక్ష

3.9 నమూనా ప్రశ్నలు

3.10 ఉపయుక్త గ్రంథాలు

### 3.1 పరిచయం:

భూస్వామ్య పద్ధతులు సక్రమముగా ఉంటేనే అధికోత్పత్తి సాధ్యమవుతుంది. ప్రభుత్వానికి, రైతులకు, ప్రజలకు మేలు చేకూర్చగల పద్ధతి వలన మేలు జరుగుతుంది. బ్రిటీష్ రాకకు పూర్వం గల రాజ్యాలు పన్ను వసూలు చేసినప్పటికి, ఆ ఆదాయం దేశ ఎల్లలు దాటి వెళ్ళలేదు. రాజ్యంలోనే ఒక వర్గం నుంచి మరొక వర్గానికి లాభం చేకూర్చేది. కాని వలసపాలనలో దేశాదాయం బ్రిటన్‌కి తరలింది. లక్ష్యం కూడా దేశాభివృద్ధికాక, మాతృదేశమైన బ్రిటన్ శ్రేయానికే వలసలు ఉన్నాయనే భావం పాలకులలో బలంగా ఉండేది. అందుచేత వర్తక కంపెనీ పాలన నుంచి ఎంత ధనాన్ని బ్రిటన్‌కి తరలించామనేది వారి పాలనకు కొలబద్ద అయింది తప్ప, దేశీయ ప్రయోజనాలను లెక్కజేయలేదు. భూస్వామ్య పద్ధతులు భూమి యజమానులకు మరియు సేద్యము చేసేవారికి మధ్యశిస్తు చెల్లించే విషయంలో ఉండే సంబంధాన్ని తెలియజేస్తాయి. వారి హక్కులను, బాధ్యతలను వ్యక్తపరుస్తాయి. ప్రభుత్వమే సర్వాధికారాలున్న భూస్వామి అని, వ్యవసాయ భూములన్నీ ప్రభుత్వానికి చెందినవే అనేది సర్వత్ర ఆమోదించ బడిన సిద్ధాంతం. అయితే సేద్యం చేసేటందుకుగాను వ్యక్తులు ఈ భూములను ప్రభుత్వం నుండి పొందుతారు. వీరు చెల్లించవలసిన శిస్తును ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అలాగే హక్కులను బాధ్యతలను వివరిస్తుంది. బ్రిటీష్ వారు భారతదేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించి వివిధ రెవెన్యూ పద్ధతులను ప్రయోగాత్మకంగానూ, వ్యూహాత్మకంగానూ అమలుపరిచారు. పూర్వం ఉన్న రెవెన్యూ యంత్రాంగాన్ని గ్రామీణ సామాజిక వ్యవస్థను వలస పాలనా ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకున్నారు. సాంప్రదాయకంగా కొనసాగుతూ వస్తున్న రెవెన్యూ యంత్రాంగాన్ని, గ్రామీణ సామాజిక సంబంధాల సారాంశాన్ని కొనసాగించారు.

### 3.2 పద్దెనిమిదవ శతాబ్ద గ్రామ స్వరూపం:

బ్రిటీష్‌వారికి పూర్వం గ్రామం స్వయం సంపూర్ణ ఆర్థిక స్వభావం కలిగి ఉండేది. కులం ఆధారంగా ఏర్పడిన సాంప్రదాయ వృత్తులు, స్వయం పోషకమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అనేక శతాబ్దాలపాటు కొనసాగాయి. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, సాలె, చెప్పులు కుట్టేవారు, నూనె తీసేవారు, చాకలి, అద్దకం పనివారు - ఇలా వివిధ వృత్తుల వారు గ్రామాన్నే అంటి పెట్టుకొని ఉండి, గ్రామానికి తమ సేవలు అందించేవారు. వీరు తమ సేవలకు గ్రామం నుంచి వస్తురూపంలో ప్రతిఫలం పొందేవారు. రైతులు భూములపై వంశపారంపర్య హక్కులు కలిగి సాగుచేసేవారు. గ్రామ అవసరాలకే ఆహారధాన్యాలు పండించేవారు. వృత్తి కళాకారులు తయారుచేసిన వస్తువులు గ్రామంలోనే ఎక్కువగా వినిమయమయ్యేవి. నిత్యావసర ఆర్థిక లావాదేవీలన్నీ వస్తుమార్పిడి ద్వారా జరిగేది. వారానికి ఒకరోజు గ్రామాలలో సంతలు జరిగేవి. వస్తుమార్పిడి పద్ధతి అమలులో ఉండుట వలన వస్తువుల విస్తృతి కూడా చాలా పరిమితంగా ఉండేది. బాహ్యప్రపంచంతో సంబంధాలు లేకపోవడం చేత, గ్రామాలు విడివడి ఉండేవి. సన్నిహిత సంబంధాలు తక్కువ. వర్తక వాణిజ్యాలు పరిమితమై ఉండేవి. ఒకరిపై మరొకరు ఆధారపడి, పరస్పర అవసరాలు తీర్చుకుంటూ, స్థానిక అవసరాలకే అధికంగా వస్తువులను, ఆహారాన్ని ఉత్పత్తి చేస్తూ, జీవనం కొనసాగించే విధానమే స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక నిర్మాణం.

బ్రిటీష్ పాలనకు పూర్వం గ్రామంలోని భూములన్నింటిపైనా గ్రామస్థులందరికీ సాముదాయకముగా యాజమాన్య హక్కు ఉండేది. సాధారణంగా ప్రతిగ్రామంలో బీడు పొలాలు ఎక్కువగా ఉండేవి. జనసంఖ్య కూడా స్వల్పంగా ఉండేది. ఆస్తి హక్కులతో ప్రమేయం లేకుండా ప్రతీరైతుకూ ఎంత పొలము అవసరమో అంత పొలం లభించేది. పంటలను వ్యాపార సరళిలో అమ్మి, లాభాలు గడించే అవకాశం ఉండేది కాదు. అందువల్ల ఎక్కువ భూములపై ఆస్తి హక్కు సంపాదించడాన్ని ఎవ్వరూ కోరుకునేవారు కాదు. గ్రామ పెద్దలు భూములను వ్యవసాయార్థమై రైతుల మధ్య పంపకం చేయడం, వ్యవసాయానికి కావలసిన జలాశయాలను నిర్మించి సద్వినియోగపరచడం సాంప్రదాయకంగా ఉండేది. చేతివృత్తుల వారు తాము తయారుచేసిన వస్తు సామాగ్రిని రైతులకు అందజేసి, వాటికి బదులుగా రైతుల నుండి ధాన్యాదులను గ్రహించి, తమ జీవనాన్ని సాగించేవారు. ఈ విధంగా గ్రామం స్వయం సమృద్ధమై, స్వయం పోషకమై ఉండేది.

ఇందుకు భిన్నంగా ఆంగ్లేయులు ఆస్తిపై యాజమాన్య హక్కును, వివిధ రెవెన్యూ పద్ధతులను, ఆధునిక రోడ్లు-రవాణా సౌకర్యాలను ఏర్పరచి, గ్రామీణ స్వరూపాన్ని మార్చారు. కేంద్రీకృత పాలనా వ్యవస్థ కూడా ఒక ప్రముఖ కారణమే అయింది. ఈ విధంగా బ్రిటీష్‌వారు సాంప్రదాయ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తమ ప్రయోజనాలకు అనుగుణంగా మలచుకునే క్రమంలో జమీందారీ వ్యవస్థ రైత్వారీ వ్యవస్థ, మహల్వారీ వ్యవస్థలు అమలుపరచారు.

### 3.3 తొలి రెవెన్యూ విధానాలు:

ప్రాచీనకాలం నుంచి భారతదేశంలో వ్యవసాయరంగం ప్రాధాన్యత వహించింది. ప్రజలకు అవసరమైన ఆహారపదార్థాలను సమకూర్చడమే గాక ప్రభుత్వానికి అవసరమయ్యే ధనాన్ని ఈ రంగం అందించేది. రాజకీయ అధికారాన్ని సాధించినప్పటి నుంచి బ్రిటీష్‌వారు అనేకమైన పద్ధతులను అనుసరించి, ఆర్థిక లాభాలను పొందే ప్రయత్నం చేశారు.

తూర్పు ఇండియా కంపెనీ బెంగాలు రాష్ట్రంలో రెవెన్యూ అధికారాలు చేపట్టిన వెంటనే శిస్తువసూలు చేయుటకు మొగల్ చక్రవర్తిచే నియమించబడిన అధికారులనే కొనసాగించారు. ఎస్టేట్లను వేలం పద్ధతిలో ప్రతి ఏడాదీ అధిక ధనం చెల్లించడానికి అంగీకరించిన వారికి కౌలుకి ఇచ్చేవారు. దీనిని 'ఏక్‌సాలా పద్ధతి'గా పేర్కొన్నారు. సంవత్సరకాలం మరీ తక్కువ సమయమవడంతో దీనిని తొలగించి, ఐదేండ్ల కొకసారి శిస్తు నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టారు. కాని ఈ పద్ధతి మాతృదేశంలోని డైరక్టర్ల మండలికి నచ్చని కారణంగా దీనిని రద్దుచేసి మరలా ఏక్‌సాలా పద్ధతినే అనుసరించారు. ప్రతి సంవత్సరమూ వేలం నిర్వహించేవారు. ఈ విధానం 1766 నుంచి 1769 వరకు కొనసాగింది.

డైరెక్టర్ల మండలి అక్టోబరు 11, 1776న ఒక సర్క్యూట్ కమిటీని ఐదుగురు సభ్యులతో సర్కారుల నుంచి వచ్చే ఆదాయాన్ని అంచనా వేయమని నియమించింది. థామస్ రంబోల్ట్ మద్రాస్ గవర్నరుగా నియమింపబడి ఫిబ్రవరి, 1778న మద్రాసు వచ్చినప్పుడు, ఈ కమిటీ రద్దు చేయబడింది. లార్డ్ మెకార్ట్నేని మద్రాసు గవర్నరుగా 1783లో నియమించబడినప్పుడు ఈ కమిటీ, నూతన సభ్యులతో, పునరుద్ధరించబడింది. శ్రీకాకుళంపై రెండు నివేదికలు, మచిలీపట్నంపై రెండు నివేదికలు, గంజాంపై ఒక నివేదికను ఈ కమిటీ సమర్పించింది.

సర్క్యూట్ కమిటీ చేసిన సూచనలో బోర్డ్ ఆఫ్ రెవెన్యూని 1786లో స్థాపించడం ప్రముఖమైనది. ప్రొవిన్షియల్ ఛీఫ్ అండ్ కౌన్సిళ్ళను ఈ సంస్థ పరిధిలోకి తెచ్చి, బోర్డ్ ఆఫ్ రెవెన్యూకి బాధ్యత వహించేటట్లు ఏర్పాటు చేశారు. ఆ మరుసటి సంవత్సరమే కలెక్టర్లను బోర్డ్ ఆఫ్ రెవెన్యూకి బాధ్యత వహించేటట్లు ఏర్పాటు చేశారు. నవంబరు 10, 1794న బ్రిటీష్ ప్రభుత్వం ఒక ప్రకటనను జారీచేసి, మద్రాసు ప్రెసిడెన్సీలోని జమీందారీలన్నిటిని కలెక్టర్ల నిర్వహణ క్రిందకు తెస్తున్నట్లు పేర్కొంది. అప్పటి నుంచి కలెక్టర్లు కంపెనీ ప్రతినిధులుగా శిస్తు వసూలు చేయసాగారు.

ఇటువంటి మార్పుల నేపథ్యంలో కంపెనీ పరిపాలనా సౌలభ్యం కొరకు ఉత్తర సర్కారులను అనేక డివిజన్లుగా విభజించింది. విశాఖపట్టణం ప్రాంతాన్ని మూడు డివిజన్లుగాను, మచిలీపట్నం కౌన్సిలు క్రింద గోదావరి జిల్లాను మూడు డివిజన్లుగానూ విభజించింది. పలనాడును మినహాయించి గుంటూరును ప్రత్యేక డివిజనుగా ఏర్పాటు చేశారు.

శాశ్వత సిస్తు విధానాన్ని కారన్‌వాలీస్ ప్రవేశపెట్టాడు. బ్రిటీష్‌పాలన దేశంలో సుస్థిరం కాకపోవడం చేత రాజకీయ ఎత్తుగడల దృష్ట్యా అంతకుమునుపే ఉనికిలో ఉన్న భూస్వాములను శిస్తు వసూలు చేసే జమీందారులుగా నియమించింది. బ్రిటీష్ పాలన తొలిదశలో పరిపాలనా దృష్ట్యా చూస్తే అసంఖ్యాకమైన రైతుల నుంచి శిస్తు వసూలు చేయడం కంటే కొద్దిమంది భూస్వాముల నుండి, జమీందారుల నుండి శిస్తు వసూలు చేయడం పొదుపైనదిగాను, సులభమైనదిగానూ కనిపించింది.

### 3.4. శాశ్వత శిస్తు విధానము:

గవర్నర్ – జనరల్ కారన్‌వాలీస్ ప్రవేశపెట్టిన సంస్కరణలలో శాశ్వత శిస్తు విధానము అత్యంత ముఖ్యమైనది. ఈ విధానంలో ప్రభుత్వానికి రైతులకు మధ్య జమీందారీ వ్యవస్థ ఏర్పడింది. వీరికి భూములపై యాజమాన్య హక్కు ఇవ్వబడింది. ఎంత భూమి సాగు అవుతున్నదో, ఎంత పంట పండుతున్నదో, ఎవరు ఎంత శిస్తు కడుతున్నారో పాత రికార్డులను పరిశీలించి విషయాలను కనుగొనమని కలెక్టర్లను ఆదేశించారు. కాని కలెక్టర్లు ఎంత శ్రమపడినా పూర్తి వివరాలను తెలుసుకోలేకపోయారు. అప్పటికి లభించిన వివరాల నాధారంగా చేసికొని, శిస్తుని నిర్ణయించి, శాశ్వత విధానమున భూములను జమీందార్లకు ఇచ్చివేశారు. వారు ఇంగ్లండ్ లోని భూస్వాముల వలనే ప్రవర్తిస్తారని కారన్‌వాలీస్ అభిప్రాయపడ్డాడు. నిజానికి వారు వంశపారంపర్య హక్కుగల శిస్తు వసూలుదారులు మాత్రమే గాని,వారికి యాజమాన్య హక్కు లేదు.

బెంగాల్‌లో తొలుతగా ప్రవేశపెట్టబడిన ఈ విధానం త్వరలోనే ఇతర ప్రాంతాలకు విస్తరించారు. బోర్డ్ ఆఫ్ రెవిన్యూ తన సెప్టెంబరు 1799 నివేదికలలో ఈ విధానాన్ని ఉత్తర సర్కారులో ప్రవేశపెడితే బాగుంటుందని సూచించింది. ఈ సూచనకు గవర్నరు-జనరల్ అంగీకారం మార్చి 3, 1800 న పొందింది. డైరక్టర్ల మండలి ఫిబ్రవరి 11,1801 న తమ ఆమోదాన్ని తెలియజేసారు. చివరకు 1802లో ఒక ప్రత్యేక కమీషన్ ద్వారా ఈ విధానం ఉత్తర సర్కారులలో ప్రవేశపెట్టబడింది. సర్కారు అనే పదానికి బదులు జిల్లా అను నూతన పేరుని వాడసాగారు.

### 3.4.1. లక్షణాలు:

1. స్థానిక వంశపారంపర్య శిస్తుదారుల యాజమాన్యపు హక్కు శాశ్వతంగా గుర్తించబడింది. దీనికి ప్రతిఫలంగా వారు నిర్ణీతమైన సొమ్మును క్రమబద్ధంగా చెల్లించాలి. దీనివలన బ్రిటీష్ కంపెనీకి ప్రత్యక్షంగా పన్ను వసూలు చేసే ఇబ్బంది తప్పుతుంది. స్థానిక శిస్తు వసూలుదారులు వంశపారంపర్యంగా ఈ పనిని చేస్తూ ఉండడం వలన ప్రజలకూ అభ్యంతరం ఉండదు.

2. ప్రత్యక్ష ప్రభుత్వ హయాంలో ఉండే హవేలీ భూములను సహితం వేలంలో విక్రయించి, ఎవరైతే అత్యధిక పాట పాడుతారో వారిని యజమానులుగా గుర్తించసాగారు . వారికి ఇతర జమీందారుల హోదాని ఇచ్చారు. హవేలీ భూములను ప్రతీఏటా 1000 నుంచి 5000 రెవెన్యూ వచ్చే మూఠాలుగా విభజించి వాటిపై ప్రొప్రైటర్లను భూస్వాములను సృష్టించారు.

3. జమీందారు చెల్లించవలసినటువంటి ఆదాయాన్ని ఎనిమిది నుంచి పదిసంవత్సరాల పాత రికార్డులు పరిశీలించిన తరువాత వాటి సగటు ఆదాయంలో 2/3 వ వంతు శిస్తుగా నిర్ణయించారు. ఈ విధంగా ఆదాయంలో 1/3 వ వంతు ఎస్టేటు నిర్వహణకు ఇతర పోషణ ఖర్చులకు జమీందారు అట్టేపెట్టుకోవచ్చు. జమీందారు యొక్క ఆదాయాన్ని పరిగణనలోకి తీసికొనేటప్పుడు భూమి నుంచి వచ్చే ఆదాయమే గాక ఉప్పునుంచి, అబ్కారీ నుంచి రవాణా సుంకాలు మొదలయిన ఇతర ఆదాయవనరులను కూడా లెక్కించేవారు .

4 ఏ ఏ నిబంధనల మేరకు రైతులు భూములను సాగు చేయాలో తెలియజేసే పట్టాలను భూస్వాములనుంచి రైతులు పొందాలి. రైతులకు జమీందార్లు పట్టాలివ్వడం ప్రభుత్వం తప్పని సరిచేసింది.

5. రైతు శిస్తు చెల్లించలేని స్థితిలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే రైతుభూమిని జమీందారు జప్తుచేయవచ్చు.దానిని అమ్మవచ్చు కుడా.

6. కరణాలకు విస్తృత అధికారాలు ఇవ్వబడ్డాయి. వారిని నియమించే హక్కు భూస్వాములకు ఉన్నప్పటికీ, తొలగించే అధికారం కోర్టుకు మాత్రమే ఉంటుంది.

7. జమీందారు యాజమాన్యహక్కు , చట్టరీత్యా , సాగుభూమి , బంజరు భూమి కలిపిన మొత్తంలో 15% మాత్రమే . దీనిని కుదువ పెట్టడానికి, విక్రయించడానికి, బదలాయించడానికి జమిందారుకి హక్కు ఉంటుంది. ప్రభుత్వానికి చెల్లించే సొమ్ములో మార్పు ఉండదు కనుక ఆదాయాన్ని అధికం చేసే ప్రయత్నాన్ని వారు చేస్తారని, కంపెనీ నమ్మింది.దీనివలన జమీందారులే లాభిస్తారు.

### *3.5.2. లాభాలు*:

1. కంపెనీకి శిస్తు వసూలులో ఉండే ఇబ్బందులు తొలిగాయి. సామాన్యప్రజలు , రైతులు స్థానిక జమిందారుల మాటకు కట్టుబడి ఉండేవారు. శిస్తు వసూలు ఉద్యోగులపై పెట్టే ఖర్చు ప్రభుత్వానికి ఆదా అయింది.

2 ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నికరమయినది కనుక వారు చేపట్టవలసిన కార్యాలను ప్రణాళికా బద్ధంగా నిర్వహించవచ్చు. ప్రభుత్వానికి సకాలానికి రావలసిన మొత్తం అందుతూ ఉండేది.

3 జమీందారులు ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తం శాశ్వత మయినదే కనుక పంట రెట్టింపు పండించినా, ఆ లాభమంతా జమీందారులకు, రైతులకు చెందుతుంది. దీనివలన ఎక్కువ శ్రద్ధ, ఎక్కువ శ్రమపెట్టే అవకాశం ఉంది. ఎందుకంటే ఆ లాభమంతా వారికే చెందుతుంది కనుక ఎక్కువ సందర్భాలలో జమిందారులు ఈ విధానంలో లాభపడ్డారు. గ్రామానికి ఉమ్మడిగా హక్కు ఉండే పచ్చిక బీడులను, బంజరుభూములను, చెరువు ప్రదేశాలను ఆక్రమించసాగారు.

4. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతి ప్రవేశపెట్టినందువలన రైతుల ప్రయోజనాలు రక్షించబడే అవకాశం ఉంది .

5. కంపెనీకి విధేయులుగా ఉండే ఒక మధ్యతరగతి వర్గం ఏర్పడడం, కంపెనీకి చాలా లాభదాయకమయింది.

### *3.4.3. లోపాలు*:

1. బెంగాలులో స్థానిక నాయకులను అణచిన తరువాత శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టబడింది. కాని ఆంధ్రాలో స్థానిక రాజులు, జమీందారులు శక్తివంతంగా ఉన్నప్పుడే ఈ విధానం అమలులోకి వచ్చింది. ఒక్క విజయనగర సంస్థానం మాత్రం పద్మనాభయుద్ధంలో ఓటమిని చవిచూసి, బలహీనపడింది. పర్లాకిమిడి, గుంసూరు, మొహిరి, నూజివీడు మొదలగు సంస్థానాలలో తరచు తిరుగుబాటు ధోరణులు ఉండేవి. వాని వలన ఈ విధానం విజయవంతం కాలేదు.

2. బెంగాలులోని భూమి అంతా జమీందారీ భూమే కాగా, ఆంధ్రాలో జమీందారీ భూమితో పాటు, హవేలీ భూమి కూడా అధికంగా ఉండేది. ఈ భూములను కొన్నవారు వేలంపాటలో అధిక ధర చెల్లించిన వారే తప్ప,స్థానిక ఆసక్తి ఉన్నవారు కాదు. లాభాల కోసమే వారు కృషి చేసారు తప్ప భూ వనరులను పెంచటంలో శ్రద్ధ చూపలేదు.

3. సమాచారాన్ని ఖరారు చేసుకోకుండానూ నూతన ప్రదేశ వాతావరణ పద్ధతులు తెలియకపోవడం చేతనూ,కంపెనీ లభించిన వివరాలనే విశ్వసించి, పేష్కష్‌ని నిర్ణయించింది. దీనివలన శిస్తు నిర్ణయం నిబంధనల మేర్రకు ఖచ్చితంగా జరుగలేదు. ఉదాహరణకు బార్‌మహల్ జమీందారుకి ఎక్కువ శిస్తు నిర్ణయించబడగా, వాసిరెడ్డి జమీందారుకి తక్కువ శిస్తు నిర్ణయించబడింది

4. ప్రతీ జమీందారీలోనూ, సంభవించిన వారసత్వ తగాదాలు, కోర్టు వ్యవహారాలు ఈ విధాన వైఫల్యానికి కారణమయ్యాయి. జమీందారుల ఆడంబర జీవనం ఆదాయ వనరులపై శ్రద్ధ చూపకపోవడం కూడా వైపల్యానికి కారణాలు.

5. ఈ విధానంలో ఏర్పడిన పోలీసుశాఖ ప్రజలను జమీందార్లను ఇబ్బందులకు గురిచేయసాగింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలోని కొండదొరల స్వాతంత్ర్యానికి విఘాతం ఏర్పడడంతో వారు తిరుగుబాట్లు చేసారు.

6. అధిక శిస్తుని నిర్ధారించడంతో జమీందార్లు రైతులపై తీవ్ర ఒత్తిడి తెచ్చేవారు.నీటిసౌకర్యాలు, రుణసదుపాయాలు లేని రైతాంగం పరిస్థితి దుర్భరం కాసాగింది. ఇటువంటి పరిస్థితులలో జమీందార్లు రైతులనుంచి శిస్తు వసూలు చేయడం దుర్భరమయింది. తత్ఫలితంగా కంపెనీకి చెల్లించవలసిన శిస్తు బకాయి పడడంతో అనేక ఎస్టేట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకొనేది,కొన్ని సందర్భాలలో వాటిని అమ్మకానికి పెట్టి, బకాయిల వసూలుకి ప్రయత్నించేది. ఇది ప్రజలకు కష్టం కలిగించేది.

7. ఈ విధానం ప్రభుత్వానికి కూడా లాభించలేదు. బకాయిల నుండి తప్పించుకోడానికి భూస్వామి తన భూములను తరచుగా బదలాయించే వాడు. దానితో వసూలు జరిగేదికాదు. వసూలు రోజుకి ఆ జిల్లానుంచి ఆ రైతు పారిపోవడమో లేక దొరికితే కొంతకాలం జిల్లా జైలులో శిక్ష అనుభవించడమో జరిగేది తప్ప ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదికాదు. రైతులు భూస్వాముల నుండి,ప్రభుత్వం నుంచి ఆనాదరణకు గురయ్యారు.

8. ఒకప్పుడు స్వంత భూములు కలిగి, స్వంత సేద్యం చేసుకుంటూ బతికిన రైతులు ఈ కొత్త విధానం వలన జమీందార్లకు బానిసలుగా మారారు. ఇంగ్లండులోని భూస్వాములకు సమానమైన హోదాను జమీందారులకు కారన్‌వాలీస్ ఇచ్చాడు.

శాశ్వత శిస్తు విధానం వలన రెండు ప్రముఖ ఫలితాలు ఏర్పడ్డాయి. 1) బ్రిటిష్ వారికి విధేయులుగా ఉండే భూస్వామ్య ప్రభువర్గం ఏర్పడింది. 2) గ్రామీణ వడ్డీవ్యాపార వర్గం బలపడింది. వ్యవసాయదారులు, అధిక శిస్తుల వలన, కరువుల వలన జమీందార్లకు చెల్లించే శిస్తు కన్నా వడ్డీ వ్యాపారులకు చెల్లించే మొత్తం అధికంగా ఉండేదని తెలుస్తోంది.

### *3.5* రైత్వారీ విధానం:

కెప్టెన్ రీడ్, థామస్ మన్రోలు నూతన రెవిన్యూ విధానాన్ని 1792 లో సేలం జిల్లాలోని బారామహల్ ప్రాంతంలో ఆరంభించారు. కెప్టెన్ రీడ్ అక్కడ కలెక్టరు కాగా, థామస్ మన్రో అతని సహాయకుడు వీరిరువురు శాశ్వత శిస్తు విధానాన్ని విమర్శించడమేగాక, ఇంగ్లండ్‌లోని అధికారులను ఒప్పించి, ప్రయోగాత్మకంగా రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టారు.

#### *3.5.1.* ముఖ్యాంశాలు:

1. రైత్వారీ విధానం రైతునే భూస్వామిగా గుర్తిస్తుంది.రైతుకు భూమిపై యాజమాన్య హక్కు కల్పించబడింది. మధ్యవర్తి లేకుండా అతడే స్వయంగా పన్నును ప్రభుత్వానికి చెల్లించవచ్చు. భూమికి యాజమానిగా ఉన్నప్పుడే దానిని బాగుచేసుకునే సంకల్పం రైతుకి కలుగుతుందని మన్రో భావించేవాడు. తద్వారా ఉత్పత్తి వృద్ధి అయ్యే అవకాశం ఉంది.

2. భూమిని సర్వే చేయించిన తరువాతనే శిస్తుని నిర్ణయించే కార్యక్రమాన్ని థామస్ మన్రో అవలంబించాడు. 1802 లో ప్రారంభమయిన సర్వే 1807 నాటికి పూర్తి అయింది. సాగులో ఉన్న భూమి అంతా సర్వే చేయబడింది. ఒక్కొక్క క్షేత్రానికి ఒక్కొక్క నెంబరుని కేటాయించి, ఆ భూమిని సాగుచేస్తున్న రైతు పేరున రిజిష్టరు చేయించారు. అతడు కట్టవలసిన పన్నును నిర్ణయించి,రైతు పేరుతో పట్టాలు ఇచ్చేవారు. ఈ కార్యక్రమాన్ని దత్తమండల జిల్లాలలో ఐదు సంవత్సరాలలో మన్రో పూర్తిచేసాడు.

3. పండిన పంటను బట్టిగాక సాగు చేస్తున్న కమతం ఆధారంగా శిస్తు నిర్ధారణ చేయబడింది.

4. రైతు శిస్తును నగదు రూపంలో చెల్లించాలి.

### 3.5.2. ప్రయోజనాలు:

1. ఈ విధానంలో రైతుకు,ప్రభుత్వానికి మధ్య ఎటువంటి దళారీలు లేకపోవడంతో, రైతుకు కొంత వెసులుబాటు కలిగి, ప్రత్యక్షంగా ప్రభుత్వానికి బాధ్యత వహించేవాడు.

2. రైతు పేరుతో భూమిని రిజిష్టరు చేయడం వలన ఆస్తి హక్కు ఏర్పడి, రైతుకు వ్యక్తిగత ఆసక్తి భూమిపై పెరిగింది.

3. ఈ పద్ధతిలో నిరుపయోగంగా ఉన్న భూములను, ప్రభుత్వ ఆధీనంలోని భూములు కొంతవరకు సాగులోకి రావడంతో విస్తీర్ణత అధికమయింది.

4. రైత్వారీ విధానమును 1801-1802 లో వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందే అమలులోనికి తెచ్చాడు. రైతులకు అవసరమయే రుణసహాయాన్ని అందించాడు. విత్తనాలు, పనిముట్లు, ఎద్దుల కొనుగోళ్లకు, పాతబావుల మరమ్మత్తులకు, కొత్తబావుల తవ్వకానికి ఈ రుణాలు మంజూరు చేయబడ్డాయి. ఈ విధమైన రుణసహాయం సమయానికి అందడంతో రైతులకు ప్రయోజనం చేకూరింది.

5. రైత్వారీ విధానంలో మరుసటి సంవత్సరమే పంట పుష్కలంగా చేతికంది, నూటికి నూరుశాతం పన్ను వసూలు జరిగింది. దీనికి ప్రధానకారణం మన్రో అనుసరించిన నీటి వసతుల విధానమే. 1802 లో అనావృష్టితో ఉన్న దత్త మండలాలు, త్వరలోనే అతివృష్టికి గురయ్యాయి. ఒక్క కడప జిల్లాలోనే వందచెరువులకు, 800 కాలువలకు గండ్లు పడ్డాయి. ఈ విపత్కర పరిస్థితులలో ప్రభుత్వ అనుమతికోసం ఎదురు చూడకుండా పాడైన చెరువులను కాలువలను మరమ్మత్తు చేయించాడు.

### 3.5.3. నష్టాలు:

రైత్వారీ విధానము వలన థామస్ మన్రో ఆశించిన మేరకు రైతులకు మంచి జరుగలేదు.

1. భూమి సర్వేగాని, విభజనకాని సక్రమంగా జరుగలేదు.

2. ప్రజలనుండి పన్నుల రూపంలో ఎక్కువ ఆదాయం పొందటం ప్రధానలక్ష్యం కావటంతో ఎక్కువ శిస్తు విధించటం పరిపాటి అయినది. మన్రో అభ్యంతరం పెట్టినప్పటికి కంపెనీ శిస్తు రేట్లను పెంచమని ఆజ్ఞాపించింది.

3. శిస్తును రైతులు నగదు రూపంలో చెల్లించవల్సిరావడంతో రైతులు భారీగా నష్టపోయేవారు. పంటలో కొంతభాగాన్ని తక్కువధరకు అమ్మి ప్రభుత్వానికి శిస్తు చెల్లించేవారు. పంట సరిగ్గా పండని సందర్భాలలో కూడా రైతుకు శిస్తు చెల్లింపు తప్పేదికాదు. ఇటువంటి పరిస్థితులలో రైతుగ్రామంలోని షావుకార్లవద్ద, వడ్డీ వ్యాపారస్తుల వద్ద భూమిని కుదువపెట్టేవారు.

4. వడ్డీ వ్యాపారస్థులు,షావుకార్లు త్వరలోనే భూస్వాములు గా మారారు. రైతులు, ఋణాలు చెల్లించలేని సందర్భాలలో వారి భూములను వశం చేసుకోవటంతో భూములు సేద్యం చేయని వర్గం చేతిలోకి మారాయి. భూమిపై సొంత యాజమాని స్థాయి నుండి రైతులు కౌలుదార్లుగాను, వ్యవసాయ కూలీలుగాను మారే పరిస్థితి ఏర్పడింది.

5. రైతులు సకాలంలో పన్ను చెల్లించలేని పక్షంలో వారి భూములను ప్రభుత్వం వేలం వేసేది.

6. నీటివసతులపై ప్రభుత్వము మన్రో తరువాత కాలంలో శ్రద్ధ చూపకపోవటంతో ఉత్పత్తి కుంటుపడింది. ఈ ప్రాంతంలో మెట్టభూములు అధికశాతంలో ఉన్నాయి. వర్షపాతం వర్షాలపైన చెరువులపై ఆధారపడి వ్యవసాయం సాగేది. భూములు సారవంతం కాకపోవడంతో వ్యవసాయ ఉత్పాదకత కూడా అల్పంగానే ఉంది. రాగులు, సజ్జలు, జొన్నలు వంటి తృణ ధాన్యాలతో పాటు ప్రత్తి, వేరశనగ, ఉల్లి వంటి వాణిజ్యపంటలను సాగుచేసే వారు. నీటి సౌకర్యాలపై దృష్టి సారించక పోవటంతో రైత్వారీ విధానం కూడా సత్ఫలితాలను ఇవ్వలేదు.

7. తరచుగా సంభవించిన కరువు – కాటకాలు రైతుల పరిస్థితిని మరింతగా దిగజార్చాయి. 19వ శతాబ్దపు రాయలసీమ చరిత్ర కరువు కాటకాల చరిత్ర అంటే అతిశయోక్తికాదు. 1839,1864,1865 లలో వరుసగా బళ్ళారి జిల్లాలో తీవ్ర క్షామం నెలకొంది. 1885 లో దత్త మండలాలన్నిటా దుర్భిక్షం నెలకొంది.

8. అమెరికాలో వచ్చిన (1860 –65) అంతర్యుద్ధం రాయలసీమలోని సాంప్రదాయ పంటల విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఈ కాలంలో బ్రిటిషు ప్రభుత్వము తమ అవసరాల కొరకు సాంప్రదాయ పంటలైన జొన్నలు, రాగులు, సజ్జలు వంటి తృణ ధాన్యాల స్థానంలో ప్రత్తి, వేరుశనగ వంటి వాణిజ్య పంటలను ప్రోత్సహించి ఈ పంటల గిట్టుబాటు ధరలను పెంచింది. ఈ సమయంలోనే బళ్ళారి జిల్లాలో రైతులు ప్రత్తిని విస్తారంగా పండించారు. ప్రత్తి, నూనె గింజల ఎగుమతులు బాగా పెరిగాయి. అమెరికా అంతర్యుద్ధం ముగిసిన తరువాత ఇంగ్లండుకు ఎగుమతి అయ్యే పంటలు తగ్గాయి. ఈ సంఘటన రాయలసీమ సాంప్రదాయ పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది.

### *3.5.4. రైత్వారీ పద్ధతి విస్తరణ:*

థామస్ మన్రో మద్రాసు ప్రెసిడెన్సీకి 1820 నుంచి 1827 వరకు గవర్నరుగా విధులు నిర్వర్తించాడు. ఆ సమయంలో రైత్వారీ విధానం అనేక ప్రదేశాలకు విస్తరించబడింది. జప్తు చేయబడిన ఏ జమీందారీని తిరిగి వారసులకు ఇవ్వరాదనీ, అచ్చట రైతువారీ విధానాన్నే ప్రవేశ పెట్టమని మన్రో ఉత్తర్వులు జారీ చేశాడు. భూసారాన్ని బట్టి పన్ను విధింపులో వైరుధ్యం ఉండేది. పంట విలువలో సగభాగం భూమి శిస్తుగానూ, ముప్పది ఏండ్లకొకమారు మదింపు చేయవలసినదిగానూ నిబంధనలుండేవి. భూమిశిస్తు నగదు రూపంలో చెల్లించవలసి ఉంటుంది. శిస్తు చెల్లించని రైతు పొలాన్ని ప్రభుత్వము స్వాధీనపరచుకొని, మరొకనికి అమ్మి, తనకు రావలసిన డబ్బుని రాబట్టుకొనేది. పొలంపై గల ఆస్తి హక్కు వంశపారంపర్యంగా సంక్రమిస్తుంది. రైతు తన పొలాన్ని అమ్ముకోవచ్చు; తాకట్టుపెట్టవచ్చు. అన్ని ఖర్చులు పోగా, మిగిలిన పంటలో సగం విలువను నగదు రూపంలో పన్నుగా రైతు చెల్లించాలి.

బొంబాయి ప్రెసిడెన్సీలో గవర్నరు ఎల్ఫిన్‌స్టన్ రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టాడు. పొలాల హద్దుల నిర్ణయం, సర్వే నెంబర్ల నిర్ణయం మున్నగు విషయాల్లో మద్రాసు రాష్ట్ర విధానాన్ని అనుసరించారు.

### *3.7 మహల్వారీ పద్ధతి :*

ఈ పద్ధతిలో గ్రామంలోని భూమి అంతా గ్రామస్థులందరికీ చెందిన ఆస్తిగా పరిగణించి, మొత్తం భూమిమీద ప్రభుత్వం శిస్తు విధించేది. శిస్తు చెల్లించే బాధ్యతను గ్రామస్థులు ఉమ్మడిగానూ, వ్యక్తిగతంగానూ వహించేవారు. గ్రామపెద్ద వ్యక్తుల నుంచి శిస్తు వసూలుచేసి, ప్రభుత్వానికి అందజేస్తాడు. ఈ సేవకు ప్రతిఫలంగా అతడు కొంత కమీషన్ పొందడానికి అర్హుడు. ఈ పద్ధతి మొదట ఆగ్రా, అయోధ్యలలో అమలులోకి వచ్చింది. ఆ తరువాత పంజాబుకి విస్తరించింది. గ్రామవారీ పద్ధతిని క్రీ.శ.1804 నుంచి 15

సంవత్సరాలపాటు రాయలసీమ, నెల్లూరు, ఉత్తర సర్కారులలోని అనేక ప్రాంతాలలో అమలులో ఉండేది. పేష్కష్‌లు బకాయీలు పెట్టిన జమీందారులు, ప్రొప్రైటరుల భూములను కంపెనీ ప్రభుత్వం వారు స్వాధీనపరచుకొని, అచట గ్రామాలలో ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు.

గ్రామవారీ పద్ధతి ముఖ్య లక్షణములేవనగా (1) గ్రామం మొత్తం మీద ఎంత శిస్తు చెల్లించవలెనో నిర్ణయించబడేది. (2) ఈ మొత్తంలో ఒక్కొక్క రైతు ఎంత చెల్లించవలెనో గ్రామాధికారియే నిర్ణయించేవాడు (3) శిస్తు మొత్తమును గ్రామాధికారులనగు రెడ్డి, మునసబు మొదలగు వారి నుంచి వసూలు చేసేవారు.

గ్రామవారీ పద్ధతి ప్రభుత్వమునకు, రైతులకు, ముఖ్యంగా సన్నకారు రైతులకు, నష్టం కలుగజేయగలదని రుజువయింది. అప్పుడు దానిని తొలగించి, శాశ్విత భూమిశిస్తు విధానం అమలులేని చోట రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టారు.

## 3.7 భూమిశిస్తు విధానాల ఫలితములు:

బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన వివిధ భూమిశిస్తు పద్ధతులు, వారు అనుసరించిన వ్యవసాయ విధానం సాంప్రదాయ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సామాజిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసాయి. నూతన మార్పులకు నాంది పలికాయి.

1. భారతదేశ వ్యవసాయరంగం ప్రపంచ మార్కెట్టుతో అనుసంధానం చేయబడింది. దీనికి ఉదాహరణ: అమెరికాలో 1860–65లలో అంతర్యుద్ధం జరుగుతున్నప్పుడు ఆంధ్రా బియ్యానికి, ముడి ప్రత్తికి డిమాండు పెరిగి, ఇంగ్లండుకి ఎగుమతులు పెరిగాయి. ప్రత్తితోబాటు వేరసెనగ వంటి వాణిజ్య పంటలను రాయలసీమ ప్రాంతంలో కంపెనీ ప్రోత్సహించి, ఈ పంటలకు గిట్టుబాటు ధరలను పెంచింది. ఈ సమయంలోనే బళ్ళారి జిల్లాలోని రైతులు ప్రత్తిని విస్తారంగా పండించారు. ఈ కాలంలోనే ప్రత్తి, నూనెగింజల ఎగుమతులు బాగా పెరిగాయి. నాలుగు సంవత్సరాల కాలంలో ప్రతి ధర నాలుగు రెట్లు పెరిగింది. అయితే అభివృద్ధి ఎంతోకాలం నిలువలేదు. అమెరికా అంతర్యుద్ధం ముగిసిన తరువాత ఇంగ్లండుకు ఎగుమతి అయ్యే పంటలు తగ్గాయి. వాణిజ్య పంటలు పండించే రైతుల పరిస్థితి సంక్షోభంలో పడింది. ప్రాంతీయ అవసరాలకు భిన్నంగా పంటలను నిర్దేశించే మార్కెట్టు శక్తులున్నట్లు తెలిసింది.

2. శిస్తు ద్రవ్యరూపంలో చెల్లించవలసిన రావడంతోనూ, పంటపండని సందర్భాల్లోనూ, కరువుకాటకాలు సంభవించినప్పుడు వడ్డీ వ్యాపారస్థుల వద్ద రైతు తన భూమిని తనఖా పెట్టి, రుణగ్రస్థుడుగా మారేవాడు. అధిక వడ్డీతో కూడిన రుణాన్ని చెల్లించలేక పోయినప్పుడు, భూమిని విడిపించుకోలేక, వడ్డీ వ్యాపారానికి కోల్పోయేవాడు. ఈ విధంగా భూమి సేద్యం చేసే రైతుల నుంచి, వడ్డీ వ్యాపారస్థుల చేతుల్లోకి మారింది.

3. వ్యవసాయం వాణిజ్య రూపం పొందింది. ద్రవ్యరూపంలో శిస్తు చెల్లించే పద్ధతి రావడంతో గ్రామంలో వ్యవసాయోత్పత్తి గ్రామ అవసరాలకు కాక వాణిజ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యేక పంటలు పండించసాగారు. భూమి అనుకూలతను బట్టి కొన్ని ప్రాంతాలలో ప్రత్తి, జనుము, గోధుమ, నూనెగింజలు వ్యాపార పంటలు విస్తారంగా సాగులోకి వచ్చాయి. రవాణా సౌకర్యాల విస్తరణ వలన వ్యవసాయ వాణిజ్యీకరణ తీవ్రతరమయింది. వీనితోబాటు ఇంగ్లండులో ఆధునిక పరిశ్రమలు 19వ శతాబ్దంనుంచి వర్ధిల్లడంతో వాటికి కావలసిన ముడి సరుకులను సమకూర్చుకునేందుకు వ్యవసాయరంగంలో వాణిజ్యీకరణను ప్రభుత్వం ప్రోత్సహించింది.

4. నూతన భూమి శిస్తు విధానాలు గ్రామస్వయం సమృద్ధి లక్షణాన్ని పోగొట్టాయి . గ్రామాన్ని ఒక యూనిట్‌గా స్వీకరించడం, పండిన పంటలో శిస్తు చెల్లింపు అంచనా వేయడం అనే పాతపద్ధతులకు బ్రిటిష్ వారు స్వస్తిపలికారు. రైతుకు భూమిపై యాజమాన్య హక్కు కల్పించి, శిస్తు ద్రవ్యరూపంలో నిర్ధారించి, వ్యక్తిగత కమతాల ఆధారంగా శిస్తుని నిర్ణయించారు. ఎక్కువ విస్తీర్ణత గల భూమి స్వాధీనంలో ఉన్నా, పండిన పంట తక్కువ అయినపుడు రైతు బకాయిలలో చిక్కుకునేవాడు. ఈ విధమైన

శిస్తు అంచనా, చెల్లింపు విధానాలు రైతులను బకాయిలలోకి నెట్టాయి. ఈ విధమైన శిస్తు పద్ధతి వలన భూములు తాకట్టు, క్రయ, విక్రయాలను రాక తప్పలేదు. బ్రిటీష్ విధాన ఫలితంగా భూమి కూడా ఒక మారకపు సరుకుగా మారింది.

5. శాశ్వత శిస్తు పద్ధతి ఫలితంగా నూతన జమీందారీ వర్గం ఏర్పడింది. శిస్తు వసూలుదారుల హోదా నుంచి జమీందారులుగా వీరి హోదా అధికారాలు పెంచబడ్డాయి. గ్రామానికి ఉండే ఉమ్మడి హక్కులు క్రమంగా క్షీణించి, జమీందారు బలపడడం జరిగింది. జమీందార్లు బ్రిటీష్ పాలనకు భద్రత చేకూర్చి, వత్తాసు పలికేవారు. ముఖ్యంగా వలస పాలనా వ్యతిరేక పోరాటాలు జరిగినప్పుడు, ఈ వర్గం ప్రజా ఉద్యమాలను అణచి, బ్రిటీష్ ప్రభుత్వాన్ని బలపరిచింది. ఈ విధంగా బ్రిటీష్ పాలన పటిష్ఠమయింది.

6. పోలీసు అధికారాలు, న్యాయాధికారాలను స్థానికులు కోల్పోయారు. నూతన శాఖలు పరిపాలనా బాధ్యతలను స్వీకరించాయి.

7. రైతుల బాగోగులు శాశ్వతశిస్తు పద్ధతిలో జమీందారులపైనా, రైత్వారీ విధానంలో బ్రిటీష్ ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడ్డాయి. పండిన పంటతో నిమిత్తం లేకుండా బలవంతపు వసూళ్ళకు పాల్పడడంతో, రైతులు అత్యంత దయనీయ స్థితిలోకి నెట్టబడ్డారు. సొంత యజమాని స్థాయి నుంచి దిగజారిన రైతులు కౌలుదారులుగానూ, వ్యవసాయకూలీలుగానూ మారారు.

8. శిస్తు వసూలుపై చూపే శ్రద్ధ ప్రభుత్వం వ్యవసాయ అభివృద్ధి పట్ల చూపలేదు. నీటిపారుదల సౌకర్యాలు, రైతుకు రుణసదుపాయాలు కలుగజేయడంలో ప్రభుత్వం శ్రద్ధ వహించలేదు. భారీ ఆనకట్టల నిర్మాణం చేపట్టినప్పటికి, పూర్వం నుంచి వస్తున్న బావులు, చెరువులు నిర్వహణలో శ్రద్ధ చూపలేదు; కొత్త చెరువుల నిర్మాణం చేపట్టలేదు. తరచుగా సంభవించే కరువు, కాటకాలు రైతుల పరిస్థితిని మరింతగా దిగజార్చాయి.

9. రుణభారం పెరిగింది. ఎన్ని కష్టాలు వచ్చినా తరతరాలుగా వస్తున్న వ్యవసాయ వృత్తిని వదులుకోడానికి రైతులు ఇష్టపడలేదు. అప్పులు చేసి ప్రభుత్వానికి శిస్తులు చెల్లించడం పరిపాటి అయింది. అప్పులిచ్చి షావుకార్లు రైతుల భూములను తాకట్టు పెట్టుకునేవారు. వాయిదా మేరకు, రైతులు అప్పు చెల్లించని పక్షంలో, షావుకార్లు వారిపై దావా వేసి, న్యాయస్థానాల నుంచి డిక్రీలు పొంది, రైతుల భూములను స్వాధీనం చేసుకొనేవారు. బ్రిటీష్‌వారు చేసిన చట్టాలు కూడా షావుకార్లకు అనుకూలముగాను, రైతులకు ప్రతికూలముగానూ పరిణమించాయి. రైతులకు భూమిపై హక్కులు కల్పించుట వలన అతడు అడిగినదే తడవుగా షావుకార్లు అప్పులిచ్చేవారు. రైతుకు అక్షర జ్ఞానం లేని కారణంగా, వ్యవహారాలన్నీ రాతపూర్వకముగా జరగడం చేతను, ఒక్క పర్యాయం రుణగ్రస్థుడైనా, అతని సంతతివారు కూడా ఆ ఉచ్చు నుంచి తప్పించుకోలేక, తరతరాలుగా ఆ రుణ బంధంలో ఇరుక్కునేవారు. విముక్తి లభించడం అరుదు. గ్రామ ప్రాంతాలలో షావుకార్లకు వడ్డీవ్యాపారం ద్వారా ధనం కూడబెట్టుకునే అవకాశం ఎన్నో రెట్లు పెరిగింది.

10. వ్యవసాయాభివృద్ధి కుంటుపడింది. పూర్వపు రాజుల వలె నీటిపారుదల సౌకర్యాలు కల్పించడం గాని, ఉన్నవాటికి మరమ్మత్తులు సకాలంలో చేయించడం గాని జరుగలేదు. పూర్వపు రాజులు, పంటలు బాగా పండినప్పుడు ధాన్యసేకరణ చేసి కరువుకాటకాల సందర్భాలలో దానిని ప్రజాపోషణకు వినియోగించేవారు. కంపెనీ ప్రభుత్వం ఈ పద్ధతిని పాటించలేదు. శిస్తు వసూలు ధన రూపంలో ఉండడం, పండిన పంటకు గిట్టుబాటు ధర లేని కారణంగా రైతులు నష్టపోయేవారు. క్షామాలు ఈ బాధలను అధికం చేశాయి. లక్షలాది ప్రజలు మరణించారు. పశుసంపద నశించింది. పొలాలు బీడువారి, కొన్ని సంవత్సరాలు వ్యవసాయ యోగ్యం కాలేదు. స్వలాభమే లక్ష్యమయిన కంపెనీ, దాని అధికారులు దయాదాక్షిణ్యాలు చూపకపోవడంతో, రైత్వారీ పద్ధతిలో కూడా నరక యాతనలు అనుభవించారు.

11. గ్రామీణ కుటీర పరిశ్రమలు, వృత్తికళలు క్షీణించడంతో వ్యవసాయరంగంపై ఒత్తిడి పెరిగింది. ఇతర వృత్తికారులు వేరే ఉపాధి లేకపోవడంతో, వ్యవసాయ రంగంలోకే ప్రవేశించారు. మొత్తంగా వ్యవసాయరంగం వలస పాలనా ప్రయోజనాలకు

అనుగుణంగా మలచబడింది.

### 3.8 సమీక్ష:

రైతుకు, ప్రభుత్వానికి మధ్య శిస్తుకు సంబంధించిన సంబంధాలను క్రమబద్ధం చేసే ప్రయత్నాన్ని వివిధ భూమిశిస్తు విధానాలు చేశాయి. రైతుకు ప్రభుత్వానికి నడుమ మధ్యవర్తి శాశ్వత శిస్తు విధానంలో ఉండగా, రైత్వారీ విధానంలో రైతుకి, ప్రభుత్వానికి ప్రత్యక్ష సంబంధాలుంటాయి. ఈ రెండు విధానాల వలన ఆయాప్రాంతాలకు చేకూరిన విశేష ప్రయోజనాలేమీలేవు. జమీందారీ విధానంతో పోలిస్తే రైత్వారీ విధానంలో కొంత వెసులుబాటు ఉన్నప్పటికి, రెండు విధానాలలోను అధిక, శిస్తుల ద్వారా రైతులు నష్టపోయారు. వ్యవసాయరంగం సంక్షోభంలో పడింది. వ్యవసాయం వాణిజ్యీకరణకు గురైంది. భూమి ఒక మారకపు సరుకు అయింది. గ్రామీణ రుణగ్రస్థత పెరిగింది. కమతాల విభజన తీవ్రతరమైంది. గ్రామీణ హస్తకళలు, కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. వ్యవసాయంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఈ మార్పులన్నీ సాంప్రదాయ గ్రామీణ ఆర్థిక నిర్మాణాన్ని ఛేదించి, భారత వ్యవసాయరంగం ప్రపంచ మార్కెట్లుతో అనుసంధానించబడింది.

### 3.9 నమూనా ప్రశ్నలు:

1. ఆంగ్ల పాలనలోని భూస్వామ్య పద్ధతులను వివరింపుము.
2. శాశ్వత శిస్తు విధానములోని ముఖ్య అంశాలను, వాని మంచి చెడ్డలను వివరించుము.
3. రైత్వారీ శిస్తు విధానాన్ని వివరించి, దానిలోని గుణదోషాలను చర్చించుము.
4. బ్రిటీష్ భూస్వామ్య పద్ధతుల ఫలితాలను విశ్లేషించుము.

### 3.10 ఉపయుక్త గ్రంథాలు:


1. R.C. Dutt : The Economic History of India. Vols. I & II
2. Nilmani Mukherjee : The Ryotwari System in Madras
3. R.C. Raychoudhary : Social, Cultural and Economic History of India (Modern times)
4. Dharma Kumar (Ed) : The Cambridge Economic History of India


-డా॥ బి. సుధాకర రెడ్డి

పాఠము - 4

# నీటిపారుదల సౌకర్యాలు

### *4.0* లక్ష్యం :-

బ్రిటీష్ ప్రభుత్వ నీటిపారుదల విధానాన్ని, గోదావరీ ఆనకట్ట నిర్మాణాన్ని కృష్ణానది, ఆనకట్ట నిర్మాణాన్ని, ఈ రెండు ప్రాజెక్టుల వలన కలిగిన ఫలితాల గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం :-**


4.1 పరిచయం

4.2 ప్రభుత్వ విధానం

4.3 భారీప్రాజెక్టులు

4.4 గోదావరి ఆనకట్ట

4.4.1 ఆనకట్ట ప్రతిపాదనలు

4.4.2 ఆనకట్ట పనులు

4.5 కృష్ణానది ఆనకట్ట

4.6 నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

4.7 కడప - కర్నూలు కాలువ

4.8 ఫలితాలు

4.9 సమీక్ష

4.10 నమూనా ప్రశ్నలు

4.11 ఉపయుక్త గ్రంథాలు

### 4.1 పరిచయం :-

అనావృష్టి నుంచి, క్షామాల నుంచి పంటలను రక్షించుకోవడం కోసం నీటివసతులు ఏర్పాటు చేసుకోవడం అనాది నుంచి భారతీయులు పాటించిన సాంప్రదాయమే. తాగునీరు, సాగునీరు పుష్కలంగా లభించే ఏర్పాట్లు చేసుకోవడంతో బాటు వ్యవసాయానికి అదనపు సౌకర్యం ఏర్పడుతోంది. ప్రధాన నదుల నుంచి కాలువలను ఏర్పాటు చేసికోడం ద్వారా ప్రయాణాలకు, వర్తక వ్యాపారాలకు అనువుగా ఉంటుంది. ఈ విధంగా నీటిపారుదల సౌకర్యాలు ప్రజలకు, ప్రభుత్వానికి మేలు చేసే కార్యక్రమాలు కనుక ప్రాచీన, మధ్యయుగాల నుంచి కొనసాగుతూ వచ్చాయి. చక్రవర్తులు, రాజులు, సామంతులు, ధనికులు, దాతలు బావులను, చెరువులను నిర్మించడం పుణ్యకార్యంగా భావించారు. వాటి సంరక్షణకై మాన్యాల నిచ్చేవారు. దేశంలో అధికభాగం భూములు కేవలం వర్షాధారంతోనే పండేవి. వర్షాల ద్వారా బావులు, చెరువులు నిండేవి. వాటి ద్వారా నీటి పారుదలకు వ్యవసాయదారులు ఏర్పాట్లు చేసుకొనేవారు. ఏతముల ద్వారా పొలాలకు నీరు తోడుతుండేవారు. తోడిపోయడానికి కొయ్య పాత్రలను, తోలుసంచులను ఉపయోగించేవారు. ఎద్దుల ద్వారా మోటతోలే ఏర్పాటు కూడా ఉండేది. చెక్క, తాడు, మట్టికుండల సమ్మేళనంతో చేసిన సాఖియా అనే సాధనం అధునాతనంగా భావించబడేది. అయితే దీని ధర ఎక్కువగా ఉండడం వలన సాధారణ రైతులు దీనిని ఉపయోగించగలిగే వారు కాదు. చెరువుల ద్వారా సాగు అమితంగా సాగేది. బ్రిటీష్ ప్రభుత్వం, మొదట ఉదాశీనత ప్రదర్శించినా, తరువాత కాలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, అధిక పెట్టుబడితో, భారీ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది.

### 4.2 ప్రభుత్వ విధానం :-

తూర్పు ఇండియా కంపెనీకి వర్తక వ్యాపారాలు, వాణిజ్య లాభాలే ప్రధానం కనుక సాగు నీటి సౌకర్యాల పట్ల ఉదాసీనతనే కనపరచారు. పన్ను వసూలులో కంపెనీ చూపిన శ్రద్ధ, చొరవ వ్యవసాయ సౌకర్యాలు కలిగించడంలో చూపలేదు. కరువు కాటకాలలో వేలాది మంది మరణించినప్పటికీ, వారు ఏమీ పట్టనట్లుగానే ఉండిపోయారు. తరచుగా సంభవిస్తున్న కరువుల కారణంగా క్షీణించిన ఆదాయం కంపెనీని పునరాలోచించేట్లు చేసింది. అనుకూలించని వాతావరణ పరిస్థితిని ఎదుర్కొనేందుకు నీటి సౌకర్యాలు కల్పించక తప్పదని గ్రహించారు. పాత తరం సౌకర్యాలనే మరమ్మత్తులు చేసి సద్వినియోగ పరచినప్పటికీ, దీని వలన పూర్తి మేలు జరుగలేదు.

బ్రిటీష్ పాలనలో 1850 వరకు కాలువల నిర్మాణం వంటి పనులు మిలిటరీ బోర్డ్ వారి ఆధ్వర్యంలో జరిగాయి. తరువాత రాయల్ ఇంజినీర్లు ఈ బాధ్యతను వహించారు.

పాత జలాధారాలను అభివృద్ధి చేయడానికి 1823లో జనరల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇర్రిగేషన్‌ని నియమించడం జరిగింది. యమునా నది కాలువలకు మరమ్మత్తు, గంగానది కాలువ నిర్మాణం, కావేరీ నదికి మరమ్మత్తులు, కోలిరూన్ నదిపై శాశ్విత ఆనకట్టను ముగించారు. ఈ పనుల తరువాతే 1847లో గోదావరి, 1852లో కృష్ణానదిపైనా ఆనకట్టలు నిర్మించడం జరిగింది. ఇవిగాక దేశమంతా చెరువుల మరమ్మత్తు. వివిధ ప్రాంతాలలో నూతన కాలువల నిర్మాణం జరిగింది. కంపెనీ, నీటిపారుదల విషయంలో, 1820 నుంచి శ్రద్ధ చూపడం ప్రారభించింది. ఇంగ్లండులోని డైరక్టర్లు కూడా దీనిపై ఆసక్తి చూపారు. సామాన్య ప్రజానీకానికి కలిగే సౌకర్యాలతోబాటు ప్రభుత్వానికి కూడా ఆర్థిక లాభాలు కలుగుతాయని వారి ఆకాంక్ష.

నీటిపారుదలను ఇంకా అభివృద్ధి చేయడానికి ఆంగ్ల ప్రభుత్వం వానిని ప్రైవేటు సంస్థలకు యిచ్చి, ప్రోత్సహించింది. వారి పెట్టుబడులపై 5% గ్యారంటీ ఇచ్చే పద్ధతిని అవలంభించింది. ఈ బాధ్యత నిర్వర్తించడానికి ఇంగ్లండులోని రెండు కంపెనీలు ముందుకు వచ్చాయి. "ది మద్రాస్ ఇర్రిగేషన్ అండ్ కెనాల్ కంపెనీ" 1858లోనూ, "ది ఈస్ట్ ఇండియన్ ఇర్రిగేషన్ కెనాల్ కంపెనీ" 1863లోనూ ఏర్పడ్డాయి. అయితే ఈ రెండు సంస్థలు కూడా ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రభుత్వం

మొదట సబ్సిడీల నిచ్చినప్పటికీ, వాటి పరిస్థితి మెరుగవక పోవడంతో, చివరగా వాటిని స్వాధీనపరచుకుంది. ఈ అనుభవాల ఫలితంగా సాగునీటి నిర్మాణ కార్యక్రమాలు ప్రైవేటు కంపెనీల కివ్వరాదనీ, ప్రభుత్వమే రుణనిధుల (లోన్ ఫండ్స్) ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది.

రుణ నిధుల విధానం కూడా నీటిపారుదల కార్యక్రమాలను ఉధృతం చేయలేకపోయింది. రైల్వేల విసరణే నీటిపారుదల కంటే, ఎక్కువ లాభకరమని ప్రభుత్వం భావించింది. వ్యవసాయిక దేశాన్ని పరిపాలించే ప్రభుత్వం నీటిపారుదల వసతులను అలక్ష్యం చేసి, రైల్వే నిర్మాణంపై మొగ్గు చూపింది. 1880 నాటికి రైల్వేల మీద జరిగిన వ్యయం 125 మిలియన్ పౌన్లు కాగా, నీటిపారుదల అభివృద్ధికోసం 12 మిలియన్ల పౌన్లు మాత్రమే వ్యయం చేయడం జరిగింది.

ప్రజానాయకుల ఆందోళన వలన, ఫామిన్ కమిషన్ 1880లో చేసిన సిఫారసు వలన ఆంగ్ల ప్రభుత్వం ఎట్టకేలకు నీటిపారుదల సౌకర్యాలపై దృష్టి పెట్టక తప్పలేదు.

లార్డ్ కర్జన్ ప్రభుత్వం 1901లో ఇర్రిగేషన్ కమిషన్‌ని నియమించింది. దీని సలహామేరకు ప్రభుత్వం రక్షణ నిర్మాణాలు (ప్రొటెక్టివ్ వర్క్స్) చేపట్టింది. క్షామ ప్రాంతాలకు సహాయం చేయడం, అక్కడి రైతులకు తక్కావి రుణ సౌకర్యాలను కల్పించింది. 1903 నుండి 1921 మధ్యన దేశంలో 45 చోట్ల సాగునీటి కార్యక్రమాలు చేపట్టారు.

ఇర్రిగేషన్ పనులను ప్రభుత్వం మేజరు, మైనరు పనులుగా వర్గీకరించుకుంది. మేజరు ఇర్రిగేషన్ పనులను తిరిగి ఉత్పత్తిదాయకములని (ప్రొడక్టివ్ వర్క్స్), రక్షకములని (ప్రొటెక్టివ్ వర్క్స్) విభజించుకుంది. మేజరు ఇర్రిగేషన్ పనులలో అధికభాగం పంటల ఉత్పత్తికి సహకరించేవే. కరువు సమయాల్లో పేదప్రజలకు పని కల్పించడానికి ప్రభుత్వం చేపట్టేవి రక్షక పనులు.

మైనరు ఇర్రిగేషన్ పనులను స్థానిక సంస్థలు నిర్వర్తిస్తాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన గ్రామీణ తటాకాలను తవ్వించడం, మరమ్మత్తులు చేయించడం ఈ తరగతిలోకి వస్తాయి.

మాంటేగు-చెమ్స్‌ఫర్డ్ 1919లో ప్రవేశపెట్టిన సంస్కరణల ద్వారా ఇర్రిగేషన్ రాష్ట్రశాఖగా మారింది. అంతకుముందు ఇది కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. రాష్ట్రశాఖగా మారిన తరువాత నీటిపారుదల సౌకర్యం హెచ్చింది. దేశంలో ఆహారోత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం పెద్ద ప్రాజెక్టులను నిర్మించింది.

బ్రిటీష్ ప్రభుత్వం పాలనా ప్రారంభదశలో జలాశయాల నిర్వహణ విషయంలో అనుభవమున్న అనేక స్థానికులను పరిపాలనా సంస్కరణల పేరుతో తొలగించింది. కంపెనీ ఉద్యోగులకే నీటివనరుల బాధ్యతను అప్పగించింది. అయితే కంపెనీ ఉద్యోగులకు అనుభవమూ, ఆసక్తీ రెండు లేకపోవడంతో త్వరలోనే జలాశయాలు నిర్లక్ష్యానికి గురై అయ్యాయి. భూమిశిస్తును సక్రమంగా వసూలు చేయడంలో చూపిన శ్రద్ధ, చెరువుల మరమ్మత్తులపై గాని, వాటిని శాస్త్రీయంగా పరిరక్షించే పద్ధతులపై గాని చూపలేదు. తర్వాత చెరువు మరమ్మత్తుకై సూపరింటెండెంట్ ఇంజనీరు నియమితుడయ్యాడు. దేశంలో నీటి పారుదలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మొదటి కార్యాలయం ఇదే. మరమ్మత్తులకై అనేక మంది సివిల్ ఇంజనీర్లు నియమితమవుతున్న కారణంగా 1819లో మద్రాసులో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేకశాఖ ఏర్పడింది. పబ్లిక్ వర్క్స్‌శాఖ 1855 నుంచి సివిల్ వ్యవహారాలను నిర్వహించసాగింది.

ప్రణాళికా బద్ధంగా నీటి సౌకర్యాలను బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పరచలేదు. భారీ ప్రాజెక్టులను నిర్మించినప్పటికీ, వానిపై కంటే, కాలువలపై లాభాలు వస్తున్నాయని ఎక్కువ శ్రద్ధ చూపింది. తరువాత రైల్వేలపై వచ్చే ఆదాయంతో పోల్చుకొని, నీటి వనరులపై ఉదాశీనత చూపసాగింది.

### 4.3 భారీ ప్రాజెక్టులు :-

ఆంధ్రాలో నిర్మించబడిన రెండు ప్రాజెక్టులకు గోదావరీ, కృష్ణా - రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్. ఇతని నిరంతర శ్రమ, కఠోర దీక్ష వలననే ఆనకట్టలు ఏర్పడ్డాయి. బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఒప్పించి, చిరకాల ప్రయోజనాలు సిద్ధింపజేసే రెండు ఆనకట్టలను నిర్మింపజేసాడు. గోదావరి నీరు సముద్రంపాలు కాకుండా నిలువరించేందుకు ఆయన 1844, 1845లలో రెండు ప్రత్యేక నివేదికలు అందించాడు. ఆయన మానవత్వం ఈ క్రింది ప్రకటన ద్వారా తెలుస్తోంది. "పేదరికం, అజ్ఞానం, నిరక్షరాస్యత భారతీయులను పట్టిపీడిస్తున్న మహమ్మారులు. వాటిని నిర్మూలించడానికి ఏ బ్రిటీష్ అధికారి అయినా ప్రయత్నిస్తున్నాడా? బ్రిటీషర్లు పన్నులు వసూలు చేసుకునే బిల్లు కలెక్టర్లేగాని, ప్రజాక్షేమం కోరే రాజనీతిజ్ఞులుకారు" అని కాటన్ ఆవేదన చెందేవాడు. స్థానికుల సంక్షేమాన్ని కోరి, దానిపై నిరంతర శ్రమ చేసిన బ్రిటీష్ ఉద్యోగులలో కాటన్ ప్రముఖుడు.

### 4.4 గోదావరి ఆనకట్ట :-

గోదావరీ నది పడమటి కనుమలలోని నాసిక్ త్రయంబకంలో పుట్టి, ఆంధ్రప్రదేశ్‌లో పయనించి, చివరకు బంగాళాఖాతంలో కలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి పయనించిన దూరం దాదాపు 225 మైళ్ళు.

### 4.4.1 ఆనకట్ట ప్రతిపాదనలు :-

గోదావరీ నదీ జలాలు సాగులోనికి తీసికొని రావడానికి 1789వ సంవత్సరంలో మేజర్ బీట్సన్, మైకేల్ టాపింగులు ప్రతిపాదనలు చేసారు. కాని ప్రభుత్వం స్పందించలేదు. ఉత్తరసర్కారుల నుంచి ముఖ్యంగా రాజమండ్రి జిల్లానుంచి, ఏటేటా తగ్గుతున్న ఆదాయానికి కారణాలు తెలియజేయమని హెన్రీమాంట్ గోమేరీని నియమించారు. ఆయన తన నివేదికలో "వ్యవసాయం పూర్తిగా పాడయింది. ధరలు పడిపోయాయి. కరువులు, కాటకాలూ, వర్షాభావం, వరదల వంటి ఈతిబాధలతో, కౌళ్ల శిస్తుల భారంతో, విపరీతపు ప్రాణనష్టంతో, జమీందారుల దుండగాలతో, నీటిపారుదల సౌకర్యాల కొరతతో, ముఠాదారుల లంచగొండితనంతో, రెవెన్యూ అధికారుల అదనపు లంచగొండితనంతో, ఉత్తర సర్కారుల్లోని రైతులు అన్ని విధాలా నాశనమై పోయారు. శిస్తులు చెల్లించలేని స్థితిలో, శిస్తుల బకాయిలు హెచ్చు అయ్యాయి" అని వ్యాఖ్యానించాడు. ఈ నివేదికను 1844లో ప్రభుత్వానికి అందజేసాడు.

ఇతని దర్యాప్తు సమయానికి పన్నెండు సంవత్సరాల ముందు నుంచి ఉన్న అధమ పరిస్థితులలో మార్పు ఏమీలేదు. గోదావరీ ప్రాంతంలోనే 1821-22లలో 7,38,308 మంది ఉన్న జనాభా 1842 నాటికి 5,61,402కి దిగజారింది. జమీందారులు ఎవరూ పాతశిస్తు బాకీలను చెల్లించలేని స్థితిలో ఉండడం వలన సర్‌థామస్ మన్రో వారి భూములన్నిటినీ ప్రభుత్వపరం చేయమని ఉత్తర్వులు జారీచేసాడు. పాత జమీందారులు, కొత్త జమీందారులు కూడా ఆస్తికి మించిన అప్పులు చేసి, హోదాలు పెంచుకొని, ఆదాయానికి ఆధారమయిన రైతులను ఎన్నో బాధలకు గురిచేసి, వారిని ధ్వంసం చేసి, వీరూ ధ్వంసమయ్యారు. వ్యవసాయం పూర్తిగా పాడైంది.

హెన్రీ మాంట్‌గొమేరీ నివేదికపై వెంటనే స్పందించిన ప్రభుత్వం సర్‌ఆర్థర్ కాటన్‌ని ఆనకట్ట వలన ప్రభుత్వానికి ప్రజలకు రాగల ప్రయోజనాలను పరిశీలించమంది. అతడు తన మొదటి నివేదికను 1844 లోనూ, రెండవ నివేదికను 1845లోనూ ప్రభుత్వానికి పంపాడు. మొత్తం 13 లక్షల ఎకరాల భూమిలో, పదిలక్షల ఎకరాల వరి, చెరుకు పంటలకు అనుకూలమని ఆయన నిర్ధారించాడు. ఆనకట్ట వలన రాజమండ్రిలో సాగుచేయడానికి పనికి వచ్చే 81,000 ఎకరాల్లో, మొత్తం రూపాయలు 30,20,000 ఖరీదు చేసే పంట పండుతుందని, దాని వల్ల ప్రభుత్వానికి రూ15,00,000 ఆదాయం వస్తుందని నిర్ణయించారు.

ఒక గవర్నమెంటు భూములపైననే ఇరవై లక్షల రూపాయిల ఆదాయం వస్తుందని అంచనా వేసారు. చెరుకు పండించే రైతులు, నీటి పన్ను కింద, ఎకరానికి ఒక రూపాయి చొప్పున, చెల్లించినా ఇంకా ఎంతో ఎక్కువ ఆదాయం రావడానికి ఆస్కారం ఉందని తెలిపాడు. గంటకి 4,20,000 క్యూబిక్ గజాల నీరు సముద్రంలోకి పోతోందని, దానిని వ్యవసాయానికి వినియోగిస్తే వచ్చే ఆదాయం సాలీనా 50 లక్షల రూపాయలని తెలిపాడు. బ్రిటీష్‌వారిని ఒప్పించే నిమిత్తం కాటన్ మరిన్ని వివరాలను ఇచ్చాడు. గోదావరి ఆనకట్ట ప్రాజెక్ట్ అంచనా పన్నెండు లక్షల రూపాయిలని, అందులో ఆనకట్ట ఖర్చు ఐదు లక్షల రూపాయలని, ఏటా రెండున్నర లక్షల రూపాయిల ఆదాయం చొప్పున రెండు సంవత్సరాల్లో కంపెనీ పెట్టుబడి వచ్చేస్తుందని, తరువాత సంవత్సరం నుంచి ఏటా రెండున్నర లక్షల అదనపు ఆదాయం కంపెనీకి లభిస్తుందని తెలియజెప్పాడు. చెరుకు పంటను పెంచితే నూటికి నూరు రెట్లు ప్రభుత్వానికి లాభం వస్తుందని నచ్చ చెప్పాడు. కాని బోర్డు ఆఫ్ డైరక్టర్లు అయనను తీవ్ర విమర్శలకు గురిచేసారు. వీనిని లెక్కజేయకుండా, కాటన్ తన వాదాన్ని మానవత్వపు కోణం నుంచి తెలియజెప్పే ప్రయత్నం చేసాడు. "ఆనకట్ట కట్టకపోతే, రెవెన్యూ నష్టం కంటే, సాలీనా లక్షల కొద్దీ ప్రజలు, కరువు కాటకాల దుర్భిక్షంతో బాధపడకుండా, సుఖజీవనానికి వీలు కలిగించడం, మానవత్వం చూపించడం, మన ప్రభుత్వానికి ఎంతో శ్రేయస్కరం అన్న ఆలోచన చాలా ముఖ్యమయింది. గత ఇరవై సంవత్సరాలలో ఈ ఆనకట్టను నిర్మించి ఉంటే లక్షలాది ప్రజల ప్రాణాలు కాపాడబడి ఉండేవి" అన్నాడు. కాటన్ ప్రతిపాదనలను పరిశీలించే సభ్యులు కూడా తమ అంగీకారాన్ని తెలియజేశారు. "ఆనకట్ట కట్టడం కోసం వ్యయం చేసే కాలపరిమితియే, నష్టానికి కొలబద్ద. ఎంత త్వరలో గోదావరి ఆనకట్టను కడితే, రెవెన్యూ నష్టం రాకపోవడమే కాకుండా, ఎన్నో రెట్లు అదనపు ఆదాయం రావడం తథ్యం" అని వ్యాఖ్యానించారు. ప్రజలకు యుద్ధ ప్రమాదం తరువాత కావలసినంత నీటి సరఫరాయే అతి ముఖ్యమైన రక్షణ అని కాటన్ పేర్కొన్నాడు. ప్రజలపై అధికారం సద్వినియోగం చేసుకోడానికి, గోదావరి ఆనకట్ట ఒకటేకాక ఎన్నో అటువంటి సదుపాయాలు కల్పించగలగడం భగవంతుడు తమ జాతికి, తమ విజ్ఞానానికి, మతానికి ఇచ్చిన అవకాశంగా అతడు భావించాడు.

### *4.4.2 ఆనకట్ట పనులు :-*

"అపార జలసంపదలకు పుట్టిల్లు భారతావని. ఇక్కడ నీటి నిల్వకు ఉన్న అనుకూల వాతావరణం ప్రపంచంలోని మరే ఇతర ప్రాంతాలకు లేసిపోనిది" అని గుర్తించిన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ప్రాజెక్ట్‌కి ఆంగ్ల ప్రభుత్వాన్ని ఒప్పించాడు. పాపి కొండల నుంచి సాగరం దాకా గోదావరి ప్రవాహాన్ని అణువణువునా శోధించి, వాలుని అంచనావేసి, డెల్టా తలకట్టు ప్రాంతమైన ధవళేశ్వరం వద్ద ప్రాజెక్ట్ పనులను 1847లో చేపట్టారు. దీని నిర్మాణం మార్చి 31, 1852వ సంవత్సరానికి ముగిసింది. ఈ పనిలో 10,000 మంది కూలీలు, 500 మంది వడ్రంగులు, 500 మంది కమ్మరులు పాల్గొన్నారు. గోదావరి ఆనకట్ట పనులకై 1847 నుంచి 1894 వరకు రూ 1,28,08,662 లు వ్యయం చేసారు.

ఆనకట్ట పనిలో పాల్గొన్న స్వదేశీయులలో వీణం వీరన్నను కాటన్ విస్తృతంగా ప్రస్తావించారు. అతడు కనుక తనకు దొరకకపోయినచో, అంతటి గొప్ప పనిని నిర్వహించలేకపోయి ఉండెడి వాడనని తెలుపుచూ, వీరన్నను ఉన్నతోద్యోగానికి రావుబహద్దూర్ బిరుదుకి అర్హునిగా ఎంపిక చేసాడు.

గోదావరీ ఆనకట్ట ముఖ్యంగా ఈస్టర్న్ డెల్టా కెనాల్ సిస్టం, సెంట్రల్ డెల్టా కెనాల్ సిస్టం, వెస్టర్న్ డెల్టా కెనాల్ సిస్టం అను మూడు భాగాలుగా విభజింపబడింది. ఈ కాలువల ద్వారా నీటిని పారించి, గోదావరీ జిల్లాని సస్యశ్యామలం చేసారు.

పంటలు బాగా పండడం వలన రైతులు క్రమం తప్పకుండా భూమిశిస్తు చెల్లించేవారు. దీని వలన ప్రభుత్వ ఆదాయం పెరిగింది. గంజాం, విశాఖపట్నం, జిల్లాల నుంచి ప్రజలు వలస వచ్చి, గోదావరీ పరివాహక ప్రాంతాలలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. గోదావరీ జిల్లా జనాభా కూడా పెరిగింది. జనాభా 1851వ సంవత్సరంలో 1,012,236 ఉండగా, ఈ సంఖ్య 1892కి 2,078,782 పెరిగింది. రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి.

**4.5 కృష్ణానది ఆనకట్ట :-**

కృష్ణానది పడమటి కనుమలలోని అరేబియా సముద్రమునకు 40 మైళ్ళ దూరంలో ఉన్న మహారాష్ట్రంలోని మహాబలేశ్వరం వద్ద పుట్టి, దాదాపు 300 మైళ్ళు మహారాష్ట్రలో పయనించి, కర్నాటక రాష్ట్రంలోని బెల్గాం జిల్లాలోకి ప్రవేశించి, 183 మైళ్ళు కర్నాటకలో ప్రవహించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని తంగడిగి అను గ్రామంలోకి ప్రవేశించింది. నల్గొండ జిల్లా వజీరాబాదు వద్ద మూసీనది కలుస్తుంది. తూర్పుకనుములకు చేరిన తరువాత ఒక్కసారిగా ఆగ్నేయ దిశకు మారి, కృష్ణా, గుంటూరు జిల్లాల సరిహద్దులలో వంద మైళ్ల దూరం ప్రవహించి, చివరకు బంగాళాఖాతంలో కలుస్తోంది.

బ్రిటీష్ ఉద్యోగి అయిన మేజర్ అలెగ్జాండర్ బీట్సన్ మొట్టమొదటిసారిగా 1792లో కృష్ణానదిపై బెజవాడ వద్ద ఆనకట్ట కట్టవచ్చని సూచించాడు. అప్పుడు ప్రభుత్వము మైకేల్ టాపింగ్‌ని సంప్రదించింది. అతడు మూడు సంవత్సరాలు కృష్ణానది గమనాన్ని పర్యవేక్షించి బీట్సన్ ఆలచనను బలపరచినప్పటికి అది కార్యరూపం దాల్చలేదు. అయితే 1832-33లలో గుంటూరులో వచ్చిన నందన కరువుతో కంపెనీవారు తిరిగి ఈ ఆలోచనను పరిశీలించారు. అయితే రెవెన్యూ బోర్డు 1940లో కృష్ణానదిపై నిర్మాణం నిష్ప్రయోజనమేగాక, చేయలేని పని అని భావించింది.

సర్ ఆర్థర్ కాటన్ రెవెన్యూ బోర్డుకి ఆనకట్ట పని సాధ్యమనీ, అది ప్రజలకు ప్రభుత్వానికి మేలు చేస్తుందని వాదించాడు. చివరకు 1851లో బెజవాడ వద్ద ఆనకట్ట పనికి 15 లక్షల రూపాయిల ఖర్చుతో ప్రభుత్వం ఆమోదించింది. 1852లో కెప్టెన్ సి.ఎ.ఓర్ యాజమాన్యంలో నిర్మాణ పనులు ఆరంభమయ్యాయి.

బెజవాడ దగ్గర రెండు కొండల మధ్య ఉన్న స్థలాన్ని ఆనకట్టకై నిర్ణయించారు. నీటిలోని ఇసుక పరుపుపై రాళ్ళు, సున్నం ఉపయోగించి పునాదులు వేసారు. పదిహేను అడుగుల ఎత్తుతో నిర్మాణం 1855 నాటికి పూర్తి అయింది. దీనికి అప్పుడు అయిన ఖర్చు రూ 15 లక్షలు. ఆనకట్ట ఎత్తును ఒకసారి ఒక అడుగుకు, రెండవసారి (1935లో) మరో మూడు అడుగులకు పెంచారు. ఆనకట్ట నుంచి పంట పొలాలకు నీరు చేరవేసే కాలువలకు ఇంకో పదిహేను లక్షలు ఖర్చు అయింది. ఆనకట్ట అభివృద్ధి పనులను 1961 వరకు చేస్తూనే ఉన్నారు; ఎత్తునీ తిరిగి పెంచారు.

కాలువలు: ఈ ఆనకట్ట నీటిని రెండు ప్రధాన కాలువల ద్వారా సాగునీటికి ఉపయోగించి, సస్యశ్యామలం చేసారు. తూర్పు డెల్టా కెనాల్ మరియు పశ్చిమ డెల్టా కెనాలు ఆ రెండు ప్రధాన కాలువలు.

తూర్పు డెల్టా కెనాల్ నుంచి వచ్చే ఏలూరు కాలువ, బందరు కాలువలు లక్షల ఎకరాల భూములకి సాగునీటిని, త్రాగునీటిని అందిస్తున్నాయి. వర్తక వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడ్డాయి.

కృష్ణానది నుంచి వచ్చే కాలువలు అనేక ఎకరాల భూమికి సాగునీటి వసతి కల్పిస్తున్నాయి. పశ్చిమ డెల్టా కాలువల ప్రధాన కార్యాలయం సీతానగరం నది ఒడ్డున ఉంది. ముఖ్యకాలువ సీతానగరం నుంచి దుగ్గిరాల వరకు 21 కిలోమీటర్ల పొడవున ప్రవహిస్తుంది. ఆయకట్టు సుమారు 2,430 హెక్టారు. ముఖ్య కాలువ మొదటి పాయవలన ఆయకట్ట విస్తీర్ణం పెరిగి రేపల్లె, తెనాలి మొదలగు ప్రాంతాలను సుక్షేత్రంగా మారుస్తుంది. దీనిని బాంక్ కెనాల్ లేదా తీరంకాలువ అంటారు. కొమ్మమూరు కాలువ పెదగంజాం వద్ద బకింగ్ హాం కాలువలో కలుస్తుంది. దీని ఆయకట్ట తెనాలి, బాపట్ల, ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకు విస్తరించింది. నిజాంపట్నం కాలువ ఆయకట్ట తెనాలి, రేపల్లె తాలుకాల్లో ఉంది. అప్పాపురం ఛానల్ పథకం 1936-1948 మధ్య ఆరంభించబడింది. గుంటూరు కాలువ పథకం 1966లో పూర్తి అయింది.

బకింగ్ హాం కాలువ ప్రధానమయింది. దీనినే మద్రాసు కాలువ అని కూడా వ్యవహరిస్తారు. ఇది సరుకు రవాణాకు ప్రధాన జలమార్గంగా చాలా దశాబ్దాలు ఉపకరించింది.

### 4.6 నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ :-

కృష్ణానదిపై విజయపురి వద్ద నూట నలభై కోట్ల రూపాయిల వ్యయం అంచనాలతో నందికొండ ప్రాజెక్టుని ఆమోదించారు. దీనిని మొదటగా ఖోస్లాకమిటి 1951లో పరిశీలించింది. దీని నివేదికను భారత ప్లానింగ్ కమీషన్ చర్చించి పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయమని ఒక సంఘాన్ని నియమించారు. ఆ నివేదికను ఆమోదించిన తరువాత డిసెంబరు 1955లో ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ శంఖుస్థాపన చేసారు.

దీని రైట్ కెనాల్ ద్వారా గుంటూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలకు, లెఫ్ట్ కెనాల్ ద్వారా ఖమ్మం, కృష్ణా జిల్లాలకు సాగునీరు అందుతోంది. రైట్‌కెనాల్ 1,99,000 హెక్టార్ల భూమిని సాగులోకి తీసుకొని రాగా, లెఫ్ట్ కెనాల్ సాగు సామర్థ్యం 35,00,000ల హెక్టార్లుగా ఉంది.

### 4.7 కడప - కర్నూలు కాలువ :-

బ్రిటీష్ ప్రభుత్వం వ్యవసాయానికి అందించిన నీటి సౌకర్యాల్లో ఇదొకటి. ఇది రాయలసీమ భూములకు బాగా ఉపకరించింది. దీనిని సర్ ఆర్థర్ కాటన్ తుంగభద్ర ప్రాజెక్ట్‌గా ప్రారంభించి, క్రీ.శ.1858లో మద్రాసు నీటిపారుదల కాలవ కంపెనీగా రిజిష్టరు అయింది. కంపెనీకి, వైశ్రాయికి 1863లో జరిగిన ఒప్పందం ప్రకారం ఒక మిలియన్ పౌండ్ల పెట్టుబడి మీద బ్రిటీష్ గవర్నమెంటు 5 శాతం గ్యారంటీ ఇవ్వడానికి అంగీకరించారు. కంపెనీ ఆర్థిక స్థితిగతులు బాగులేకపోవడం వలన, ఇంకా అప్పులు తెచ్చుకోగల శక్తి లేకపోవడం వలనా, కాలువ పనులు ఆలస్యమయ్యాయి. జూలై 1882లో కంపెనీని బ్రిటీష్ ప్రభుత్వం ఆధీనంలోకి తీసికొంది.

ఈ కాలువ తుంగభద్రానది మీద కర్నూలుకు ఎగువగా 17 మైళ్ల దూరంలో ఉన్న ఆనకట్ట నుంచి ప్రారంభం అవుతుంది. నీరును 1500 గజాల పొడుగున పంపించడానికి వీలయ్యే ఆనకట్టను సుంకేశుల వద్ద కట్టారు. ఈ కాలువ 1871వ సంవత్సరంలో పూర్తి అయింది. క్రీ.శ 1871-72 నాటికి సాగుబడికి కావలసిన నీరు 14,700 ఎకరాలకు చేరి, సాలీనా రూ. 50,650ల ఆదాయం సంపాదించింది. ఎకరానికి మూడు రూపాయిల చొప్పున నీటిపన్ను వసూలు చేసారు. కడప-కర్నూలు కాలువ 30,000 ఎకరాలకు నీరు సమకూర్చి, రూ. 1,80,000 ఆదాయం ఇచ్చింది.

### 4.8 ఫలితాలు :-

సంవత్సరమంతా పంటలకు నీటివసతి ఏర్పడడంతో ఆదాయ వృద్ధి జరిగింది. ప్రజలు, ప్రభుత్వం లాభాల నార్జించసాగారు.

1. ఋతు పవనాలపై మాత్రమే ఆధారపడవలసిన అవసరం కొంతవరకు తగ్గడంతో, కరువుకాటకాల భయాందోళనలు రైతులకు తగ్గాయి. అధిక పెట్టుబడి పెట్టడానికి ధైర్యం వచ్చింది. భూమి, విలువలు పెరగడం ఆరంభమయింది. రైతులు మామూలు పరిస్థితుల నుంచి అభివృద్ధి చెంది, స్వతంత్ర భూస్వాములయ్యారు.
2. వ్యవసాయంలో వాణిజ్యీకరణ ప్రవేశించింది. అంతకుముందు గ్రామాల్లో ఉండే స్వయం పోషక వ్యవస్థ మార్పుచెంది, మార్కెట్లను ఉద్దేశించి ఉత్పత్తిని పెంచే ప్రక్రియ ఆరంభమయింది. బ్రిటీష్ పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకుల ఉత్పత్తిని పెంచవలసిన ఆవశ్యకత ఏర్పడడంతో వాణిజ్య పంటల సాగు అధికమయింది. వాణిజ్య పంటలను విస్తరించి, విక్రయానికై దూరప్రాంతాలకు పంపేవారు. ఈ విధంగా ఆహారధాన్యాలు కూడా వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా పండించడం జరిగింది.

3. ఆంధ్రాలో, ముఖ్యంగా, రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో, పారిశ్రామికాభివృద్ధి జరిగింది. ప్రత్తి, జనపనార, చెరుకు, పొగాకు మొదలయిన వ్యవసాయ పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ఆంధ్రా వరిసాగుకు ప్రసిద్ధిగాంచడంతో, బియ్యం మిల్లులు అధిక సంఖ్యలో స్థాపించబడి, ముఖ్య పరిశ్రమగా మారింది. ఉత్తర సర్కారులో 1911లో 60 బియ్యం మిల్లులు ఉండగా, 1921 నాటికి ఈ సంఖ్య 216కి పెరిగింది. అత్యధిక సంఖ్య కృష్ణాజిల్లా కాగా గుంటూరు, గోదావరి తురవాతి స్థానాల్లో ఉన్నాయి.

4. నీటి పారుదల నిర్మాణాలు అనేక మందికి ఉపాధిని ఏర్పరచాయి. వ్యవసాయం నీరసించిన పరిస్థితులలో కంపెనీవారి ప్రజాహిత కార్యాచరణ వారికి చాలా సహాయకారి అయింది. మార్చి 1, 1847 నుంచి ఏప్రిల్ 30, 1850 వరకు రోజుపని చేసిన కూలీల సంఖ్య 30,54,413. వీరిపై చేసిన ఖర్చు రూ. 2,39,130లు, పబ్లిక్ పనుల కోసం 1852 నుంచి ప్రతీ నెల 641 మంది ఇటుకలు తయారు చేసేవారిని 365 మందిని రాళ్ళు కొట్టేవారిని, ఇతర రోజువారి కూలీలను నియమించడం జరిగింది.

5. సేద్యపు నీటి సదుపాయం వల్ల రైతులకు వచ్చిన లాభాన్ని పంచుకోవడానికి మద్రాసు ప్రభుత్వం నీటి పన్నును విధించడానికి ముందుకు వచ్చింది. గోదావరి జిల్లాలోని అదనపు నీటి సౌకర్యానికి ఎకరానికి రెండు రూపాయల చొప్పున నీటి పన్ను విధించాలని మద్రాసు ప్రభుత్వం భావించింది. సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా ఇంకో అడుగు ముందుకువేసి పంట భూములకు వదులుతూ ఉన్న నీటిని కొలిచి ప్రభుత్వం పన్నువేయాలని చెప్పాడు. మచిలీపట్నం, గుంటూరు జిల్లాల్లో ఎకరానికి నాలుగు రూపాయలు చొప్పున నీటి పన్ను విధించారు. త్వరలోనే మచిలీపట్నంలో మొదటి పంటకి ఎకరానికి నీటిపన్నుగా రూ 6-8-0, రెండో పంటకు రూ 1-12-0, రెండు పంటలకు ఎకరానికి రూ 8-4-0 చొప్పున నిర్ణయించారు.

6. ప్రభుత్వం ఆనకట్టల వలన లాభపడింది. గోదావరి మీద కట్టిన సౌకర్యాలకి ఏటా రెండు లక్షల రూపాయిల ఆదాయం ఉంటే, కృష్ణానది మీద కట్టిన ఆనకట్ట నుంచి లాభం రూ. 1,82,320. ఈ మొత్తం కేవలం 1858-59 సంవత్సరానికే గుంటూరులోని 116 గ్రామాలకు ఇచ్చిన నీటి నుంచే వచ్చింది.

7. నదులు, కాలువల ద్వారా తక్కువ ఖర్చుతో ప్రయాణ సౌకర్యాలు ఏర్పడ్డాయి; దేశీయ వ్యాపారము సాగింది. విజ్ఞేశ్వరం లాకు నుంచి 1853-54 సంవత్సరంలోనే 204 పడవలు బియ్యం, నూనె గింజలు మొదలయిన వానితో రూ. 9,000/-ల దాకా వ్యాపారం సాగేది.

### *4.9* సమీక్ష :-

బ్రిటీష్ ప్రభుత్వవిధానం లాభాల నుద్దేసించినదే అయినప్పటికీ, నీటిపారుదల సౌకర్యం వలన తరతరాల ప్రయోజనం స్థానికులకు సమకూరింది. త్రాగునీరు, సాగునీరులతో పాటు వర్తక, వ్యాపార అభివృద్ధికి దోహదం చేసింది.

### *4.10* నమూనా ప్రశ్నలు :-

1. బ్రిటీష్ ప్రభుత్వపు నీటిపారుదల విధానాన్ని వివరించండి.

2. బ్రిటీష్ ప్రభుత్వ భారీ నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని విపులీకరించండి.

3. గోదావరీ, కృష్ణా ఆనకట్టల నిర్మాణ ఆవశ్యకతను, ప్రయోజనాలను విశ్లేషించండి.

### 4.11 ఉపయుక్త గ్రంథాలు:-


1. Lady Hope : General Sir Arthur Cotton (Calcutta, 1964)
2. గుమ్మలూరి సత్యనారాయణ : డెల్టా శిల్పి ఆర్థర్ కాటన్
3. Dildar Hussain : A Century of Irrigation
4. B.Sudhakara Reddy : Irrigation Works in the Northern Circars - A study (1766 - 1900) Visakhapatnam, 2002
5. ఎ.వి.రమణారావు : ఆంధ్రప్రదేశ్‌లో ఆటవిక ఆర్థిక జీవనం (1766-1957) హైదరాబాదు, 1991.
6. G.T. Walch : Engineering works of God favari Delta
7. Gorden Mackenzie : A Manual of the Kishna District
8. H.Morris : Manual of the Godavari District


-డా॥ బి. సుధాకర రెడ్డి

పాఠం- 5

# ఆంధ్రలో విద్యాభివృద్ధి

విషయ క్రమం


5.0 లక్ష్యం
5.1 పరిచయం
5.2 ఆంగ్ల పాలనకు ముందున్న విద్యా విధానం
5.3. క్రైస్తవ మిషనరీల కృషి
5.3.1. వివిధ జిల్లాలలో విద్యా వ్యాప్తి
5.3.2. వృత్తి విద్య, పారిశ్రామిక పాఠశాలలు
5.3.3. స్త్రీ విద్య
5.3.4. హరిజనుల విద్య
5.4 బ్రిటిష్ ప్రభుత్వ కృషి
5.5 ప్రగతిశీల ఉదారుల సంస్థల కృషి
5.6 తెలంగాణాలో విద్యా వ్యాప్తి
5.7 సారాంశం
5.8 వ్యాసరూప ప్రశ్నలు
5.9 ఉపయుక్త గ్రంథాలు


## 5.0 లక్ష్యం :

ఆంధ్రాలో విద్యాభివృద్ధికి క్రైస్తవ మిషనరీలు, బ్రిటీష్ ప్రభుత్వం, ప్రగతిశీల ఉదారుల కృషిని వివరించడమే ఈ పాఠం ముఖ్య లక్ష్యం.

## 5.1. పరిచయం :

ఆంగ్లేయుల పరిపాలన ప్రారంభానికి ముందు భారతదేశ సామాజిక, ఆర్థిక వ్యవస్థ మధ్యయుగ భూస్వామ్య లక్షణాలతో కూడుకొని వుంది. నాటి సమాజాన్ని సంస్కృతిని పట్టి పీడించిన కొన్ని చెడు లక్షణాలు : ఖర్చుతో కూడుకొన్న కర్మకాండ, పురోహితుల దోపిడి, బహు దేవతారాధన, విగ్రహారాధన, బాల్య వివాహాలు, సతీ సహగమనం, వరకట్నం, కన్యాశుల్కం, దేవదాసీ వ్యవస్థ, మతపరమైన విద్యాబోధన మొదలగునవి. భారతదేశాన్ని ఆంగ్లేయులు ఆక్రమించిన తరువాత భూస్వామ్య వ్యవస్థ స్థానంలో, పెట్టుబడిదారీ సామాజిక ఆర్థిక వ్యవస్థ ఏర్పడింది. ఫలితంగా భారతీయ ప్రజల సామాజిక వ్యవస్థ, ఆర్థిక పరిస్థితులు, విద్యావిధానం, పత్రికా ప్రచురణలో మార్పులు చోటు చేసుకొన్నాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావ ఫలితంగా భారత ప్రజలలో లౌకిక, తార్కిక, హేతువాద దృష్టి ప్రసరించింది.

## 5.2. ఆంగ్ల పాలనకు ముందున్న విద్యా విధానం :

హిందూ సమాజం కుల ప్రాతిపదికపై ఏర్పడింది. ఇటువంటి కుల విధానంలో ప్రతి కులానికి ఒక ప్రత్యేక సామాజిక విధి కేటాయించబడింది. ఈ ప్రకారం బ్రాహ్మణులొకరికే మత సిద్ధాంతాలు బోధించడానికి, పూజారులుగా పని చేయడానికి, అధ్యాపకులుగా పనిచేయడానికి వీలు కల్పించడమయింది. అందుచే వారికొక్కరికే మత, లౌకికపరమైన విద్యను అధ్యయనం చేసే హక్కు ఇవ్వబడింది. సామాన్య ప్రజలకు ప్రతి గ్రామంలో ప్రాంతీయ పాఠశాలలుండేవి. ఇవి చదవడం, రాయడం, ప్రాథమిక గణితాన్ని నేర్పేవి. స్త్రీలు, తక్కువ

కులాలవారు, వ్యవసాయదారులకు విద్యార్జన శూన్యం. ఈ విధంగా కంపెనీ పాలనకు ముందుగల ఇండియాలో హిందువులకు విద్యాభ్యాసం పరిమితమైంది. ఉన్నత విద్యకు బ్రాహ్మణులే అర్హులు. పెద్దలకు, ఉపాధ్యాయులకు, చక్రవర్తికి పూర్తి విధేయతను పాటించవలసిందిగా నాటి విద్యార్థులకు విద్యావిధానం బోధిస్తుండేది.

కంపెనీ పాలనకు ముందున్న ముస్లింలలో ఉన్నత విద్యపై ఏ ఒక్కరికి గుత్తాధిపత్యం లేదు. దీనికి ఇస్లాంలోని సాంఘిక సమానత్వం కారణమైంది. మదరసాలో ఏ ముస్లిమైనా చదువుకోవచ్చు. అయితే ఖురాన్ అరబ్బీ భాషలో ఉండడంచేత ఉన్నత విద్య అంతా అరబ్బీలో బోధించబడేది. ఖురాన్‌తోపాటు, ప్రాంతీయ భాషలు, పారశీకం ఇతర విషయాలను బోధించే పాఠశాలలు కూడా కంపెనీ పాలనకు ముందున్న పాఠశాలల్లో హేతువాద దృష్టి విద్యార్థుల్లో పెంపొందే అవకాశాలు లేకపోయింది. నాటి విద్యా విధానం విద్యార్థులను హిందువులుగా, ముస్లింలుగా తయారుచేసి, వారి మతాలకు విశ్వాస పాత్రులుగా ఉండేట్లు చేసింది. కంపెనీ పాలన మొదలైన చాలా కాలం వరకూ భారతీయులు తమ ప్రాచీన విద్యా పద్ధతులను మినహా పాశ్చాత్య దేశాలలో జరుగుతున్న శాస్త్ర జ్ఞానాభివృద్ధినిగానీ, ఇతర రాజకీయ, రాజనీతి సిద్ధాంతాలనుగాని తెలుసుకోడానికి ఉత్సాహం చూపించలేదు. ఆంగ్లేయులను దురాక్రమణ దారులుగా మాత్రమే ఊహిస్తూ వచ్చిన ముస్లింలు, ఆంగ్ల విద్య, శాస్త్ర జ్ఞానం పట్ల ఏహ్యభావాన్ని కల్గి, వాటికి దూరంగా ఉండిపోయారు. అంతేగాక రాజకీయాధికారాన్ని కోల్పోవడంతో స్థానిక సంస్థానాలు పాఠశాలలను పోషించలేకపోయాయి. ఫలితంగా పట్టణాల్లో, గ్రామాల్లో పాఠశాలలు క్షీణించసాగాయి.

## 5.3. క్రైస్తవ మిషనరీల కృషి :

ఆధునిక విద్యా వ్యాప్తిలో క్రైస్తవ మత ప్రచారకులు గొప్ప కృషి చేశారు. ప్రథమంగా ఇండియాలో మిషనరీలు ఆంగ్ల విద్యా పద్ధతిని ప్రవేశపెట్టారు. అంతేగాక బాలికలకు విద్య నేర్పే పాశ్చాత్య పద్ధతిని కూడా వీరే ప్రవేశపెట్టారు. పెద్ద పట్టణాల్లో బాలికల కోసం ప్రాథమిక పాఠశాలలు, అందులో హిందూ బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు, చదువుకోవడానికి ఇల్లు వదలని మహిళల కోసం జనానా పాఠశాలలను మిషనరీలు ఏర్పాటు చేశారు.

భారతీయులను క్రైస్తవ మతంలోనికి మార్చటాన్ని ఒక నాగరిక లక్ష్యంగా మిషనరీలు భావించారు. హిందువులలో గల బహు దేవతారాధన, కుల అసమానతలను వీరు ఖండించారు. ఇండియాలో ఆధునిక విద్యకు వీరు మార్గదర్శకులయ్యారు. వీరు స్థాపించిన విద్యా సంస్థలు లౌకిక విద్యతోబాటు, క్రైస్తవ మత బోధన కూడా చేశాయి. వీరి విద్యా సంస్థల్లో చదివిన అధిక సంఖ్యాక విద్యార్థులు ఆధునిక విద్యను గ్రహించగా, కొద్దిమంది మాత్రము క్రైస్తవులయ్యారు. విద్యా సంస్థలను స్థాపించటంలో మత ప్రచారకుల ప్రధాన ఆశయం మతపరమయినప్పటికీ ఆధునిక విద్యా వ్యాప్తిని గావించుటలో వీరు ప్రముఖ పాత్ర నిర్వహించారు.

18వ శతాబ్దపు చివరి సంవత్సరాలలో పాశ్చాత్య దేశాలలో ప్రొటెస్టంటు మత ప్రచార పునరుద్ధరణ విస్తృతంగా జరిగింది. ఫలితంగా బ్రిటన్‌లోనూ, అమెరికాలోనూ కొత్త సంఘాలు ఉద్భవించాయి. వాటిలో కొన్ని తమ సందేశాన్ని ఆసియాకు తీసుకుపోవాలని ఉత్సాహ పడ్డాయి. దక్షిణ భారతదేశంలో ఈ మత ప్రచార ఉద్యమంలో 5 సంఘాలు కీలకపాత్ర వహించాయి. అవి గాస్పెల్ ప్రచార సంఘం, లండన్ మిషనరీ సొసైటీ, చర్చి మిషన్ సొసైటీ, వెస్లియన్ మిషన్, స్కాట్లండు ఫ్రీ చర్చి మిషన్. ఈ సంఘాలు దక్షిణ భారత దేశంలో వివిధ ప్రాంతాలలో పాఠశాలలూ, మత శిక్షణా కేంద్రాలు, ముద్రణాలయాలూ ప్రారంభించాయి. అదే సమయంలో అవి తమ కార్యక్రమాలమీద కంపెనీ విధించిన నిర్బంధాలకు వ్యతిరేకంగా శక్తివంతమైన ఉద్యమం ప్రారంభించాయి. ఫలితంగా 1813లో కంపెనీ ఛార్టర్ పొడిగించినప్పుడు మత సంస్థల వ్యాప్తికి, విద్యా కార్యక్రమాలకు అవకాశం కల్పించబడింది. అపుడు పైన పేర్కొన్న మిషన్‌లు ఆంధ్ర జిల్లాలలో తమ కార్యకలాపాలు ముమ్మరంగా సాగించాయి. నాటి మతాంతరీకరణ ఉద్యమమూ, విద్యా కార్యకలాపాలు కలసి జంటగా కొనసాగాయి. క్రైస్తవుడుగా మారిన ప్రతి భారతీయుడూ తన సొంత ప్రయోజనం కొరకూ, భద్రత కొరకూ బ్రిటిష్ వాళ్ళకు విధేయుడుగా వుంటాడు గనుక, క్రైస్తవ మత వ్యాప్తి అంతిమంగా భారతదేశంలో బ్రిటిష్ స్థానాన్ని పటిష్ఠ పరుస్తుందని మిషనరీలు నొక్కి చెప్పారు. ఈ వాదాలు ప్రభుత్వాన్ని ప్రభావితం చేయలేదు. కాని ఇండియా గురించి అవగాహనగల గ్రాంట్ 1813 చట్టంలో మిషనరీలపైగల నిర్బంధాలను తొలగించేటట్లు చేశాడు. 1833లో ఛార్టర్‌ను పొడిగించినపుడు విద్యా రంగానికి కంపెనీ 10 లక్షల రూపాయలు కేటాయించింది. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరూ

ఉపయోగించేటట్లుగా పాఠశాలలు, గ్రంథాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రజల మేలుకోరి ఈ సంస్థలను ప్రారంభించినట్లు మిషనరీలు ప్రకటించాయి.

అయితే పాఠశాలలు మత ప్రచార వాతావరణంలో నడిచాయి. ఏ ఇతర పాఠశాలలు లేని చోట్ల మిషనరీ పాఠశాలలకు ప్రాముఖ్యం హెచ్చింది. ఇష్టా ఇష్టాలతో ప్రమేయం లేకుండా పిల్లలు మిషన్ పాఠశాలలకే వెళ్ళాల్సి వచ్చింది. మిషనరీ పాఠశాలలు ఉచిత విద్యా సౌకర్యం కూడా కలుగజేశాయి. వ్యక్తిగతంగా విద్యార్థికేగాక సమాజానికే మేలు చేయాలని విద్యా సంస్థలు ప్రయత్నించాయి. విద్యా వ్యాప్తికి మిషన్ సంస్థలు తోడ్పడగలవని ప్రభుత్వం గుర్తించింది. సార్వజనీన విద్యకు ప్రభుత్వం బాధ్యత స్వీకరించలేకపోయింది. విద్యా రంగంలో సహకరించే సంస్థలన్నిటినీ ప్రోత్సహించారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ సహాయంతో అనేక పాఠశాలలు ఏర్పాటు కావచ్చు. 1854లో ప్రభుత్వం తన విద్యా విధాన తీర్మానంలో ప్రైవేటు సంస్థలకు సహాయం చేస్తున్నట్లు స్పష్టం చేసింది. విద్యను విస్తరించడానికి నిధులు సమకూర్చుతూ విద్యా విషయాలను ప్రభుత్వం గుర్తించిందేగాని మత విషయాలను పట్టించుకోలేదు. మిషనరీ విద్యా సంస్థలు ప్రభుత్వ విద్యా విధానంలో భాగం కాదు. పాఠశాలలను నడపాల్సిందిగా ప్రభుత్వం మిషనరీలను ఆదేశించనూలేదు. వారు పాఠశాలలను ప్రారంభించినపుడు వారికి అభ్యంతరం చెప్పనూలేదు. అయితే గ్రాంట్లు పొందిన మిషనరీ పాఠశాలలు ఎలా పని చేయాలో చెప్పే అధికారాన్ని ప్రభుత్వం నిలుపుకుంది. మిషనరీలు విద్యారంగంలో అడుగుపెట్టడాన్ని అందరూ హర్షించారు. మిషనరీ విద్యా సంస్థలు ప్రాథమిక విద్య, ఉన్నత విద్య, ఉపాధ్యాయ శిక్షణ, వృత్తి విద్యలను ప్రోత్సహించాయి. మిషనరీలు ఆంగ్ల భాషతోబాటు వ్యాకరణం, భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం, గణితం ముఖ్య పాఠ్యాంశాలుగా బోధించారు.

**5.3.1. వివిధ జిల్లాలలో విద్యావ్యాప్తి :** వివిధ జిల్లాలలో వివిధ శాఖలకు చెందిన క్రైస్తవ మిషనరీలు విద్యా వ్యాప్తిని చేపట్టాయి.

**విశాఖపట్టణం జిల్లా :** 1795లో లండన్ మిషనరీ సొసైటీ దక్షిణ భారతదేశంలో తన కృషి ప్రారంభించింది. ఆంధ్రదేశంలో దాని మొదటి కేంద్రం 1805లో విశాఖపట్నంలో స్థాపించబడింది. అందువల్ల మొదటి మిషనరీ పాఠశాలలు కూడా ఆ ప్రాంతంలోనే ఏర్పాటయ్యాయి. తరువాత లండన్ మిషనరీ సొసైటీ తన కార్యకలాపాలను పొరుగున వున్న జిల్లాలలోకి విస్తృత పరచి శ్రీకాకుళంలోను, ఛత్రపూర్‌లోనూ పాఠశాలలు స్థాపించింది. విశాఖపట్టణంలో ఏడు పాఠశాలలు ఏర్పాటయ్యాయి. పాఠశాలల పర్యవేక్షణకు జనరల్ సూపరింటెండెంట్‌ను నియమించారు. టౌన్‌గేట్ ఛాపెల్ స్కూల్ కాక ప్రతి పాఠశాలలో 30 మంది దాకా చదువుకొనేవారు. మిగతా ఆరు పాఠశాలలు అల్లీపురం, వాల్తేర్, నారవ, కుమ్మరి, మల్కాపురం, కొన్ని స్కూళ్ళు. యూరోపియన్, ఆంగ్లో ఇండియన్ పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలను ప్రారంభించారు. స్థానిక యువకుల కోసం కూడా ఒక సంస్థ ప్రారంభమయింది. ఈ సంస్థలన్నీ చాలా వరకు విరాళాలతోనే నడిచేవి. పాఠశాలలకు యాజమాన్య సంఘాలు ఏర్పాటయ్యాయి. పోర్టరు సతీమణి పర్యవేక్షణలో ఆదివారం పాఠశాల నడిచేది. ఆదివారం తరగతుల్లో 10 మంది పురుషులు, ఏడుగురు మహిళలు బోధించేవారు. జిల్లా కలెక్టర్ సహాయంతో స్థానికులకు ఒక ఇంగ్లీషు స్కూల్ ఏర్పాటయింది. ఆంగ్లదేశ చరిత్ర, మత పాఠశాలలు, భూగోళ శాస్త్రం, వ్యాకరణం, గణితం నేర్పేవారు. వారానికి రెండుసార్లు పరీక్ష జరిపేవారు. 1837లో కొత్త పాఠశాల భవనం ఏర్పాటయింది. స్థానికంగా యూరోపియన్లు, జమీందార్లు పాఠశాలకు నిధులు సమకూర్చేవారు. పాఠశాలను రెవరెండ్ పోర్టర్ పర్యవేక్షించేవాడు. పోర్టర్ సతీమణి పర్యవేక్షణలో 1835లో అనాథ బాలికల శరణాలయం ప్రారంభమయింది. చదవడం, వ్రాయడం, లెక్కలు, సంగీతం, కుట్టు పనితోబాటు మత విషయాలు బోధించేవారు. శరణాలయం 22 మంది బాలికలతో ప్రారంభమైంది. బాలురకోసం ఏర్పాటైన శరణాలయాన్ని గార్డెన్ సతీమణి చూచుకొనేవారు. అదే సంవత్సరం పని పిల్లలకోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటైంది. అందులో 3 నుంచి 10 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 60 మంది ఉండేవారు. బాలుర కోసం, పసిపిల్లల కోసం, మహిళల కోసం వేర్వేరుగా ప్రథమంగా సంస్థలను ఏర్పాటు చేసినవారు క్రైస్తవ మిషనరీలే.

**కడప జిల్లా :** 1822లో లండన్ మిషనరీ సొసైటీ కడపలో తన కేంద్రాన్ని స్థాపించింది. మతాంతరీకరణ దృష్ట్యా కడప కేంద్రం ముఖ్యమైన కేంద్రంగా అభివృద్ధి చెందింది. రాయలసీమ జిల్లాలతో బాటు కడప జిల్లాలో కూడా క్రైస్తవ మిషనరీలు విద్యా వ్యాప్తికి గొప్ప కృషి చేశాయి. 1835-36 నాటికి మిషనరీలు కడపలో 6 పాఠశాలలు నడపసాగారు. పేట బడిలో 100 మంది విద్యార్థులు 1836లో పాఠశాలలో పరీక్షలు రాశారు. పాత కడప పాఠశాల ఉపాధ్యాయుడు ఛత్రే ఎర్రమూకపల్లిలో పాఠశాలను ప్రారంభించాడు. మూసాబ్ పేట పాఠశాలలో

విద్యార్థులు చాలా తక్కువ మంది ఉండేవారు. పెద్దమూక పల్లిలో ఒక పాఠశాల నడిచేది. మొత్తం ఆరు పాఠశాలల్లో 176 మంది
విద్యార్థులుండేవారు. మత గ్రంథాలను చదివి కంఠస్థం చేసేవారు. భూగోళ శాస్త్రం, వ్యాకరణ శాస్త్రం కూడా పాఠశాలల్లో నేర్పించేవారు.
1837 నాటికి మూడు పాఠశాలలు మాత్రం మిగిలాయి. కంపెనీ పాలనాకాలంలో లండన్ మిషన్ సొసైటీ 1860లో కడపలో ఒక బాలికల
పాఠశాల ప్రారంభించింది. ఉడ్ నివేదిక అమలు ఫలితంగా ఈ సొసైటీ జిల్లాలో అనేక పాఠశాలలు ప్రారంభించింది. 1864-65 నాటికి 25
గ్రామ పాఠశాలలు, ముత్యాలపాడులో ఒక కేంద్ర పాఠశాల నిర్వహించబడేవి. హోవెల్, స్పెన్సర్ హిగ్గిన్స్, నీల్, హాండ్స్ మొదలగు మత
ప్రచారకులు కడప జిల్లాలో విద్యా వ్యాప్తికి, మత వ్యాప్తికి గొప్పగా కృషి చేశారు. 1913లో జమ్మలమడుగులో కాంఫ్‌బెల్ స్మారక పాఠశాలను
లండన్ మిషన్ సొసైటీ ప్రారంభించింది. తరువాత అదే ప్రాంతంలో బాలికల పాఠశాల ప్రారంభించింది. కలసపాడులో మిషన్ సుమారు
40 ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించింది. కోడూరులో లూథరన్ మిషన్ 8 ప్రాథమిక పాఠశాలలు నిర్వహించ సాగింది. క్రైస్తవ మత
వ్యాప్తితో బాటు, లౌకిక విద్యాభివృద్ధికి మిషనరీలు ప్రత్యేక శ్రద్ధ చూపారు. మిషనరీ పాఠశాలలకు బ్రాహ్మణుల పిల్లలతోబాటు ఇతర కులాల
వాళ్ళు హాజరయ్యేవారు.

**కృష్ణా జిల్లా :** 1841లో చర్చి మిషనరీ సొసైటీ తన మొదట మిషన్‌ను మచిలీపట్నంలో స్థాపించింది. తొలి మద్రాస్ బిషప్ కర్రీ
ఆంధ్రాలో మత వ్యాప్తికి తీవ్ర కృషి సల్పాడు. ఇతడు 1840లో ఇండియాకు విద్యావేత్తలను, మత ప్రచారకులను పంపమని లండన్ చర్చి
మిషనరీ సొసైటీకి అనేక లేఖలు వ్రాసాడు. అయితే అతని కల అతని మరణం తర్వాత నెరవేరింది. అతని అభిమానులు 2 వేల రూపాయలు
పోగుచేసి మచిలీపట్నంలో ఒక మిషన్ స్కూల్‌ను నెలకొల్పారు. 1841లో ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన హెన్రీ ఫాక్స్, కేంబ్రిడ్జికి చెందిన తర్లింగ్టన్
నోబుల్ అను ఇద్దరు మిషనరీలు మచిలీపట్నం ప్రాంతంలో మత ప్రచారానికి మద్రాస్ చేరుకొన్నారు. తన ప్రయాణంలో నోబుల్ తెలుగు,
సంస్కృత వ్యాకరణం, మరికొన్ని పుస్తకాలు పఠించాడు. మద్రాస్ చేరుకొన్న తర్వాత ఫోర్ట్ సెయింట్‌జార్జి కళాశాల మున్షీ వద్ద సాహిత్యం
చదివాడు. 1841 అక్టోబర్‌లో నోబుల్ మచిలీపట్నం చేరుకొని తన కార్యక్రమాన్ని షేర్కీ, అనంతం, భూషణంలతో కలసి నవంబర్‌లో
ప్రారంభించాడు. తొలుత బైబిల్, భగవద్గీత, గణితం, భూగోళ శాస్త్రం ఇచట బోధించబడింది. ఉన్నత వర్గాలకు చెందిన విద్యార్థులకు 22
సంవత్సరాలపాటు అత్యంత ఉత్సాహంతో బోధించాడు. మత కార్యకలాపాలకు ఫాక్స్ తన కాలాన్ని వినియోగించాడు. టేలర్, కూంబ్స్ మరి
ఐదుగురు స్థానికులతో కలసి నోబుల్ మచిలీపట్నం, దాని పరిసర ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి గొప్పగా కృషి చేశాడు. ఏలూరు, విజయవాడ
పట్టణాలలో బాలుర పాఠశాలలు స్థాపించబడ్డాయి. మచిలీపట్నంలోని ఆంగ్ల ప్రాంతీయ భాషా పాఠశాల ఒక్కటే. మద్రాస్, రాజమండ్రి
మధ్యగల ఉన్నత తరగతికి చెందిన పాఠశాల. నోబుల్ నిర్వహించే పాఠశాలను మద్రాస్ గవర్నర్ ట్రెకెలియన్ పొగిడాడు. 1842లో నోబుల్
స్థాపించిన పాఠశాల 1898 నాటికి నోబుల్ కళాశాలగా రూపాంతరం చెందింది.

**గుంటూరు జిల్లా :** 1842లో క్రైస్తవ మిషనరీలు గుంటూరు జిల్లాలో అడుగుపెట్టారు. అమెరికాకు చెందిన లూథరన్ క్రైస్తవ
మిషనరీలు, హాలెండుకు చెందిన కాథలిక్ మిషనరీలు గుంటూరు ప్రాంతంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. క్రైస్తవ మతాన్ని వ్యాప్తి
చేయడానికి అమెరికా బోర్డు పంపగా జర్మనీకి చెందిన మిషనరీ జాన్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ హైయ్యర్ 1842లో బాపట్లకు వచ్చాడు. గుంటూరు
కలెక్టర్ ఆహ్వానంపై తన మకాంను బాపట్ల నుండి గుంటూరుకు మార్చాడు. గుంటూరు పాత బస్టాండ్ దగ్గర గన్‌హాల్ ప్రాంతంలో ఉంటూ
మత ప్రచారం చేయసాగాడు. 1842లోనే ఎ.సి. కళాశాలలో ప్రస్తుతం రిక్రియేషన్ హాలుగా ఉన్న భవనంలో ఇతడు ఒక పాఠశాలను ఏర్పాటు
చేశాడు. తరువాత దీనిని ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేశాడు. అమెరికన్ సన్‌డే స్కూల్ పిల్లలు పంపిన విరాళాలతో 1885లో పాఠశాల
ఆవరణలోనే ఆంధ్ర క్రైస్తవ కళాశాలను స్థాపించారు. ప్రత్తిపాడు, నల్లపాడులలో హైయ్యర్ పాఠశాలలు ఏర్పాటు చేశాడు. తొలి బాలికల
పాఠశాలను 1842లో హైయ్యర్ ప్రారంభించాడు. హైయ్యర్ గుంటూరులో వున్న మొదటి సంవత్సరంలోనే 10 మంది ఉపాధ్యాయులు, 180
మంది విద్యార్థులు 7 పాఠశాలలతో అభివృద్ధి జరిగింది. అదే సమయంలో అమెరికన్ బాప్టిస్ట్ మిషన్ సొసైటీ గుంటూరు, గురజాలల్లో
ప్రాథమిక పాఠశాలలు ప్రారంభించింది. తరువాత ఒంగోలులో ఒక కేంద్రం ప్రారంభించబడింది. యునైటెడ్ ఎవాంజలికల్ లూథరన్ మిషన్
గుంటూరు కేంద్రంగా విద్యారంగంలో కృషి చేసింది. ఈ సంస్థ జిల్లాలో 15 ప్రాథమిక పాఠశాలలు, 20 ఉన్నత పాఠశాలలు నిర్వహిస్తున్నది.
జె.యమ్.జె. సంస్థ గుంటూరులో మహిళల కొరకు 1904లో ఒక డిస్పెన్సరీని ఏర్పాటు చేసింది. ఇది సెయింట్ జోసఫ్ హాస్పిటల్‌గా మారింది.
ఈ హాస్పిటల్‌కు అనుబంధంగా మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్స్ ట్రెనింగ్ స్కూలును 1933లో, నర్సింగ్ స్కూల్‌ను 1947లో ఏర్పాటు చేశారు.

మహిళా విద్యను కేథలిక్ సంస్థ ప్రోత్సహించింది. గుంటూరులో మహిళల కోసం సెయింట్ జోసఫ్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను 1946లో ప్రారంభించింది. ఈ కళాశాల అభివృద్ధికి తొలిదశలో రెవరెండ్ సిస్టర్ స్టాన్సిలాస్ స్వామికన్ను విశేష కృషి చేశాడు. గుంటూరు, చీరాల, రేపల్లె, నరసరావుపేట, రెంటచింతల, సత్తెనపల్లి, గురజాల, వెల్దుర్తి, మాచర్ల పాఠశాలల్లో బాలికల సంఖ్య ఎక్కువగా ఉండేది.

**గోదావరి జిల్లా :** గోదావరి జిల్లాలో మిషనరీల కార్యకలాపాలు 19వ శతాబ్దపు రెండో భాగంలో ప్రారంభమయినాయి. 1840లో ఉత్తర జర్మన్ మిషనరీ సొసైటీ తన కృషిని రాజమండ్రి చుట్టూ ప్రారంభించింది. ఈ కృషిని 1851లో అమెరికన్ జర్మన్ లూథరన్‌లు కొనసాగించారు. 1858లో అమెరికా నుండి వచ్చిన రెవరెండ్ ఎ. లాంగ్ ఒక క్రొత్త మిషన్‌ను సామర్లకోటలో స్థాపించాడు. రాజమండ్రిలో ఒక రాష్ట్ర పాఠశాల ఉండినందున మిషనరీలు పాఠశాలకు బదులు ఒక వస్తు ప్రదర్శనశాల, ఒక పఠనాలయం ప్రారంభించారు. మిషనరీల కృషి పాలకొల్లు, నరసాపూర్‌లకు వ్యాపించింది. కాకినాడ దగ్గర జగన్నాధపురంలో 1876లో బాలికల బోర్డింగ్ పాఠశాల, 1883లో ఆకివీడు, తునిలలో బాలికల పాఠశాలలు, రామచంద్రాపురం, పెద్దాపురం, నర్సీపట్టణంలలో బాలుర పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

**నెల్లూరు, చిత్తూరు జిల్లాలు :** ఫ్రీ చర్చి మిషనూ, అమెరికన్ బాప్టిస్టు మిషను నెల్లూరు జిల్లాలో విద్యా వ్యాప్తికి కృషి చేశాయి. మదనపల్లెలో జాకబ్ ఛేంబర్లేన్ భార్య అన్ని కులాలవారు ఒకేచోట చదువుకొనేందుకు 1880లో ఒక పాఠశాలను ప్రారంభించింది. ఏడో తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో చదివిన పిల్లలను మెట్రిక్యులేషన్ కోసం మద్రాస్ పంపేవారు. విదేశ మిషన్ సంస్థల మహిళల బోర్డు చిత్తూరు పాఠశాలకు మంచి భవనాన్ని బహూకరించింది. పుంగనూరులోని ప్రభుత్వ పాఠశాలను మిషనరీలకు ఇచ్చివేశారు. పలమనేరులో బాల, బాలికల కోసం ఆర్కాట్ మిషన్ పాఠశాలలు నెలకొల్పింది.

**5.3.2. వృత్తి విద్య, పారిశ్రామిక పాఠశాలలు :** పని చేయడం గౌరవానికి లోటు కాదనీ, పనిలో హుందాతనం ఉంటుందనీ పిల్లలకూ నేర్పుతూ వారు స్వయం పోషకత సాధించి, పని ద్వారా శీలాన్ని అభివృద్ధి పరచుకోవాలన్న భావంతో మిషనరీలు వృత్తి విద్యను ప్రవేశపెట్టారు. 1910 నాటికి అమెరికన్ ప్రొటెస్టెంట్ మిషన్ సంస్థలు దేశంలో 29 పారిశ్రామిక పాఠశాలలను నిర్వహించింది. పారిశ్రామిక శిక్షణతో ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని మిషనరీలు ప్రయత్నించారు. సామర్లకోటలో వృత్తి విద్యా పాఠశాల ప్రారంభించారు. వృత్తి విద్యా పాఠశాలలో శిక్షణ పొందిన వడ్రంగిని టీచరుగా నియమించారు. వడ్రంగం నేర్చుకొనేవారు తమ విద్యను ఉపయోగంలోకి తెచ్చారు. యునైటెడ్ లూథరన్ చర్చి ఒక సంస్థలో వ్యవసాయ శిక్షణ, మరొక సంస్థలో పారిశ్రామిక శిక్షణ ప్రారంభించారు. లామ్‌లో గ్రామీణ పునర్ నిర్మాణ పాఠశాల, వడ్రంగము పాఠశాల ప్రారంభమయ్యాయి. నేతపని, కోళ్ళ పెంపకం, వ్యవసాయ పద్ధతులు లామ్ క్షేత్రంలో నేర్పారు. అమెరికన్ బాప్టిస్టు మిషన్ సంస్థ, ఎవాంజలికల్ లూథరన్ సంస్థ, పిల్లలకు పారిశ్రామిక శిక్షణ లేదా వృత్తిని నేర్పేందుకు కృషి చేశాయి. వీరు 1931లో కంభంలో గ్రామీణ సామాజిక శిక్షణ సంస్థను ప్రారంభించారు. ఆంధ్ర ఎవాంజలికల్ లూథరన్ చర్చి రాజమండ్రి, గుంటూరు, భీమవరం, చీరాలలో స్వయం సమృద్ధి సాధించింది. ఈ చర్చి ప్రాథమిక పాఠశాలలు, మత బోధన, మత బోధకుల శిక్షణ నిర్వహించేది. భీమవరం, పెద్దాపురం, రాజమండ్రి, గుంటూరులోని బాలుర పాఠశాలలు ఈ చర్చి ఆధీనంలోకి వచ్చాయి. సాల్వేషన్ ఆర్మీవారు నేతపని, పట్టు పరిశ్రమ, కుట్టుపని, చాపల అల్లకంలో శిక్షణ యిచ్చారు.

**5.3.3. స్త్రీ విద్య :** ఆంధ్ర దేశంలో 18వ శతాబ్దం వరకూ స్త్రీ విద్యను నిర్లక్ష్యం చేయడం జరిగింది. ప్రాచీన కాలంనుండి స్త్రీ విద్యను అభ్యసించినా అది పూర్తిగా మతపరమైనదే. ఇండియాలోని ఇతర ప్రాంతాలలాగే ఆంధ్ర దేశంలో ఆడపిల్లల చదువుపట్ల బలమైన వ్యతిరేకతా, ఉపేక్షా ఉండేవి. స్త్రీలకు విద్య చెప్పించకూడదనే నమ్మకం సమాజంలో బలంగా నాటుకుని ఉండేది. ఆడపిల్లలు చదువుకుంటే ఆ కుటుంబాలకు దురదృష్టం చుట్టుకుంటుందని అనుకొనేవారు. దేవదాసీలు ఆలయాలలో, ఉత్సవాలలో నృత్యం చేసేటందుకు లలిత కళలు నేర్చుకోవాలి గనుక, స్త్రీ విద్య వారి కొరకు ఉద్దేశింపబడింది అనే అభిప్రాయం ఉండేది. కంపెనీ ప్రభుత్వం కూడా స్త్రీ విద్య విషయంలో పట్టించుకోలేదు. స్త్రీ విద్యా వ్యాప్తిలో మిషనరీలు పథ నిర్మాతలు.

స్త్రీ విద్య ప్రయోజనకరమైన ఫలితాలకు దారి తీస్తుందని, ప్రజల అలవాట్లలో మార్పు తీసుకు రావచ్చని డల్హౌసీ నిశ్చయించి స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. ప్రభుత్వ నిర్ణయం 1854 నాటి ఉత్తరువులో ధృవపరచబడింది. కాని ఈ దిశలో మద్రాస్ రాష్ట్రంలో 1868 వరకు గొప్ప పురోగతి జరగలేదు. మద్రాస్ రాష్ట్రంలో విద్యా పరిస్థితిని గురించి తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నం దేశీయ పాఠశాలల్లోని మొత్తం పిల్లలలో 3.17% మంది ఆడ పిల్లలు ఉండేవారు.

లండన్ మిషనరీ సొసైటీ, వెస్లియన్ మిషన్, అమెరికన్ మిషన్, చర్చి మిషనరీ సొసైటీ మద్రాస్‌లో 1830-37 మధ్య కాలంలో అనేక పాఠశాలలు ప్రారంభించారు. ప్రథమంలో ఈ పాఠశాలల్లో మతం స్వీకరించిన వారి పిల్లలకు మాత్రమే ప్రవేశముండేది. హిందూ బాలికలకై తొలి పాఠశాలను 1843లో బ్రేడ్‌వుడ్ దంపతులు ప్రారంభించారు. 1852లో శ్రీమతి కట్టర్ మార్గరెట్ రాజమండ్రిలో తొలి బాలికల పాఠశాల ప్రారంభించింది. తరువాత హెయినీన తెలుగు పాఠశాలలు బాల బాలికల కొరకు ప్రారంభించారు. ఆర్ట్‌మన్ 1880లో హాస్టల్ సౌకర్యంతో బాలికల పాఠశాల స్థాపించాడు. 1884లో ముస్లిం బాలికల పాఠశాలను మిషనరీలు ప్రారంభించారు. 1884లో ఆర్ట్‌మన్ మరో బాలికల పాఠశాలను స్థాపించాడు. అమెరికన్ ఎవలాంజికల్ లూథరన్ చర్చికి చెందిన కుమారి అగ్నస్ ఇడీష్మేడ్ 1894లో రాజమండ్రిలో హాస్టల్‌తో కూడిన బాలికల పాఠశాల స్థాపించింది. శ్రీమతి ష్మిడ్ గియోవని బ్లెషాయ్ రాజమండ్రిలో అల్లిక పరిశ్రమ నెలకొల్పింది. 1870లో రాజమండ్రి డిప్యూటీ కలెక్టర్ ప్రజలిచ్చిన చందాలతో ఒక బాలికల పాఠశాల నెలకొల్పాడు. ఇదే కాలంలో విజయనగరం జమీందార్ రాజమండ్రిలో బాలికల పాఠశాల స్థాపించాడు. 1870 నాటికి గోదావరి జిల్లాలో 7 బాలికల పాఠశాలలుండేవి. శ్రీమతి జానకమ్మ విశాఖపట్నంలో 1367లో హిందూ బాలికల కొరకు ఒక పాఠశాల ప్రారంభించింది. మహారాజా విజయరామగజపతి 1886లో విజయనగరంలో ఒక పాఠశాల ప్రారంభించాడు. పిఠాపురం రాజా 1868లో కాకినాడలో ఒక బాలికల పాఠశాల ప్రారంభించాడు. 1874లో వీరేశలింగం ధవళేశ్వరంలో బాలికల పాఠశాల స్థాపించాడు. తరువాత ఇతడు 1881లో రాజమండ్రిలో బాలికల పాఠశాల ప్రారంభించాడు. స్త్రీల కొరకు వీరేశలింగం స్థాపించిన పత్రిక 'సతీహిత బోధిని' (1883) ఒక ఆదర్శాన్ని నెలకొల్పి, ఆంధ్రదేశంలో స్త్రీల పత్రికలయుగాన్ని ప్రారంభించింది. ఈ పత్రిక పూర్తిగా స్త్రీలకొరకు మాత్రమే ఉద్దేశింపబడింది. ఆ తరువాత అనేక మహిళా పత్రికలు ప్రారంభించబడ్డాయి. ఈ పత్రికల్లో స్త్రీ విద్య, బాల్య వివాహాలు, లలిత కళలు మొదలైన విషయాల మీద స్త్రీలు వ్రాసిన అనేక వ్యాసాలు ప్రచురించబడ్డాయి. 1883-1924 మధ్య కాలంలో వచ్చిన

**స్త్రీల పత్రికలు :**

| పత్రిక | ప్రచురించిన సం॥ | సంపాదకులు | ప్రచురించిన స్థలం |
|---|---|---|---|
| సతీహితబోధిని | 1883 | కందుకూరి వీరేశలింగం | రాజమండ్రి |
| తెలుగు జనానా | 1893 | రాయసం వెంకట శివుడు | బెజవాడ |
| స్త్రీ హితబోధిని | 1893 | రాపాక కౌస్తుభం | కాకినాడ |
| శ్రీ బాలిక | 1896 | సంగీతం బాపిరాజు | శ్రీకాకుళం |
| హిందూ సుందరి | 1902 | మొసలి కంటి రమాబాయి | కంతేరు |
| | | భుజంగరావు | ఏలూరు |
| సావిత్రి | 1904 | పులుగుర్త లక్ష్మీ నరసమాంబ | కాకినాడ |
| వివేకవతి | 1909 | శ్రీనివాసకతి | మదరాసు |
| సుందరి | 1909 | నారాయణ | కొమరిపాలెం |
| స్త్రీల కొరకు వర్తమానములు | 1912 | మెకాలేకన్య | గుంటూరు |
| అనసూయ | 1914 | వింజమూరి వెంకటరత్నం | |
| స్త్రీ ధర్మ | 1917 | మాలతీ పట్వర్థన్ | మద్రాసు |
| సౌందర్యవల్లి | 1919 | రమాబాయి | మద్రాసు |
| ఆంధ్ర లక్ష్మి | 1921 | వెంకటరమణమ్మ | గంజాం |
| హిందూయువతి | 1923 | యామినీపూర్ణ తిలకమ్మ | |
| గృహలక్ష్మి | 1927 | కేసరి | మద్రాస్ |
| ఆంధ్రమహిళ | 1924 | దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ | మద్రాస్ |

ఇదే కాలంలో స్త్రీ విద్యమీద తెలుగులో స్త్రీలు, పురుషులూ వ్రాసిన అనేక గ్రంథాలు కూడా వెలువడ్డాయి. వాటిలో పేర్కొనదగినవి: లక్ష్మీ నరసమాంబ రాసిన 'మహిళా కళాబోధిని', వెంకయ్య వ్రాసిన 'స్త్రీ ధర్మబోధిని', 'స్త్రీ విద్యా పంచరత్న విషయం', పట్టాభి రామశర్మ వ్రాసిన 'స్త్రీ విద్యాసార సంగ్రహం' బాల కృష్ణమూర్తి వ్రాసిన 'బాలికా హితబోధిని', రాయసం వెంకటశివుడు రాసిన 'కుటుంబ ఆర్థిక విషయాలు' మొదలగునవి.

ఏనుగుల వీరాస్వామి, సామినేని ముత్తు నరసింహయ్య నాయుడు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు ఆంగ్ల విద్యా వ్యాప్తికి, స్త్రీ విద్యకు కృషి చేశారు. అయితే వీరి కార్యకలాపాలలో సైత్వక భావ జాలం కన్పిస్తుంది. స్త్రీలకు విద్యతోపాటు వంటపని, గృహ నిర్వహణ, కుట్లు, అల్లికలు, గృహవైద్యం అవసరమని నాటి భావన.

19వ శతాబ్దంలో అనేక మహిళా సంఘాలు ఆవిర్భవించాయి. ఈ సంఘాలన్నీ స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేశాయి. 1902లో స్థాపించబడిన 'అస్క' తొలిమహిళా సంఘం. ఈ సంస్థ ఒక బాలికల పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థినిలకు రవాణా సౌకర్యం కల్పించింది. ఈ సంస్థలోని చురుకైన సభ్యులు వెంకటేశ్వరరావు, గోపాలరావు, బంగారమ్మ, సుబ్బమ్మ, రాముడమ్మ, లక్ష్మీ, నరసమ్మ, వరలక్ష్మమ్మ, సీతమ్మ మొదలగువారు రాజమండ్రిలోని ప్రార్థన సమాజం, మచిలీపట్నంలోని (1902) బృందావన పుర స్త్రీ సమాజం, కాకినాడలోని (1903) శ్రీ విద్యార్థిని సమాజం, పిఠాపురంలోని మహిళా సమాజం, విజయనగరంలోని (1911) సత్య సంవర్థని సమాజము, విశాఖపట్నంలోని (1915) ఆంధ్ర స్త్రీల విద్యాభివర్థని సమాజం, బాపట్లలోని త్రిపుర సుందరి సమాజం, నరసాపురంలోని స్త్రీ విద్యాభివర్థని సమాజం స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేశాయి.

ఆంధ్రదేశంలో స్త్రీ విద్యా ఉద్యమంయొక్క వ్యాప్తినీ, ఫలితాలనూ, అది తెచ్చిన జ్ఞాన వికాసాన్ని చర్చిస్తూ హిందూ దిన పత్రిక (1911 ఏప్రిల్ 25) యిలా వ్రాసింది. "స్త్రీ విద్య యింకా హీన స్థాయిలోనే వున్నప్పటికీ వేగంగా వృద్ధి చెందుతున్నది. 1881లో బాలికల పాఠశాలలు 67 వుండగా 1908 నాటికి పాఠశాలల సంఖ్య 329కి పెరిగింది. స్త్రీలే సంపాదకులుగా, ప్రచురణ కర్తలుగా వుండే తెలుగు పత్రికలు మూడు నాలుగున్నాయి. ఉత్తర సర్కార్‌లోని ముఖ్య కేంద్రాలన్నిటిలో మహిళా సంఘాలున్నాయి.... కొన్నిచోట్ల స్త్రీలు తామే బాలికల పాఠశాలలు స్థాపించి మామూలు చదువుతోబాటు సంగీతమూ, దర్జీపని వగైరా నేర్పుతున్నారు. పాత భావాలనూ, అలవాట్లనూ, సంప్రదాయాలనూ విసర్జించడానికి ఇప్పుడామె మరింత సిద్ధంగా వుంది కనుక అనతి కాలంలోనే సమాజం బలమైన మార్పుకు లోనుగావడం తధ్యం."

**5.3.4. హరిజనుల విద్యా వ్యాప్తి :** వ్యవసాయక పునాదులు గల శూద్రకులాల వారు బ్రాహ్మణుల బహిష్కరణలను అధిగమించినట్లుగా హరిజనులు తమమీద అమలవుతున్న వివక్షతతో కూడిన సామాజిక నీతికి అంతం పలకడానికి వారు మొదట కనీసం విద్యావంతులైనా కావాలి. ఆ తరువాతే భూ వసతుల గురించి కూడా గట్టిగా అడగగలరు. సత్వరం హరిజనులను సామాజిక జీవన స్రవంతిలో కలుపుకోకపోతే కలిగే జాతి విపత్తును గుర్తించి వారి విద్యపట్ల నాటి నాయకులు కృషి చేశారు.

హరిజనులకు విద్యావశ్యకతను గురించి కందుకూరి వీరేశలింగం తన రచనలలో గుర్తు చేశాడు. నాటికే రాజమండ్రిలో నిమ్న జాతులవారి కొరకు 4 మున్సిపల్ పాఠశాలలు ఉన్నా, అందులో తెలుగు తప్ప ఆంగ్ల బోధన లేదు. అందువల్ల 1909లో చిలకమర్తి నరసింహం నిమ్న జాతుల వారికి ఒక పాఠశాలను ఏర్పాటు చేశాడు. చెరువు సోమయాజులు తమ గృహంలో పాఠశాల నిర్వహణకు వసతిని కల్పించాడు. తెలుగువాడైన మెగా రాజయ్య ఉపాధ్యాయుడుగా నియమించబడ్డాడు. రాత్రిపూట తీరికగల పెద్దలకొరకు వివేకానంద పాఠశాలను తరువాత ఏర్పరచారు. గుడివాడలో నిమ్న జాతుల వారి కొరకు గూడూరి రామచంద్రరావు ఒక పాఠశాలను, వసతి గృహాన్ని ఏర్పరిచాడు. కాశీనాధుని నాగేశ్వరరావు స్వగ్రామంలో స్థాపించిన శ్యామలాంబ ప్రాథమిక పాఠశాలలో హరిజనులకు కూడా చదివే అవకాశం కల్పించడం జరిగింది. దీనబంధు రామ్‌జీరావు కూడా హరిజనులకు ఒక పాఠశాలను ఏర్పరచాడు. బందర్‌లో మరిగంటి శేషాచార్యులు హరిజనులకు ఒక పాఠశాలను ఏర్పరచాడు. ఈ దిశగా ముట్నూరి కృష్ణారావు, కాశేశ్వరరావు తమవంతు కృషి చేశారు. నాయకులు హరిజనోద్ధరణకై జరిపిన ప్రచారం వల్లనే గ్రామ స్థాయిలోని పాఠశాలల్లో హరిజన విద్యార్థుల ప్రవేశానికి మార్గం సుగమమయింది.

**ఆంధ్రలో విద్య - పరిశీలన :** ఇండియాలో బ్రిటిష్ పాలకులు ప్రవేశపెట్టిన విద్యావిధానం పూర్తిగా భారతీయుల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని ప్రవేశ పెట్టిన విధానం కాదు. ఇది కూడా పాలకుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొన్న మరొక ప్రణాళిక వంటిది. ఉదాహరణకు

ఈ నూతన విద్యా విధానంలో సాంకేతిక, ఉన్నత విద్యలకు స్థానం పూజ్యమే. ఇండియాలో మొదటినుండి బ్రిటిష్ పాలకులు విద్యా విధానంపై శ్రద్ధ చూపలేదు. రాజకీయంగా, ఆర్థికంగా వారి విధానాల సుస్థిరతపైనే వారు దృష్టిని సారించారు. ఆ తరువాత కాలంలో కొద్దిగా విద్యా విధానాన్ని గురించి పట్టించుకొన్నారు. అయితే వారు భారతీయుల విద్యపై పెట్టిన ఖర్చు చాలా తక్కువ.

మద్రాస్ ప్రెసిడెన్సీలో బ్రిటిష్ పాలకులు అనుసరించిన విద్యా విధానంలోని మూడు ప్రధాన విషయాలు 1) విద్యావిధాన రూపకల్పనలో పాలకుల అనిశ్చిత ధోరణి 2) విద్యా రంగంలో క్రైస్తవ మిషనరీల విజృంభణ 3) విద్యాలయాల్లో మత ప్రమేయం విషయంలో ద్వంద్వ విధానం. 1835 నాటికి బ్రిటిష్‌వారు తమ స్థానాన్ని రాజకీయంగా సుస్థిరం చేసుకొన్న తరువాత విద్యా విధానంపై దృష్టి సారించారు. ప్రజలకు ఆంగ్ల విద్య బోధించడం ద్వారా వారిని దిగువ తరగతి ఉద్యోగాలకు సంసిద్ధులను చేసి తద్వారా పాలనా భారాన్ని కొంత తగ్గించుకోవడం. అంతేగాక ఆంగ్ల విద్యను అభ్యసించిన భారతీయులు రంగు, రూపుల్లో భారతీయతను ప్రతిబింబించినా, మానసికంగా, సాంస్కృతికంగా పాశ్చాత్య నాగరికతా ప్రవంతిలో వారు పూర్తిగా మిళితమై పోతారనే మెకాలే చింతన ఆంగ్ల విద్యా విధానంలో కన్పిస్తుంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ విద్యావిధానంలో వారు ప్రవేశపెట్టిన పాశ్చాత్య నాగరికత పాఠ్యాంశాలు, క్రైస్తవ నీతిని బోధించే విషయాలు.

బ్రిటిష్ పాలకులు 19వ శతాబ్దం పూర్వార్థం వరకు తమ దృష్టిని కేవలం వ్యాపారంపైనే కేంద్రీకరించారు. అయితే 1813 తరువాత వారు సామాజిక, విద్యారంగాలపై దృష్టిని మరల్చారు. 1813 చట్టం క్రైస్తవ మిషనరీలు ఇండియాలో ప్రవేశించరాదనే నిబంధనను తొలగించింది. దీంతో వీరు మరింత స్వేచ్ఛగా మత ప్రచార, మతాంతరీకరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారు విద్యారంగాన్ని ఈ పనికి ప్రధాన వేదికగా చేసుకొన్నారు. చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, మొదలగు ప్రాంతాలలో క్రైస్తవ మత ప్రచారకులు ఎక్కువగా విస్తరించి, పని చేయడం ప్రారంభించారు. గుంటూరు, పల్నాడు మొదలగు ప్రాంతాల్లో అమెరికన్ బాప్టిస్టు మిషన్ వంటి సంస్థలు తమ ప్రభావాన్ని, ప్రాభవాన్ని విస్తరింప జేసుకొన్నాయి. లండన్ మిషనరీ సొసైటీవారు 1805 ప్రాంతానికి విశాఖలో, చర్చి మిషనరీ సొసైటీవారు 1841 నాటికి మచిలీపట్నంలో, అమెరికన్ బాప్టిస్టు మిషన్ సొసైటీవారు 1842 నాటికి గుంటూరు జిల్లా ప్రాంతంలో పాఠశాలలను స్థాపించారు. గోదావరీ ప్రాంతంలో ఉత్తర జర్మనీ మిషనరీ సొసైటీవారు 19వ శతాబ్ద మధ్య కాలానికి తమ కార్యకలాపాలను ప్రారంభించారు. ప్రభుత్వ అనిశ్చిత విధానాలవల్ల విద్యా విధానం మిషనరీల చేతిలో కేంద్రీకరింపబడింది. విశాఖపట్నం, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప మొదలగు ప్రాంతాల్లో మిషనరీలు పని చేయడం ప్రారంభించారు. క్రైస్తవ విద్యాలయాల్లో లౌకిక విద్యతోబాటు మత విషయాలను బోధించేవారు. దీనిని బ్రిటిష్ ప్రభుత్వం చూసీ చూడనట్లు ఊరుకుంది. 19వ శతాబ్ది ద్వితీయార్థంలో స్థానిక ప్రజలు సైతం పాఠశాలలను స్థాపించుకొనడం ప్రారంభించారు. క్రైస్తవ ప్రచారాన్ని వ్యతిరేకించినా, స్థానికులు వారి విద్యకు అంగీకరించారు. స్త్రీ విద్యా వ్యాప్తికి, హరిజనుల విద్యా వ్యాప్తికి మిషనరీలు, స్థానికులు కృషి సల్పారు.

## 5.4. బ్రిటిష్ ప్రభుత్వం కృషి :

ఆధునిక విద్యా వ్యాప్తిలో బ్రిటిష్ ప్రభుత్వం కీలక పాత్ర నిర్వహించింది. బ్రిటిష్ ప్రభుత్వం అనేక విద్యా సంస్థలను స్థాపించింది. వీటినుండి పెక్కుమంది భారతీయులు ఆధునిక విద్య, విజ్ఞానంలో ఆరితేరి ప్రజా జీవన రంగాల్లోకి రాసాగారు. బ్రిటిష్‌వారి రాజకీయ పాలనావసరాల కోసం ఇండియాలో ఆధునిక విద్యా స్థాపన ఆరంభమైంది. 19వ శతాబ్ది మధ్య భాగానికి ఆంగ్లేయులు ఇండియాలో అధిక భాగాన్ని తమ పాలన కిందికి తేగలిగారు. ఈ కాలంలోనే ఆధునిక విద్య ఇండియాలో ప్రారంభమయింది. జయించిన ఇండియా భాగాల పాలనా నిర్వహణకు పెద్ద సంఖ్యలో చదువుకొన్నవారు అవసరమయ్యారు. మాతృదేశం నుండి పెక్కుమందిని సంపాదించడానికి ఆ దేశ పరిమిత జనాభా అడ్డంకి అయింది. ఫలితంగా, పాలనా నిర్వహణకు ఇండియాలో విద్యా సంస్థలు స్థాపించి, వీటినుండి వచ్చే భారతీయులను నియమించడం జరిగింది. అయితే పాలనా నిర్వహణలో పెద్ద పెద్ద పదవులను ఆంగ్లేయులకిచ్చి, క్రింది పదవుల్లో మాత్రమే చదువుకున్న భారతీయులను నియమించడం జరిగింది. దీనికితోడు, ఇండియాలో విస్తరిస్తున్న వ్యాపారం, ఇండియాలో బ్రిటన్ స్థాపించిన పరిశ్రమల నిర్వహణలో కూడా ఆంగ్లం తెలిసిన గుమాస్తాలు అవసరమయ్యారు. అంతేగాక ప్రపంచమంతా ఆంగ్ల సంస్కృతితో నిండినట్లైతే, అది ప్రపంచ సామాజిక, రాజకీయ ఐక్యతకు దారితీస్తుందని భావించి, ప్రపంచాన్ని ఆంగ్లీకరణ చేయడానికి పూనుకొన్నారు. సిసిల్ రోడ్స్, మెకాలే ఈ కోవకు చెందినవారు. ఇండియాలో ఆంగ్ల విద్యను ప్రవేశ పెట్టడం ఒక రాజకీయ అవసరమని మౌంట్ స్టూవర్ట్ ఎల్ఫిన్‌స్టన్ భావన. బ్రిటిష్

ప్రభుత్వ సుస్థిరతకు, బ్రిటిష్ ప్రభుత్వానికి, ఇండియా ప్రజలకు మధ్య అగాధమేర్పడకుండా ఉండడానికి ఆంగ్ల విద్య అవసరమని భావించాడు. ఈ విధంగా ఇండియాలో బ్రిటిష్ రాజకీయ, ఆర్థికావసరాలు, బ్రిటన్ నాయకత్వంలో ప్రపంచ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఐక్యతను సాధించాలనే ఆశయం ఆధునిక విద్యాస్థాపనను ప్రేరేపించాయి.

**తూర్పు ఇండియా కంపెనీ విధానం (1757-1813) మొదటి దశ :** 1757 మొదలు 1813 వరకు తూర్పు ఇండియా కంపెనీ ఇండియాలో విద్యావ్యాప్తిపై ఏమంత శ్రద్ధ, ఆసక్తి కనబరచలేదు. ఈ కాలంలో కంపెనీ ప్రధానంగా దాని వ్యాపార కలాపాలు, దాని రెవిన్యూ పాలన క్రింద ఉండే ప్రాంతాలనుండి వచ్చే లాభాలపైనే దృష్టిని ప్రసరించింది. ఈ కాలంలో భారత ప్రజల సామాజికార్థిక, సాంస్కృతిక సంక్షేమాన్ని గురించి శ్రద్ధను కనబరచలేక పోయింది. అంతేగాక భారత సమాజం, సంస్కృతుల గట్టి మత ప్రాతిపదికను గమనించిన ఆంగ్లేయ పాలకులు మార్పుకు ప్రయత్నించలేదు. ఈ కాలంలో కంపెనీ రెండు విద్యా సంస్థలను నెలకొల్పింది. వీటిల్లో ఒకటి ముస్లిం న్యాయ బోధన, ఇతర అంశాల అధ్యయనానికి ఉద్దేశించి 1781లో వారన్ హేస్టింగ్స్ నెలకొల్పిన కలకత్తా మద్రాసా. రెండోది హిందూ న్యాయ శాస్త్రం, తత్వ శాస్త్రాల అధ్యయనానికి 1792లో జోనాథన్ డంకన్ బెనారస్‌లో నెలకొల్పిన విద్యా సంస్థ. ఈ రెండు విద్యా సంస్థలను కంపెనీ కోర్టుల్లో భారత న్యాయ వ్యవస్థ, న్యాయ పాలనకు సంబంధించి బ్రిటిష్ వారికి సహాయం చేసేందుకు పరిమితమైన విద్యార్థులను తయారు చేసేందుకు ఉద్దేశించడం జరిగింది. పూర్వాచార పాలకుల భావాలు బాగా ప్రచారంలో ఉన్న ఈ కాలంలో బ్రిటిష్ టోరీ పార్టీ కూడా, ఈ అభిప్రాయాలకు మద్దతునిస్తూ, క్రైస్తవ మత ప్రచారకుల చర్యలను నిరుత్సాహపరచింది.

1793లో చార్టర్ చట్టాన్ని చేసే సమయంలో విల్బర్ ఫోర్స్ ఇండియాకు ఆంగ్ల ప్రభుత్వం ఉపాధ్యాయులను, మత ప్రవక్తలను పంపించి, భారతీయులకు ఉపయోగపడే విద్యను నేర్పించాలని సూచించాడు. కాని ఈ సూచనలు కార్యరూపం దాల్చలేదు.

కంపెనీ డైరెక్టర్లలో ఒకడైన చార్లెస్ గ్రాంట్ భారతీయులకు విద్యా సౌకర్యాలను కల్గించి, ఆంగ్ల భాషను బోధించి కొత్త విధానాలు ఉద్దేశాలకు చేరువగునట్లు కంపెనీ తగు శ్రద్ధ వహించాలని సూచించారు. అతని ఉద్దేశంలో ముస్లిం పాలకులు భారతీయులకు పారశీక భాషను బోధించునట్లు బ్రిటిష్ వారు ఆంగ్ల భాషను బోధించాలి. క్రమేణ, ఆంగ్లమును బోధించు పాఠశాలలను స్థాపించి విరివిగా ఆంగ్ల భాషా గ్రంథాలను పంచి భారతీయులను ఆంగ్ల భాష బోధనకు తర్ఫీదు చేయవలెనని అతడు భావించాడు. క్రైస్తవ మిషనరీలు కూడా ఆంగ్ల విద్యా వ్యాప్తికి సుముఖత చూపారు. 1800 సంవత్సరంలో లార్డ్ వెల్లస్లీ కలకత్తాలో ఫోర్ట్ విలియం కళాశాలను స్థాపించాడు. ఇది కంపెనీ అధికారులకు భారతీయ భాషలు, ఆచార వ్యవహారాలు నేర్పడానికై ఉద్దేశింపబడింది. కాని ఈ కళాశాల 1802లో డైరెక్టర్ల ఉత్తర్వుల ప్రకారం మూయబడింది. ఈ దశలో ఆంధ్రాలో ఎట్టి మార్పులు జరుగలేదు.

**1813-1854 మధ్య కాలంలో కంపెనీ విధానం (రెండోదశ) :** ఇండియా కంపెనీ పాలనలో క్రమంగా సంభవించిన కొన్ని పరిణామాలు పాలకుల, సంస్కర్తల దృక్పథంలో మార్పును తెచ్చాయి. కంపెనీ ఉద్యోగులు అవినీతికి పాల్పడ్డం వల్ల వారిపట్ల పార్లమెంటు సభ్యుల్లో కోపద్వేషాలు ఏర్పడి, ఇండియా సంక్షేమం పట్ల దృష్టి సారించారు. రెగ్యులేటింగ్ చట్ట చర్చల సందర్భంలో పాలితుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలనే సూత్రాన్ని బ్రిటిష్ పార్లమెంట్ సభ్యుడు ఎడ్మండ్ బర్క్ పేర్కొన్నాడు. పిట్ ఇండియా చట్టంలో ఇండియా ప్రజల యోగక్షేమాల బాధ్యతను చట్టరీత్యా అంగీకరించబడింది. మార్పును, ప్రగతినికోరే హేతువాదులు, క్రైస్తవ మత ప్రచారకులు పూర్వాచార పరాయణుల వాదాన్ని వ్యతిరేకించారు. 1813-1828 మధ్య కాలంలో సంప్రదాయ, ఉదార వాదాల మధ్య సంఘర్షణ జరిగింది. ఆడమ్ స్మిత్, జెరెమి బెంథమ్, జేమ్స్ మిల్ పాత సిద్ధాంతాలను దుయ్యబట్టారు. పాశ్చాత్య విజ్ఞానాన్ని ఇండియాలో ప్రవేశపెట్టాలని మిల్ సూచించాడు. ఇండియాలో ఆధునిక విద్యకు ప్రోత్సాహమివ్వాలని పెక్కుమంది కంపెనీపై వత్తిడి తీసుకురావడం ప్రారంభించారు. ఫలితంగా 1813 ఛార్టర్ చట్టం రూపొందింది. దీని ప్రకారం ప్రథమంగా విద్యాబాధ్యతను ప్రభుత్వం గైకొన్నది. ఇండియాలో విద్యావ్యాప్తికి, కంపెనీ ఏటా లక్ష రూపాయలను ఖర్చు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం ఆదేశించింది. ఈ డబ్బును ప్రాచ్య విద్యాభివృద్ధి కోసం ఖర్చు పెట్టాలని కొందరు, పాశ్చాత్య విద్యా విజ్ఞానాల అభివృద్ధికోసం ఉపయోగించాలని మరికొందరు వివాదపడ్డారు. చివరకు రాజారామ్ మోహన్‌రాయ్ తదితర సంస్కర్తల ప్రోత్సాహంతో, పాశ్చాత్య విద్య విజ్ఞానాల వ్యాప్తికి ఈ డబ్బును ఉపయోగించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సందర్భంలో మెకాలే తన వాదనను సమర్థిస్తూ ఒక నివేదిక సమర్పించాడు. దీనినే 'మెకాలేస్ మినిట్స్' అంటారు. తన వాదనలో మెకాలే నిర్ద్వంద్వంగా కంపెనీవారి విద్యా

లక్ష్యాలను ప్రకటించాడు. "రంగులో రక్తంలో భారతీయులేదైనా, మేధాసంపత్తిలో, విజ్ఞానంలో యూరోపియన్‌లుగా తయారు చేయాలి" అన్నది అతని లక్ష్యం. గవర్నర్ జనరల్ బెంటింగ్ మెకాలే ఉద్దేశాలతో ఏకీభవించి 1835 మార్చి 7న ఆంగ్ల భాషను బోధనా భాషగా గుర్తిస్తూ ఉత్తరువు జారీ చేసాడు. 1844లో లార్డ్ హార్డింజ్ ఆంగ్ల పాఠశాలల్లో చదివిన భారతీయ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించాడు. ఫలితంగా బెంగాల్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో ఆంగ్ల విద్యా బోధనకు ఎంతో ఆదరణ లభించింది. 1813-1853 మధ్య కాలం లో పెద్ద సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఈ కాలంలోనే ఇండియాలో క్రైస్తవ మత సంస్థల కార్యకలాపాలు అధికమయ్యాయి. బాలికల విద్యాభ్యాసానికి అధికారికంగా అనుమతి లభించింది. వైద్య వృత్తి విద్యలు ఆరంభమయ్యాయి. అయితే విద్యపై ఎక్కువ మొత్తంలో డబ్బును ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంవల్ల కొద్దిపాటి ఆంగ్ల పాఠశాలలను, కళాశాలలను మాత్రమే నెలకొల్పడం జరిగింది. దీంతో సామాన్య ప్రజలకు విద్యాభ్యాసానికి అవకాశం లేకుండా పోయింది. తమ ఆధునిక విద్య ఉన్నత, మధ్య తరగతికి చెందిన కొద్దిమంది విద్యార్థులకు మాత్రమే పరిమితమని, తమ పాఠశాలల్లో విద్యాబోధన పొందినవారు మిగిలిన ప్రజలలో విద్యా వ్యాప్తికి కృషి చేయాల్సి ఉంటుందని బ్రిటిష్‌వారు వాదించారు. దీనినే 'అధోముఖగాలన' సిద్ధాంతం అంటారు.

**ఆంధ్ర ప్రాంతంలో విద్యావ్యాప్తి :** లార్డ్ మన్రో గవర్నర్‌గా వున్న కాలంలో మద్రాస్ రాష్ట్రంలోని విద్యావిధాన చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. విశ్వసనీయ వర్గాల ద్వారా దేశీయ విద్యా విధానం గురించి తెలుసుకోవాలని మన్రో 1822 లో ఉత్తరువు చేశాడు. విద్యా స్వభావం గురించీ, పాఠశాలల సంఖ్య గురించీ, ఇతర ఆసక్తికర విషయాల గురించి నివేదికలు కావాలని మన్రో జిల్లా కలెక్టర్లను కోరినాడు. దేశంలో బీదరికం పెరగడంవల్ల దేశీయ పాఠశాల వ్యవస్థ క్షీణ స్థితిలో ఉందని బళ్ళారి జిల్లా కలెక్టర్ కాంప్‌బెల్ తన నివేదికలో తెలిపాడు. ప్రతి వెయ్యిమంది జనాభాకు ఏడుగురు విద్యార్థులు ఉన్నట్లు, ప్రతి విద్యార్థి అనేక పద్యాలు ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా వల్లించగలడు గాని, ఆ పద్యాలకు అర్థం తెలియదని కాంప్‌బెల్ తన నివేదికలో పేర్కొన్నాడు. ఈ పరిశీలన తర్వాత 1826లో రాష్ట్ర రాజధానిలో 'పౌర విద్యా సమితి' నెలకొల్పబడింది. ప్రతి జిల్లాలోనూ రెండు ప్రధాన పాఠశాలలూ, ప్రతి తాలూకాలోనూ ఒక పాఠశాల నెలకొల్పడానికి, ఉపాధ్యాయులను తర్ఫీదు చేసేటందుకు పాఠ్య పుస్తక సంఘానికి విరాళం ఇవ్వడానికి ఆ సమితికి అధికారం ఇవ్వబడింది. ఇందుకుగాను మన్రో కోరినట్లు డైరక్టర్ల సమితి 1826లో 50 వేల రూపాయల సాలుసరి గ్రాంటు మంజూరు చేసింది. దీని ప్రకారం 14 జిల్లా పాఠశాలలూ, 18 తాలూకా పాఠశాలలూ, మద్రాస్‌లో ఒక కేంద్ర పాఠశాల నెలకొల్పబడింది. మన్రో మరణం తర్వాత ఈ పథకం క్షీణించి, చివరకు 1836లో ఉపసంహరించబడింది.

ఉదారవాద భావాలు ఇంగ్లండులో వ్యాప్తి చెందిన ఫలితంగా 1833-1853 మధ్య కాలంలో కంపెనీ పాశ్చాత్య జ్ఞానం వ్యాప్తి చేయాలనే లక్ష్యాన్ని అమలు పరచింది. మద్రాసు రాష్ట్రంలో విద్య కొరకు ఖర్చు పెట్టడానికి 50 వేల రూపాయలు కేటాయించబడినవి. కాని ఈ మొత్తంలో సగానికి కొంచెం పైగా మాత్రమే ఖర్చు పెట్టబడింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ మొత్తం చాలా తక్కువ. సామాన్య ప్రజలకు విద్య నేర్పించేటందుకు ప్రత్యక్ష బాధ్యతను 1854 వరకు కంపెనీ వహించలేదు. విద్య క్రమ క్రమంగా పై వర్గాల నుండి కిందికి దిగుతుందనే విధానాన్ని కంపెనీ అనుసరించింది. కానీ ఈ విధానంవల్ల ఆశించిన ఫలితాలు కలగలేదు.

19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంధ్ర దేశంలోని అనేక ప్రాంతాలలో ఆంగ్ల భాష పాఠశాలలు నెలకొల్పడంతో విద్యాభివృద్ధి చాలా మెరుగైంది. రాజమండ్రి సబ్ డివిజన్‌లో సబ్ కలెక్టర్ జి.యన్. టేలర్ రేట్ స్కూళ్ళు స్థాపించడంలో ఆ పని సులభమైంది. 1852లో టేలర్ ప్రయోగ ప్రాతిపదికమీద స్థానిక చందాల సాయంతో నడిచే పాఠశాలలు నరసాపూర్, పాలకొల్లు, పెనుగొండ, ఆచంటలలో ప్రారంభించాడు. సమర్థంగా పనిచేసిన ఈ పాఠశాలలు కొంతవరకు సంపన్నులైన రైతులు గల అనేక పరిసర గ్రామాల ప్రజల దృష్టిని ఆకర్షించాయి. తమ పిల్లల విద్య కొరకు అయ్యే ఖర్చు నిమిత్తం చందాలు ఇస్తామని ముందుకు వచ్చిన గోదావరి డెల్టా రైతుల కోరికలను టేలర్ ప్రభుత్వానికి 1854లో నివేదించాడు. టేలర్ ప్రభుత్వానికి సమర్పించిన విజ్ఞప్తిలో తమిళ ప్రజలకు 950 పాఠశాలలు వుండగా, మద్రాస్ రాష్ట్రంలో తెలుగు సమర్థంగా బోధించే పాఠశాలలు 30 మాత్రమే ఉన్నాయి అని పేర్కొన్నాడు. అతని ప్రతిపాదన అంగీకరించబడి టేలర్ వ్యవస్థగా, రాజమండ్రి విద్యా వ్యవస్థగా పేరుగాంచింది. ఇంతవరకు సాధింపబడినదానికీ, కొంత వరకు ఇలాంటిదే అయిన వ్యవస్థను దేశమంతటా ప్రవేశపెట్టినందుకూ అందరికంటే ఎక్కువగా టేలర్‌ను అభినందించాలి అని ప్రజా విద్యాశాఖ డైరెక్టర్ ఎ.జె. అర్బుత్ నాట్ మద్రాస్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాశాడు. ఈ పద్ధతి 1862 తర్వాత కూడా కొనసాగించబడింది. అప్పటి నుండి రైతులు ఇచ్చే చందాలకు సమానమైన మొత్తాన్ని ఇవ్వడానికి

ప్రభుత్వం ముందుకు వచ్చింది. కొన్ని వర్గాల నుండి కొన్ని తీవ్రమైన ఆక్షేపణలు వచ్చినందుకు, అలాంటి పాఠశాలల విషయం చివరకు రైతుల ఇష్టానిష్టాలకు వదలివేయబడింది. రాజమండ్రి ప్రాంతంలో ఈ పాఠశాలల స్థాపనతో విద్యా వాతావరణం ఏర్పడింది. ఇంగ్లీష్ కావాలని ప్రజలు కోరడమేగాక, చాలాచోట్ల మంచి ఉపాధ్యాయుల కొరకు అర్జీలు పెట్టుకొన్నారు. తరువాతి కాలంలో ఆంధ్రదేశంలోని సంస్కరణ కార్యకలాపాలకు కేంద్రమైనట్టి గోదావరి జిల్లాలో విజ్ఞాన ప్రబోధం ఈ పాఠశాలలతో ప్రారంభమైయింది. రాజమండ్రి చుట్టూ పాఠశాలలు ప్రారంభించడం ఆంధ్ర దేశంలో విద్యా వ్యాప్తికీ, అభివృద్ధికీ ప్రభుత్వం చేసిన మొదటి ప్రముఖ ప్రయత్నం.

**1854-1900 మధ్య కాలంలో విద్యావ్యాప్తి (మూడో దశ)** : డల్హౌసీ పాలనా కాలంలో పార్లమెంట్ ఆదేశంతో 1854లో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అధ్యక్షుడైన సర్ ఛార్లెస్ ఉడ్ ఒక గొప్ప విద్యా పథకాన్ని రూపొందించాడు. ఇండియాలో ఆంగ్ల విద్యా వ్యాప్తికి దీనిని ఒక 'మాగ్నా కార్టా'గా భావిస్తారు. ఇండియా ఆధునిక విద్యా చరిత్రలో ఇదొక మైలురాయి. ఇండియాలో విద్యావ్యవస్థ అభివృద్ధి చెందడానికి అవసరమైన సమగ్ర ప్రణాళికను రూపొందించడానికి ఇది ఎంతగానో దోహదం చేసింది. ఈ పథకం అంత వరకూ బ్రిటీష్‌వారు అనుసరిస్తూ వచ్చిన 'అధోముఖ గాలన' సిద్ధాంతాన్ని తిరస్కరించింది.

**ఉడ్ పథకంలోని ముఖ్యాంశాలు** : 1) ఇండియాలో విద్యా వ్యాప్తికై ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ శాఖను ఏర్పాటు చేయాలి. 2) ప్రతి రాజధాని ముఖ్య పట్టణంలో ఒక విశ్వ విద్యాలయం స్థాపించాలి. 3) పాఠశాలల్లో విద్య నేర్పు ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా విద్యా బోధనాభ్యాస కళాశాలలు ఏర్పాటు చేయాలి. 4) ప్రస్తుతం ఉన్న కళాశాలలు, ఉన్నత పాఠశాలలను ప్రోత్సహించడమేగాక అవసరమయిన కొత్తవాటిని స్థాపించాలి. 5) ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువగా దేశీయ విద్య, దేశభాషలకు ప్రాధాన్యం ఇవ్వాలి. 6) ప్రభుత్వ విద్యా సంస్థలకు తగిన ధన సహాయం చేయాలి. 7) ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో ఆంగ్ల భాషయే బోధనా భాషగా ఉండాలి. 8) ప్రభుత్వం విద్యా సంస్థలకు ధన సహాయం చేసే సందర్భంలో మతానికి ప్రాధాన్యం ఇవ్వక నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. 9) విద్యార్థులలో అర్హులైన వారికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. 10) ప్రభుత్వం స్త్రీ విద్యకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలి. 11) విశ్వ విద్యాలయాలు కేవలం బోధనా సంస్థలుగా కాకుండా పరీక్షా సంస్థలుగా ఉండి, వాటికి అనుబంధ కళాశాలలు ఉండాలి. 12) పాఠశాలల్లో, కళాశాలల్లో లౌకిక విద్యనే బోధించాలి.

19వ శతాబ్దం రెండో అర్ధభాగం నుంచే ఉడ్ పథకం రూపొందించిన విధానాలను ప్రభుత్వం క్రమంగా అమలు చేయడం ప్రారంభమయింది. మద్రాస్, బొంబాయి, బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలలో 1855లో ప్రత్యేక విద్యా విభాగాల ఏర్పాటు ప్రారంభమయింది. తరువాత ఇది మిగిలిన రాష్ట్రాలకు కూడా వ్యాపించింది. విద్యా రంగంలో ఉన్నత పదవులకు అభ్యర్థులను ఎంపిక చేయడానికి 1897లో ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీస్ ఏర్పడింది. 1857లో కలకత్తా విశ్వ విద్యాలయం, బొంబాయి విశ్వ విద్యాలయం, మద్రాస్ విశ్వ విద్యాలయం తరువాత పంజాబ్, అలహాబాద్ విశ్వవిద్యాలయాలు నెలకొల్పడం జరిగింది. ఈ విశ్వ విద్యాలయాలకు అనుబంధంగా ఇంజనీరింగ్, వైద్య, ఆర్ట్స్, సైన్స్, లా కళాశాలలో ఏర్పాటై విద్యా విధానం ఒక ఆదర్శమైన విధానంగా రూపొందించడం జరిగింది.

ఉడ్ నివేదిక ఎంతవరకు అమలుజరిగిందో, ఎటువంటి ఫలితాలను సాధించిందో తెలిసికోవడానికి, విద్యా వ్యాప్తికై ఇతర సూచనలను స్వీకరించడానికై రిప్పన్ ప్రభుత్వం 1882లో హంటర్ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమైన సమాచారం సేకరించిన తర్వాత హంటర్ కమీషన్ కొన్ని సూచనలను చేసింది.

**హంటర్ కమీషన్ సూచనలు** : 1) విద్యాలయాలపై నెమ్మదిగా ప్రభుత్వ యాజమాన్యం తొలగించి, ప్రైవేటు సంస్థలకు అప్పగించటం. 2) ప్రాథమిక విద్యకు ఇతోధిక ప్రోత్సాహమివ్వడం 3) కళాశాలల్లో శిక్షణకై విద్యార్థులకు ప్రత్యామ్నాయ విషయాలను ప్రవేశపెట్టడం. 4) ప్రభుత్వ గ్రాంటు పొందే విద్యాలయాలు విద్యార్థుల నుంచి తక్కువ రుసుము వసూలు చేయడం 5) ఉపకార వేతనాలు ఇచ్చు విధానం క్రమబద్ధీకరించడం 6) ప్రతి కళాశాలలోనూ పౌరుని విధులను గురించి ఉపన్యాసాలను ఇప్పించటం 7) ముస్లింలలో విద్యావ్యాప్తికై ప్రత్యేక కృషి జరపడం 8) మత సంబంధం లేని నీతి బోధన చేయడం. 9) దేహారోగ్యానికి తోడ్పడే విద్యను విద్యార్థులకు నేర్పించడం 10) విద్యాలయాలు సరిగ్గా నిర్వహించడానికై విద్యాశాఖాధికారులచే తనిఖీ చేయించడం.

హంటర్ కమీషన్ నివేదికను ప్రభుత్వం అంగీకరించి, అమలు పరచింది. ఫలితంగా దేశంలో ఉన్నత విద్య శీఘ్రగతిని పురోగమించింది. దేశంలో ప్రాంతీయ విద్య అభివృద్ధి చెందింది. ప్రైవేటు సంస్థలు విద్యాభివృద్ధికి కృషి చేశాయి.

**ఆంధ్ర ప్రాంతంలో విద్యావ్యాప్తి :** రాజమండ్రి సబ్ డివిజన్‌లో సబ్ కలెక్టర్ టేలర్ 1854-1859 మధ్య కాలంలో ప్రతి రైతు నుండి 60 రూపాయలు వసూలు చేసి 100 స్కూళ్ళు స్థాపించాడు. అయితే టేలర్ విధానం విఫలమయింది. అందుకు కారణం పిల్లలు లేని రైతులనుండి కూడా డబ్బు వసూలు చేయడం, ఒక గ్రామంలోని మిగులు నిధులు మరో గ్రామానికి తరలించి స్కూళ్ళు స్థాపించాడు. 1863 నాటికి వసూలు చేయు డబ్బు తగ్గసాగింది. 1863 నాటి విద్యా చట్టం ప్రకారం ఈ స్కూళ్ళు కొంతకాలం నడిచాయి. 1871లో లోకల్ ఫండ్ చట్టం ప్రకారం ఈ స్కూళ్ళను స్థానిక బోర్డులకు బదిలీ చేయడం జరిగింది. దీంతో మరొక్కసారి విద్యాభివృద్ధికి గొప్ప మార్పు లభించింది. లోకల్ ఫండ్ చట్టం ప్రాథమిక పాఠశాలల నిర్వహణకు, ఉపాధ్యాయుల తర్ఫీదుకూ, పాఠశాల భవనాల నిర్మాణానికి ఇంటి పన్నుల ద్వారా నిధులు సమకూర్చింది. 1871 నాటి చట్టం 3 పట్టణాలకు, చట్టం 4 గ్రామీణ ప్రాంతాలకు ఈ ఏర్పాటు చేసింది. ఈ విధంగా మునిసిపల్ నిధులు విద్యాభివృద్ధి కొరకు వినియోగించవచ్చని ప్రకటించబడింది. ఫలితంగా అనేక పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. 19 వ శతాబ్దపు ఉత్తరార్థంలో మద్రాస్ రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతంలో విద్య గొప్పగా అభివృద్ధి చెందింది. ప్రభుత్వంయొక్క, ప్రైవేటు సంస్థల యొక్క సంయుక్త ప్రయత్నాలవల్ల 1862 కూ 1899కీ మధ్య విద్యారంగంలో కలిగిన ఫలితాలు ఈ క్రింది విధంగా ఉంది.

| జిల్లా | సంవత్సరం | పాఠశాలల సంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|---|
| కృష్ణా | 1862 - 63 | 7 | 633 |
| | 1867 - 68 | 26 | 1135 |
| | 1879 - 80 | 731 | 12859 |
| | 1898 - 99 | 1801 | 46937 |
| గోదావరి | 1862 - 63 | 115 | 2597 |
| | 1867 - 68 | 116 | 3330 |
| | 1879 - 80 | 702 | 17476 |
| | 1898 - 99 | 1604 | 53955 |
| విశాఖ పట్నం | 1862 - 63 | 16 | 635 |
| | 1867 - 68 | 28 | 1402 |
| | 1879 - 80 | 496 | 10167 |
| | 1898 - 99 | 1354 | 34603 |
| నెల్లూరు | 1862 - 63 | 9 | 204 |
| | 1867 - 68 | 226 | 3918 |
| | 1879 - 80 | 554 | 9685 |
| | 1898 - 99 | 1151 | 27015 |
| కడప | 1862 - 63 | 23 | 568 |
| | 1867 - 68 | 47 | 997 |
| | 1879 - 80 | 308 | 4715 |
| | 1898 - 99 | 841 | 17802 |
| కర్నూలు | 1862 - 63 | 2 | 133 |
| | 1867 - 68 | 5 | 202 |
| | 1879 - 80 | 228 | 3687 |
| | 1898 - 99 | 670 | 14838 |

రాయలసీమ కంటే ముందుగా సర్కారు జిల్లాలు బ్రిటిష్ ప్రభావం కిందికి రావడం, మిషనరీల విద్యా కార్యకలాపాలు, టేలర్ వ్యవస్థ కారణాలుగా రాయలసీమ కంటే సర్కార్ జిల్లాల్లో విద్య వేగంగా అభివృద్ధి చెందింది.

1854 - 1882 మధ్య కాలంలో ఆంధ్ర ప్రాంతంలో నాల్గు కళాశాలలు ప్రారంభింపబడ్డాయి. పాఠశాలల స్థాపనకు ప్రజల వద్ద నుండి విరాళాలు బాగా రానందువల్ల ప్రభుత్వమే ఎక్కువ పాఠశాలలు ప్రారంభించి. పిల్లలకు విద్య నేర్పించాలని విజ్ఞప్తి చేయబడింది. ఏమైనప్పటికీ గ్రామాలలో అతి కొద్దిగా ప్రాథమిక పాఠశాలలు తప్ప మొత్తం పాఠశాలలూ, కళాశాలలూ పట్టణ ప్రాంతాల్లో స్థాపించబడినందున విద్య పట్టణాలకు పరిమితమైంది. అంతేగాక విద్యావ్యాప్తి సమాజంలోని ఉన్నత, మధ్య తరగతులకు పరిమితమైంది. 1883-84 మధ్య కాలంలో మద్రాస్ రాష్ట్రంలోని హిందూ విద్యార్థుల కుల వివరాలను బట్టి ఈ విషయం స్పష్టమవుతుంది. ఉన్నత విద్యలో బ్రహ్మణులది పై చేయిగా వుండగా, ప్రాథమిక విద్యలో బ్రహ్మణేతరులూ, హరిజనులు అంతగా వెనకబడిలేరు.

హంటర్ కమీషన్ సూచనల మేరకు 1889-90 నాటికి విద్యా నిబంధనలలో అనేక మార్పులు చేయడం జరిగింది. ఫలితంగా 1891 నాటికి అనేక ఇబ్బందులున్నప్పటికీ 'మాల'లలో 1.13%, 'మాదిగ'లలో 0.46% విద్యాభివృద్ధి జరిగింది. 1893 నాటి ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం హరిజనుల విద్యకు ప్రోత్సాహం కల్పించబడింది. ఈ ఉత్తర్వు ప్రకారం హరిజనులకు మద్రాస్‌లో ఒక శిక్షణా పాఠశాలను ప్రారంభించడం జరిగింది. హరిజన గ్రామాల్లో ప్రత్యేక పాఠశాలలను హరిజనులకు ప్రారంభించాలని స్థానిక సంస్థలను కోరడం జరిగింది. 1898 నాటికి హరిజనుల్లో 5% విద్యాభివృద్ధి జరిగింది. హరిజనులకు స్కూళ్ళలో ప్రవేశం నిరాకరించకూడదని 1899 విద్యా కమీషన్ కోరింది. అయినప్పటికి 19వ శతాబ్ది చివరి నాటివరకు హరిజనుల విద్య ప్రధానంగా మిషనరీల ద్వారానే జరిగింది.

**1900 - 1920 మధ్య కాలంలో విద్య : (వాల్గోదశ) :** వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోని 'లా' సభ్యుడు థామస్ రాలీగ్ అధ్యక్షతన కర్జన్ 1902లో విశ్వ విద్యాలయ కమీషన్‌ను ఏర్పాటు చేశాడు. ఆ కమీషన్ సిఫార్సు ఆధారంగా 1904 భారతీయ విశ్వ విద్యాలయాల చట్టాన్ని ఆమోదించడమైంది. ఫలితంగా ఉన్నత విద్యకు సంబంధించిన పరిస్థితులు గణనీయంగా మెరుగుపడ్డాయి. విశ్వ విద్యాలయాలపై ప్రభుత్వ అదుపును ఈ చట్టం మరింత పటిష్టం చేసింది. బ్రిటిష్ చక్రవర్తి 1912లో భారత దేశంలో విద్యా వ్యాప్తికై 50 లక్షల రూపాయలు కేటాయిస్తూ, భారత ప్రజల అన్ని రంగాల అభివృద్ధి తమకు అత్యంత ప్రియతమమైన విషయంగా పేర్కొన్నాడు. కర్జన్ కార్యనిర్వాహకవర్గ విద్యా విషయాల సభ్యుడైన సర్ హెన్రీ బట్లర్ విశ్వవిద్యాలయాల పరిధిని తగ్గించాలని సూచించాడు. ఫలితంగా వివిధ ప్రాంతాల్లో ఆరు విశ్వ విద్యాలయాలు స్థాపించబడ్డాయి. 1916లో కార్వే పూనాలో స్త్రీలకు ప్రత్యేక విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. 1920లో అలహాబాద్ విశ్వ విద్యాలయం, 1921లో శాంతి నికేతన్‌లో విశ్వ భారతి విద్యాలయాలు స్థాపించబడ్డాయి.

కలకత్తా విశ్వ విద్యాలయం పని తీరును సమీక్షించడానికి చెమ్స్ ఫర్డ్ 1917-19లో శాడ్లర్ కమీషన్ ఏర్పాటు చేశాడు. సెకండరీ విద్యను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు వదలాలని, డిగ్రీకోర్సు కాలపరిమితిని మూడేళ్ళుగా నిర్ణయించాలనీ ఈ కమీషన్ సిఫార్సు చేసింది.

ఈ దశలోనే గాంధీ, లాలాలజపతిరాయ్, అనిబిసెంట్ మొదలయినవారు 'జాతీయ విద్య' అనే భావనను రూపొందించారు. మాతృదేశంపై ప్రేమను, భక్తినీ పెంపొందించే కొత్త విద్యా విధానాన్ని రూపొందించాలని వారు కోరారు. ఫలితంగా కాశీ విద్యాపీఠ్, జామియా మిలియా ఇస్లామియా వంటి జాతీయ విద్యా సంస్థలు ఏర్పడ్డాయి. 1906లో అరవింద ఘోష్ కలకత్తాలో ఒక కళాశాలను స్థాపించాడు. 1909లో మచిలీ పట్నంలో ఆంధ్ర జాతీయ కౌన్సిల్ ఒక జాతీయ కళాశాలను స్థాపించింది.

**ఆంధ్ర ప్రాంతం :** జాతీయ విద్యను ప్రవేశపెట్టాలనీ, యువజనులలో శరీర సౌష్టవం పెంపొందించేటందుకు వ్యాయామ శాలలు నెలకొల్పాలనీ ఆంధ్రలో కొన్ని జిల్లా మహాసభలు తీర్మానాలు చేశాయి. స్థానిక ఉపాధ్యాయులతో, కళా, సంగీతమూ, శిల్పములాంటి విషయాలు పాఠ్య ప్రణాళికలో భాగంగా వుంటూ, దేశీయుల విరాళాలతో జాతీయ విద్య సాగాలనే అభిప్రాయం బాగా ప్రచారంలోకి వచ్చింది. మహాసభల తీర్మానాలననుసరించి మచిలీపట్నం, మదనపల్లిలో అలాంటి విద్యా సంస్థలు ప్రారంభించబడినాయి. ఈ కాలంలోనే రాజమండ్రిలో జాతీయ ఉన్నత పాఠశాల స్థాపించబడింది. ఒంగోలు, కడప, ఇంకా ఇతర ప్రాంతాలలో కూడా జాతీయ సంస్థలు స్థాపించబడినాయి.

**1920-47 మధ్య కాలంలో విద్య (ఐదోదశ) :** ఈ కాలంలో ప్రథమంగా అధికారికంగా విద్య భారతీయ నియంత్రణలోకి వచ్చింది. మాంటేగు చెమ్స్‌ఫర్డ్ నిబంధనలననుసరించి విద్యను రాష్ట్ర జాబితాకు బదిలీ చేయడమైంది. రాష్ట్రాల శాసన మండలికి సంబంధించిన మంత్రికి విద్యాశాఖ బాధ్యతలను అప్పగించాలని ఈ చట్టం సూచించింది. ఫలితంగా విద్యకు సంబంధించిన అన్ని స్థాయిల్లోనూ మునుపెన్నడూ లేని విస్తరణ చోటు చేసుకుంది. అంతేకాకుండా ఉన్నతస్థాయి విద్యకు సంబంధించిన ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయి. దీనికి శాడ్లర్ కమీషన్ చేసిన సిఫార్సులు తోడ్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వ విద్యా విషయాల సలహాదారు సర్‌జాన్ సార్జెంట్ 6 నుండి 14 సంవత్సరాల మధ్యగల బాలబాలికలకు సార్వత్రిక, నిర్బంధ, ఉచిత విద్యాబోధన సదుపాయం కల్పించాలని 29.5 కోట్ల రూపాయల పథకాన్ని రూపొందించాడు. ఈ పథకం దేశ సేవకై అవసరమయ్యే, ఒక జాతీయ యువదళాన్ని ఉద్దేశించింది. ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతి జిల్లాలో కొన్ని గ్రామాలలో అమలుచేసింది.

ఈ దశలో ప్రభుత్వం సాంకేతిక విద్యకు ప్రత్యేక శ్రద్ధ చూపలేదు. ఫలితంగా మద్రాస్ రాష్ట్రం పారిశ్రామికంగా చాలా వెనకబడింది. ఈ క్రింది పట్టికను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. 1928 నాటి మద్రాస్ రాష్ట్రంలో :

| ప్రాంతం | ప్రభుత్వ సాంకేతిక స్కూళ్ళు | విద్యార్థులు | ప్రభుత్వ సహాయం గల స్కూళ్ళు | విద్యార్థులు |
|---|---|---|---|---|
| తమిళనాడు | 5 | 1298 | 45 | 3167 |
| ఆంధ్ర | - | - | 13 | 432 |
| మలబార్ | - | - | 2 | 81 |
| దక్షిణ కనరా | - | - | 3 | 118 |

**1939లో మద్రాస్ రాష్ట్రంలో :**

| ప్రాంతం | ప్రభుత్వ సాంకేతిక స్కూళ్ళు | విద్యార్థులు | ప్రభుత్వ సహాయ స్కూళ్ళు | విద్యార్థులు | |
|---|---|---|---|---|---|
| | | | | బాలురు | బాలికలు |
| తమిళనాడు | 4 | 1621 | 56 | 2791 | 853 |
| ఆంధ్ర | - | - | 11 | 417 | 91 |
| మలబార్ | 1 | 99 | 5 | 132 | 69 |
| దక్షిణ కనరా | 2 | 121 | 3 | 19 | 82 |

పై పట్టికను పరిశీలిస్తే మద్రాస్ రాష్ట్రంలోని 82 సాంకేతిక స్కూళ్ళలో 11 మాత్రమే ఆంధ్రాలో కలవు. అంతేగాక స్త్రీలలో సాంకేతిక విద్య చాలా తక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఈ స్కూళ్ళలో శాస్త్ర సంబంధమైన విద్య కాకుండా సాంకేతిక విద్య మాత్రమే బోధించడం జరిగింది. మద్రాస్ రాష్ట్రంలోని మంత్రివర్గం సాంకేతిక విద్యయొక్క ప్రాముఖ్యాన్ని గుర్తించినా, సాంకేతికాభివృద్ధికి ఎట్టి చర్యలు చేపట్టలేదు.

## 5.5 ప్రగతి శీల ఉదారుల, సంస్థల కృషి :

ఇండియాలో ఆధునిక విద్యను వ్యాప్తి చేయడంలో ప్రగతి శీల ఉదారులు గొప్ప కృషి చేశారు. అందుకు రాజారామ్ మోహనరాయ్ మార్గదర్శకుడయ్యాడు. ఇతడు పాశ్చాత్య దేశాల్లో ఏర్పడ్డ శాస్త్రీయ, ప్రజాస్వామిక భావాలు, చింతనగల ఆంగ్ల విద్యను ప్రశంసించాడు. ఇండియాలో ప్రాచీన విద్యా విధానాన్ని కొనసాగించినట్లయితే అది మూఢ నమ్మకాలు, పెత్తన చెలాయింపు స్థిరత్వానికి దారితీస్తుందని, సంస్కృత విద్యా విధానం ఇండియాను అంధకారంలో ఉంచుతుందని ఇతడు తెలియజేసాడు. బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, రామకృష్ణమఠం, ఆలీగడ్ ఉద్యమంలాంటి సంస్థలు ఆధునిక విద్యా వ్యాప్తికి కృషి చేశాయి. దేశ్‌ముఖ్ చిప్లుంకర్, అగార్కర్, మగన్ బాయ్ కరంచంద్, కార్వే, తిలక్, గోఖలే, మాలవ్యా, గాంధీ, వీరేశలింగంలాంటి వ్యక్తులు ఆధునిక విద్యను బోధించే విద్యా సంస్థలను దేశమంతటా స్థాపించడానికి కృషి చేశారు. వీరిలో కొందరు స్థాపించిన విద్యా సంస్థల్లో మతపరమైన బోధనను చేర్చారు. ఈ రకమైన సంస్థలకు ప్రతీకలు: బెనారస్‌లో మదన

మోహన మాలవ్యా స్థాపించిన బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం, సర్ సయ్యద్ అహమ్మద్‌ఖాన్ స్థాపించిన ఆలీఘడ్ విశ్వ విద్యాలయం. మరి కొందరు ఇండియా ప్రజల్లో జాతీయ ఆత్మ గౌరవాన్ని పెంపొందించగల్గే పాఠ్య పుస్తకాలను ప్రవేశపెట్టారు. అయితే అందరూ ఆధునిక విద్య ప్రధాన లక్షణాలైన నిరంకుశత్వ వ్యతిరేక ఉదారవాద తత్వం, వ్యక్తి స్వేచ్ఛా ప్రాధాన్యత, గుడ్డి నమ్మక తిరస్కృతి, ఆధునిక ప్రకృతి శాస్త్రాల విలువలను ఆమోదించారు. విదేశీ ప్రభావాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆర్య సమాజం ప్రారంభించిన విద్యా సంస్థల్లో కూడా ఆధునిక విద్యను అంగీకరించి బోధించాయి. అయితే వేదాల ఆమోఘత్వ సిద్ధాంతంలాంటి కొంత మతపరమైన బోధన దీనికి చేర్చడమైంది.

**ఆంధ్ర ప్రాంతంలో :**

ఆంధ్ర ప్రాంతంలో ఆధునిక విద్యను వ్యాప్తి చేయడంలో పెక్కుమంది గణనీయమైన కృషి సల్పారు. వీరిలో ధనవంతులు, జమీందారులు, పురుషులు, స్త్రీలు ఉన్నారు.

**గోడే వంశస్థులు :** విశాఖపట్నం జిల్లాలోని ప్రసిద్ధ గోడే వంశానికి చెందిన సూర్య ప్రకాశరావు భార్య జానకమ్మ విశాఖపట్నంలో 1867లో హిందూ బాలికల కొరకు ఒక పాఠశాల ప్రారంభించింది. ఆమె మరణించిన తరువాత ఆమె కుమార్తె రత్నమ్మ ఆ పాఠశాలను నిర్వహించింది. విద్యా పర్యవేక్షణ కొరకు ఆమె జోసెఫ్ ఫ్రెంచి కాన్వెంటుకు చెందిన సన్యాసినుల సాయం స్వీకరించింది. ఆ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు భాషలతో బాటు చిత్రలేఖనం, సంగీతం, అల్లిక పనిలాంటి కళలూ, చేతిపనులూ కూడా బోధింపబడేవి. ఇది తరువాత కాలంలో సెయింట్ జోసెఫ్ కళాశాలగా అభివృద్ధి చెందింది. గోడే వంశానికి చెందిన పెద జగ్గారావు విశాఖపట్నంలో ఖగోళ పరిశోధనాశాలను నెలకొల్పాడు. అంతేగాక ఇతడు అనేక పరిశోధనా పత్రాలు ప్రచురించాడు. జగ్గారావు కుమార్తె అచ్చాయమ్మ తన భర్త ఇచ్చిన లక్షా పదిహేనువేల రూపాయలతో 1892లో శ్రీమతి అంకితమ్ వెంకట నరసింగారావు కళాశాలను స్థాపించింది. ఉత్తరాంధ్రలో విద్యాభివృద్ధికి ఈ కళాశాల ఎంతో కృషి చేసింది.

**పిఠాపురం జమిందారీ :** పిఠాపుర జమీందారీ విద్యా వ్యాప్తికి విశేషమైన కృషి చేసింది. కాకినాడలోని స్కూలుకి తగిన ధన సహాయం చేసి పిఠాపుర రాజా కళాశాలగా మార్చింది. బలహీన వర్గాలకు, స్త్రీలకు, హరిజనులకు విద్యా ప్రవేశాన్ని కల్పించి సాంఘిక సంస్కరణోద్యమంలో వారిని భాగస్వాములుగా చేసింది. పిఠాపురంలోని అనేక పాఠశాలలు, హరిజన లాడ్జిలు, కాకినాడలోని పాఠశాలలు, పిఠాపుర రాజా కళాశాల ప్రముఖ విద్యా కేంద్రాలుగా, సంస్కరణ పీఠాలుగా విలసిల్లాయి. వెంకటరత్నం నాయుడు పిఠాపురం రాజగు రావు సూర్యారావుకి ఆప్తుడే గాక, కళాశాల ప్రిన్సిపాలుగా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాడు.

**వీరేశలింగం :** కందుకూరి వీరేశలింగం స్త్రీ విద్యకు గొప్పగా కృషి చేశాడు. స్త్రీలు విద్యా వంతులైతేనే సమాజం ఔన్నత్యం పొందగలదనీ, వారికి విద్య, విజ్ఞాన, వికాసాలను కల్పించాలని భావించాడు. నాటి సమాజంలో స్త్రీకి విద్య అవసరమా? అనే చర్చ జరుగుతున్నప్పుడు, ఆ చర్చలలో వీరేశలింగం పాల్గొని స్త్రీలకు విద్య అవసరమని వాదించాడు. అతను స్థాపించిన 'వివేకవర్థిని' అనే మాసపత్రికలో (1874) స్త్రీ విద్యపై చాలా వ్యాసాలు ప్రచురించాడు. బాలికల కోసం ధవళేశ్వరంలో ఒక ప్రత్యేక పాఠశాలను స్థాపించాడు. తరువాత 1881లో రాజమండ్రిలో మరొక పాఠశాలను స్థాపించడం జరిగింది. స్త్రీలకై ప్రత్యేకంగా 'సతీహిత బోధిని' అనే పత్రికను ప్రారంభించాడు. తన భార్య రాజ్యలక్ష్మికి చదువునేర్పించి తాను చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొనడానికి వీలు కల్పించాడు.

**విజ్ఞాన చంద్రికా మండలి :** ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో అభివృద్ధి సాధించనిదే భారత దేశం ప్రగతి పథంలో అడుగు పెట్టలేదని గుర్తించిన కొమర్రాజు లక్ష్మణరావు, నాయని వెంకటరంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావులతో కలసి 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి' స్థాపనకు ప్రణాళిక వేశాడు. ఈ మండలి 1906లో స్థాపితమయింది. దీని కేంద్రం మొదట హైదరాబాద్‌లో వుంది. తరువాత మద్రాసుకు మార్చడం జరిగింది. ఏ క్లిష్ట విజ్ఞాన శాఖనైనా మాతృభాషలో బోధించినపుడే అది తేలికగా పరివ్యాప్తం కాగలదని మండలివారు భావించారు. దేశ చరిత్రలు, పదార్థ రసాయన, వృక్షశాస్త్రాలకు చెందిన అనేక గ్రంథాలు తెలుగువారి కందించిన ఈ మండలి కృషి ప్రశంసనీయం. పాశ్చాత్య విజ్ఞానాన్ని మాతృభాషలో ఈ మండలి తెలుగువారికి అందించింది.

**గాడిచర్ల హరి సర్వోత్తమరావు :** ఆంధ్ర దేశంలోని వివిధ ప్రాంతాలలో హరి సర్వోత్తమరావు వేసవి విద్యా కేంద్రాలు, వయోజన విద్యా కేంద్రాలు స్థాపించాడు. 'అడల్ట్ ఎడ్యుకేషన్ రెవ్యూ' సంపాదకుడుగా ఇతడు అనేక సంవత్సరాలు పనిచేసి, అనుభవం పొంది వయోజనులకు విద్యను ఎలా బోధించాలో తెలుగులో ఒక పుస్తకం వ్రాసాడు. ఇతడు విజయనగరం, కాకినాడ, పిఠాపురాలలో సమావేశాలు నిర్వహించాడు. కర్నూల్ జిల్లా కల్వబుగ్గలోని వేసవి పాఠశాలకు 1937లో ఇతడు అధ్యక్షుడు. 1941లో ఇతడు తెనాలి వయోజన విద్యా మహాసభకు అధ్యక్షుడు. పడమట, విజయవాడ, వేటపాలెం, చంద్రగిరి, అనంతపూర్, అనకాపల్లిలలో వయోజన విద్యా శిక్షణా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిలో వందల సంఖ్యలో ఉపాధ్యాయులు శిక్షణ పొంది వయోజన విద్యావ్యాప్తికి కృషి చేశారు. వాల్తేరు, విజయనగరంలలో తనంతట తానే శిక్షణా తరగతులు నిర్వహించాడు. వయోజనులకు శిక్షణా తరగతులు ప్రభుత్వం రద్దు చేస్తే, తెనాలి సమావేశంలో ఇతని అధ్యక్షతన ప్రభుత్వ ఉత్తర్వు రద్దుకు తీర్మానించాడు.

**శారదానికేతన్ :** శారదా నికేతన్ ఉన్నవ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గుంటూరులో స్థాపించబడింది. ఉన్నవ తన భార్య లక్ష్మీబాయమ్మతో గుంటూరులో 1922 నవంబర్ 24న కాకాని పురుషోత్తముగారి ఇంటిలో 10 మంది విద్యార్థినులతో శారదానికేతన్ స్థాపించారు. దీని పోషణకు పలువురు సహాయం చేశారు. మునగాల జమీందారు 4వేల రూపాయలు విరాళమిచ్చాడు. కొండా వెంకటప్పయ్య 10 వేల రూపాయలు విరాళముగా ఇచ్చాడు. కాశీనాధుని నాగేశ్వరరావు విరాళమిచ్చిన వారిలో ఒకరు. స్త్రీ విద్యావ్యాప్తి, స్త్రీ జనోద్ధరణకై గురుకుల పద్ధతిలో స్థాపించబడిన ఈ శారదా నికేతన్‌లో తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు బోధించడమేగాక సంగీతం, చిత్ర లేఖనం, కుట్టు, అల్లిక, పట్టు జరీ నగిషీ పనులు, నూలు వడుకుట మొదలగునవి నేర్పి స్త్రీలకు స్వయం ఉపాధిని కల్పించడంలో శారదానికేతన్ విశేషమైన పాత్ర నిర్వహించింది.

**వినయాశ్రమం :** రేపల్లె తాలూకా కావూరు ప్రాంతానికి చెందిన తుమ్మల బసవయ్య, అతని భార్య దుర్గాంబ తమకు చెందిన 15 ఎకరాల భూమిని ఆశ్రమ స్థాపనకు విరాళంగా ఇచ్చారు. స్వామి సీతారాం ఒక ఎకరం మాగాణి 25 ఎకరాల మెట్టభూమి విరాళంగా ఇచ్చారు. ఇతరులు 5 ఎకరాలు ఇచ్చారు. ఇదిగాక స్వామి సీతారాం నిధులను సేకరించి ఆశ్రమం నిర్మించాడు. దీనికి గాంధీ 1933 డిసెంబర్ 23న ప్రారంభోత్సవం చేసి 'వినయాశ్రమం' అని పేరు పెట్టాడు. ఈ ఆశ్రమం గాంధీ నిర్మాణ కార్యక్రమాలకు ఆటపట్టుగా నిలచింది. ప్రాథమిక విద్యా విధానంలో ఒక పాఠశాల, వేదాల తెలుగు అనువాద కార్యక్రమం, వయోజన విద్యా కార్యక్రమం, హరిజన పత్రికను తెలుగు అనువాదంలో నిర్వాహణ బాధ్యతలను ఆశ్రమంలో నిర్వహించారు. వీటికితోడుగా కోట లక్ష్మయ్య నాయుడు భూ విరాళంతో ఒక ఆయుర్వేద పాఠశాల, ధర్మాసుపత్రి నిర్వహించడం జరిగింది. ఈ ఆశ్రమాన్ని అనిబిసెంట్, వినోభాభావే, డా॥ రాజేంద్ర ప్రసాద్ దర్శించారు.

**శ్రీకృష్ణాశ్రమం :** తెనాలి తాలూకాలోని పెదపాలెం గ్రామంలో నల్లపాటి హనుమంతరావు ప్రోత్సాహంతో, గ్రామ పెద్దల ఔదార్యంతో 1916లో శ్రీకృష్ణాశ్రమం స్థాపించబడింది. తరువాత కేంద్ర స్థానాన్ని గుంటూరుకు తరలించడం జరిగింది. ఇందుకుగాను కోటా లక్ష్మయ్యనాయుడు కోబాల్ట్‌పేటలో దానంగా ఇచ్చిన 5 ఎకరాల స్థలంలో ఈ సంస్థను ప్రారంభించారు. ఆర్థిక కారణాలవల్ల ఈ సంస్థ 1930లో మూతపడగా 1936లో కొండా వెంకటప్పయ్య, మరికొంతమంది కలసి 'హరిజన్ ఇండస్ట్రియల్ స్కూల్' అను పేరుతో కాశీనాధుని నాగేశ్వరరావు అధ్యక్షతన పునరుద్ధరించారు. ఇందు సిమెంట్ శాఖ, వడ్రంగ శాఖ, మెటల్ కాల్పింగ్ శాఖ, బొమ్మల తయారీ శాఖ, కాగితపు తయారీ, ప్రింటింగ్ విభాగాలు పనిచేశాయి.

**ఇతరుల కృషి :** బిపిన్ చంద్రపాల్ ఆంధ్రప్రాంత పర్యటన సందర్భంగా రాజమండ్రిలో జాతీయ విద్యాపీఠం, మచిలీపట్నంలో జాతీయ కళాశాల స్థాపించబడ్డాయి. రాజమండ్రిలో జాతీయ విద్యా సంస్థను నెలకొల్పుటలో కరణం గున్నేశ్వరరావు ప్రముఖపాత్ర నిర్వహించాడు. ఇందుకోసం ఇతడు వేయి రూపాయలు ఇచ్చాడు. కోపల్లె హనుమంతరావు, హరి సర్వోత్తమరావుల కృషి ఫలితంగా మచిలీపట్నంలో జాతీయ కళాశాల రూపొందింది. కృష్ణా పత్రిక సంపాదకత్వాన్ని 1907లో స్వీకరించిన ముట్నూరి కృష్ణారావు జాతీయ కళాశాల నిర్మాణ కృషిలో సాటిలేని సేవచేశాడు. ఈ కళాశాలలోని పాఠ్య ప్రణాళికలో తీవాచీనేత పరిశ్రమకు స్థానం కల్పించబడింది. ఒంగోలు, కడప మొదలగు ప్రాంతాలలో కూడా జాతీయ సంస్థలు స్థాపించబడినవి. గుంటూరు వాస్తవ్యుడైన భావనాచారి పారిశ్రామిక శిక్షణకై యువకులను జపాన్‌కు

పంపుట సముచితమని సూచించాడు. ఈ విషయంలో సేతు సోదరులు శ్రీనివాసరావు, మాధవరావు ప్రముఖంగా చొరవతీసుకొని పనిచేశారు. తుమ్మల దుర్గాంబ 1923 లో కావూరులో తిలక్ జాతీయ పాఠశాలను స్థాపించింది. త్రిపురనేని సాధువమ్మ సత్తెనపల్లిలో బాలికల హైస్కూల్ ఏర్పాటుకు కృషి చేసింది. గొర్లమూడి రత్నమ్మ స్త్రీ విద్యావ్యాప్తికి కృషి చేయడమేగాక, చేబ్రోలులో గ్రంథాలయాన్ని, హిందీ విద్యాలయాన్ని స్థాపించింది. భారతీదేవి రంగా ఈడ్పులపాడులో వేసవి పాఠశాలను, కడపలోని చెన్నూరు పాఠశాలను నడిపారు. ఈమె రాజకీయ శిక్షణా పాఠశాలలను నిర్వహించడమేగాక, పూర్తిగా స్త్రీల కోసం చేబ్రోలులో రాజకీయ పాఠశాలను నిర్వహించింది. అనిబిసెంట్ దత్త మండలాలలో విద్యావ్యాప్తి కొరకు 1910లో థియోసాఫికల్ కళాశాల స్థాపించింది. తరువాత 1916 లో అనంతపూర్‌లో దత్తామండలాల కళాశాల స్థాపించబడింది. రాయలసీమలో విద్యాభివృద్ధికి ఈ రెండు కళాశాలలు దోహదం చేశాయి. విజయనగరం మహారాజా కళాశాల (1879), కాకినాడ పిఠాపురం రాజా కళాశాల (1884), ఆంధ్ర విశ్వ విద్యాలయం (1926) విద్యా వ్యాప్తిలో గణనీయమైన పాత్ర నిర్వహించాయి.

20వ శతాబ్దం మొదటి రెండు దశాబ్దాలలో స్థాపించబడిన స్త్రీల సమాజాలు కూడా ప్రధానంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేశాయి. వాటిలో పేర్కొనదగినవి : 1902లో మచిలీపట్నంలో స్థాపించబడిన బృందావనపుర స్త్రీ సమాజము, 1903లో కాకినాడలో నెలకొన్న స్త్రీ విద్యార్థిని సమాజం, రాణి చిన్నమ్మదేవి అధ్యక్షతన పిఠాపురంలో నెలకొన్న స్త్రీల సమాజం, 1911లో విజయనగరంలో స్థాపించబడిన సత్య సంవర్థనీ సమాజం, 1915లో విశాఖపట్నంలో స్థాపించబడిన ఆంధ్రస్త్రీల విద్యాభివర్థని సమాజం, సీతమ్మ బాపట్లలో నెలకొల్పిన త్రిపుర సుందరీ సమాజం మొదలయినవి.

**తెలంగాణా ప్రాంతంలో విద్యావ్యాప్తి :** ఆంధ్రా రాయలసీమ ప్రాంతాలలో బ్రిటిష్ పాలన కొనసాగుతూ ఉండగా, తెలంగాణాలో అసఫ్ జాహీ వంశంవారు రాజ్యమేలారు. తెలంగాణాలో విద్యాభివృద్ధికి రాజ్య ప్రధాని అయిన సాలార్జంగ్ పునాదులు వేశాడు. ఇతడు విద్యారంగంలో అనేక మార్పులు చేసాడు. ఇతడు హైదరాబాదులో స్థాపించిన దరుల్‌ఉలుం పాఠశాలలో విద్యార్థులను ఆకర్షించడానికి బహుమతులను ఉపకార వేతనాలను ఇచ్చేవారు. ఉచితముగా అరబిక్, పర్షియన్, మరాఠీ, ఆంగ్లం బోధించేవారు. ఈ పాఠశాలలో తొలిరోజే 130 మంది విద్యార్థులు చేరారు.

ఈ సంస్థలోనే తొలి విద్యాబోర్డు ప్రారంభమైయింది. 1859-60 కాలంలో ప్రతి తాలూకాలో నెలకు 81 రూ. ఖర్చుతో ఒక పర్షియన్, ఒక దేశీయ భాషా పాఠశాల నెలకొల్పాలనీ, ప్రతి జిల్లా కేంద్రంలో ప్రతి నెలకు 150 రూపాయల ఖర్చుతో ఒక పాఠశాల నెలకొల్పాలనీ, ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేసింది. అంతేకాక, వీటిలో లెక్కలు, వ్యాకరణము, భూగర్భ శాస్త్రము, చరిత్ర బోధన జరగాలి అని, ప్రభుత్వం ఆజ్ఞాపించింది. విద్యను, రెవెన్యూ బోర్డు నియంత్రించింది. 1868 లో విద్యకు సంబంధించి, అన్ని విషయాలను, మంత్రి అనుమతితో, రెవెన్యూ బోర్డు నిర్వహించాలి అని, ఒక ఉత్తరువు జారీచేయుడమైనది. 1869 లో విల్‌కిన్‌సన్ సెక్రటరీగా నియమితుడు కావడంతో ఇతడు తొలి డి.పి.ఐ. అయ్యాడు. ఇతడు 1869 లో చాదర్ ఘాట్‌లో ఆంగ్ల స్వదేశీ భాష పాఠశాలను నెలకొల్పాడు. ఈ రకంగా ఇతని నియామకంతో విద్యాశాఖ ఏర్పాటు అయ్యింది. విల్‌కిన్‌సన్ తరువాత డి.పి.ఐ.గా, మల్విఇనయత్‌పుర్ రహమాన్‌ఖాన్ నియమించబడినాడు. 1873లో పరీక్ష విధానము ప్రవేశ పెట్టబడింది. హైదరాబాద్‌లో 1874 లో, జిల్లాలలో 1876 లో పాఠశాల రుసుము ప్రవేశపెట్టారు. 1870-71 లో తెలంగాణాలో ప్రధమముగా ప్రభుత్వ ఆంగ్ల పాఠశాలను, నెలకొల్పడం జరిగింది. దీని పేరే సిటి ఇంగ్లీష్ హైస్కూల్. ఇందులో ఇంగ్లీష్, అరబిక్, పర్షియన్, హిందుస్థాని, తెలుగు, మరాఠి బోధించబడింది. ఈ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ష్కాప్‌టెర్ విద్యార్థుల కొరతవల్ల ఈ పాఠశాలను 1875లో మూసివేయడం జరిగింది. ఇచటగల కొద్దిమంది విద్యార్థులను ఛాదర్ ఘాట్ హైస్కూల్‌కి తరలించడం జరిగింది. సిటి హైస్కూలు ఛాదర్ ఘాట్ స్కూలు రెండింటినీ ఒకటి చేసి, హైదరాబాద్ కాలేజి పేరుతో మద్రాస్ విశ్వ విద్యాలయానికి అనుసంధానం చేయడం జరిగింది. 1877లో ష్కాప్‌టెర్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా, గ్లోరియా స్కూల్ డిపార్టుమెంట్‌కు హెడ్ మాస్టర్‌గా, అఘోర్‌నాథ్ చటోపాధ్యాయ ప్రిన్సిపాల్‌గా నియమించబడినారు. 1882లో మద్రాస్ సిండికేట్ ఈ కాలేజిని ప్రథమ శ్రేణి కాలేజిగా గుర్తించింది.

తన కుమారులకు, ఆంగ్ల విద్యను బోధించడానికి, సాలర్‌జంగ్ తన అంతఃపురంలోనే ఒక పాఠశాలను నెలకొల్పి పర్నెల్‌ను 1873లో నియమించాడు. అయితే మరికొంతమంది తల్లిదండ్రుల కోరికపై సాలార్‌జంగ్ 1878లో పబ్లిక్ స్కూల్‌ను నెలకొల్పాడు. ఈ స్కూలు

హైస్కూలుగా అభివృద్ధి చెంది, మదరస ఈ అలీయా అనే పేరుతో పిలువబడింది. దీనికి క్రోస్ హెడ్ మాస్టర్. 1887లో మద్రస-ఈ అలీయాను హైదరాబాద్ క లేజిలో విలీనం చేసి, నిజాం కాలేజిగా, పేరు పెట్టడం జరిగింది.

పైన పేర్కొన్న విద్యాలయాలను, స్థాపించడమే కాక, సాలార్‌జంగ్ ఆలీఘర్‌లో విద్యా సంస్థలను స్థాపించడానికి సర్ సయ్యద్ అహ్మద్‌కు ఆర్థిక సహాయం చేశాడు. ఆలీఘర్ కళాశాల అభివృద్ధికి, హైదరాబాద్ అధికారులు ఎక్కువ కృషి చేశారు.

**ప్రభుత్వ సహాయంతో నిర్వహించబడు విద్యా సంస్థలు :** ప్రభుత్వ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు 4 సంస్థలు నిర్వహించబడును. అవి ఆల్ సెయింట్స్ సంస్థ, సెయింట్స్ జార్జి వ్యాకరణ పాఠశాల, మహబూబ్ కళాశాల, మద్రస - ఈ - ఐజా. ఆల్ సెయింట్స్ సంస్థను, 1855లో మర్ఫీ స్థాపించాడు. ఇది చాదర్ ఘాట్‌లో ఆంగ్ల బోధనకు నెలకొల్పబడింది. 1885 లో ఈ పాఠశాలలో 147 మంది ఉండేవారు. యూరోపియన్లు, యూరో- ఏషియన్లల కొరకు చాదర్ ఘాట్‌లో 1834 లో సెయింట్ జార్జి వ్యాకరణ పాఠశాల స్థాపించబడింది. ఇది ప్రొటెస్టెంట్ ఆంగ్ల పాఠశాల. 1885 నాటికి ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 82; వారిలో 62 మంది ఐరోపావారు సికింద్రాబాద్‌లో 1881లో మహబూబ్ కళాశాల స్థాపించబడింది. 1885 నాటికి ఇందులో విద్యార్థుల సంఖ్య 210. 1878లో మద్రస-ఇ-ఐజా స్థాపించబడింది. సాలార్‌జంగ్ దీనికి ఆర్థిక సహాయం చేశాడు.

**స్త్రీ విద్య :** తెలంగాణాలో బాలికల పాఠశాలలు నెలకొల్పడంలో, ముఖ్య పాత్ర నిర్వహించిన వారు క్రైస్తవ మిషనరీలు, సికింద్రాబాద్, చాదర్ ఘాట్‌లలోని వెస్లియన్, మిషన్ బాలికల పాఠశాలలు, తెలంగాణాలోని ప్రథమ బాలికల పాఠశాలలు. 1882లో 519 మంది పిల్లలతో, 11 ఆంగ్ల పాఠశాలలు నెలకొల్పబడినవి. 1881లో హైదరాబాద్‌లో అఘోరనాథ్ ఛటోపాధ్యాయ హిందూ, ఆంగ్ల స్వదేశీ భాషల బాలికల పాఠశాల నెలకొల్పాడు. 1887లో జనానా నాంపల్లి పాఠశాల ప్రారంభించబడింది. 1882-83 నాటికి నైజాం ప్రాంతంలో 186 పాఠశాలలు, 11599 విద్యార్థులు ఉండేవారు. ఆరవ నైజాం అయిన మీర్ మహబూబ్ అలీఖాన్ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ప్రకటించాడు. ఈ ప్రకటన నవాబ్, హిమదుల్ ముల్క్, బహదూర్‌కు బలాన్ని ఇచ్చింది. ఇతని కాలంలో ప్రతి పట్టణంలో ఒక ఆంగ్ల స్వదేశీ పాఠశాల నెలకొల్పాలని ప్రతి గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాల స్థాపించాలని నిర్ణయించబడింది. వరంగల్‌లోని ఆంగ్ల స్వదేశీ భాషా పాఠశాలను 1890లో హైస్కూల్‌గా మార్చడం జరిగింది. జిల్లాలలో విద్యావసరాలను తీర్చడానికి గ్రాంట్-ఇన్-ఎయిడ్ పద్ధతి ప్రవేశపెట్టడం జరిగింది. భువనగిరి, మట్వాడ, వరంగల్, నాందేడ్, మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్, మొదలగుచోట్ల పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. 1887 నాటికి, పాఠశాలల సంఖ్య 402 కు చేరుకున్నది.

నిజాం కళశాలలో 1897 నాటికి విద్యార్థుల సంఖ్య 66 కు చేరుకున్నది. ప్రతి జిల్లాకు, ఒక అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించి, విద్యా పర్యవేక్షణను పటిష్టం చేయడం జరిగింది. 1893లో పుస్తక కమిటి నెలకొల్పబడింది. అంతేకాక విద్యా విషయాల్లో ప్రభుత్వానికి సలహా ఇవ్వడానికి ఒక విద్యాబోర్డు ఏర్పాటు చేయబడింది.

1889-90లో వరంగల్లులో రెండు సాధారణ పాఠశాలలు నెలకొల్పబడ్డాయి. 1893లో హైదరాబాద్‌లో ప్రభుత్వ సాధారణ పాఠశాల నెలకొల్పబడింది. 1891లో వరంగల్లు పారిశ్రామిక పాఠశాల నెలకొల్పబడింది. 1891-92లో వరంగల్లులో ఇంజనీరింగ్ పాఠశాల ప్రారంభించబడింది. అయితే తరువాత ఈ రెండూ హైదరాబాద్‌కు మార్చడం జరిగింది. 1899-1900లో హైదరాబాద్ న్యాయ పాఠశాల ప్రారంభించబడింది. 1905లో నిజాం సహకారంతో సరూర్‌నగర్‌లో విక్టోరియా స్మారక వికలాంగ సంస్థ నెలకొల్పబడింది. వికలాంగులైన, హిందువులకు, ముస్లింలకు పారిశ్రామిక శిక్షణ ఇవ్వడం దీని లక్ష్యం. 1890లో అసాఫియా రాష్ట్ర గ్రంథాలయం నెలకొల్పబడింది.

తెలంగాణాలో సాలార్‌జంగ్ ప్రారంభించిన విద్యా సంస్కరణలు, తరువాత కాలంలో కూడా కొనసాగి, విద్యాభివృద్ధికి దోహదం చేసాయి. కరువు పరిస్థితులవల్ల 1898-1906 మధ్య కాలంలో విద్యాభివృద్ధి కుంటుపడింది. నవాబ్, ఇమాదుల్ ముల్క్ బహదూర్ (డి.పి.ఐ.) సమర్థ నాయకత్వంలో విద్యకు సంబంధించిన అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించబడింది. 1909లో 9 క్రొత్త ప్రాథమిక ఉన్నత పాఠశాలలు స్థాపించబడ్డాయి. మున్షి, మౌల్వి పరీక్షలకు ఇచ్చట శిక్షణ ఇవ్వబడింది. ఈ కాలంలోనే 19 ప్రాథమిక పాఠశాలలు కూడా నెలకొల్పబడ్డాయి. స్త్రీ విద్యాభివృద్ధికి 1907లో మహబూబియా పాఠశాల ఆరంభమయింది. 1910 నాటికి ఇది హైస్కూల్‌గా మారింది.

తెలంగాణాలో బాలికలకు శిక్షణ ఇచ్చే పారిశ్రామిక పాఠశాలలకు ప్రారంభోత్సవం చేసినవారు మిషనరీవారు. 1899లో సికింద్రాబాద్‌లోని వెస్లీయన్ మిషన్ బాలికల పారిశ్రామిక సాంకేతిక విద్యా సంస్థను నెలకొల్పింది. 1903 లో బాలికలకు శిక్షణ ఇవ్వడానికి మోస్ట్ హోలీరోసరీ మిషన్ ఒక పారిశ్రామిక పాఠశాలను స్థాపించింది. యద్దనపూడి ఆశీర్వాదం, సహకారంతో మధిర మిషన్ మధిరలో ఒక బాలికల పాఠశాలను నెలకొల్పింది. ఈ స్కూలు పిల్లలకు రుసుము మినహాయించడం జరిగింది. ఈ స్కూలు తరువాత ప్రాథమిక ఉన్నత పాఠశాలగా రూపొంది, పెక్కుమంది బాలికలను ఆకర్షించింది. 1902లో మెదక్‌లో వెస్లియన్ మిషన్ ఒక బాలికల పాఠశాలను ప్రారంభించింది. స్త్రీల విద్యా వ్యాప్తికి, మహబూబ్‌నగర్‌లోని అమెరికన్ మిషన్, నల్గొండలోని రోమన్ కేథలిక్కులు, హనుమకొండలో అమెరికన్ బాప్టిస్టు మిషన్ కృషి సలిపాయి. నాలుగవ నిజాం పాలనా కాలంలో హైదరాబాద్‌లో స్త్రీ విద్యకు ఎక్కువ ప్రోత్సాహం లభించింది. అతని ప్రభుత్వం స్త్రీలకు ప్రత్యేకంగా జనానా స్కూలు ప్రారంభించింది. ఈ స్కూళ్ళు అన్నీ విద్యాశాఖ ఆధీనంలో ఉండేవి. 1885లో సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామి ఒక బాలికల పాఠశాలను ప్రారంభించాడు. బహుశా తెలంగాణాలో ఇదే తొలి ముస్లిం బాలికల సంస్థ. 19వ శతాబ్ద అంతానికీ, కాయస్త, ఖత్రి కులాల వారు ఖత్రి, ముఫీదుల్-అనమ్ ఉన్నత పాఠశాలలు ప్రారంభించారు. నురున్నీసా బేగం తన తండ్రి సాలార్‌జంగ్ జ్ఞాపకార్థం జమిందార్ల కుమార్తెల కొరకు ఒక పాఠశాలను ప్రారంభించింది. ఇమాద్-ఉల్-ముల్క్ సోదరి అయిన ఘజత్ అలీ ఉన్నత కుటుంబ స్త్రీలకు ఒక పాఠశాల నెలకొల్పింది. ఈ పాఠశాలలో ప్రధాన పాఠ్యాంశాలు; ఉర్దూ, పర్షియన్, అరబిక్, ఇంగ్లీష్, చరిత్ర, భూ గర్భ శాస్త్రం. 1905లో సరూర్ నగర్‌లో అన్ని కులాల వారికి బాల బాలికల పాఠశాలను ప్రారంభించడం జరిగింది. 1907లో మహబూబియా బాలికల పాఠశాలను, ఉన్నత తరగతుల వారి కొరకు ప్రారంభించబడింది. హైదరాబాద్ నగరంలో అఘోర నాథ్ చటోపాధ్యాయ చాదర్ ఘాట్ పాఠశాలను నెలకొల్పాడు. హరిజన కులానికి చెందిన వ్యక్తులు కూడా స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేశారు. భాగ్యరెడ్డి, వెంకటరావు, రామస్వామి కూడా స్త్రీ విద్యకు కృషి చేశారు.

1911 తరువాత తెలంగాణా ప్రాంతంలో విద్య గొప్పగా వ్యాపించింది. విద్య అందుబాటులోకి రావటం, అనేక పాఠశాలలు నెలకొల్పడం అందుకు కారణం అయ్యాయి. ఈ క్రింది పట్టికను పరిశీలిస్తే అది స్పష్టమౌతుంది.

| సంవత్సరం | 10-15 | | 15-20 | | 20 ఆపైన | |
|---|---|---|---|---|---|---|
| | బాలలు | బాలికలు | విద్యార్థులు | విద్యార్థినీలు | పురుషులు | స్త్రీలు |
| 1911 | 67 | 5 | 69 | 7 | 72 | 4 |
| 1921 | 65 | 8 | 86 | 14 | 67 | 8 |
| 1931 | 93 | 12 | 137 | 20 | 90 | 11 |
| 1941 | 163 | 58 | 233 | 69 | 126 | 36 |

1937-38 మధ్య కాలంలో నిజాం ప్రభుత్వం క్రింది స్థాయిలో మాతృ భాషలో బోధనకు అనుమతినిచ్చింది. తెలంగాణాలో బాలికల విద్యకు రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి, మాడపాటి హనుమంతరావు, నాయక్, కేశవరావు, అహల్యాబాయి గొప్పగా కృషి చేశారు. కేశవరావు, నాయక్, గణపతిరావు, కలసి వివేకవర్ధనీ పాఠశాల నెలకొల్పారు. 1922 లో నడింపల్లి సుందరమ్మ, మాడపాటి మాణిక్యమ్మ, లక్ష్మీ నరసమ్మ ఆంధ్ర సోదరీ సమాజాన్ని స్థాపించి స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేశారు. హైదరాబాద్ మహిళా సంఘం స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేసింది. స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేసిన మరో సంస్థ ఆంధ్ర యువతీ మండలి దీనిని హైదరాబాద్‌లో 1935 లో సరస్వతీదేవి, సీతాకుమారి ప్రారంభించారు. ఈ సంస్థ నవ జీవన్ బాలికల ఉన్నత పాఠశాలను, ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పింది. ముస్లీం సంస్థలు కూడా, స్త్రీ విద్యకు కృషి చేశాయి.

1913లో బేగం కాదర్ జంగ్ ప్రారంభించిన అంజుమన్-ఇ-ఖవీటిన్ బీద పిల్లల విద్యకు కృషి చేసింది. ఈ సంస్థ ఒక ఉర్దు భాషా పాఠశాలను నెలకొల్పింది. ఇందులో తెలుగు ఇంగ్లీష్ కూడా బోధించేవారు. ఈ సంస్థ హైదరాబాద్‌లోని శంకర్‌గంజ్‌లో ఒక బాలి పాఠశాలను నెలకొల్పింది. ఈ సంస్థకు చెందిన హుమయూన్ మీర్జా రెండు బాలికల పాఠశాలలు ప్రారంభించింది. ఈమె మాసబ్ టాంక్ వద్ద సఫ్ దారియా బాలికల పాఠశాల నెలకొల్పింది. ఇండియాలో తొలి ముస్లీం పట్టభద్రురాలు అయిన త్యేబా బేగమ్ సహిబా బిల్‌గ్రామీ కృషివల్ల హైదరాబాద్‌లో అనేక విద్యా సంస్థలు నెలకొల్పబడ్డాయి.

**మీర్ అక్బర్ అలీఖాన్ :** హైదరాబాద్‌కు చెందిన మీర్ అక్బర్ అలీఖాన్ లౌకిక విద్య కొరకు సాంకేతిక విద్య కొరకు, గొప్పగా కృషి చేశాడు. హైదరాబాద్‌లో ప్రథమ, బాలుర, ప్రథమ బాలికల సాంకేతిక సంస్థలను నెలకొల్పడంలో అక్బర్ అలీఖాన్ చేసిన కృషి అద్భుతం. అవి జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్, కమలానెహ్రూ స్త్రీల పాలిటెక్నిక్‌లు. ఈ సంస్థలకు, అక్బర్ అలీఖాన్, తమ భూమినంతా దానం చేయడమేకాక, హైదరాబాద్‌లో చందాలు వసూలు చేశాడు. 1932 లో ఉస్మానియా, పట్టభద్రుల సంఘ స్థాపనతో ఇతడు కీలక పాత్ర వహించాడు. ఈ సంస్థ స్త్రీల కొరకు వనితా మహా విద్యాలయాన్ని స్థాపించింది. తదుపరి ఈ పేరు సరోజినీనాయుడు. వనితా, మహా విద్యాలయంగా మారింది. చరిత్ర సంస్కృతి భాషా, తత్వ శాస్త్రాలలో పరిశోధన కొరకు అబ్దుల్ కలాం ఓరియంటల్, పరిశోధన సంస్థను స్థాపించడంలో అక్బర్ అలీ ఆజాద్ కృషి చేశాడు.

**ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ :** హైదరాబాద్ సంస్థానంలో విశ్వ విద్యాలయం, రూపొందించడానికి కృషిని ఆరంభించింది. ఈ కాన్ఫరెన్స్‌ను 1915 లో కొందరు యువ పట్టభద్రులు స్థాపించారు. వారిలో ప్రముఖులు మీర్ అక్బర్ అలీ, మీర్జా మహమద్ బేగం, అబ్దుల్ బాసిత్ మౌల్వి మహ్మద్ మురజ్. ఈ కాన్ఫరెన్స్ చేసిన కృషి ఫలితంగా 1919 లో ఉస్మానియా విశ్వ విద్యాలయం అవతరించింది. ఈ విశ్వ విద్యాలయ తెలంగాణా ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పడింది.

**విజ్ఞాన చంద్రికామండలి :** పాశ్చాత్య విజ్ఞానాన్ని తెలుగువారికి, అందుబాటులో తీసుకురావటానికి నాయిని వెంకటరంగారావు, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, అయ్యదేవర, కాళేశ్వరరావులతో కలసి కొమర్రాజు వెంకట లక్ష్మణరావు 1906 లో విజ్ఞాన చంద్రికా మండలిని స్థాపించాడు. దీని కేంద్రం మొదట హైదరాబాద్‌లో వుంది. తరువాత మద్రాసుకు మార్చడం జరిగింది. తెలంగాణాలో తెలుగు భాషా స్థితిని మెరుగు పరచాలి అనే ఉద్దేశ్యంతో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు హైదరాబాద్‌లో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయాన్ని 1901లో స్థాపించాడు.

**ఆంధ్రజన కేంద్ర సంఘం :** 1923లో హైదరాబాద్‌లో ఆంధ్ర జన కేంద్ర సంఘం ఏర్పడింది. ఈ సంఘం ఉద్దేశాలు : గ్రంథాలయ, పఠన మందిరాలు స్థాపించడం విద్యార్థులను ప్రోత్సహించి తగిన సహాయం చేయడం, పండితులను గౌరవించడం, తెలుగు భాషా ప్రచారం, లలిత కళలు, వ్యాయామము ప్రోత్సహించడం, కరపత్రాలు, చిన్న పుస్తకాలు ప్రచురించి విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడం. ఆంధ్రజన కేంద్ర సంఘం తన 9 సంవత్సరాల జీవితంలో తెలంగాణా ప్రజలలో విద్యా వ్యాప్తికి కృషి చేసింది. ఈ సంఘం గ్రామాలలో తెలుగు బోధనకు అనేక పాఠశాలలు స్థాపించింది. ఒక సంవత్సరంలోనే నాలుగువేల పాఠశాలలు ప్రారంభించడం జరిగింది. 1928 లో బాలబాలికల నిమిత్తం హైదరాబాద్‌లో ఆంధ్ర బాలికా హైస్కూల్ స్థాపించారు. ఈ హైస్కూలే నేటి మాడపాటి హనుమంతరావు గర్ల్స్ హైస్కూల్. 1943 లో స్థాపించబడిన ఆంధ్ర సారస్వత పరిషత్, సుందరమ్మ, మాణిక్యమ్మ, వరలక్ష్మమ్మ స్థాపించిన ఆంధ్రయువతా మండలి తెలంగాణాలో విద్యావ్యాప్తికి కృషి చేశాయి.

## 5.7. సారాంశం :

పాశ్చాత్య విద్యా విధానం, ఆంగ్ల భాషా వ్యాప్తి స్థానిక ప్రజానీకంపై గొప్ప ప్రభావాన్ని చూపింది. వారిలో ఆంగ్ల విద్య ఐక్యతను, చైతన్యాన్ని కలుగజేసింది. ఆంగ్ల విద్యా బోధనచేత పరిపాలనా యంత్రాంగాన్ని నడపటానికి తగు సిబ్బందిని సులభంగా ఉత్పత్తి చేయడమేగాక, దానివే విద్యావంతులైన స్థానికులు సమకాలీన పాశ్చాత్య భావాలకు, విజ్ఞానానికి దగ్గర అయ్యారు. ఈ నూతన భావ వికాసం బెంగాల్‌లో మొదలయి ఆంధ్ర దేశంతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా వ్యాప్తి చెందింది.

ఆధునిక విద్య లౌకిక ఉదార స్వభావాన్ని కలిగి అందరికీ సమాన అవకాశాన్ని ఇచ్చింది. ఈ విద్య ఆధునిక పాశ్చాత్య హేతుబద్ధ ప్రజాస్వామిక భావాలను భారతీయులకు అందించింది. అంతేగాక ఆధునిక ప్రకృతి శాస్త్రాలు అయిన భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం, జీవ శాస్త్రం, మొదలగు రంగాలలోని ప్రగతిని భారతీయులు గ్రహించగలిగారు. ప్రజాస్వామ్య సూత్రాలను, జీర్ణము చేసుకొన్న చదువుకొన్న భారతీయులు నిరంకుశ సామాజిక తత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి ప్రేరణ పొందారు.

మెకాలే చేసిన చారిత్రాత్మక నిర్ణయం మేరకు ఆంధ్ర జిల్లాలలో ఆంగ్ల విద్యా విధానంలో పాఠశాలలు, కళాశాలలు స్థాపించడం జరిగింది. వీటిలో మొదటివి క్రైస్తవ మిషనరీలు స్థాపించినవి. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఆంధ్ర ప్రాంతంలో పాఠశాలలు, కళాశాలలను స్థాపించాయి. రాజమండ్రి, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడలో స్థాపించిన కళాశాలలు, యూరోపియన్ విద్యా విధానాలపై ఏర్పడినటువంటివే. పాశ్చాత్య విద్యా, విజ్ఞానానికి లోనైన ఆంధ్రులు వారి హేతువాదాన్ని మానవతా వాదాన్ని, వ్యక్తి వాదాన్ని, నిశిత దృష్టిని గమనించి స్వీకరించారు. హిందూ సమాజంలోని సనాతన, ఆచారాలను మూఢనమ్మకాలను ప్రక్షాళన చేయడానికి వారు పూనుకొన్నారు.

ఆంగ్ల విద్యా వ్యాప్తితో ఆంధ్ర దేశంలో ప్రముఖముగా కోస్తా ప్రాంతంలో పాశ్చాత్య ఉదారవాద ప్రభావితమైన ఒక మేధావి వర్గం ఉద్భవించింది. హిందూ మత, సాంఘిక వ్యవస్థ, సనాతన తత్వం, ఈ మేధావి వర్గానికి నచ్చలేదు. మతాధికారినీ, సాంప్రదాయక, సాంప్రదాయానికి నిరపేక్ష బద్ధతను వారు నిరసించారు. వారే ఆంధ్రదేశ సాంఘిక, రాజకీయ, సంస్కరణ ఉద్యమానికి వైతాళికులు అయినారు; జాతీయోద్యమాన్ని నడిపారు.

## 5.8. వ్యాస రూప ప్రశ్నలు :

1. ఆంధ్ర దేశంలో పాశ్చాత్య విద్యావ్యాప్తికి క్రైస్తవ మిషనరీల కృషిని వివరించుము.
2. పాశ్చాత్య విద్యా వ్యాప్తికి ప్రగతిశీల ఉదారుల కృషిని తెలియజేయుము.
3. పాశ్చాత్య విద్యా వ్యాప్తికి ప్రభుత్వ పాత్రను చర్చించుము.

## 5.9 ఉపయుక్త గ్రంథాలు :


1. Thomas, P.J. : The Growth of Higher Education in Southern India.
2. Vittal Rao, Y. : Education and Learning in Andhra under the East India Company.
3. Y. Vaikuntham : Education and Social change in Andhra.
4. Noble, John : A Memoir of the Rev. Robert Turlington Noble, Missionary to the Telugu People of India.
5. J. Mangamma : The Godavari District Rate Schools of Godavari


**Dr. V. K. Mohan.**

పాఠం- 6

# అసఫ్ జాహీల యుగం

## విషయ క్రమం


6.1 లక్ష్యం
6.2 పరిచయం
6.3 అసఫ్ జాహీ వంశ చరిత్ర
6.4 అసఫ్‌జా నిజామ్-ఉల్-ముల్క్ (1774-1748)
6.5 రాజ్య పాలనానుభవము
6.6 మొఘల్ సామ్రాజ్య ప్రధానిగా
6.7 దక్కను సుబేదారుగా
6.8 మున్‌గిషివ్ గాంవ్ సంధి (1728)
6.9 వార్నా సంధి (1731)
6.10 భోపాల్ యుద్ధము (1738)
6.11 నాదిర్షా దండయాత్ర (1738)
6.12 నాసర్ జంగ్ తిరుగుబాటు (1740)
6.13 యూరోపియన్‌లతో మైత్రి
6.14 నిజామ్-ఉల్-ముల్క్ ఘనత
6.2.1 నాసర్ జంగ్ (1748-1751)
6.2.2 ముజఫర్ జంగ్
6.2.3 సలబత్ జంగ్ (1751-1761)
6.2.4 ఫ్రెంచి వారి ప్రాబల్యము
6.2.5 నిజాం-అలీ-ఖాన్ (1761-1803)
6.2.6 నిజాం-అలీ-ఖాన్ కాలం నాటి ముఖ్య సంఘటనలు
6.3.1 సికిందర్ జా (1803 - 1829)
6.3.2 నాసిర్-ఉద్ద్-దౌలా (1829-1857)
6.3.3 1857 విప్లవము
6.3.4 విప్లవ ఫలితాలు
6.4.1 అఫ్‌జల్ - ఉద్ద్-దౌలా (1857-1869)
6.4.2 మహబూబ్ అలీఖాన్ (1869-1911)
6.4.3 ఉస్మాన్ అలీఖాన్ (1911 - 1948)

6.4.4 నిజాం రాజ్యం ఇండియన్-యూనియన్‌లో చేరిక

6.4.5 ఆసఫ్ జాహీ వంశ పరిపాలన స్వరూప, స్వభావాలు

6.15. సమీక్ష

6.16 వ్యాస రూప ప్రశ్నలు


## 6.1 లక్ష్యం :

తెలంగాణాలో అసఫ్ జాహీల పరిపాలన ప్రారంభంనుంచి (1724-1948) మొత్తం తొమ్మిది మంది వంశీయులు సుమారు 224 సంవత్సరాలు తెలంగాణాను పాలించిన విధానమును వివరించుటయే ఈ పాఠం లక్ష్యం.

## 6.2. పరిచయము :

ఔరంగజేబు మరణానంతరము (1707) మొఘలు సామ్రాజ్య క్షీణత ప్రారంభమయింది. అతని వారసుల బలహీనతను అవకాశంగా తీసుకొని రాష్ట్రాల పాలకులు (సుబేదార్లు) కొందరు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వారిలో దక్కను సుబేదారైన నిజామ్-ఉల్-ముల్క్ ఒకడు. అతనికి ఆసఫ్‌జా అను బిరుదు ఉండేది. దానిని బట్టి అతని వంశమునకు ఆసఫ్ జాహీ వంశమను పేరు కల్గినది.

## 6.3. ఆసఫ్ జాహీ వంశ చరిత్ర :

సుప్రసిద్ధ ఆసఫ్ జాహీ వంశ స్థాపకుడు ఆసఫ్ జా బుఖారాకు చెందిన ఒక భక్తుని సంతతికి చెందినవాడు. ఇతని అసలు పేరు కమ్రుద్దీన్ ఖాన్. ఇతని తండ్రి తాతలు మొఘల్ పాదుషాలకొలువులో ఉద్యోగాలను నిర్వహించారు. కమ్రుద్దీన్ చివరి మొఘల్ పాదుషాలలో ఒకడైన ఫరూక్ షియార్‌ను సేవించాడు. సమర్థుడైన పరిపాలకుడుగా పేరు గాంచిన ఇతడు దక్కను సుబేదారుగా పదవిని పొందాడు. ఆ ప్రాంతంలో పరిపాలనా స్థిరత్వాన్ని శాంతి భద్రతలను నెలకొల్పాడు. ఇతడు మొఘల్ సామ్రాజ్యానికి గావించిన సేవలకు ప్రతిఫలంగా సుబేదారి పదవితోపాటు ఆసఫ్‌జా నిజాంఉల్-ముల్క్ అనే బిరుదును 1724వ సంవత్సరంలో పొందాడు. సుబేదారుకే నిజాం అని పేరున్నందున హైదరాబాదు సంస్థానాన్ని నిజాం రాజ్యంగా, ఆ ప్రాంతాన్నే నైజాంగా వ్యవహరించారు.

## 6.4. ఆసఫ్‌జా నిజామ్ -ఉల్-ముల్క్ (1774-1748) :

రెండు శతాబ్దాలకు పైగా దక్కన్‌ను పాలించిన ఆసఫ్ జా రాజవంశమునకు మూల పురుషుడు నిజామ్-ఉల్-ముల్క్ మొఘలుల చరిత్రలోనే గాక భారతీయ రాజకీయ రంగంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన వారిలో నిజామ్ -ఉల్-ముల్క్ ఒకరు. నాదిర్షా దండయాత్రల వలన కూకటి వ్రేళ్ళతో కదలిపోయిన మొఘల్ సామ్రాజ్య వృక్షమును మరికొంత కాలము నిలచియుండునట్లు చేసిన ఘనత ఈతనిదే. ఆసఫ్ జా గొప్ప రాజనీతిజ్ఞుడు విజేతయేగాక పరిపాలనా దక్షుడుకూడా. అతి నిరాడంబరుడు, ప్రజా క్షేమమునకు, రాజ్య క్షేమమునకు అవిరళ కృషిచేశాడు. ఈతడు పార్శీ భాషలో పండితుడు, కవి, అరబ్బీ, తురుష్క భాషలలో ఇతనికి పరిచయం కలదు.

## 6.5. రాజ్య పాలనానుభవము :

ఔరంగజేబు 1690లో కమ్రుద్దీన్‌ను 4000 సేనకు మన్సబ్‌దారునిగా, సర్కారు పాలకునిగా నియమించాడు. సర్కారు పాలకునిగా అతడు ప్రదర్శించిన శక్తి సామర్థ్యములను సంతసించిన ఔరంగజేబు అతనిని 5000 సేనకు మన్సబ్ దారునిగా నియమించుటయేగాక కర్ణాటక ఫౌజదారుగా చేసి "చిన్ ఖిలిచ్ ఖాన్" అను బిరుదును ప్రధానము చేశాడు. ఔరంగజేబు వారసుడైన బహదూర్‌షా కాలములో అయోధ్య రాష్ట్ర సుబేదారుగా పిమ్మట ఫరూక్ షియార్ కాలములో 7000 సేనకు మన్సబ్‌దారునిగా నియమింపబడుటయే గాక "ఫతేజంగ్, నిజామ్ -ఉల్-ముల్క్" అను బిరుదాలను కూడా పొందాడు. రాజనియంతలుగా పేరొందిన సయ్యదు సోదరుల పతనములో ప్రధాన పాత్రను నిర్వహించి, మహమ్మద్ షా కాలములో (1719-1748) ప్రధా న మంత్రిగా నియమితుడయ్యాడు.

## 6.6. మొఘల్ సామ్రాజ్య ప్రధానిగా :

మొఘల్ సామ్రాజ్య ప్రధానిగా నిజాముల్ ముల్క్ కొన్ని అతి ముఖ్యమైన నిర్ణయాలు చేశాడు. ప్రభుత్వ భూములను 'ఇజారా' పై ఇచ్చు పద్ధతిని రద్దు చేశాడు. పేష్కష్‌లను రద్దు చేశాడు. జిజియా పన్నును పునరుద్ధరించాడు. ఆఫ్ఘన్‌లకు వ్యతిరేకంగా ఇరాన్‌కు సాయపడవలెనని సలహా ఇచ్చాడు. కానీ ఈ సూచనలను అవలు జరుగునట్లు చూచుటకు నాటి పరిస్థితులు అనుకూలముగా లేకుండెనని గ్రహించిన నిజామ్ -ఉల్-ముల్క్ తన నిర్ణయంను మార్చుకొనదల్చాడు. రాష్ట్ర పాలకులు స్వతంత్రులగు చుండుట మొఘల్ సామ్రాజ్యము క్షీణించుట గమనించాడు. ఈ పరిస్థితులలో మొఘల్ సామ్రాజ్యమునకు తానెట్టి సేవలను చేయలేనని గ్రహించిన నిజామ్ -ఉల్-ముల్క్ ప్రధాని పదవికి రాజీనామా చేసి దక్కను సుభాకు వెళ్ళిపోయాడు.

## 6.7. దక్కను సుబేదారుగా :

ప్రధాని పదవికి తానిచ్చిన రాజీనామాను చక్రవర్తి ఆమోదించకపోయినా తన సైన్యంతో దక్కను చేరాడు. చక్రవర్తి తరపున తననెదిరించిన ముబారిజ్ ఖాన్‌ని 1724లో షకర్ ఖేడ్ యుద్ధంలో వధించాడు. దక్కనులో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తనకు స్వతంత్ర ప్రతిపత్తి అవసరమని నిజామ్ -ఉల్-ముల్క్ చేసిన విజ్ఞప్తికి చేసేది లేక చక్రవర్తి అతణ్ణి 8000 హోదాగల మన్సబు దారుగా గుర్తించి, 'ఆసఫ్ జా' బిరుదునిచ్చి దక్కను సుబేదారుగా అంగీకరించాడు. అయితే నిజాం స్వతంత్రంగానే వ్యవహరించాడు. ఆనాటి నుంచి ఆసఫ్ జాహీలు మొఘలు చక్రవర్తుల పేరు మీదనే 1858 వరకు దక్కను పాలించినప్పటికీ, స్వతంత్రులుగానే వ్యవహరించారు.

## 6.8. మున్ గిషివ్ గాంవ్ సంధి 1728 :

ఆసఫ్ జా దక్కనులో స్వతంత్ర రాజ్యము నెలకొల్పిన పిమ్మట మహా రాష్ట్రుల అధికార విస్తరణను అరికట్టవలెనని నిశ్చయించాడు. అంతఃకలహములు సృష్టించి స్వ కార్యమును నెరవేర్చుకొనుటకు ప్రయత్నించాడు. కొల్హాపూర్ పాలకుడైన రెండో శంభోజీతో చేతులు కలిపి ఛత్రపతి సాహుకు, చౌత్, సర్దేశ్‌ముఖి పన్నులు చెల్లించుటకు (1714 సంధి ప్రకారము) నిరాకరించాడు. కానీ పీష్వా బాజీరావు నిజాంను పాల్ఖాట్ యుద్ధమున పరాజితుని గావించి మున్‌గిషివ్ గాంవ్ సంధికి (1728) అంగీకరింప చేశాడు. దీని ప్రకారము నిజామ్ -ఉల్-ముల్క్ చౌత్, సర్దేశ్ ముఖి పన్నులను చెల్లించుటకంగీకరించి, దీనికి హామీగా కొన్ని దుర్గములను పీష్వా ఆధీనము చేశాడు.

## 6.9. వార్నా సంధి 1731 :

ఎట్లాగైనా మహా రాష్ట్రులను ఓడించాలని నిజాం నిర్ణయించాడు. పూర్వపు వైరమును మరువని నిజాం మహా రాష్ట్ర సేనాపతి త్రియంబక్ రావుని పీష్వాపైకి ఉసికొల్పినాడు. త్రియంబక్ యుద్ధములో నిహితుడగుటవలన ఆ ప్రయత్నము కూడా విఫలమయ్యెను. ఆపై నిజాం పీష్వాతో వార్నాసంధి చేసుకొన్నాడు. దాని ప్రకారము దక్షిణమున నిజాంకు, ఉత్తర హిందూస్థానమున మహారాష్ట్రులకు తమ తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుటకు అంగీకారము కుదిరింది.

## 6.10. భోపాల్ యుద్ధము 1738 :

ఎప్పటికైనా మహా రాష్ట్రులను నిరోధించాలని, వారి అభివృద్ధిని అడ్డుకోవాలని, వారి రాజ్య వ్యాప్తిని అరికట్టాలని నిర్ణయించాడు నిజాం. మహారాష్ట్రులు 1737వ సంవత్సరము నాటికి ఢిల్లీ సమీపము వరకు తమ అధికారమును విస్తరించారు. ఈ పరిస్థితులను చూసి ఆందోళన చెందిన మొఘల్ చక్రవర్తి మహమ్మద్ షా తన నమ్మినబంట్రైన నిజాంను ఢిల్లీకి పిలిచి మహారాష్ట్రులను నిరోధించవలెనని ఆదేశించాడు. అప్పుడు జనవరి 1738లో మహారాష్ట్రులకు నిజాంకు భోపాల్ వద్ద జరిగిన యుద్ధంలో నిజాం పూర్తిగా ఓడిపోయి సంధిచేసుకొన్నాడు. దురారీ సరాయివద్ద జరిగిన సంధి (జనవరి 7, 1738) ప్రకారము, మాళ్వా రాష్ట్రమును, చంబల్, నర్మదా నదుల మధ్య దేశమును, యుద్ధ నష్టపరిహారముగా 50 లక్షల రూపాయలను, మొఘలు చక్రవర్తినుండి మహారాష్ట్రుల కిప్పించుటకు నిజాం అంగీకరిస్తాడు.

## 6.11. నాదిర్షా దండయాత్ర - 1738 :

మొఘలు సామ్రాజ్యంపై 1738లో నాదిర్షా దండయాత్ర జరిగింది. నాదిర్షా తన నెదిరించిన మహమ్మద్ షా, నిజాంను ఓడించి ఢిల్లీ చేరుకొన్నాడు. ఈ సందర్భమున ఢిల్లీ పౌరులు నాదిర్షాను ఎదిరించారు. అప్పుడు నిజాం నాదిర్షాని కలసి ఢిల్లీ పౌరులపై ఆగ్రహం తగదని ఒప్పించి వారిని కాపాడాడు.

## 6.12. నాసర్‌జంగ్ తిరుగుబాటు 1740 :

నిజాం ఢిల్లీలో ఉన్నప్పుడు అతని ప్రతినిధి దక్కనులోనున్న నాసర్ జంగ్ (నిజాం కుమారుడు) తిరుగుబాటు చేసాడు. ఈ తిరుగు బాటును నిజాం అణచివేసి, కుమారుని క్షమించి తన ఔదార్యాన్ని నిరూపించుకొన్నాడు.

## 6.13. యూరోపియన్‌లతో మైత్రి :

గోల్కొండ సుల్తానుల కాలం నుండి తూర్పు తీరమున వ్యాపార కేంద్రములు నెలకొల్పిన ఆంగ్లేయులతోను, ఫ్రెంచి వారితోను నిజాం స్నేహ సంబంధములను జీవిత పర్యంతం కొనసాగించాడు. మహా రాష్ట్రుల దాడులనుండి తన రాజ్యమును కాపాడు కొనుటకు వారి సహాయమవసరమని తెలుసుకొన్న నిజాం వారి వివాదాలలో తలదూర్చక తటస్థముగా వ్యవహరించాడు.

## 6.14. నిజామ్-ఉల్-ముల్క్ ఘనత :

నిజాం తన రాజ్యములోని ఉత్తర భాగములను మహారాష్ట్రుల దండయాత్ర నుండి రక్షించు కొనుటకు కట్టుదిట్టములు చేసి, కర్ణాటక ప్రాంతములో పర్యటించి, శత్రువులనుండి దానిని సురక్షితము కావించాడు. 1743లో మహా రాష్ట్రుల నుండి తిరుచునాపల్లి కోటను వశపర్చుకొని, తదుపరి 1746లో బాల కొండ దుర్గము నాక్రమించాడు. నిజాం తన రాజ్యము ఉత్తరమున తపతీనది నుండి దక్షిణమున తిరుచునాపల్లి వరకు, పశ్చిమమున హైదరాబాద్ నుండి తూర్పున బంగాళాఖాతము వరకు విస్తరించాడు.

నిజామ్-ఉల్-ముల్క్ విజేత, రాజనీతిజ్ఞుడు, పరిపాలనా దక్షుడు, మహారాష్ట్రులతో మైత్రి, అపరాధుల యెడల మెలకువతో నుండుట, దేశాటన ద్వారా ప్రజల కష్ట సుఖములనరయుట, ప్రజా క్షేమమును పెంపొందించుట మున్నగు అంశములతో కూడియున్న అతని మరణ శాసనమే అందుకు నిదర్శనము. అసఫజా నిజాం కవిపోషకుడు. పది లక్షల జనాభాతో వర్ధిల్లు అతని రాజధాని ఔరంగాబాదు కవి పండితులకు నిలయమై యుండేది. నిజాం అతి నిరాడంబరుడు, దర్బారునకు పోవునప్పుడు తప్ప అతనెప్పుడు విలువైన ఆభరణములను ధరించేవాడు కాదు. అతడు వితరణశీలి. పేద సాదలకు, ఫకీరులకు, మత గురువులకు, కవి పండితులకు ధన ధాన్యములను విరివిగా ఇచ్చేవాడు.

ఆఫ్ఘనిస్తాన్ పాలకుడగు అహ్మద్‌షా అబ్దాలి భారత దేశముపై దండయాత్ర చేయుచున్నాడను వదంతులు వ్యాపించగా, అహ్మద్ షా ఆహ్వానమును పురస్కరించుకొని ఢిల్లీ వెళ్ళుచూ, మార్గ మధ్యమున బుర్హన్‌పూర్ వద్ద మే 22, 1748న తన 79వ ఏట తనువు చాలించాడు.

"భారత దేశములో 18వ శతాబ్ద ప్రథమార్థ భాగమున తన రాజకీయ లక్ష్యాలను సఫలీకృతము చేసుకొన్న రాజనీతిజ్ఞుడు ఇతడొక్కడే, ఇతడు జన్మతః నాయక లక్షణాలను కలిగినవాడు, గొప్ప యోధుడు, పరిపాలనాదక్షుడు...." అని డా॥ యూసఫ్ హుస్సేన్ ఖాన్ నిజామ్ ఉల్-ముల్క్ గూర్చి ప్రశంసాపూర్వకముగా వ్రాశాడు.

**6.2.1. నాసర్ జంగ్ (1748-1751) :** ఇతను నిజాం-ఉల్-ముల్క్ రెండో కుమారుడు. మొదటి అసఫ్ జా మరణానంతరము అతని వారసుల మధ్య బయలుదేరిన వారసత్వ యుద్ధంలో నాసర్‌జంగ్ విజయము సాధించి దక్కను సుబేదారైనాడు. దక్కన్ పాలకునిగా నాసర్‌జంగ్ ఎదుర్కొన్న ప్రధాన సమస్య ముజఫర్ జంగ్ వ్యతిరేకత. తన సోదరి కుమారుడు (ఖైరున్నీసా బేగం) ముజఫర్ జంగ్. ఫ్రెంచివారి సహాయముతో దక్కన్ సుబేదారగుటకు తీవ్ర ప్రయత్నములు చేశాడు. నాసర్ జంగ్ ఆంగ్లేయుల సహాయంతో సైన్యమును సమకూర్చుకొని తన మేనల్లుడైన ముజఫర్ జంగ్‌ను శిక్షించుటకు, కర్ణాటకములోని పరిస్థితులను అదుపులో నుంచుటకు బయలుదేరాడు. యుద్ధంలో ముజఫర్ జంగ్‌ను ఓడించి అతనిని లొంగతీస్తాడు. ముజఫర్ లొంగిపోవుట ఫ్రెంచివారు సహించలేకపోతారు. ఫ్రెంచివారి కుట్ర ఫలితంగా

కర్నూలు నవాబు రుహిమ్మత్ ఖాన్, నాసర్ జంగ్‌ను హత్య చేస్తాడు. నాసర్‌జంగ్ ధైర్యశాలి, కరుణా హృదయుడు, సాహిత్యము, సంగీతము, చిత్ర లేఖనము అంటే ఆసక్తి చూపేవాడు.

**6.2.2. ముజఫర్ జంగ్ :** ముజఫర్ జంగ్ ఆసఫ్ జాహీ వంశీయుడు కాదు. నాసర్ జంగ్ హత్యానంతరము ఫ్రెంచివారి సహాయముతో ముజఫర్ జంగ్ స్వల్ప కాలము దక్కను సుబేదారుగా వున్నాడు. అందువలన ఆసఫ్ జాహీ వంశ చరిత్రలో ఇతని ప్రసక్తి వచ్చింది. ఫ్రెంచి వారి సహాయముతో దక్కను సుబేదారైన ముజఫర్ జంగ్ ఫ్రెంచి సేనాని బుస్సీ తోడురాగా రాజధానికి బయలుదేరాడు కాని తాము చేసిన సహాయానికి ప్రతిఫలము లభించలేదని అసంతృప్తి చెందిన కడప, కర్నూలు నవాబులు కలిసి కుట్రపన్ని కడపకు 35 మైళ్ళ దూరమునందున్న లక్కిరెడ్డిపల్లి వద్ద ఫిబ్రవరి 1751లో ముజఫర్ జంగ్‌ను హత్య చేస్తారు.

**6.2.3. సలాబత్ జంగ్ (1751 - 1761) :** ముజఫర్ జంగ్ హత్యానంతరము ఫ్రెంచి సేనాని బుస్సీ, మొఘలాయి సర్దారులను తదితర అధికారులను ఒప్పించి నాసర్‌జంగ్ తమ్ముడగు సలాబత్ జంగ్‌ను దక్కను సుబేదారుగా ప్రకటిస్తాడు. అనుకోకుండా అధికారము లభించిన తరుణములో, ఆనందభరితుడై సలాబత్ జంగ్, బుస్సీకి అతని అనుచరులకు కానుకలిచ్చి సత్కరించి, ఫ్రెంచి కంపెనీకి కొండవీడు, నిజాం పట్టణము, నరసాపురం మండలములను దత్తము చేస్తాడు.

**6.2.4. ఫ్రెంచివారి ప్రాబల్యము :** అనుకోకుండా లభించిన అధికారాన్ని సలాబత్‌జంగ్ నిలుపుకోలేకపోతాడు. ఇతను అసమర్థుడు. ఇతడు పదవిలో వుండుటకు ఫ్రెంచివారి మద్దతే ముఖ్య కారణము. ఒక ప్రక్కన మహారాష్ట్రుల దండయాత్రనుండి, మరోపక్కన తన దాయాదుల కుట్రలనుండి అతనిని కాపాడినది ఫ్రెంచి సేనాని బుస్సీయే. అందుకు ప్రతిఫలంగా ఫ్రెంచి వారికి మచిలీపట్టణ ప్రాంతము, ఉత్తర సర్కారులు ఇచ్చాడు. సారవంతమైన ఉత్తర సర్కారులు ఫ్రెంచివారికి ఇచ్చుటవలన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నమైంది. సలాబత్ జంగ్ ప్రజాభిమానాన్ని కోల్పోతాడు. లష్కర్ ఖాన్, షానవాజ్‌ఖాన్ లాంటి ప్రధానాధికారులు ఫ్రెంచివారి ఆధిక్యతను నిరసిస్తారు. మూడవ కర్ణాటక యుద్ధమున, ఆంగ్లేయులు ఫ్రెంచి వారిని ఓడిస్తారు. సలాబత్ జంగ్ అనుమతితో మచిలీపట్టణము, నిజాం పట్టణము, కొండపల్లి సర్కారులను వశపర్చుకొంటారు ఆంగ్లేయులు. మహారాష్ట్రుల చేతిలో పరాజితుడై వారికి దౌలతాబాద్, బీజాపూర్ మున్నగు ప్రాంతముల నొసగి సలాబత్‌జంగ్ సంధించేసుకొంటాడు. ఇట్టి పరిస్థితులలో అతని తమ్ముడు నిజాం-ఆలీ-ఖాన్ క్రమ క్రమముగా అధికారమును హస్త గతము చేసుకొంటాడు. సలాబత్ జంగ్‌ను బంధీగా చేస్తాడు.

**6.2.5. నిజాం-ఆలీ-ఖాన్ 1761-1803 :** 1761లో సలాబత్‌జంగ్‌ను బందీచేసి మొదటి ఆసఫ్‌జా నాలుగవ కుమారుడైన నిజాం-ఆలీ-ఖాన్ రాజ్యాధికారాన్ని స్వీకరిస్తాడు. ఇతను రెండో ఆసఫ్ జా బిరుదుతో నిజాం అయ్యాడు. ఈతని కాలము నుండే ఆసఫ్ జా ప్రభువులు నిజాము ప్రభువులుగా ప్రసిద్ధికెక్కారు. సింహాసనము నధిష్టించే నాటికి నిజాం-ఆలీ-ఖాన్ సైనిక పరిపాలనా వ్యవహారములలో అనుభవము గడించుటయేగాక దక్కన్ రాజకీయములలో పరిచయము సంపాదించి యున్నాడు. మొఘల్ సర్దారులతో సత్సంబంధాలు కలిగియున్నాడు. ఇతను ఎక్కువ కాలము పరిపాలించుటవలన ఇతని పరిపాలన కాలంలో అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటిలో ముఖ్యమైనవి మనము వరుస క్రమములో తెలుసుకుందాము;

### 6.2.6. ముఖ్య సంఘటనలు :

1. మహారాష్ట్రుల వారసత్వ విషయములో జోక్యము చేసుకొని మాధవరావు, రఘునాధరావుల మధ్య సఖ్యతను చేకూరుస్తాడు.
2. కర్నూలు, ఆదోని, కర్ణాటక ప్రాంతములలో పర్యటించి తన అధికారమును స్థిరపర్చుకొంటాడు.
3. ఆంగ్లేయులతో ఒడంబడిక చేసుకొని ఉత్తర సర్కారులను వారి ఆధీనముగావించి వారు యేటేటా 5 లక్షల పేష్కష్ చెల్లించు ఏర్పాటు చేసుకొన్నాడు.
4. రాజధానిని ఔరంగాబాదు నుండి 1870లో హైదరాబాదుకు మార్చాడు.

5. కారన్ వాలీస్ కాలములో జరిగిన మూడవ ఆంగ్లో మైసూర్ యుద్ధమున ఆంగ్లేయుల పక్షము వహించి మైసూరు యేలు టిప్పు సుల్తాన్‌తో పోరాడి, కడప, బళ్ళారి ప్రాంతములను పొందాడు.

6. మహారాష్ట్రులు నానాఫడ్నవీస్ నాయకత్వమున నిజాం రాజ్యంపై దండెత్తిరాగా, ఆంగ్లేయులు మాత్రం (సర్ జాన్ షోర్) తటస్థముగా ఉన్నారు.

7. మహారాష్ట్రుల చేతిలో ఓడిపోయిన నిజాం, వారికి తపతీ నదీ తీరమందలి విశాల భూభాగమును, దౌలతాబాదు దుర్గముతోపాటు 3 కోట్ల రూపాయలను చెల్లించాడు.

8. నిజాం తన పరాజయమునకు బ్రిటీష్‌వారి ద్రోహబుద్ధియే కారణమని భావించుటవలన ఫ్రెంచివారితో స్నేహం చేయసాగాడు. ఆంగ్ల పటాలములను తొలగించి, ఫ్రెంచి సైనిక పటాలములను రెట్టింపు చేసి, సైనిక వ్యయము క్రింద మెదక్ మండలాన్ని ఫ్రెంచివారికిచ్చాడు.

9. రాజ్యాధిపత్యమునకై ఉవ్విళ్ళూరు నిజాం కుమారుడు అక్బర్ ఆలీ తిరుగుబాటుచేసి విఫల మనోరథుడై ఆత్మహత్య చేసికొన్నాడు.

10. వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిని 1798లో అంగీకరించాడు. భారత దేశంలో వెల్లస్లీ సైన్య సహకార సంధి నంగీకరించిన మొదటి పాలకుడితడే.

11. ఈ సంధితో నిజాం రాజ్యంలో ఫ్రెంచి ప్రాబల్యమంతరించుటయేగాక, నిజాం కూడా తన స్వాతంత్ర్యమును కోల్పోతాడు.

12. నిజాం, వెల్లస్లీ కాలమున నాలుగవ ఆంగ్లో - మైసూర్ యుద్ధంలో ఆంగ్లేయుల పక్షమున పోరాడి, కర్నూలు, అనంతపురము మొదలైన ప్రదేశములను పొందుతాడు.

13. సైనిక వ్యయము కొరకై కడప, బళ్ళారి, కర్నూలు, అనంతపురం మండలములను ఆంగ్లేయులకు వశపరచారు. వీటిని అప్పటి నుంచి దత్త మండలములని అంటారు.

14. ఆగస్టు 1777లో అతి వృష్టి వలన మూసీ నదికి వరదవచ్చి రాజధాని నగరమునకు, నగర వాసులకు అపార నష్టము కల్గింది.

15. నిజాం-ఆలీ-ఖాన్ మతసామరస్యానికి మారు పేరు. ఉదాహరణకు - రాజా ప్రతాపవంత్ విఠల్ ఇతని మొదటి దివాన్ - పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో పేష్కార్ అనే క్రొత్త పదవిని సృష్టించి - ఈ పదవులలో మహారాష్ట్ర బ్రాహ్మణులను నియమించాడు. - ఛోండాజీపంత్, నానాజీపంత్ అనే ఈ ఇరువురు నిజాం ఆలీ - ఖాన్‌పై చెప్పుకోదగిన పలుకుబడి కల్గియుండేవారు.

నిజాం ఆలీఖాన్ తన పరిపాలన చివరి కాలంలో అంశాంతికర పరిస్థితుల నెదుర్కొన వలసివచ్చింది. తన కుమారుడు అక్బర్ ఆలీ ఎదురు తిరిగి తిరుగు బాటును చేసినప్పుడు నిజాం అతనిని బంధించాడు. దీనికతడు ఆత్మహత్య చేసుకోవడం ఈ హఠాత్సంఘటనకు తట్టుకోలేక వృద్ధుడైన నిజాం ఆలీ ఖాన్ శోక భారంతో కృంగి మనో వ్యాధితో ఆగష్టు 6వ తేదీన 1803లో మరణించాడు.

నిజాం ఆలీఖాన్ తన రాజధానియైన హైదరాబాద్‌ను అతి సుందరంగా తీర్చిదిద్దినాడు. ఇతని కాలములో నిర్మించబడిన భవనములలో మోదీమహల్, గుల్షన్‌మహల్ రోషన్ బంగ్లా ప్రసిద్ధములు.

**6.3.1. సికిందర్ జా 1803 - 1829 :** నిజాం ఆలీఖాన్ కుమారుడు నవాబు సికిందర్ జా బహదూర్ మూడవ అసఫ్‌జా బిరుదుతో రాజ్యానికి వచ్చాడు. ఇతను 1829 వరకు పాలించాడు. సికిందర్ జా రెండవ ఆంగ్లో-మహారాష్ట్ర యుద్ధంలో ఆంగ్లేయుల పక్షమున యుద్ధము చేసి చౌత్ పన్ను చెల్లింపు నుండి మినహాయింపు పొందాడు.

సికిందర్ జా కాలంలోనే ఆంగ్లేయ తూర్పు ఇండియా కంపెనీ రాజకీయంగా సంపూర్ణమైన ఆధిక్యతను సంపాదించుకున్నది. దివాన్ నియామకంలో నిజాం కంపెనీ వారి మాట పాటించటంలో కంపెనీ ఆమోదంపై చందూలాల్ షాని దివాన్‌గా నియమించాడు. క్షత్రియ, ఖత్రి కుటుంబంలో జన్మించిన ఇతడు అక్బర్ చక్రవర్తి కాలంలో భూమిశిస్తు విధానాన్ని రూపొందించిన సుప్రసిద్ధ ఆర్థిక శాస్త్ర

నిపుణుడు రాజా తోడర్ మల్ వంశానికి చెందినవాడుగా చెప్పబడ్డాడు. ఇతని దివాన్‌గిరీ హయాంలోనే పరిపాలనా రంగంలో అవినీతి పెచ్చు పెరిగింది. శిస్తు వసూళ్ళ అధికారాన్ని ఇతడు వేలంపాటపై వడ్డీ వ్యాపారులకు సంక్రమింపచేశాడు. జలగలాంటి ఈ వడ్డీ వ్యాపారుల చేతులలో రైతులు నానా అగచాట్ల పాలయ్యారు. చందులాల్‌షా తన అధికారాన్ని నిలవబెట్టుకొనడానికై కడు నిరంకుశంగా ప్రవర్తించాడు. ప్రభుత్వ వ్యయంతో 'రసెల్సు బ్రిగేడ్' అని పేరు పెట్టి కొంత సైన్యాన్ని నిర్మించాడు. విలియం పామర్ 1814లో ఒక పెద్ద బ్యాంకుని స్థాపించి హైదరాబాదులో రాజా పామర్‌గా ప్రసిద్ధికెక్కాడు. చందులాల్‌షా, పామర్ అండ్ కంపెనీ వారితో అక్రమమైన లావాదేవీలను పెంపొందించుకొని హైదరాబాద్ రాజ్య ప్రతిష్టకే భంగకరంగా వ్యవహరించాడు. తాను నిర్మించిన 'రసెల్సు బ్రిగేడ్'ను పోషించే నిమిత్తమై, పామర్ కంపెనీ వారి నుండి అపారమైన ధనాన్ని ఋణంగా తీసుకున్నాడు. ఈతడు గావించిన అక్రమమైన వ్యవహారాలవల్ల రాజ్య ఖజానా దివాలా స్థితికి దిగజారింది. ఇట్టి స్థితిలో ఇతడు జిల్లాలలో ఆంగ్లేయ అధికారులను నియమించి సైన్యాల సహాయంతో పరిస్థితులను అదుపులోపెట్టడానికై ప్రయత్నించాడు.

శాంతి భద్రతల పరిరక్షణకై సికిందర్‌జా కాలంలో పోలీసు బలగమేర్పాటు చేయబడింది. సికిందర్‌జా కాలమున ప్రభుత్వదైనందిన కార్యకలాపములలో ఆంగ్లేయుల జోక్యమెక్కువయ్యింది. వారి వత్తిడివలన రాకుమారులిద్దరు (వీరికి ఆంగ్లేయులన్న అయిష్టము) నిర్బంధించబడ్డారు.

**6.3.2. నాసిర్-ఉద్-దౌలా 1829-1857 :** సికిందర్‌జా తరువాత నాసిర్-ఉద్-దౌలా 1829లో సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతని హయాంలో చందూలాల్ షా కొద్ది కాలం మాత్రమే దివానుగా కొనసాగాడు. 1843లో తీవ్రమైన వత్తిడికిలోనై దివాన్ పదవికి రాజీనామా చేశాడు. తర్వాత పదిసంవత్సరాలలో అనేకులు దివానులుగా పని చేశారు. చివరకు 1853లో ఈ పదవి సాలార్‌జంగ్ కైవసమైంది. నాసిర్-ఉద్ దౌలా కాలంలో జమీందార్లు, జాగీరుదార్లు నిరంకుసులయ్యారు. చందూలాల్ దుబారాల వలన పరిస్థితులు అదుపు తప్పినవి. 1853లో రెసిడెంట్, మేజర్ డేవిడ్‌సన్ సూచనపై నిజాం బీరార్, ఉస్మానాబాద్, రాయచూర్ జిల్లాలను సైనిక వ్యయమునకు బదులుగా బ్రిటీష్ వారికి దత్తము చేశాడు. ఉత్తర హిందూ దేశమున బ్రిటీష్‌వారిపట్ల నిరసనగా సయ్యద్ అహమ్మద్ నాయకత్వమున తిరుగుబాటు బయలుదేరింది. నిజాం రాజ్యములో ఈ ఉద్యమము ముబారిజ్-ఉద్-దౌలా (నాసిర్-ఉద్-దౌలా) జ్యేష్ఠపుత్రుడు నిర్వహించాడు. కానీ ఆంగ్లేయులీ ఉద్యమమును అణచివేశారు.

**6.3.3. 1857 విప్లవము :** 1857లో ఉత్తర హిందూ స్థానమున సిపాయిల తిరుగుబాటు బయలుదేరింది. ఈ విప్లవ ప్రభావము దక్షిణ హిందూ దేశములో తక్కువ ఔరంగాబాదు, బోయినపల్లి ప్రాంతములలో విప్లవ ప్రయత్నములు జరిగాయి. రాజధానిలో ప్రజలు రెసిడెన్సీపై దాడి చేశారు. నిజాం విప్లవకారులను పిలిపించి మందలించాడు. దివానైన సాలార్‌జంగ్ అరబ్బుల సాయముతో విద్రోహ చర్యలను అణచివేశాడు. రెసిడెన్సీపై దాడిచేసిన తుర్రెబాజ్ ఖాన్‌ను ఆంగ్లేయులు కాల్చిచంపారు.

**6.3.4. విప్లవ ఫలితాలు :**

1) ఆంగ్లేయులకు మద్దతు నిచ్చినందుకు నిజాం, అతని అధికార వర్గమును సత్కరించారు.

2) నిజాంను 'స్టార్ ఆఫ్ ఇండియా" అను బిరుదుతో సత్కరించారు.

3) నిజాం చెల్లించవలసిన 50 లక్షలు రద్దు చేశారు.

4) మొఘలు నాణెముల స్థానంలో కొత్త నాణెములు వాడుకలోనికి వచ్చాయి.

**6.4.1. అఫజల్-ఉద్-దౌలా 1857-1869 :** నాసిర్ - ఉద్ -దౌలా కుమారుడైన అఫజల్-ఉద్-దౌలా రాజ్యాధికారైనాడు. అఫజల్-ఉద్-దౌలా కేవలం నిజాంగానే ఉండిపోయాడు. పరిపాలనంతా సాలార్‌జంగ్ దివానే కొనసాగించాడు. దివాన్ సాలార్ జంగ్ నిజాం రాజ్యమును జిల్లాలు, తాలూకాలుగా విభజించి పరిపాలనను క్రమబద్ధము చేశాడు, భూమిశిస్తు విధానము, న్యాయ నిర్వహణ విషయంలోనూ, విద్యా విషయములోనూ అనేక సంస్కరణలు చేసి అతను పరిపాలనావేత్తగా ప్రసిద్ధికెక్కాడు. అఫజల్-ఉద్-దౌలా 1869లో మరణించాడు.

**6.4.2. మీర్ మహబూబ్ అలీఖాన్ : (1869-1911)** అఫజల్-ఉద్-దౌలా అకాల మరణము చెందగా అతని కుమారుడైన మీర్ మహబూబ్ అలీఖాన్ మూడు సంవత్సరముల ప్రాయమున నిజాం మయ్యాడు. బ్రిటీష్ వారు సాలార్ జంగ్‌ను, షమ్స్- ఉల్-ఉమ్రాన్ ను అతని సంరక్షకులుగా నియమించారు. సాలార్ జంగ్ తన సంస్కరణలను ఈ నిజాం కాలమున పూర్తి చేశాడు. మహబూబ్ అలీఖాన్ యుక్తవయస్కుడు కాగానే నాటి గవర్నర్ జనరలైన లార్డ్ రిప్పన్ హైదరాబాద్ వచ్చి, అతనికి సర్వాధికారములను హస్తగతము చేశాడు. నిజాం రాజ్యమునకు వచ్చిన మొట్టమొదటి గవర్నర్ జనరల్ ఇతడే. తదుపరి ప్రతి వైస్రాయి తన పదవీ కాలమున హైదరాబాద్ వచ్చుట ఆనవాయితీ అయింది. మహబూబ్ అలీఖాన్ నిజాంకాలంలో జరిగిన ముఖ్య అంశాలు.

అటవీ, తపాలా శాఖలు ఈ కాలమున రూపొందింపబడ్డాయి. నిజాం ఈ శాఖలపై ఎక్కువ శ్రద్ధ చూపాడు. హైదరాబాదు రాజ్యాన్ని మిగిలిన భారత దేశంతో రైలు మార్గం ద్వారా కలపడానికి ఇతడే కారకుడు. ప్రభుత్వ యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించాడు. ఈ నిజాం ఆజమాయిషీలోనే సికింద్రాబాద్ నుండి వరంగల్ వరకు, డోర్నకల్‌నుండి బెజవాడ వరకు రైలు మార్గాలు వేయబడ్డాయి.

ఫిబ్రవరి 1883లో దివాన్ సాలార్‌జంగ్ మరణంతో దివాన్ పదవి అతని కుమారుడైన మీర్ లియాక్ అలీఖాన్‌కు అప్పజెప్పబడినది. తండ్రి ప్రారంభించిన సంస్కరణ కార్యక్రమాలను ఇతడు కొనసాగించాడు. ఇతని దివాన్‌గిరీ హయాంలో 'రాజ్యసభ' (కౌన్సిల్ ఆఫ్) అని పిలువబడిన ఒక సలహా సంఘం ఏర్పాటు చేయబడింది. పౌర చట్టాలు శిక్షాస్మృతులు పునర్విమర్శ చేయబడి సక్రమంగా నిర్మింపబడ్డాయి. దివాన్ న్యాయ పబ్లిక్ వర్క్స్ శాఖల పరిపాలనా బాధ్యతలను స్వయంగా స్వీకరించాడు. పూర్వపు రెవెన్యూ బోర్డు రద్దు చేయబడి ఆ శాఖకు చెందిన పరిపాలనలో అధికభాగం రెవెన్యూ శాఖ కార్యదర్శికి బదిలీ చేయబడింది.

1887లో రెండవ సాలార్‌జంగ్ నిజాంతో తనకు గల విభేదాల కారణంగా దివాను పదవికి రాజీనామా చేశాడు. అతని తర్వాత దివాను పదవి పొందిన అస్మాన్ జాహయాంలో పరిపాలనా యంత్రాంగంలో గల పటుత్వం క్రమంగా సన్నగిల్లి పూర్వపు సామర్థ్యాన్ని కోల్పోయింది. దిగజారుతున్న పరిస్థితులను అదుపులో పెట్టి, పరిపాలనా యంత్రాంగాన్ని పటిష్ఠం చేయుడానికై నిజాం అనేక సంస్కరణలను అమలు చేశాడు. రాజ్య ఆర్థిక స్థితిని బలపరచడానికై రెవెన్యూ న్యాయపౌర వ్యవహారాలు, (పబ్లిక్), పోలీసు, పబ్లిక్ వర్క్సుశాఖలు మంత్రుల వశం చేశాడు. ప్రధాన మంత్రి పేష్కార్, వివిధ శాఖల మంత్రులతో కూడిన మంత్రి మండలి (Cabinet Council) పరిపాలనకు సంబంధించిన ముఖ్య వ్యవహారాలన్నింటిని చర్చించసాగింది. ప్రధానమంత్రికి అతి ముఖ్యమైన ప్రభుత్వ శాఖలపై ఆజమాయిషీ ఇవ్వబడింది. పేష్కార్ ప్రభుత్వోద్యోగుల సైన్యాలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించేవాడు. ఆర్థిక, రెవెన్యూ, న్యాయ, పోలీసు, పబ్లిక్ వర్క్సు, సైనిక వ్యవహారాలను నిర్వహించడానికై ఆర్గురు కార్యదర్శులు నియమించబడ్డారు.

అస్మాన్ జా తరువాత దివాన్ పదవిని నిర్వహించిన నవాబ్ వికార్-ఉల్-ఉమ్రా హయాంలో పరిపాలనా యంత్రాంగం మరింత పటిష్ఠం చేయబడింది. 1894లో మంత్రి మండలి అధికారాలను కొన్నింటిని తగ్గించి ప్రధానమంత్రికి ప్రత్యేకాధికారాలు కల్పించబడ్డాయి. దివాన్‌గా ఉమ్రా అమలు జరిపిన సంస్కరణలు విజయవంతమైనప్పటికీ, కాలక్రమాన నిజాంతో ఇతనికి ఉత్పన్నమైన విభేదాల కారణంగా ఇతడు 1901లో తన పదవికి రాజీనామా చేశాడు. తర్వాత దివాను స్థానంలో మహారాజా కృష్ణ ప్రసాద్‌ను నియమించారు. ఇతని దివాన్ గిరీలోనే బీరార్ పై నిజాం సర్వాధిపత్యం గుర్తించారు. కాని ఈ ప్రాంతాన్ని బ్రిటీష్ ప్రభుత్వం వారు నిజాంనుండి శాశ్వత కౌలుపై పొందారు. నిజాం మహబూబ్ అలీఖాన్ కాలంలోనే ఇంపీరియల్ సర్వీసెస్ అను సైన్యము ఏర్పాటైంది.

ఈ నిజాం కాలము హిందూ-మహమ్మదీయుల సామరస్యమునకు ప్రతీకగా నుండేది. 1908లో మూసీనది పొంగి విపరీత ప్రాణ నష్టము, ఆస్తి నష్టము సంభవించినప్పుడు నిజాం తగురీతిలో ప్రజలను ఆదుకొన్నాడు. అరబ్బీ, పారశీక, ఉర్దూ స్థానిక భాషల అధ్యయనమునకు విద్యాలయములు స్థాపించబడ్డాయి. ఈ నిజాం కాలంలోనే అధికార భాషగా పారశీకం తొలగించబడి ఉర్దూకు ఆ స్థానం కల్పించబడింది.

**6.4.3. ఉస్మాన్-అలీ-ఖాన్- 1911-1948 :** 1911లో హైదరాబాద్ సింహాసనాన్ని నిజాం మీర్ ఉస్మాన్-అలీ-ఖాన్ అధిష్ఠించాడు. ఇతను ఆసఫ్ జాహీలలో చివరివాడు. ఇతని పరిపాలనలో అనేక ముఖ్య సంఘటనలు జరిగాయి. రెండు ప్రపంచ యుద్ధాలు, భారత దేశము స్వాతంత్ర్యమును సంపాదించుకొనుట, హైదరాబాదు సంస్థానము ఇండియన్ యూనియన్‌లో విలీనమగుట ఇతని కాలంలోనే జరిగాయి. ఇతని కాలములో నిజాం రాజ్యము సర్వతోముఖాభివృద్ధి పొందింది. వివిధ ప్రభుత్వ కార్యాలయములలో అధికార వర్గమును నియమించుటలోను,

కార్య నిర్వహణలోను నిజాము శ్రద్ధ వహించి ప్రభుత్వ కార్యకలాపాలు నిర్విఘ్నముగా కొనసాగునట్లు చేశాడు. రాష్ట్రాదాయము క్రమ బద్ధము చేసి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాడు. వీటిలో ప్రధానమైనది ఉస్మాన్ సాగర్ లేక గండిపేట చెరువు. వీని వలన పొలము సాగుకు నీరు, రాజధానికి మంచినీరు లభించుటయేగాక మూసీనదికి వరదల ప్రమాదము తొలగిపోయింది. వ్యవసాయాభి వృద్ధికి నిజాము సాగరము, హిమాయత్ సాగరములు నిర్మించారు. నిజాము సాగరము విస్తీర్ణము 50 చదరపు మైళ్ళు దీని జలము 2,70,000 ఎకరముల సాగుకు ఉపయోగపడుచున్నవి. నిజాం ఉస్మాన్, సిల్కు, పట్టు, తివాచీలు, దుప్పట్లు మున్నగువాటికి సంబంధించిన చేనేత తదితర దేశీయ పరిశ్రమలను పునరుద్ధరించి, పంచదార, కాగితము, సిమ్మెంటు, సిగరెట్లు, అగ్గిపెట్టెలు, వస్త్రములు తయారు చేయు పరిశ్రమలను స్థాపించి, వేలకొలది శ్రామికులకు బ్రతుకు తెరువు కల్పించాడు. సిర్పూరు పేపరుమిల్స్, బోధన్ చెక్కెర ఫ్యాక్టరీ, ఆజం జాహిమిల్, చార్మినార్ సిగరెట్ ఫ్యాక్టరీ, బీదర్, నిర్మల్ పరిశ్రమలు నిజాంచే నెలకొల్పబడిన ప్రధాన పరిశ్రమలు. ఈ నిజాం వైద్యాలయములు, విద్యాలయములు స్థాపించాడు. సిటీ కళాశాల, ఉస్మానియా విశ్వ విద్యాలయము, ప్రభుత్వ పుస్తక భాండాగారము, మ్యూజియం, జూబిలీహాలు, ఉస్మానియా వైద్యాలయము, యునాని వైద్యాలయము మొదలగునవి ఈయన కాలమున నిర్మించబడ్డాయి. సాలార్‌జంగ్ ప్రారంభించిన పారిశ్రామిక వస్తు ప్రదర్శన పద్ధతి క్రమ బద్ధము చేయబడింది. జిల్లా కేంద్రాలలోను, తాలూకా కేంద్రాలలోను ప్రభుత్వ కార్యాలయముల నిర్మాణము విస్తృత ప్రాతిపదికపై జరిగాయి. పురాతత్వ శాఖలు నెలకొల్పబడ్డాయి. ఎల్లోరా, అజంతా గుహలు, వేయి స్తంభాలగుడి, రామప్ప దేవాలయము మున్నగు చారిత్రక ప్రాధాన్యముగల కట్టడాలను ఈ శాఖ రక్షించింది. తెలంగాణాలోని వివిధ రాజవంశములకు చెందిన శాసనములను సేకరించి, పరిష్కరించి, ప్రచురించబడ్డాయి. రైల్వే, తపాలశాఖలు పునర్నిర్మింపబడ్డాయి. నిజాం స్టేట్ రైల్వే స్థాపించబడింది. చెంచులు, కోయలు మున్నగు ఆదిమ జాతులవారి స్థితిగతులను మెరుగుపర్చుటకు ఒక సంఘము, సేవాభ్యుదయ శాఖను ఏర్పాటు చేశారు. మొదటి ప్రపంచ యుద్ధమున నిజాం ఆంగ్లేయులకు ఆర్థికంగా, సైనికంగా సహాయపడి వారినుండి "మహోన్నత వహించిన" (His Exalted Highness) అను బిరుదును పొందాడు. చివరి నిజామైన ఇతని కాలం సర్వత్రా అభివృద్ధి చెందింది.

**6.4.4. నిజాం రాజ్యము ఇండియన్-యూనియన్‌లో చేరిక :** నిజాము రాజ్యంలో రజాకార్ల దౌర్జన్యములు చెలరేగగా 1948 వ సంవత్సరం, సెప్టెంబర్ నెలలో భారత ప్రభుత్వం పోలీసు చర్య జరిపించి హైదరాబాదు సంస్థానమును ఆక్రమించింది. తదుపరి, జనవరి 1950వ సంవత్సరమున ఈ సంస్థానము ఇండియన్-యూనియన్‌లో చేరి పోయింది. నిజాం ఉస్మాన్-అలీ-ఖాన్ రాజ ప్రముఖ పదవియందు నియమించబడ్డాడు.

**6.4.5. ఆసఫ్ జాహీ వంశ పరిపాలన స్వరూప, స్వభావాలు :** అధికారం నిజాముల మధ్య మార్పులు పొందిన కాలంలో తెలంగాణా పరిస్థితి ఏమాత్రం సౌఖ్యవంతంగా లేదు. తెలంగాణాలో మొత్తం జనాభాలో అత్యధిక సంఖ్యాకులు తెలుగు మాతృభాషగాగల హిందువులు, సంఖ్యా బలంలో తరువాత లెక్కింపదగిన వారు కన్నడిగులు. పరిపాలన నిర్వహించిన ముస్లింలు అల్ప సంఖ్యాకులే, కానీ వీరే ప్రభుత్వ రంగంలో అన్ని పదవులను గుత్తాధికారంగా అనుభవించారు. రాజ్యంలోగల అన్ని పరిశ్రమలు వీరి యాజమాన్యంలోనే ఉండేవి. హిందువులలో అధిక సంఖ్యాకులు చదువుకున్న వారైనందున విద్యా వ్యాసంగాలలో మాత్రం వారు కొంత ప్రాధాన్యత వహించారు.

ఆసఫ్ జాహీల పరిపాలన అధిక సంఖ్యాకులైన హిందువులకు యేమాత్రం సంతృప్తిని కల్గించలేదు. ఈ కాలంలో పరిపాలకులు పరిపాలనాధికారాలను జాగీర్దారుల పరంచేయగా వారు ప్రజా క్షేమాన్ని పూర్తిగా విస్మరించి నిరంకుశంగా వ్యవహరించారు. గ్రామీణ ప్రాంతాలలో నివసించే హిందూ ప్రజానీకాన్ని ఆరోగ్య విద్యా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారు అన్ని రంగాల్లోను వెనుకబడి ఉండి స్వార్థ పరులైన భూస్వాముల నిరంకుశత్వానికి గురియై అనేక కష్టనష్టాలననుభవించారు.

○ హిందూ జనాభాలో అధిక సంఖ్యాకులైన రైతు కూలీల పరిస్థితి హృదయ విదారకమై ఉండేది. గ్రామాలలో 'భగలా', 'బిగారీ' అనే రెండు వర్గాలకు చెందిన కంబారులుండేవారు. భూకామందులకు అప్పుపడి, వడ్డీకి బదులుగా వారి దగ్గర కంబారులుగ పనిచేసేవారు. భగలా అని ఉన్నత కులాలవారికి పాలేరుల పనిచేసేవారు. భగలా అని ఉన్నత కులాల వారికి పాలేరుల పనిచేసే కంబారులు 'బిగారీ' అని పిలువబడేవారు. వీరిలో భగలాలకు వెట్టి సేవలకు ప్రతిఫలంగా వస్తు రూపంగానూ దిన భత్యం ప్రకారం వేతనాన్ని సాలీనాగా ఇచ్చేవారు. బిగారీలకు పంటలకోత కాలంలో తిండి గింజలు యివ్వబడేవి. ఒక రకమైన బానిస బ్రతుకులో ఉన్న ఈ కంబారుల జీవిత పరిస్థితులను

మెరుగు పరచడానికై ప్రభుత్వం కొంత ప్రయత్నించింది. కాని భూస్వాముల వ్యతిరేకతవల్ల ఈ పనిలో అది సఫలత పొందలేకపోయింది. హిందువుల పరిస్థితులతో పోల్చి చూస్తే ముస్లింల జీవితం అన్ని విధాలా మెరుగుగా ఉండేది. వారు అనేకమైన సదుపాయాలను సౌకర్యాలను అనుభవించారు. ఇట్టి తేడాలవల్ల ప్రజలలో అసంతృప్తి తీవ్రంగా పెరిగి పోయింది.

ప్రాథమిక ఉన్నత విద్యాస్థాయిలలో ప్రభుత్వం ఉర్దూను మాధ్యమిక భాషగా ప్రవేశపెట్టడం, ప్రజలు విద్యా విషయకంగా వెనుకబడి ఉండడానికి ప్రబలకారణమైంది. ప్రత్యేక వ్యక్తులు, సంస్థలు, పాఠశాలలను నిర్వహించే విషయంలో ప్రభుత్వం అనేక కట్టడలను విధించింది. కొన్ని ప్రైవేటు పాఠశాలలు స్థాపింపబడినప్పటికి అవి నిరుపయోగమయ్యాయి. కాల దోషం పట్టిన పాతకాలపు పాఠ్య ప్రణాళికనే పాటించ వలసిన నియమం ఉండడంవల్ల అవికూడా ప్రభుత్వ పాఠశాలలవలె నిరుపయోగమయ్యాయి. ఇన్ని నిబంధనలు, కట్టడలు ఉన్నప్పటికీ శ్రీవామన్‌రావు నాయక్, పండిత కేశవరావు కరాట్‌కర్ మున్నగు విద్యావేత్తలయిన నాయకులు హిందూ ప్రజలకు ప్రయోజనకరమైన విద్యను బోధించుటకై అనేక విద్యా సంస్థలను నెలకొల్పారు. ఇలాగే కొన్ని విద్యా సంస్థలు తెలంగాణా, ఇతర పట్టణాలలో కూడ నెలకొల్పబడ్డాయి. ఈ విధంగా ఆవిర్భవించిన విద్యా సంస్థలే కాలక్రమాన ప్రజలలో ఆంధ్ర సాంస్కృతికోద్యమ జాతీయోద్యమ బీజాలను వెదజల్లి వాటి పెంపుదలకు కారణాలయ్యాయి.

## 6.15. సమీక్ష :

ఔరంగజేబు మరణానంతరం ఏర్పడిన స్వతంత్ర రాజ్యాలలో ప్రధానమైన దక్కన్ రాజ వంశీకుల చరిత్రను ఈ పాఠంలో సమీక్షించడమైంది. తొమ్మిది మంది ఆసఫ్ జాహీల రాజ్య పాలనా విషయాలను పేర్కొనటం జరిగింది. ఉస్మాన్-అలీ-ఖాన్ పాలనలో దక్కన్ రాజ్యంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించటం జరిగింది. ఇండియన్-యూనియన్‌లో విలీనమవ్వడంతో ఆసఫ్ జాహీల చరిత్ర అంతమొందింది.

## 6.16. వ్యాస రూప ప్రశ్నలు :

1. నిజాం-ఉద్-దౌలా పరిపాలనలో జరిగిన సంఘటలను వివరింపుము.
2. ఉస్మాన్-అలీ-ఖాన్ కాలంలో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేయండి.
3. ఆసఫ్ జాహీ పాలన స్వరూప, స్వభావాలను చర్చించుము.

**Reference Books :**


1. Prof. M. Venkata Rangaiya - The Freedom Struggle in Andhra Pradesh Vol. I (1800 - 1905 A)
2. Dr. Sarojini Regani - Highlights of the Freedom Movement in Andhra Pradesh.
3. Andhra Pradesh State Archives - Adhunika Andhradesa Charitra
4. Telugu Academi - Andhrula Charitra Part I & II
5. P. Raghunadha Rao - History of Modern Andhra Pradesh
6. Telugu Academy - Andhralo Swathanthrodhyama Charitra
7. State Archives - News Letter of Nizam Alikhan's Reegin (1767-1799)
8. State Archives - The Freedom Struggle in Hyderabad Vol. III (1885-1920)
9. State Archives - Brief History of Andhra Pradesh.

పాఠం-7

# సాలార్‌జంగ్ సంస్కరణలు

విషయ క్రమం


7.1 లక్ష్యం

7.2 పరిచయం

7.3 సాలార్‌జంగ్ దివాన్‌గా నియమింపబడుట

7.4 దివాన్ అయిన నాటికి నిజాం రాజ్య పరిస్థితులు

7.2.1 ఆర్థిక సంస్కరణలు

2. పరిపాలనా సంస్కరణలు

3. రెవెన్యూ సంస్కరణలు - జిలేబంది విధానము

4. పోలీసు సంస్కరణలు

7.3.1 విద్యా సంస్కరణలు

2. న్యాయ సంస్కరణలు

3. రవాణా సౌకర్యములు

4. నాణెముల సంస్కరణలు

5. ప్రజాహిత కార్యములు

6. ముల్కీ ఉద్యమము

7.4.1. నిజాములతో సాలార్‌జంగ్ సంబంధములు

2. సాలార్‌జంగ్ - బ్రిటీష్

3. సాలార్‌జంగ్ సంస్కరణలు - ప్రజాచైతన్యం

4. సాలార్‌జంగ్ సంస్కరణల ఫలితములు

5. సాలార్‌జంగ్ ఘనత

6. సమీక్ష

7. వ్యాస రూప ప్రశ్నలు


## 7.1 లక్ష్యం :

హైదరాబాద్ సంస్థానంలో కుతుబ్ షాహీల పరిపాలన తర్వాత ఏర్పడిన విపరీత పరిస్థితుల వలన ఏ నిర్మాణాత్మక కార్యక్రమము చేపట్టడానికి పెద్దగా సావకాశం లేదు. ఆ జరిగిన కొద్దిపాటి పనులు కూడా చాలావరకు భవనాల నిర్మాణానికే పరిమితమయ్యాయి. ఆ తర్వాత సాలార్‌జంగ్ సంస్కరణలే ముఖ్యమైనవి. వాటిని వివరించుటయే ఈ పాఠం లక్ష్యం.

**7.2. పరిచయం :**

వరుసగా ముగ్గురు నిజాములు (నాసిర్ - ఉద్ - దేలా 1829-1857), (అఫజల్-ఉద్-దేలా(1857-1869), (మీర్ - మహబూబ్ - అలీ - ఖాన్ 1869 - 1911) పదవీ కాలములలో ముప్పది సంవత్సరముల (1853 నుండి 1883) వరకు ప్రధాన మంత్రి పదవి నిర్వహించిన మొదటి సాలార్‌జంగ్ భారత దేశ సంస్థానములలో ప్రధానమంత్రులలో అగ్రగణ్యుడు. ఛిన్నా భిన్నమైన ఆర్థిక పరిస్థితులను చక్కబరచి, శాంతి భద్రతలను నెలకొల్పిన ఖ్యాతి సాలార్‌జంగ్‌కు దక్కింది. అతను ప్రవేశపెట్టిన సంస్కరణలు భారతదేశం సంస్థానాల చరిత్రలోనే ముఖ్య ఘట్టాలుగా వర్ణింపవచ్చును.

**7.3. సాలార్‌జంగ్ దివాన్‌గా నియమించబడుట :**

సాలార్‌జంగ్ అసలు పేరు నవాబ్ ఆలీఖాన్. సాలార్‌జంగ్ అనునది బిరుదు నామము. హైదరాబాద్ నిజాం నాసిర్-ఉద్-దేలా మే 31 వ తేదీన, 1853, సాలార్ జంగ్ దివాను (ప్రధాన మంత్రిగా) నియమించాడు. దివానుగా నియుక్తుడగుటకు పూర్వము ఇతడు ఆంగ్లాధికారి డైటన్ సహచర్యంలో పరిపాలనానుభవము గడించాడు. తన పినతండ్రి జాగీరును నిర్వహించుచూ, పేర్వావలె సాలార్‌జంగ్ కూడా తన భావిజీవితమునకు పునాది వేసుకొన్నాడు.

**7.4. దివానైన నాటికి నిజాం రాజ్యపరిస్థితులు :**

సాలార్‌జంగ్ దివానైన నాటికి (1853) నిజాం రాజ్య పరిస్థితులు సంతృప్తికరంగా లేవు. ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమై వుంది. బ్రిటిష్ వారు సికింద్రాబాద్, బొలారములలోనున్న కంటింజెంట్ సైనిక వ్యయనెపమున సారవంతములైన బీరార్, రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలను కైవశము చేసుకొన్నారు. దీనివలన నిజాముకు సాలీన వచ్చు ఆదాయం తగ్గిపోయి ఆర్థిక పరిస్థితి పూర్తిగా క్షీణించింది. ఈ విధానం వలన, దర్బారు అధికారులలోను, ముస్లిం ప్రజలలోను బ్రిటిష్ వారిపట్ల తీవ్ర వ్యతిరేకత ప్రబలింది. తమకు రావలసిన బాకీల క్రింద అరబ్బులు, రోహిల్లాలు, తదితర నాయకులు కొన్ని రాజ్యభాగములను ఆక్రమించారు. అవినీతిపరులైన ఉద్యోగుల పాలనలో జిల్లాలలో పారపాలన నామమాత్రమైంది. కొన్ని జిల్లాలలో వేలం ద్వారా భూమిశిస్తు వసూలు అధికారమును పొందినవారు రైతులను పీడించి అదిక శిస్తులు వసూలు చేయసాగారు. రాజ్యంలో, నిజాం బంధువులకు, మన్సబ్‌దారులకు గూడ వేతనములు చెల్లించుటకు ఆదాయము చాలకుండేది. పాలనా సంబంధమైన సైనిక వ్యయమును భరించుటగూడా కష్టముకాగా మార్గాంతరములేని నిజాం తనస్వంత ఎస్టేట్‌లను, ఆభరణములను, వజ్రాలను రోహిల్లాలకు, అరబ్బులకు, వడ్డీ వ్యాపారులకు కుదువబెట్టి 2 కోట్ల 70 లక్షల రూపాయల అప్పు చేశాడు.

**7.2.1. ఆర్థిక సంస్కరణలు :** సాలార్‌జంగ్ మొదటి కర్తవ్యము రాజ్యంయొక్క ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుట. రాజ్యంలో నెలకొనియున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వ్యయమును తగ్గించి ఆదాయ వనరులను మెరుగుపరచుట తన ప్రథమ కర్తవ్యమని సాలార్‌జంగ్ భావించాడు. ప్రభుత్వ వ్యయమును తగ్గించు మార్గములను అన్వేషించడం మొదలు పెట్టాడు. పాలనా యంత్రాంగమును సునిశితంగా పరిశీలించి హెచ్చు వేతనములో 1000 కి పైగానున్న నిరుపయోగకరమైన పదవులను రద్దు చేశాడు. నిరుద్యోగులైన కుటుంబాలనుండి చాలా వ్యతిరేకత వచ్చింది. ఈ చర్యవలన సాలార్‌జంగ్ తీవ్ర విమర్శలకు గురియగుటయే కాక, హత్యాప్రయత్నములను గూడ ఎదుర్కొనవలసి వచ్చింది. కాని అతడు ధైర్యంగా స్థిరంగా ఎదురునిలచాడు. బ్రిటిష్‌వారి సైన్యము సికింద్రాబాద్, బొలారంవద్ద నిలచియుండుట వలన నిజాం సైన్యమును తగ్గించినను ప్రమాదము లేకుండునని గ్రహించాడు. అందువలన సైనిక సంఖ్యను తగ్గించాడు. దీనివలన ప్రభుత్వవ్యయము తగ్గిపోయింది. ఈ చర్యవలన రెండు సంవత్సరములలో ఎంతో తేడా కనపడింది. ఆర్థికలోటు పోయి మిగులు కనిపించింది. ఈ మిగులు ధనంతో, వడ్డీ వ్యాపారుల ఋణములు తీర్చి, నిజాం ఆభరణములను, వజ్రములను, వారి స్వాధీనములోనున్న భూములను విడుదలచేయించాడు. 1857 తిరుగుబాటు సమయంలో ఆంగ్లేయులకు సహాయపడుటవలన వారు నిజాం తమకీయవలసిన 50 లక్షల రూపాయల బాకీని రద్దు చేసారు. ఈ అప్పు వీడిపోవుటతో క్రమముగా నిజాం ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

**7.2.2. పరిపాలన సంస్కరణలు :** నిజాం రాజ్యమును సాలార్‌జంగ్ 5 సుబాలుగాను, 17 జిల్లాలుగాను, ప్రతిజిల్లాను కొన్ని తాలుకాలుగా విభజించాడు. ఒకొక్క సుబాకు ఒక సుబేదారును నియమించాడు. జిల్లాధికారి తాలుక్దారు, తాలుకాధికారి తహసీల్దారు. వీరికొక్కరికి

ప్రత్యేక కార్యాలయము, సిబ్బంది ఏర్పాటు చేయబడింది. పరిపాలన యంత్రాంగమునకు ప్రధానమంత్రి అధిపతి. ఒకొక్క పరిపాలన శాఖ ఒకొక్కరి ఆధీనములో నుండేది. వీరందరూ ప్రధానమంత్రికి లోబడిన ఉద్యోగులు. ప్రధానమంత్రికి ఒక అంతరంగిక కార్యదర్శి ఉండేవాడు. 1876 నుండి 1883 వరకు సయ్యద్ హుస్సేన్ బిల్ గ్రమ్ ప్రధాన మంత్రికి అంతరంగిక కార్యదర్శిగా ఉన్నాడు. అంతరంగిక కార్యదర్శితో పాటు, న్యాయశాఖ, పోలీసు శాఖ, రెవెన్యూశాఖ, పబ్లిక్‌వర్క్స్‌శాఖ మున్నగు శాఖలకు, శాఖకొక్కరు చొప్పున కార్యదర్శులుండేవారు. అన్ని ప్రభుత్వ కార్యములు సక్రమంగా నిర్వహించటానికి 14 కార్యాలయాలను ఏర్పాటు చేశారు. అంతరంగిక కార్యదర్శి ఆధీనంలో ఒక ఆంగ్లకార్యాలయముండెను

**7.2.3. రెవెన్యూసంస్కరణలు : జిలే బంది విధానము** : జిలే బంది విధానం ప్రకారం రాజ్యం అయిదు భాగాలుగా విభజింపబడింది. మొత్తం 17జిల్లాలు ఏర్పడ్డాయి. జిల్లాలను ఉపజిల్లాలుగా, తాలుకాలుగా విభజించారు. న్యాయ, ప్రజాసంబంధ, ఆరోగ్య, పురపాలక, పోలీసు, విద్యాశాఖలను పునర్మించారు. ఈ శాఖలన్నీ జిలేబంది విధానంను సక్రమంగా నడుపుటకు అవసరమైనాయి. అన్ని పదవులకు జీతాలపై ఉద్యోగనియామకం జరిగింది. 1875 లో భూమిశిస్తు సర్వేశాఖ (Land Revenue Survey Department) సెటిల్మెంట్ శాఖను (Settlement Department) స్థాపించారు. ఈ శాఖల ద్వారా భూమిని సర్వేచేయించి, భూమిశిస్తు విధానాన్ని బ్రిటిష్ పాలిత రాష్ట్రాలలోలాగ ఏర్పాటు చేసాడు. దీనివల్ల ప్రభుత్వానికి ఎంతో ఆదాయం పెరగడంతో బాటు రైతుకీ లాభం చేకూరింది.

సాలార్‌జంగ్ వేలంపాట ద్వారా భూమిశిస్తు వసూలు చేయు అధికారము గుత్తాధికారులకిచ్చు పద్ధతిని రద్దు చేశాడు. ప్రభుత్వమునకు, రైతులకు ప్రత్యక్ష సంబంధములు కల్పించాడు. దీనివలన రైతులకు తాము సాగుచేయు భూములపై హక్కు కలిగింది. పొలమును కొలిపించి, హద్దులను నిర్ణయించి, భూమిశిస్తు లెక్కలను తయారుచేయుటకు తగిన ఏర్పాటుగావించెను. భూమి విస్తీర్ణము, సాగుబడి మున్నగు అంశములను బట్టి శిస్తు నిర్ణయించుటకు నియమములు ఏర్పడినాయి. ధాన్యమునకు మారుగా ధనరూపమున భూమిశిస్తు వసూలు చేయు విధానమును మొదలుపెట్టారు. ప్రభుత్వోద్యోగులకు భూములిచ్చు పద్ధతిమానివేసి, వారికి నగదు రూపంలో వేతనమును చెల్లించు విధానమును ప్రవేశపెట్టారు. భూమిశిస్తు విధానములోని లోపములను తొలగించి దానిని క్రమబద్ధము చేయుటకు అధికారులకు ఎక్కువ అధికారాలను ఇచ్చారు. అసమర్థులు, అవినీతిపరులు, ప్రజాపీడితులు అయిన ఉద్యోగుల స్థానములో సమర్థులు, నిజాయితీ పరులు నియమించబడినారు. బలాత్కారముగా పన్నువసూలు చేయుట, అపరాధరుసుములు విధించుట నిషేధింపబడినాయి. ఈ సంస్కరణల వలన రైతుసంపద, తద్వారా ప్రభుత్వాదాయము పెంపొందాయి. రెవిన్యూ వ్యవహారములు సాఫీగా జరిగిపోయాయి.

**7.2.4. పోలీసు సంస్కరణలు :** 1687 కుతుబ్ షాహీల పతనం తర్వాత తిరిగి 1724లో ఆసఫ్ జాహి రాజవంశం పరిపాలనకు వచ్చుసమయం నాటికి దక్కన్ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. రాజ్యపరిపాలనలో లోపాలవలన శాంతి భద్రతలు లేక అనిశ్చిత వాతావరణం వుండేది. ఆ తర్వాత రాజ్యంలో, బందిపోటులు, దారిదోపిడీలు ఎక్కువగావుండేవి. సాలార్‌జంగ్ దేశములో శాంతి భద్రతలు నెలకొల్పుటకు 1865 లో పోలీసను పాలనా విధానమును సంస్కరించ నిర్ణయించాడు. బంది పోటులను, దారిదోపిడీదార్లను అణచివేయుటకు అవసరమైన చర్యలు తీసుకొన్నాడు. రాజ్యంలోని 17జిల్లాలలో, జిల్లాకొక సూపరింటెండెంట్‌ను నియమించాడు. బ్రిటిష్ వారినుండి నిజామునకు పునరుద్ధరింపబడిన రాయచూరు ఉస్మానాబాద్ జిల్లాలలో బ్రిటిష్ వారిచే నియుక్తులైన పోలీసువారి నుండియే క్రొత్త పోలీసు దళము ఏర్పాటు చేశారు. మిగిలిన జిల్లాలలో అంతకు పూర్వము పోలీసు పనులు చేయుచున్న వారినుండి సమర్థులైనవారు ఎన్నిక చేయబడినారు. పోలీసు శాఖను 1867లో రెవెన్యూశాఖనుండి వేరు చేసారు. పోలీసు శాఖ కార్యదర్శి పదవి, న్యాయశాఖ కార్యదర్శి పదవితో కలిపి వేసారు. పోలీసుశాఖలను కట్టుదిట్టమైన ఆదేశాలతో రాజ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజ్యం జాగ్రత్తలు తీసుకుంది.

**7.3.1. విద్యా సంస్కరణలు :** విద్యా రంగంలో అతి వెనుకబడిన రాజ్యం అని గ్రహించిన సాలార్‌జంగ్ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. రాజ్య పాలనా వ్యవహారమును సమర్థవంతంగా నిర్వహించుటకు శిక్షణ పొందిన సిబ్బంది అవసరమని గ్రహించి ముందు ప్రాథమిక విద్యకు ప్రాధాన్యతనిచ్చాడు. విద్యావిధానము సంస్కరించుటలో అతనికి సయ్యద్ హుస్సేన్ బిల్ గ్రామి అనునతడు సహాయపడ్డాడు. నిజాం రాజ్యంలో 1835 లో సాలార్‌దారుల్ ఉల్మ్ అను ఉన్నత పాఠశాలను నెలకొల్పి పాశ్చాత్య విద్యావిధానమునకు అంకురార్పణ చేశాడు. ఈ పాఠశాలలో పార్సీ, అరబ్బీలతో బాటు ఆంగ్ల భాష కూడా బోధింపబడింది. అఫజల్-ఉద్-దౌలా కాలములో స్థాపింపబడిన పాఠశాల ఇదొక్కటే. అతని

మరణానంతరము రాజ్యపాలనలో సర్వాధికారములు పొందిన సాలార్‌జంగ్ ఆంగ్ల భాషను, పాశ్చాత్యవిద్యను బోధించు అనేక పాఠశాలలను నెలకొల్పాడు. నగరవాసులకు సమీపంలో వుండాలనే ఉద్దేశంతో 1870 లో సిటీ హైస్కూల్, 1872 లో చాదర్ ఘాట్ హైస్కూల్ ప్రారంభించాడు. 1873 లో ప్రభువుల పిల్లలు కొరకు ఉన్నత శ్రేణి పౌరుల పిల్లలకొరకు, మదర్సా ఆలియా అను పాఠశాలను, 1878 లో రాజకుటుంబీకుల కొరకు ఐజా విద్యాలయమును స్థాపించాడు. ఈ విద్యాలయాలలో చదివి అనతి కాలంలోనే రాజధానిలో చైతన్యవంతమైన మేధావి వర్గము ఏర్పడింది. ప్రజాహిత కార్యక్రమములకుగాను, పబ్లిక్ వర్క్స్ శాఖ నిర్వహణలో సాంకేతిక సిబ్బంది. కొరత తీర్చుటకు 1870 లో ఇంజనీరింగ్ పాఠశాల స్థాపించబడింది. సాలార్‌జంగ్ మరణానంతరము 1887 లో సుప్రసిద్ధ నిజాం కళాశాలను ప్రారంభించారు. సాలార్‌జంగ్ రాజధానిలోనేగాక మొత్తం రాజ్యంలోని అన్ని రాష్ట్రాలలో, జిల్లాలలో, తాలుకాలలో కూడా విద్యాలయములు నెలకొల్పుటకు చర్యలను తీసుకొన్నాడు. ఈ పాఠశాలలో పారశీకము, ఉర్దూ, స్థానిక భాషలలో బోధనలు జరిగేవి. స్వరాజ్యం, స్వరాష్ట్రాలలోనేగాక, ఇతర ప్రదేశములలో జరుగు విద్యావ్యాప్తికి గూడా సాలార్‌జంగ్ సహాయపడ్డాడు. ఆలీఘర్‌నందు విద్యాసంస్థలను ఏర్పాటు చేయుటలో సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్‌కు సాలార్‌జంగ్ ద్రవ్యసహాయము చేశాడు. ఈ విధంగా సాలార్‌జంగ్ చేసిన విద్యా సంస్కరణల ద్వారా, చైతన్యవంతమైన మేధావి వర్గము ఏర్పడి ముందు తరాలవారికి మార్గదర్శకుడయ్యాడు.

**7.3.2. న్యాయ సంస్కరణలు :** రాజ్యంలో న్యాయ వ్యవస్థ సరిగాలేదని గ్రహించిన సాలార్‌జంగ్ అనేక న్యాయ సంస్కరణలు చేశాడు. రాజ్యంలో ఒక ఉన్నత న్యాయ స్థానమును (అదాలత్-ఇ-పాదుషాహి), ఒక అప్పీలు న్యాయస్థానమును ఏర్పాటు చేసి న్యాయ నిర్వహణ విధానమును మెరుగుపర్చాడు. హైదరాబాదులో నెలకొల్పబడిన ఈ ఉన్నత న్యాయస్థానములో ఒక ప్రధాన న్యాయమూర్తిని, నలుగురు న్యాయమూర్తులను నియమించాడు. మరణదండన, యావజ్జీవ కారాగారశిక్ష తప్ప, తక్కిన క్రిమినల్, సివిల్ వ్యవహారములన్నింటిని విచారించి, కాలయాపనచేయకుండా, తీర్పులిచ్చుటకు అందలి న్యాయమూర్తులకు సర్వాధికారములు కలుగజేసాడు. రాజధానియందును, జిల్లాలలోను, మీర్ ఆదిల్, మున్సిఫ్ మున్నగు న్యాయాధికారులను నియమించాడు. సాలార్‌జంగ్ అంగవిచ్ఛేదన శిక్షను రద్దుచేసి, శిక్షల కాఠిన్యమును తగ్గించేటట్లు చేశాడు.

**7.3.3. రవాణా సౌకర్యములు :** రాజ్యం దినదినాభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యాలు పటిష్టంగా వుండాలని గ్రహించి సాలార్‌జంగ్ అనేక సౌకర్యాలు కలుగజేశాడు. హైదరాబాద్‌నుండి షోలాపూర్ వరకు రాజమార్గము వేయించాడు. బ్రిటిష్ వారు నిర్మించదలచిన బొంబాయి, మద్రాసు రైలు మార్గమును 1868 లో ప్రారంభం చేశాడు. ఈ మార్గము నిజాము రాజ్యములోని గుల్బర్గా వాడి మున్నగు ముఖ్య పట్టణములను కలుపుచూ వేయబడింది. సాలార్‌జంగ్ హైదరాబాద్‌నుండి వాడి వరకు రైలు మార్గము ప్రారంభించి 1878 లో పూర్తిచేయించాడు. సాలార్‌జంగ్ ఆమోదించిన రైలు మార్గము అతని మరణానంతరము అతని కుమారుడైన మీర్ లియాక్ ఆలీఖాన్ పూర్తి చేయించాడు. సికింద్రాబాదునుండి వరంగల్ వరకు, డోర్నకల్‌నుండి బెజవాడ వరకు రైలు మార్గాలు వేయబడ్డాయి.

**7.3.4. నాణెముల సంస్కరణలు :** ద్రవ్య సంబంధమైన వ్యవహారములను సుగమమొనర్చుటకు సాలార్‌జంగ్ 1855 లో హైదరాబాదు నగరమున కేంద్ర కోశాగారమును జిల్లాలలోను, తాలుకాలలోను స్థానిక కోశాగారములను నెలకొల్పాడు. అప్పటిదాకా మొగలు పాదుషా పేరుతో చలామణిలో వున్న నాణెములను, 1857 తిరుగుబాటు తరువాత హైదరాబాదు టంకశాలలో ముద్రించబడిన నాణెములపైనను మొగలు పాదుషా పేరును తొలగించాడు.

**7.3.5. ప్రజాహిత కార్యములు :** సాలార్‌జంగ్ 1858 లో దారుల్ ఉలూమ్ అనే ఓరియంటల్ కాలేజీని హైదరాబాద్‌లో స్థాపించాడు. దీనిలో ఇంగ్లీషు, అరబిక్, పర్షియన్, తెలుగు, మరాఠీ భాషలను బోధించేవారు. దీనిలోనికి ప్రవేశాన్ని సాలార్‌జంగ్ స్వయంగా మంజూరు చేసేవాడు. ఈ పాఠశాలలో క్వార్టర్లీ పరీక్షల్ని పాఠశాల బోర్డ్ ఆఫ్ గవర్నర్లు నిర్వహించేవారు. విద్యార్థులకు నెలకు 8 రూ॥లనుండి 50 రూ॥ల వరకు సాలార్‌జంగే ఉపకారవేతనం ఇచ్చేవాడు.

పూర్వకాలపు జలాశయములను, చెరువులను, బాగుచేయించి నీటి పారుదలకు తగిన సౌకర్యములు కల్పించాడు. సాలార్‌జంగ్ సతీసహగమనమును నిషేధించాడు.

**7.3.6. ముల్కీఉద్యమము :** ప్రమాణములనను మెరుగుపరచి పరిపాలన సమర్ధవంతముగా సాగుటకు సాలార్‌జంగ్ భారత దేశములోని వివిధ ప్రాంతముల ప్రతిభావంతులను పిలిపించి వారిని వివిధ పదవులలో నియమించాడు. ఉత్తర భారతమునుండి ముస్లింలు, కాయస్థులు పెక్కుమంది నిజాం పాలనా యంత్రాంగంలో ప్రవేశించారు. సయ్యద్ హుస్సేన్ బిల్‌గ్రామి, సయ్యద్ ఆలీ బిల్ గ్రామి, సయ్యద్ మొహ్దీన్ ఆలీ మెహిన్ ముల్క్ మున్నగువారు వారిలో ప్రసిద్ధ పాలనావేత్తలు. అఘోరనాథ చటోపాధ్యాయ వంటి బెంగాలీలు విద్యాలయములు స్థాపించి సమర్ధవంతంగా నడిపించారు. బారిష్టరు రామచంద్రపిళ్ళే, రుద్ర మున్నగు న్యాయశాస్త్ర నిపుణులు మద్రాసు, బెంగాలులనుండి హైదరాబాదు చేరి ప్రాక్టీసు ప్రారంభించి 19 వ శతాబ్దమునకు సుప్రసిద్ధ న్యాయవాదులుగా ప్రసిద్ధి కెక్కారు. ఈ విధంగా అనేక ప్రాంతాలనుండి అనేక మంది నిజాం రాజ్యంచేరి ప్రధాన ప్రభుత్వ ఉద్యోగములను కైవశము చేసుకొనుట స్థానికులైన విద్యావంతులకు, అసూయను, ఆగ్రహమును కలిగించాయి. దీనివలన ఇరువర్గముల వారిమధ్య సంఘర్షణలు చెలరేగాయి. చివరికి ఈ సంఘర్షణల వలన ప్రజలలో అసహనము చెలరేగి,"ముల్కీ ఉద్యమము" నకు దారి తీసింది.

**7.4.1. నిజాముతో సాలార్‌జంగ్ సంబంధములు :** సిపాయిల తిరుగుబాటు (1857) తర్వాత నిజాంకు, సాలార్‌జంగ్‌కు మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. 1859 తరువాత సాలార్‌జంగ్, నిజాం విశ్వాసమును కోల్పోయాడు. 1860 లోను, 1867 లోను నిజాం, సాలార్‌జంగ్‌ను తొలగించుటకు నిశ్చయించాడు. కాని అతని ఉనికి తమకు ప్రయోజనకారియని గ్రహించిన బ్రిటిష్‌వారతని పదవిని కాపాడారు. నిజాం అఫ్జల్-ఉద్-దౌలా 1869 వ సంవత్సరములో మరణించగా అతని మూడు సంవత్సరముల కుమారుడు మీర్ మహబూబ్ ఆలీఖాన్ హైదరాబాద్ నిజాం అయ్యాడు. బ్రిటిష్‌వారు సాలార్‌జంగ్‌ను నిజాం సంరక్షకులలోనొకనిగా నియమించారు (రెండవవాడు అమీర్-ఎ-కబీర్-(లేక)షమ్స్-ఉల్-ఉమ్రా). ఈ ఏర్పాటు వలన సాలార్‌జంగ్‌కు దివాన్‌గా స్వతంత్రముగా వ్యవహరించు అవకాశము లభించింది. ఈ అవకాశమును సాలార్‌జంగ్ మెండుగా సద్వినియోగ పర్చుకొని పరిపాలనను మెరుగుపర్చాడు.

**7.4.2. సాలార్‌జంగ్-బ్రిటిష్ :** సాలార్‌జంగ్- బ్రిటిష్‌వారి సంబంధాలలో రెండు దశలున్నాయి. మొదటి దశ 1853 నుండి 1867 వరకు, రెండవదశ 1867 నుండి 1878 వరకు. మొదటిదశలో సాలార్‌జంగ్‌కు బ్రిటిష్ వారితో సత్సంబంధములుండేవి. 1857 తిరుగుబాటు సమయంలో సాలార్‌జంగ్ హృదయపూర్వకముగా బ్రిటిష్‌వారితో సహకరించి, నిజాము రాజ్యంలో తిరుగుబాటులనణిచి మాములు పరిస్థితులు నెలకొల్పుటకు దోహదపడ్డాడు. అదేవిధముగా బ్రిటిష్‌వారు గూడా అతనినభిమానించారు. 1860 సంవత్సరములోను, 1867 లోను నిజాము సాలార్‌జంగ్‌ను తొలగించుటకు పూనుకొన్నప్పుడు బ్రిటిష్ వారతనికి అండగా నిలిచారు. హైదరాబాద్‌లో బ్రిటిష్ స్థానికులగు (Residents) కర్నల్ డేవిడ్‌సన్ 1860 లోను, యూల్ (yule) అనునతడు 1867లోను సాలార్‌జంగ్ పదవీచ్యుతుడు కాకుండా కాపాడారు.

రెండవదశలో (1867-1878) వీరిమధ్య సంబంధములలో మార్పువచ్చింది. వీరిమధ్య వైరభావమేర్పడింది. హైదరాబాద్ రాజ్యంలో పరిస్థితులు చక్కబడిన పిమ్మట సాలార్‌జంగ్ బీరారు జిల్లాను, నిజాముకు సంపాదించిపెట్టుటకు, రాజకీయంగా అతని హోదా పెంచుటకు తీవ్ర కృషి చేశాడు. వాటిని సాధించుట తన జీవితాశయముగా భావించి సాలార్‌జంగ్ భారత ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరములు జరిపి. ఫలితము రాకపోవుటతో ఈ విషయమై సంప్రదించుటకు 1876 లో ఇంగ్లాండు కూడా వెళ్ళాడు. ఆ సందర్భముననే ఇతడు విక్టోరియా రాణిని సందర్శించి ఆమెతో విందారగించాడు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయము వారతనికి డి.సి.యల్ (Doctor of Civil Law) అను గౌరవపట్టానిచ్చి సత్కరించారు. కానీ భారతదేశములోని బ్రిటిష్ ప్రభుత్వవైఖరి వలన అతని ఆశయము మాత్రము నెరవేరలేదు. విఫల మనోరథుడై సాలార్‌జంగ్ తిరిగి భారతదేశానికొచ్చాడు.

ఇంగ్లాండులో అతనికి లభించిన గౌరవము, అతని కార్యకలాపాలు భారత ప్రభుత్వమునకు (బ్రిటిష్ ప్రభుత్వము) ఆగ్రహము కల్గించాయి. నిజాము రాజ్యములో అతని ప్రాముఖ్యము తగ్గించుటకు వారు ప్రయత్నాలు సాగించారు. సాలార్‌జంగ్‌తో పాటు నిజాం సంరక్షకుడుగా నియమింపబడిన అమీర్-ఎ-కబీర్ 1877 లో మరణించగా అతని తమ్ముడును, సాలార్‌జంగ్ యెడల సుముఖంగా లేనటువంటి వాడువగు వికార్ అనునతనిని రెండవ సంరక్షకునిగా నియమించుటకు బ్రిటిష్‌వారు ప్రయత్నించారు. దీనితో సాలార్‌జంగ్ రాజీనామా చేయుటకు సిద్ధపడగా అతని రాజీనామా ఆమోదింపబడునని బ్రిటిష్‌వారు ప్రకటించారు. అంతట సాలార్‌జంగ్ వెనుకంజవేసి తన రాజీనామాను

ఉపసహరించుటయేగాక, నిజాం మహబూబ్-అలీ-ఖాన్ యుక్తవయస్కుడైనంత వరకు బీరార్ ప్రస్తావన వదిలి వేయుటకు సమ్మతించాడు. ఈ విధంగా సాలార్‌జంగ్ ప్రయత్నాలు వమ్మయిపోయాయి. దానితోపాటు అతని ఖ్యాతి కూడా తగ్గిపోయింది. బీరారు పునరుద్ధరణ విషయంలో సాలార్‌జంగ్ చేసిన ప్రయత్నాలు నాటి వైస్రాయి లార్డ్ లిట్టన్‌కు అత్యంతాందోళనను కలిగించాయి. అతడు హైదరాబాదులోని బ్రిటిషు స్థానికుడు (Resident) సర్‌రిచర్డ్‌మీడ్‌కొక లేఖ వ్రాస్తూ, అందులో ఇలా అన్నాడు. "నేను భారతదేశములో రాజప్రతినిధిగా నున్నపుడు, సర్ సాలార్‌జంగ్ కుట్రవలన భారతదేశములోని బ్రిటిష్ వారియధికారము ప్రమాదమునకు గురైనట్లు నేను భావించాను. ఆ ప్రమాదము క్షామముకంటెనూ, యుద్ధముకంటెనూ భయంకరమైనది"

**7.4.3. సాలార్‌జంగ్ సంస్కరణలు- ప్రజాచైతన్యం :** సాలార్‌జంగ్ అనంతరం కొద్దికాలం రీజన్సీ కౌన్సిల్ ఏర్పడి పనిచేసింది. దానికార్యదర్శిగా సాలార్‌జంగ్ కుమారుడు మీర్ లాయక్ అలీఖాన్ పని చేశాడు. ఈ కౌన్సిల్ పాలనా సమయంలో చాందా రైల్వే ఉద్యమం ఒకటి జరిగింది. సాలార్‌జంగ్ ఉండగానే హైదరాబాద్ నుండి వాడి వరకు ఉన్న రైల్వేలైను వరంగల్‌కు, అక్కడనుండి ఒక ప్రక్క భద్రాచలం, బెజవాడ మరోప్రక్క చాందాకు కలపాలని దీనికి కావలసిన వనరుల్ని సమకూర్చటానికి హైదరాబాద్ సంస్థానం కొంత వడ్డీని గ్యారంటీగా ఇవ్వాలని ఈ రైల్వేని నిజామ్స్ గ్యారంటీడ్ స్టేట్ రైల్వే అని ఏర్పాటు చెయ్యాలనుకున్నారు. దానిలో భాగంగానే ప్రస్తుతం ఉన్న హైదరాబాద్-వాడి స్టేట్ రైల్వేని ఒకబ్రిటిషు కంపెనీ తీసుకోవాలని, ఆ కంపెనీయే ఈ క్రొత్తలైన్లు నిర్మించాలని భావించారు. ఈ వివరాలు ప్రజలకు పూర్తిగా తెలియవు. దానిపై అప్పుడే వస్తున్న విద్యావంతులైన వర్గం ఈ ప్రతిపాదన వలన సంస్థానానికి ఆర్థికంగా చాలా నష్టం కల్గుతుందని భావించింది. అందుచేత సంస్థానంలో విద్యావంతులైన కొంతమంది "చాందా రైల్వే ప్రణాళిక పరిశీలనకు ఒక కమిటీ"ఏర్పాటు చేశారు. వారిలో డాక్టరు అఘోరనాథ్ చటోపాధ్యాయ, ముల్లా అబ్దుల్ ఖయూం ముఖ్యులు. (అఘోరనాథ్ హైదరాబాద్ కాలేజీ ప్రిన్సిపాల్) ఈ కమిటీ కౌన్సిల్ ఆఫ్ రీజన్సీని ఈ రైల్వేస్కీంకి సంబంధించిన పూర్తి వివరాలు తమ కమిటీకివ్వాలని కోరారు. ప్రజలు ఈ విధంగా కోరటం హైదరాబాద్ సంస్థానచరిత్రలో ఇదే మొదటిసారి. దీనిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పర్యవసానంగా మే.20, 1883 న అఘోరనాథ్‌ను సంస్థానంనుండి బహిష్కరించారు. మే, 22, న దస్తూర్ ఔసాజి హుసంగ్ అనే రెవెన్యూ అధికారిని కుట్ర పేరుతో సంస్థానంనుంచి బహిష్కరించారు. దీనిపై రాష్ట్రంలోపల, వెలుపల అనేక వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఈ సందర్భంలో మొత్తం 18మంది వ్యక్తులపై ఏదో ఒకరకమైన చర్య తీసుకోడానికి ఏర్పాట్లు జరిగాయి. కాని 1886 నాటికి వాడి- సికింద్రాబాద్ లైను బెజవాడ వరకు వేయడం పూర్తియైంది. డాక్టరు అఘోరనాథ్ రెండు సంవత్సరాల తర్వాత తిరిగి హైదరాబాద్ రావడానికి అంగీకరించారు. తరువాత ఆయనే హైదరాబాద్ కాలేజీని నిజాం కాలేజీగా అభివృద్ధి చేసాడు. దస్తూర్ హుసంగ్ కూడా తిరిగి రప్పించారు. ముల్లా అబ్దుల్ ఖయూం కూడా సంస్థానానికి తిరిగి వచ్చాడు. ఏమైనా 1883 లో చాందా రైల్వేఆందోళన హైదరాబాద్ సంస్థానంలో ప్రజాచైతన్యానికి నాంది అనడంలో ఏ సందేహం లేదు.

**7.4.4. సంస్కరణల ఫలితములు :** సాలార్‌జంగ్ తన ఆధునిక భావాలతో నిజాం రాజ్యమును సంస్కరించాడు. ఇతని సంస్కరణల వలన రాజ్య ఆర్థికపరిస్థితి చక్కబడింది. పరిపాలన పటిష్టవంతమైంది. విద్యావంతుల సంఖ్య పెరిగింది. ప్రతిభావంతులైన ఇతర ప్రాంతముల వారికి గూడా నిజాం రాజ్యంతో ఉద్యోగావకాశములు కల్పించబడుట వలన మధ్యతరగతి వర్గము వృద్ధి చెందుటకు, ప్రజాభిప్రాయము రూపొందుటకు దోహదము చేసింది. (ఉదా॥చాందా రైల్వే స్కీమ్ అలజడి) నిజాం రాజ్యమునకు ఇతర ప్రాంతీయులరాక ముల్కీ అలజడులకు త్రోవతీసినప్పటికి వారి రాక స్థానికులలో నవచైతన్యము ఉదయింపచేసింది. సాలార్‌జంగ్ పదవీకాలంలో ఆంగ్ల, ఉర్దూ భాషలలో పత్రికల ప్రచురణ జరిగి ప్రజాభిప్రాయ నిర్మాణమునకు ఎక్కువగా దోహదము చేసాయి. అందుచేత 1853 -1883 సంవత్సరముల మధ్య సాలార్‌జంగ్ పదవీకాలము హైదరాబాద్ సంస్థాన చరిత్రలో నిర్మాణాత్మకమయింది. సాలార్‌జంగ్ తన 30 సంవత్సరాల చరిత్రాత్మక దివాన్ గిరిలో బలమైన వారితో స్నేహన్ని హైదరాబాద్ రాజ్యాన్ని ఆధునీకరించడానికి ఎనలేని కృషిచేసాడు.

**7.4.5.సాలార్‌జంగ్ ఘనత :** సాలార్‌జంగ్ తన శక్తియుక్తులచే నిజాం రాజ్యమునకు విశిష్టసేవ చేశాడు. 1857లో తిరుగుబాటు జరిగినప్పుడు ఆ తుఫానులో చిక్కుకోకుండా నిజాము రాజ్యనౌకను సురక్షితముగా ఒడ్డుచేర్చిన ఘనత సాలార్‌జంగ్‌దే. ముఖ్యంగా అతని కృషి వలననే రాయచూర్, ఉస్మానాబాద్ జిల్లాలు నిజాముకు పునరుద్ధరింపబడ్డాయి. బీరార్ జిల్లాపునరుద్ధరణకు, నిజాం

రాజకీయ హోదాను పెంచుటకు సాలార్‌జంగ్ తీవ్ర కృషి చేశాడు. కాని అతని కృషి ఫలించలేదు. ఆ కారణము వలన "సాలార్‌జంగ్ స్వాప్నికుడే గాని రాజనీతిజ్ఞుడుకాదు" (SalarJung was a dreamer, not a statesman- Thornton) అనుట సమంజసము కాదు. 1857 తిరుగుబాటు సమయమున అతడు ప్రదర్శించిన రాజనీతి, అంచెలవారీగా అతడు ప్రవేశపెట్టిన సంస్కరణలుపై అభిప్రాయము అవాస్తవికమని ఋజావు చేయుచున్నవి. "దేశ సౌభాగ్యమునకు చక్కటి పరిపాలన ఆవశ్యకమని అతని ధృఢవిశ్వాసము""19వ శతాబ్దమునాటి ఉత్తమ భారతీయ పాలనావేత్తలలో, రాజనీతిజ్ఞులలో సాలార్‌జంగ్ ఒకడు"-వహీద్‌ఖాన్.

**7.4.6.సమీక్ష :** దీర్ఘకాలం దివాన్ పదవిలో కొనసాగిన సాలార్‌జంగ్ ప్రవేశపెట్టిన అనేక సంస్కరణలను ఈ పాఠంలో వివరించబడినవి. ఆంగ్లేయులతో సన్నిహితమైత్రీ సంబంధాలను ఇతడు నెలకొల్పాడు. భారతదేశములో 1857లో జరిగిన తిరుగుబాటు దక్కన్‌కు తాకకుండా ఇతడు అడ్డుకోగల్గాడు. హైదరాబాద్ రాజ్యాని ఆధునికీకరించే ప్రయత్నాన్ని చేశాడు. ఆ శక్తి గొలిపేవస్తూ సేకరణకు ఇతడు ప్రాధాన్యతనిచ్చాడు. ఇతడు సేకరించిన అనేక వస్తువులు తర్వాత కాలంలో ఇతని పేరిట ఆరంభించిన వస్తు ప్రదర్శనశాలలో భద్రపరిచారు.

**7.4.7. వ్యాసరూప ప్రశ్నలు :**

1. సాలార్‌జంగ్ ప్రవేశపెట్టిన సంస్కరణలను వివరించుము.
2. సాలార్‌జంగ్ దివాన్ గిరిలో జరిగిన మార్పులను తెల్పుము.

**Reference Books:**


1. Prof : M.Venkata Rangaiah - The Freedom Struggle in Andhra Pradesh vol (1800-1905AD)
2. Dr. Sarojini Regani - Highlights of the Freedom Movement in Andhra Pradesh
3. Andhra Pradesh State Archives - Andhunika Andhradesa Charitra
4. Telugu Academi - Andhrula Charitra Part I & II
5. P. Raghunatha Rao - History of Modern Andhra Pradesh
6. Telugu Academi - Andhra Swathanthrodyama Charitra
7. State Archives - News letters of Nizam Ali Khans Regin (1767-1799)
8. State Archives - Freedom Struggle in Hyderabad vol III (1885-1920)
9. State Archives - Brief History of Andhra Pradesh.

పాఠం- 8

# ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణోద్యమాలు

## 8.0 లక్ష్యం :

ఆంధ్ర దేశంలో 19-20 శతాబ్దాలలో జరిగిన సాంఘిక, మత సంస్కరణోద్యమాల గురించి వివరించడమే ఈ పాఠం లక్ష్యం. ఆంధ్రాలో బ్రహ్మసమాజం, రాయలసీమలో దివ్యజ్ఞాన సమాజం, తెలంగాణాలో ఆర్య సమాజం ఉద్యమరూపంలో సమాజ మార్పునకు కృషి చేశాయి. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థని, వివాహ వ్యవస్థలోని దోషాలని సంస్కర్తలు ప్రశ్నించారు. అంచులకు నెట్టబడిన స్త్రీలను, వెనుకబడిన వర్గాలను సమాజంలో భాగస్వాములను చేసే ప్రయత్నాన్ని ఆరంభించారు.

## విషయ క్రమం


- 8.1. పరిచయం
- 8.2 పద్దెనిమిదవ శతాబ్దపు ఆంధ్ర సమాజం
- 8.3 మధ్యయుగ సంస్కరణ భావాలు
- 8.4 సంస్కరణ ఉద్యమానికి దోహదం చేసిన కారణాలు
  - 8.4.1 పాశ్చాత్య విద్య
  - 8.4.2 మిషనరీలు
  - 8.4.3 మధ్య తరగతి వర్గం
  - 8.4.4 పత్రికలు
  - 8.4.5 సంస్కరణ భావాలు
- 8.5 సంస్కరణల యుగం
  - 8.5.1 కందుకూరి వీరేశలింగం
  - 8.5.2 రఘుపతి వెంకట రత్నం నాయుడు
  - 8.5.3 ఇతర సంస్కర్తలు
- 8.6 ప్రభావం
- 8.7 దివ్యజ్ఞాన సమాజం
- 8.8 ఆర్య సమాజం
- 8.9 రామకృష్ణ మిషన్
- 8.10 ఉద్యమాల క్షీణత
- 8.11 సారాంశం
- 8.12 వ్యాసరూప ప్రశ్నలు
- 8.13 ఉపయుక్త గ్రంథాలు

## 8.1 పరిచయం

ఆంధ్రాలో సంఘ సంస్కరణోద్యమం వీరేశలింగంతో ఆరంభించబడినదిగా భావించబడుతోంది. సామాజిక వ్యవస్థలయిన కులం, వివాహం, రెండూ తీవ్రంగా ప్రశ్నించబడ్డాయి. సంస్కర్తలందరూ ఆ రెండు వ్యవస్థలలోని దోషాలను తెలియపరిచి, మార్పునకై కృషి చేశారు. ఉధృతమైన ఉద్యమ రూపంలో సామాజిక న్యాయం కోసం పోరాటం సాగింది. స్త్రీలను, ఇతర వెనుకబడిన కులాలను విద్య ద్వారా బాహ్య ప్రపంచంలోకి తెచ్చే ప్రయత్నాన్ని సంస్కర్తలు ముమ్మరంగా చేశారు. ఈ ప్రయత్నాలలో వారు సాంఘిక వెలిని ఎదుర్కొన్నా, లెక్కచేయక తమ ప్రయత్నాలను కొనసాగించారు. వీరేశలింగం తరువాత కూడా సంస్కరణలు కొనసాగినప్పటికీ, వానికి ఉద్యమ రూపంలేదు. వీరేశలింగం, వెంకటరత్నం, పెదబాపయ్య వ్యక్తిగతంగా నిర్వహించిన కార్యక్రమాలకే ఉద్యమ స్వభావం ఉంది. ఎందుకంటే వారు సాంప్రదాయ సమాజాన్ని మొదటిసారిగా తీవ్ర స్థాయిలలో ఎదుర్కొన్న నాయకులు. తరువాత కాలంలో కులసంఘాలు సంస్థాపరంగా సంస్కరణలను కొనసాగించాయి. గాంధీ నాయకత్వంలో జాతీయోద్యమంతో ఆకర్షితులయిన ఆంధ్ర యువత, సంఘ సంస్కరణకు ద్వితీయ స్థానాన్ని ఇవ్వడంతో సంఘ సంస్కరణోద్యమం 1920 నుంచి క్షీణించిందని చెప్పవచ్చు. తన ప్రత్యేక ఉనికిని కోల్పోయి, సంఘ సంస్కరణ కుల సంఘాల ద్వారానూ, జాతీయ ఉద్యమం ద్వారానూ కొనసాగింది. అప్పటికి సంస్కరణలకి కొంత సమాజ అంగీకారం లభించడంతో, వాటి ఫలితాలకి ఉగ్రత కొంత తగ్గింది.

సంఘ సంస్కరణ ఉద్యమాన్ని ఆరంభించింది రాజమండ్రి-కాకినాడ ప్రాంతం. ఇక్కడనుంచి సాగిన సంస్కరణ కార్యక్రమాలు ఇతర ఆంధ్ర ప్రాంతాలకి విస్తరించాయి. గోదావరీ ఆనకట్టవలన కలిగిన సౌభాగ్యం విద్యావ్యాప్తికి దోహదం చేసింది. పాఠశాలలు, కళాశాలలు విస్తరించి, నూతన విద్యాధిక మధ్య తరగతి వర్గం పెరగడానికి దోహదం చేశాయి. నాయకులు, పోషకులు గోదావరీ నివాసులవడంతో సంఘ సంస్కరణ ఇక్కడ వికాశం పొందింది.

## 8.2 పద్దెనిమిదవ శతాబ్దపు ఆంధ్ర సమాజం :

పద్దెనిమిది, పందొమ్మిదవ శతాబ్దాలలో ఆంధ్ర సమాజంలో కులవ్యవస్థ అత్యంత ప్రాధాన్యత, విశేష ప్రభావమూ కలిగి ఉండేది. సమాజాన్ని కులవ్యవస్థ పూర్తిగా నియంత్రించేది. దీని లక్షణాలు : 1) పుట్టుకతో నిర్ణయించబడే కులం 2) కులం నిర్దేసించే వృత్తి 3) వివాహాలు, భోజనాలు కుల పరిధిలోనే జరగాలి. 3) అంతస్థులు, హోదాలు, ప్రత్యేక హక్కులు, అసమానతలతో కూడిన కులవ్యవస్థ.

భారతీయ సమాజంలోని నాలుగు వర్ణాలు ఆంధ్ర సమాజంలో కూడా దర్శనమిస్తాయి. అవి : బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు. ఆంధ్ర సమాజంలో క్షత్రియుల సంఖ్య తక్కువే. సమాజంలోని ప్రజలను హోదాల పరంగా మూడు సాంఘిక వర్గాలుగా విభజించవచ్చు. 1) బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో కూడిన స్వాధికార ద్విజ వర్గం. ఒక్కొక్క కులంలో అనేక శాఖలు, ఉపశాఖలు ఉండేవి. 2) పై మూడు కులాలకు చెందని వారిని శూద్రులని వ్యవహరించేవారు. వీరినే సత్శూద్రులు అని వ్యవహరించేవారు. వీరు వ్యవసాయ వృత్తినిగాని, ఇతర చేతి వృత్తులనిగాని అవలంభించి, జీవనం గడిపేవారు. రెడ్డి, కమ్మకులాలు ప్రధానంగా వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టారు. విశ్వబ్రాహ్మణులు చేతి వృత్తులగు కంసాలి పనిని, వడ్రంగం మొదలగు వానిని అనుసరించేవారు. నేతపనివారు తమ వృత్తిని కొనసాగించేవారు. వీరందరూ కూడా వృత్తులను బట్టి అనేక కులాలు, ఉపకులాలుగా విడివడి తమ కులమే మిన్న అని భావిస్తూ, జీవనం గడిపేవారు. * 3) ఇక మూడో వర్గం వర్ణ వ్యవస్థలో స్థానం లేని అస్పృశ్యులు. వీరు సమాజంలో అట్టడుగు అశుభ్రమైన వృత్తులను అవలంభించి, వర్ణ సమాజానికి జీవితాంతం దూరంగా నివశించేవారు. పశుపోషణ, భూస్వాముల ఇళ్ళలో పనిచేయడం, మృతి చెందిన జంతు శరీరాలను తొలగించడం, తోళ్ళని శుభ్రం చేయడం, చెప్పులు కుట్టడం, వ్యవసాయ పనులలో పాల్గొనడం, పాకీ పని వీరు చేసేవారు. బావులు చెరువులు, విద్య దేవాలయ ప్రవేశానికి దూరమైన వీరి సాంఘిక హోదా పెంచి ఉద్యమ కాలంలో ప్రధాన స్రవంతిలో వీరిని కలిపే యత్నం జరిగింది.

వర్ణ వ్యవస్థ తరువాత పేర్కొనదగిన మరొక ముఖ్య సామాజిక సంస్థ వివాహ వ్యవస్థ. ఒకే కులంలోని ఒకే ఉపశాఖలోనే వివాహం అంగీకారమయ్యేది. సగోత్ర వివాహాలు నిషేధించబడ్డాయి. భోజనాలు, వివాహాలు కులపరిధిలోనే జరిగేవి. కులంపట్ల చిన్నాపెద్దా అనే తేడా

* బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, వేదాధ్యయనంపై వారి గుత్తాధిపత్యాన్ని బ్రహ్మణేతర ఉద్యమ రూపంలో ప్రశ్నించింది ఈ వర్గమే.

లేక అన్ని కులాల వారు స్వాభిమానం చూపి, గుర్తింపు పొందేవారు. బాల్య వివాహాలు జరిగేవి. భార్య మరణించిన వృద్ధులు సహితం పునర్వివాహానికి బాలికలనే ఎంచుకోవడంతో బాల వితంతువుల సంఖ్య పందొమ్మిదవ శతాబ్దంలో అధికమయింది. వారి స్థితి దయనీయ మవడంతో సంస్కర్తలు పునర్వివాహాలను, యుక్త వివాహాలను ప్రోత్సహించసాగారు. కుల గుర్తింపును గర్హించే వర్ణాంతర వివాహాలు జరిపారు.

ఈ విధంగా పద్దెనిమిదవ శతాబ్దంలో కుల వ్యవస్థ, అంటరానితనము, వివాహ వ్యవస్థ, ప్రధాన సాంఘిక సమస్యలుగా ఉండి, సంస్కరణల ఆవశ్యకత ఏర్పడింది.

## 8.3. మధ్యయుగ సంస్కరణ భావాలు :

ఆంధ్ర దేశంలో సంస్కరణ మధ్యయుగంలో కూడా ప్రాముఖ్యత పొంది పలనాటి బ్రహ్మనాయుడు వైష్ణవ మతాన్ని స్వీకరించి, కులాచారాలకు విరుద్ధంగా, సహపంక్తి భోజనాలను (చాపకూడు) ప్రోత్సహించాడు. బ్రహ్మనాయుని అనుచరులలో ప్రముఖుడు కన్నమదాసు అనే హరిజనుడు. ఆయనే సర్వ సేనాధిపతి. బ్రహ్మనాయుడు వివిధ కులాలను ఏకం చేసి, పద్మనాయక కులం (వీరుల కులం) అనే కొత్త కులాన్ని సృష్టించాడు.

బసవేశ్వరునిచే ఆరంభించబడిన వీరశైవం ఆంధ్రాలోకి ప్రవేశించి, సమానత్వ ధోరణిని ప్రదర్శించింది. మల్లికార్జునుడు కుల వ్యవస్థను విసర్జించకుండా, దానిని భక్తితో రాజీచేయడానికి ప్రయత్నించాడు. జంతు బలులలో కూడిన వైదిక కర్మలను, స్త్రీల హీన స్థితిని మడి, మైల వంటి ఆచారాలను ఈ మతం ఖండించింది. సామాజిక రంగంలో బాల్య వివాహాలను వ్యతిరేకించి, వితంతు వివాహాలను అనుమతించింది.

అయితే 16, 17 శతాబ్దాల నాటికి శైవ, వైష్ణవ మతాలు రెండూ తమ బాటను వీడి బాహ్య ఆచారాలకే పరిమితమయి, మత మౌఢ్యాన్ని పెంచాయి.

పదిహేడవ శతాబ్దంలో వేమన తన భావాలను ప్రచారం చేశాడు. ఇతడు ఏ మతశాఖకు చెందినవాడు కాదు; ఏ మత శాఖను స్థాపించలేదు. ఇతడు తన చుట్టూ వున్న సమాజాన్ని గమనిస్తూ దానిపై హేతుబద్ధంగా వ్యాఖ్యానిస్తూ, దేశ సంచారం చేసేవాడు. ఇతడు రాయలసీమ ప్రాంతాలలోని రెడ్డి కులానికి చెందినవాడు. ఇతడు తన భావాలను స్పష్టంగానూ, సరళమైన రీతిలోనూ వ్యక్తం చేసాడు. సాంఘిక అసమానతలను, విగ్రహారాధనను, సంఘ దురాచారాలను దుయ్యబడుతూ, వాటినుంచి విముక్తి చెందమని ప్రజలను ఉద్బోధించాడు. సామాన్యులకు అర్థమయ్యే సరళరీతిలో హృదయానికి హత్తుకునే విధంగా బోధ చేశాడు. వేమన సిద్ధాంతం మధ్యయుగంలో ప్రధానంగా మానవతా వాదం. కాని స్త్రీలను గురించి వేమనకు గల అభిప్రాయాలు సంప్రదాయక హిందువుల అభిప్రాయాలకంటే భిన్నమయినవి కావు.

బ్రహ్మంగారు ప్రసిద్ధికెక్కిన పోతులూరి వీరబ్రహ్మం విశ్వ బ్రాహ్మణ కులస్థుడు. ఇతడు కుల వ్యవస్థను ఖండించాడు. వేదజ్ఞానం అందరు పొందవచ్చని నమ్మాడు. అందువల్ల ఆయన శిష్యులలో వివిధ కులాల వారు ఉండేవారు. ఇతడు విగ్రహారాధనను వ్యతిరేకించి, మూఢ విశ్వాసాలను ఖండించాడు. ఇతడు అస్పృశ్యతను నిరసించాడు. హిందూ, ముస్లింల మధ్య మత సామరస్యం బోధించాడు. యుక్త వయస్సు వివాహాలను ప్రోత్సహించాడు.

ఈ సంస్కర్తలందరూ సమకాలీన సమాజంలోని దోషాలను వెల్లడించి, తమ నిరసనను, తిరస్కారాన్ని తెలియజేసారు. సమాజం ఏ రకంగా ఉంటే బాగుంటుందో తెలియజేసారు. కుల వ్యవస్థని, ఆచారాలను, కట్టుబాట్లను, వివాహ వ్యవస్థను, అస్పృశ్యతను ప్రశ్నించినప్పటికీ, త్వరలోనే సాంప్రదాయ పద్ధతే సమాజంలో తిరిగి కొనసాగింది. ఈ సంస్కర్తల ప్రయత్నాలు మధ్యయుగాల సామాజిక ఆర్థిక చట్రము చేత పరిమితం చేయబడి, సాంప్రదాయక వ్యవస్థలో పెద్ద మార్పులు తీసికొని రాలేకపోయాయి. అయితే వీని ప్రభావం తెలుగులో నూతన సాహిత్య ధోరణి పెరగడానికి దారితీసింది. తెలుగులో సులభమైన వ్యావహారిక భాషను ఉపయోగించే పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఆధునిక యుగంలో సంఘ సంస్కరణ ఉద్యమంలో తిరిగి కులం, వివాహ వ్యవస్థ, అస్పృశ్యత, స్త్రీ పురోభివృద్ధి ప్రముఖ అంశాలయ్యాయి.

## 8.4. సంస్కరణ ఉద్యమానికి దోహదం చేసిన కారణాలు :

ప్రాచీన, మధ్యయుగ సాంఘిక ఆచారాలను, అలవాట్లను, సాంప్రదాయాలను మత దృక్పథాన్ని ఆంగ్ల విద్య నేర్చిన మధ్య తరగతి మేధావి వర్గం ప్రశ్నించింది. ఆధునిక యుగంలో సంఘ సంస్కరణ ఉద్యమ రూపంలో ప్రబలడానికి కొన్ని కారణాలు తోడ్పడ్డాయి. వానిలో ప్రముఖమైనవి :

**8.4.1 పాశ్చాత్య విద్య :** పందొమ్మిదవ శతాబ్దం నాటికి ఆంధ్ర దేశం విద్యలో వెనుకబడి ఉంది. విద్య అగ్రకులాల వారికే పరిమితం హిందువులు, ముస్లింలు తమ సంప్రదాయ రీతుల్లో విద్యను అభ్యసించేవారు. అందులో ప్రధాన అంశాలు మతానికి సంబంధించినవే. బెంటింగ్ గవర్నరు - జనరల్‌గా ఉన్నప్పుడు మెకాలే మినిట్ ద్వారా ఆంగ్ల విద్య ప్రవేశపెట్టబడింది. మిషనరీలు వివిధ ప్రాంతాలలో తమ పాఠశాలలను స్థాపించారు. పందొమ్మిదవ శతాబ్దం మధ్య భాగం నుంచి ప్రభుత్వేతర రంగంలో సహితం అనేక పాఠశాలలు వచ్చాయి.

**ప్రభావం :**

* ఆంగ్ల భాషతోపాటు చరిత్ర, రాజనీతి, విజ్ఞాన శాస్త్రాలు, ఇతర లౌకిక అంశాలు బోధించబడేవి. ఈ విధంగా లౌకిక విద్య, కుల భేదాలు లేక, అందరికి అందుబాటులోకి వచ్చింది.

* ఐరోపాలో ప్రబలిన అనేక ఉదారవాదాలు పాశ్చాత్య విద్య ద్వారా భారతదేశంలో ప్రవేశించాయి. వీనిలో వ్యక్తి వాదం, మానవతా వాదం, హేతువాదం, ప్రత్యక్ష జ్ఞానవాదం ప్రధాన పాత్ర వహించాయి. ప్రతి సాంప్రదాయాన్ని హేతుబద్ధంగానూ, మానవ విలువలతోనూ ఉండాలనే భావం ప్రబలింది. వీరు ప్రజాస్వామ్య విలువలకు మద్దతు తెలుపుతూ, అమానుష పద్ధతులను వ్యతిరేకించసాగారు.

* వలస ప్రభుత్వం ధోరణిలో కూడా మార్పు వచ్చింది. అంతకు పూర్వం ప్రభుత్వం ప్రజల మత సాంఘిక అంశాలలో జోక్యాన్ని వ్యతిరేకించింది. కాని పాశ్చాత్య విద్య ప్రవేశపెట్టాక, సాంప్రదాయ వాదులకు వ్యతిరేకంగా సంఘ సంస్కర్తలకు పూర్తి మద్దతు నివ్వడం ఆరంభించింది. చట్టాల ద్వారా సంస్కరణలను బలపరచనారంభించింది.

**8.4.2. మిషనరీలు :** క్రైస్తవ మిషనరీలు ఆంధ్ర దేశంలో విద్యా వ్యాప్తిని, మత ప్రచారాన్ని సాగించారు. మచిలీపట్నంలో చర్చి మిషన్ సొసైటీ, గుంటూరులో లూథరన్ మిషన్, నెల్లూరులో బాప్టిస్ట్ మిషన్ ప్రముఖ పాత్ర పోషించాయి. మిషనరీల వ్యక్తిగత జీవితం, భక్తి, సేవా నిరతి స్థానికులను ఆకర్షించసాగాయి. వారి విద్యా విధానాన్ని, క్రమ శిక్షణను ప్రజలు అంగీకరించారు. వారి విమర్శలకు ముఖ్యంగా బహు దేవతారాధన, అసమాన కులవ్యవస్థ అమానుష మానవ సంబంధాలు స్పందించవలసిన అవసరం ఆంగ్ల విద్య నేర్చిన స్థానిక నాయకుల కర్తవ్యమయింది. స్త్రీలను, హరిజనులను మొదటగా విద్యావంతులుగా చేసింది మిషనరీలే. ఈ చర్యలు ఆంధ్రులను ప్రభావితం చేశాయి.

**8.4.3. మధ్య తరగతి వర్గం :** ఆంగ్ల పాలన, ఆంగ్ల విద్య, వలస ఆర్థిక వ్యవస్థ ఫలితములుగా నూతన సామాజిక వర్గాలు ఆవిర్భవించాయి. పాశ్చాత్య విద్యా వ్యాప్తి వలన ఆంగ్ల విద్య నేర్చిన మధ్య తరగతి వర్గం ఏర్పడింది. దీనిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, వైద్యులు, పత్రికా సంపాదకులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. పందొమ్మిదవ శతాబ్ది ద్వితీయార్థం నుంచి వారి సంఖ్య పెరగసాగింది. మధ్య తరగతి మేధావి వర్గం సాంఘిక మత సంస్కరణ ఉద్యమాలను నిర్వహించింది.

వీరు సాంఘిక మత వ్యవస్థలలోని లోపాలపై తిరుగుబాటు ప్రారంభించారు; వానిని సవరించే ప్రయత్నాలనూ ఆరంభించారు. మానవతా దృక్పథం నుంచి లోపాలను ఒకవైపు విమర్శిస్తూనే మరోవైపు ఆ ఆచారాలకు శాస్త్ర ప్రమాణం లేదని రుజువు చేస్తూ వచ్చారు. సంప్రదాయ వాదులను అంగీకరింపజేస్తూ, సంస్కరణలు శాస్త్రబద్ధమే అని నిరూపించారు.

**8.4.4. పత్రికలు :** తెలుగు పత్రికలు ఆంధ్రులలో కొత్త చైతన్యాన్ని రగిల్చాయి. సంస్కరణ భావాల ప్రచారానికి ఉపకరించాయి. బాల్య వివాహాల నిరోధానికి వితంతు వివాహాలకి, స్త్రీ విద్యా వ్యాప్తికి, దేవదాసీ వ్యవస్థ నిర్మూలనకి, అస్పృశ్యతా వ్యతిరేకతకు ఇవి కృషి చేశాయి. తెలుగులో మొదటి వార్తా పత్రిక సత్యదూత అని, వృత్తాంతిని అని అభిప్రాయ భేదాలున్నాయి. కందుకూరి వీరేశలింగం తెలుగులో

ప్రథమముగా సతీహిత బోధిని అను స్త్రీల పత్రికను 1883లో ఆరంభించాడు. కొక్కొండ వెంకటరత్నం 1871లో "ఆంధ్ర భాషా సంజీవిని' ' అను పత్రికను ఆరంభించి పాశ్చాత్య విద్యని, సంస్కరణలను, వ్యవహారిక భాషని వ్యతిరేకించాడు. గ్రాంథిక భాషని, సంప్రదాయాన్ని అనుసరించాలనేవాడు. మచిలీపట్నంకి చెందిన ఉమారంగ నాయకుల నాయుడు 1872లో "పురుషార్థ ప్రదాయిని" అనే పత్రికను ఆరంభించాడు. స్త్రీ విద్యపై ఆంధ్ర భాషా సంజీవినికి, పురుషార్థ ప్రదాయినికి మధ్య 1870లలో చర్చ జరిగింది. వీరేశలింగం కూడా ఈ చర్చలలో పాల్గొని తన అభిప్రాయాలను శక్తి వంతంగా తెలుపుటకై 1874లో వివేకవర్ధని పత్రికను స్థాపించాడు.

కృష్ణా పత్రిక 1902లోనూ, ఆంధ్ర పత్రిక 1905లోనూ స్థాపించబడి, సంఘ సంస్కరణను జాతీయతా భావాన్ని పెంపొందింపజేసాయి. ఇతర పత్రికలలో భారతి (1875), స్వదేశీ (1874), ఆంధ్ర ప్రకాశిక (1885), చింతామణి (1891), సత్య సంవర్ధని (1892), శశిలేఖ (1894), దేశాభిమాని (1896) ముఖ్యమైనవి. తెలుగులో స్త్రీల పత్రికలలో ముఖ్యమైనవి: తెలుగు జనానా (1893), బాలిక (1896), హిందూ సుందరి (1902), సావిత్రి (1904), వివేకవతి (1909), సుందరి (1909), అనసూయ (1914), ఆంధ్రలక్ష్మి (1921), హిందూ యువతి (1923), ఆంధ్ర మహిళ (1924), గృహలక్ష్మి (1927), మొదలయినవి. ఈ పత్రికలు ప్రధానంగా చర్చించిన అంశాలు స్త్రీ విద్య, పాతివ్రత్యం, బాల్య వివాహాలు, పునర్వివాహాలు, గృహ నిర్వహణ, స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మొదలయినవి.

**8.4.5. సంస్కరణ భావాలు :** వీరేశలింగం వలన ఉద్యమ రూపం పొందిన సంఘ సంస్కరణ, భావ రూపంగా అంతకు ముందు నుంచి ఉంది. ఉదార భావ వ్యాప్తి వలన ఆంగ్ల విద్య నేర్చిన కొందరు ఆంధ్రులు సాంఘిక దురాచారాలను వ్యతిరేకించారు. వారిలో ఏనుగుల వీరాస్వామి, వెన్నెలకంటి సుబ్బారావు, సామినేని ముద్దు నరసింహ నాయుడు, జియ్యరుసూరి, వేదాంతాచారి, గాజుల లక్ష్మీ నరసింహ సెట్టి ముఖ్యులు. వీరు సంస్కరణ భావ వ్యాప్తికి కృషి చేసారు.

ఆంధ్రదేశపు సంస్కర్తలలో మద్రాసు సుప్రీంకోర్టులో దుబాసీ (అనువాదకుడు)గా పనిచేసిన ఏనుగుల వీరాస్వామి ప్రథముడు. మద్రాసులోని హిందూ లిటరరీ సొసైటీలో ఇతడు సభ్యుడు. అస్పృశ్యతకు స్మృతుల ఆమోదంలేదని విమర్శిస్తూ సమాజంలోని క్రింది కులాల వారిని హీనంగా చూడడమే వారు క్రైస్తవ మతంలోకి మారడానికి కారణమని తెలిపేవాడు. కుల భేదాలను, సతీసహగమనాన్ని ఇతడు వ్యతిరేకించేవాడు. భగవంతుడు ఒక్కడే అని నమ్మేవాడు. హిందూ లిటరరీ సొసైటీ సభ్యునిగా సంస్కరణ ఆవశ్యకతను గురించిన చైతన్యానికై పాటుపడ్డాడు.

వెన్నెలకంటి సుబ్బారావు మద్రాసులోని సుప్రీంకోర్టులో దుబాసీగా ఉండేవాడు. ఇతడు మద్రాసులోని పాఠశాల పుస్తకాల సంఘం సభ్యునిగా ఉండి, ఆంగ్ల విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టాలనీ, కోరేవాడు. దేశీయ విద్య లోప భూయిష్టంగా ఉందని ప్రభుత్వ దృష్టికి తెస్తూ, చౌక ధరలకు ఇంగ్లీషు పుస్తకాలను ముద్రించాలని సలహా ఇచ్చాడు. పాశ్చాత్య విద్యా వ్యాప్తికై కృషి చేశాడు.

సామినేని ముద్దు నరసింహ నాయుడు రాజమండ్రికి చెందిన వ్యక్తి. హితసూచని అనే గ్రంథంలో వివాహ వ్యవస్థలోని లోపాలను, స్త్రీ విద్యకు సంబంధించిన సాంఘిక అన్యాయాలను సమకాలికుల దృష్టికి తెచ్చాడు. శాస్త్ర విజ్ఞానాన్ని అందించే విద్యను ప్రవేశపెట్టాలని, శాస్త్ర గ్రంథాలను ఆంగ్లం నుంచి దేశీయ భాషల్లోకి అనువదించాలని ఆయన కోరాడు. భూత ప్రేతాలను, మంత్ర తంత్రాలను, మూఢ విశ్వాసాలను ఖండించాడు. కలరా వంటి వ్యాధుల నివారణకు గ్రామ దేవతలను పూజించకూడదనీ, వైద్యం చేయించుకోవాలని ప్రజలకు బోధించాడు. పెండ్లి తంతు పేరుతో జరిగే వ్యయాన్ని ఖండించాడు. బాల్య వివాహాలను నిరసిస్తూ, వివాహ యోగ్య వయస్సుగా ఆడ పిల్లలకు 12 సంవత్సరాలను, మగ పిల్లలకు 18 సంవత్సరాలను సూచించాడు. బాల్య వివాహాల వలననే కన్యాశుల్క ఆచారం ఏర్పడిందని, దానివలననే వైధవ్యము, వ్యభిచారము వంటి సాంఘిక దురాచారాలు ప్రబలుతున్నాయని, శిశు హత్యల వంటి క్రూర సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నాడు.

జియ్యరు సూరి బెంగుళూరులోని సైనిక బాలికా పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు. ఇతడు స్త్రీ కళాశాల్లోలిని అనే పుస్తకాన్ని రచించాడు. చిన్న చిన్న వ్యాసాలతో కూడుకొన్న ఈ పుస్తకంలో ప్రతి వ్యాసానికి ఆంగ్ల శీర్షిక కూడా వుంది. స్త్రీ నీతి, స్త్రీ విద్యల గురించి ప్రస్తావించింది ఈ పుస్తకం.

వేదాంతాచారి విశాఖ పట్టణంలో పాఠశాలల డిప్యూటీ ఇన్స్పెక్టర్‌గా పని చేశాడు. ఇతడు వివాహ సంస్కరణల గురించి, మద్రాసు ప్రభుత్వానికి ఒక వినతి పత్రాన్ని సమర్పించాడు. అందులో ప్రస్తుత హిందూ వివాహ పద్ధతి ఎంతో అసంబద్ధంగా ఉందని, వివాహ ఫలితాలు దారుణంగా ఉన్నాయని పేర్కొన్నాడు. ఇతడు బాల్య వివాహాలను కన్యాశుల్క దురాచారాన్ని ఖండించాడు. వివాహ వయస్సును ఆడ పిల్లలకు 9 సంవత్సరాలని, మొగపిల్లలకి 16 సంవత్సరాలని సూచించాడు. అంతేగాక, వివాహాలను తాలూకా కచేరీలో రిజిష్టరు చేయించాలని పేర్కొన్నాడు.

గాజుల లక్ష్మీనరసు సెట్టి క్రెసెంట్ అను పత్రికను స్థాపించి, తద్వారా సాంఘిక సంస్కరణ భావాలను ప్రచారం చేసాడు. నాటి సమాజంలో పాతుకుపోయిన వెట్టి చాకిరీని రద్దు చేయాలని కోరాడు. మద్రాసు నేటివ్ అసోసియేషన్‌ని స్థాపించి, రైతుల కష్టాలను మహజరుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేసాడు. విక్టోరియా రాణి ఇచ్చిన హామీలను అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరాడు.

ఈ విధంగా 19వ శతాబ్ది ప్రథమార్థం అంతంనాటికి ఆంధ్ర దేశంలో సంస్కరణ భావాలు కనిపించాయి. వీరేశలింగం కృషివలన సంస్కరణ భావాలు ఉద్యమ రూపాన్ని పొందాయి. బ్రహ్మత్రయంగా ప్రసిద్ధమైన బ్రహ్మ సమాజ నాయకులకు వీరేశలింగం, వెంకటరత్నం నాయుడు, పెద బాపయ్య బ్రహ్మ సమాజ సిద్ధాంతాలతోపాటు సంస్కరణ కార్యక్రమాలను చేపట్టారు.

## 8.5. సంస్కరణల యుగం :

ఆంధ్రాలో సంస్కరణ కార్యక్రమాలకు ఆదరణ, ప్రోత్సాహం బ్రహ్మ సమాజ అనుయాయుల నుంచీ సానుభూతి పరులనుంచీ లభించింది. కలకత్తాలో 1828లో రాజారామమోహనరాయ్ ఆరంభించిన బ్రహ్మ సమాజం త్వరలోనే బలపడి ఇతర ప్రాంతాలకు, ముఖ్యంగా ఆంధ్రాకు వ్యాప్తి చెందింది. కేశవ్ చంద్రసేన్ 1864లో మద్రాసులో పర్యటించి, ఉపన్యసించిన ఫలితముగా మద్రాసు నగరంలో "వేదసమాజ్" సంస్థ స్థాపించబడింది. వేద సమాజ్ కార్యదర్శి అయిన శ్రీధరులు నాయుడు కొన్ని మార్పులను చేసి, "దక్షిణ భారత దేశ బ్రహ్మ సమాజం" అనే పేరు దానికిపెట్టాడు. శ్రీధరులు నాయుడు, దొరస్వామి అయ్యంగార్లు అనేక ప్రదేశాలను సందర్శించి ప్రచారం చేసారు. వారి కృషి ఫలించి, నూతన ప్రదేశాలలో సమాజాలు ఉద్భవించాయి. బ్రహ్మ సమాజ దీక్ష వహించిన మన్నవ బుచ్చయ్య పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మద్రాసులో సమాజ శాశ్వత కార్యాలయాన్ని 1885లో స్థాపించారు. కలకత్తాలోని సాధారణ బ్రహ్మ సమాజ 1878లో రాజ్యాంగ నియమావళిని ఏర్పరచింది. వానిలో విద్య, స్త్రీ జనోద్ధరణ, సంఘ సంస్కరణ, నిమ్న జాతుల అభివృద్ధి ప్రధాన అంశాలుగా స్వీకరించారు. సాధారణాశ్రమాన్ని 1892లో స్థాపించి, బ్రహ్మమత ప్రచారకులను తయారు చేయడం ఆరంభించారు. ఈ విధంగా మద్రాసు, కలకత్తాలలోని సమాజ కార్యక్రమాలు ఆంధ్రాని ప్రభావితం చేశాయి.

**8.5.1. కందుకూరి వీరేశలింగం (1848-1919) :** ఆంధ్రాలోని సాంఘిక సంస్కరణ ఉద్యమంలో ప్రథమ, ప్రముఖ పాత్ర వీరేశలింగంది. ఇతడు 1848లో రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడులకు జన్మించాడు. అధ్యాపక వృత్తిని స్వీకరించి కోరంగి, ధవళేశ్వరంలలో ఉపాధ్యాయుడుగా పనిచేశాడు. ఆ తరువాత రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో రెండో గ్రేడ్ తెలుగు పండితుడిగా పనిచేసాడు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో కొంత కాలం పని చేసాడు. సమకాలీన సమాజంలోని చెడుని గుర్తించి, సంస్కరణ దిశగా పయనించాడు. అతని భార్య రాజ్యలక్ష్మి ప్రతి కార్యక్రమంలోనూ తోడుగా నిలబడింది.

**వితంతు వివాహాలు :** వీరేశలింగం స్త్రీలకై చేసిన కార్యక్రమాలలో వితంతు వివాహాలు ప్రముఖమైనవి. ఈ అంశంపై 1875లోనే విశాఖపట్టణానికి చెందిన పరవస్తు వేంకట రంగాచార్యులు "పునర్వివాహ సంగ్రహం" అనే పుస్తకాన్ని పునర్వివాహాలను సమర్థిస్తూ ప్రచురించాడు. మద్రాసులో 1874లోనే వితంతు పునర్వివాహ సంఘం స్థాపించబడింది. కానీ కొద్ది కాలానికే ఈ సంస్థ చైతన్యం కోల్పోయింది.

వితంతు వివాహాలకు వ్యతిరేకి అయిన కొక్కొండ వెంకటరత్నం రంగాచార్యులు రాసిన పుస్తకాన్ని ఖండించడానికి వీరేశలింగం సహాయం కోరాడు. కానీ వీరేశలింగం సానుభూతి వితంతువులపైనే ఉండేది. బ్రిటిష్ ఉద్యోగులతో పరిచయం ఏర్పడిన తరువాత, వీరేశలింగం 1878లో సంఘ సంస్కరణ సమాజాన్ని రాజమండ్రిలో స్థాపించాడు.

కొక్కొండ వెంకటరత్నం, వేదం వెంకటరాయ శాస్త్రి వంటి సనాతనులను ఎదుర్కొనడానికి, వితంతువివాహాలు ధర్మ బద్ధమేనని తెలుపడానికి వీరేశలింగం ఉపన్యాసాలివ్వడం ఆరంభించాడు. 1879లో మహారాజ బాలికల పాఠశాలలో రెండు సార్లు ఉపన్యాసాలిచ్చాడు. రాజమండ్రి, కాకినాడలలో బహిరంగ సభలలో వితంతు వివాహాలను సమర్థిస్తూ ఉపన్యసించాడు. ఈ సమయంలో ఛాందసవాదులు వీరేశలింగంపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించగా, విద్యార్థులు ఆయనను కాపాడారు.

వీరేశలింగం 1880లో వితంతు పునర్వివాహ సంఘాన్ని స్థాపించాడు. సీతమ్మ అను బాల వితంతువును రాజమండ్రికి తీసికొనివచ్చి, గోగులపాటి శ్రీరాములు అనే యువకునికి ఇచ్చి డిసెంబరు 11, 1881న మొదటి వితంతు వివాహాన్ని జరిపాడు. అనేక ఇబ్బందులను అధిగమించి జరిగిన తొలివితంతు వివాహమది. తీవ్రమైన సాంఘిక వెలిని కార్యకర్తలు ఎదుర్కొనవలసి వచ్చింది. వివాహం ఆశించిన రీతిలో జరగాలని సంస్కరణ వాదులు, ఎట్టి పరిస్థితులలోనూ జరగరాదని సాంప్రదాయవాదులు ఘర్షణ పడిన సమయమది. వివాహస్థలిని పోలీసులు కాపలా కాసారు. వివాహాన్ని ఆపలేకపోయిన సాంప్రదాయవాదులు ఆ వివాహంలో పాల్గొన్న 31 కుటుంబాలను వెలివేసారు.

రెండో వితంతు వివాహం నాలుగు రోజుల వ్యవధిలోనే డిసెంబరు 15, 1881న రామచంద్రరావుకు, రత్నమ్మకు జరిగింది. ఇరవై వితంతు వివాహాలు 1892 నాటికే జరిగాయి. కాకినాడకు చెందిన వ్యాపారస్థుడు పైడా రామకృష్ణయ్య వితంతు వివాహాలకై రూ. 30,000/- వీరేశలింగానికి ధన సహాయం చేసాడు. బాల వితంతువుగాని ఆమె కుటుంబ సభ్యులుగాని పునర్వివాహానికై వీరేశలింగం వద్దకు గావడం సహజ పరిణామమయింది. వీరేశలింగం కృషిని గుంటూరులో సంస్కర్తలు అనుకరించారు. పునర్వివాహం గాని వితంతువులకై వీరేశలింగం మద్రాసులోను, రాజమండ్రిలోనూ వితంతు శరణాలయాలను స్థాపించాడు.

**సాహిత్య సేవ :** సాహిత్యాన్ని సంఘ సంస్కరణకై ఉపయోగించిన తొలి ఆధునిక కవి వీరేశలింగం. సులభ గద్యంలో వివిధ ప్రక్రియలను చేపట్టి విజయం సాధించాడు. "స్వీయ చరిత్ర"ని తొలుతగా రచించాడు. "రాజశేఖర చరిత్ర" అను తొలి సాంఘిక నవలను రచించాడు. జోనాథన్ స్విఫ్ట్ రచించిన "గల్లివర్స్ ట్రావెల్స్" ధోరణిలోనే "సత్యరాజ పూర్వదేశ యాత్రలు" రచించాడు. ఆంధ్ర కవుల చరిత్ర" ద్వారా పూర్వ కవుల రచనా విశేషాలను తెలుపుతూ, చక్కని విశ్లేషణను అందించాడు. ప్రహసనమనే ప్రక్రియ ద్వారా వ్యంగ్య విమర్శలతో సమాజస్థితిని వర్ణించాడు. "పెద్దయ్యగారి పెండ్లి" ద్వారా వృద్ధులు బాలికలను వివాహమాడే అంశాన్ని ఖండించాడు.

అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, రత్నావళి, చంద్రోదయం మొదలగు నాటకాలు; దశకుమార చరిత్ర, సత్యవతీ చరిత్రము, చంద్రమతి మొదలగు పౌరాణిక గాథలు; ఏసుక్రీస్తు చరిత్ర, విక్టోరియా మహారాణి చరిత్ర మొదలగు చరిత్ర గ్రంథాలు, నీతి కథలు, నీతి కథామంజరి, నీతి చంద్రిక మొదలగు కథలు వీరేశలింగం రచనలలో కొన్ని.

**స్త్రీ విద్య :** కొక్కొండ వెంకటరత్నం "ఆంధ్ర భాషా సంజీవిని" పత్రికకు సంపాదకుడు. ఉమా రంగ నాయకులు "పురుషార్థ ప్రదాయని" సంపాదకుడు. ఈ రెండు పత్రికల మధ్యా 1870 ప్రాంతాలలో స్త్రీ విద్య ఆవశ్యకతపై చర్చ జరిగేది. సాంప్రదాయకుడగు వెంకటరత్నం స్త్రీ విద్యని, పాశ్చాత్యీకరణను, సంస్కరణలను వ్యతిరేకించేవాడు. వీరేశలింగం ఈ చర్చల్లో పాల్గొని, స్త్రీలకి విద్య అవసరమని వాదించేవాడు. తన సంస్కరణ భావాలను ప్రచారం చేయడానికి వీరేశలింగం రాజమండ్రిలో 1874లో "వివేక వర్థని" అను పత్రికను ఆరంభించాడు. స్త్రీ విద్యకై 1874లో ధవళేశ్వరంలో బాలికా పాఠశాలను స్థాపించాడు. రాజమండ్రిలో 1881లో మరొక బాలికా పాఠశాలను ఇతడు ఆరంభించాడు. స్త్రీల కొరకు ప్రత్యేకంగా ఇతడు "సతీహితబోధిని" అను మాస పత్రికను 1883లో ప్రారంభించాడు.

**ఇతర కార్యక్రమాలు :** వీరేశలింగం చేపట్టిన ఇతర కార్యక్రమాలలో అవినీతిపై పోరు ప్రధానమైనది. రాజమండ్రిలోని జిల్లా మున్సిఫ్ అవినీతిని ఇతడు ప్రచురించగా, అతడు ఆత్మహత్య చేసికొన్న ఉదంతం ఉంది. కుల వ్యవస్థను ఖండిస్తూ, దాని చిహ్నాలయిన జంధ్యాన్ని, పంతులు అను పేరును త్యజించాడు. శకునాలను, మంత్రతంత్రాలను, మూఢ నమ్మకాలను, విగ్రహారాధనను తీవ్రంగా వ్యతిరేకించేవాడు. దేవదాసీ వ్యవస్థని, భోగం మేళాలను నిరసించాడు.

తాను ఏర్పాటు చేసిన సంస్థలను నిర్వహించడానికై డిసెంబరు 15, 1905న వీరేశలింగం హితకారిణీ సమాజాన్ని ఏర్పరచి, తన యావదాస్తిని, దాదాపు రూ. 50,000 లను, ఆ సంస్థకి ఇచ్చాడు.

వీరేశలింగానికి అండగా నిలచిన భార్య రాజ్యలక్ష్మి ఆగష్టు 11, 1910న మరణించింది. ఆమె మరణంతో వీరేశలింగం కార్యక్రమాలు కుంటుపడ్డాయి. మద్రాసులో మే 27, 1919న వీరేశలింగం మరణించాడు. ఆంధ్ర దేశంలో సాంఘిక ఉద్యమానికి ఆరంభకుడు, ఆధునిక ఆంధ్రా పునరుజ్జీవన వైతాళికుడు వీరేశలింగమే.

**8.5.2. రఘుపతి వెంకటరత్నం నాయుడు (1862-1939)** : - వెంకట రత్నం నాయుడు 1862లో మచిలీపట్నంలో శేషమ్మ, అప్పయ్య నాయుడులకు జన్మించాడు. మద్రాసు క్రైస్తవ కళాశాలలో విద్యాభ్యాసం చేసి, ప్రిన్సిపాల్ మిల్లర్ ప్రభావంతో విశాల దృక్పధాన్ని పెంచుకున్నాడు. ఆంగ్లంతోబాటు పర్షియన్, అరబిక్, ఉర్దూ భాషలను కూడా అధ్యయనం చేశాడు. విద్యాభ్యాసమైన తరువాత మద్రాసులోని పచ్చయప్ప కాలేజీలోనూ, బందరు నోబుల్ కాలేజీలోనూ, సికింద్రాబాద్ మహబూబ్ స్కూల్లోనూ అధ్యాపకునిగా పనిచేశాడు. కాకినాడలోని పిఠాపుర మహారాజ కాలేజీలో 1905లో ప్రిన్సిపాల్‌గా చేరి, 1919 వరకు ఆ పదవిలో కొనసాగి, ఆ సంస్థపై తన ముద్రని స్ఫుటంగా వేశాడు. వారెక్కడ పని చేసినా, వారి ప్రభావం విద్యార్థులపైనా, యువతపైనా ఉండేది. వారిలోని పాండిత్యము, ఉపన్యాసధోరణి, నిరంతర ప్రార్థనా శీలత, మానవతా వాదం, కరుణ అందరినీ ప్రభావితం చేసేవి. భగవంతుని పట్ల అపరిమిత భక్తి; తోటి మానవుల, ముఖ్యంగా దిగువ, అనాధలపట్ల ప్రేమ; వారిని సంస్కరించే కృషి వెంకటరత్నం నాయుడి శిష్యులపై స్ఫుటమైన ముద్రని వేశాయి. మద్రాసు విశ్వవిద్యాలయానికి వెంకటరత్నం 1926-28ల మధ్య కులపతి (వైస్-ఛాన్సలర్)గా ఉన్నారు. భాషా శాస్త్ర వేత్తలకు డాక్టరేట్ డిగ్రీలను ఇచ్చి గౌరవించే సాంప్రదాయాన్ని ఇతడు ఆరంభించాడు.

**విద్యాసేవలు :** పిఠాపుర కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నకాలంలో వెంకటరత్నం అనేకమంది విద్య నభ్యసించే అవకాశాన్ని కల్పించాడు. పేదలు ముఖ్యంగా వెనుకబడిన కులాలకు చెందినవారు, హరిజనులు ఫీజులు కట్టనవసరం లేకుండా చదువుకునే వీలును కల్పించాడు. స్త్రీలు, పురుషులతో సహ విద్య నభ్యసించగలిగే సదుపాయం ఏర్పడింది. ఈ విధంగా ఉన్నత విద్య విస్తరించింది. పిఠాపుర రాజా విద్యా సంస్థలన్నిటిలోనూ పాఠశాలలతో సహా ఈ అవకాశం ఏర్పడింది. వెంకటరత్నం ఆచార్యత్వాన్ని గురించి, వారి శిష్యరికాన్ని దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి ఈ విధంగా తెలియజేస్తున్నారు. నాయుడుగారి హృదయం శత తంత్రీ మహతి అని, ప్రతి శిష్యునితోడి అనుభవాలేగాక, ప్రతి కావ్యములోని అనుభవాలు ఆయనను కదలించేవని, వారి భావనా శక్తికి, వాక్ప్రతిభకు అంతేలేదని, వారెక్కడ ఉంటే అదే జ్ఞానాన్ని ఇచ్చే ప్రదేశమని అంటారు. యువతను నీతివర్తనులుగా మానవతావాదులుగా చేసిన ఖ్యాతి వారిది. జీవితం ఉత్తమ లక్ష్య సాధనకే తప్ప సుఖానుభవానికి మాత్రమేకాదను స్పృహ కలిగించాడు.

**బ్రహ్మ సమాజసేవ :** విద్యార్థి దశలోనే కేశవ్‌చంద్రసేన్ రచనలు చదివి, వెంకటరత్నం బ్రహ్మ సమాజ అభిమాని అయ్యాడు. ఇతడు 1855లోనే బ్రహ్మ సమాజంలో చేరి మద్రాసులో మన్నవ బుచ్చయ్య పంతులు నిర్వహించు కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. వెంకటరత్నం కృషివల్లనే ఆంధ్రాలో బ్రహ్మ సమాజం బలపడింది. అఖిల భారత ఆస్తిక సభకు 1906లోనే అధ్యక్షులయ్యారు.

ఆంధ్రాలో మొట్టమొదటి ప్రార్థనా సమాజాన్ని వీరేశలింగం 1870లో రాజమండ్రిలో ఆరంభించగా రెండవ ప్రార్థనా సమాజాన్ని వెంకటరత్నం మచిలీపట్నంలో 1882లో ప్రారంభించాడు. గుంటూరులో 1898లో పిళ్ళారిసెట్టి సీతారామయ్య కృషితో సమాజం ఏర్పడింది. ఇతడే చీరాల వద్ద ఈవూరిపాలెం వద్ద సమాజాలను ప్రారంభించాడు. తాయి సూర్యప్రకాశరావు నాయుడు, దుగ్గిరాల సూర్య ప్రకాశరావు కాకినాడు సమాజాన్ని 1888లో ఆరంభించారు. వెంకటరత్నం నాయకత్వంలో ఈ సంస్థ బలపడడమేకాక ఆంధ్రాకే ఇది కేంద్రమయింది. విశాఖపట్నం సమాజం 1904లో స్థాపించబడగా, 1906లో నరసాపురం, ఏలూరులలో రెండు సమాజాలు ఆరంభమయ్యాయి. పిఠాపురంలో 1909 లో సమాజం ఏర్పడింది. వెంకటరత్నం ఈ ప్రదేశాలలో ఉపన్యసిస్తూ బ్రహ్మసమాజ సిద్ధాంతాలను వ్యాప్తి చేశాడు. వెంకటరత్నం కృషివలననే ఆంధ్రాలో బ్రహ్మ సమాజం బలపడింది. పిఠాపుర రాజా ఆర్థిక సహాయంతో తాను రూపురేఖలు దిద్దిన బ్రహ్మోపాసనా మందిరం కాకినాడలో ఏర్పడి, బలమైన కేంద్రమయింది.

**సంఘ సంస్కరణ :** మచిలీపట్నంలో అధ్యాపకుడుగా ఉన్నప్పుడు వెంకటరత్నం సంఘం సంస్కరణ ఉద్యమాన్ని ఆరంభించాడు. ఇతడు 1891లో మచిలీపట్నంలో సాంఘిక శుద్ధి సంఘాన్ని స్థాపించి, స్త్రీ పురుష లిరువురూ సచ్ఛీలురుగా ఉండాలని తెలిపేవాడు. ధూమపానం, మద్యపానం నిర్మూలించమని యువతని కోరేవాడు. వేశ్యావృత్తి సాంఘిక దురాచారమని, దానని సంపూర్ణంగా తొలగించాలని ఆశించాడు. వేశ్యలలో మాతృరూపాన్ని ఆయన ఆవిష్కరించేవాడు. పాప పంకిలంలో పవిత్రతను చూసే శక్తిని, దౌర్బల్యాన్ని సాధించగలిగే ఉపాసనా శక్తిని, ఆత్మగరిమను ప్రతిష్టింపగల ధీరవృత్తిని వెంకటరత్నం నాటి యువతకు ప్రసాదించాడని కృష్ణశాస్త్రి చెపుతాడు.

దేవదాసీ కుటుంబాలకు చెందిన అనేకమంది పురుషులను విద్యావంతులుగానూ, ఉద్యోగులుగాను చేసి గౌరవప్రదమైన జీవితంలోకి మళ్ళించాడు. ఈ కుటుంబాలకి చెందిన స్త్రీలకు వివాహ ఉద్యమాన్ని ఆరంభించి, అనేక మందిని ప్రధాన స్రవంతిలోకి తీసికొని వచ్చాడు. తొలి వివాహాన్ని రాజు నాయుడికి సుమారు 1909 ప్రాంతంలో చేశాడు. ఆ తరువాత అనేక వివాహాలు జరిగాయి. బాల్య వితంతువులను వీరేశలింగం ఏవిధంగా వివాహ వ్యవస్థలోకి తీసికొని వచ్చాడో, అదేవిధంగా మరో బాధిత వర్గాన్ని వెంకటరత్నం ముఖ్య స్రవంతిలో కలుపగలిగాడు.

హరిజనోద్ధరణను కాంగ్రెస్ చేపట్టడానికి ముందే బ్రహ్మసమాజం, చేపట్టింది. వెంకటరత్నం తన కరుణను హరిజనులపైనా, అనాధలపైనా కురిపించాడు. హరిజన బాలికలను స్వయంగా పెంచి, విద్యాబుద్ధులు నేర్పించాడు. వారు గృహిణులుగానూ, ఉద్యోగినులుగాను బాధ్యతలను నిర్వహించుటే గాక, సంస్కరణలు మరి రెండు తరములు కొనసాగుటకు కారణమయ్యారు.

హరిజన బాలురకు, బాలికలకు వసతి గృహాలను పిఠాపురం, కాకినాడలలో పిఠాపుర రాజుచే నిర్మింపజేసి, అనేకమందిని విద్యావంతులుగా మార్చాడు. పిఠాపుర రాజా కాకినాడలో ఒక అనాథ శరణాలయాన్ని నిర్మించడానికి వెంకటరత్నం నాయుడి గారి ప్రభావమే కారణం. అక్కడ వసతి చేసిన బాలబాలికల అభివృద్ధిపై పిఠాపురం రాజు, నాయుడుగారు వ్యక్తిగత శ్రద్ధని చూపారు. ఆ సంస్థని కరుణాలయమనే పిలిచేవారు.

అస్పృశ్యతా నివారణ, దేవదాసీ విమోచన, అనాథ శిశుసంరక్షణ జరిగాయి. ఇతను చేసిన కృషికి బ్రిటిష్ ప్రభుత్వం రావు బహదూర్ బిరుదును, ప్రజలు బ్రహ్మర్షి బిరుదును ఇచ్చారు. ఇతడు అనాధాశ్రమాన్ని నర్సరీ అని, పి.ఆర్. కాలేజీని రోజరీ అనీ, బ్రహ్మోపాసనా మందిరాన్ని శాంక్చురీ అని అనేవాడు. వెనుకబడిన వర్గాలు, పేదలు, అనాధలు, హరిజనులు, స్త్రీలు, దేవదాసీలు, అందరూ ఆయన కరుణకు పాత్రులే. సాంఘిక న్యాయం దిశగా ఉద్యమాన్ని ఆయన నడిపాడు.

**8.5.3 ఇతర సంస్కర్తలు :** గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సంస్కరణోద్యమాన్ని బలోపేతం చేశాడు. ప్రజాకవిగా, సంస్కర్తగా, విమర్శకునిగా బహుభాషావేత్తగా, దేశభక్తునిగా, నాటకకర్తగా పరిశోధకునిగా తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడులను సృష్టించి, జాతిని జాగృతం చేసాడు. కన్యాశుల్కం నాటకాన్ని 1893 లోనూ, ముత్యాల సరాలు గ్రంధాన్ని 1910లోనూ ముద్రించాడు. పందొమ్మిదవ శతాబ్దపు దురాచారాలకు అద్దంపట్టిన నాటకం కన్యాశుల్కం. దేశభక్తిని ప్రేరేపిస్తూ రాసిన గేయాలే ముత్యాలసరాలు. గురజాడ సృష్టించిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ నాటి దురాచారాలకు బలి అయిన అబల. హేతువాద దృక్పధాన్ని పెంచిన కవి గురజాడ.

దేశిరాజు పెద బాపయ్య మొదటి అనుష్టానిక బ్రహ్మ ధర్మావలంబి. ఇతడు బాపట్లకు చెందినవాడు. విగ్రహారాధనను వీడి, కుటుంబానికి దూరమయి, బ్రహ్మసమాజ వ్యాప్తికి అంకితమయ్యాడు. సర్వమానవ సోదర భావాన్ని చాటి, సాంప్రదాయాల పేరుతో అణగద్రొక్కబడిన వారి ఉద్ధరణకు కృషిచేశాడు.

సంఘ సంస్కర్తగా, రచయితగా జాతీయోద్యమ నాయకునిగా ప్రసిద్ధి కెక్కిన వారిలో ఉన్నవ లక్ష్మీనారాయణ ఒకరు. ఇతడు లాయరు వృత్తిని చేపట్టాడు. పాశ్చాత్య దేశాలలో పర్యటించి నందువలన ఆయనపై ఆ ప్రభావం ప్రసరించింది. సంఘ సంస్కరణకు పూనుకొని 1902లో గుంటూరులో వితంతు శరణాలయాన్ని స్థాపించి, అనేక వితంతు వివాహాలను జరిపించాడు. గుంటూరులో ప్రథమ వివాహం విశ్వనాథశాస్త్రి ఇంట 1902 బేతపూడి జోగి ప్రకాశరావు, వెంకట రమణమ్మలకు జరిగింది. తరువాతవన్నీ ఉన్నవ చేతుల మీదుగా జరిగినవే. భార్య ఆయన లక్ష్మీ బాయమ్మతో కలసి స్త్రీ జనోద్ధరణకు, స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేశాడు. ఇతడు 1922లో గుంటూరులో స్త్రీ

విద్యావ్యాప్తికై శారదానికేతన్‌ని స్థాపించాడు. ఈ సంస్థ స్త్రీలకు విద్యను, జాతీయ భావాన్ని, స్వయం ఉపాధిని కల్పించడంలో విశేషమైన పాత్ర నిర్వహించింది. అనాథ బాలికలకు ఆశ్రయం ఇవ్వడంలో, కులమతాలకు అతీతంగా సమతాభావాన్ని పెంచడంలో, హరిజనోద్ధరణలోనూ, అనాథ శిశువుల పెంపకంలోనూ శారదానికేతన్ గణనీయమైన పాత్రను నిర్వహించింది.

చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆంధ్రాలో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనములో తనదైన ముద్రను వేసిన ప్రముఖుడు. ఇతడు వీరేశలింగానికి పాఠశాలలో ప్రత్యక్ష శిష్యుడు, సంస్కరణలో అనుయాయుడు. అనేక పద్యకవితలను, నవలలను, నాటకాలను, ప్రహసనాలను, శతకాలను రచించాడు. మనోరమ అను మాసపత్రికను, దేశమాత అను దినపత్రికను నిర్వహించాడు. షేక్స్పియర్ నాటకాలను ఆంధ్రీకరించాడు. ఇతని సాంఘిక నవలలయిన గణపతి, రామచంద్ర విజయం, రాజరత్నం, విజయలక్ష్మిలలో సామాజిక అంశాలను ప్రస్తావించారు. మహాపురుషుల జీవిత చరిత్రలను రచించాడు.

సాహిత్య ప్రక్రియలలో వీరేశలింగం అడుగు జాడలలో నడచినప్పటికీ, దేశభక్తిని ప్రబోధించే జాతీయ కవిత్వాన్ని రచించడం ద్వారా వీరేశలింగాన్ని అధిగమించాడు.

ఇతడు తన ప్రహసనాలలో కట్న సమస్యలను ప్రస్తావించాడు; భోగం మేళాలను నిరసించడమే గాక, వెంకటరత్నం ప్రవేశపెట్టిన సాంఘిక శుద్ధి ఉద్యమాన్ని బలపరచాడు. బ్రహ్మ సమాజికుడయి విగ్రహపూజలను, మంత్రతంత్రాలను, వర్ణవ్యవస్థను వ్యతిరేకించాడు. శ్రీరామనవమి పందిరిలో పూనకాలను ఖండించాడు. ఎన్నికల్లో జరిగే మోసాలు తెలియజేసాడు. అంతర్వర్ణ భోజనాలకు, అంతర్వర్ణ వివాహాలకు మద్దతు తెలిపాడు. మతాధిపతుల అధికారాన్ని ధిక్కరించాడు. వీరేశలింగం, మద్రాసులో ఉన్న సమయంలో, వితంతు వివాహాలను రాజమండ్రిలో కొనసాగించాడు. వీరేశలింగం స్థాపించిన వితంతు శరణాలయ నిర్వహణకు తోడ్పడినాడు. లక్ష్మీనరసింహం నిమ్నజాతుల ఉద్ధరణకు కృషి చేశాడు. ఇతడు 1909లో రామమోహన్ పాఠశాలను స్థాపించి, ఉచిత విద్యను అందిస్తూ నిర్వహించాడు. బ్రహ్మ సమాజం ప్రభాంతో స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. . తన మేనకోడలగు వెంకట సుబ్బమ్మను చదివించి, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి, ఉభయ భాషాప్రవీణ పట్టాను పొందిన మొదటి స్త్రీగా తయారు చేశాడు. లక్ష్మీనరసింహం అప్పుడే విస్తరిస్తున్న నాటకరంగాన్ని, గ్రంథాలయ ఉద్యమాన్ని బలపరచాడు. అంధత్వాన్ని లెక్కజేయక, సమాజాన్ని ముందుకు నడపడంలో కృషి చేశాడు.

ఇతర సంస్కర్తలలో ప్రధానంగా పేర్కొనవలసిన పేరు పిఠాపుర రాజగు రావు వెంకట కుమార మహీపతి సూర్యారావు. ఈయన బ్రహ్మసమాజానికి అవసరమయిన ఆర్థిక, హార్దిక సహాయములను అందించాడు. వెంకట రత్నం నాయుడుని గురువుగా భావించి, ఆయన కార్యక్రమాలకు అండగా నిలిచాడు. బ్రహ్మ సమాజ మందిరాన్ని, కరుణాలయమనే అనాథ శరణాలయాన్ని స్థాపించి, తన విద్యా సంస్థలలో వెనుకబడిన వర్గాలకు ఉచిత విద్యకు ఏర్పాటు చేశాడు. స్త్రీ విద్యని ప్రోత్సహించి, కళావంతుల వివాహాలకు కృషి చేశాడు. బ్రహ్మ ధర్మప్రచారానికి లక్షరూపాయలను మూలనిధిగా ఇచ్చాడు. హరిజన లాడ్జిలను ఏర్పాటు చేసి, వారి విద్యా వ్యాప్తికి కృషి చేశాడు. ఆయన సంస్థలన్నీ అనుష్ఠానిక బ్రహ్మసమాజికుల ఆధ్వర్యంలో నడవడంతో అక్కడ ఉండే అనేకమంది బ్రహ్మసమాజ ప్రభావానికి, సంస్కరణలకు ఆకర్షితులయ్యారు.

దేవులపల్లి వెంకట కృష్ణ శాస్త్రి బ్రహ్మసమాజ సిద్ధాంతాలను తేలిక భాషలో ప్రజలకు గీతాల రూపంలో అందించాడు. బ్రహ్మసమాజ హేతువాద దృక్పథం, మానవతా వాదం అందిస్తున్న వ్యక్తిగత స్వేచ్ఛ కృష్ణశాస్త్రిలో పరాకాష్ఠ చెందాయి. ఆస్థాన కవితకు విరుద్ధంగా ఆరంభమయిన ఆయన పోరాటం జమీందారీ నిషేధాన్ని కోరడంతో బాటు సంస్కరణ కృషి వరకు సాగింది. అనేక ఉపాసనా గీతాలు రాసారు.

నాభి జగన్నాథరావు, వేమూరి రామకృష్ణారావు, కొండపల్లి కళ్యాణస్వామి, అక్కల కోటయ్య, కంభంపాటి రామశాస్త్రి (తారకం) ఇతర ప్రముఖులు.

## 8.6 ప్రభావం

బ్రహ్మసమాజం తీరాంధ్ర ప్రాంతాలలోనూ ప్రధానంగా నగరాలలోనూ విస్తరించింది. దీనికి రాజమండ్రి - కాకినాడ ప్రాంతం ప్రధాన కేంద్రమయింది. పట్టణ మధ్య తరగతి విద్యావంతులు దీనికి నాయకత్వం వహించారు. మొదటి ప్రార్థనా సమాజం రాజమండ్రిలో 1878లో వీరేశలింగంచే ఆరంభించబడింది. బెంగాలు నాయకుడయిన పండిత శివనాథశాస్త్రి 1881లో ఇక్కడికి వచ్చి, బ్రహ్మప్రచారం చేశారు. కాకినాడలో 1888లో ఆరంభించబడిన ప్రార్థనా సమాజాన్ని శివనాథశాస్త్రి, బిపిన్ చంద్రపాల్, హేమ చంద్ర సర్కారు దర్శించారు. పిఠాపురం, నర్సాపురం, ఏలూరు, భీమవరం, రామచంద్రాపురం, మండపేట మొదలగు చోట్ల సమాజాలు ఆరంభమయ్యాయి. కృష్ణాజిల్లాలో మొదటి సమాజం 1882 మచిలీపట్నంలో ఆరంభమయింది. గుడివాడ, విజయవాడలలో సమాజాలు ప్రారంభమయ్యాయి. గుంటూరులో 1898లో ఒక సమాజం ప్రారంభమయింది. ఆ తరువాత ఈపూరుపాలెం, వేటపాలెం, చీరాల, బాపట్ల, నెల్లూరులలో సమాజాలు ప్రారంభించబడ్డాయి.

ఈ విధంగా విస్తరించిన సమాజాల వల్ల సంస్కరణలు పెరిగి కొన్ని సాంఘిక మార్పులు జరిగాయి. అవి :

1. కుల కాఠిన్యత కొంత వరకు సడలింది. అంతర్వర్ణ వివాహాలను, అంతర్వర్ణ భోజనాలను ప్రోత్సహించడం ఈ మార్పుకి దోహదం చేసింది.

2. విద్యా వ్యాప్తి జరిగింది. పాశ్చాత్య విద్య, అన్ని కులాలకీ అందుబాటులోకి వచ్చింది.

3. వితంతు వివాహాలు, ప్రధానంగా బాల వితంతు వివాహాలు సమాజంలో అంగీకారం పొందాయి. రాజమండ్రిలో 1881లోనూ, గుంటూరులో 1902 లోనూ ఆరంభమయిన ఈ ఉద్యమం ఆమోదాన్ని పొందింది.

4. స్త్రీ విద్యా వ్యాప్తి జరిగింది. స్త్రీలు గృహ, కుటుంబ బాధ్యతల నుంచి, బాహ్య ప్రపంచంలోకి అడుగు బెట్టారు. తమకి సంబంధించిన ప్రతి అంశంపై విద్య, వివాహం, మొదలయినవి పురుషులు ఆవేశంతో చర్చించుకోవడం గమనించారు. త్వరలోనే వారూ ఆ విషయాలపై ఆసక్తి చూపడమేగాక పత్రికా నిర్వహణను, చేపట్టడం సభలలో పాల్గొని ఉపన్యసించడం చేయనారంభించారు. కందుకూరి రాజ్యలక్ష్మి, ఉన్నవ లక్ష్మీ బాయమ్మ త్వరలోనే సంస్కర్తలుగా స్త్రీలకు ఆదర్శనీయులయ్యారు. కొటికలపూడి సీతమ్మ చక్కని వక్తగా పేరు పొందింది. వేంపల్లి శాంతాబాయమ్మ బ్రహ్మసమాజ ప్రభావంతో సంపాదకురాలయింది. యామినీ పూర్ణ తిలకం కళావంతుల స్త్రీల అభివృద్ధికి కృషి చేసింది. అనేక మహిళా సంఘాలు ఇరవైయ్యవ శతాబ్ది ఆరంభం నుంచి ప్రారంభమయి స్త్రీ సంక్షేమ దిశగా పయనించాయి. మచిలీపట్నంలో 1902లో బృందావన పుర స్త్రీ సమాజం ఆరంభమయింది. ఈ క్రమంలో ఏర్పడిన సమాజాలలో శ్రీ విద్యార్థినీ సమాజం, సత్యసంవర్ధనీ సమాజం, త్రిపుర సుందరీ సమాజం ప్రముఖమైనవి. గ్రంథాలయాలు స్త్రీ విద్యా వ్యాప్తికి కృషి చేశాయి. ఏకా రత్నమ్మ గుంటూరులో 1904లో 400 గ్రంథాలతో స్త్రీ సనాతన ధర్మ గ్రంథమండలిని ఏర్పాటు చేసింది. బాపట్లలో సీతమ్మ, గుంటూరులో బాలత్రిపుర సుందరమ్మ, చేబ్రోలులో గోళ్ళమూడి రత్నమ్మ గ్రంథాలయాలను నిర్వహించి, స్త్రీ చైతన్యానికి కృషి చేశారు.

5. స్త్రీల పత్రికలు పెరిగాయి. తెలుగులో ప్రచురించబడిన పత్రికలు సమకాలీన సమస్యలను చర్చించాయి. తెలుగులో మొదటి స్త్రీల పత్రిక సతీహిత బోధిని ఆ తరవాత 'తెలుగు జానానా' బాలిక, సాహిత్రి, వివేకవతి, అనసూయ, సుందరి, స్త్రీ ధర్మ, ఆంధ్రలక్ష్మి, హిందూయువతి, ఆంధ్ర మహిళ మొదలగు పత్రికలు వెలువడ్డాయి. కాని ప్రధానంగా స్త్రీల చైతన్యాన్ని వృద్ధిచేసినవి హిందూ సుందరి, గృహలక్ష్మి పత్రికలు ఈ పత్రికలన్నీ స్త్రీ విద్య బాల్య వివాహాలు, వితంతు సమస్య, పునర్వివాహము, పాతివ్రత్యం, గృహ నిర్వహణ, స్త్రీ స్వేచ్ఛ, స్వాతంత్ర్యముల గురించి చర్చించేవి. హిందూ సుందరి 1902లో ప్రారంభించ బడింది. రామాబాయమ్మ, శాంతా బాయమ్మ దీనికి సంపాదకులుగా ఉంటూ, సంస్కరణకు సంబంధించిన వ్యాసాలను అనేకం ముద్రించేవారు. తొలితరం ఉద్యోగినులు బ్రహ్మసమాజ నేపథ్యం నుంచే వచ్చారు.

6. వర్ణాంతర వివాహాలు జరిగాయి. హైదరాబాదులో 1898 లో డా॥ అఘోరనాథ్ చట్టోపాధ్యాయ కుమార్తె అగు సరోజినీ దేవికి డాక్టరు గోవింద రాజులు నాయుడుకి వి.పి. రాజానాయుడు వివాహం చేయగా, వెంకటరత్నం ఆశీర్వదించాడు. నాభి జగన్నాధరావు కుమార్తె

పద్మ, ముస్లిమగు కరీంని వివాహమాడారు. పిఠాపుర రాజా పెద్ద కుమార్తెకి అస్సాం జమీందారునికి, తారకంకి సగుణ మహాలక్ష్మికి జరిగిన వివాహాలు వర్ణాంతర వివాహాలలో కొన్ని.

(7) సనానత సాంప్రదాయాలు, మూఢనమ్మకాలు మతం పేరుతో జరిగే అక్రమాలు, క్రతువులు, కర్మకాండలు ప్రశ్నించబడ్డాయి. శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెంది హేతువాద దృక్పథం ప్రబలింది. మానవతావాదం ప్రాముఖ్యం పొంది చట్టాల ద్వారా దురాచారాలను తొలగించే కృషి జరిగింది.

(8) సంస్కరణలు అందరికీ బోధపడేటట్లు తెలుగులో రాయడం ద్వారా దేశీయ భాష అభివృద్ధి చెందింది. సంస్కర్తలు తమ సంస్కరణలకు వేద, ఉపనిషత్ మద్దతుని చూపి, ఆ సాహిత్యాన్ని ఉటంకిస్తూ ప్రచారం చేశారు.

## 8.7. దివ్యజ్ఞాన సమాజం :

కల్నల్ ఓల్‌కాట్, మేడం బ్లావట్స్కీలు 1875లో న్యూయార్క్‌లో ప్రారంభించిన దివ్యజ్ఞాన సమాజం ఆంధ్రాలోనూ ఆదరణ పొందింది. కల్నల్ ఓల్‌కాట్ బ్లావట్స్కీలు 1880లోనూ 1882లోనూ దక్షిణ భారతదేశంలో పర్యటించారు. వీరి ఉపన్యాసాల ఫలితంగా ఆంధ్రాలో అనేక దివ్యజ్ఞాన శాఖలు వెలిసాయి. గుంటూరులో 1882లో ఓల్‌కాట్ సందర్శించినప్పుడు దివ్యజ్ఞాన సమాజం అంకురించింది. వింజమూరి భావనాచార్యులు లాడ్జి ఏర్పాటుకు స్థలం ఇవ్వగా, అనేకమంది స్థానికులు ఇచ్చిన విరాళాలతో భవనం నిర్మాణం జరిగింది. ఓల్కాట్ మరణం తరవాత అడయార్‌కి మకాం మార్చి, 1933 వరకు అక్కడే ఉన్న అనిబిసెంట్ ప్రభావం ఆంధ్రాపై ఉంది. దివ్యజ్ఞాన సమాజ ప్రభావం ప్రధానంగా విద్యాధికులయిన హిందువులపై, అందులోనూ బ్రాహ్మణులపై పడింది. హిందూ మత ప్రాచీన విజ్ఞానాన్ని పునరుద్ధరించాలని, ఆ సిద్ధాంతాల ప్రకారం తిరిగి స్థాపించాలని వారు భావించారు. హిందూమతాన్ని, ఇతర మతస్థుల నుంచి కాపాడవలసిన అవసరం ఉందని దీని అనుయాయులు భావించేవారు. దివ్యజ్ఞాన శాఖలు మచిలీపట్నం, నెల్లూరు, మదనపల్లిలలో వెలిసాయి. స్త్రీ విద్యని వీరు ప్రోత్సహించారు. బాల్య వివాహాలను ఖండిస్తూ యుక్త వయస్కుల వివాహాలను ప్రోత్సహించారు. మదనపల్లిలోని కళాశాల జాతీయ విద్యని అందించడంతో బాటు దివ్యజ్ఞాన కేంద్రమై, క్రైస్తవ మతాన్ని, పాశ్చాత్య సంస్కృతిని విమర్శించడంతో, హిందువులు ఎక్కువగా స్పందించారు. ఈ సమాజాలు అంతర్జాతీయ సోదరభావాన్ని ప్రచారం చేశాయి. సంస్కృత సాహిత్యాన్ని, నైతిక విద్యను, ప్రాచీన నమ్మకాలను ప్రచారం చేశాయి. దివ్యజ్ఞాన వ్యాప్తితో బాటు సంస్కృత పాఠశాలలను, ఆసుపత్రులను పఠనమందిరాలను గ్రంథాలయాలను ఈ శాఖలు పెంపొందించాయి. జాతీయతా భావం విస్తరిల్లడానికి సమాజాలు కృషిచేశాయి. సమాజ శాఖలలో ప్రధానమైనవి. ఆదోని, అనంతపురం, చిత్తూరు, కడప, గుంతకల్లు, కర్నూలు, మదనపల్లి సిద్దవటం, తాడిపత్రి, బెజవాడ, గుంటూరు, కాకినాడ, ఏలూరు, మచిలీపట్నం, నెల్లూరు, రాజమండ్రి, విజయనగరం, వరంగల్ మొదలగునవి. రాయలసీమలో సంస్కరణలు అమలు జరపడంలో దివ్యజ్ఞాన సమాజం ప్రముఖ పాత్ర వహించింది.

## 8.8 ఆర్య సమాజం

దీని ప్రభావం ప్రధానంగా తెలంగాణా ప్రాంతంలో కనిపిస్తుంది. స్వామి శ్రద్ధానంద 1926 లో హత్యకు గురి అయిన తరువాత ఆర్యసమాజం ఆర్య రక్షా సంఘాన్ని, ఆర్య వీరదళ్ అను రెండు కొత్త సంస్థలను ఏర్పరచుకొంది. వేదాలను ప్రమాణంగా ఎంచే ఆర్య సమాజంపై హైదరాబాదులో 1930 నాటికి ఆంక్షలు విధించారు. హైదరాబాదులో 1938లో ఆర్య సమాజం నిర్వహించిన సత్యాగ్రహోద్యమం ఫలించి, మరుసటి సంవత్సరం నిజాం సంస్కరణలను ప్రవేశపెట్టడంతో ముగిసింది. విద్య, వేదాధ్యయనంపై అందరికీ హక్కు ఉందని తెలుపడంతో బాటు, జాతీయతా భావాన్ని ఆర్యసమాజం ప్రోత్సహించింది. కుల వ్యవస్థను బాల్యవివాహాలను ఖండించింది.

## 8.9 రామకృష్ణ మిషన్ :

నిర్భీతిని, త్యాగాన్ని, సేవను ఉత్తమ ఆదర్శాలుగా ప్రబోధించే రామకృష్ణ మిషన్ 1896లో స్థాపించబడింది. ఇది ఆంధ్రాలో సర్వమత సామర్య సాధనకు దోహదపడింది. ఆధ్యాత్మికత్వానికి ప్రాధాన్యతనిస్తూ, పూర్వులిచ్చిన అమూల్య సంపదను పదిలపరచుకోవాలని తెలుపుతుంది. అన్నదానం, విద్యాదానం, జ్ఞానదానాల ద్వారా మానవసేవ జరగాలని కోరుతుంది సంఘ కార్యక్రమాలలో పాల్గొనే వారికి

శిక్షణను ఇస్తుంది. వైద్యశాలలను, విద్యాలయాలను, అనాథ శరణాలయాలను, గ్రంథాలయాలను వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసింది. పాశ్చాత్యులను ఆకర్షించి, ఆర్థిక హార్థిక మద్దతు పొందిన మొదటి హిందూ ఉద్యమం ఇదే.

## 8.10 ఉద్యమాల క్షీణత :

ఇతర ప్రాంతాలలో వలెనే స్వాతంత్రోద్యమం విజృంభించడంతో, జాతీయతా భావం ప్రాధాన్యతను పొంది, సంఘ సంస్కరణ వెనుకంజ వేసింది. అంత వరకు సంస్కరణోద్యమంలో నిమగ్నమయిన ఉన్నవ లక్ష్మీనారాయణ, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు అయ్యదేవర కాళేశ్వరరావు చురుకైన కాంగ్రెస్ కార్యకర్తలుగా మారారు. జాతీయోద్యమంలో భాగంగా ముఖ్యంగా, గాంధీ నాయకత్వంలో, సంఘ సంస్కరణ కొనసాగినప్పటికీ, పూర్వపు తీవ్రతను కోల్పోయింది. అదే విధంగా వివిధ కుల సంఘాలు సంస్కరణలను ప్రోత్సహించాయి. అందుచేత వితంతు వివాహాలకు, స్త్రీల విద్యకు, తిరస్కారం పెద్దగా ఎదురవలేదు.

## 8.11 సంగ్రహంగా :

సంఘ సంస్కరణోద్యమాలు ప్రధానంగా కుటుంబాన్నీ, గ్రామ జీవనాన్ని విప్లవాత్మక మార్పులకు గురిచేశాయి. విద్య కొరకు, ఉపాధి కొరకు, మెరుగైన అవకాశాల కొరకు గ్రామాలను వదలి పట్టణాలకు వెళ్ళడంతో వ్యష్టి కుటుంబాలు ఏర్పడ్డాయి. కుల కాఠిన్యత తగ్గింది. స్త్రీ విద్యకు ప్రోత్సాహం లభించింది. దళితులకు, అనాథలకు సంస్కర్తలు ఆదరణ చూపసాగారు. పట్టణాలు సంస్కరణ కేంద్రాలయ్యాయి. సంస్కర్తలు పాశ్చాత్యులకు, స్వదేశీయులకు వారధిగా ఉండేవారు. భారతీయ ఔన్నత్యాన్ని, సంస్కృతిని చూసి, ఒక వంక ఆత్మ ధైర్యాన్ని పొందుతూనే, మరోవంక ఆంధ్ర సమాజంలోని దురాచారాలను ఎదిరిస్తూ సంస్కరణలకై పాటుపడ్డారు. దేశ చరిత్రను సాంప్రదాయాలను, వ్యవస్థలను, సంస్కృతిని వారు పునర్వ్యాఖ్యానించసాగారు. సహనం, ఆత్మ విమర్శ, సమన్వయాన్ని వారు పెంచుకున్నారు. ఆంధ్రాలో బ్రహ్మసమాజం, దత్తమండలాలలో దివ్యజ్ఞాన సమాజం, తెలంగాణాలో ఆర్యసమాజం సంస్కరణల కార్యక్రమాలను చేపట్టి, అక్కడి మార్పులకు కారణమయ్యాయి. బ్రహ్మసమాజం సంఘ సంస్కరణలపై ప్రధాన దృష్టిని కేంద్రీకరించగా, మిగిలిన మూడూ - ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణమిషన్ - హిందూ మత ఆధిక్యతను కీర్తించాయి.

## 8.12 వ్యాస రూప ప్రశ్నలు

1. సంస్కరణ ఉద్యమానికి దోహదం చేసిన కారణాలను తెలియజేయండి.
2. కందుకూరి వీరేశలింగం ఆంధ్రదేశానికి చేసిన వివిధ సేవలను వివరించండి.
3. రఘుపతి వెంకటరత్నం నాయుడు ఆంధ్రదేశానికి ఒనర్చిన కృషిని పరిశీలించండి.
4. ఆధునిక ఆంధ్రాపై వీరేశలింగం - వెంకటరత్నంల పాత్రను పరిశీలించండి.
5. ఆంధ్రాలోని సంఘసంస్కర్తల సేవలను తెలియజేయండి.
6. ఆంధ్రాపై బ్రహ్మసమాజ ప్రభావాన్ని వివరించండి.

## 8.13 ఉపయుక్త గ్రంథాలు


1. V. Rama Krishna : Social Reforms in Andhra (1848-1919)
2. B. Kesava narayana : Political and Social Factors in Andhra (1900-1956)
3. Y. Vaikuntham : Education and Social Change in Andhra
4. Raghuvamsi : Indian Society during the 18th Century.
5. Natarajan : Century of Social Reforms in India.
6. K. K. Datta : A Social History of Modern India.


**Dr. V.K. Mohan**

పాఠం - 9

# ఆంధ్రాలో జాతీయభావము

విషయక్రమం


9.1 లక్ష్యం

9.2 పరిచయం

9.3 ఆంగ్లపాలన

9.4 వలసవాద ఆర్థిక వ్యవస్థ - ఆర్థిక విధానాలు - దోపిడీ

9.5 కరువులు

9.6 ఆంగ్ల విద్యావ్యాప్తి

9.7 పునరుజ్జీవనోద్యమము

9.8 ప్రజాభిప్రాయం

9.9 వార్తాపత్రికలు

9.10 జాతీయ కాంగ్రెస్ స్థాపన

9.11 జిల్లా సంఘాల ఆవిర్భావము

9.12 సాహిత్య ప్రభావం

9.13 ఆంధ్రలో సాగిన జాతీయోద్యమము

9.14 స్వదేశీవాదం - జాతీయ విద్యాసంస్థలు

9.15 జాతీయ నాయకుల పర్యటనలు

9.16 సమీక్ష

9.17 వ్యాసరూప ప్రశ్నలు


**9.1 లక్ష్యం :**

ఆంధ్రాలో జాతీయ భావము జనించుటకు దోహదము చేసిన ముఖ్య పరిస్థితులు లేక కారణములు వివరించుటయే ఈ పాఠ్య లక్ష్యం.

**9.2. పరిచయం :**

ఆంధ్రాలో జాతీయోద్యమ బీజాలు 19 వ శతాబ్దపు చివరిభాగంనుంచి కనిపిస్తాయి. ఈ సమయంలోనే బొంబాయిలో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది. ఆ సమావేశాలకు హాజరయిన ఆంధ్రా నాయకులు జిల్లా కాంగ్రెస్ శాఖలను నెలకొల్పారు. ప్రారంభంలో భారత స్వాతంత్ర్యోద్యమం నగరాలకు, జిల్లా ముఖ్యపట్టణాలకు మాత్రమే పరిమితమైంది. నాగపూర్‌లో జరిగిన ఏడవ కాంగ్రెస్ వార్షిక సమావేశానికి, ఆంధ్రా నాయకులొకరు అధ్యక్షపీఠం వహించే అవకాశం కలిగింది. జిల్లా కాంగ్రెస్ సమావేశాలలో ఆంధ్ర నాయకులు, జాతీయ కాంగ్రెస్ తీర్మానాలన్నిటినీ సమర్థిస్తూ, అనేకమందిని కాంగ్రెస్ సభ్యులుగా చేస్తూ, స్థానిక సమస్యలపై ప్రభుత్వ దృష్టిని కేంద్రీకరించే ప్రయత్నం చేస్తూ, జాతీయోద్యమాన్నీ విస్తరించారు.

## 9.3. ఆంగ్లపాలన :

క్రీ.శ. 1858 విక్టోరియా రాణి ప్రకటనతో భారతదేశంలో ప్రత్యక్ష ప్రభుత్వ పాలన మొదలైంది. ఆంగ్లేయులను గురించిన సామ్రాజ్యవాదము, జాతి విచక్షణా విధానము, ఆర్థిక పీడనా విధానము ఆంధ్రులలో తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. ఆంగ్లపాలనలో ఆంధ్రదేశము నిత్యము కరువు కాటకములకు గురియగుటయేగాక, వారు అనుసరించిన భూమి శిస్తు విధానము రైతులను కడు దరిద్రులుగా మార్చింది. ఆంగ్లేయులు అనుసరించిన పారిశ్రామిక విధానము వలన కుటీర పరిశ్రమలు మూతపడి పెక్కుమంది జీవనోపాధిని కోల్పోయారు. విద్యాధికులైన ఆంధ్రులకు ఉద్యోగావకాశములు సన్నగిల్లాయి. ఇట్టి దుష్పరిపాలనను ఆంధ్రులు గర్హించారు. స్వప్రయోజనాలకు వేసుకొన్న రవాణా సౌకర్యాలు, ఆంగ్లేయులకు ఆర్థికంగా లాభించినా పరోక్షముగా భారతీయులకు ముఖ్యముగా ఆంధ్రుల సమైక్యతకు దోహదపడినాయి.

## 9.4. వలసవాద ఆర్థిక వ్యవస్థ : ఆర్థిక విధానాలు - దోపిడీ :

బ్రిటిష్ అధికార స్థాపనతో భారత దేశాన్ని ఒక వలస రాజ్య స్థాయికి నెట్టేశారు. ఈ దేశ ఆర్థిక సంపద, వనరులు, శక్తులు, ప్రజల శ్రమ, బ్రిటన్ దేశ ప్రజల సౌభాగ్యం, ప్రగతి, సంతోషాలకు సాధనాలయ్యాయి. ఇక్కడి ఆర్థిక వనరులను పీల్చి పిప్పిచేయటానికి ఆంగ్లేయపాలకులు తమ విధానాలను రూపొందించారు. పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం, ప్రాతినిధ్యం లేవు ఫలితంగా పాలకులు బాధ్యతా రహిత పాలనను యధేచ్ఛగా సాగించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలపై బ్రిటిష్ ప్రజలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారుల ప్రభావం బలంగా ఉంది. బ్రిటిష్ పాలనాకాలంలో నెలకొన్న ఇటువంటి వ్యవస్థ 'వలసవాద ఆర్థిక వ్యవస్థ' (colonial economy) గా చెలామణైంది. వలసవాద ఆర్థిక వ్యవస్థలో పరిణామరీత్యా, కాలక్రమానుగతంగా, మూడు దశలు చేయబడ్డాయి. ఈ మూడు దశల్లోకూడా, భారతదేశ సంపద, ఆర్థిక వనరులు, భిన్న ప్రక్రియల్లో నిరంతరంగా, బ్రిటిష్ పాలకులచేత దోపిడీ చేయబడ్డాయి. అయితే, ఒక దశరీతులు, లక్షణాలు, మరో దశలో కూడా కొనసాగాయి. భారతీయ వలసవాద ఆర్థిక వ్యవస్థ (Indian colonial economy) లో, మొదటగా 'వ్యాపార' (Mercantilist) దశ ప్రారంభమైంది. ఈ దశ 1757 నుండి 1813 వరకు నడిచింది. ఈ దశలో ఆంగ్లేయ తూర్పు ఇండియా కంపెనీవారు, వ్యాపార పెట్టుబడి (Merchant Capital) కి దిగి, లాభార్జన ప్రధాన లక్ష్యంగా, రాజకీయ ఆధిపత్యం ద్వారా కృషి చేశారు. స్వేచ్ఛా వ్యాపార పారిశ్రామిక పెట్టుబడిదారీ దశ 1813-1870 వరకు సాగింది. కంపెనీ వ్యాపార గుత్తాధికారం అంతమవటంతో, ఇండియా బ్రిటన్‌ల మధ్యగల ఆర్థిక సంబంధాలలో విపరీతమైన నూతన మార్పులు చోటు చేసుకున్నాయి. "పారిశ్రామిక ఇంగ్లాండ్‌కు వ్యవసాయిక వలసగా భారతదేశాన్ని మార్చడమే" ప్రధాన ధ్యేయమైంది. బ్రిటిష్ పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలను ఉత్పత్తి చేసి పంపించే దేశంగా, ఆ పరిశ్రమలు తయారు చేసే సరుకులను కొనే విశాల మార్కెట్‌గా ఇండియాను మార్చివేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం పలు ఆర్థిక విధానాలను అనుసరించింది. ఈ ప్రక్రియలో ఆంగ్ల పారిశ్రామికుల వ్యాపారుల, పెట్టుబడిదార్ల ప్రయోజనాల పరిరక్షణే పరమావధిగా భావించి, భారత కళాకారుల, చేనేత వృత్తి, చేతివృత్తుల వారల, వ్యవసాయదార్ల, కార్మికుల, వ్యాపారుల బాగోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఆహుతిగావించింది. ఆంధ్రాలో కూడా ఈ అనుభవమే ఎదురయింది. బ్రిటన్ భారతదేశాల మధ్య 1813 నుండి నెలకొన్న స్వేచ్ఛా వ్యాపారం, ఏకపక్ష స్వేచ్ఛనే కల్గివుంది. బ్రిటన్‌కు తన సరుకులను ఇండియాకు దిగుమతి చేయటానికి పూర్తి స్వేచ్ఛ ఉంది, కాని తన ఉత్పత్తులను ఇంగ్లాండుకు గాని ఇతర దేశాలకు గాని ఎగుమతి చేయటానికి ఇండియాకు స్వేచ్ఛలేదు. బ్రిటిష్ పారిశ్రామికుల ప్రయోజనార్థమై భారతదేశ వ్యాపార స్వేచ్ఛ కడు క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా అణచివేయబడింది. అధికారబలం, దౌర్జన్యం, అణచివేతలద్వారా, దేశీయ రైతులు, వర్తకులు, నేత పనివారినుండి అతిస్వల్ప విలువకు కావలసిన ఉత్పత్తులు, సరుకులు కొనుగోలు చేస్తూ, కంపెనీ ఉద్యోగులు, ఏజెంట్లు తమ సరుకులను రైతులచేత బలవంతంగా రెట్టింపు ధరలకు కొనిపించేవారు. ఇంతేకాదు, ఇతర ఐరోపాదేశాలు, విదేశాలతో కూడా ఇండియా ప్రత్యక్ష వ్యాపారం నిలిపివేయబడింది.

ఆర్థిక పెట్టుబడిదశ 1870 నుండి 1947 వరకు సాగింది. 19 వ శతాబ్దం చివరి పాదంలో బ్రిటిష్ పారిశ్రామిక గుత్తాధిపత్యం, ప్రపంచ మార్కెట్‌పై ప్రాబల్యత బలహీనపడసాగాయి. ప్రపంచంలోని ఇతర భాగాల్లో నూతన ఐరోపా, అమెరికా పోటీదార్లు ఎదురయ్యారు. ఇండియాలో మాత్రం బ్రిటిష్ రాజకీయ సర్వసత్తాధికార కారణంగా క్షీణత ప్రస్ఫుటమైనప్పటికీ, నెమ్మదిగా సాగింది.

**ఆర్థిక విధానాలు - దోపిడి :** శాశ్విత శిస్తు విధానమును బెంగాల్ గవర్నర్ లార్డ్ కారన్ వాలీస్ 1793 లో బెంగాల్ రాష్ట్రంలో ప్రవేశపెట్టాడు. దీని ప్రకారము అప్పటివరకు ప్రభుత్వమునకు రైతులకు మధ్యవర్తులుగానున్న జమిందారులకు భూమిమీద ఆస్థిహక్కు లభించేది. వారు ప్రభుత్వమునకు చెల్లింపవలసిన భూమి శిస్తు స్థిరముగా ఉండేది. వారు క్రమముగా భూమిశిస్తు చెల్లించునంతకాలము వారి భూస్వామ్యమునకు భంగము కల్గదు. దీనివలన భూమిశిస్తు ద్వారా వచ్చు ఆదాయము ఖచ్చితంగా ప్రతిసంవత్సరము లభించేది. అందుచే వేలమువేయు పద్ధతికంటే శాశ్విత శిస్తు నిర్ణయ విధానమే ఉత్తమమని కంపెనీ ప్రభుత్వం నిర్ణయించింది, ఈ శాశ్విత శిస్తు విధానమును మద్రాసు ప్రెసిడెన్సీలో గూడా 1802 లో ప్రవేశపెట్టారు. ఈ చట్టము అంతకుముందున్న జమిందారీ భూములకేగాక హవేలీ భూములకు గూడా వర్తింపచేశారు. హవేలీ భూములలో వంశపారంపర్య హక్కుగల జమిందారులు లేరు. అందుచేత ఆ భూములు కొన్ని భాగములుగా చేయబడి ఒక్కొక్క భాగమునకు ఒక్కొక్క ప్రొప్రైటర్ నియమింపబడ్డారు. ఆ భూములపై ప్రొప్రైటర్లకు ఆస్థి హక్కు ఇచ్చారు. వారు చెల్లించవలసిన పేష్కష్ గూడా నిర్ణయించబడింది. ఇట్లు ప్రొప్రైటర్లు రైతులను పీడించి లాభాలు గడించారు. రైతుల పీడ, ఆవేదనను కంపెనీ సర్కారు గ్రహించలేదు. రెండు భాగములు చేసి ఒక భాగము మచిలీపట్టణము అధికారులక్రింద, రెండవ భాగము విశాఖ పట్టణము అధికారుల క్రింద ఉంచారు. ఈ విధానము 85 సంవత్సరములపాటు కొనసాగింది. ఈ గిడ్డంగులనుండి ముడిసరుకులు విపరీతంగా బ్రిటన్‌కు చేరాయి. ఈ గిడ్డంగుల అధికారుల పాలన సంతృప్తికరముగా లేదు. ఈ అధికారులకు తగినంత పాలనా అనుభవం లేదు. వారు స్వలాభాపేక్షా పరులు. వారికి ప్రజాక్షేమమందు శ్రద్ధలేదు. కంపెనీ ఉద్యోగులను అదుపులో నుంచుటకు మద్రాసులో "బోర్డ్ ఆఫ్ రెవెన్యూ" (1789) అను సంస్థ నెలకొల్పారు. దీనివలన ప్రయోజనం కల్గలేదు. 1791 లో రద్దుచేయబడింది.

క్రమ క్రమంగా దేశీయ వస్త్రములు, యంత్రములలో తయారై గ్రేట్ బ్రిటన్‌నుండి దిగుమతియగు వస్త్రములు పోటీకి తట్టుకొనలేకపోయాయి. విశాఖపట్టణము రేవులో 7 లక్షలనుండి 1 లక్షకు, మచిలీపట్టణములో 30 లక్షలనుండి 3000 రూపాయలకు ఎగుమతులు పడిపోయాయి. దీనికి కారణము కంపెనీ వారనుసరించిన వాణిజ్య విధానము (Mercantalism). తమ దేశ యంత్రములలో ఉత్పత్తియగు వస్త్రములు రాయలసీమ ప్రాంతమున మన్రో అను కలెక్టరు రైతువారీ పద్ధతిని ప్రవేశపెట్టి అమలు జరిపాడు. రాయలసీమలో శాశ్విత శిస్తు విధానంకు బదులుగా రైతువారి పద్ధతి ప్రవేశపెట్టుటకు కారణము, రాయలసీమ ప్రాంతంలో జమిందారులు లేరు. అచట రైతులు బ్రిటీష్ వారి రాక పూర్వము నుండియే రైతువారీ పద్ధతికి అలవాటుపడి యున్నారు. హవేలీ భూములపై యాజమాన్య హక్కు పొందిన వారనేకులు పేష్కష్‌లు సకాలమునకు చెల్లింపక బకాయిలు పెట్టసాగారు. వంశపారంపర్యంగా జమిందారులుగా నున్నవారు గూడా సకాలములో పేష్కష్‌లు చెల్లింపలేకపోయారు. మొదటినుండి మద్రాసు ప్రభుత్వం జమిందారీ విధానమునకు సముఖంగాలేదు. రాయలసీమలో మన్రో నిర్ణయించిన రైతువారి శిస్తులు (పంటలో సగము) దుర్భరముగా నుండుటవలన, రైతులు శిస్తు చెల్లింపులలో బకాయిపడుట, శిస్తు సమయంలో చెల్లించకపోవుటవలన కఠినమైన కారాగార శిక్షలు అనుభవించవలసి వచ్చింది. ఇటువంటి దుర్భరస్థితులను రైతులు చాలా సంవత్సరాలు భరించవలసి వచ్చింది.

వర్తక సంస్థల విధానానికి వస్తే గిడ్డంగి వ్యవహారములు నిర్వహించుటకు ఒక ముఖ్యాధికారి, చిన్నసభ ఉండేది. నిజామునుండి లభించిన సర్కారులను కంపెనీవారు అమ్మకమునే వీరు ప్రోత్సహించారు. జమిందారుల పరిస్థితి క్షీణించుటతో నేత పనివారికి, ఇతర చేతివృత్తులవారికి ఆదరణ తగ్గింది. ఇట్టి పరిస్థితులలో మగ్గముల సుంకము (Moturpha) గూడా వసూలు చేయబడుటవలన నేతపనివారు నిస్పృహ చెందారు.

క్రీ.శ. 18 వ శతాబ్దంలో ఆంధ్ర ప్రదేశమున స్థిరత్వము లేకున్నను నేత పరిశ్రమ అభివృద్ధి దశయందుడేంది. పోర్చుగల్, డచ్, ఫ్రెంచి వర్తకులు నేత పనివారికి ముందుగనే ధనము చెల్లించి వస్త్రములు నేయించుకొనేవారు. బట్టల నాణ్యత విషయంలో వారికి పెద్ద పట్టింపు ఉండేదికాదు. కానీ ఆంగ్ల వర్తకులు నేత పనివారికి తక్కువ సొమ్ము చెల్లించి, వస్త్రములు నాణ్యముగా ఉండవలెనని పట్టుబట్టేవారు. అందువలన నేతపనివారు అప్పుడప్పుడు ఆంగ్లవర్తకులకు బట్టలు నేసి యిచ్చుటకు నిరాకరించేవారు. మచిలీపట్టణము వద్ద డచ్ వారికి 50,000 మంది నేతపనివారు వస్త్రములు నేయుచుండేవారు. రోజుకు 50,000 పగడాల ధనము చెల్లించుటయేగాక డచ్‌వారు వారికి చౌక ధరలకు ఆహార పదార్థములను గూడా సరఫరా చేశారు. ఇంజరము వద్ద 2000 మంది నేత పనివారు డచ్ వారికి, 700 మంది

ఆంగ్లేయులకు వస్త్రములు నేసేవారు. కాని ఆంగ్లేయులు డచ్, పోర్చుగీస్ వాళ్ళను పోటీలో దాటి వస్త్రముల వాణిజ్యంలో గుత్తాధిపత్యము సంపాదించారు.

సిల్కు పరిశ్రమ : పెద్దాపురం, ధర్మవరం, బర్హంపురం మున్నగునవి ఆంధ్రదేశములోని సిల్కు వస్త్రముల ఉత్పత్తి కేంద్రములు. పోర్చుగీసువారు, ఆంగ్లేయులు ఈ సిల్కు వస్త్రములను ఐరోపా నిపుణులకు సరఫరాచేసి విశేష లాభములనార్జించారు. కాని క్రీ.శ. 1850 నాటికి ఈ సిల్కు వస్త్రములు ఐరోపాలో చైనా, జపాన్ సిల్కుల పోటీకి నిలబడలేక పోయాయి.

తివాసీల పరిశ్రమ : ఏలూరు తివాసీలు, కర్నూలు, ఆదోని, బళ్ళారి రగ్గులు, దుప్పట్లు, వరంగల్ తివాసీలు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాయి. క్రీ.శ. 1861 లో లండనులో ఏర్పాటు చేయబడిన వస్తు ప్రదర్శనశాలలో ఏలూరు తివాసీలు జనాకర్షణ పొందాయి.

ఇనుప పరిశ్రమ : వ్యవసాయదారులు, వడ్రంగులు, కమ్మరులు మొదలైనవారు ఉపయోగించు పనిముట్లకు, సైనికుల ఆయుధములకు, సామాన్య జనుల వాడుకకు కావలసిన ఇనుము క్రీ.శ. 1800 కు పూర్వము దేశమునందే దొరుకుచుండేవి. కాలక్రమమున ఆంగ్లేయులు యంత్ర సహాయమున తయారయి చౌకగా లభించు ఇనుము దిగుమతి చేయుటవలన ఇనుము పరిశ్రమ పూర్తిగా నశించింది.

కుటీర పరిశ్రమలు క్షీణించుట : క్రీ.శ. 18 వ శతాబ్దమున ఇంగ్లాండులో సంభవించిన పారిశ్రామిక విప్లవము వలన విదేశీ వస్తువులు చౌకగా లభించేవి. వీటి పోటీకి నిలబడలేక దేశములోని కంచర్లు, చర్మకారులు, కమ్మర్లు తదితర కార్మికులు వంశపారంపర్యంగా అనుసరించుచున్న వృత్తులను మానుకొని వ్యవసాయ కూలీల వర్గములో చేరారు. ప్రజల అభిరుచులలో గొప్పమార్పులు వచ్చి విదేశీ వస్తువులకు గల గిరాకీ ఎక్కువై సామాన్య ప్రజలలో కూడా విదేశములనుండి దిగుమతియగు పింగాణీ సామానులు, సబ్బులు, బొమ్మలు, ఆటవస్తువులు మున్నగు వానియందు వ్యామోహము పెరిగింది. ఈ కారణము వలన బ్రిటిష్ పాలనా కాలమున, ఆంధ్రదేశములోని పరిశ్రమలు క్షీణించి ప్రజలలో ముఖ్యంగా చేతిపని పారిశ్రామికులలో పేదరికం, అశాంతి, బ్రిటీష్‌వారి ఎడల వ్యతిరేకత పెరిగింది.

## 9.5 కరువులు :

బ్రిటిష్ పాలనలో ఆంధ్రదేశంలో కరువులు తరచుగా వస్తూనే ఉండేవి. క్రీ.శ. 1791 లో మద్రాసు ప్రెసిడెన్సీలో ఉత్తర జిల్లాలలో కరువు పరిస్థితులేర్పడి ప్రజలు అనేక ఇబ్బందులకు గురైయ్యారు. కంపెనీ పాలనలో అంతవరకు అటువంటి పరిస్థితులు ఎన్నడూ ఏర్పడలేదని మచిలీపట్టణములోని కంపెనీ ప్రధానాధికారి పేర్కొన్నాడు. దేశములోని దుర్భిక్ష పరిస్థితులు తీవ్రతరములైనాయి. దీనికితోడు దొంగలు ఎక్కువైనారు. ప్రజల, పశువుల మరణాలు అధిక సంఖ్యలో జరిగాయి. పెద్దాపురం జమిందారీలో నాల్గింట మూడువంతుల కర్షక జనం, పశువుల మరణాలు సంభవించాయి. కొందరు ఇండ్లను దోచుకొనుట మొదలుపెట్టారు. మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనేకులు పొరుగు జిల్లాలకు వలస వెళ్ళారు. ఈ జిల్లాలు అట్టి పరిస్థితులునుండి బయటపడుటకు చాలాకాలము పట్టింది. 18 వ శతాబ్దమున ఉత్తర సర్కారులలో ధాన్యపు కొరత ఏర్పడింది. గంజాము మండలములో క్షామ పరిస్థితులు తీవ్రముగానుండి కొన్ని గ్రామాలు నిర్మానుష్యములైనాయి. అనేకులు వలస వెళ్ళారు. మచిలీపట్టణ ప్రాంతంలో 1823-24 సంవత్సరములలో క్షామ పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని ముందుగానే ఊహించిన మచిలీపట్టణములోని కంపెనీ అధికారులు బియ్యము మామూలు ధరకు అమ్మమని వర్తకులను ఆదేశించారు. మచిలీపట్టణానికి అదనపు బియ్యం దిగుమతి చేయవలసిందిగా బెంగాలులోని ఆంగ్ల ప్రభుత్వమునకు వార్త చేరింది. దీనికి మద్రాసు ప్రభుత్వము, మచిలీపట్టణ అధికారిని నిందించారు. కానీ రెండు మాసములలోనే అతని ఊహ వాస్తవమయ్యింది. ఒక్క గిడ్డంగివద్ద మాత్రమే ధాన్యము అమ్మబడుటవలన ప్రజల అవసరము తీరలేదు. ఆకలి బాధతో అనేకులు అసువులు బాసారు. క్షుద్బాధకు తాళలేక తమ పిల్లలను వదిలివేశారు. మచిలీపట్టణములో మొదలైన ధాన్యపు దోపిడీలనాపుటకు సైన్య సహాయమవసరమైంది. రైతువారీ పద్ధతి అమలులోనున్న ప్రాంతములలోని ప్రజల యోగక్షేమములు విచారించుటకు తమ బాధ్యతయని కంపెనీ ప్రభుత్వము వారికొరకు సహాయ కార్యక్రమములు ప్రారంభించేలోపే అనేకులు అశువులు బాసారు.

1833 లో గుంటూరులోని క్షామము అన్నిటికంటె ఘోరమైంది. ఇచ్చట పశువుల నష్టమపారము. కర్షకులు అనేకమంది ఇతర ప్రాంతములకు వలస వెళ్ళారు. మరణములెక్కువై అంటువ్యాధులు ప్రబ[illegible]యి. దౌర్జన్యములు, దోపిడీలు ఎక్కువయ్యాయి. గుంటూరు

ప్రాంతంలో సుమారు 50 లక్షలమంది క్షామ పరిస్థితులలో చిక్కుకున్నారు. ఈ విషయము ప్రభుత్వము ఆలస్యముగా గ్రహించింది. అప్పటికిగూడా ప్రభుత్వము సత్వర నివారణ చర్యలు తీసికోలేదు. పట్టణములో మాత్రము అన్నదానములు జరిగాయి. ఈ కరువు సమయమున సుమారు రెండు లక్షలమంది మరణించినట్లు అంచనా. ఇదే సమయమున మచిలీపట్టణము, నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతములలోగూడా దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ గుంటూరు పట్టణ క్షామ ప్రభావము కొన్ని సంవత్సరాలవరకు సాగింది.

రాజమండ్రి పరిస్థితి గుంటూరులోనున్నంత విపరీతంగా లేదు. 1812 నాటి తుఫానువలన పంటలు అధిక నష్టమునకు గురైనాయి. అట్టి దీనావస్థనుండి బయటపడుటకు పెక్కుమంది తమ పిల్లలతో మద్రాసు చేరారు. కొందరు తమ పిల్లలను అమ్ముకొని పొట్టపోసుకున్నారు. కొన్ని రాజ మార్గాలు స్మశానాలైనవి. పనిచేసిన వారికే ప్రభుత్వ సహాయమందించవలెనని ప్రభుత్వము ఉత్తర్వులు జారీ చేసింది. ఎందరో స్త్రీ-పురుషులు క్షుద్బాధను తాళలేక ప్రభుత్వము కల్పించిన పనులలో పాల్గొన్నారు. సైనికుల సహాయము లేకుండా ధాన్యము రవాణా చేయుట అసాధ్యమైంది. ధాన్యపు వర్తకుల రాకను పసిగట్టి వారిని దోచుకొనుటకు గ్రామస్థులు తయారైనారు. తినుబండారములేవైనా దొరుకునేమోనని కొందరు ఖాద్య యోగమ్ముగాని పదార్థములను గూడా భక్షించారు. స్త్రీలు నీటి కొరకు రాత్రంతయు బావులవద్ద జాగరణ చేసేవారు. మద్రాసు సుప్రీం కోర్టులో వ్యాఖ్యాతగానున్న ఏనుగుల వీరస్వామిగారు కూడా ఆ సమయమున అన్నదాన కార్యక్రమము పెద్ద ఎత్తున జరిపారు. ఉత్తర సర్కారులలో భూమిని పూర్తిగా సాగుచేయుటకు పశువులు గాని, మనుషులు గానీ తగినంతగా లేరని 1835 లో అచట పర్యటించిన మద్రాసు గవర్నరు పేర్కొన్నాడు.

క్రీ.శ. 1803 లో దత్తమండలములో వర్షాభావము వలన పంటలు నాశనమయ్యాయి. పశువుల మరణము సంఖ్య చాలా ఎక్కువ. దత్తమండలములు అప్పటికి కొద్దికాలమునకు ముందే (1800 సం॥లో) కంపెనీవారి అధికారము క్రిందకొచ్చాయి. భూమిశిస్తు రేట్లు కర్షకుల శక్తికి మించివుండేవి. ఈ రేట్లు క్రమబద్ధం కాలేదు. శిస్తు తగ్గించినయెడల అది తమ బలహీనతగా పరిగణింపబడునే మోనని కంపెనీ అధికారులు ఎట్టి చర్య తీసుకోలేదు. చెదురుముదురుగా తప్ప ప్రజాహిత కార్యములు కూడ చేపట్టలేదు. ధరలు ఎక్కువగా ఉండేవి. రుపాయికి 25 మండి 30 శేర్లు వరకు అమ్మే బియ్యము 8 లేక 9 శేర్లు మాత్రమే లభించేవని మన్రోతన జాబులలో తెల్పాడు. తక్కిన ఆహార ధాన్యముల ధరలుకూడా అదే విధంగా వుండేవి. క్షామకాలమున 1805 లో 3225 మంది, 1806 లో 4902 మంది, 1807 లో 17,207 మంది ప్రాణములు కోల్పోయారు. 1804 లో బళ్ళారి జిల్లాలో తీవ్ర క్షామ పరిస్థితి ఏర్పడింది. అందుకు ముఖ్యకారణము 1802, 1803 లో వర్షపాతము అత్యల్పముగా నుండుటయే. బళ్ళారి జిల్లాలోని గ్రామములలో ఐదింట నాలుగువంతుల పశువులు మరణించాయి. జనాభా కూడా పలచబడింది. దుర్భిక్ష సమయములో ప్రజలనాదుకొనుటకు, కరువు కాటకములు పునరావృత్తం కాకుండా చూచుటకు కంపెనీ ప్రభుత్వం తీసుకొన్న చర్యలు తగినంతగా లేకపోవుటవలన ఆంధ్రులు తరచుగా అట్టి పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది.

గంజాం జిల్లాలో 1799-1801, 1836-39, 1865-66 లలో కరువులు సంభవించి అపారమైన నష్టాన్ని కలిగించాయి.

## 9.6 ఆంగ్ల విద్యా వ్యాప్తి :

ఆంగ్లపాలన మొదలవ్వగానే వారికి చిన్న చిన్న ప్రభుత్వోద్యోగములలో పనిచేయుటకు స్థానికుల అవసరమేర్పడింది. అందువలన వారు మొదట 1813 చట్టము ప్రకారము మద్రాసు ప్రెసిడెన్సీకి ఒక లక్ష రూపాయలు విద్యావ్యాప్తికి కేటాయించారు. అటుపిమ్మట మన్రో మద్రాసు గవర్నరైన తర్వాత 40 కలక్టరేట్ స్కూల్స్, 300 ల తహసీల్‌దార్ స్కూళ్ళను స్థాపించారు. అందులో ఆంధ్రలో కొన్ని ప్రభుత్వ, మరికొన్ని మిషనరీ పాఠశాలలను స్థాపించారు. వాటిలో ముఖ్యమైనవి 1?'3 లో రాబర్ట్ నోబుల్ చర్చి మిషనరీ సొసైటీ పాఠశాల మచిలీపట్నం, 1845 లో నేటివ్ స్కూలు మచిలీపట్నం, జార్జి నోబుల్ టైలర్ స్కూలు నర్సాపురం, విజయనగరంలో మహా రాజ స్కూల్ 1857 మిడిల్ స్కూల్, 1853 రాజమండ్రి జిల్లా పాఠశాల, 1853 మిడిల్ స్కూల్ కాకినాడ (తర్వాత పి.ఆర్. కళాశాల) మచిలీపట్నంలో మిందా ఆంగ్లో వెర్నాక్యూలర్ పాఠశాల 1, జనవరి 1856 తర్వాత లూథరన్ మల్టీపర్పస్ పాఠశాల (L.M.P) 184?, స్టాల్ బాలికల పాఠశాల, గుంటూరు, రేట్ పాఠశాలలు గోదావరి జిల్లాల్లో ముఖ్యమైనవి. ఈ విధంగా ఆంధ్రాలోని అనేక ప్రాంతాలలో పాఠశాలలు స్థాపించి విద్యాభివృద్ధికి దోహదం చేసారు. అటుపిమ్మట సంస్థానాలలో అనేక విద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఆంధ్రదేశములో సార్వభౌముని పాలనలో పెక్కు విద్యాసంస్థలు నెలకొల్పబడినాయి. 1857 లో మద్రాసు విశ్వవిద్యాలయము, 1864 లో బందరులో నోబుల్ కళాశాల, 1866 లో గుంటూరులో

ఆంధ్ర క్రైస్తవ కళాశాల, 1877 లో రాజమండ్రిలో ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల, 1878 లో విశాఖ పట్నమున హిందూ కళాశాల, 1879 లో కళ్ళికోట కళాశాల మొదలగు విద్యాసంస్థలు నెలకొల్పబడ్డాయి. ఈ విద్యాసంస్థల ద్వారా ఆంధ్రులు ఆంగ్లభాషను నేర్చుకొని, పాశ్చాత్య సాంఘీక శాస్త్రములనభ్యసించారు. ఈ అభ్యాసముతో వారు బర్క్‌మిల్, మెకాలే, మున్నగు వారి భావములకు, ప్రజాస్వామ్య విప్లవములైన ఇంగ్లాండ్, ఫ్రెంచి విప్లవములు, అమెరికా స్వాతంత్ర్య యుద్ధములు, వాని ప్రభావములకు ప్రజాస్వామ్య విప్లవములైన ఇంగ్లాండ్, ఫ్రెంచి విప్లవములు, అమెరికా స్వాతంత్ర్య యుద్ధములు, వాని ప్రభావములకు లోనైరి. ఇట్టి స్వేచ్ఛా, స్వాతంత్ర్య భావములతో చైతన్యులైన ఆంధ్రులు తమ కష్టనిష్ఠురములను తొలగించుకొనుటకు, రాజకీయ సంఘములు స్థాపించి, సమావేశములు జరిపి, తద్వారా ప్రభుత్వమునకు విజ్ఞాపన పత్రములు సమర్పించి లాభములను పొందుటకు ప్రయత్నం చేశారు. చాలామంది ఆంధ్ర నాయకులు ఆంగ్లభాషనభ్యసించినవారే కాబట్టి ప్రభుత్వ పరిపాలనా, దానిలోని మంచి చెడులను గ్రహించగల్గారు. ఆ పైన ప్రభుత్వ విధానాలను విమర్శించుటకు వారు వెనుకాడలేదు.

## 9.7 పునరుజ్జీవనోద్యమము :

భారతదేశమున వ్యక్తి జీవితమంతయు కులాచార సంప్రదాయ భావనల పరిధిలో ఇమిడి ఉండేది. భారతీయ సంస్కృతి చాలావరకు, మతాన్ని ఆశ్రయించింది. సంఘసంస్కరణ ఉద్యమ ఫలితంగా ఈ పరిస్థితి మారింది. క్రొత్తగా ఒక మేధావి వర్గం రూపొంది, తమ ఆచారాలను పునఃపరిశీలన చేయసాగింది. బ్రిటిష్ అధికారుల, మిషనరీల విమర్శల దృక్పథంనుంచి తమ అలవాట్లను పరిశీలించి, అమానుషమైనవాటిని విడువసాగారు. వ్యక్తిత్వవాదం, మానవతావాదం, హేతువాదం ప్రబలి, వారు పాటించే ఆచారాలకు శాస్త్ర మద్దతు ఉందో, లేదో పరిశీలించారు. లేదని తెల్సుకొని, అమానుష ఆచారాలకు స్వస్తి పలికారు.

భారతదేశంలో ఇట్టి నూత్నమేధావి వర్గం సాంఘీక నాయకత్వాన్ని వహించుటనే, పునరుజ్జీవనోద్యమం అని వ్యవహరించారు. భారతదేశంలో బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన విద్యావిధానం లౌకిక స్వభావం కలది. ఉదార భావాలను అది ఎక్కువగా ప్రోత్సహించింది. ఈ విధంగా బ్రిటీష్‌వారి ప్రజాస్వామ్య మూల సిద్ధాంతాలతో గాఢ పరిచయం సంపాదించిన విద్యావంతుడగు భారతీయుడు తన దేశాన్ని లోగొన్న సనాతన సామాజిక వ్యవస్థలపై తిరుగుబాటు చేయుటకు కుతూహలపడ్డాడు. సంప్రదాయం పేరిట, కులాచారం పేరిట వ్యక్తిని అణచివేయుచున్న నిరంకుశపు సామాజిక భావనల్ని, వర్ణ వ్యవస్థను ఎదుర్కొని పోరాడవలసిన ఆవశ్యకత అతను స్పష్టంగా తెలుసుకొన్నాడు.

అయితే ఇందు గమనీయమగు ఒక విశిష్ట లక్షణం మాత్రం వారిలో కనబడింది. వారు సమాజాన్ని సంస్కరించవలెనని ఆశించి కృషి చేసినా, పారంపర్యంగా తమకు లభించిన సాంస్కృతికపు వారసత్వాన్ని వదలుకొనదలచిన వారు కారు. ఇట్టి నూతన మేధావి వర్గం తొలుత బెంగాలులో వెలసింది. హిందూ సంఘాన్ని సంస్కరించుటకై 'బ్రహ్మసమాజ' ఉద్యమాన్ని రాజారామమోహనరాయ్ (1744-1833) బయలుదేరుట, ఇది ప్రారంభదశగ చెప్పారు. అజేయమగు గత కాలమునుండి అనూహ్యమగు భవిషత్తులోకి పయనించు భారతదేశానికి ఒక సజీవపు వంతెన అని భారతదేశ చరిత్రలో వర్ణితుడైన మహనీయుడు రాజారామమోహనరాయ్. ఇటువంటి కృషిని తర్వాత దేశంలో తక్కిన ప్రాంతాలవారు, అందును ముఖ్యంగా మహారాష్ట్ర ప్రాంతపువారు కొనసాగించారు. మహాదేవ గోవిందరేనడే 1867 లో ప్రార్థన సమాజాన్ని స్థాపించాడు. ఆయనయే 1849 లో దళిత వర్గాల సమ్మేళనము (డిప్రెస్‌డ్ క్లాసెస్ లీగ్) ను, పంఢర్‌పూరులో ఒక వితంతు శరణాలయాన్ని, అనాథ శిశు నిలయాన్ని ఏర్పరచాడు.

భావ సంచలనపు ప్రతిఫలాలే బ్రహ్మ సమాజము, ప్రార్థన సమాజాలు అయితే, ఈ కోవకు చెందక కొంతవరకు భారత గత చరిత్రనుంచి భావ స్ఫూర్తిని గ్రహించిన రెండు సంస్కరణోద్యమాలు కూడా 19 వ శతాబ్దంలో వ్యాప్తికి వచ్చాయి. దేశీయ ప్రాచీన మత గ్రంథాలనుండి ఆ ఉద్యమాలు తమ ప్రాతిపదిక సూత్రాలను గ్రహించాయి. అవి యేవనగా, 1875 లో స్వామి దయానంద సరస్వతి వల్ల ఆరంభమైన ఆర్యసమాజం, రెండవది రామకృష్ణ మఠం. ఇది ప్రాచ్య, పాశ్చాత్య మత భావనల మేలి కలయిక, స్వామి వివేకానందుని అలౌకిక మూర్తిమత్వము వలనను, అతని బోధనల వలనను విశ్వవిఖ్యాతి నార్జించింది. భారతీయులకు వీనితో పాటుగ, నైతిక బలాన్ని విరివిగా చేకూర్చకల్గిన వేరొక మత సంస్కరణోద్యమం దివ్యజ్ఞాన సమాజం. వర్ణ వ్యవస్థకు, సర్వమానవ సౌభ్రాతృత్వంతో సామరస్యాన్ని సాధించు మార్గాన్ని హిందువులకు ఇది విశదం చేసి, హిందువులు అర్చించు అసంఖ్యాక దేవీ దేవతల యందిమిడియున్న ఏకైక పరతత్త్వ భావనను అది స్పష్టం చేసింది. ఈ సంఘ సంస్కరణోద్యమాలు అన్నియు హిందూమత పునరుజ్జీవనానికి దోహదం కల్పించి, భారత

జాతీయోద్యమం రూపొందుటకు తోడ్పడ్డాయి. ఈ సమాజముల ప్రభావం ఆంధ్ర దేశంపై కూడా ప్రసరించి ఆంధ్రులనుత్తేజితులను చేసింది. ఉదా॥ 'సత్యదూత' అను క్రైస్తవమత ప్రచార పత్రిక సాగించు రచనలను, 1864 లో మద్రాసు వేద సమాజము స్థాపించిన "తత్వబోధిని" తీవ్రంగా ప్రతిఘటించింది. అటులనే శ్రీ కందుకూరి వీరేశలింగంగారు 1876 లో "వివేకవర్ధిని" 1883 లో "సతీహితబోధిని" ' మొదలగు పత్రికల ద్వారా ఆంధ్ర సాంస్కృతిక పునరుజ్జీవమునకు ముఖ్య కారకుడయ్యాడు.

## 9.8 ప్రజాభిప్రాయం :

ఆంగ్ల విద్యావిధానము వలన ప్రభావితులై రాజకీయ, సాంస్కృతిక సంఘముల నెలకొల్పుటద్వారా తమ ఇక్కట్లు తొలగించుటయే మార్గమని ఆంధ్రప్రజలు గ్రహించారు. ఇదే సమయాన కొన్ని ప్రముఖ సంస్థలు వెలిసాయి. వాటిలో ముఖ్యమైనవి - మద్రాసు నేటివ్ అసోసియేషన్ (1852). దీనిని గాజుల లక్ష్మీనరసు శెట్టి స్థాపించి, ప్రజల ఇక్కట్లను 1852-61 మధ్యలో మూడు మహజర్ల రూపాన తెలియజేసాడు. వారసత్వ చట్టాన్ని గురించి, మిషన్ పాఠశాలల గురించి గ్రామపద్ధతి ద్వారా భూమిశిస్తు వసూలు చేయమని తెలిపాడు. మొతాదు పన్నుకు వ్యతిరేకత తెలిపాడు. మదరాసు మహాజన సభ (1884), కాకినాడ లిటరరీ అసోసియేషన్ మొదలగు సంస్థలు ఏర్పడ్డాయి. గాజుల లక్ష్మీనరసు శెట్టి ది క్రసెంట్ అను ఆంగ్ల భాషా పత్రికను నడిపాడు. వీనిద్వారా ప్రజాభిప్రాయం వ్యక్తమయ్యేది.

1885 లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత క్రమంగా ఆంధ్రలో జిల్లా అసోసియేషనులు ఏర్పడ్డాయి. అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో 21 జిల్లాలుండేవి. అన్నింటిలోను మొదటిసారిగా జిల్లా అసోసియేషన్ కృష్ణా జిల్లాలో ఏర్పడింది (1891).

## 9.9 వార్తా పత్రికలు :

ఆంధ్రులను జాగృతపర్చుటలో వార్తా పత్రికలు గణనీయమైన పాత్ర వహించాయి. 1905 నాటికి ఆంధ్రదేశమున దాదాపు ఇరువది వార్తా పత్రికలుండుట విశేషము. ఇట్టి వార్తా పత్రికలలో ముఖ్యమైనవి : 1885 లో ఎ.సి. పార్థసారధి నాయుడు సంపాదకుడుగా వెలువడిన "ఆంధ్ర ప్రకాశిక", గాజుల లక్ష్మీ నరసుచెట్టి "ది క్రసెంట్" అను ఆంగ్ల వార పత్రిక, పురుషార్థ ప్రదాయనీ, దిన వర్తమాని, లోకరంజని, శశిరేఖ, గౌతమి, వార్తాలహరి, దేశాభిమాని, సుజన మనోల్లాసిని మొదలైనవి. ఇవిగాక 1902 లో శ్రీ కొండా వెంకటప్పయ్యగారు స్థాపించిన "కృష్ణా పత్రిక" మొదలైనవి. ఈ పత్రికలు మిషనరీల దుష్ప్రచారమును, ఆంగ్లాధికారుల దురాగతములను, ఆంగ్లపాలనలోని లోపములను విశదీకరించుచు, ప్రజాభిప్రాయమును ప్రస్ఫుటింప చేశాయి. ఈ పత్రికల సంపాదకులు వ్రాసిన సంపాదకీయాలు, రచనలు విచక్షణతో కూడియుండుటచేత, ఉత్తేజకరముగా నుండుటచేత ఆంధ్రులలో రాజకీయ చైతన్యము వృద్ధి చెందుటకు ఎంతగానో తోడ్పడ్డాయి. ఆంధ్రపత్రిక కాశీనాధుని నాగేశ్వరరావుగారిచే ఆరంభింపబడి, ఆంధ్ర ప్రజాభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేసేది. ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక రెండుకళ్లవలె ఆంధ్రదేశాన్ని ప్రభావితం చేశాయి.

## 9.10 జాతీయ కాంగ్రెసు స్థాపన 1885 :

మద్రాసు మహాజనసభ, "ఇండియన్ అసోసియేషన్" "బాంబే అసోసియేషన్" అను ప్రాంతీయ సంఘముల ఆవిర్భావమే 1885 లో ఎ.ఓ. హ్యూమ్ నాయకత్వమున "జాతీయ కాంగ్రెస్" అను సంస్థ ఏర్పడుటకు దోహదం చేశాయి. భారతీయులలో రగులుతున్న అగ్నిని చల్లార్చుటకు విద్యాధికులగు భారతీయులలో ఒక సంస్థ నెలకొల్పుట ఉత్తమమనీ హ్యూమ్ భావించాడు. తత్ఫలితమే జాతీయ కాంగ్రెసు ఆవిర్భావము. బొంబాయిలో ఉమేష్ చంద్ర బెనర్జీ అధ్యక్షతన జరిగిన ప్రథమ జాతీయ కాంగ్రెస్ (1885) సమావేశమునకు ఆంధ్ర ప్రాంతమునుండి, బరంపురం, మచిలీపట్నము, కడప, బళ్ళారి, అనంతపురము మొదలగు పట్టణాలనుండి, చాలామంది ప్రతినిధులు హాజరైనారు. అట్టివారిలో ముఖ్యులు - 'మద్రాసు మహాజన సభ' అధ్యక్షుడైన పి. రంగయ్య నాయుడు, కార్యదర్శియైన పి. ఆనందాచార్లు, యస్.యన్ నరసింహులు నాయుడు, గుత్తి కేశవపిళ్ళె, యస్.వి.జి. పంతులు, యస్. వెంకట సుబ్బారాయుడు మొదలగువారు. నాటినుండి జరుగు ప్రతి జాతీయ కాంగ్రెసు సమావేశమునకు ఆంధ్రులు అధికసంఖ్యలో హాజరగుటయేగాక అందు చురుకుగా పాల్గొన్నారు. 1891 లో నాగపూరు కాంగ్రెసు సభకు పి. ఆనందాచార్లు అధ్యక్షత వహించారు. "దేశ సమైక్యతను గూర్చి ప్రజల కష్టములను నివృత్తి చేయుటకు ప్రభుత్వము చూపవలసిన శ్రద్ధను గూర్చి" గంభీరోపన్యాసము నిచ్చుట ఆంధ్రులకు గర్వకారణము. ఇట్లు జాతీయ కాంగ్రెసు కార్యకలాపములలో ఆంధ్రులు గణనీయమైన పాత్ర వహించారు.

## 9.11 జిల్లా సంఘాల ఆవిర్భావము :

జాతీయ కాంగ్రెసులో హాజరైన నాయకులు తమ తమ ప్రాంతాలకు చేరుకొని, వారుకూడా తమ ప్రాంతాలలో జిల్లా సంఘాలను స్థాపించాలని నిర్ణయించారు. ఇట్టి వానిలో ప్రప్రథమమైనది 1891 లో ఏర్పడిన కృష్ణాజిల్లా సంఘము. ఈ సంఘము 1892 లో గుంటూరునందు, 1893 లో మచిలీపట్నమునందు, 1894 లో ఏలూరునందు సమావేశమై అనేక స్థానిక సమస్యలను చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసికొచ్చారు. "నీటి తీరువ" పన్ను హెచ్చించినందుకు నిరసనగా కృష్ణాజిల్లా సంఘము 1894 లో ఏలూరు సమావేశమున హెచ్చించిన పన్ను తగ్గించనిదే భూములను సాగుచేయమని హెచ్చరించాయి. ఇట్టి జిల్లా సంఘములే క్రమ క్రమముగా మిగిలిన జిల్లాలందునూ స్థాపించబడినాయి. వీనిలో ప్రధానమైనవి గోదావరీ, గంజాం సంస్థలు. వీని మూలముగా రాజకీయముల పట్ల ప్రజలకు ఆసక్తి పెరిగింది. గోదావరి జిల్లా సంఘములో చిలకమర్తి లక్ష్మీ నరసింహారావుగారు 1895 లో కాకినాడలో జరిగిన సభలో తన 14 పద్యాల ద్వారా రైతుల కష్టాలను వివరించారు. ఇంతేకాదు చిలకమర్తిగారు వరుస గోదావరీ మండల సభలలో 1896 రాజమండ్రిలో, 1897 ఏలూరులో, 1898 లో పసలపూడిలో పాల్గొన్నారు. అటుతర్వాత 1913 లో కాకినాడలో, 1914 లో రాజమండ్రిలో, 1919 లో పిఠాపురంలో జరిగిన సభలలో పాల్గొని జాతీయ భావాలను ప్రజలలో రగిలించారు.

## 9.12 సాహిత్య ప్రభావం :

జాతీయోద్యమము విస్తరించడానికి సాహిత్యం ప్రధాన కారణమయింది. దేశభక్తి పూరితమయిన పద్యాలు, పాటలు, రచనలు, గ్రంథాలు ప్రజలను సమ్మోహితులను చేసి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చేశాయి.

**చిలకమర్తి లక్ష్మీనరసింహం 26 సెప్టెంబరు 1867, 17 జూన్ 1946 :** కళాప్రపూర్ణ శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు తణుకు **తాలూకా ఖండవల్లి గ్రామములో 1867 లో** జన్మించారు. వీరి దేశభక్తి, సంఘసంస్కరణ, విద్యారంగంలో చేసిన కృషి ఎంతో విలువైంది. చిలకమర్తి దేశభక్తి రచనలద్వారా ఆనాటి యువతరం ఎంతో ప్రభావితమైంది.

భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగయకట్టి

నాడు ఈ పద్యాన్ని వినని, పాడని ఆంధ్రుడెవడూ ఉండడు. 1921 మహాత్మాగాంధీ నాయకత్వాన మన దేశంలో సాగిన సహాయ నిరాకరణోద్యమంలో ఈ పద్యం బ్రహ్మాండమైన ప్రాశస్త్యాని పొందింది. ఎందరో యువకులు మహాత్ముని ఆదేశానుసారం ఇంగ్లీషు భాషను బోధించే విద్యాలయాలనుంచి బయటికొచ్చి పై పద్యాన్ని పాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు.

గురజాడ అప్పారావు 1861-1915 : దేశభక్తునిగా, ప్రజాకవిగా, భావకవిగా, సంస్కర్తగా, విమర్శకుడుగా, పరిశోధకుడుగా, భాషావేత్తగా, నాటకకర్తగా, తెలుగుసాహిత్యమున నూతన ఒరవడులు సృష్టించి, తెలుగు జాతిని జాగృతమొనర్చిన ఆధునిక కవి శ్రీ గురజాడ వెంకట అప్పారావు, దేశభక్తిని ప్రేరేపించిన కవి. 1887 సంవత్సరమునందే కాంగ్రెసు మహా సభలకు హాజరై ఉపన్యాసములిచ్చాడు. వందేమాతరం ఉద్యమము వలన ప్రేరితులై 1910 లో ముత్యాల సరాలు రచించాడు. అందులో ముఖ్యమైంది.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టవోయ్
గట్టిమేలు తలపెట్టవోయ్"

"సొంతలాభం కొంతమానుకు

పొరుగువాడికి తోడు పడవోయ్

దేశమంటే మట్టికాదోయ్

దేశమంటే మనుషులోయ్"

అని తెలుగు జాతిని మేలుకొలిపి, అందు దేశభక్తిని, సేవానిరతిని రేకెత్తించాడు. కనుకనే "ఈ గీతం సమస్త ప్రపంచ మహా కవు జాతీయగీతం" అని శ్రీ శ్రీ శ్లాఘించారు.

## 9.13 ఆంధ్రలో సాగిన జాతీయోద్యమము :

పైన పేర్కొనబడిన విధంగా అనేక జిల్లా సంఘాలు ఏర్పడిన తర్వాత ప్రజలలో నవ చైతన్యము మొదలైంది. 1905-1911 సంవత్సరాల మధ్య కాలమున ఆంధ్రలో సాగిన జాతీయోద్యమమునందు కనపడు ప్రముఖ అంశాలు : వందేమాతర ఉద్యమము, స్వదేశీ ఉద్యమము, 1905 లో కర్జన్ బెంగాలు విభజనకు వ్యతిరేకముగా ప్రారంభమైన రాజకీయ ఉద్యమము - వందేమాతరం ఉద్యమము. ఆంగ్లేయుల ఆర్థిక పీడనా విధానం వలన దెబ్బతినిన స్వదేశీ పరిశ్రమల పునరుద్ధరణకు సాగిన ఆర్థిక పరమైన ఉద్యమము - స్వదేశీ ఉద్యమము. మితవాదుల సుదీర్ఘ విజ్ఞాపనల కాలములో ఆశించిన సంస్కరణలు సాధింపలేకపోవుట, రష్యాపై జపాను విజయము, మధ్య తరగతి విజృంభణ, బెంగాలు విభజన, నాయకత్రయమైన తిలక్, లజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ బోధనలు, ప్రచారము వలన జాతీయోద్యమమున అతివాద జాతీయతాయుగము జనించింది. క్రమముగా వృద్ధిచెందు అతివాద జాతీయతా భావములు ఆంధ్రులను సైతము ప్రభావితము చేశాయి. ఆదిపూడి సోమనాథరావు తెలుగులో జపాన్ చరిత్ర వ్రాసి మునగాల రాజాకు అంకితమిచ్చాడు. మునగాల రాజా తన కుమారులకు జపాన్ సైన్యాధికారైన 'టోగో', నౌకాధిపతియైన 'నోగి' పేర్లు పెట్టాడు. బందరు వాస్తవ్యుడైన శ్రీరామ వీరబ్రహ్మం 'జపానీయము' అను నాటకము రచించాడు. కర్జను సంస్కరణలు ముఖ్యముగా 1905 లో బెంగాలు విభజన తమ దేశ సమైక్యతకు గొడ్డలి పెట్టుగా భావించి వారు దానిని ప్రతిఘటించారు. 1906 లో కలకత్తా జాతీయ కాంగ్రెసునందు, దాదాబాయి నౌరోజి అధ్యక్షుడు. బెంగాలు విభజనను ప్రతిఘటించుచూ బంకిమ్ వ్రాసిన "వందేమాతరం" జాతీయ గీతముగా ఆమోదింపబడింది. తదనుగుణముగా జనించిన రాజకీయ ఉద్యమము వందేమాతరం ఉద్యమముగా పేర్కొనబడింది. ఈ సమావేశమునాటికే జాతీయ కాంగ్రెసు అతివాద, మితవాద పక్షములుగా ఏర్పడింది. ఈ సమావేశమునకు ఆంధ్ర నాయకులైన మునగాల రాజా, కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, సి. ఆనందాచార్లు హాజరై అతివాద పక్షమున చేరారు. ఈ సమావేశమున ఆనందాచార్లు "స్వదేశీ" తీర్మానమును ప్రవేశపెట్టారు. ఇట్లు ఈ సమావేశముననే వందేమాతరం ఉద్యమముతోబాటు, స్వదేశీ ఉద్యమము కూడా జనించింది. 1907 సూరత్ సమావేశమున జాతీయ కాంగ్రెసు మితవాద, అతివాద పక్షములుగా చీలాయి.

## 9.14 స్వదేశీవాదం - జాతీయ విద్యాసంస్థలు :

1906 నుండి 1910 వరకు రాజకీయ ఉద్యమంతోబాటు స్వదేశీ, జాతీయ విద్య అనేవి కూడా ప్రముఖ పాత్ర వహించాయి. ఈ ఉద్యమంలో, రాజమండ్రి కరణం సత్యవోలు గున్నేశ్వరరావు, అతనితోపాటు గంటి లక్ష్మణ్, భీమశంకరం, టంగుటూరి శ్రీరాములు, కంచుమర్తి రామచంద్రరావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలైనవారు రాత్రి పాఠశాలల్ని నడపటానికి, విద్యార్థి సంఘాన్ని ఏర్పాటు చేయడానికి, జాతీయ విద్యాలయాల స్థాపనకు ఎంతో సహాయపడ్డారు. కృత్తివెంటి పేర్రాజు ఆనాడు 40 వేల రూపాయల విలువచేసే భూమిని రామచంద్రపురంలో జాతీయోన్నత పాఠశాల స్థాపించడానికి విరాళం ఇచ్చాడు. న్యాపతి సుబ్బారావు రాజమండ్రిలో ఒక జాతీయ పాఠశాలను స్థాపించాడు. మార్చి 27, 1910 న మచిలీపట్నంలో కొండా వెంకటప్పయ్య అధ్యక్షతన జాతీయ కళాశాల ఏర్పాటైంది. ఈ కళాశాల ఏర్పాటులో చల్లపల్లి రాజా దివాను కుమారుడు కోపెల్లె హనుమంతరావు కృషి గణనీయం. అలాగే గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వల్లూరి సూర్యనారాయణ, ముట్నూరి కృష్ణారావు, కౌతా శ్రీ రామశాస్త్రి, భోగరాజు పట్టాభి సీతారామయ్యల కృషి చెప్పుకోదగ్గది. వీరంతా స్వదేశీ పారిశ్రామిక ప్రావిడెంట్ ఫండ్ అనేది వసూలు చేసి పరిశ్రమలు నెలకొల్పడానికి సహాయపడ్డారు.

## 9.15 జాతీయ నాయకుల పర్యటనలు : బిపిన్ చంద్రపాల్ :

బిపిన్ చంద్రపాల్ గొప్పవక్త, మేధావి, బ్రహ్మసమాజి, అతివాద నాయక త్రయములోనొకడు. ఆంధ్రలో బీజరూపమునున్న వందేమాతరము ఉద్యమమును బలవత్తరము చేసింది ఏప్రియల్ 1907 లో ఆయన ఆంధ్ర పర్యటన. బిపిన్ చంద్రపాల్ పర్యటనను ఏర్పాటు చేసింది ముట్నూరు కృష్ణారావు. స్వదేశీ, స్వరాజ్ జాతీయ విద్యల ప్రాముఖ్యాన్ని అతడు తెలియజేసాడు. బిపిన్ చంద్రపాల్ తన పర్యటనను విజయనగరము, విశాఖపట్నములలో ప్రారంభించాడు. ఈ పట్టణములలో మితవాదులు ఎక్కువగానుండుటచే ఆయన ఉపన్యాసముల ప్రభావము అంతగా కన్పడలేదు. 17 ఏప్రిల్ 1907 లో, కాకినాడలో 'వేదాంతముపై, స్వదేశీ' పై రెండు ఉపన్యాసములిచ్చాడు. తదుపరి 19-24 ఏప్రిల్‌లో ఐదు ఉపన్యాసములిచ్చారు. బాలభారతి సమితి సభ్యులు పాల్‌కు ఘనస్వాగతమిచ్చుటయేగాక, ఆయన ఉపన్యాసమును తు.చ. తప్పక పాటించారు. ఆయన ఉపన్యాసాలను సుప్రసిద్ధ తెలుగుకవి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగులో అనువదించారు. ఈ ఉపన్యాసములలో స్వరాజ్య, స్వదేశీ, విదేశీ వస్తు బహిష్కరణ, బ్రహ్మసమాజ్, వందేమాతరం మొదలైనవానిపై కూలంకషముగా పాల్ చర్చించాడు. ఇట్లు బిపిన్ చంద్రపాల్ పర్యటన వలన ఆంధ్రులలో నూతన చైతన్యము కల్గి, స్వరాజ్య, స్వదేశీ ఉద్యమములు వారినాకర్షించి వారిలో రాజకీయ పరిజ్ఞానమును వృద్ధి చేశాయి. ఆయన పర్యటన విజయవంతమైనటానికి నిదర్శనములు నాడు జరిగిన నాల్గు సంఘటనలే - అవి - రాజమండ్రి కళాశాల సంఘటన, కాకినాడ కొట్లాటలు, కోటప్పకొండ సంఘటన, తెనాలి బాంబుకేసు.

హోంరూల్ ఉద్యమమును ఆంధ్రలో ప్రచారము చేసింది ఐరిష్ స్త్రీయైన అనిబిసెంట్. 1916 లో ఆంధ్ర దేశమున పర్యటించి కాకినాడ, రాజమండ్రి, చిత్తూరు మొదలైన సభలలో తన గంభీర ఉపన్యాసములతో ప్రజలను ఉర్రూతలూగించింది. తన ఉపన్యాసములలో ఆమె, ఆత్మగౌరవము గల ఏ వ్యక్తి తన మాతృదేశములోనే పరాయివాడుగా ఉన్నత పదవులను పొందకుండా యుండడని, మాతృదేశమును దాస్యశృంఖలములనుండి విముక్తి చేయుటలో ఉదాసీనత వహించినచో భావితరములవారు మనలను "దేశద్రోహుల"ని దూషిస్తారని, మాతృదేశ సేవయే మాధవసేవయని వక్కాణించి ఆంధ్రులలో జాతీయ చైతన్యమును, ఆత్మగౌరవమును ద్విగుణీకృతం చేసింది. యువకులను సంఘటితశక్తిగా రూపొందించుటకు ఆమె "యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్" మాదిరిగా యంగ్‌మెన్స్ ఇండియన్ అసోసియేషన్ అను సంస్థను స్థాపించింది. జాతీయ విద్యను, ఇతర సేవా సంస్థలను ప్రోత్సహించింది. హోంరూల్ ఆవశ్యకతను తెలియజేసింది. ఐరిష్ వనిత భారతీయ సంస్కృతిని గురించి ఉన్నతమైన ఉపన్యాసాలనివ్వడంతో ఆంధ్రులు పెద్దఎత్తున ఆకర్షితులయినారు. తన విద్యాపథకములో అంతర్భాగముగా ఆమె మే 1916 లో మదనపల్లిలో జాతీయ కళాశాలను స్థాపించింది. ఇదియే నేటి మదనపల్లిలోని అనిబిసెంట్ థియోసాఫికల్ కళాశాల. ఇట్లు నిర్విరామకృషి వలన మరల ఆంధ్రలో వందేమాతరం ఉద్యమము నాటి రాజకీయ వాతావరణమును పునారావృతముచేసింది.

ఆంధ్ర జాతీయోద్యమ చరిత్రలో విజయవాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం మహోజ్వలమైంది. 3, మార్చి 1 ఏప్రిల్ 1921 వ సంవత్సరంలో ఇది విజయవాడలో జరిగింది. ఈ సమావేశమునకు జాతీయ నాయకులైన గాంధీజీ, కస్తూరిబాయి, వల్లభాయి పటేలు, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, ఆలీ సోదరులు, లజపతి రాయ్, చిత్తరంజన్ దాస్, పురుషోత్తమ దాసు టాండన్ మొదలగువారు హాజరైనారు. సహాయ నిరాకరణోద్యమము పనిచేయు తీరు తెన్నులను పరిశీలించుటకై ఈ సమావేశ ఏర్పాటైంది. ఈ స్థలమే నేడు "గాంధీనగర్" గా పిలువబడుచున్నది. ఈ సమావేశమున ప్రముఖ ఆంధ్రనాయకులందరు పాల్గొన్నారు. వారిలో ముఖ్యులు, టంగుటూరి ప్రకాశం, కొండా వెంకటప్పయ్య, బులుసు సాంబమూర్తి పట్టాభి శీతారామయ్య, రాజాజీ, కె. సంతానం మొదలైనవారు. తెలంగాణనుండి శ్రీ మాడపాటి హనుమంతరావు పరిశీలకుడుగా వచ్చాడు. సరియగు రవాణా సౌకర్యములు లేకపోయినను అనేక కష్టములనోర్చి నాయకులను చూచుటకు, వారి ప్రసంగాలను వినడానికి ఆంధ్ర నలుమూలలనుండి సుమారు రెండు లక్షలమంది ప్రజలు ఈ సమావేశానికి హాజరైనారు.

ఈ సమావేశానంతరము గాంధీజీ, శ్రీ కొండా వెంకటప్పయ్యతో ఆంధ్రదేశములోని కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నము, గుంటూరు, వేటపాలెం, బాపట్ల, చీరాల, నెల్లూరులలో పర్యటించినారు. సహాయ నిరాకరణోద్యమమునకు ప్రజలను సంసిద్ధము

చేయుటయేగాక, "తిలక్ స్వరాజ్యనిధికి" విరాళములను సేకరించారు. మానికొండ సత్యనారాయణశాస్త్రి, కామినేని వెంకటప్పయ్య మొదలైనవారు కళాశాలలను బహిష్కరించి ఉద్యమంలోకి వచ్చారు.

ఇట్లు విజయవాడ సమావేశము గాంధీజీ పర్యటన ఆంధ్రులలో నూతన చైతన్యము కల్గించింది. దేశభక్తి ప్రేరితులై ప్రజలు సామూహిక పాటలు పాడుట, హరికథలు, భజనలు, సంకీర్తనలు చేయుట మొదలుపెట్టారు. తుదకు సన్యాసులు సైతము దేశభక్తి గేయములు పాడుటయే విశేషము. ఇట్టివారిలో కాకినాడకు చెందిన "అయ్యప్ప భాగవతార్" అనునతని ప్రభుత్వము అరెస్టు చేసింది. అట్లానే 1921 ఫిబ్రవరిలో మహోదయ ఉత్సవ సందర్భమున అగస్టు 1921 లో వచ్చిన కృష్ణా పుష్కరముల సందర్భమున తిలక్, గాంధీజీ జన్మదినోత్సవముల సందర్భమున స్వరాజ్యసాధనయే లక్ష్యముగా ప్రచారము సాగించారు.

### 9.16 సమీక్ష :

భారతదేశంలోని ఇతర ప్రాంతములవలనే ఆంధ్రాలో కూడా జాతీయతాభావం వృద్ధిగాంచింది. స్వరాజ్, స్వదేశి నినాదాలతో ఆరంభమైన జాతీయతాభావం సంపూర్ణ స్వరాజ్ వరకు కొనసాగింది. వందేమాతరం ఉద్యమంనుంచి క్విట్ ఇండియా ఉద్యమం వరకు సాగిన స్వాతంత్రోద్యమములో ఆంధ్రుల పాత్ర ప్రముఖమైంది. నిర్మాణ కార్యక్రమాలలోనూ, రాజకీయ పోరాటాలలోను ఆంధ్రులు తమ ప్రతిభను చాటారు.

### 9.17 వ్యాసరూప ప్రశ్నలు

1. జాతీయోద్యమమునకు దారితీసిన పరిస్థితులేవి ?
2. ఆంధ్రలో జాతీయోద్యమానికి బ్రిటిష్ ప్రభుత్వ విధానాలు ఎంతవరకు కారణం ?

**Reference Books :**


1. Prof : M. Venkata Rangaiha : The Freedom Struggle in Andhra Pradesh - Vol I & II & III
2. Dr. Sarojini Regani : Highlights of the Freedom Movement in Andhra Pradesh.
3. Andhra Pradesh State Archives : Adhunika Andhradesa Charitra
4. Telugu Academy : Andhrula Charitra (Part I & II)
5. P. Raghunatha Rao : History of Modern Andhra Pradesh
6. Telugu Academy : Andhralo Swathanthraodyama Charitra
7. State Archies : The Freedom Struggle in Hyderabad Vol III (1885 -1920)
8. State Archives : Brief History of Andhra Pradesh
9. Chilkamarthy Foundation : Tribute to Chilakamarthy Lakshmi Narasimham

పాఠం : 10

# వందేమాతరం - హోమ్‌రూల్ ఉద్యమాలు.

విషయ క్రమం


10.1 లక్ష్యం

10.2 పరిచయము

3. వందేమాతరం ఉద్యమము జనించటకు కారణాలు
4. ఆంధ్రలో వందేమాతరం - మద్రాసు బీచ్ సమావేశం - సెప్టెంబరు 1905
5. వందేమాతరం జాతీయ గీతంగా ఆలపించుట
6. బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర పర్యటన - ఏప్రిల్ 1907
7. రాజమండ్రి కళాశాల సంఘటన 1907
8. కాకినాడ కొట్లాటలు
9. కోటప్పకొండ సంఘటన
10. తెనాలిబాంబు కేసు - 6 ఏప్రిల్ 1909.

10.2.1 హోమ్ రూల్ ఉద్యమము

2. ఆంధ్రలో అనిబిసెంట్ పర్యటన
3. హోమ్‌రూల్ లీగ్‌ల స్థాపన
4. ఆంధ్రులపై హోరూల్ ఉద్యమ ప్రభావము

10.3.1 ఆంగ్లేయుల అణచివేత చర్యలు - ఆంధ్రుల ప్రతిఘటన

2. హోమ్‌రూల్ ఉద్యమ ఫలితాలు
3. సమీక్ష
4. వ్యాసరూప ప్రశ్నలు.


## 10.1 లక్ష్యం :

ఆంధ్రులపై జాతీయ నాయకుల ఉపన్యాసాల ప్రభావం సత్వర ఫలితాన్నిచ్చింది. బెంగాల్ విభజనను వ్యతిరేకిస్తూ వందేమాతరం ఉద్యమాన్ని వారు చేపట్టి చురుకుగా అందులో పాల్గొన్నారు. ఈ ఉద్యమస్ఫూర్తిని హోమ్‌రూల్ ఉద్యమం కొనసాగించింది. బాలగంగాధర తిలక్, అనీబిసెంట్‌లు ఆరంభించిన హోమ్‌రూల్ ఉద్యమాన్ని ఆంధ్రులు స్వాగతించారు. ఈ రెండు ఉద్యమాలను వివరించుటయే ఈ పాఠం లక్ష్యం.

## 10.2. పరిచయము :

1905 - 1911 సం॥ రాల మధ్య కాలమున ఆంధ్రాలో సాగిన జాతీయోద్యమమునందు కాననగు ప్రముఖ ఘట్టము - వందేమాతరం ఉద్యమము - దీనికి స్వదేశీ, స్వరాజ్ సాధనాలు. 1905 లో కర్జన్ బెంగాలు విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమైన రాజకీయ ఉద్యమము - వందేమాతరం ఉద్యమము. ఆంగ్లేయుల ఆర్థిక పీడనా విధానం వలన దెబ్బతినిన స్వదేశీ పరిశ్రమల పునరుద్ధరణకు సాగిన ఆర్థికపరమైన ఉద్యమము - ఇది సాధించుటకు స్వీయపరిపాలన అవసరం - అదే హోమ్‌రూల్ ఉద్యమము.

## 10.3 వందేమాతరం ఉద్యమం జనించుటకు కారణాలు :

1858 నుంచి 1905 వరకు ఆంగ్లేయుల పాలనవలన జరిగిన అనర్థాలు, వాటిని సరిచేయడానికి బ్రిటీష్ వ్యతిరేక పోకడలు, భారతీయుల్ని పాశ్చాత్య పద్ధతులద్వారా సంస్కరించడానికి జరిగిన ప్రయత్నాలు మనకు తెలుసు. ఇదే సమయంలో రామకృష్ణ పరమహంస, దయానంద సరస్వతి, ముఖ్యంగా స్వామి వివేకానందుడు జాతీయ సంస్కృతి ఔన్నత్యం, విశ్వజనీనతను ప్రకటిస్తూ భారతీయులలో ఒక కొత్త ఆశను, గొప్ప ఆత్మగౌరవాన్ని కలుగచేసారు. ఈ రకంగా తమ మతం గురించి తమ గతంగురించి వాటి ఔన్నత్యాన్ని గురించి తెలుసుకుంటున్న భారతీయులకు వైస్రాయి కర్జన్ ప్రకటనలు, పనులు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. కర్జన్ చదువరులైన భారతీయులకు బుద్ధి చెప్పాలని తీవ్రంగా యత్నిస్తే అతని దురహంకారాన్ని ఏ విధంగానైనా ఎదుర్కోవాలని భారతీయ మేధావులు భావించారు. వీటి పరిణామమే బెంగాలు విభజన, వందేమాతరం ఉద్యమం, 1905 లో జపాన్ రష్యాపై విజయం సాధించడంతో, ప్రపంచంలో యూరోపియన్లు ఇతరుల కన్నా శక్తివంతులు అనే అభిప్రాయం పటాపంచలైంది. ఆంధ్రదేశంలో జపాను విజయాన్ని స్తుతిస్తూ శ్రీరామ వీరబ్రహ్మం అనే అతను 'జపానీయము' అనే నాటకాన్ని రచించాడు. ప్రముఖ ఆర్యసమాజీకుడు, సంఘ సంస్కర్త ఆదిపూడి సోమనాథరావు 1906 లో జపాను చరిత్రను తెలుగులో రాసి మునగాల రాజాకు అంకితమిచ్చారు. ఇట్టి పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో లోకమాన్య బాలగంగాధర తిలక్ శివాజీ ఉత్సవాన్ని, గణేశోత్సవాన్ని కొత్తగా ప్రారంభించి జాతిని జాగృతం చేసాడు. అదే సమయంలో బెంగాలులో భారతమాత జాతీయ చిహ్నమైంది. దానితో బంకింగ్ చంద్ర ఛటర్జీ 'ఆనందమఠం' నవలలో చేసిన మాతృస్తోత్రం వందేమాతర గేయం వెలుగులోనికి వచ్చి జాతినుత్తేజపరిచే మంత్రంగా అభివృద్ధి చెందింది. బెంగాలు విభజనకు పూర్వమే ఆంధ్రదేశానికి బెంగాలీ సంస్కర్తలతో సంబంధాలుండేవి. బిపిన్ చంద్రపాల్ బ్రహ్మసమాజ ఉపన్యాసాలిస్తూ ఆంధ్రదేశంలో పర్యటించాడు అతడే తిరిగి 1907లో వందేమాతద ఉద్యమ ప్రచారాకునిగా ఆంధ్రదేశానికి వచ్చాడు.

## 10.4 ఆంధ్రలో వందేమాతరం - మద్రాసు బీచ్ సమావేశము, సెప్టెంబరు 1905 :

వందేమాతరం ఉద్యమమునకు మద్దత్తుగా ఆంధ్రలో జరిగిన తొలి సమావేశము మద్రాసు బీచ్ సమావేశము. అక్కడ విద్యనభ్యసించు ఆంధ్రా విద్యార్థులు - అయ్యదేవర కాళేశ్వరరావు, రామశాస్త్రి నాయుడు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొమర్రాజు లక్ష్మణరావు, గొల్లపూడి సీతారామ శాస్త్రి మొదలగు వారు "స్వదేశ మిత్రన్ " పత్రికా సంపాదకుడైన జి. సుబ్రమణ్యా అయ్యర్ అధ్యక్షతన సెప్టెంబర్ 1905 లో మద్రాసు బీచ్‌నందు సమావేశమై వందేమాతరం ఉద్యమమునకు తమ మద్దతును వ్యక్తపరచారు. ఈ సమావేశమునందే సుప్రసిద్ధ తమిళ కవి " సుబ్రహ్మణ్య భారతి " కొన్ని పద్యాలు చదివారు.

## 10.5 వందేమాతరం జాతీయగీతముగా ఆలాపించుట :

కేవలం విద్యార్థులనే కాక, మొత్తం ఆంధ్ర ప్రజానీకాన్ని వందేమాతరం జాతీయగీతం ఆకర్షించింది. ఈ గీతం ఆంధ్రులను అమితంగా ఉత్తేజితులను చేసింది. ప్రతి సమావేశమున ఈ గీతము పాడేవారు. ఆంధ్రాలో కొతా శ్రీరామశాస్త్రి ఆవేశపూరితుడై దీనిని గానముచేసి, సభాసదులందరిని ఆవేశపూరితులను చేసేవారని ప్రతీతి. ఎక్కడైనా ఇద్దరు కలిసికొనినపుడు, " వందేమాతరం " అని అభినందించుకొనుట, వందేమాతరం బాడ్జీలను ధరించుట పరిపాటియైంది. ఫిబ్రవరి, 11, 1907న రాజమండ్రిలో బాల భారతి సమితి ఏర్పడి స్వరాజ్యం, స్వదేశీ ఉద్యమముల వ్యాప్తికి కృషి చేసింది. ఈ వందేమాతరం గీతం జాతీయ వాదులను ఐక్యపరచేదిగానూ, ఆంగ్లేయుల సహనానికి పరీక్షగానూ ఉండేది.

## 10.6 బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర పర్యటన, ఏప్రియల్ 1907 :

ఏప్రిల్ 1907, లో స్వదేశీ ఉద్యమపు ఆదర్శాలను అతివాదృక్పథాన్ని ప్రచారం చేయడానికి, బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర ప్రాంతాన పర్యటించాడు. ఆంధ్రులు అప్పటికే అతివాద ఆవశ్యకతని గ్రహించడంతో బిపిన్ చంద్రపాల్‌యొక్క పర్యటనని ఒక విజయ యాత్రగ రూపొందజేశారు. బిపిన్ చంద్రపాల్ గొప్పవక్త, మేధావి, బ్రహ్మసమాజి, అతివాద నాయకత్రయములోనొకడు. ఆంధ్రలో బీజరూపముననున్న వందేమాతరము ఉద్యమును బలవత్తరం చేసింది పాల్ ఆంధ్ర పర్యటన. ఈ పర్యటన ఏర్పాటు చేసింది కృష్ణా పత్రిక సంపాదకుడయిన శ్రీ ముట్నూరు కృష్ణారావు.

బిపిన్ చంద్రపాల్ తన పర్యటనను, విజయనగరము, విశాఖపట్నములలో ప్రారంభించాడు. ఈ పట్టణములలో మితవాదులు ఎక్కువగానుండుటచే ఆయన ఉపన్యాసముల ప్రభావము అంతగా కనపడలేదు. ఏప్రిల్ 17, 1907న కాకినాడలో వేదాంతముపై, స్వదేశీపై రెండు ఉపన్యాసాలిచ్చాడు. ఆ తర్వాత ఏప్రిల్ 19-24 తారీఖులమధ్య రాజమండ్రిలో ఉపన్యాసములిచ్చాడు. బాలభారతి సమితి సభ్యులు బిపిన్‌కు ఘనస్వాగత మిచ్చుటయేగాక, ఆయన ఉపన్యాసములను సుప్రసిద్ధ తెలుగు కవి శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం తెలుగులో అనువదించారు. ఈ ఉపన్యాసములలో స్వరాజ్య, స్వదేశీ, విదేశీవస్తు బహిష్కరణ, బ్రహ్మసమాజ్, వందేమాతరం మొదలైన వానిపై కూలంకషముగా బిపిన్ చర్చించాడు. ఇచ్చటనే ఆంధ్ర యువకుల తరపున నాడు ప్రభుత్వ ట్రైనింగు కళాశాలలో విద్యనభ్యసించు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు బిపిన్ చంద్రపాల్‌కి ఒక సన్మాన పత్రమును సమర్పించారు. స్వదేశీ ఉద్యమ నాయకుడుగా బిపిన్ గోదావరి స్వదేశీ స్టోర్సును ప్రారంభించాడు. రాజమండ్రి కరణమైన గున్నేశ్వరరావు రాజమండ్రిలో జాతీయ పాఠశాల స్థాపనకు వెయ్యిరుపాయలు బిపిన్ ద్వారా విరాళమిచ్చాడు. ఆ తర్వాత బిపిన్ ఏప్రిల్ 24, 1907 న, రాజమండ్రి నుండి విజయవాడకు బయలుదేరి, అచ్చట మునగాల రాజావారి అతిథి గృహంలో మకాంచేశారు. (ఆ సమయంలో ఆ రాజా మచిలీపట్టణం నోబుల్ కాలేజీలో విద్యార్థిగా ఉండేవారు) విజయవాడనుండి బిపిన్ మచిలీపట్టణం చేరాడు అచ్చట కోపల్లె హనుమంతరావు, యం. నరసింహం, సూర్యనారాయణ రావు మొదలైనవారు బిపిన్‌కు ఘన స్వాగతం పల్కారు. మచిలీపట్టణాన రామదాసు నాయుడు అనే బ్రహ్మసమాజంవారి ఇంట్లో బసచేశారు. ఏప్రియల్, 26, 27, 28 తేదీలలో ఆ పట్టణంలో బిపిన్ గడిపారు. 26 వ తేదీన జరిగిన మహాసభకు అప్పటి హిందూ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణమాచారి అధ్యక్షత వహించగా, బిపిన్ ఉపన్యసించాడు. 27వ తేదీన జరిగిన సభకు, మచిలీపట్టణం మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ అయిన పురాణం వెంకటప్పయ్య అనే వకీలు అధ్యక్షత వహించాడు. ఇచ్చట బిపిన్ ఉపన్యాసం వలన ప్రభావితుడై శ్రీ కోపల్లె హనుమంతరావు జాతీయ విద్యకు తన జీవితమును అంకితము చేయుటకు నిర్ణయించినట్లు ప్రకటించాడు. బిపిన్ ఆంధ్రజాతీయ కళాశాలకు బందరులో శంఖుస్థాపన చేశాడు. ఈ సందర్భమున మచిలీపట్టణంలో " Young Men Swaraj Samithi " (యంగ్‌మెన్స్ స్వరాజ్య సమితి) ఏర్పడింది. శ్రీ కోపల్లె హనుమంతరావు జాతీయ కళాశాలకు ప్రథమ ప్రిన్సిపాల్‌గా తన జీవితమును అంకితం చేశాడు. ఈ విధంగా బిపిన్ చంద్రపాల్ పర్యటన వలన ఆంధ్రులలో నూతన చైతన్యము కల్గి, వారిని క్రియాశీల ఉద్యమాలవైపు మరల్చింది. ఆయన పర్యటన విజయవంతమైనదనటానికి నిదర్శనములు నాడు జరిగిన సంఘటనలే - రాజమండ్రి కళాశాల సంఘటన, కాకినాడ కొట్లాటలు, కోటప్పకొండ సంఘటన, తెనాలి బాంబు కేసు.

### 10.7 రాజమండ్రి కళాశాల సంఘటన 1907 :

బిపిన్ చంద్రపాల్ ఆంధ్ర పర్యటన ఫలితం విద్యార్థి లోకంపై ఎక్కువగా కన్పించింది. ఉద్రేకమొలికించు అతని ఉపన్యాసాలు ఆ విద్యార్థులను ఉత్తేజితులను చేశాయి. ఆ అంతర్గత భావనల్ని వెల్లడించు సంకేతాలుగ వందేమాతరం పతాకాలను వారు తమ దుస్తులపై ధరించుటేగాదు, పరస్పరాభినందనకై వందేమాతరం అనే నినాదాన్నే ఉపయోగించారు. విద్యార్థిలోకం ఆనాడు ఎంత గాఢంగ ఉద్రిక్తమైందో, రాజమండ్రి గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజి ట్రైనింగ్ కాలేజీల్లో జరిగిన సంఘటనలు తెలుపుతాయి. బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి రావడానికి రెండు నెలలకు ముందే రాజమండ్రిలో బాల భారతి సమితి అనే సంస్థ ఏర్పడింది. దాని ముఖ్యోద్దేశం ' స్వదేశీ' ని ప్రచారం చేయడం, సాంఘికసేవ, వయోజన పాఠశాలల్ని నడపడం. దీనికి సహాయ సంపత్తులు రాజమండ్రి కరణం గున్నేశ్వర రావు అందించారు. దీనిలోని సభ్యులు అందరూ యించుమించు రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులే. ఆనాడు ఆర్ట్స్ కళాశాల, ట్రైనింగ్ కళాశాలలకు మార్క్ హంటర్ అనే యూరోపియన్ ప్రిన్సిపాల్. బిపిన్ చంద్రపాల్ రాకకు పూర్వమే ఆంధ్ర దేశంలోయువకులు వందేమాతరమని అభివాదాలు చేసుకోవడం, ప్రతిదానికి వందేమాతరం అనడం చేస్తుండేవారు. ఆ మాట అర్థంతో ప్రమేయం లేకుండా ఆంగ్లేయులు అది తమకు వ్యతిరేకంగా వాడుతున్న నినాదమని తప్పుగా భావించారు. అందుచేత ఆంగ్లేయ అధికారులు, మార్చి 1907 హంటర్‌కు మీ విద్యార్థులు వందేమాతర నినాదంతో చాలా చికాకు పెడ్తున్నారని తెలిపారు. దీనితో మార్చి 18 న హంటర్ కళాశాల సిబ్బందిని పిలిచి తామంతా 19 వ తేదీన విద్యార్థుల్ని సమావేశపరిచి మందలించాలన్నాడు. వందేమాతర నినాదమే కాకుండా, వందేమాతరం మెడల్స్, బ్యాడ్జీలు పెట్టుకొని విద్యార్థులు, ముఖ్యంగా బాలభారతి సభ్యులు కళాశాలకు వస్తున్నారన్నారు. అట్టి నినాదాలివ్వడం, బ్యాడ్జీలు, మెడల్స్ ధరించడంగాని, బాల భారతి సభ్యులుగా ఉండటంగాని చేయరాదని హంటర్ విద్యార్థుల్ని హెచ్చరించాడు హంటర్, సాధారణంగా ఇటువంటి హెచ్చరికలు రాత పూర్వకంగా

చెప్పటం అలవాటు, కాని ఆ విధంగా తెలుపలేదు కనుక విద్యార్థులు కూడా ఆ హెచ్చరికను అంతతీవ్రంగా పరిగణించలేదు. మార్చి 20, - బి. ఏ ఆఖరి సంవత్సరంలో ఉన్న జోస్యుల రామచంద్రరావు వందేమాతం బ్యాడ్జీ ధరించి గున్నేశ్వర రావుతో కలిసి తాను హాస్టలు విద్యార్థి కాకున్నా కళాశాల హాస్టల్‌కు వెళ్ళి విద్యార్థుల్ని ప్రిన్సిపాల్ హెచ్చరికను లెక్కచేయక రాత్రి పాఠశాలల్ని నడిపి రమ్మని కోరాడు. ఈ అభియోగంపై రామచంద్రరావుని ప్రిన్సిపాల్ హంటర్ పిలిచాడు. బ్యాడ్జీ చూడటంతోనే హంటర్ అతనిని కళాశాలనుంచి ఎందుకు పంపివేయరాదో అయిదు రోజుల్లో తెల్పాలన్నాడు. రామచంద్ర రావు తన సంజాయిషీలో వందేమాతరం బ్యాడ్జీ ధరించరాదని ఉత్తర్వునివ్వలేదని, అయినా దానిని ధరించడం అంతరాత్మ ప్రభోధమని, తనకేమాత్రం అవకాశం ఇచ్చినా ఆ బ్యాడ్జీ ధరిస్తూనే ఉంటానని సమాధానం ఇచ్చాడు. దానిపై హంటర్ తీవ్ర చర్య తీసుకోవాలని తలపెట్టాడు. కాని కడకు రామచంద్ర రావు విచారం వ్యక్తం చేసి సక్రమంగా నడుచుకుంటానని హామీ ఇవ్వగా తిరిగి 26 న కళాశాలలో చేర్చుకొన్నారు.

ఆ తర్వాత పట్టణ ప్రముఖులు ఒక సమావేశము జరిపి, బాలభారతిలో సభ్యులుగా చేరరాదనే నియమాన్ని తొలగించాలని హంటర్‌కు విజ్ఞప్తి చేశారు. కాని విషయం ఎటూ తేలకుండానే ఉండిపోయింది. ట్రైనింగ్ కళాశాల విద్యార్థులు స్టైఫండ్ పొందుతారు కనుక హంటర్ ఆజ్ఞను శిరసావహించారు. మార్చి 26 నుండి, బిపిన్ రాజమండ్రి వచ్చిన ఏప్రిల్ 19 వరకు పరిస్థితి ప్రశాంతంగానే ఉంది. ఏప్రిల్ 19 న కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ ఉపాధ్యాయులు కళాశాల వ్యవహారమై మద్రాస్ వెళ్ళి 22 న తిరిగి వచ్చారు. వారు రావడంతోనే బిపిన్ చంద్రపాల్ రాక, ఆ సందర్భంలో కళాశాల విద్యార్థుల, ముఖ్యంగా గాడిచర్ల హరిసర్వోత్తమ రావు పాత్ర గురించి హంటర్‌కు సమాచారం అందింది. ఏప్రిల్ 23 న కళాశాలలో క్లాసులులేవు, 24 వ తేదీ నుండి అర్ధ సంవత్సర పరీక్షలు ప్రారంభం. 23వ, తేదీన హంటర్ కళాశాలకు వెళ్ళగా గ్రంధాలయంలో, ఇతరచోట్ల కన్పించిన విద్యార్థులెవ్వరూ వందేమాతరం బ్యాడ్జీలతో కనపడలేదు. ఆ రోజునే బిపిన్ జాతీయ విద్యపై ఉపన్యసిస్తూ కళాశాలలో క్రమశిక్షణ దేశసేవకు అడ్డు వచ్చినప్పుడు దానిని పాటించనవసరంలేదని ప్రబోధించాడు. దీనిని హంటర్ తన విద్యార్థుల్ని ప్రత్యక్షంగా క్రమశిక్షణా రాహిత్యానికి ప్రోత్సహించడంగా భావించాడు. ఆ మరునాడు చాలామంది విద్యార్థులు బ్యాడ్జీలతో కళాశాలకు హాజరయ్యారు. హంటర్ క్లాసులోకి వెళ్ళి బ్యాడ్జీలను తీసేయమని ఆజ్ఞాపించాడు. అందరూ తీసివేసారు. ఆ విద్యార్థుల్లో బ్యాడ్జీతో జోస్యుల రామచంద్రరావు ఉన్నాడు, హంటర్ అక్కడికక్కడే అతణ్ణి కళాశాలనుంచి బహిష్కరించాడు. తరువాత రెండవ గదిలోకి వెళ్ళి బ్యాడ్జీల గురించి చెప్తుంటే, 'వందేమాతరం' అని వరండాలోనుండి నినాదం వినపడడం, మొత్తం విద్యార్థులు గదిలోనుండి వందేమాతరం అంటూ అక్కడకు వెళ్ళడం జరిగింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావుని కళాశాలనుంచి ప్రిన్సిపల్ మార్క్ హంటర్ డిస్మిస్ చేసాడు. ఆనాడు ఆర్ట్స్ కళాశాలనుంచి వెళ్ళిపోయిన విద్యార్థులు అందర్నీ సస్పెండ్ చేశాడు. చివరకు తల్లిదండ్రులు క్షమాపణలు చెప్పుకోగా 50 మందిని తిరిగి చేర్చుకొన్నాడు. కళాశాల విద్యార్థుల సంఖ్య 222 కాగా 138 మంది ఈ చర్యవల్ల నష్టపోయారు. వారిలో జోస్యుల రామచంద్రరావు బి. ఏ పరీక్షకు శాశ్వతంగా అనర్హుడైనాడు. ప్రభుత్వోద్యోగానికి కూడా అనర్హుడైనాడు. హరిసర్వోత్తమ రావుని కూడా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకు అనర్హుడుగా ప్రభుత్వం ప్రకటించింది. మిగతా విద్యార్థులకు రకరకాల శిక్షలుపడ్డాయి. ప్రభుత్వం దీనికి మొట్టమొదటిసారిగా కొత్త వ్యాఖ్యానం చేసింది. దాని ప్రకారం ఇది బ్రాహ్మణుల కుట్ర అని దీనిలో శూద్రులు, మహమ్మదీయులకు సంబంధం లేదని ప్రకటించింది. రాజమండ్రి పురప్రముఖులు హంటర్ చర్యని వ్యతిరేకించారు. అనేకమంది విద్యార్థులు చదువులు మాని, వారి గ్రామాలకు వెళ్ళి ఆ తర్వాత జాతీయోద్యమ ప్రచారకులయ్యారు.

### 10.8 కాకినాడ కొట్లాటలు :

మే 31, 1907 న కాకినాడ వీధుల్లో జిల్లావైద్య శాఖాధికారి కెప్టెన్ కెంప్ తన బగ్గీలో వెళుతూ ఉండగా, ముగ్గురు పిల్లలు, 18 సంవత్సరాల ప్రాయంవారు వందేమాతరం అని అరిచారు. దీనితో కెంప్ ఉగ్రుడయ్యాడు. తనకు అందిన కోపల్లె కృష్ణారావు అనే అతన్ని పట్టుకొని కెంప్ చావ మోదాడు. వైద్యసిబ్బంది ఎవరూ కూడా మూర్ఛపోయిన కృష్ణారావుకు వైద్యం అందించలేదు. ఈ సంఘటన కాకినాడు పురజనుల్లో సంచలనం కలిగించగా, రాత్రి 8-30 గం॥లకు కొన్ని వందలమంది కర్రలతోసహా కెంప్ ఉన్న యూరోపియన్ క్లబ్బుకు వెళ్ళి, క్లబ్ సామాగ్రిని విచ్ఛిన్నం చేశారు. ఈ విషయం తెలిసి కలక్టర్ కుమ్మింగ్ కొంతమంది పోలీసులతో అక్కడకు వచ్చి కెంప్‌ని అక్కడనుంచి తప్పించి గుంపును చెల్లాచెదరు చేశాడు. ఆ సందర్భంగా కలెక్టర్‌కు కూడా దెబ్బలు తగిలాయి. నగరంలో బ్రిటిష్‌వారు ప్రాణభయంతో గడిపారు. ఇదంతా బిపిన్ చంద్రపాల్ రాకవల్ల జరిగిందని ప్రభుత్వం వ్యాఖ్యానించింది. ఈ విషయాన్ని ఖండించటానికి జూన్ 5 న స్థానిక

రాజకీయ నాయకుడు కె. పేరరాజు అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. అందులో పోలవరం జమీందారు. కె. ఆర్ వి. కృష్ణారావు బహద్దూర్ తీర్మానం ప్రతిపాదిస్తూ క్లబ్బువద్ద జరిగిన సంఘటనకూ, కలెక్టరుకు తగిలిన దెబ్బలకు విచారం వ్యక్తపరిచారు. ప్రముఖ వ్యాపారస్థుడైన కొమ్మిరెడ్డి సూర్యనారాయణ మూర్తి నాయుడు ఈ తీర్మానాన్ని బలపరిచారు. స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి వెంకటరత్నం నాయుడు మరొక తీర్మానం ప్రతిపాదిస్తూ కెంప్ చర్యవల్లనే గొడవ ప్రారంభమైందనీ బిపిన్ పాల్ రాకకి, ఈ సంఘటనకి సంబంధంలేదనీ సాధారణ పరిస్థితి ఏర్పడడానికి పౌరులందరూ సహకరించవలసిందనీ కోరాడు. రావు సాహెబ్, పి.వి చలపతి తీర్మానాన్ని బలపరిచాడు. అయినప్పటికీ ప్రభుత్వం 50 మందిని అరెస్ట్ చేసింది. కాని సాక్ష్యం చెప్పటానికి పురప్రముఖులెవరూ రాలేదు. అరెస్టుచేసిన వారిలో 5 గురు రేవు కార్మికులుండటం వలన కార్మిక సమ్మె జరిగింది. రేవుపని స్థంభించగా అసిస్టెంట్ కలెక్టర్, తహసీల్దార్ హామీపై మరెవరిని అరెస్ట్ చేయమని చెప్పిన తర్వాత సమ్మెవిరమణ జరిగింది. అరెస్ట్ చేయబడినవారిలో చినపేరయ్య, బారు వెంకటనారాయణ, అరిపిరాల లక్ష్మీ నరసింహారావు వున్నారు. నరసింహారావు స్వదేశీ వ్యాపార సంస్థకు కార్యదర్శి కావటమే అతని అరెస్టుకు కారణం, బిపిన్ రాకవలన స్వదేశీ పోలీసులలో కూడా మార్పు వచ్చిందినీ, వారు ప్రభుత్వ విధేయులుగా ఉండటం లేదని భావించబడింది. దాదాపు 7 వారాలపాటు కాకినాడ భయాందోళనలతో గడిపింది. అదనపు పోలీసులను తీసివేయవలసిందిగా జూలై 30 వ తేదీన జరిగిన సమావేశంలో పుర ప్రముఖులు కోరారు. తర్వాత ప్రభుత్వానికి వినతి పత్రం కూడా సమర్పించారు. కాని నవంబరు నాటికిగాని ప్రభుత్వం పోలీసులను తొలగించలేదు. అరెస్టు చేయబడిన 50 మందిలో చివరికి 13 మందికి శిక్షలు విధించారు. పోలీసు జులంతో సాక్ష్య సేకరణ జరిగిందని, క్వొచెన్‌కెంప్ చర్య వల్లనే గొడవంతా ప్రారంభమైందని తేలింది. కెంప్ చేతిలో దెబ్బలు తిన్న కృష్ణారావు నష్ట పరిహారంగా 100 రూ. పొందాడు. కెంప్ ప్రవర్తన గర్హించబడింది, కెంప్‌ను కడపకు బదిలీ చేశారు. కాకినాడ కొట్లాట కేసు ఆంధ్ర రాజకీయములలో జరిగిన తొలి క్రిమినల్ కేసు.

## 10.9 కోటప్ప కొండ సంఘటన :

18, ఫిబ్రవరి 1909, లో కోటప్ప కొండవద్ద జరిగిన శివరాత్రి ఉత్సవ సందర్భంగా ఈ సంఘటన జరిగింది. ఉత్సవ సందర్భముగా నాట్యములు, ప్రభలు, జంతు ప్రదర్శనలు జరిగేవి. ప్రజలు అసంఖ్యాకముగా పాల్గొను ఈ ఉత్సవమున పోలీసు బందోబస్తు ఉండేది. ఈ బందోబస్తు చేయు సందర్భమున ప్రజలనదుపులో పెట్టుటకు జరిపిన కాల్పులలో చిన్నపరెడ్డికి చెందిన ఎద్దుకు గాయం తగిలింది. దీనితో ఉగ్రుడైన రెడ్డి ఆ పోలీసుపై చేయి చేసుకొన్నాడు . అంతట పోలీసు మరణించెనను వదంతితో పోలీసులు చిన్నపరెడ్డిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకొని వెళ్ళారు. ఈ వార్త విన్నంతనే స్త్రీ, పురుషులను భేదము లేక ప్రజలందరూ 'వందేమాతర' అను నినాదముతో పోలీసు స్టేషన్‌పై దాడిచేసి, దానిని తగులపెట్టారు. అంతట జిల్లా పోలీసు అధికారి సుబ్బారావు అక్కడకు వచ్చి ప్రజలను శాంతపరచదలచాడు. కాని వారు ఆయనపై రాళ్ళు విసరి గాయపర్చారు. అంతట ఆయన అచటనుండి తప్పించుకొని పారిపోయాడు. ఈ సందర్భమున జరిగిన కొట్లాటలో ఒక కానిస్టేబుల్, జవాను మరణించగా, పెక్కు పోలీసులు గాయపడ్డారు. ప్రజలలో ఇద్దరు రెడ్డి బాలురు మరణించారు. తుదకు చిన్నపరెడ్డికి ఉరిశిక్ష విధింపగా, నలుగురికి యావజ్జీవ కారాగారశిక్ష విధించారు. మరికొందరికి సాధారణ శిక్షలు విధించారు. ఈ సంఘటన పోలీసు వైఫల్యముగా భావించి పోలీసు అధికారి యైన సుబ్బారావుకు, సబ్ కలెక్టరైన కెర్‌హాస్‌ను దిగువ స్థాయిలకు మార్చారు.

## 10.10. తెనాలి బాంబు కేసు - 6, ఏప్రిల్ - 1909 :

తెనాలి బాంబు కేసు కూడా ఈ వందేమాతరం ఉద్యమ కాలంలోనే జరిగింది. తెనాలి సమీపాన ఉన్న కంచర్లపాలెం గ్రామంలో, చెంచుగాడనబడే హరిజనుడొకడు తన సమీపంలో అకస్మాత్తుగా ఒక బాంబు ప్రేలటం వలన మరణించాడు. ఈ బాంబు ఆ గ్రామ వాసులైన చుక్కపల్లి రామయ్య, కోటం రాజు వెంకట్రాయుడు, లక్కరాజు బసవయ్య అను వారలు తయారు చేసి అక్కడ ఉంచారని, ప్రభుత్వానికి సమాచాగం అందింది. 6, ఏప్రిల్ 1909 న వారు ముగ్గురు అరెస్టు చేయబడ్డారు. చుక్కపల్లి రామయ్యకు, ప్రేలుడు పదార్థాల చట్టంలోని 5 వ సెక్షన్ క్రింద, 10 సంవత్సరాల ద్వీపాంతరవాస శిక్ష విధించబడింది. ' స్వరాజ్య సంపాదన ' అనే పేరుగల రాజద్రోహ ప్రేరకపు తెలుగు కరపత్రాలను పంచాడనే కేసు వెంకట్రాయుడుమీద, బసవయ్యమీద దాఖలైంది. బసవయ్యకు దిగువ కోర్టులో 5 ఏండ్ల ద్వీపాంతం వాసశిక్ష విధించబడింది. కాని అప్పీలులో అది రెండేండ్ల శిక్షగా తగ్గించారు. ఈ కేసులో బసవయ్య పక్షాన టంగుటూరు ప్రకాశం పంతులు వకీలుగా పనిచేశారు. అప్పటిలో ఆయన మదరాసున బారెట్లాగా ప్రాక్టీసు చేస్తూవుండేవాడు. ఆ కేసులో పి.వి శ్రీనివాస రావు, అక్కా లక్ష్మీనరసింహా అనే లాయర్లు ప్రకాశం పంతులకు సహాయపడ్డారు.

వందేమాతర ఉద్యమ ఫలితంగా ఆంధ్రలో రాజకీయ పరిజ్ఞానం, చైతన్యం వృద్ధిగాంచాయి. స్వదేశీ పట్ల అభిమానం పెరిగింది. జాతీయ విద్య ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఆందోళన సాధనాన ప్రభుత్వాన్ని లొంగదీయవచ్చుననే నమ్మకం బలపడింది. మొత్తంమీద ఉద్యమం ఫలవంతమైందిని చెప్పవచ్చును.

వందేమాతరం ఉద్యమం మొట్టమొదటిసారిగా ఆంధ్రలో అత్యంత ఉత్సాహంతో సాగిన ఉద్యమం. స్వదేశి, స్వరాజ్‌లకై ఆరంభమైన ఈ ఉద్యమం స్వాతంత్ర్యం లభించేంతవరకు కొనసాగింది.

**10.2.1 హోమ్‌రూల్ ఉద్యమము :** భారతదేశమును భారతీయులే పరిపాలింపవలెననునదే హోమ్‌రూల్ ఉద్యమ లక్ష్యము. ఆంధ్రదేశమున వందేమాతరం ఉద్యమము జనింపజేసిన జాతీయ శక్తులను బలవత్తరమొనర్చిన మరో ఉద్యమము - హోమ్‌రూల్ ఉద్యమము. అతివాద నాయకుల నిర్బంధము, బెంగాల్ విభజన రద్దు, మితవాదుల బలాధిక్యత వలన కొన్నాళ్ళు జాతీయోద్యమమున స్తబత ఏర్పడేది. ఇట్టి శాంతియుత వాతావరణమున తిలక్ మాండలే జైలునుండి విడుదలై జూన్ 16, 1914 న పూనా చేరాడు. ఈ లోపల ఐరోపాలో మొదటి ప్రపంచ యుద్ధము ఆరంభమయ్యింది. ఇంగ్లండ్ మిత్ర రాజ్య పక్ష మందు చేరి టర్కీ, జర్మనీ మొదలైన దేశములను ప్రతిఘటింపసాగింది. ఈ యుద్ధము వలన ఏర్పడిన పరిస్థితులను ఆసరగా తీసుకొని ఆంగ్లేయుల వద్దనుండి ఎక్కువ లాభమును పొందవలెనను ధ్యేయముతో ఏప్రిల్, 1916లో తిలక్ హోమ్‌రూల్ ఉద్యమమును ప్రారంభించాడు. ఈ లోపల అనీబిసెంటు జాతీయకాంగ్రెసు నందు చేరి సెప్టెంబర్ 1916 లో మద్రాసునందు హోంమ్‌రూల్ లీగ్‌ను స్థాపించింది. ఈ రెండు లీగ్‌లు వేర్వేరుగా జనించినను పరస్పరము సహకరించుకొని ఒకే ఉద్యమముగా కొనసాగాయి. రాజ్యాంగ పద్ధతుల ద్వారా బ్రిటిష్‌నుండి పూర్తి స్వయం లేక స్వీయ పాలన సాధించుటయే దీని లక్ష్యమని అందుకు ప్రజలను సమాయత్తము చేయవలెనని తిలక్ ప్రవచించాడు. అలాగే అనిబిసెంటు గ్రామస్థులనుండి జాతీయస్థాయి వరకు పూర్తి స్వపరిపాలనను సాధించి, కామన్‌వెల్తులో అంతర్భాగముగా భారతదేశం స్వతంత్రదేశంగా ఆవిర్భవింపవలెనని కోరింది. ఇదే సమయంలో మద్రాసులో అనీబిసెంట్ తన థియోసాఫికల్ సొసైటీ ఉపన్యాసంలో స్వపరిపాలన గురించి ఇలా అన్నారు: "స్వేచ్ఛలేని జీవితము జీవచ్ఛవము వంటిదని." హోంమ్‌రూల్ ఉద్యమం ప్రారంభమగునాటికి అతివాదులు 1916 లక్నో సమావేశమున తిరిగి కాంగ్రెసులో చేరుట వలన జాతీయ కాంగ్రెసు బలపడింది. బెంగాల్ విభజన రద్దువలన ముస్లిం దేశమైన టర్కీపై బ్రిటన్ యుద్ధము చేయుటవలన, ముస్లిం లీగ్ ఆంగ్లేయులకు విరోధియై, కాంగ్రెస్‌తో లక్నోఒడంబడిక చేసికొని సహకరించుటకు అంగీకరించింది. ఈ విధంగా దేశంలో హోంమ్‌రూల్ ఉద్యమమునకు కాంగ్రెస్ - ముస్లిం లీగ్‌ల ఆదరణ కూడా లభించింది.

**10.2.2 ఆంధ్రాలో అనిబిసెంట్ పర్యటన :** 1916 లో ఆంధ్రదేశమున పర్యటించి కాకినాడ, రాజమండ్రి, చిత్తూరు మొదలగు సభలలో తన గంభీర ఉపన్యాసములతో ఆమె ప్రజలను ఉగ్రూతలూగించారు. చిత్తూరులో జరిగిన ఒక సభకు అధ్యక్షత వహించిన సందర్భంలో ప్రసంగించుతూ ఆమె " తన దేశంలోనేతాను విదేశీయుడై, ప్రజాజీవితాన ఉన్నత స్థానాలను అందుకొను అవకాశం లేకుండా జీవితాన్ని సాగించుటకు స్వాభిమానం గలిగిన ఏ మానవుడు అంగీకరించి ఊరకొనడు, స్వతంత్రత లేకుండ బ్రతుకుటయన్న దిన దినమున మరణించుట వంటిది. అది జీవితము కానే కాదు, జీవన్మరణము" అని తెలిపింది. భారతీయులనుద్దేశించి మాట్లాడుతూ ఆమె " మహత్తరమగు మిగత చరిత్రలోని మరువరాని ఘట్టాల పేరిట, కీర్తి శేషులగు మీ పూర్వుల పేరిట, ఇక ముందు జన్మించి పెంపొందగల తరతరముల మీసంతతి పేరిట దేశ మాతృసేవకై దీక్ష వహించండి. మీరు ఇప్పుడు నిర్వహించెడు పాత్రను అనుసరించియే, రాబోవు తరాలవారు మిమ్ములను స్వాతంత్ర్య నిర్మాతలుగ సంభావించుటో, లేదా దాస్యబంధాలను మరింతగ బిగింపజేసిన దౌర్భాగ్యులుగా చూపించుటయో జరుగగలదు" అని హెచ్చరించింది. తన శరీరం తెలుపురంగుది యగుట వలన మాత్రమే, భారతీయుడెవడును ఉచ్చరించుటకు అనుమతింపబడని వానిని మాట్లాడుటకు తనను ప్రభుత్వం అనుమతించుచున్నదనియు ఆమె తెల్పింది. అయితే ఆ విధంగా స్వేచ్ఛగా తాను మాట్లాడు అవకాశం ఎంత కాలం వరకు ఉండగలదనుట తనకు తెలియకున్నను, తనను నిర్బంధించి నోరు మూయించు వరకు తాను ఈ విధంగానే మాట్లాడుచుండగలనని ఆమె తన సంకల్పాన్ని ఆ సమయంలో వెలువరించింది.

అనిబిసెంట్ ఎప్పుడూ బ్రిటిష్ ప్రభుత్వపు పరిపాలనా పరమైన హెచ్చుతగ్గులను విమర్శిస్తూ వుండేది. 'ది న్యూ ఇండియా,' 'కామన్ వీల్' అను పత్రికలలోని తన వ్యాసాలద్వారా బ్రిటీష్ ప్రభుత్వముపై విమర్శలను ముమ్మరంగా సాగించింది. దేశాన తిష్ట వేసిన ఒక

విదేశీయ నిరంకుశ ప్రభువుగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఆమె అభివర్ణించి, ఆ నిరంకుశుని చేతిలోని ఆయుధాలుగా వాఙ్ఞ రోధమును, శిక్షాస్మృతియు ఉపకరించుచున్నవని నిందించింది.

బ్రిటిష్ ప్రభుత్వం అనిబీసెంట్ కార్యక్రమలకు అన్నివిధాలా అవరోధాలు కల్పించింది. అనిబిసెంట్ చేయు కార్యకలాపాలను నిరోధించు ఉద్దేశంతో మద్రాసు ప్రభుత్వం గవర్నరు గారి ఆంతరంగిక కార్యదర్శిద్వారా తొలుత ఆమెను హెచ్చరించింది. కాని ఆ హెచ్చరికలను లక్ష్యపెట్టక ఆమె యధాపూర్వంగా హోమ్‌రూల్ ఉద్యమ ప్రచారాన్ని కొనసాగించింది. రైలు ప్రయాణాలలో ఆ కాలాన యూరోపియనులకును, భారతీయులకు మధ్య చూపబడే విచక్షణను వేలెత్తి చూపి ఆమె విమర్శించింది. యూరోపియనులకు ఆ కాలాన రైలుబండిలో కొన్ని పెట్టెలు ప్రత్యేకంగా రిజర్వు చేయబడి ఉండేవి. వారితో పాటుగ ఆ తరగతికి చెందిన టిక్కెట్టునే కొన్నప్పటికిని, భారతీయులకు ఆ పెట్టెల్లో యూరపేయన్‌లతో కూర్చుండుటకు రైల్వే అధికారులు అనుమతించేవారు కాదు. దీనిని నిందిస్తూ అనిబిసెంట్ సాగించిన ప్రచారపు ఫలితంగా భారతీయుల్లో స్థైర్యం పెచ్చుపెరిగి, యూరోపియన్ విద్యార్థులతో పాటుగ భారతీయ విద్యార్థుల్ని కాలేజీలకు రైళ్ళల్లో పయనింప ప్రయత్నించుట, అందువల్ల వ్యతిరేకత పెరుగుట జరిగింది. యువ క్రైస్తవ సంఘపు ఒరవడిలోనే యువ భారతీయ సంఘమును ఆమె స్థాపించింది. ఆమెయే ఇండియన్ బాయ్ స్కౌట్ ఉద్యమం, ఆర్డర్ ఆఫ్ సన్స్ ఆఫ్ ఇండియా అను సంఘాలను ఏర్పరచి, ప్రోత్సహించింది. జాతీయ విద్యా వ్యాప్తికై ఆమె ప్రచారం చేసింది. 31, మార్చి, 1917 మద్రాసు పార్లమెంటు అనబడు దానిని ఆమె సమావేశపర్చింది. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతినిధులను ఆహ్వానించింది. భారతదేశపు నాటి పరిస్థితిని గురించి తమ తమ అభిప్రాయాలను ఆ పార్లమెంటుకు తెలియజేయవలసిందిగా, ఆ ప్రతినిధుల్ని ఆమె కోరింది, మద్రాసు మహాజన సభలో సభ్యత్వం కల్గిన బయ్యా నరసింహేశ్వర శర్మ వంటి ప్రముఖులు పలువురు హోమ్‌రూల్ ఉద్యమాన ఆమెను సమర్థించారు. మే, 1916 న మదన పల్లిలో నేషనల్ కాలేజిని ఆమె ప్రారంభించింది, దాని మొదటి ప్రిన్సిపాలుగ, ఐరీషు పత్రికా విలేఖరి జె. హెచ్. కజిన్సును నియమించింది. అనిబిసెంటు నెలకొల్పిన యంగ్ మెన్స్ ఇండియన్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులు, ప్రజలకు రాజకీయ కరపత్రాలను పంచి హోమ్‌రూల్ ఉద్యమాల భావాల వ్యాప్తికి తోడ్పడ్డారు. ప్రజల్లో హోంమ్‌రూల్ ఆదర్శాల వ్యాప్తికి అనంతపురం వాస్తవ్యుడు గుత్తి కేశవపిళ్లె కూడా ఎంతో కృషిచేశాడు.

అనిబిసెంట్‌కు ఆంధ్ర దేశంలో అనేకమంది ప్రముఖులు సహాయపడ్డారు. వివిధ దశల్లో రంగనాధ మొదలియారు, కేశవపిళ్ళె, శివశంకరం పిళ్ళె, హత్తె శంకరరావు, హత్తె శివరావు, దొరస్వామి అయ్యంగారు, పార్థసారధి అయ్యంగారు, రాజా రామనారాయణంగారు, మునుస్వామి నాయుడు, కాశీనాధుని నాగేశ్వరరావు, గద్దె రంగయ్య నాయుడు, ఏ. ఎస్ కృష్ణా రావు, కొండా వెంకటప్పయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, పట్టాభి సీతారామయ్య, గొల్లపూడి సీతారామ శాస్త్రి, ముట్నూరి కృష్ణారావు, ఏ. కాళేశ్వరరావు, మోచర్ల రామచంద్ర రావు, వెంకటరెడ్డి నాయుడు, న్యాపతి సుబ్బారావు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, బులుసు సాంబమూర్తి, బి. వెంకటపతిరాజు, సి.వి.ఎస్ నరసింహరాజు, పి. వెంకటపతి రాజు, ఏ.పి పాత్రో మొదలైన వారు హోంమ్‌రూల్ ఉద్యమాన్ని బలపరచారు. తెనాలి, బాపట్ల ఏలూరు కర్నూలు, బళ్ళారి, కడప, కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం మొదలైన చోట్ల సభలలో వచ్చిన మద్దతుని గమనించి ప్రభుత్వం, ఆమెకు ఎన్నో హెచ్చరికలు చేసి 16, జూన్, 1917 న ఉదకమండలంలో ప్రభుత్వం నిర్బంధ నివాస శిక్షను అమలు చేసింది. చివరకు ఈ ఉద్యమ తీవ్రతకు తల్గొగ్గి సెప్టెంబరు 17, 1917 న అనిబిసెంట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విజయం ప్రజావిజయంగా పేర్కొనబడింది. మొదటిసారిగా ప్రజాభిప్రాయనికి గుర్తింపు లభించింది.

**10.2.3 హోంరూల్ లీగ్‌ల స్థాపన :** అనిబిసెంట్ ఆంధ్రా పర్యటన తర్వాత ఆంధ్రదేశ మంతటా అఖిల భారత హోంమ్‌రూల్ లీగ్ శాఖలు నెలకొల్పబడ్డాయి. ఈ ఆంధ్రా హోమ్‌రూల్ లీగ్‌కు శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావు కార్యదర్శి. హరిసర్వోత్తమరావు శ్రీమతి సరోజినీ నాయుడు వ్రాసిన 'Awake mother' ను 'నూతన హైందవ మాతృగీతంగా'' అనువదించాడు. ఇంకా, "స్వరాజ్య పరమోద్దేశము'' "స్వరాజ్యం కోరుటకు కారణం'' "స్వాతంత్ర్య వర్ధనపత్రం'' మొదలగు కరపత్రముల ద్వారా, తన ఉపన్యాసముల ద్వారా హోంమ్‌రూల్ ఉద్యమమును వ్యాప్తి చేశాడు.

అనిబిసెంట్ కృషివలన విశాఖపట్నము, బర్హంపూర్, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, నరసాపూర్, గుంటూరు, తెనాలి, చిత్తూరు, మదనపల్లి మొదలగు చోట్ల హోంరూల్ లీగ్ శాఖలు స్థాపించబడ్డాయి. ఈ విధంగా 1917 వ సంవత్సరం మధ్య కాలమునాటికి

ఆంధ్రదేశమున 52 హోంరూల్ లీగ్ శాఖలు ఏర్పడ్డాయి. తెలుగు పత్రికలైన దేశమాత, హితకారిణి, ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక మొదలైనవి ఈ ఉద్యమ వ్యాప్తికి బాగా దోహదము చేశాయి.

**10.2.4. ఆంధ్రులపై హోమ్‌రూల్ ఉద్యమ ప్రభావము :** అనేకమంది ఆంధ్ర నాయకులు ముఖ్యముగా కాంగ్రెసువారు ఈ ఉద్యమమునందు చురుకుగా పాల్గొన్నారు. వారిలో ముఖ్యులు శ్రీ కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, చిలకమర్తి లక్ష్మీనరసింహం, అయ్యదేవర కాళేశ్వరరావు, పట్టాభి సీతారామయ్య, గుత్తి కేశవపిళ్ళే, బి. వెంకటపతి రాజు, న్యాపతి సుబ్బారావు మొదలైనవారు.

హోమ్‌రూల్ ఉద్యమమునకు మద్దత్తుగా చిత్తూరు, కృష్ణా, కడప, కర్నూలు మొదలగు జిల్లా సంఘాలు సమావేశమై, తదనుగుణముగా వ్యవహరించుటకు నిర్ణయించాయి. చిత్తూరు జిల్లా సంఘమునకు మార్చి 1916, అనిబిసెంట్, కృష్ణాజిల్లా సంఘమునకు ఏప్రిల్ 20, 1916, గుత్తి కేశవపిళ్ళె, కడపజిల్లా సంఘమునకు, నవంబరు, 1916, ఆజాద్ ఆలీఖాన్, కర్నూలు జిల్లా సంఘమునకు, నవంబర్, 1916, కె.వి.ఆర్ కృష్ణారామ అధ్యక్షులుగా ఈ కార్యక్రమములు నిర్వహించారు. రైళ్ళలో ఆంగ్లేయులనుసరించిన జాతి విచక్షణా విధానమునకు నిరసనగా మద్రాసులో భారతీయ విద్యార్థులు ఐరోపా వాసులకు రిజర్వు చేయబడిన రైలు పెట్టెలను ఆక్రమించారు. తత్ఫలితంగా జరిగిన ఐరోపా - భారతీయ సంఘర్షణలో ఆంధ్రులు ఎక్కువగా పాల్గొన్నారు. అనిబిసెంట్‌ను అరెస్టు చేసినప్పుడు, ఉద్యమ కారుల తీవ్రతను గ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం అనిబిసెంట్‌ను శిక్షనుండి తప్పించింది. ఈ విధంగా ఆంధ్రులపై హోంమ్‌రూల్ ఉద్యమ ప్రభావము ఎక్కువగా కనిపించింది.

**10.3.1 ఆంగ్లేయుల అణచివేత చర్యలు - ఆంధ్రుల ప్రతిఘటన :** హోంమ్‌రూల్ ఉద్యమమును అణచుటకు ఆంగ్లప్రభుత్వము తీసుకొన్న చర్యలను వరుస క్రమమున తెలుసుకుందాము.

1. విద్యార్థులు రాజకీయ సంస్థలలో చేరరాదని, రాజకీయ సమావేశములలో, బహిరంగ సభలలో పాల్గొనరాదని, ఇవి అమలు జరుపని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయుదుమని ఉత్తర్వులు జారీ చేసారు.
2. అనిబిసెంట్, ఆమె ముఖ్య అనుయాయులైన అరండేల్, వాడియాలు హోంరూల్ ఉద్యమ ప్రచారంతో ప్రజలు అలజడి సృష్టించుచున్నారని 16, జూన్, 1917, న ఉదరక్‌మండలం వద్ద అరెస్టు చేయబడ్డారు.
3. హోంమ్‌రూల్ ఉద్యమం బ్రాహ్మణుల ఉద్యమమని చిత్రించి, బ్రాహ్మణేతరులను తమ ఆధీనంలో నుంచుటకు ప్రయత్నించారు. ఈ విధానం వలన గుంటూరు, కర్నూలు, కడప మొదలగు చోట్ల వర్ణ సంఘర్షణలు జరిగాయి.

1. ఆంధ్రుల ప్రతిఘటన తీరు:- ఆంగ్లేయుల ఉత్తరువులను తొలుత ఉల్లంఘించినవారు విద్యార్థులు. గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, మద్రాసులోని విద్యార్థులు ప్రభుత్వ ఉత్తరువులను నిర్భయంగా నెదిరించారు. గుంటూరులో స్థానికాధికారులు అనేకమంది విద్యార్థులను విద్యాసంస్థలనుండి బహిష్కరించారు.
2. అనిబిసెంట్ అరెస్టుకు నిరసనగా ఆంధ్ర దేశమున పెక్కు సభలు, సమావేశములు జరిపారు. మద్రాసులో 'బీసెంటు నిధి' ని ఏర్పాటుచేసి హోంమ్‌రూల్ ఉద్యమం కొనసాగించుటకు నిర్ణయంచారు. దేశాభిమాని, దేశమాత మొదలగు పత్రికలలో ఈ అరెస్టును నిశితముగా విమర్శించారు. 14, ఆగస్టు 1917 న, మద్రాసు రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అనిబిసెంట్ విడుదలకై సత్యాగ్రహమును చేపట్టవలెనని తీర్మానించింది.
3. ఆంగ్ల ప్రభుత్వ బ్రాహ్మణేతర విధానం వలన కొందరు బ్రాహ్మణేతరులు హోంరూల్‌ని వ్యతిరేకించి మద్రాసు రాష్ట్రమున జస్టిస్ పార్టీగా ఏర్పడినను, హోమ్‌రూల్ ఉద్యమమును వ్యతిరేకించు బ్రాహ్మణేతరులకు భిన్నముగా ఆరు కోస్తా జిల్లాల బ్రాహ్మణేతరుల మహాసభ బెజవాడలో జరిగింది. ఈ సభకు సుప్రసిద్ధ కవి, పండితుడు ' కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి అధ్యక్షత వహించారు. నెల్లూరునుండి పనబాక పట్టాభి రామిరెడ్డి, రాయలసీమనుండి కేశవపిళ్ళె, రాఘునాధ మొదలియార్ మొదలైనవారు ఈ సమావేశానికి హాజరైనారు. ఈ సమావేశమున హోంరూల్ ఉద్యమమునకు మద్దత్తుగా వారు తీర్మానాలు చేశారు. ఇదే

సమయమున అయ్యదెవర కాళేశ్వరరావు చొరవ వలన ఆంధ్ర మహాసభ విజయవాడలో సమావేశమై మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌నందు బ్రాహ్మణేతరులకు ఎక్కువ ప్రాధాన్యమీయవలెనని తీర్మానించింది.

4. ఆంధ్ర మహాసభ మాంటేగు రాక సందర్భముగా స్వయంపాలన కావలెనని కోరుతూ 10 వేల సంతకములు సేకరించి స్వీకరించారు.

5. యుద్ధ సమయమున ఋణములకై ఆంగ్లోద్యోగులు, నేటి తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రపురం న్యాయవాదుల వద్దకు వెళ్ళగా వారు కాంగ్రెస్ - లీగ్ పథకము ఆమోదింపనిదే చందాలు ఇవ్వమని చెప్పారు.

6. గుంటూరులో 1918 లో లీగ్ కాశీనాధుని నాగేశ్వరరావు గారి అధ్యక్షతన సమావేశమై ఆంధ్ర మహాసభ లీగ్ పథకమును అమలు చేయవలసిందిగా కోరారు.

ఈ విధంగా బ్రిటిష్ అణచివేత విధానముల వలన హోంరూల్ ఉద్యమము క్షీణింపకపోగా మరింత బలవత్తరము చెందింది. ఈ లోపు మాంటేగ్ బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపన ఆంగ్లపాలన లక్ష్యమని 20, ఆగస్టు 1917 న ప్రకటించాడు, ఇట్లు ఆంధ్రుల ఆందోళనను, బ్రిటిష ప్రభుత్వవైఖరిలో మార్పును గ్రహించి, మద్రాసు ప్రభుత్వము, 16 సెప్టెంబరు, 1917 న అనిబిసెంటును విడుదల చేసింది.

అనిబిసెంట్ విడుదలానంతరము ఆమె అధ్యక్ష తన కలకత్తాలో 1917 న జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశమున తిలక్ కృషి ఫలితముగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘము ఏర్పడింది. ఇది ఆంధ్రులు సాధించిన ఘన విజయము. ఈ లోపల మొదటి ప్రపంచ యుద్ధము 11, నవంబరు 1918 న ముగిసింది. ఇందు మిత్ర రాజ్యములు విజేతలై విల్సన్ ప్రవచించిన జాతీయ స్వయం నిర్ణయ సూత్రమును ప్రపంచములోని అన్ని దేశములకు వర్తింపచేయుదుమని ప్రకటించారు. అంత ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం విజయవాడలో సమావేశమై పారిస్ శాంతి సమావేశమునకు తిలక్‌ను భారత ప్రతినిధిగా పంపవలెనని జాతీయ కాంగ్రెస్‌ను కోరారు. ఆ తర్వాత, కాంగ్రెస్ సమావేశము ఇంగ్లండులో జరుపవలెనని కూడా యోచించారు. ఇదే సమయంన అఖిల భారత కాంగ్రెసు కమిటీ ఢిల్లీలో సమావేశమై ముగ్గురు సభ్యులుగల ప్రతినిధి వర్గము - తిలక్, గాంధీజి, హసన్ ఇమామ్, పారిస్‌కు పంపనిర్దేశించారు. కాని ఆంగ్ల ప్రభుత్వము ఈ కోర్కెలను మన్నించలేదు. యుద్ధము ముగియుటతో హోమ్‌రూల్ ఉద్యమము కూడా అంతరించింది. తిలక్ మరణము, ఆంధ్రాలో జస్టిస్ పార్టీ ఏర్పాటు, అనిబిసెంట్ ఖిలాఫత్ ఉద్యమమును వ్యతిరేకించుట, మాంటేగు చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టుటవలన హోమ్‌రూల్ ఉద్యమము క్షీణించింది. ఏది ఏమైనా హోమ్‌రూల్ ఉద్యమము జాతీయ శక్తులను బలవత్తర మొనర్చుటలో అద్వితీయమైన పాత్ర పోషించింది.

### 10.3.2. హోమ్‌రూల్ ఉద్యమ ఫలితాలు :

1. భారత వ్యవహారముల మంత్రియగు మాంటేగు, ప్రతిపాలనాంశములో భారతీయులకు ప్రాతినిధ్యము పెంచబడునని, స్వీయపాలన పెంపొందింపబడునని, ఆంగ్లాధిపత్యములో బాధ్యతాయుత పరిపాలన ఏర్పాటు చేయబడునని 20, ఆగస్టు 1917 న ప్రకటించారు. ఈ ప్రకటనానుసారంగా మాంటేగు - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను ప్రవేశపెట్టారు.

2. సైన్యములో పాటించుచున్న జాతి విచక్షణా విధానము తొలగించారు.

3. ఆధ్రులలో రాజకీయ చైతన్యము వృద్ధిచెంది, తదుపరి గాంధీజీ నాయకత్వమున సాగిన ఉద్యమములందు చురుకుగా పాల్గొనుటకు దోహదము చేసింది.

4. సేనలోచేరే భారతీయుల సంఖ్య నానాటికీ తగ్గుముఖం పట్టుట కూడా, హోమ్‌రూల్ ఉద్యమ ప్రచారంవల్ల సంఘటిల్లింది.

హోమ్‌రూల్ ఉద్యమం రెండు ప్రముఖ ఉద్యమాలైన వందేమాతరం, సహాయ నిరాకరణలమధ్య సంభవించింది. ప్రజా భిప్రాయానికి మొట్టమొదటిసారిగా బ్రిటిస్ ప్రభుత్వం తల్గొగ్గి శ్రీమతి అనిబిసెంట్‌ని నిర్బంధ కారాగారంనుంచి విముక్తి చేసింది. కాని ఈ ఉద్యమ కాలమునుండే బ్రాహ్మణ, బ్రాహ్మణేతర విభేదాలు తారాస్థాయికి చేరాయి

**10.3.3 సమీక్ష :**

ఈ రెండు ఉద్యమాలైన వందేమాతరం, హోంరూల్, ఆంధ్రా ప్రజలను గాంధీ నాయకత్వంలో జరగబోయే స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంచేశాయి.

**10.3.4. వ్యాసరూప ప్రశ్నలు :**

1. వందేమాతర ఉద్యమ ఘట్టాలను వివరించండి.
2. హోంమ్‌రూల్ ఉద్యమాన్ని గురించి ఒక వ్యాసము వ్రాయండి.
3. వందేమాతర ఉద్యమ ప్రాముఖ్యతను తెలియజేయండి.
4. హోంమ్‌రూల్ ఉద్యమ ప్రాధాన్యతను వివరించండి.

## 10.3.5 Reference Books :


| | | | |
|---|---|---|---|
| 1. | Rao, P.R | : | History of Modern Andhra |
| 2. | Venkatarangaiah. M | : | Freedom Struggle in Andhra Pradesh |
| 3. | Venkatarangaiah M | : | Freedom Struggle in Telangana |
| 4. | Narayana Rao, K.V | : | Emergence of Andhra |
| 5. | Sarojini Regani | : | Highlights of Freedom Movement |
| 6. | Durga Prasad J | : | Andhrula Charitra (part I&II) |
| 7. | Sundaram K | : | Adhunika Andhradesa Charitra |
| 8. | Telugu Academy | : | Adhunika Andhradesha Chaitra |

పాఠం - 11

# సహాయ నిరాకరణోద్యమము.

విషయక్రమం

11.1 లక్ష్యం
11.2 పరిచయం
11.3 సహాయ నిరాకరణోద్యమ కారణాలు
11.3.1 రౌలత్ చట్టము
11.3.2 జలియన్ వాలాబాగ్ సంఘటన
11.3.3 మాంటేగు - ఛెమ్స్ ఫర్డ్ సంస్కరణలు
11.3.4 ఖిలాఫత్ ఉద్యమము
11.3.5 శాసన సభ ఎన్నికల బహిష్కరణ
11.3.6 నాగపూర్ కాంగ్రెస్ - డిశంబరు 1920
11.3.7 విజయవాడ అఖిల భారత కాంగ్రెస్ సమావేశం 1921
11.4.1 ఆంధ్రాలో సహాయ నిరాకరణోద్యమము
11.4.2 ఎన్నికలు బహిష్కరించుట
11.4.3 బిరుదులు, గౌరవపదవులు త్యజించుట
11.4.4 విద్యా సంస్థల బహిష్కరణ
11.4.5 న్యాయ స్థానముల బహిష్కరణ
11.5.1 పురపాలక సంఘముల బహిష్కరణ - ప్రముఖ సంఘటనలు
11.5.2 చీరాల - పేరాల 25, ఏప్రిల్ 1921
11.5.3 పల్నాడు అటవీ పన్నుల ప్రతిఘటనోద్యమము
11.5.4 పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమము
11.5.5 ఉద్యమము కొనసాగిన రీతి
11.5.6 బ్రిటిష్ వారి అణచివేత చర్యలు
11.5.7 ఉద్యమ క్షీణత
11.5.8 సహాయనిరాకరణోద్యమము నిలుపుదల, 12, ఫిబ్రవరి 1922.
11.6 సమీక్ష
11.7 వ్యాసరూప ప్రశ్నలు

## 11.1 లక్ష్యం :

సహాయ నిరాకరణోద్యమానికి దారితీసిన పరిస్థితులు, ఆంధ్రాలో సహాయ నిరాకరణోద్యమం, ఆంధ్రాలోని ప్రముఖ సంఘటనలు తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

## 11.2 పరిచయం :

1919 లో గాంధీజీ దేశ రాజకీయ రంగంలో ప్రవేశించేనాటికి ఆయనపేరు ప్రజలలో వ్యాపించి ఉంది. దక్షిణాఫ్రికాలో గాంధీజీ నిర్వహించిన సత్యాగ్రహం, అహమ్మదాబాద్ మిల్లు కార్మికుల ఉద్యమం, ఖేడా జిల్లా రైతుల విముక్తి ఇవన్నీ గాంధీజీకి కీర్తిని తెచ్చిపెట్టగా, సాంప్రదాయం, మతంపేరిట, ప్రజలకాయన చేసిన విజ్ఞప్తి వీరిని ఎంతో ఆకర్షించింది. అదే సందర్భంలో యుద్ధానంతరం బ్రిటిష్ ప్రభుత్వం రౌలట్ బిల్లు ప్రవేశపెట్టి భారతీయుల హక్కులను శాంతి సమయంలో కూడా హరించ తలపెట్టింది. ఈ బిల్లులు చట్టంగా రూపొందితే సత్యాగ్రహోద్యమం ప్రారంభిస్తానని గాంధీజీ ప్రకటించాడు.

చట్టాన్ని అధిక్షేపించే కార్యక్రమంలోనే, మద్రాసులో జరిగిన సమావేశానికి వేమవరపు రామదాసుపంతులు అధ్యక్షత వహించగా హరిసర్వోత్తమరావు ఉపన్యాసం చేశాడు. దేశమంతా ఇంచుమించు హర్తాళ్ ప్రశాంతంగా జరిగినప్పటికీ పంజాబులో మాత్రం దారుణ సంఘటనకు దారితీసింది. పంజాబులో కాంగ్రెస్ మహాసభ జరగవలసి ఉండగా ముందుగానే డాక్టరు కిచ్లూ, డాక్టర్ సత్యపాల్‌ను ప్రభుత్వం ప్రవాసానికి పంపటమే గాక గాంధీ పంజాబులో ప్రవేశించరాదని ఆంక్షలు విధించారు. 10 ఏప్రిల్‌న ప్రభుత్వ చర్యకు నిరసనగా అమృత్ సర్‌లో ఊరేగింపు జరిపిన ప్రజలు కాల్పులకు గురై అనేకమంది మరణించగా ఆగ్రహావేశంలో ఐదు, లేక, ఆరుగురు ఆంగ్లేయులను ప్రజలు చంపారు. 13 ఏప్రిల్‌న జలియన్‌వాలాబాగ్‌లో 20 వేలకు మించిన ప్రజలు బహిరంగ సమావేశంలో ఉండగా జనరల్ డయ్యర్ సైనికులతో వచ్చి మందు సామాగ్రి అయిపోయేవరకు కాల్పులు జరిపించాడు. 400 మంది అక్కడకక్కడే మరణించగా అనేకులు గాయపడ్డారు. మందు సామాగ్రి అయిపోగా జనరల్ డయ్యర్ మృతదేహాలను వదిలేసి వెళ్లిపోయ్యాడు. ఈ సంఘటన ఉదంతం దేశమంతా వ్యాపించి ప్రజల కోపతాపాలకు అవధిలేకపోయింది.

ఆంధ్రాలో కూడా కృష్ణా పత్రిక, ఆంధ్ర పత్రిక, హితకారిణి, ఈ బిల్లుల పట్ల వ్యతిరేకత ప్రకటించగా ప్రజలు గాంధీ పిలుపుకై ఎదురు చూశారు. అయినప్పటికీ ప్రభుత్వం రౌలట్ చట్టాన్ని ఆమోదించేసరికి గాంధీజీ సత్యాగ్రహం పిలుపునిచ్చాడు. దీని ప్రకారం ప్రజలందరూ ఒక రోజు నిరాహారదీక్ష, బహిరంగ సమావేశాలు జరపటం, అత్యవసర పనులు తప్ప మిగిలినదంతా స్థంభింపచేయటం జరగాలి. ఆంధ్రలో 6, ఏప్రిల్, 1919 నిరసన దినంగా అంగీకరించబడింది. బెజవాడ, రాజమండ్రి, గుంటూరు, నరసాపూర్, చిత్తూరు, నెల్లూరు, ఏలూరు, విశాఖపట్టణంలో హర్తాళ్ జరిగింది. బెజవాడ తాలుకా రైతులు కోలవెన్నులో సమావేశమై చట్టాన్ని అధిక్షేపించారు. ఆంధ్రలో గోదావరి, కృష్ణా జిల్లాల మహాసభలు ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ సత్యాగ్రహాన్ని ఆహ్వానించాయి. సహాయ నిరాకరణోద్యమం మొదలైంది.

## 11.3 సహాయ నిరాకరణోద్యమ కారణాలు : ఈ ఉద్యమం జరగడానికి అనేక సంఘటనలు దారితీశాయి.

**11.3.1 రౌలత్ చట్టము :** 1914 నుండి 1918 వరకు జరిగిన మొదటి ప్రపంచయుద్ధ కాలాన బ్రిటీష్ ప్రభుత్వం డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్టును 1915 న రూపొందించింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు సంక్రమించాయి. ఎవరినైనను, యుద్ధరోధకుడను నెపముపై, కోర్టుల అనుమతితో నిమిత్తం లేకుండ నిర్బంధించియుంచు అధికారం ప్రభుత్వానికి లభించింది. దీనివలన యుద్ధకాలాన విప్లవోద్యమాలను అన్నింటిని ప్రభుత్వం అణచివేసింది. యుద్ధకాలమునకే ఆ చట్టం పరిమితమగుటవలన, యుద్ధానంతరమున దానిని అమలు జరుపుటకు తమకు అధికారము లేనందున ప్రజోద్యమాన్ని అనచుటకై ప్రభుత్వం నూతన రౌలత్ బిల్లుల్ని ప్రవేశపెట్ట తలపెట్టింది. ఈ బిల్లులు కనుక చట్టరూపాన్ని పొందితే, ఎట్టి విచారణ లేకుండానే, ప్రజలను కారాగార బద్ధులుగ చేయు అధికారం ప్రభుత్వానికి లభించనుంది. కాని ఈ బిల్లులను ప్రజానీకము ఏకగ్రీవంగ ప్రతిఘటించింది. ఇదే సమయాన భారత రాజకీయాలలో ప్రవేశించిన గాంధీ, రౌలత్ బిల్లుల్ని విమర్శించి ఫిబ్రవరి 24 న ఒక ప్రకటన చేయుచూ, రౌలత్‌ను ప్రభుత్వం ఆమోదించిన యెడల

తాను దీనికి వ్యతిరేకంగా సత్యాగ్రహోద్యమాన్ని నడిపెదనని ఉద్ఘాటించాడు గాంధీజీ సలహాను ఒక తొందరపాటు చర్యగ ప్రభుత్వం ప్రకటించి, మార్చి 1919 న మొదటి వారంలో రౌలత్ బిల్లును చట్టంగా ఆమోదించి అమలులోనికి కొనివచ్చింది. గాంధీజీ సత్యాగ్రహాన్ని ఆరంభించి, త్యాగానికి, బాధలకు సన్నిద్ధులై, దేశ సేవకే అంకితులు కండని ప్రజల్ని అభ్యర్థించాడు.

**11.3.2 జలియన్‌వాలాబాగ్ సంఘటన :** మార్చి 1919 న ఆంగ్ల ప్రభుత్వము ప్రవేశ పెట్టిన రౌలత్ బిల్లును ప్రతిఘటించుటకు గాంధీజీ దేశ వ్యాప్తముగా పర్యటించి సత్యాగ్రహము ప్రారంభించవలెనని ప్రజలను ఉద్బోధించాడు. ఈ పర్యటనలో గాంధీజీ ఆంధ్ర దేశమున పర్యటించి, సికింద్రాబాదు, విజయవాడ, మద్రాసులందు ఉపన్యాసాలిచ్చాడు. విజయవాడలో రామమోహన గ్రంథాలయ సభలో ఆయన ఉపన్యాసము శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు అనువదించారు. అటులనే రౌలత్ బిల్లునకు నిరసనగా కాంగ్రెస్ 6, ఏప్రిల్, 1919 లో హర్తాళ్ పిలుపునిచ్చింది. ఆంధ్రాలో ఈ హర్తాళ్ విజయవంతముగా నిర్వహించారు. కాని పంజాబులో 10, ఏప్రిల్ 1919 న డా॥ సత్యపాల్, డా॥ కిచ్లూలను ఆంగ్లేయులు నిర్బంధించారు. దీనిని నిరసనగా 13, ఏప్రిల్, 1919 న జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన సభపై జనరల్ డయ్యర్ విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. అందు సుమారు 400 మంది మరణించారు, 1200 మంది గాయపడ్డారు. జలియన్‌వాలాబాగ్ దురంతమును ఆంధ్ర నాయకులు, గోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లా సంఘములు, దేశమాత, ఆంధ్రవాణి మొదలగు పత్రికలు తీవ్రముగా ఖండించాయి. గుంటూరు బార్ సంఘము జనరల్ డయ్యర్‌ను అభిశంసింప వలసిందిగా కోరింది. పంజాబులో చెలరేగిన అశాంతిని అణచుటకు సైనిక శాసనము ప్రవేశపెట్టి ప్రజలను కాపాడుటకు గాంధీజీ తన సత్యాగ్రహోద్యమమును నిలుపుదల చేశాడు.

**11.3.3 మాంటేగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు :** ఈ సంస్కరణల ప్రకారము, భారతదేశ పరిపాలనా విధానంలో ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థ ప్రవేశ పెట్టబడింది. దీని ప్రకారము శాసనాలు చేయవలసిన పరిపాలనాంశాలను 47 కేంద్రజాబితాలోను, 51 రాష్ట్ర జాబితాలోను విభజించబడినాయి. విదేశ వ్యవహారాలు, రక్షణ, రైల్వేలు, పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్‌లు, కేంద్ర ప్రభుత్వానికి, విద్య, ఆరోగ్యం, నిర్మాణాలు, రెవెన్యూ వగైరాలు రాష్ట్ర ప్రభుత్వానికిచ్చారు. ఇటువంటి ద్వంద్వ పరిపాలనను ఆంగ్లేయులు, భారతీయులముందు పెట్టారు. ఇదిలావుండగా, జలియన్‌వాలాబాగ్ దురంతాలు స్మృతి ప్రధాన పాత పడకముందే, భారత జాతీయ కాంగ్రెస్ తన వార్షిక మహాసభా సమావేశాన్ని అమృత్‌సర్‌లో జరిపింది. ఈ సభకు అధ్యక్షత వహించిన మోతీలాల్ నెహ్రూ " మీ తోబుట్టువులు వందల కొలదిగ ఒక దురంతానికి బలియై శోచనీయ రీతిలో మరణించినందులకు మీరు గాఢ సంతాపాన్ని చెందు సమయాన మీరిట సమావేశమయ్యారు. ఇట్టి సమావేశానికి నన్ను మీరు అధ్యక్షునిగ ఎన్నుకొనుటలో అట్టి శోక సంతప్తులందెల్ల ప్రథముడుగ నేను పరిగణనీయుడను" అని తన పరివేదనను వెల్లడించాడు. ఈ సమయానికి, మాంటేగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు చట్టరూపం పొందాయి. ఈ కాంగ్రెసు మహాసభ సమావేశం కాబోవుటకు ముందుగ ప్రభుత్వం రాజకీయ ఖైదీలను అందరిని విడుదల చేసింది. ఇందువలన సంస్కరణల పట్ల సుముఖ భావం రాజకీయ వాదులలో కలుగ గలదని ప్రభుత్వం ఆశించింది. భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ ఈ సంస్కరణలను గురించి చర్చించిన తదుపరి ఒక తీర్మానం చేయుచు "ఈ సంస్కరణలు అసమగ్రాలు, అసంతృప్తి కారణాలు, నిరాశ జనకములు" అని తన అభిప్రాయాన్ని వెల్లడించింది. భారత దేశాన ఒక సంపూర్ణ బాధ్యతాయుత ప్రభుత్వాన్ని నెలకొల్పుటకై తగు చర్యలను బ్రిటీష్ పార్లమెంటు తీసికొనవలసి యున్నదని ఆ మహాసభ హెచ్చరించింది. అయినప్పటికి, ఆ సంస్కరణల్ని అమలుపరచుటలో కొంత కృషిని చేయుటకు తన సన్నద్ధతను కూడా ఆ సమావేశంలో మహాసభ తెల్పింది. ఆంధ్రదేశపు తెలుగు పత్రికలు మాంటేగు-ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణల అసమగ్రతయెడ తమ గాఢ అసంతృప్తిని స్పష్టంగా వెల్లడించాయి. అయినను, అమృత్‌సర్ ఆమోదించిన తీర్మానంలో, ఆ సంస్కరణల్ని అమలుపరచుటకు సన్నద్ధతను కాంగ్రెస్ తెలియపరచుట వలన, తెలుగు పత్రికలును ఆ వరవడినే అనుసరించుచు సంస్కరణల్ని ఆమోదించి, వానిని అనుసరించి జరుగనున్న ఎన్నికలలో భారతీయులు పాల్గొనదగునని సలహానిచ్చారు. కొండా వెంకటప్పయ్య, సాంబమూర్తి, కాళేశ్వరరావు మొదలగు ఆంధ్రనాయకులు, రానున్న ఎన్నికలను గురించి ప్రజలకు సవిరంగా తెలియజేయుటకై వివిధ జిల్లాలలో పర్యటన చేశారు.

**11.3.4 ఖిలాఫత్ ఉద్యమము :** మొదటి ప్రపంచ యుద్ధమున ఆంగ్లేయులు ఖలీఫా పదవిని రద్దుచేయుటలో భారతీయ ముస్లింలు, మహమ్మద్‌ఆలీ, షౌకత్‌ఆలీ, డా॥ అన్సారి నాయకత్వమున ఖిలాఫత్ ఉద్యమమును ప్రారంభించారు. కాని మే 1920 లో జరిగిన సెవర్స్ సంధిలో ఖలీఫా పదవి పునరుద్ధరింపబడలేదు. అందువలన భారతీయ ముస్లింలు అసంతృప్తిగా ఉన్నారు. ఆ తర్వాత ముస్లింలు, జూన్,

1920, న అలహాబాదునందు గాంధీజీని కలుసుకొని, ఆంగ్లేయులను ప్రతిఘటించి, కాంగ్రెసుతో సహకరించుటకు అంగీకరించారు. అంతట స్వరాజ్య సాధనకు హిందూ ముస్లింల ఐక్యతకు, 1919 సంస్కరణల ప్రతిఘటనకు, పంజాబు దురంతముల పరిహారనకు సహాయ నిరాకరణోద్యమమే మార్గమని గాంధీజీ నిర్దేశించాడు. డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య కాంగ్రెస్ చరిత్ర గ్రంథమున " పంజాబుకు (ప్రజలకు) ఖిలాఫత్ ఉద్యమమునకు జరిగిన అన్యాయముల పరిహారణకే గాంధీజీ మరల అహింసాత్మక సహాయ నిరాకరణోద్యమమును ప్రారంభించుటకు నిర్దేశించెనని" వక్కాణించెను.

**11.3.5 శాసనసభ ఎన్నికల బహిష్కరణ :** 4, సెప్టెంబరు, 1920 న కాంగ్రెసు మహాసభా ప్రత్యేక సమావేశం కలకత్తాలో జరిగింది. ఈ సమావేశానికి హాజరై, మహాత్ముని రాజకీయ విధానాన్ని బలపర్చిన ఆంధ్రులలో కాశేశ్వరరావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, బులుసు సాంబమూర్తి, గొల్లపూడి సీతారామశాస్త్రి, దండు నారాయణరాజు, పేటబాపయ్య, కోటగిరి వెంకటకృష్ణారావు మొదలగు ప్రముఖులు ఉన్నారు. కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య కూడా ఈ సమావేశానికి హాజరైయ్యారు. గాంధీజీ ప్రతిపాదించి శాసనసభా బహిష్కరణ తీర్మానాన్ని కొండా వెంకటప్పయ్య మొదట వ్యతిరేకించినా, తర్వాత సుశిక్షతుడయిన కాంగ్రెస్ వాదివలె ఆయన కాంగ్రెస్ మహాసభా తీర్మానాన్ని ఆమోదించాడు. మద్రాసు శాసనసభాలోని తన సభ్యత్వానికి రాజీనామా చేశాడు. కలకత్తా కాంగ్రెస్ నుండి తిరిగి వచ్చిన తరవాత ఆంధ్రనాయకులు తమ జిల్లాలలో పర్యటించి, ప్రజలకి సహాయ నిరాకరణ విధానాన్ని విశదీకరించి, రానున్న ఎన్నికలలో ఓటును వేయకుండ బహిష్కరింపవలసిందిగా వారిని హెచ్చరించారు. కోర్టుల్ని బహిష్కరించవలసిందిగ వారు లాయర్లను అర్థించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ, పోలిశెట్టి హనుమంతయ్య గుప్త, మదనపల్లి నరసింహాచార్యులు వంటి లాయర్లు, కాంగ్రెస్ ఆదేశాన్ని మన్నించారు. కాంగ్రెస్ తీర్మానంను సారంగ ప్రభుత్వ విద్యాసంస్థలను బహిష్కరించి, వెలుపలికి వచ్చిన వారిలో కళా వెంకటరావు ఒకడు. అప్పుడాయన మచిలీపట్నంలోని నోబుల్ కాలేజీలో బి.యస్.సి. కడపటి సంవత్సరపు తరగతిలో విద్యార్థిగా వుండేవాడు. కాంగ్రెస్ తీర్మానాలను ఆంధ్రలోని అనేక జిల్లాలలో ప్రచారం జరపడానికి అనేకమంది ఆంధ్రనాయకులు మహాసభలు జరిపారు. ఇదే సంవత్సరం అక్టోబరులో గోదావరి జిల్లా పెద్దాపురంలో జరిగిన జిల్లా జాతీయ మహాసభ సమావేశానికి, గంపలగూడెం కుమారరాజా, కోటగిరి వెంకటకృష్ణారావు అధ్యక్షత వహించారు. శాసనసభల బహిష్కరణాన్ని ఆమోదిస్తూ ఆ సమావేశం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. నెల్లూరు జిల్లా జాతీయ మహాసభా సమావేశం నెల్లూరులో జరిగింది. దాని ఆహ్వాన సంఘానికి తిక్కవరపు రామిరెడ్డి అధ్యక్షుడుగ వ్యవహరించాడు. కొండా వెంకటప్పయ్య ఆంధ్ర జిల్లాలలో అన్నింటా పర్యటించి కాంగ్రెస్ సందేశాన్ని అందచేశాడు. ఈ రీతిగా ప్రజానీకంలో కాంగ్రెస్ వాదులు సాగించిన ప్రచార కృషి ఫలితంగా ఎన్నికల బహిష్కరణ విజయవంతమైంది. చాలా కొద్ది మంది మాత్రమే ఎన్నికల్లో ఓటు వేశారు. గుంటూరులో ఓట్లున్న వారిలో 15 శాతం మాత్రమే ఓటుచేయగా, రాజమండ్రిలో ఓట్లున్న 120 మంది ముస్లిములలో ఒకడు మాత్రమే ఓటు వేశాడు. ఆ ఒక్కడును ఒక ప్రభుతోద్యోగి. జిల్లాలలో పెక్కింట, ఓట్ల పెట్టెలు ఖాళీగానే పోలింగ్ స్టేషనులనుండి తిరిగి పంపబడ్డాయి.

**11.3.6 నాగపూర్ కాంగ్రెస్, డిసెంబరు 1920 :** నాగపూర్‌లో కాంగ్రెస్ మహాసభ చాలా ఉత్సాహంగా జరిగింది. ప్రజలు తమ విధానానికి, ఈ విధంగా తెలిపిన ఆమోదం వల్ల గాంధీజీ నాగపూర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభా సమావేశంలో, ఇంకొక అడుగు ముందుకు వేయుటకు ఉత్సహించాడు. ఈ సమావేశానికి విజయరాఘవాచారి అధ్యక్షత వహించాడు. ఈ సభలో సుమారు 16,000 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో అత్యధిక సంఖ్యాకులు న్యాయవాదులు, విద్యార్థి లోకానికి చెందినవారు. ఈ ప్రతినిధలు అందరును స్వదేశీ వస్త్రాలనే ధరించారు. మొట్టమొదటిగా ఈ సమావేశంలోనే గాంధీ టోపీలను కాంగ్రెసు వాదులు ధరించుట వా డుకలోనికి వచ్చింది. ఈ సమావేశంలో గాంధీజీ, శాంతియుతములైన న్యాయబద్ధములైన అన్ని పద్ధతులను అవలంబించి స్వరాజ్యాన్ని సాధించుటయే కాంగ్రెస్‌యొక్క ధ్యేయమని ప్రకటించాడు. 'రాజ్యాంగ విహిత' అనే పదానికి బదులుగా 'న్యాయబద్ధం' అనే పద్దాన్ని కావలెననే అపుడు చేర్చడం జరిగింది. తమ పరమ గమ్యమగు స్వరాజ్యసిద్ధికై ఎన్నికల్ని, కోర్టులను, విద్యాశాలలను బహిష్కరించుట మాత్రమే చాలదనియు, పన్నుల చెల్లింపుల నిరాకరణకు సైతం పూనుకొనవలసియుండుననియు అపుడు స్పష్టం చేశారు. కాంగ్రెస్ వాదులు తూచ, తప్పకుండ తన సహాయ నిరాకరణ విధానాన్ని అవలంబించి కొనసాగించిన యెడల ఒక సంవత్సరంలోనే స్వరాజ్యం లభించగలదని గాంధీజీ ఆ సమయంలో [illegible]ంచాడు. ఈ రీతిలో కాంగ్రెస్‌యొక్క ధ్యేయాన్ని ఆ మహాసభ నిర్వచించుట వలన, అదివరలో కాంగ్రెస్ తన ధ్యేయంగ

ప్రకటించుకొనినటుల బ్రిటీష్ ప్రభుత్వానికి, రాజ్యాంగ విహితమైన ఆందోళనా పద్ధతులకు కట్టుబడి ఉండవలసిన రీతికి స్వస్తి చెప్పబడింది. ఈ నాగపూర్ సమావేశం తరవాత ప్రాంతీయ కాంగ్రెస్ ల పునర్వ్యవస్థీకరణ జరిగి, భాషా, ప్రాంతాల వారీగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటైనవి. నాగపూర్ కాంగ్రెస్ చేసిన తీర్మానాల వలన జాతిపై ఒక గురుతర బాధ్యత పడింది. ఆ తీర్మానాల్ని అనుసరించి అఖిల భారత కాంగ్రెస్ కమిటీయు, కార్యవర్గాల్ని నెలనెలా వివిధ ప్రదేశాలందు వరుసగ సమావేశాల్ని 1921 లో నిర్వహించారు. గాంధీజీ పిలుపునందుకొని ఆంధ్ర దేశమున సహాయ నిరాకరణోద్యమములో ప్రముఖ పాత్ర వహించిన వారెవరనగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య, ఉన్నవ లక్ష్మీనారాయణ, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, మతం బాలసుబ్రమణ్య గుప్త మొదలైనవారు.

**11.3.7 విజయవాడ అఖిల భారత కాంగ్రెస్ సమావేశము - 1921 :** ఆంధ్రదేశ జాతీయోద్యమ చరిత్రలో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశం మహోజ్వలమైంది. ఈ సమావేశమునకు (మార్చి 31 - ఏప్రియల్ 1,1921) జాతీయ నాయకులైన గాంధీజీ, కస్తూరిబాయి, వల్లభభాయి పటేల్, మోతీలాల్ నెహ్రూ, జవహర్‌లాల్ నెహ్రూ, పురుషోత్తమదాసు టాండన్ మొదలైనవారు హాజరైయ్యారు. సహాయ నిరాకరణోద్యమము పని చేయు తీరు తెన్నులను పరిశీలించుటకై ఈ సమావేశము ఏర్పాటు చేయబడింది. ఈ స్థలమే నేడు "గాంధీనగర్" గా పిలువబడుతుంది. ఈ సమావేశంలో ప్రముఖ ఆంధ్రా నాయకులందరు పాల్గొన్నారు. టంగుటూరి ప్రకాశం, కొండా వెంకటప్పయ్య, బులుసు సాంబమూర్తి, పట్టాభి సీతారామయ్య, దువ్వూరి సుబ్బమ్మ, రాజాజీ, కె.సంతానం మొదలైనవారు సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణమునుండి శ్రీ మాడపాటి హనుమంతరావు పరిశీలకుడుగా వచ్చాడు. అప్పుడు సరైన రవాణా సౌకర్యములు లేకపోయినను అనేక కష్టములకోర్చి ఆంధ్ర నలుమూలలనుండి సుమారు రెండు లక్షలమంది ప్రజలు ఈ సమావేశమునకు హాజరైయ్యారు.

**సమావేశ ఆకర్షణ :** శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ రచించిన "మా కొద్దీ తెల్లదొరతనము", "దండాలు దండాలు భరతమాత" (రచయిత ఆలియదు) మొదలైన దేశభక్తిగీతాలను ఆలాపించి, ఆంధ్ర ప్రజానీకంలో దేశభక్తిని రగుల్కొల్పారు. ఇంతేకాదు, "మహాత్మాగాంధీ దర్శనమే పుణ్యము" "మముబ్రోవ వెలసితివా మహాత్మాగాంధీ" "మహాత్మాగాంధీకి జై, కాంగ్రెసుకు జై" మొదలైన నినాదాలతో కాంగ్రెస్ సమావేశమును ఉద్రూతలూగించారు. గాంధీజీ ఆదేశంపై చరఖా చిహ్నమును జాతీయ త్రివర్ణ పతాకానికి పింగళి వెంకయ్య రూపకల్పన చేశాడు.

ఈ సమావేశములో తీసికొన్న నిర్ణయాలలో ముఖ్యమైనవి, తిలక్ స్వరాజ్య నిధికి ఒక కోటి రూపాయలు సమకూర్చుట, కోటిమందిని కాంగ్రెస్ సభ్యులుగా చేర్చుట, ఖద్దరు ఉద్యమమును ప్రోత్సహించుటకు 20 లక్షల చరఖాలను సేకరించుట, గ్రామపంచాయితీల ఏర్పాటు, మద్యపాన నిషేధనకు పాటుబడుట, అంటరానితనము నిర్మూలన, హిందూ-ముస్లిం ఐక్యత, జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు మొదలైనవి. ఈ సమావేశ విశిష్టత ఏమిటంటే దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తన "రామదండు" వాలంటీర్లతో సమావేశ నిర్వహణలో తోడ్పడడం.

ఈ సమావేశానంతరము గాంధీజీ, కొండావెంకటప్పయ్యతో ఆంధ్రదేశములోని కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నము, గుంటూరు, వేటపాలెం, బాపట్ల, చీరాల, నెల్లూరులలో పర్యటించి సహాయ నిరాకరణోద్యమమునకు ప్రజలను సంసిద్ధము చేసారు. "తిలక్ స్వరాజ్యనిధికి" విరాళములను సేకరించారు. ఈ నిధికి విరాళమిచ్చుటలో స్త్రీలు ముందంజ వేశారు. మాగంటి అన్నపూర్ణమ్మ తన నగలను "స్వరాజ్యనిధి" కిచ్చుటేగాక, విదేశీ వస్త్రముల బహిష్కరించి, ఖద్దరు బట్టలు ధరించింది. పెక్కు విద్యార్థులు కళాశాలలను బహిష్కరించారు. అట్టి వారిలో కళా వెంకటరావు, మానికొండ సత్యనారాయణశాస్త్రి, కామినేని వెంకటప్పయ్య మొదలైనవారు ఉన్నారు. ఇట్లు విజయవాడ సమావేశము గాంధీజీ పర్యటన ఆంధ్రులలో నూతన చైతన్యము కల్గించాయి. దేశభక్తి ప్రేరితులై ప్రజలు సామూహిక పాటలు పాడుట, హరికథలు, భజనలు, సంకీర్తనలు చేయుట పరిపాటి అయింది. తుదకు సన్యాసులు సైతము దేశభక్తి గేయములు పాడుటయే విశేషము. ఇట్టివారిలో కాకినాడకు చెందిన "అయ్యప్ప భగవతార్" అనునాతనిని ప్రభుత్వము అరెస్టు చేసింది. అట్లాగనే 1921 ఫిబ్రవరి 2 న మహోదయ ఉత్సవ సందర్భమున, ఆగస్టు 1921 లో వచ్చిన కృష్ణా పుష్కరముల సందర్భమున, తిలక్, గాంధీజీ జన్మదినోత్సవముల సందర్భమున స్వరాజ్య సాధనే లక్ష్యముగా ప్రచారము రసవత్తరంగా సాగింది.

**11.4.1 ఆంధ్రలో సహాయ నిరాకరణోద్యమము :** తక్కిన భారతదేశమునందు సాగిన తీరుగనే ఆంధ్ర ప్రాంతంలో సైతము సహాయ నిరాకరణోద్యమం బహుముఖంగా సాగింది. వీనిలో ప్రధానమైనవి: (1) ఎన్నికలు బహిష్కరించుట (2) బిరుదులు గౌరవపదవులు

త్యజించుట (3) విద్యాసంస్థల బహిష్కరణ, (4) న్యాయస్థానముల బహిష్కరణ (5) పురపాలక సంఘముల బహిష్కరించుట, (6) విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తువుల వాడుక, (7) మధ్యపాన నిషేధ కార్యక్రమము, (8) గ్రామాధికారుల సామూహిక రాజీనామాలు.

**11.4.2. ఎన్నికలు బహిష్కరించుట :** భారతప్రభుత్వ చట్టం ప్రకారము (1919) శాసనసభలకు ఎన్నికలు నిర్ణయం జరిగింది. ఎన్నికలు దగ్గరపడే కొలది, గాంధీజీ పిలుపునందుకొని శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, కె. వెంకటాచలపతయ్య, వి. రాజగోపాలరావు, సభాపతి ఆర్. ఓబుల రెడ్డి మొదలైనవారు, తమ కౌన్సిల్ అభ్యర్థిత్వములను ఉపసంహరించుకొన్నారు. శ్రీ కొండ వెంకటప్పయ్య, సి. నరసింహరాజు, బి. వెంకటపతిరాజు మొదలైనవారు శాసనసభ సభ్యత్వములకు రాజీనామా చేశారు. ఈ ఎన్నికలను కాంగ్రెస్ అభ్యర్థులేగాక, కాంగ్రెస్ ఓటర్లు కూడా బహిష్కరించారు. కొన్నిచోట్ల ఖాళీఓట్ల పెట్టెలు మాత్రమే పంపారు. ఈ సదవకాశము వినియోగించుకొని జస్టిస్ పార్టీ, బ్రాహ్మణేతరుల పార్టీ, మద్రాసు ప్రెసిడెన్సీ పాలనను హస్తగతము చేసికొని, గాంధీజీ సహాయ నిరాకరణోద్యమమును ప్రతిఘటింప సాగింది.

**11.4.3 బిరుదులు, గౌరవపదవులు త్యజించుట :** మొదట గాంధీజీయే తనకు ఆంగ్ల ప్రభుత్వము మొదటి ప్రపంచయుద్ధ కాలమున ఇచ్చిన "కైజర్ - ఇ - హింద్" బిరదమును త్యజించాడు. ఆయన అడుగుజాడలలో నడచి మౌల్వీజహీద్ హుస్సేన్ సాహెబ్ 'షామ్సుల్ ఉలేమా' అను బిరుదును త్యజించాడు. వి. రామదాసు పంతులు మద్రాసు విశ్వవిద్యాలయ సిండికేటు సభ్యత్వమునకు రాజీనామా చేశాడు. ఐరుగురు గౌరవ మెజిస్ట్రేటు పదవులులకు రాజీనామా చేశారు. వారిలో ముఖ్యులు (1) విజయవాడకు చెందిన గులామ్ మొయినుద్దీన్ సాహెబ్ (2) గుంటూరుకు చెందిన మౌల్వీమహమ్మద్ రాజాసాహెబ్ (3) ఏలూరు హనుమంతురావు, (4) భీమవరమునకు చెందిన సత్యదేవ సోమేశ్వరరావు పంతులు మొదలైనవారు.

**11.4.4 విద్యాసంస్థల బహిష్కరణ :** గాంధీజీ పిలుపు నందుకొని పలువురు విద్యార్థులు విద్యాసంస్థలను బహిష్కరించారు. ఇందుకుతగు ప్రచారాన్ని కల్పించటకై ప్రతి కేంద్రమునందు విద్యార్థులు ఊరేగింపులు నిర్వహించారు. జాతీయ విద్యను అభ్యసించుచూ, గ్రామీణసేవలో పాల్గొనవలసిందిగ విద్యార్థుల్ని, ఉద్బోధించు కరపత్రాలు పంచారు. విద్యార్థి సేవాసమితులు, సంకీర్తన దళాలు ఏర్పాటు చేశారు. ఇందలి సభ్యులు రాట్నం వడకుటను, నేతపనిని నేర్పుటయేగాక, మధ్యనిషేధ ప్రచారాన్ని కూడా నిర్వహించారు. 1921 - 22 సంవత్సరపు సహాయ నిరాకరణోద్యమ కాలాన విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పిన వారిలో కొందరు; మచిలీపట్నంలోని నోబిల్ కాలేజీకి చెందిన చేత్రావర్ణల రామకృష్ణమ్మ, అమలాపుర వాసి కళా వెంకటరావు, ఉరుటూరు వాస్తవ్యుడు మానికొండ సత్యనారాయణ, నెల్లూరు కాపురస్థులు దొమ్మాశేషురెడ్డి, రామచంద్రుని వెంకటప్ప, వెన్నెలకంటి రాఘవయ్య, పోతూరి సుబ్బరామమ్మ, ఇక ఆకాలంలో తమ ఉపాధ్యాయ పదవుల్ని వదలుకొన్నవారిలో కొందరు; కొడాలి ఆంజనేయులు, గురుజాడ రాఘవశర్మ, గడియారం సాంబయ్య, సూరంపాటి కనకరాజు, మొత్తంమీద మచిలీపట్నం ఆర్ట్స్ కాలేజీనుండి 20 మంది, ఆ నగరంలో క్రిస్టియన్ మిషన్ కాలేజీ నుండి 60 మంది, పర్లాకిమిడి రాజావారి కాలేజినుండి 30 మంది, విశాఖపట్నం నందలి ఏ.వి.యస్ కాలేజి, సి.బి యం హైస్కూలునుండి ఆరుగురు విద్యార్థులు తమ చదువులు మానివేసి, దేశసేవకై వెలుపలికి వచ్చారు. ఇంతటితో ఊరకుండక, ప్రభుత్వం తన ఆధీనములోని పాఠశాలలను, కాలేజీలను జాతీయ విద్యాసంస్థలుగ మార్పు చేయాలనికోరుతూ విద్యార్థులు ప్రదర్శనల్ని, ఆదోనల్ని లేవదీసారు. విజయనగరం నందలి మహారాజా కాలేజికి, మునిసిపల్ హైస్కూలునకు చెందిన సుమారు 1000 మంది విద్యార్థులు 4, ఫిబ్రవరి 1921 న తరగతులకు పోకుండ సమ్మెచేసారు. తెనాలిలోని హైస్కూలుకు చెందిన విద్యార్థులు దాదాపు 1050 మంది ఫిబ్రవరి 1921 లో ఒకవారం దినాలపాటు తరగతుల నుండి వైదొలగి, తమ పాఠశాలను జాతీయ సంస్థగ పరివర్తన చేయవలెనని కోరారు. ప్రజలలోని ఈ గాఢ కాంక్షకు, వారి ఒత్తిడికి ఫలితంగ 1921 లో 44 జాతీయ పాఠశాలలు రూపుదిద్దుకొన్నాయి.

**11.4.5 న్యాయ స్థానముల బహిష్కరణ :** న్యాయస్థానాముల బహిష్కరణోద్యమములో మొదట పాల్గొన్న ఖ్యాతి గుంటూరు బార్ అసోసియేషన్ వారికి దక్కింది. వీరుమొత్తం 14నెలలు ప్రాక్టీసు మానివేసారు. క్రమముగా ఈ ఉద్యమము మిగిలిన ఆంధ్ర ప్రాంతములకు వ్యాపించింది, ఈ విధంగా సుమారు 108 మంది న్యాయవాదులు కోర్టులను బహిష్కరించారు. అట్టివారిలో ముఖ్యులు; కొండా వెంకటప్పయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, టంగుటూరి ప్రకాశం, ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి నరసింహాచార్యులు, డి. మధుసూదనరావు, పోలిశెట్టి హనుమంతయ్య గుప్త, శిష్టా పురుషోత్తమ్, మొదలైనవారు బ్రిటీషు కోర్టులను బహిష్కరించి వాని స్థానములో

పంచాయితీ న్యాయస్థానముల నేర్పరచారు. జూన్, 1921 నాటికి ఆంధ్రలో 37 స్వదేశీ కోర్టులు ఏర్పడ్డాయి. నరసాపూర్ తాలుకా మెట్టపాలెం గ్రామములో గ్రామస్థులే వందలాది కేసులకు తీర్పులనిచ్చారు.

**11.5.1 పురపాలక సంఘముల బహిష్కరణ :** ప్రముఖ సంఘటనలు పురపాలక సంఘసంస్థల పాలనను స్థంభింప చేయుటకు ఆంధ్రులు సహాయ నిరాకరణోద్యమమును వానికి విస్తరించారు. వాటిలో ముఖ్యమైనవి నరసరావుపేట, రేపల్లె, విజయవాడ, చీరాల మొదలైనవి.

1. నరసరావుపేట : 1920 మద్రాసు పురపాలక సంఘచట్టమునకు వ్యతిరేకముగా ఆందోళన చేసిన ప్రథమ పురపాలక సంఘము ఈ చట్టమునకు వ్యతిరేకముగాన నర్సారావుపేటలోని 12 మంది పురపాలక సంఘ సభ్యులలో సగముమంది తమ సభ్యత్వములకు రాజీనామాచేశారు. కాని ఈ చర్యవలన ఎట్టి ఫలితము లేకపోయింది.

2. రేపల్లె : 1 సెప్టెంబర్, 1920, నుండి రేపల్లె పురపాలక సంఘముగా మార్చబడింది. ఈ మార్పుకు వ్యతిరేకముగా పురపాలక సంఘములోని 12 మంది సభ్యులలో 8మంది రాజీనామాచేశారు. మునిసిపాలిటీని రద్దుచేయవలెనని, నూతన పన్నులను వసూలు చేయరాదని కోరారు. జట్కా డ్రైవర్లు, ఎడ్లబండి వారు పన్నుల నోటీసులను తిరస్కరించారు. ఇట్టి పరిస్థితిలో స్థానిక స్వపరిపాలనా శాఖా మాత్యుడు పి. రామరాయమణింగార్ (జస్టీస్ పార్టీ) రేపల్లె సందర్శించి, అది గ్రామీణ ప్రాంతమని నూతనముగా ఏర్పాటు చేయబడిన పురపాలక సంఘమును రద్దు చేశారు.

3. విజయవాడ : 1921 మద్రాసు పురపాలక సంఘచట్ట ప్రకారము విజయవాడ పురపాలక సంఘమునకు ఎన్నికలు జరగవలసి ఉన్నది. కాని ఎన్నికలు జరిపితే కాంగ్రెస్ నెగ్గుతుందనే భయముతో జస్టిస్ పార్టీ ప్రభుత్వము ఎన్నికలను వాయిదావేశారు. ఎన్నికలు జరుపవలసిందిగా ప్రజలు ప్రభుత్వమునకు విన్నవించారు. కాని ప్రభుత్వము ఈ విజ్ఞప్తులను ఖాతరుచేయలేదు. అంతట అయ్యదేవర కాళేశ్వరరావు, రామశేషయ్య శ్రేష్ఠి. యల్. సత్యనారయణ నాయకత్వమున పన్నుల నిరాకరణోద్యమమును ప్రారంభించారు. విజయవాడ ప్రజలు పన్నులు చెల్లించుట మానివేశారు. 24 మంది కౌన్సిలర్లలో18 మంది రాజీనామా చేశారు. అపుడు ప్రభుత్వము అయ్యదేవర కాశేశ్వరరావు తదితరులను అరెస్టు చేశారు. కౌతాపూర్ణా నందంను పురపాలక అధ్యక్షునిగా, కొంతమంది ప్రతి నిధులతో ప్రత్యామ్నాయ కౌన్సిల్ ఏర్పాటు చేసి, ప్రజలను పన్నులు చెల్లింప వలసిందిగా ఆదేశించారు. అయినను ప్రజలుపన్నులు చెల్లిపలేదు. పురపాలక సంఘ పాలన స్థంభించింది. గత్యంతరము లేక నాటి ముఖ్యమంత్రి యగు రాజారాయమణింగారు సంప్రదింపులకుదిగి ఎన్నికలు జరుపుటకకు అంగీకరింపగా, ప్రజలు పన్నులు చెల్లించుటకు అంగీకరించారు. ఇట్లు జరిగిన ఎన్నికలలో జూన్ 1922, కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చింది. 24స్థానములలో 15 కాంగ్రెసుకు లభించెను-దీనిని అందరూ ప్రజావిజయంగా భావించారు.

**11.5.2 చీరాల-పేరాల 25, ఏప్రిల్ 1921 :** చీరాల-పేరాల ఉద్యమము, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నాయకత్వాన సాగింది. ఈ ఉద్యమము కేవలం పన్నుల నిరాకరణోద్యమమేగాక బ్రిటీష్ వారికి ప్రత్యామ్నాయముగా దేశీయ ప్రభుత్వము అనగా స్వరాజ్యమును సంపాదించుట. జాండ్రపేట, వీరరాఘవపేటలతో కలిసియున్న చారాల-పేరాల గ్రామములను మద్రాసు ప్రభుత్వము 1919లో ప్రత్యేక పురపాలక సంఘముగా ఏర్పాటు చేశారు. నాడు చీరాల-పేరాల గ్రామముల జానాభా 15, 000. వీరిలో అధిక సంఖ్యాకులు సన్నకారు రైతులు, పేద కార్మికులు, చేనేతపారిశ్రామికులు. వీరికి రోజు కూలీ నాలుకు లేక ఐదు అణాలు. ప్రత్యేక పురపాలక సంఘము నేర్పాటు చేయుట వలన వారికి ఎట్టి అదనపు సౌకర్యములు లభింపకపోగా వారిపై అధిక పన్నుల భారము పడింది. అంతకు పూర్వము సాలుసరి రూ 4000/- పన్నులు చెల్లించువారు ఇప్పుడు ఈ పురపాలక సంఘము ఏర్పాటు చేయుటవలన రూ 40,000 చెల్లించ వలసి వచ్చింది. అందు వలన పురజనులు, ఈ ప్రత్యేక పురపాలక సంఘమును రద్దు చేయవలసిందిగా కోరారు. ప్రభుత్వము ఈ విన్నపములను ఖాతరుచేయకుండా 1920లో ఎన్నికలు జరిపి 11 మంది సభ్యులు గల నూతన పురపాలక సంఘమును ఏర్పాటు చేసింది. 1919-1920 సంవత్సరమునకు ప్రజలు ప్రభుత్వమునకు పన్నులు చెల్లించినను ప్రభుత్వమునకు, మునిసిపాలిటీ రద్దుకు విజ్ఞప్తులు మాత్రము చేస్తూనే వున్నారు. రెండవ సంవత్సరారంభమున పన్నులు చెల్లించకుండ, పురపాలక సంఘానికి ఎన్నికైన సభ్యులపై వత్తిడి తెచ్చి, వారిచేత రాజీనామాలు చేయించారు.

అంతట వారి స్థానమున ప్రభుత్వము వేతనమిచ్చి ఒక ఉద్యోగిని ఈ పురపాలక సంఘ పాలనా నిర్వహణకు నియమించింది. ఆ సమయమున జస్టిస్ పార్టీ ముఖ్యమంత్రియైన రాజరామరాయణి మునిసిపల్ పాలన శాఖను కూడా నిర్వహించేవాడు. కాని అతను తలచుకొంటే, ఈ మునిసిపాలిటీని రద్దు చేయగలిగేవాడు, కాని ఈ ఉద్యయము కాంగ్రెసు చేత, బ్రాహ్మణుడగు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చేత నిర్వహించబడుట వలన ఆయన ఈ ఉద్యయము పట్ల సాను భూతి వహింపక అణచివేయదల్చాడు.

ముఖ్యమంత్రి యొక్క అణచివేత ధోరణిని గ్రహించి దుగ్గిరాల గోపాల కృష్ణయ్య చీరాల-పేరాల ప్రజలకు నాయకత్వము వహించి పన్నుల నిరాకరణోద్యమమును ప్రారంభించాడు. ఈ ఉద్యమములో ఆయన ఏర్పరచిన వేయిమంది సభ్యులు గల "రామదండు" (శాంతిసేన) ఆయనకు కుడిభుజమై ప్రముఖపాత్ర వహించింది. పన్నులు చెల్లింప నిరాకరించిన వారి ఇళ్ళ సామానులను ప్రభుత్వము వేలము పెట్టగా కొనుటకు ఎవ్వరూముందుకు రాలేదు. పన్నులు చెల్లింపక నిరాకరించినందుకు పన్నెండు మందిని, వారిలో ఒక ముదుసలి స్త్రీ అలివేలుమంగమ్మ కూడా రావూరి అరెస్టు చేశారు. సత్యాగ్రహ ఉద్యమములో పాల్గొన్నందుకు కారాగార శిక్షననుభవించిన మొదట భారత స్త్రీ ఈమెయే కావచ్చును. ప్రభుత్వ అణచివేత చర్యలు మితిమీరుట వలన, ఆ సమయంలో అఖిలభారత కాంగ్రెస్ మహాసభలకు విజయవాడకు వచ్చిన గాంధీజీని చీరాల రావలసిందిగా గోపాలకృష్ణయ్య కోరాడు. 6,ఏప్రిల్ 1921, న గాంధీజీ చీరాలను సందర్శించి, రెండు ప్రతిపాదనలు చేశాడు. ఒకటి, పన్నులనిరాలరణోద్యమమును శాంతియుతంగా కొనసాగించుట, రెండు ప్రజలందరు ఊరు వదలి వెళ్ళిపోవుట. గాంధీజీ సలహామేరకు గోపాలకృష్ణయ్య చీరాల-పేరాల వాసులను, ఏప్రల్ 25,1921, రాత్రి ఖాళీ చేయించాడు. వీరు తమ మూట ముల్లెలతో గోపాలకృష్ణయ్య నాయకత్వమున మనిసిపల్ సరిహద్దులు దాటి, బయటి ఇసుకతిన్నెలలో పర్ణశాలలను నెలకొల్పారు. ఇదే రామ్ నగర్ ఈ పునర్నిర్మాణ కార్యక్రమములో రామదండు బావులుత్రవ్వుటలోను, కుటీరములనేర్పాటు చేయుటలోను నిర్విరామ కృషి చేశారు.

రామ్‌నగర్‌నందు గోపాల కృష్ణయ్య తన అధ్యక్షతన అన్ని కులముల ప్రతి నిధులతో, 200 మందితో, ఒక పంచాయతీ పాలనలో యుండేవి. ఈ పంచాయితీ చోళగ్రామ కమిటీల వలె పని చేసి, రామ్ నగర్ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసింది. ఇట్లు పదకొండు నెలలు ఈ ప్రత్యామ్నాయ ప్రభుత్వము పనిచేసింది. ఈ పదకొండు నెలలు రామ్‌నగర్ వాసులు దుర్భర వేసవికి, అధిక వర్షపాతమునకు గురియైనను చలించ లేదు.

రామ్‌నగర్ వాసుల కష్టాలు పెరగటం మొదలైనాయి. ప్రకృతి దాటికి తట్టుకొనినను, ప్రభుత్వము మాత్రము వారిని బాధించుట కొనసాగించింది. ప్రభుత్వ ఆస్తియైన పోరం బోకులలో అనుమతి లేకుండా గుడిసెలు వేయుట చట్ట వ్యతిరేక మని, అందుకు వారిపై విపరీతముగా పన్నులు విధించి వారిని ఖాళీ చేయించుట ప్రారంభించారు. ఒక్కొక్క గుడిసెకు అయిన ఖర్చు 20నుండి 40 రూపాయాలుండగా, ప్రభుత్వము ఒక్కొక్క గుడిసెపై 102 రూపాయలు పన్నును విధించింది. బహుశ ప్రపంచ చరిత్రలో ఇట్టి దారుణమైన పన్నుల విధానము ఏ యుగమున ఉండి ఉండదు. "కాశీకి పోయినను శనివదలనట్లు" ప్రజలు అనేక కష్టాల పాలైనారు. కార్మికులకు పనిదొరుకుట కష్టమైంది. మిగిలిన వృత్తులవారి పరిస్థితులు మెరుగు కాలేదు. ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురైనారు. వీరినాదుకొనుటకు గోపాలకృష్ణయ్య ఊరూరు తిరిగి చందాలు వసూలు చేశాడు. కాంగ్రెసు కొంత ఆర్థిక సహాయం చేసింది. ప్రభుత్వ ఆజ్ఞలను ఉల్లంఘించి, సెప్టెంబరు, 1921న, బర్హాంపూరు నందు జరిగిన ఆంధ్రమహా సభ యందు ప్రజా శాసనోల్లంఘనోద్యమమును ప్రోత్సహించుటచే ఆయనను అరెస్టు చేసి, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు. గోపాలకృష్ణయ్య నిర్బంధముతో రామ్‌నగర్ వాసులకు నాయకత్వము వహించి, మార్గం చూపించువారు కరువైనారు. ప్రజలలో ధైర్య స్థైర్యములు సన్నగిల్లాయి. ఫిబ్రవరి 1922, చౌరీ చౌరా సంఘటనతో సహాయనిరాకరణోద్యమము ఆగిపోయింది. రామ్‌నగర్ వాసులు క్రమముగా చీరాల-పేరాల వచ్చి మునిసిపాలిటీలో జీవింప సాగారు. 1938లో బెజవాడ గోపాలరెడ్డి గారినాయకత్వమున ఏర్పడిన ప్రథమ కాంగ్రెసు మంత్రి వర్గము ఈ మునిసి పాలిటీని రద్దు చేసింది.

**11.5.3 పల్నాడు అటవీ ప్రతిఘటనోద్యమము ;** సహాయనిరాకరణోద్యమంలో భాగంగా, గుంటూరు జిల్లాలోని పలనాడు ప్రాంతంలో అడవుల పరిపాలనా చట్టనిబంధనల్ని ఉల్లంఘించడం జరిగింది. ఎక్కువ అటవీ ప్రాంతం రిజర్వుడుగా మారడంతో ప్రజలకు ఇబ్బందులెదురయ్యాయి. అడవులలో పశువుల మేతకై చెల్లింప వలసిన 'పుల్లరి'ని చెల్లింప లేని స్థితిలో వారు ఉన్నారు. మాచర్ల, వెల్దుర్తి

జట్టిపాలెం, సిరిగిపాడు, రెంటచింతల మొదలైన గ్రామాలలోని ప్రజలు అచటనున్న అడవీ సంపదపై ఆధారపడి చేసే వారు. అడవులలో పశువులను మేపు కొనుటకు, కట్టెలు కొట్టుకొనుటకు, ఆకులు అలములు ఎరువుగా చేసుకొనుటకు, అచట లభ్యమైన నీటి వనరులను ఉపయోగించు కొనుటకు ఆ శ్రామిక జీవులపై బ్రిటీష్ ప్రభుత్వము అధిక పన్నులు విధించింది. దీనికి తోడు 1921లో వాతావరణము సరిగా లేక ప్రజలకు ఆహార కొరత, నీటి ఎద్దడి ఏర్పడింది. ఈ ఇక్కట్లను ప్రభుత్వాధికారులకు విన్నవించి, పన్నుల భారమును తగ్గించి, ఉదారముగా వ్యవహరించ వలసినదిగా కోరారు. ఆ కోర్కెలలో ముఖ్యమైనవి, వంట చెరుకు, వ్యవసాయ పనిముట్లకు ఉపయోగించు కట్టెలపై పన్ను రద్దు చేయుట, పశువులపై విధించిన సుంకము 12 అణాలనుండి మూడు అణాలకు తగించమని,, గొర్రెలపై పన్నును ఒకటిన్నర అణాకు తగ్గించమని, లైసెన్సులు ఇచ్చుటలో గుంటూరు జిల్లానంతటిని ఒకే ప్రాంతముగా పరిగణించాలని, అడవులలో లభ్యమగు నీటి వనరులను ఎల్లప్పుడు వాడుకొనుటకు స్థానిక ప్రజలను అనుమతించాలని, వీరి ముఖ్య కోరికలు. ఈ విజ్ఞాపనలకు ప్రభుత్వాధికారులు సరైన సమాధానము నీయలేదు. దీనికి విసిగివేసారిన రైతులు సహాయనిరాకరణోద్యమ పిలుపును అందుకొని అటవీ నిబంధనలను ప్రతిఘటింప సాగారు.

ఈ కార్యక్రమములో మొదటిగా అటవీ ఉద్యోగులను సాంఘిక బహిష్కరణ చేశారు. ఈ బహిష్కరణ వలన వారికి దుకాణముల వారు వస్తువులను అమ్మలేదు. హోటళ్ళలో ఆహారము ఇవ్వలేదు. చాకలి, మంగలి సేవలు లభించలేదు. ప్రభుత్వ ప్రకటనలు ప్రజలకు తెలియజేయుటకు తప్పెట్లు వారు కూడా దొరక లేదు. చివరికి మాచర్లలో ఫారెస్టు రేంజర్ పిల్లలకు పాలుకూడ లభించలేదు. తర్వాత అటవీ పన్నుల నిరాకరణోద్యమును ప్రారంభించారు. పన్నులు చెల్లించకుండానే పశువులను అడవులలో మేతకు పంపడం మొదలు పెట్టారు. ప్రభుత్వమును ధిక్కరించు ప్రజలను అదుపులో నుంచుటకు పోలీసు బలగములను వినియోగించ సాగారు. ప్రజలకు, పోలీసులకు సంఘర్షణలు మొదలైనాయి. ఈ సంఘర్షణలలో ప్రజలే అనేక సార్లు పోలీసులను తరిమివేశారు. ఉదాహరణకు: నాడిపాలెం వద్ద వంద పశువులను ఫారెస్టు రేంజర్ నిర్బంధించగా, ఆ గ్రామ వాసులు ఒక స్త్రీ నాయకత్వమున వానిపై దాడి చేసి విడిపించారు. సిరిగిరిపాడు వద్ద ఏడు వందల పశువులను ప్రభుత్వాధికారులు పట్టుకొనగా వారిని సాంఘిక బహిష్కరణ చేశారు.

పల్నాడులో పరిస్థితి విషమించుట గమనించి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జూలై 1921లో, శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణను, వేదాంతం లక్ష్మీనరసింహాచారిని అచటకు పంపి అసలు సంగతులను తెలిసికోనవలసిందిగా ఆదేశించారు. వీరు పల్నాడు రాగానే ప్రజలు వారికి ఘనస్వాగతమిచ్చారు. కలెక్టరు వారికి సెక్యూరిటి ఇవ్వ వలసిందిగా కోరాడు. అందుకు వారు నిరాకరించారు. నిరాకరించినందు వలన ప్రభుత్వము అరెస్టు చేసి ఒక సంవత్సరము శిక్ష విధించింది. ఈ సంఘటనతో రెచ్చిపోయిన ప్రజలు పన్నులు చెల్లించుటను పూర్తిగా మానివేశారు. వీరి అరెస్టులకు నిరసనగా గుంటూరులో బందు జరిగింది. ఈ వార్తాళ్ నిర్వహించుటలో శ్రీమతీ ఉన్నవ లక్ష్మీబాయమ్మ, యామినీ పూర్ణతిలకం ప్రముఖ పాత్ర వహించారు. విద్యార్థులు కళాశాలలను బహిష్కరించారు. సూర్య ప్రకాశరావు అను విద్యార్థిని ప్రభుత్వము అరెస్టు చేశారు. ఈ సందర్భమున పెద్ద గందరగోళము ఏర్పడింది. కాని కొండా వెంకటప్పయ్య జోక్యము వలన ఎట్టి అవాంఛనీయమైన సంఘటన జరగలేదు. ఆగస్టు 1921లో కొండా వెంకటప్పయ్య పల్నాడు తాలుకా రాజకీయ మహాసభ నుండి అటవీ నిబంధనలను ఉల్లంఘించుట మంచిది కాదని, పుల్లరి పన్ను చెల్లిస్తూ సాంఘిక బహిష్కరణ కొనసాగించ వలసిందిగా కోరి పూగా దీనికి జాతీయ కాంగ్రెసు ఆమోదము లేదని ప్రకటించాడు.

కాని పల్నాడు ప్రజలు ఈ సలహాలను పెడచెవిన పెట్టి పన్నులు చెల్లించకుండానే యధా విధిగా పశువులను మేతకు పంప సాగారు. పైగా పెక్కు గ్రామాలలో స్వరాజ్యము వచ్చినట్లు ప్రకటించారు. మరల మెల్లరాగు, కండ్లగుంట మొదలైన చోట్ల ప్రజలకు ప్రభుత్వాధికారుల మధ్య సంఘర్షణ జరిగింది. సెప్టెంబర్ 23, 1921న మంచాలపాడు వద్ద ప్రభుత్వాధికారులు మూడు వందల పశువులను పట్టుకొని ముట్కూర్ బందెల దొడ్డికి తీసికొని పోవుచుండగా కన్నెగంటి హనుమంతు నాయకత్వమున సుమారు రెండు లేక మూడు వందల మంది వారిపై దాడి చేసి చాలా పశులులను విడిపించారు. ఈ సందర్భమున జరిగిన పోలీసు కాల్పులలో కన్నెగంటి హనుమంతు, అతని సేవకునితో సహా మగ్గురు మరణించారు. ఆ మరుసటిరోజు కలెక్టరు, పోలీసు అదికారి వచ్చి పదిహేడుగురిని అరెస్టు చేశారు. అందులో

తొమ్మిది మంది స్త్రీలు. ప్రజలు అనేక ఇబ్బందులకు గురైనారు. దీనికి తోడు శాసనోల్లంఘనోద్యమము తగ్గుముఖం పట్టడంతో, మార్చి 1922నాటికి పల్నాడు అటవీ పుల్లరి సత్యాగ్రహము తగ్గుముఖము పట్టింది.

**1.5.4 పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమము 1922 :** సహాయ నిరాకరణోద్యమములో అంతర్భాగముగా ఆంధ్ర దేశమున గుంటూరు జిల్లాలోని పెదనంది పాడు ఫిర్కాలో సాగిన పన్నుల నిరాకరణోద్యమము భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలోనే అపూర్వమైన ఘట్టము. పెదనంది పాడు ఉద్యమము దేశనాయకుల ఆదేశము మేరకు గాకుండా కర్షకులే స్వచ్ఛందముగా నిర్వహించుటకు ముందంజవేయుట విశేషము. ఈ ఉద్యమమును రైతుల శాంతియుత పోరాటమని కూడా అంటారు. నాటి మద్రాసు గవర్నరైన లార్డ్ విల్లింగ్టన్ మాటలలో చెప్పవలెనంటే "భారత దేశమున బ్రిటీష్ సామ్రాజ్యపు పునాదులనే కదలించి వేసిన ఉద్యమము".

ఉద్యమమునకు దోహదము చేసిన పరిస్థితులలో ముఖ్యమైనవి; జనవరి 7, 1922న విజయవాడలో సమావేశమైన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ, పొన్నూరులో సమావేశమైన గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ పన్నుల నిరాకరణోద్యమ పిలుపు నిచ్చారు. రైతులు కనుక ముందంజ వేసి పన్నులు చెల్లించక పోతే ప్రభుత్వ ఖజానా ఖాళీయై ప్రభుత్వము జాతీయ నాయకులతో రాజీకి వస్తారని అభిప్రాయపడినారు. శ్రీ కొండా వెంకటప్పయ్య, శరణు రామస్వామి చౌదరి, గొల్లపూడి సీతారామశాస్త్రి, ఉన్నవ లక్ష్మీనారాయణ, మహమ్మద్ గౌస్ బేగ్, మంతెన రామరాజు, మద్ది రాధాకృష్ణయ్య, రామరాజు భానుమూర్తి మొదలగు నాయకులు తీవ్ర ప్రచారము చేసారు. దీనితో ప్రభావితులైన పెదనంది పాడు ఫిర్కాలోని గ్రామాధికారులందరూ రాజీనామా చేశారు.

పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమమునకు ముఖ్యనాయకుడు 'ఆంధ్ర శివాజీ' గా గణతికెక్కిన శ్రీ పర్వతనేని వీరయ్య చౌదరి. ఆయన రైతు బిడ్డ, విద్యాధికుడు కాక పోయిననూ నిజాయతీ పరుడు. చిత్తశుద్ధిగల కాంగ్రెసువాది. ఈ ఉద్యమము నిర్వహణకు ఆయన "శాంతిసేన" అను వలంటీర్లను ఏర్పరచాడు. వీరికి శిక్షణ నిచ్చి శాంతియుత పోరాటమునకు సమాయత్తము చేశాడు. ఒక్క పెదనంది పాడు ఫిర్కాలోనే నాలుగు వేల శాంతి సేవాదళములు ఏర్పడ్డాయి. వీరు గ్రామ, గ్రామములకు వెళ్ళి ప్రజలను ఉత్సాహపరిచేవారు. ఆంగ్లాధికారులకు ఎటువంటి సమాచారము అందనీయ కుండా సాంఘిక బహిష్కరణ కొనసాగించారు. ఈ ఉద్యమము విజయవంతమగుటలో వీరు నిరుపమానమైన పాత్రవహించారు. ఉదాహరణగా గుంటూరు జిల్లా అదనపు మేజిస్ట్రేటు అగు రూథర్‌ఫర్డ్, పెదనంది పాడు సందర్శించినపుడు "శాంతిసేన" శాంతియుత బహిష్కరణ చేసింది. ఈ ఉద్యమములో వీరయ్య చౌదరి, మరియు 'శాంతి సేన' యొక్క పాత్ర మరపురానిది.

**11.5.5: ఉద్యమము కొనసాగిన రీతి :** శిస్తు చెల్లించని రైతుల ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయ ప్రారంభించారు. ప్రభుత్వమునకు ఎవరు శిస్తు చెల్లింప లేదో తెలియజేయు వారు కరువైనారు. ఇండ్ల నంబర్లు తొలగించుట వలన ఏ ఇల్లు ఎవరిదో అధికారులు తెలిసికొన లేక పోయారు. ఇండ్లకు తాళాలు వేసి ఉండడంతో ప్రభుత్వం ఏమీ చెయ్యలేకపోయంది. తాళములు పగులగొట్టినను అందుఎట్టి వస్తువులు వుండేవి కాదు. ఒక సారి గృహ వస్తువులను వేలం పాట వేసినను ఆ వేలములలో ఎవరు పాల్గొన లేదు. ఆ తర్వాత గృహ వస్తువుల స్థానే భూమిని, పశువుల్ని వేలం వేయుటకు వీలుగా నిబంధనలను మార్చారు. ఇట్లు స్వాధీనము చేసుకొన్న భూములను దళిత వర్గములకు పంచేవారు. అయినను ప్రజలు చలింపక సాంఘిక బహిష్కరణ సాగించారు. అధికారుల కార్యకలాపాలను ఆటంక పరుస్తున్నారని నిషేధాజ్ఞలను ఉల్లఘించుచున్నారని, అనేక మందిని నిర్బంధించారు. ప్రజలను చిత్రహింసలకు గురిచేస్తారు. పైగా మిలిటరీ దళములను రప్పించి పెదనందిపాడు వద్దనుండి జిల్లా అంతటా విన్యాసాలు చేయించారు. కాని ప్రజలు ఎటువంటి భీతి చెంద లేదు. రాజీనామా చేసిన గ్రామాధికారులను ఉద్యోగం నుండి తీసివేస్తామని ఆ పదవులకు గల వంశపారంపర్యపు హక్కులను తొలగిస్తామని ప్రభుత్వము బెదరించింది. కాని గ్రామాధికారులు లొంగలేదు. కనీస విద్యార్హతలు పాటించకుండా ముస్లింలను, హరిజనులను గ్రామాధికారులుగా నియమించారు. కాని ఈ చర్య అంతగా సఫలము కాలేదు. శాంతి సేనను అదుపులో పెట్టుటకు ప్రతి గ్రామములో పోలీసు దళమును ఉంచారు. శాంతి సేనను అమానుషముగా కొట్టి వారిని అనేక బాధలకు గురి చేశారు. ఎన్ని అణచివేత చర్యలు గైగొనినను కష్టముల కోర్చినారేగాని, పెదనందిపాడు ప్రజలు ఉద్యమమును విరమించలేదు. ఇంతటి ప్రతిఘటనను గాంచి ఆనాటి గుంటూరు జిల్లా కలెక్టరు ఇది "శాంతి

యుతముగా నున్నను బహిరంగ విప్లమని" అనగా, బోర్డు ఆఫ్ రెవిన్యూ సభ్యుడైన హారిస్ "దీనిని శాసనోల్లంఘనోద్యమము, లేక సహాయనిరాకరణోద్యమము అనుట కంటె విప్లవము అనుట సమంజసముగానుండునని" వక్కాణించెను.

**11.5.6 బ్రిటిష్ వారి అణచి వేత చర్యలు :** సహాయనిరాకరణోద్యమమును అణచుటకు ప్రభుత్వము అనేక నిషేధాజ్ఞలను జారీ చేసి సుప్రసిద్ధ నాయకులను అరెస్టు చేసి జైళ్ళ పాలు చేశారు. ప్రజలను నానాహింసలకు గురి చేశారు. గాంధీటోపీని ధరించుట నిషేధించారు. దామరాజు పుండరీకాక్షుడు రాసిన స్వరాజ్యసోపానము, "పాంచాలపరాభవము" (పంజాబు దురంతరములు) "స్వరాజ్యగీతపుంజము" మొదలైన గ్రందములను నిషేధించారు. కాని ఆంధ్రప్రజలు ఈ అణచివేతచర్యలకు భీతి చెంద లేదు.

**11.5.7 ఉద్యమ క్షీణత :** ఇంతటి పరాకాష్టనందుకొని ప్రజలు శాంతియుతముగా జరిపిన ఉద్యమము ఆంధ్రనాయకులలోని విభేదముల వలన, ప్రభుత్వ దమననీతి వలన గాంధీజీ తొందరపాటు వలన క్షీణించింది. ఫిబ్రవరి 8.10.1922 న, జిల్లా కాంగ్రెసు కమిటీ సమావేశమున ఈ ఉద్యమమును కొనసాగింపవలెనా లేదా అనువిషయము పై ఆంధ్రనాయకులలో అభిప్రాయ భేదములు ఏర్పడ్డాయి. ఈ విషయంపై తుది నివేదిక సమర్పించ వలసిందిగా కాశీనాధుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం, డి. నారాయణరాజులతో ఒక ఉపసంఘమును నియమించారు. ఈ ఉపసంఘము పెదనందిపాడు పర్యటించి ఉద్యమము కొనసాగుటకు తగిన వాతావరణమున్నను, ఇతర కారణముల వలన ఈ ఉద్యమమును నాయిదా వేయవలెనని సిఫార్సు చేసింది. ఈ లోపు బార్డోలీ ఉద్యమ పలితములు వచ్చు వరకు పెదనందిపాడు ఉద్యమమును విరమించ వలసినదిగా, గాంధీజీ స్వదస్తూరితో కొండా వెంకటప్పయ్యగార్కి ఉత్తరము అందింది. అంతట నిరుత్సాహముతో, అయిష్టముగా ఉద్యమమును నిలిపి వేశారు. ఈ లోపు ప్రభుత్వము కొండా వెంకటసుబ్బయ్య, కె. సాంబయ్య, గొల్లపూడి శీతారామశాస్త్రి మొదలైన వారిని అరెస్టు చేశారు. పర్వతనేని వీరయ్య చౌదరిని కాల్చి చంపుతామని బెదిరించి క్షమాపణ పత్రం వ్రాయించుకొన్నారు. ఏప్రిల్ 1922 లో ఈ పన్నుల నిరాకరణోద్యమము అంతమొందింది. కాని రైతులు అనేక గ్రామములలో పన్నులు చెల్లించుటలో జాప్యం చేశారు. స్వరాజ్యము ప్రకటించిన గ్రామములలో ప్రభుత్వాధికారులు, ఉద్యమకారులను నానా హింసలు పెట్టారు. ఇటువంటి మహోజ్జ్వలమైన శాంతి యుత పోరాటము గాంధీజీ పొరపాటు చర్య వలన నిర్వీర్యమయ్యెను. కాని ప్రజలలో చైతన్యము మాత్రం పెరిగింది. 17, నవంబరు, 1921 న ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారతదేశ పర్యటనకు వచ్చుచున్న సందర్భమున ఆయనను బహిష్కరించవలసిందిగా కాంగ్రెస్ పిలుపు నిచ్చింది. దీని కనుగుణంగా ఆయన బొంబాయిలో కాలిడగానే ఆంధ్ర దేశమంతటా హర్తాళ్ జరిగింది. నల్లజెండాలు ఎగుర వేసి, వేల్స్ యువరాజు వెనక్కు పోవాలని నినాదములు చేసి బహిరంగ సభలు జరిపారు.

**11.5.8 సహాయ నిరాకరణోద్యమము నిలుపుదల, 12, ఫిబ్రవరి 1922 :** ఫిబ్రవరి 4.1922న, చౌరిచౌరా వద్ద ప్రజలు ఆంగ్ల పోలీసులను హతమార్చారు. అహింసా వారియైన గాంధీజీకి ఇదిరుచింప లేదు. శాంతియుత పోరాటమునకు ప్రజలు సంసిద్ధులుగా లేరని ఈ ఉద్యమమును నిలుపుదల చేశారు. 11, 12, ఫిబ్రవరి 1922 న అఖిల భారత కాంగ్రెసు సంఘము సహాయ నిరాకరణోద్యమమును నిలపుదలచేయుటకు తీర్మానించారు. దీనితో ఆంధ్రదేశమున సహాయనిరాకరణోద్యమము ముగిసింది. మార్చి 13,1922 న, ప్రభుత్వము గాంధీజీని నిర్భందించి ఆరు సంవత్సరముల కారాగార శిక్ష విధించింది.

**11.6 సమీక్ష :**

ఈ విధంగా ఆంధ్రలో సహాయనిరాకరణోద్యమము గాంధీ ఉద్దేశ్యములకు అనుగుణంగా శాంతియుతంగా ఆజ్వల ఘట్టాలతో ముగిసింది. ఈ చైతన్యంతో మరో ప్రముఖ ఘట్టంలోనికి ఆంధ్రలో స్వాతంత్రోద్యమము ప్రవేశించింది.

**11.7 వ్యాసరూప ప్రశ్నలు :**

1. సహాయ నిరాకరణోద్యమానికి దారితీసిన పరిస్థితులను వివరింపుము.

2. ఆంధ్రాలో సహాయ నిరాకరణోద్యమ ఘట్టాలను వర్ణింపుము.

3. ఆంధ్రాలో సహాయ నిరాకరణోద్యమములో నాయకుల పాత్రని అంచనా వేయుము.

### 11.8 Reference Books:


1. K.Durga Prasad : Andhrala Charitha (1st & 2nd volums)
2. Sarojini Regani : Highlights of the Freedom Movement in Andhra Pradesh.
3. K.Sundaram : Adhunika Andhradesa Charita (State Archives)
4. M.Venkatarangaiah : The Freedom Struggle in Andhra pradesh.
5. P. Raghunadha Rao : History of Modern Andhra Pradesh.
6. K.V.Narayana Rao : Emergence of Andhra pradesh.
7. B.Kesava Narayana : Political and Social Factors in Modern Andhra.
8. G.V.Subba Rao : Sree Gopala Krishnayya.

పాఠం-12

# అల్లూరి సీతారామరాజు - రంప ఉద్యమం

విషయ క్రమం


12.1 లక్ష్యం

12.2. రంప ఉద్యమం - దాని ప్రాముఖ్యత

12.3. అల్లూరి సీతారామరాజు బాల్యం

12.4. రంప ఉద్యమానికి దారితీసిన కారణాలు

12.5. చింతపల్లిపై దాడి, 22 ఆగస్టు 1922

12.6. దామనపల్లి దాడి, 24 సెప్టెంబరు 1922

12.7. అడ్డతీగల, రంప చోడవరం దాడులు

12.8. రామవరం దాడి

12.9. పెద్దగడ్డ పాలెంవద్ద రాజు తొలి పరాజయం

12.10. అన్నవరంపై రాజు దాడి

12.11. గామ్‌మల్లు దొర అరెస్టు

12.12. రాజుమరణం 7 మే, 1924

12.13. సమీక్ష


## 12.1 లక్ష్యం :

ఆంధ్రదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో అల్లూరి సీతారామరాజు సాగించిన రంప ఉద్యమం ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నది. ఈ పితూరీకి, కాంగ్రెసు జాతీయోద్యమానికి ఎటువంటి సంబంధము లేదు. గోదావరి, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలో 1922 జనవరి నుండి 1924 మే వరకు రెండు సంవత్సరాల అయిదునెలలు ఆంగ్ల సామ్రాజ్యాన్ని గడగడలాడించి, ముప్పుతిప్పలుపెట్టిన విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు. ఆయన సాగించిన రంప ఉద్యమాన్ని కూలంకషంగా పరిశీలించడమే ఈ పాఠం ముఖ్య ఉద్దేశము.

## 12.2. రంప ఉద్యమం - దాని ప్రాముఖ్యత :

అల్లూరి సీతారామరాజు సాగించిన రంప ఉద్యమం ఆంధ్రదేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో ఒక విశిష్ట స్థానాన్ని సంతరించుకొన్నది. ఈ ఉద్యమం కాంగ్రెసు ఆధ్వర్యంలో జరగకపోవటం విశేషం. ఈ ఉద్యమం 1922 జనవరినుండి 1924 మేనెల వరకు దాదాపు రెండు సంవత్సరాల ఐదు నెలలు కొనసాగింది. తూర్పు గోదావరి, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన ఈ ఉద్యమం సహాయ నిరాకరణోద్యమంకన్నా ఎక్కువగా బ్రిటిష్‌వారిని ఇబ్బందికి గురిచేసింది. కాంగ్రెస్ అవలంభించిన అహింసా, శాంతియుత సహాయనిరాకరణ పంథాను కాదని, బ్రిటిష్‌వారిని భారతభూమినుండి తరిమికొట్టేందుకు సాయుధపోరాటమే శరణ్యమని విశ్వసించినవాడు సీతారామరాజు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇప్పటికీ రంప ఉద్యమాన్ని కథలుగా, బుర్రకథలుగా చెప్పుకుంటున్నారంటే ఆ ఉద్యమం ప్రాశస్త్యము అంత గొప్పది.

భారత స్వాతంత్రోద్యమ చరిత్ర ఈ ఉద్యమానికి సముచిత స్థానాన్ని కల్పించకపోయినా, ఆనాటి యువకుల దేశభక్తి జ్వాలయే ఈ పితూరీగా రూపుగొన్నదనియు, ఆంధ్రాలోజరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఇదికూడా ఒక ముఖ్యభాగమే అనియు చెప్పవలసియున్నది. ఈ పితూరీ తనకుతానుగా చేకూర్చిన ఫలితాలేమి లేకపోవచ్చునుకానీ, రంప ఉద్యమం దాని నాయకుడైన అల్లూరి సీతారామరాజు కోట్లకొలది

ఆంధ్రుల హృదయాలలో చెరిగిపోని స్థానాన్ని సంపాదించుకున్నారు. శివాజి, రాణాప్రతాప్‌వలె ఈయనకూడా ఒక మహావీరునిగా చరిత్రకెక్కారు. ఈ పితూరీ గోదావరి, విశాఖపట్నం ప్రాంతలలో జరిగినా, మొత్తందేశంలో బ్రిటిష్ ప్రభుత్వపు ఉనికిని ప్రశ్నించగల్గింది. రాజుయొక్క వీరగాథను ఈ నాటికీ ప్రజలు కొనియాడుతారు. కాని సమకాలీన కాంగ్రెసు నాయకులు రాజుపైగాని, ఆయన నడిపించిన ఉద్యమంపైగాని సానుభుతిని చూపలేదు.

## 12.3 అల్లూరి సీతారామరాజు బాల్యం :

అల్లూరి సీతారామరాజు 1897 లో పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్లులో ఒక క్షత్రియ కుటుంబంలో జన్మించాడు. అతనికి చదువు అంతగా అబ్బలేదు. కాని గుర్రపుస్వారి, మూలికా వైద్యం, జ్యోతిష్యం నేర్చుకొని అడవులలో సన్యాసిగా తిరుగుతూ కొండప్రజల మన్ననలను పొంది గూడెం నాయకుడైనాడు. అతనికి శాంతియుత పోరాటంమీద విశ్వాసం లేకపోయినను, సహాయ నిరాకరణోద్యమం రేకెత్తించిన దేశభక్తి భావన ఆయనకు ప్రేరేపక శక్తిగా ఉపకరించింది. హోవెల్ అనే బ్రిటిష్ ఉద్యోగి బ్రిటిష్ ప్రభుత్వానికి పంపిన నివేదికనుబట్టి సీతారామరాజు 1921 జూలైలో చిట్టగాంగుకు వెళ్ళి అక్కడ విప్లవవాదుల సమావేశంలో పాల్గొన్నట్లు తెలుస్తుంది. అక్కడినుండి వచ్చిన తర్వాత ఆయన మన్యం, గూడెం ప్రాంతాలు పర్యటించి, అంతాడ, పెద్దవలస మున్నగు గ్రామాల్లో సంచారంచేసి, త్రాగుడు మానుకోవలెనని అక్కడి ప్రజలకు ప్రబోధించాడు. ఆయనకి అహింసా పద్ధతులపై నమ్మకంలేదు. ఆంగ్లేయులను బలప్రయోగం ద్వారానే తరిమివేయాలని ఆయన ఆశయం. 1922 జనవరి 20 వ తేదీ నాటికే సీతారామరాజు ఒక పితూరీని లేవదీయనున్నట్లు కృష్ణదేవి పేట పరిసర ప్రాంతాలలో వదంతులు వ్యాపించాయి. అందువలన ప్రభుత్వము సీతారామరాజుపై పోలీసు నిఘాను ఏర్పాటుచేసి, అతనికి 30 ఎకరాల భూమిని పైడిపుట్ట వద్ద పట్టానిచ్చి, అక్కడ నివాసం ఏర్పరచుకోవలసిందిగా ఆయనకు సలహా ఇచ్చింది. అప్పుడు అతను ఆ ప్రాంతపు డివిజనల్ మేజిస్ట్రేటుయైన ఫజలుల్లాను కలుసుకొని, తనపై నిఘాను తీసివేయవలసిందిగా, తాను నేపాలుకు పోవుటకు అనుమతినియ్యవలసిందని అడుగగా, అందులకు అతడు అంగీకరించాడు. కానీ సీతారామరాజు నేపాల్‌కు పోకుండా, ఏజెన్సీ ప్రాంతాలలో పర్యటించి తిరుగుబాటుకొరకై పూర్వరంగాన్ని సిద్ధం చేసుకొన్నాడు.

## 12.4. రంప ఉద్యమానికి దారితీసిన కారణాలు :

గూడెం ప్రాంతము తూర్పుగోదావరి జిల్లాలో దట్టమైన అడవులతో, కొండలోయలతో కూడిన సహజ రక్షణగల ప్రాంతము. అక్కడి ప్రజలను స్థానిక అధికారులు ఎంతగానో పీడించేవారు. అటవీసంపదను అనుభవించడానికి వారికి ఎంతమాత్రము అవకాశంలేదు. 'పోడు' వ్యవసాయంవలన వారికష్టాలు దినదినానికి పెరుగుతూ వచ్చాయి. అంతేగాక అక్కడి గిరిజనులు, స్థానిక తహసిల్‌దారైన బాస్టియన్ అక్రమచర్యలవల్ల, 'ముత్తదారీ పద్ధతి' వలన, ప్రభుత్వంయొక్క 'రిజర్వు అడవుల విధానం' వలన ఎన్నో కష్టనష్టాలకు గురియై, అసంతృప్తితో ఉన్నారు. అసంతృప్తిలో ఉన్న ఈ గిరిజనులను సులభంగా ఉద్యమంవైపు ఆకర్షించ వచ్చునని సీతారామరాజు ఆశించాడు. ఇవి కొంతవరకు కారణాలని అంగీకరించినా, అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో ఇది ఒక స్వాతంత్ర్య సమర రూపాన్ని పొందినదనే విషయం యధార్థం. ఆనాటి ఏజెన్సీలోని పరిస్థితులు తిరుగుబాటునకు చాల దోహదపడ్డాయి. ప్రభుత్వం అవలంభించిన అటవీ రక్షణ విధానం వలన మన్యపు ప్రాంత ప్రజల 'పోడు' వ్యవసాయానికి ఇబ్బందులు కల్గాయి. అడవులలో లభించే తేనె, మైనము, కాయగసరులు పొందలేకపోయారు. పశువులను యధేచ్ఛగా మేపలేకపోయేవారు. కొండజాతి ప్రజలచేత బలవంతాన రోడ్లు వేయించేవారు. ఈ రకంగా కొండజాతి ప్రజలలో కరుడుకట్టిన అసంతృప్తి పెల్లుబికి అలజడికి దారితీసింది. ప్రకృతి ఒడిలో పుట్టి స్వేచ్ఛగా పెరుగుతున్న కొండజాతుల వారికి 1882 'అడవులచట్టం' ఎంతో సంకటం కల్గించింది. వారు చేసే పనులన్నీ శిక్షా పాత్రమయ్యాయి. నేరస్థులకు జైలుశిక్ష, జరిమానా విధించేవారు. ఈ అడవులచట్టం ప్రకారం కొండప్రాంతాలలో 1200 చదరపు మైళ్ళదాక ప్రభుత్వాధీనంలోకి వచ్చినది. కల్లు, సారాయి లేనిదే కొండజాతుల పూజా పునస్కారాలు, విందులు, వినోదాలు పూర్తికావు. మద్యం తయారీ, అమ్మకంమీద ప్రభుత్వం నిబంధనలు విధించింది.

దీనికి తోడుగా ఆ ప్రాంతాన డిప్యూటీ తహసిల్దారుగా అప్పుడు పనిచేస్తున్న బాస్టియన్, ఓవర్‌సీరుగా ఉన్న సంతాన పిళ్లె లంచగొండితనానికి అలవాటుపడి, ప్రజలను ఎప్పుడు పీడిస్తుండేవారు. అంతేగాక, వేరొక స్థానిక కారణంకూడా తోడ్పడింది. బట్టపంకాలు గ్రామానికి మునసబుగా ఉన్న గామ్‌మల్లుదొర అనే కోయ ప్రముఖుని ప్రభుత్వం ఉద్యోగంనుండి తీసివేయడమే గాక, అతని తమ్ముడైన

గామ్ గంటందొరకు చెందిన భూములను వశం చేసుకొంది. అందుచే భంగపడిన ఈ సోదరులిరువురు, సీతారామరాజుకు రెండుభుజాలుగా ఉపకరించి, బ్రిటిష్ వారిని ఎదిరించి, మన్యప్రాంతంలో పోరాటాన్ని సాగించుటకు ఆయనకు చేదోడు వాదోడుగా మారారు. వీరుగాక, ఎండుపడాల్ అను వేరొకడు ఈ ఉద్యమంలో సీతారామరాజుకు తోడ్పడ్డాడు. తనకు హక్కున్నటువంటి పెద్దవలస, ముఠాదార్ పదవిని తనకు దక్కకుండా బ్రిటిష్ ప్రభుత్వం చేయడంవలన, ఆ ప్రభుత్వంపై అతను క్రోధాన్ని వహించాడు. ఈ కారణాలకు తోడుగా, గూడెంలో అదివరకు ముఠాదారుగ ఉన్న మట్టెడం వీరయ్య దొరపై ప్రభుత్వం క్రిమినల్ కేసులను పెట్టడంవలన, ఆదివాసులగు కోయల్లో చెలరేగిన అలజడికూడా రాజు పితూరీకి సహకరించింది. వీరందరు, తన అనుచరులతోపాటుగా రాజు నాయకత్వంక్రింద ఒక పద్ధతిని అనుసరించి పోలీసు స్టేషన్లపై దాడిచేసి, ఆ స్టేషన్లలోని మందుగుండు సామాగ్రిని ఆయుధాలను వశపరచుకొని, స్థానిక ప్రభుత్వాన్ని స్థంభింపచేయవలెనని సంకల్పించారు. ఈ యత్నంలో గామ్ సోదరులు రాజునకు ఎంతగానో సాయం చేశారు. స్పెషల్ కమీషనర్గా నియమింపబడ్డ రూథర్‌ఫోర్డ్‌కూడా రాజు ధైర్య సాహసాలను మెచ్చుకొన్నాడు.

## 12.5. చింతపల్లిపై దాడి, 22 ఆగస్టు 1922 :

సీతారామరాజు తనకు కావలసిన ఆయుధాలను సమకూర్చుకొనుటకై పోలీసు స్టేషన్లపై దాడిచేయడం ప్రారంభించాడు. గూడెం తాలూకాలోని పెద్దవలసలో రాజు ఉండగా, గాముసోదరులు అతనిని కలిసి, తమ తాలూకాలో తహసిల్దారైన బాస్టియన్ చేస్తున్న ఆగడాలను వివరించారు. ప్రజలలో అసంతృప్తి బాగా వ్యాప్తి చెందినదని, అడవుల రిజర్వేషన్ విధానంతో ప్రతిఒక్కరు విసిగిపోయారని, సీతారామరాజు ఏదైనా తిరుగుబాటు ప్రారంభిస్తే, గ్రామ ప్రజలంతా ఏకమౌతారని చెప్పారు. ఆగస్టు 21 నాటికి జనాన్ని కూడగట్టారు. 1922, ఆగస్టు 22 న 300 మంది అనుచరులతో రాజు చింతపల్లి పోలీసుస్టేషన్‌పై దాడిచేసి, 11 తుపాకులు, 1,390 మందుగుండ్లు, 5 బాకులు, 14 బాయొనెట్లు వశపర్చుకున్నాడు. మరుసటిరోజు కృష్ణదేవిపేట పోలీసులకు కబురుచేస్తూ వారిని పోరాడటానికిగాని, లొంగుబాటుకుగాని సిద్ధంగా ఉండమన్నాడు. పోలీసులు స్టేషన్ వదిలిపోగా, అక్కడ కొన్ని ఆయుధాలు చేజిక్కించుకున్నాడు. ఆగస్టు 24 వ తేదీన రాజు ఓమ్మంగి స్టేషన్‌మీద దాడిచేసి కొంత ప్రతిఘటన అనంతరం, ఎనిమిది కార్బైన్స్, 325 బాలకాట్‌రిడ్జస్ వశం చేసుకున్నాడు. రాజు ఒమ్మంగి జైల్లో వీరయ్యదొర ఖైదీగా ఉన్నాడు. 1918 లో లాగరాయి పితూరీలో ప్రముఖపాత్ర వహించిన వీరయ్యదొరను పోలీసుల బారినుండి తప్పించి, రాజు తన కుడిభుజంగా చేసుకున్నాడు. అప్పటికే రాజుకు అండగా గామ్‌మల్లుదొర, గామ్‌గంటందొర సహాయపడుతున్నారు. రాజ ఒమ్మంగినుండి పితూరీదారులు ఆగస్టు 28 వ తేదీన గూడెం చేరుకొని, అటునుండి గంగరాజు మాడుగులకు పోయారు. ఇంతటితో ఈదాడుల సమాచారం తెలియవచ్చి, పై అధికారులు ప్రత్యేక పోలీసు దళాలను నర్సీపట్నం, అడ్డతీగల, కృష్ణదేవిపేట, చింతపల్లి స్టేషన్లలో నియమించారు. అయినప్పటికీ రాజుజాడ తెలుసుకోలేకపోయారు. విప్లవకారులకు, పోలీసులకు ప్రత్యక్షపోరాటం సెప్టెంబరు 3 వ తేదీన 'వంజేరిఘాటువద్ద' జరిగింది. ఘాట్ డివిజనల్ ఆఫీసరైన ట్రిమెన్‌హీర్ (Tremenhare) పోలీసు దళాలకు నాయకత్వం వహించాడు. పోరాటంలో అతడు తీవ్రంగా గాయపడి తనడబ్బా, డవాలీని వదిలేసి పరారు చిత్తగించాడు. అంతట ఆ సామాగ్రిని విప్లవకారులు వశపర్చుకున్నారు. రాజు గ్రామాలలో పర్యటిస్తూ, తన ఉద్యమాన్ని వ్యాపింపచేస్తూ ఉండగా దొరకొండవద్ద, కాళీపూజ సందర్భంగా అతనిపై దాడిచేయాలని పోలీసులు విఫల ప్రయత్నం చేశారు.

## 12.6. దామనపల్లిదాడి, సెప్టెంబరు 24, 1922 :

సీతారామరాజు సెప్టెంబరు 23 న తన అనుచరులతో గూడెం తాలూకాలోని దామనపల్లి చేరుకున్నాడు. ఆగస్టు 24 న దామనపల్లిలో రాజు ఉన్నాడని తెలుసుకొని, 50 మంది పోలీసుదళం స్కాట్‌కోవర్డ్, హేటర్ నాయకత్వాన అక్కడికి వెళ్ళారు. ఈ విషయం ముందుగానే గూఢచారుల ద్వారా తెలుసుకొన్న రాజు దామనపల్లి ఘాట్‌వద్ద పొదలనుండి మెరుపుదాడి తలపెట్టాడు, ఆ సందర్భంగా పోలీసులపై రాజు జరిపిన దాడివలన నలుగురు పోలీసులు మరణించారు. ఆరు రైఫిళ్ళు, అనేక బాయొనెట్లు, కాట్‌రిడ్జ్‌లు దొరికాయి. వెంటనే ఘాట్ క్రిందిభాగంలో కాలినడకన వస్తున్న రిజర్వు పోలీసులపై రాజు దళం దాడిచేసి, ఒకపోలీసును చంపి వారిని తరిమివేశారు. పోలీసుదళపు నాయకుడు స్కాట్‌కవర్డ్, ఉపనాయకుడు హైటరు మరణించారు. ఒక హెడ్‌కానిస్టేబుల్ గాయపడ్డాడు. తక్కినవారు భయచకితులై ఎవరి దోవనవారు తమ ఆయుధాలను, మందుసామాగ్రిని అచటనే వదిలివేసి పోయారు. స్కాట్‌కవర్డ్, హైటర్‌కు అంత్యక్రియలు నర్సీపట్నంవద్ద

జరిపించారు. ఈ పోరాటంలో తర్వాత సెప్టెంబరు 24 మొదలుకొని అక్టోబరు 15 వరకు పితూరీదారులను ఎదిరించుటకు పోలీసుదళాలేవీ ముందునకు వచ్చుటకు సాహసించలేదు. ఆ సమయంలో పితూరీదారులు యదేచ్ఛగా బహిరంగంగా, పల్లెల్లో పర్యటిస్తూ ఉండేవారు. వారి ధైర్య సాహసాలను మెచ్చుకొని, అక్కడి ప్రజలు వారిని గురించి జయగీతాలు పాడేవారు. అంతట తమ కార్యక్రమాన్ని ఇంకను ముందునకు తీసుకొనపోదలచి. విప్లవకారులు తపాలా రహదారుల్ని అడ్డగించి, తపాలులను హరింప సాహసించారు. ఆ తపాలాసంచుల రక్షణకై వచ్చిన పోలీసుదళాల్ని, సబ్ ఇన్‌స్పెక్టర్లను వారు ఖైదుచేశారు. తురుమామిడి, లక్కవరపుపేట పోలీసుస్టేషన్లను కూడా ఈ కాలంలోనే విప్లవకారులు దోచుకున్నారు. అచట ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ రాజు పాదాలపైబడి క్షమాభిక్షను అర్థింపగా వానిని మందలించి రాజు వదిలివేశాడు.

## 12.7. అడ్డతీగల, రంపచోడవరం దాడులు :

అక్టోబరు 8 నుండి 10 వ తేదీ వరకు దసరా ఉత్సవాలను తన ఆధ్వర్యం క్రింద రాజు ఎంతో వైభవోపేతంగా జరిపించాడు. ఇంతలో ప్రభుత్వం ప్రత్యేక మలబారు పోలీసుదళాన్ని సమాయత్తం చేసి అక్టోబరు 12 వ తేదీన ఆ ప్రాంతానికి పంపించారు. ఆ దళం అచ్చటికి చేరిన తర్వాత కూడా రాజు నిర్భయంగా తిరుగుతూ, అడ్డతీగల పోలీసుస్టేషనుపై తాను సాగింపదలచిన దాడిసంగతిని తారీఖుతో సహా, అక్కడి తాలుకా ఆఫీసరులకు తెలియపరచి. దానికి అనుగుణంగా అక్టోబరు 16న ఆ స్టేషనుపై దాడి చేశాడు. ప్రభుత్వము షెర్లాక్ అనువాని నాయకత్వంలో వెనువెంటనే ప్రత్యేక పోలీసుదళాన్ని అక్కడికి పంపినాకూడా ఏమీ ప్రయోజనం లేకపోయింది. అడ్డతీగలనుండి రాజు తన అనుచరులతో, రంపచోడవరానికి పయనించి. అక్కడి తహసిల్దార్‌ను తనవద్దకు పిలిపించి, పితూరీ ఇంకా రెండు సంవత్సరాలపాటు కొనసాగుతుందని, రక్తపాతం జరిగి తీరుతుందని విశదీకరించాడు. ఇంకను అతను యూరోపియన్లు, ఎప్పుడు భారతీయులతో కూడి ఉంటున్నందున, వారిని చంపుటకు తనకు వీలుకానందున బాధపడ్డాడు.

ఒక్కవారం రోజులలో రెండు ప్రాంతాలను లూటీచెయ్యడం గవర్నమెంటు ప్రతిష్టకు ఎంతో హానికరమని గోదావరి కలెక్టరు బ్రేకన్ బాధపడ్డాడు. మలబారు స్పెషల్ పోలీసులు, వైర్‌లెస్‌సెట్ వలనకూడా సీతారామరాజు ఉద్యమాన్ని అరికట్టలేకపోయారు. చోడవరం స్టేషన్‌లోని మందుగుండు సామాగ్రిని, ఆయుధాలను ప్రభుత్వం అదివరకే రాజమండ్రికి తరలించినందున, సీతారామరాజుకు అచట ఏమియు లభించలేదు. అయితే చోడవరం ప్రజలు మాత్రం రాజునకు మంగళహారతులతో సుస్వాగతం పల్కి గౌరవించారు. ఈ విధంగా పోలీసుదళాలు ఆ ప్రాంతంలో మకాం వేసి ఉన్నా, ఎంతో నిర్భయంగా రాజు తన దాడులను సాగింపగల్గుటకు, అతని వేగుదళము అతనికెంతో సహకరించింది. అంతేగాక ఆ ప్రాంతంలోని గ్రామ మునసబులు, సాధారణ గ్రామీణులు కూడా అతనిపై ఉన్న గౌరవభావం వలన, జీతంలేని వేగు పనివారివలె అతనికెంతో సాయపడి, పోలీసుదళాల్ని, వారి రాకపోకల్ని, వారి స్థావరాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసేవారు. ఈ సంగతి గమనించిన ప్రభుత్వం గ్రామ మునసబులను భయపెట్టి తమవైపుకు త్రిప్పుకోటానికి ఎంతోయత్నించినా లాభం లేకపోయింది.

## 12.8. రామవరం దాడి :

సెప్టెంబరు నెలలో ఇద్దరు బ్రిటిష్ అధికారులను చంపిన నెలరోజులకు రామవరం దాడి జరిగింది. విప్లవకారులు చోడవరంనుండి బయలుదేరి రామవరంవచ్చి అక్కడ బసచేశారు. అది తెలిసి బ్రిటిష్ ఆఫీసరు సాండర్స్ ప్రత్యేక సైనికదళంలో అక్టోబరు 24 ఉదయం 9 గంటలకు అక్కడికి వచ్చాడు. విప్లవవీరులు బండరాళ్ళవెనుక పొంచిఉండి ప్రభుత్వ సైన్యాలపై కాల్పులు జరిపారు. సైనికులు ఎదురుకాల్పులు జరిపారు. ఎత్తైన ప్రదేశంలో రాళ్ళవెనుకనుండుటచే విప్లవకారులకు పెద్దగా నష్టం కల్గలేదు. ఒక పోలీసు గాయపడ్డాడు. పరిస్థితులు అనుకూలంగా లేక సాండర్స్ సైనికులతో వెనుతిరిగిపోయాడు. రామవరం సంఘటనతో సాండర్స్ చాలా నిరాశ చెందాడు. రామవరందాడి కొండక్రింద దళాధిపతియైన స్టూవర్ట్ ఈ విధంగా రాశాడు, "రామవరం దగ్గర జరిగిన దాడినిబట్టి చూస్తే రాజుకు మందుగుండు సప్లయి బాగుంది. ఇంకా ఇలాగే కొన్ని నెలలపాటు దాడిని జరిపేట్టున్నాడు."

తర్వాత నవంబరు 3 వ తేదీకి రాజు, విప్లవవీరులు మాకవరం చేరారు. "నిత్యానంద పట్నాయక్" అను ఇన్‌స్పెక్టర్ వీరికి పట్టుబడ్డాడు. రాజు అతనిద్వారా బ్రిటిష్ సైనిక శిబిరాలలోని బలాలను గూర్చి వివరాలను తెలుసుకొన్న తర్వాత హెచ్చరించి అతనిని విడిచిపెట్టాడు. తర్వాత నవంబరు 17 న రంపోల్, చేవర్తిపాలెం లూటీలు, నవంబరు 30 వ తేదీన అనంతసాగరం, వెలగపాలెం దోపిడీలు జరిగాయి.

### 12.9. పెద్దగడ్డపాలెం వద్ద రాజు తొలిపరాజయం :

డిసెంబరు 6 వ తేదీన రాజు పెద్దగడ్డపాలెంలో ఉండగా అతనిపై ప్రభుత్వం ఆకస్మికంగా ఒకదాడిని నిర్వహించింది. అఫిషియల్ రిపోర్టు ప్రకారం స్వేనీ (Sweney) కీన్ (Keene), గూడ్‌సెల్ (Good Sell), ముగ్గురు భారతీయ ఆఫీసర్లు, ఇంకను 50 మందికి, విప్లవకారులకు మధ్య ఒకగంటసేపు హోరాహోరీ పోరాటం జరిగింది. దీనిలో 8 మంది విప్లవకారులు చనిపోయారు. నలుగురు పట్టుబడ్డారు. కొంతమంది గాయపడ్డారు. సీతారామరాజు తప్పించుకొని పారిపోయాడు. కాని అతనుకూడా గాయపడ్డాడు. ఈ దాడిలో రెండు 303 రైఫిల్స్, ఆరు పోలీసు కత్తులు, ఇంకా కొన్ని తుపాకులు మందుగుండు సామాగ్రి, రాజుపడకతోసహా స్కాట్‌కవార్డ్‌యొక్క ఆటోమేటిక్ పిస్టల్ పట్టుబడ్డాయి. పోలీసుల పక్షంలో జమిందార్ కేశవన్ గాయపడ్డాడు. మళ్ళీ లింగాపురందగ్గర పోలీసుదళం దాడిచేసి వారికి ఎంతో నష్టాన్ని కల్గించారు. ఈ రెండుచోట్ల రాజు పరాజయం చవిచూశాడు. సీతారామరాజును పట్టుకున్నవారికి 1500 రూ॥లను, గాముసోదరులను వీరయ్యలలో ఏ ఒక్కరిని పట్టుకొన్నా 1,000 రూ॥లను తక్కిన పితూరీదారులలో ఏ ఒక్కరినీ పట్టుకొని అప్పగించినా 50 రూ॥లు బహుమతులుగా ఈయగలమని ప్రభుత్వంవారు ప్రకటించారు. ఇంతగా ఆశ కల్పించినా రాజునుగాని, అతని అనుచరులనుగాని పట్టి ఇచ్చుటకుగాని, తగు ఆచూకీని తెల్పుటకుగాని ఎవరు ముందుకు రాలేదు. పెద్దవలస, దొరకొండ, గూడెం గుర్తేడు, మఠం, భీమవరం ప్రాంతాలలోని పర్వతసీమలలో రాజు, తన అనుచరులతో ఎంతో స్వేచ్ఛగా నెలలతరబడి తిరుగుతున్నప్పటికీ, అతని ఆచూకీని ప్రభుత్వానికి ఎవ్వరు అందచేయలేదు. ప్రభుత్వం రాజుకు అత్యంత సన్నిహితుడైన ఎండుపడాల్‌ను రాజునుండి విడదీయడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. అడపదడప గ్రామాల దోపిడీ జరుగుతూనే ఉన్నది. ఫిబ్రవరి 16 వ తేదీన పోలీసులు దాడిజరిపి నలుగురు తిరుగుబాటుదారులను పట్టుకున్నారు. రాజుదళాన్ని గురించి సరైన సమాచారాన్ని అందచేయలేదనే నెపంతో కొన్ని గ్రామాలలోని మునుసుబులను, అనుమానితులను ప్రభుత్వం శిక్షించింది. తిరుగుబాటుదారులందరూ, మార్చినెల నాటికి రాజును వదిలేసి వెళ్ళినారని భావించిన ప్రభుత్వం మలబారు ప్రత్యేకదళాన్ని పంపించివేసింది.

### 12.10. అన్నవరంపై రాజుదాడి :

మలబారు పోలీసుదళం ఆ ప్రాంతంనుండి వైదొలిగిన వెంటనే, రాజు యధాపూర్వకంగా తన విప్లవ కార్యకలాపాలను కొనసాగించడం మొదలుపెట్టి ఏప్రిల్ 18, 1923 న అన్నవరం పోలీసుస్టేషన్‌మీద హఠాత్తుగా దాడిచేశాడు. కాని అక్కడ ఉన్న తుపాకులను, మందుగుండు సామాగ్రిని ముందుగానే ప్రభుత్వం తరలించివేసినందువలన రాజుకు ఏవీ లభ్యంకాలేదు. అయినా అచటి గ్రామీణులేగాక, ప్రభుత్వ ఉద్యోగులగు పోస్ట్‌మాస్టరు, డిప్యూటీ తహసిల్దార్, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ రాజునకు స్వాగతంపలికి, ఎంతో ఆదరించి తమతమ ఇండ్లకు తీసుకొనిపోగా, వారి గృహిణులు రాజు కాళ్ళుకడిగి, ఆ నీటిని తమ శిరస్సుపై చల్లుకొని, ఎంతో భక్తితో గురువుకు పూజచేసినట్లుగా పూజలుచేశారు. రాజు అన్నవరం దేవాలయాన్ని సందర్శించినపుడు కూడా ఇట్టిమర్యాదలే జరిగేవి. అక్కడినుండి రాజు శంఖవరం వెళ్ళగా అక్కడి ప్రజలుకూడా రాజుకి ఘనస్వాగతం పలికారు. ఇది తెలుసుకొన్న ప్రభుత్వం ఆ రెండు గ్రామాలపై సమిష్టిగా 4,000 రూ॥లు జరిమానా విధించింది. అంతేగాక రాజుయొక్క గౌరవప్రతిష్టలు ఏమి తగ్గలేదని ప్రభుత్వం అర్థం చేసుకొనగల్గింది.

### 12.11. గాముమల్లుదొర అరెస్టు :

మళ్ళీ మే నెలాఖరువరకు ఎలాంటి సంఘటనలు లేవు. మే నెల 31 వ తేదీన గంటందొర నాయకత్వాన కొయ్యూరువద్ద సబ్‌ఇన్‌స్పెక్టరును డిప్యూటీ తహసిల్దారును పట్టుకున్నారు. తర్వాత వారిని కొట్టి వదిలి వేశారు. విశ్రాంతి గృహాన్ని తగులపెట్టారు. ఈ దాడి సల్పిన గంటందొర అక్కడి తహసిల్దారుతో బాస్టియన్‌యొక్క దురాగతాలను, అతనివలన తనకు కల్గిన నష్టాన్ని విశదీకరించి, అతనికి ఒంజేరిఘాట్ దగ్గర తాను చంపడానికి ప్రయత్నించినా అది విఫలమైనదని చెప్పాడు. అంతేగాక, ఏదోఒకరోజు పొత్తంగి వెళ్ళి అతనిని చంపుతానన్నాడు. జూన్ 15 న రాజు తన దళంలో తుపాకులను కొన్నింటిని సంపాదించుకొనుటకై కొండ కంబేరు, మల్కానగిరి పోలీసు స్టేషన్లపై దాడి చేశాడు. ఈ దాడి సల్పిన దళంలో కుముదవల్లికి చెందిన అగ్గిరాజు (పేరిచెర్ల సూర్యనారాయణరాజు) కూడా పాల్గొన్నాడు. ఆ సందర్భంగా రాజు తహసిల్దారును రప్పించి తన తర్వాత పథకాలన్ని అతనికి చెప్పాడు. తహసిల్దారు ప్రభుత్వానికి పంపిన నివేదికలో రాజు ఒక ఎర్రటి ఖద్దరు తలపాగ, పొడవైన షర్ట్, నిక్కరు ధరించినట్లు పేర్కొన్నాడు. అంతేగాక అతనివద్ద అగ్గిరాజు కూడా ఉన్నాడు. రాజు

ఎప్పుడూ తెలుగుభాషలోనే మాట్లాడుతాడని, అతనికి గాంధీపట్ల ఎంతో గౌరవభావాలు ఉన్నాయని, స్వరాజ్యం సాధించేవరకు అతను పోరాటం సాగిస్తాననేవాడని అయితే హింస తప్పనిసరి అని అతని ఉద్దేశం అని పేర్కొన్నాడు. తన సమాచారాన్ని ప్రభుత్వానికి అందచేసే వారిని రాజుకఠినంగా శిక్షించేవాడు. జూన్ 31 వ తేదీన రాజు, అనుచరులు ఏబ్రోలు గ్రామపు మునుసబును, అతని కుమారుని ప్రభుత్వానికి వేగుపడినా వ్యవహరించుచున్నారనీ సమాచారం తెలియవచ్చి, వారిరువురిని నిర్బంధించి, తమతోకూడా తీసుకొనిపోయారు. కాని వారి ప్రాణాలకు అపాయం కల్గించలేదు. మళ్ళీ జూలై 29 న కొన్ని బండ్లనుపట్టుకొని, 600 బియ్యపు బస్తాలను స్వాధీనం చేసుకొన్నారు. ఆగస్టు 4 న ఇద్దరు తపాలా కానిస్టేబుళ్ళను పట్టుకొని పెద్దవలస శిబిరాన్ని నెలరోజులలోగా దాడిచేస్తామని కబురుచేశారు. ఆగస్టు 14 న కోమిక, 20 న దమనూరువెళ్ళి కొన్ని బియ్యంబస్తాలను పట్టుకొన్నారు. సెప్టెంబరు 2 వ తేదీన రామవరంవద్ద రాజును ఎదిరించిన పోలీసులు వెనెక్కి తిరిగిపోవలసి వచ్చింది. ఇంతలో సెప్టెంబరు 18 వ తేదీన గ్రామమల్లుదొర నాడింపాలెంలోని అతని ఉంపుడుకత్తె ఇంట్లో గాదెలో దాగుకొని ఉండగా పట్టుబడ్డాడు. దానితో రాజుకు కుడిభుజము పడిపోయినట్లయింది. అయినను ఎంతమాత్రము గుండెనిబ్బరం కోల్పోకుండా నిలదన్నుకొని తనదాడులను కొనసాగించుతూ రాజు సెప్టెంబరు 20, 22 తేదీలలో క్రమంగా గంగరాజు మాడుగోలు పెద్దూరులలోని పోలీసులపై దాడిచేసి దెబ్బతీశాడు.

### 12.12. రాజు మరణము, మే 7, 1924 :

సెప్టెంబరు 22 న రాజు, అతని అనుచరులు పద్వావైపుకు వెళ్తుండగా పోలీసులు వెంటబడుటచే వెనక్కు మళ్ళవలసి వచ్చింది. సెప్టెంబరు 30 న పోలీసు కాల్పులనుండి రాజుదళం తప్పించుకొన్నారు, కాని అక్టోబరు 22 న గుడ్డపల్లివద్ద రాజు ఉన్నాడని ప్రభుత్వం తెలుసుకొని పోలీసు దళాన్ని అచటికి పంపించినది. కాని అక్కడి గ్రామ మనసబు పోలీసులకు సహకరించినట్లు నటిస్తూనే, రాజును ఉన్నచోటునుంచి తప్పించి పోలీసుదళాన్ని తప్పుత్రోవకు మరలించాడు. ఈ సంగతి తర్వాత తెలుసుకొన్న మలకనగిరి డిప్యూటి తహసిల్దార్ ప్రభుత్వానికి తెలియచేస్తూ రాజు, అతని అనుచరులు తప్పించుకొని పారిపోవడానికి గ్రామ మునసబు విద్రోహకచర్యయే సాయపడిందని వాపోయాడు.

కాలం గడిచేకొద్దీ రాజుకు తగినన్ని మారణాయుధాలు లేని కొరత బాధించసాగింది. అతని రాకపోకలను పసిగట్టిన ప్రభుత్వం స్టేషన్లలోని మారణాయుధాలను వేరే ప్రాంతాలకు తరలించినందున, పోలీస్ స్టేషన్లపై రాజుదాడి వ్యర్థమైంది. అందువలన రాజు గూడెం వద్దనున్న మిలిటరీ శిబిరంపైనే దాడిచేసి, ఆయుధాలను సంపాదించవలెనని నిర్ణయించుకున్నాడు. ఈయొక్క ప్రయత్నంలో గూడెంలోని ప్రజలందరు రాజుపక్షాన్ని సమర్థించారు. కాని అక్కడి మిలిటరీదళం మాత్రం తీవ్రంగా కాల్పులు సాగించింది. దానిఫలితంగా అనేకమంది పితూరీదారులు గాయపడ్డారు. ఒకరు మరణించారు. తర్వాత రాజుదళాన్ని పట్టుకోవడానికి పోలీసులు గజపాకలువద్ద వ్యర్థప్రయత్నం చేశారు. నవంబరు 22 న మైదానం ప్రాంతపు సమీపంలోని ఉరట్ల గ్రామాన్ని రాజుదళం సందర్శించింది. అప్పటినుండి రాజు అతని అనుచరులు ప్రభుత్వంతో దాగుడుమూతలాడుతూ వచ్చారు. డిశంబరులో జరుగనున్న కాకినాడ కాంగ్రెస్ మహాసభకు రాజు వస్తాడని, రాజమండ్రి జైలుపై దాడిచేసి పృథ్వీసింగ్‌తో సహా రాజకీయ ఖైదీలను విడుదల చేయిస్తాడని వదంతులు వ్యాపింపగా ప్రభుత్వం జాగ్రత్త వహించింది. కాంగ్రెస్ మహాసభలో రాజు వాలంటీరుగా పంజాబ్ శిబిరంలో ఉన్నాడని, పోలీసులు కనుక్కోలేకపోయారని కూడా వదంతులు వ్యాపించాయి. పరిస్థితులిలా ఉండగా, ఏజెన్సీ ప్రాంతాలలో ఉంచబడిన సైనికదళాలు రాజును ఎదుర్కొనుటకు తగినంత సమర్థవంతమైనవి కావనీ నిర్ణయానికి మద్రాసు ప్రభుత్వం వచ్చింది. అంతట అస్సామ్ రైఫిల్స్‌కు చెందిన రెండు జమిరి కంపెనీలను ప్రభుత్వం నర్సీపట్నానికి జనవరి 27, 1924 నాటికి పంపించింది. ఫిబ్రవరి ప్రారంభంలో రాజుదళం రెండుగా చీలి, తరచు కలుసుకుంటూ తమ కార్యకలాపాలను సాగించారు. కాని ఈ దళం వలన కూడా ప్రయోజనం అంతగా లేకపోయింది. కావున ఏప్రిల్ 17 న రూథర్‌ఫోర్డ్ అను అధికారిని ప్రభుత్వం స్పెషల్ కమీషనర్ ఇన్-ఛార్జిగ నియమించింది. ఈ కాలంలోనే రాజు తన అనుచరులతో జయపూర్‌జిల్లాలోని పాడవతాలుకా ప్రాంతంలో పర్యటిస్తూ ఉండేవాడు. మే 1 వ తేదీనాటికి 200 మంది అస్సాం రైఫిల్‌దళం వచ్చిచేరింది. రాజును నలువైపులనుండి అరికట్టి కదలకుండాచేసి నిర్బంధింపవలెనని ఎత్తుగడవేసి, రూథర్‌ఫోర్ట్ తన శాయశక్తులా కృషిచేశాడు. రాజు స్థావరాలను తెలుసుకోవడంలో అక్కడి గ్రామస్థులు పెద్దఅడ్డంగా ఉన్నారు. రాజు పట్ల ఆ గ్రామస్థులకు గల సానుభూతియే అతని జాడను గురించి వివరాలను చెప్పనీయడంలేదని రూథర్‌ఫోర్ట్ తెలుసుకున్నాడు. దీనిని తొలగించడానికి వెంటనే

పూనుకొని, ఆ ప్రాంతపు ప్రముఖులలో 55 మందిని వేరేచోటికి తరలిపోవలసిందిగా వారెంట్లను, పితూరీదార్లకు సన్నిహిత బంధువులైన 182 మందికి నిర్బంధపు ఉత్తర్వులను జారీచేశాడు. రూథర్‌ఫోర్ట్ సాగించిన ఇట్టిచర్యలవలన ప్రజలలో భీతి, అలజడి చెలరేగాయి.

రాజుమాత్రము ఏమి భయపడకుండా, ఇంతకుముందు మాదిరే తన కార్యకలాపాలను సాగించాడు. మే 6, 1924 న ఉపేంద్రపట్నాయక్ నాయకత్వంలో పోలీసుదళం మద్దేరువద్ద తమ రహస్య స్థావరంకొరకు వెతుకుతున్న తిరుగుబాటుదార్లతో తారసిల్లింది. ఈ పోరాటంలో ఒక కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. తర్వాత పోలీసులు జరిపిన కాల్పులో ఇద్దరు తిరుగుబాటుదార్లు చనిపోగా కొందరు గాయపడ్డారు. అంతేగాక అగ్గిరాజు పోలీసుల చేతుల్లో చిక్కాడు. 1924 మే 7 న, తూర్పుతీరపు ప్రత్యేక పోలీసుదళం (East coast special police) జమీందారు కుంభమీనన్ ఆధ్వర్యంలో ఒక గడ్డపు వ్యక్తిని రాజుగా అనుమానించి వెంటబడగా అతను పరుగెత్తాడు. పోలీసులు కాల్పులు జరుపగా అతను పడిపోయి పట్టుబడ్డాడు. తానే రాజునని అంగీకరించాడు. అప్పుడు అతనికి ఆ రోజే కొయ్యూరికి తీసుకొనివచ్చారు. అప్పుడే అక్కడికి మేజర్‌గుడాల్ అస్సామ్ రైఫిల్స్‌తో వచ్చాడు. గవర్నమెంటు రిపోర్టుప్రకారం రాజు తప్పించుకోవటానికి ప్రయత్నించగా అతన్ని తుపాకితో కాల్చిచంపారు. తర్వాత రాజుశవాన్ని కృష్ణదేవిపేటకు తీసుకొనిరాగా అక్కడి డిప్యూటీ తహసిల్దారు, తదితరులు రాజు శరీరాన్ని గుర్తుపట్టారు. రాజు మృతదేహాన్ని ఒక మంచానికి కట్టివేసి ఆ నులకమంచాన్ని బండిమీద నిలబెట్టి ఇతరులు ఇంకెప్పుడు ఇటువంటి తిరుగుబాట్లు తలపెట్టకుండా ఉండేటట్లు భయపెడుతూ, బండిమీద ఊరేగింపుగా తీసుకొనివెళ్ళారు. దారిలో అందరు ఆ మృతదేహాన్ని రాజుదేనని గుర్తించారు. గూడెంలో ఉండే 50 మంది రాజు అనుచరులు, గ్రామ మునసబులు, రాజును తిరుగుబాటుకు ముందే తెలిసినవారంతా ఆయనను గుర్తించారు. అయినా బ్రిటిష్ ఆఫీసర్లకు ఇతను సీతారామరాజేనా, కాదా అనే అనుమానం, భయం పీడించాయి. తాము పొరపాటు చేయలేదని ధృవపరచుకొనేందుకు సీతారామరాజు మృతదేహాన్ని అంత్యక్రియలకు ముందు ఫోటోతీశారు. మే 8 వ తేదీ ఉదయం కృష్ణదేవిపేటలో అంత్యక్రియలు జరిగాయి. రాజుని కాల్చలేదు, అతన్ని అండమాన్ దీవులకు పంపారని ఒకకథనం కూడా ఉంది. అందువలననే జూలై 20, 1924 న గోదావరిజిల్లా కాంగ్రెస్ సమావేశంలో సీతారామరాజు త్యాగాల్ని శ్లాఘిస్తూ తీర్మానం చేయబోయి, అతను చావలేదనే ఎదంతివల్ల ఆపివేశారు. రాజు మరణంతో, తిరుగుబాటు ఇంచుమించు నిలిచిపోయింది. చెదురుమదురుగా తిరుగుబాటు జరిగినా గ్రామస్థులు ప్రభుత్వానికి సహాయం చేయడం మొదలుపెట్టారు. మే 26 న, ఎండుపడాల్ జూన్ 7 న గంటందొర హతమార్చబడటంతో తిరుగుబాటుదార్లు అంతమయ్యారు. ఈ విధంగా 1924 వ సంవత్సరం మధ్యకాలానికి రంపపితూరి ఆగిపోయింది

## 12.13. సమీక్ష :

రాజువంటి నాయకుడు, కాల్చి చంపబడుటగాని, అండమాన్స్‌కి పంపబడడం కాని సబబుకాదు. రాజు శివాజీలాంటి వీరులతో సరిసమానమైనవాడు. ఈ రంపవిప్లవము ప్రభుత్వానికి కనువిప్పు అయింది. ఇటువంటి తిరుగుబాట్లు పునరావృతం కాకుండా దీనికి శాశ్వతపరిష్కారం కనిపెట్టాలని ప్రభుత్వం గుర్తించింది. ఈ రంపపితూరి ఆంధ్రప్రజానీకపు గౌరవాదరణాలను, అధికంగా ఆర్జించి వారి భావనల్ని సమాయత్తం చేయకలిగింది. ఆ కాలంలో అహింసాయుతంగా స్వాతంత్ర్య సమరాన్ని సాగించుకున్న భారత జాతీయ కాంగ్రెస్, సీతారామరాజు లేవదీసిన సాయుధపు తిరుగుబాటును సమర్థింపకున్నా, ఆంధ్రుడగు ప్రతివానికి రాజుయొక్క సాహసకృత్యాలు గర్వకారణాలైనాయి. రాజుయొక్క వీరగాథను ఈనాటికి ప్రజలు వేనోళ్ళ కొనియాడుతున్నారు. అయితే సమకాలీన కాంగ్రెస్ నాయకులు, రాజుపైగాని, రాజు నడిపించిన ఉద్యమంపైగాని అణచివేసే చర్యలకు స్వాగతం పలికారు. 1924 అక్టోబరులో జరిగిన ఆంధ్ర కాంగ్రెసు కమిటీ వార్షిక సమావేశంలోగాని, ఆంధ్రమహాసభ వార్షిక సమావేశంలోగాని రాజుయొక్క దేశభక్తిని, త్యాగనిరతిని ప్రశంసిస్తూ ఎటువంటి తీర్మానం ఆమోదించలేదు. రాజుయొక్క మరణం సందేహాస్పదంగా ఉండడంవల్లనే తీర్మానాన్ని ఆమోదింపలేదని సంజాయిషీ చెప్పారు. ఆంధ్రపత్రికతో సహా అనేక పత్రికలు రాజు సాయుధపోరాట చర్యలను మెచ్చుకోలేకపోయినాయి. మద్రాసు శాసనసభలో కట్టమంచి రామలింగారెడ్డితో సహా అనేకమంది సభ్యులు పితూరీని అణచివేయవలసిన అవసరాన్ని గురించి నొక్కి చెప్పారు. ఈ విధంగా సీతారామరాజు విప్లవాత్మకపాత్రను సమకాలీనులు శ్లాఘింపలేకపోయారు.

డాక్టరు పట్టాభి సీతారామయ్య వ్రాసిన 'భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర' లో గూడెం, ఏజెన్సీ తిరుగుబాటు గురించి ప్రస్తావించారు.

మోప్లా తిరుగుబాటు వంటిదానిలో సాగినట్లుగా ప్రభుత్వపు ఆస్తులను నాశనం చేయడం, ప్రజలను కొల్లగొట్టడం భీతావహంగా మెలగడంవంటి దురంతాలు రాజు సాగించిన తిరుగుబాటులో ఎక్కడా జరగలేదనే ఇక్కడ గమనింపదగిన ముఖ్యవిషయం. తమ దగ్గర నిర్బంధితులైన పోలీసు అధికారులయెడ పితూరీదారులు ప్రదర్శించిన గౌరవభావం ఎంతో శ్లాఘనీయం. తన అనుచరులను ఎంతో క్రమశిక్షణతో నడుపుతూ, బ్రిటిష్‌వారిని భారతదేశంనుండి తరిమికొట్టడమే తన లక్ష్యమని రాజు అంటూ ఉండేవాడని తెలియవస్తున్నది. పూర్వం శివాజీవంటి వీరులు తమకాలపు పరప్రభుత్వాన్ని కాదని పోటీ ప్రభుత్వాన్ని ఏర్పరచి కృతకృత్యులైన విషయం చరిత్రవలన తెలుస్తున్నది. సీతారామరాజుకూడా వారిని అనుసరింప బూనుకున్నాడు. కాని శివాజీకాలపు పరిస్థితికి, సీతారామరాజుకాలపు పరిస్థితులకు మధ్య ఏ విధమైన పోలికలేదు. అందుచేత సీతారామరాజు ప్రయత్నం విఫలమైనది. అంతేగాక రాకపోకలు, వార్తాసంబంధాల వసతులు, విజ్ఞాన శాస్త్రసాయంతో ఆధునిక పరికరాలతో యుద్ధం సాగించు సేనాబలాన్ని కల్గిన ఇండియావంటి పెద్దదేశంలో ఇట్టి స్థానిక తిరుగుబాటు విజయవంతం కావడం అసాధ్యం. తాను కన్నకలలు కార్యరూపం పొందడానికి, దేశకాలాలు ఏ విధంగానూ అనుకూలించని సమయంలో, స్థానికవిప్లవానికి పూనుకొని బ్రిటిష్ ప్రభుత్వాన్ని సాయుధ పోరాటంద్వారా ఎదిరించిన ఖ్యాతి ఈ వీరునిది.

### 12.14. వ్యాసరూప ప్రశ్నలు :

1. రంప ఉద్యమానికి దారి తీసిన కారణాలు, దాని ప్రాముఖ్యతను వివరింపుము.
2. అల్లూరి సీతారామరాజు నిర్వహించిన రంప ఉద్యమాన్ని అరికట్టుటకై బ్రిటిష్‌వారు తీసుకొన్న చర్యలను వర్ణింపుము.

### 12.15. ఉపయుక్త గ్రంథాలు :

1. Prof. M. Venkata Rangaiya (editor) - The Freedom Struggle in Andhra Pradesh (Andhra) Vol III. (1921 -31)
2. Prof. Sarojini Regani - Andhralo Swantrodyama Charitra ( Telugu Academy Publication, Hyd, 1998.)
3. Prof. P. Raghunadha Rao - Adhunika Andhra Pradesh Charitra (Sterling Publishers Pvt Ltd, New Delhi 1997)
4. Dr. Tolepalem Mangamma - Viplava Virudu Alluri Sitaramaraju (Hyd, 1985)
5. Prof. Mamidipudi Venkatarangaiah - Andhralo Swatantrya Samaramu (Hyd, 1972)

డాక్టర్. ఎస్. గిరిజ

పాఠం - 13

# శాసనోల్లంఘన ఉద్యమం (1930 - 34)

విషయక్రమం

13.1 లక్ష్యం

13.2 ఆంధ్రాలో ఉప్పుసత్యాగ్రహం (1930-31)

13.3 దండి ఉప్పు సత్యాగ్రహం

13.4 ఆంధ్రాలో ఉప్పుసత్యాగ్రహం విశిష్ట లక్షణాలు

13.5 వివిధ జిల్లాలలో ఉద్యమ నిర్వహణ

13.5.1 కృష్ణాజిల్లా

13.5.2 గుంటూరు జిల్లా

13.5.3 తూర్పు గోదావరి జిల్లా

13.5.4 పశ్చిమ గోదావరి జిల్లా

13.5.5 విశాఖపట్నం జిల్లా

13.5.6 నెల్లూరు జిల్లా

13.5.7 మద్రాసు నగరం

13.5.8 రాయలసీమ

13.6 ఆంధ్రాలో మద్యనిషేధ, విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమాలు

13.7 గ్రామోద్యోగుల రాజీనామాలు

13.8 ప్రభుత్వం అవలంబించిన ఉద్యమ అణచివేత విధానాలు

13.9 పెద్దాపురం సంఘటన

13.10 గాంధీ - ఇర్విన్ ఒడంబడిక తర్వాత జరిగిన సంఘటనలు

13.10.1 వాడపల్లి సంఘటన

13.10.2 ఇతర సంఘటనలు

13.11 ఉప్పుసత్యాగ్రహ తీరుతెన్నులు

13.12 శాసనోల్లంఘన రెండవ దశ 1932 - 34

13.13 శాసనోల్లంఘన ఉద్యమాన్ని అణచుటకు ప్రభుత్వం అవలంబించిన దమన చర్యలు

13.13.1 కాంగ్రెస్ ఆఫీసులకు తాళాలు వేయుట

13.13.2 144 సెక్షన్ అములులోనికి తెచ్చుట

13.13.3 నాయకుల అరెస్టులు

13.13.4 సత్యాగ్రహుల ఇళ్ళు సోదాచేయుట

13.13.5 నిషేధింపబడిన పుస్తకాలు
13.13.6 144 సెక్షన్ ధిక్కరించి జరిపిన సమావేశాలు
13.13.7 ఉమ్మడి జరిమానాలు
13.13.8 పోలీసుల జులుం
13.14 మహిళల పాత్ర
13.15 ఇండియా లీగ్ డెలిగేషన్ పర్యటన
13.16 కమ్యూనల్ అవార్డ్
13.17 ముగింపు

13.1 **లక్ష్యం :** 1930 ఫిబ్రవరి 14, 15, 16, తేదీలలో, కాంగ్రెస్ కార్యనిర్వాహక వర్గం సబర్మతి ఆశ్రమంలో సమావేశమై, ఉద్యమాన్ని నడపడానికి గాంధీజీని సర్వసేనాధిపతిగా నియమించి, శాసనోల్లంఘనం గురించి తీర్మానం చేసింది. 1930 లో ప్రారంభమైన ఉప్పుసత్యాగ్రహం భారత స్వాతంత్ర్య సమరంలో ఒక ప్రముఖ ఘట్టం. ఈ ఉద్యమం మహాత్మాగాంధీ నాయకత్వంలో దేశమంతటా వ్యాపించి బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మారింది. 1931 గాంధీ - ఇర్విన్ ఒప్పందంలో ఉప్పుసత్యాగ్రహం ఆగిపోయింది. తర్వాత 1932 - 34 లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో కూడా లక్షలాది ప్రజలు, స్త్రీలు పిల్లలతో సహా పాల్గొన్నారు. ఈ శాసనోల్లంఘన ఉద్యమం ఆంధ్రలో ఏ విధంగా జరిగినదో పరిశీలించుటయే ఈ పాఠం లక్ష్యం.

## 13.2 ఆంధ్రాలో ఉప్పుసత్యాగ్రహం (1930-31) :

లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో 'పూర్వ స్వరాజ్య తీర్మానం' ఆమోదింపబడిన తర్వాత, శాసనసభల నుండి కాంగ్రెసువారు రాజీనామా ఇవ్వాలని, జనవరి 26 న దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవం జరపాలని కాంగ్రెస్ కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. తదనుసారంగ భారతదేశాన స్వాతంత్ర్య దినోత్సవం, మొట్టమొదట, జనవరి 26, 1930 న జరిపారు. లాహోర్ కాంగ్రెసు ముగిసిన వెంటనే కొండా వెంకటప్పయ్య నాయకత్వంలో ఆంధ్ర ప్రతినిధులు గాంధీజీని కలుసుకొన్నారు. తన సత్యాగ్రహ విజయానికి గాంధీజీ గుజరాత్, బీహార్, ఆంధ్ర రాష్ట్రాలమీదనే ఆధారపడినట్లు చెప్పారు. అంతేగాక ఎట్టి పరిస్థితులలోను అహింసామార్గాన్ని విడనాడ వద్దన్నారు. ఆంధ్రకాంగ్రెస్ సంఘం కాకినాడలో సమావేశమై సత్యాగ్రహోద్యమానికి వలంటీర్ల దళాన్ని పెంపొందించాలని తీర్మానించింది. స్వాతంత్ర్య ప్రకటనను తెలుగులో అనువదించి అన్ని కాంగ్రెస్ సంఘాలకు పంపారు. స్వాతంత్ర్య దినోత్సవం ఆంధ్రా అంతటా ఉత్సాహంగా జరిగినప్పుడు ప్రజలు కార్యాచరణకు సిద్ధంగా ఉన్నట్లు రుజువైంది. కాంగ్రెస్ ఆదేశానుసారం ఒక్క ప్రకాశం మినహా మిగిలిన వారంతా శాసన సభలకు రాజీనామా ఇచ్చారు.

లాహోర్ కాంగ్రెస్‌నుండి వెనుకకు రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పర్యటనకై ఫిబ్రవరి 8 న వచ్చిన గవర్నరు ముందు 'గోబాక్' అన్న నినాదాలతో వ్యతిరేఖ ప్రదర్శనలు జరిపారు. ఈ సందర్భంగా 11 మందిని అరెస్ట్ చేసి 5 వారాల అనంతరం వారికి వివిధ శిక్షలు విధించారు. వారిలో గొట్టిపాటి బ్రహ్మయ్య కూడా ఉన్నారు. ఫిబ్రవరి 10 న గవర్నర్ గుంటూరుకి వచ్చిన సందర్భంలో మున్సిపల్ కౌన్సిల్ ఆయనకు స్వాగతం పలుకలేదు. అంతేగాక హిందూ హై స్కూల్‌లో ఒక భవనానికి శంఖుస్థాపనకై వెళ్ళిన సందర్భంగా విద్యార్థులందరు గైరుహాజరై గవర్నరును అవమానించారు.

## 13.3 దండి ఉప్పుసత్యాగ్రహం :

జనవరి 30, 1930 న గాంధీజీ తన సంపాదకత్వంలో వెలువడుతున్న 'యంగ్ ఇండియా'లో ప్రజల శ్రేయస్సుకై ప్రభుత్వం చర్య తీసుకొనవలసిన 11 విషయాలను ప్రస్తావిస్తూ, వాటికి అనుగుణంగా వైస్రాయ్ చర్య తీసుకొన్నచో శాసనోల్లంఘనానికి ఆవశ్యకత ఉండదన్నారు. వీటిలో సంపూర్ణ మద్యనిషేదం, ఉప్పుపన్ను రద్దుచేయుట ముఖ్యమైనవి. ఫిబ్రవరి 8, 1930 న కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సబర్మతి ఆశ్రమాన సమావేశమై, శాసనోల్లంఘన ఉద్యమాన్ని నడుపుటకు గాంధీజీకి సంపూర్ణ అధికారాన్ని ఇచ్చింది. గాంధీజీ మార్చి 12 న ఉప్పుశాసనాన్ని

ఉల్లంఘించుటకు దండయాత్ర ప్రారంభించినప్పుడు ఆయన 78 మంది అనుచరులలో ఎర్నేని సుబ్రహ్మణ్యం కూడా ఉన్నారు. ఆంధ్ర నాయకులు జంబూసర్‌లో గాంధీని కలిశారు. సత్యాగ్రహానికి ఉద్యుక్తులు కమ్మని కొండా వెంకటప్పయ్య ఆంధ్ర నాయకులకు తంతి ఇచ్చాడు.

### 13.4 ఆంధ్రాలో ఉప్పుసత్యాగ్రహం : విశిష్ట లక్షణాలు :

ఆంధ్రలో ఈ ఉద్యమాన్ని నిర్వహించడానికి కొండా వెంకటప్పయ్యకు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అన్ని హక్కులు ఇచ్చింది. ఇదే విధంగా జిల్లాకొక వ్యక్తిని నాయకుడిగా నియమించారు. ప్రతిజిల్లాకు ఒక సత్యాగ్రహ శిబిరం నెలకొల్పబడింది. అంతేగాక వలంటీర్లకు శిక్షణ ఇవ్వడానికి, సమాచారం అందివ్వడానికి, కొత్తవారిని చేర్చుకోవడానికి ఏర్పాట్లు చేశారు. నెల్లూరు జిల్లాకు పల్లెపాడు, గుంటూరు జిల్లాకు గుంటూరు, పశ్చిమ కృష్ణాకు బెజవాడ, తూర్పు కృష్ణాకు మచిలీపట్నం, పశ్చిమ గోదావరికి ఏలూరు జాతీయ కళాశాల, తూర్పు గోదావరికి సీతానగరం, విశాఖపట్టణానికి విజయనగరం శిబిర కేంద్రాలుగా నిర్ణయించారు. సత్యాగ్రహం ఒకేసారి అనేక కేంద్రాలలో నిర్వహించినట్లయితే ప్రభుత్వ శక్తులు కేంద్రీకృతం కాలేవని, దానివలన సత్యాగ్రహం జయప్రదం కాగలదని పట్టాభి ఆంధ్ర కాంగ్రెస్ సమావేశాలలో సూచించారు. ఈ సూచన ఆమోదం పొందింది. మార్చి 29 న గుంటూరులో జరిగిన ఆంధ్ర కాంగ్రెస్ సమావేశం ప్రకారం నెల్లూరులో మైపాడు, కృష్ణాలో మచిలీపట్నం, పశ్చిమ గోదావరిలో మొట్లపాలెం, తూర్పు గోదావరిలో చొల్లంగి, విశాఖపట్నంలో బీచ్, గుంటూరులో కొండా వెంకటప్పయ్య గృహం సత్యాగ్రహ కేంద్రాలుగా నిర్ణయించారు. ఏప్రిల్ 6 నుండి 13 లోపల అనుకూలమైన రోజున శాసనోల్లంఘనం చేయమని జిల్లా సంఘాలకు ఆదేశాన్నిచ్చారు.

### 13.5 వివిధ జిల్లాలలో ఉద్యమ నిర్వహణ :

ఏప్రిల్ 6 న తూర్పు గోదావరి జిల్లా వలంటీర్లు చొల్లంగిలో సముద్రనీటిని కాచి ఉప్పు తయారు చేశారు. 9 వ తేదీన కృష్ణా, గుంటూరు జిల్లాలలో, 11 వ తేదీన పశ్చిమ గోదావరి, నెల్లూరుజిల్లాల్లో, 13న విశాఖపట్నంలో సత్యాగ్రహం జరిగినది. మద్రాసులో ఏప్రిల్ 13 న ప్రకాశం, నాగేశ్వరరావు, వి.యల్ శాస్త్రి, దుర్గాబాయి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాలలో ఉప్పుమళ్ళుకట్టి సముద్రపునీరు ఆవిరి కావించడం ద్వారా ఉప్పు తయారుచేశారు. నెల్లూరు వద్ద గోగులపల్లిలో సత్యాగ్రహులకు, పోలీసులకు ఈ పద్ధతి వలన పోరాటం సంభవించింది.

తొలిదశలో ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని గురించి అంతగా పట్టించుకోలేదు. కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాకలెక్టర్లకు తమకు విచక్షణాధికారాలు ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ అనుమతితో సాంబమూర్తి తదితర నాయకులు అనేకులు అరెస్టుకాబడి జైలుకు పంపబడ్డారు. నెల్లూరు, గంజాం జిల్లాలలో కూడా ఇట్టి చర్యలే తీసుకోబడ్డాయి. గుంటూరు, తెనాలి, బాపట్ల విశాఖపట్టణం న్యాయవాదుల సంఘాలు సమావేశాల ద్వారా సానుభూతిని వ్యక్తపరిచి, చందాలిచ్చి ఖద్దరు ధరించి కోర్టుకు వెళ్ళడం ప్రారంభించారు. స్థానిక సంస్థలవారు, స్త్రీలు ఉద్యమంలో ప్రవేశించారు.

**13.5.1 కృష్ణాజిల్లాలో ఉప్పు సత్యాగ్రహం :** ఉప్పుసత్యాగ్రహానికి ఆంధ్రరాష్ట్రానికి సంబంధించినంతవరకు కృష్ణాజిల్లాయే శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 6 న అయ్యదేవర కాళేశ్వరరావు, ముట్నూరి, డాక్టర్ పట్టాభి మచిలీపట్నం వద్ద సముద్ర తీరానికి వెళ్ళి ఉప్పును సేకరించి సాయంత్రాన జరిగిన బహిరంగ సభలో ఆ ఉప్పును పంచిపెట్టారు. ఏప్రిల్ 9 న డా॥ పట్టాభి సీతారామయ్య సముద్రతీరానికి వెళ్ళి, ఉప్పును తెచ్చి మచిలీపట్నంలోని తిలక్‌చౌక్ వద్ద జరిగిన సభలో వేలంపాట పెట్టి అమ్మివేశారు. ఏప్రిల్ 10 న ప్రకాశం పంతులు, కాశీనాధుని నాగేశ్వరరావు, కొండా వెంకటప్పయ్య సముద్రతీరానికి చేరి, ఉప్పును తయారుచేశారు. అయితే పోలీసులు దారి అడ్డగించి ఆ ఉప్పును వశపరచుకున్నారు. ఏప్రిల్ 11 న 150 మంది వలంటీర్లు కుండల్లో సముద్ర నీటిని మచిలీపట్టణానికి తెచ్చి ఉప్పును తయారుచేశారు. ఇంకను గంపల గూడెపు జమీందారుడైన వెంకట కృష్ణారావు, అయ్యదేవర కాళేశ్వరరావు మున్నగువారు ఉప్పుచట్టాన్ని ఉల్లంఘించారు.

**13.5.2 గుంటూరు జిల్లాలో ఉప్పు సత్యాగ్రహం :** ఏప్రిల్ 9 న గుంటూరు జిల్లాలో మొదలైన ఉప్పుసత్యాగ్రహానికి కొండా వెంకటప్పయ్య నడింపల్లి వెంకటలక్ష్మీ నరసింహారావు, శరణు రామస్వామి చౌదరి నాయకత్వం వహించారు. కొండా వెంకటప్పయ్య గారి

ఇంటిలో ఉప్పు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో 16 మంది మహిళలు కూడా పాల్గొన్నారు. వాడరేవువద్ద అన్నా ప్రగడ కామేశ్వరరావు, కాశీవిశ్వనాథం. ఉప్పుచట్టాలను ఉల్లంఘించారు. ఏప్రిల్ 26 న 41 మంది సత్యాగ్రహులు కనుపర్తివద్ద నున్న ప్రభుత్వపు ఉప్పు కొఠారుపై దాడిచేసి, అక్కడినుండి ఉప్పును కొనిపోవలసినదని గ్రామస్థులను కోరారు. గుంటూరులో ఉన్నవ లక్ష్మీబాయమ్మ, రుక్మిణీ లక్ష్మీపతుల నాయకత్వాన ఏర్పాటైన మహిళా స్వయం సేవికా విభాగం ఉద్యమ వ్యాప్తికి చురుకుగా పనిచేసింది. 1930 మార్చి 31, ఉగాది పండుగ సందర్భాన మహిళా వలంటీర్లు గుంటూరు నగరాన ఇంటింటికి పోయి స్త్రీలనందరినీ ఆ పండుగను స్వరాజ్యలక్ష్మి వ్రతంగా నిర్వహించి, సత్యాగ్రహోద్యమంలో పాల్గొనవలసిందిగ కోరారు. స్వరాజ్యలక్ష్మీవ్రతం, రాట్నలక్ష్మీవ్రతం ఈ జిల్లాలో జరిగాయి. సాంప్రదాయ మహిళలను స్వాతంత్రోద్యమంలోకి మళ్ళించడానికి ఇవి తోడ్పడ్డాయి. ఈ రకంగా రూపొందిన సత్యాగ్రహ శిబిరాలు ప్రజానీకంలో అన్ని కులాల, తెగల వర్గాల ఆదరాభిమానాలను ఆర్జింపగల్గాయి.

**13.5.3 తూర్పు గోదావరి జిల్లాలో ఉప్పు సత్యాగ్రహం :** ఏప్రిల్ 6 వ తేదీన తూర్పు గోదావరి జిల్లాలోని బొల్లంగిలో వలంటీర్లు సముద్రపు నీటిని కాచి ఉప్పు తయారుచేశారు. సీతానగరం ఆశ్రమవాసులు ఉద్యమ నిర్వహణలో ప్రముఖ పాత్రను వహించారు. మొదటి సత్యాగ్రహ జట్టులో దువ్వూరి సుబ్బమ్మ, వెన్నేటి సత్యనారాయణ, సూర్యప్రకాశరావు, బులుసు సాంబమూర్తి ఉన్నారు. అంతేగాక పెద్దాడ కామేశ్వరమ్మ, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యంగారి తల్లియైన లక్ష్మీనరసమ్మ, రాజమండ్రికి చెందిన పాలకోడేటి శ్యామలాంబ ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

**13.5.4 పశ్చిమ గోదావరి జిల్లా :** ఈ జిల్లాలో దండునారాయణ రాజు ఆధ్వర్యంలో ఏప్రిల్ 11 వ తేదీన ఉప్పు సత్యాగ్రహులు ఉప్పు పర్రల వద్దకు వెళ్ళి, సముద్రపు నీటినుండి ఉప్పు తయారుచేసి ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించారు. మట్లపాలెం వద్ద ఆత్మకూరి గోవిందాచార్యులు ఉప్పు చట్టాలను ధిక్కరించారు. వారు తాము నెలకొల్పిన వేర్వేరు శిబిరాలలో ఏప్రిల్ 15 నుండి మే 13 వరకు ఇతర సత్యాగ్రహులతో పాటుగా ఉండి ఉద్యమం నిర్వహించారు.

**13.5.5 విశాఖపట్నం జిల్లా :** విశాఖపట్నంలో ఉప్పుసత్యాగ్రహం టౌన్‌హాలువద్ద, భీమిలి మున్నగు చోట్ల జరిగినది. తెన్నేటి విశ్వనాథం, యమ్. రామచంద్రశాస్త్రి కె.యస్.గుప్తా, డి.వి. సీతారామస్వామి మున్నగు వారు పాల్గొన్నారు. ముందుగ రామచంద్రశాస్త్రి చీపురుపల్లి, భీమిలి, విజయనగరం, అనకాపల్లి, సర్వసిద్దిపాలెం తాలూకాలలో ఉప్పు సత్యాగ్రహాన్ని నిర్వహించడానికి నిర్ణయించారు. విశాఖపట్నంలో తెన్నేటి విశ్వనాథం, రామచంద్రశాస్త్రి డి.వి. రామస్వామి ఉప్పు తయారు చేశారు. శ్రీమతి దిగుమర్తి జానకీబాయి కూడా పాల్గొన్నారు. భీమిలిలో వెంకట సత్యనారాయణ 20 మంది వలంటీర్లతో ఉప్పు తయారు చేశారు. శ్రీమతి జానకీబాయి, ఎమ్. శారదాంబ, ఎమ్. బంగారమ్మ, భీమిలిలో మే 15 న ఉప్పు తయారుచేశారు. శ్రీమతి జానకీబాయి టౌన్‌హాల్ దగ్గర ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నప్పుడు పోలీస్ అధికారి సాండర్స్ ఆమె చేతినుండి ఉప్పు లాగడానికి ప్రయత్నించగా ఆమె తన్ను అరెస్టుచేసి ఉప్పును స్వాధీనం చేసుకోమని చెప్పింది. మే 24 న బాల చెరువువద్ద ఉప్పు కొఠారుపై దాడి కె. సర్వేశ్వర శాస్త్రి నాయకత్వంలో జరిగింది.

**13.5.6 నెల్లూరు ఉప్పు సత్యాగ్రహం :** నెల్లూరు జిల్లాలో మొదట ఏప్రిల్ 11, 1930 న మైపాడువద్ద ఉప్పు సత్యాగ్రహంలో డిక్టేటరైన ఓరుగంటి వెంకట సుబ్బయ్య. వి. రాఘవయ్య, లేబూరు సుబ్బరామిరెడ్డి, వేమూరి లక్ష్మయ్య, బెజవాడ గోపాలరెడ్డి మున్నగువారు పాల్గొన్నారు. ఇంకను ఓరుగంటి మహాలక్ష్మమ్మ, పాటూరి బాలసరస్వతమ్మ, పొణకా కనకమ్మ కూడా పాల్గొన్నారు. ఓరుగంటి వెంకట సుబ్బయ్య బెజవాడ గోపాలరెడ్డి, ఏ. లక్ష్మయ్య, యల్. సుబ్బరామిరెడ్డి, యల్. సుబ్బరామిరెడ్డి సత్యాగ్రహ సమితిలో సభ్యులుగా నియమింపబడ్డారు. పల్లెపాడు సత్యాగ్రహ ఆశ్రమాన్ని వలంటీరు శిక్షణా కాంప్‌గా నిర్ణయించారు. ఉప్పుసత్యాగ్రహం నెల్లూరు జిల్లాలోని గోగులపల్లి, తుమ్మలపెంట, నాయుడుపేట, సూళ్ళూరుపేట మున్నగుచోట్ల నిర్వహింపబడినది.

**13.5.7 మద్రాసు నగరంలో ఉప్పు సత్యాగ్రహం :** మద్రాసులో ఉప్పుసత్యాగ్రహం విజయవంతం కావడానికి ప్రకాశం పంతులు, కాశీనాధుని నాగేశ్వరరావు బాగా కృషి చేశారు. మద్రాసులో ఏప్రిల్ 13 న సముద్రతీరాన ప్రకాశం, నాగేశ్వరరావు ప్రథమ సత్యాగ్రహ దళంలో ఉప్పును తయారుచేశారు. తర్వాత ప్రకాశం శ్రీమతి దుర్గాబాయి 20 మంది మహిళా వలంటీర్లతో హైకోర్టుకు ఎదురుగ ఉన్న సముద్ర ప్రాంతాన ఉప్పును తయారు చేశారు. తర్వాత మే 5 న [illegible]బాయమ్మ, సాంథోమ్ బీచ్‌లో ఉప్పు తయారు చేస్తుండగా,

పోలీసులు ఉప్పుకుండలను పగులగొట్టి పొయ్యిని ఆర్పివేశారు. తర్వాత సత్యాగ్రహులు ఉప్పునీటిని తీసుకొని వేదవనం రాగా పోలీసులు దానిమీద కూడా దాడిచేశారు.

**13.5.8 రాయలసీమ :** సముద్ర తీరానికి చాలదూరంగా ఉన్న రాయలసీమలో ఉప్పు సత్యాగ్రహానికి అవకాశం లేనందున ఈ ఉద్యమం అంతగా జరుగలేదు. కాని మద్యనిషేధం, స్వదేశీ ఉద్యమం ఇచ్చట విజయవంతంగా జరిగాయి.

## 13.6 ఆంధ్రలో మధ్యనిషేధ, విదేశీ వస్త్రబహిష్కరణోద్యమాలు :

ఉప్పుసత్యాగ్రహానికి సరిపడని చోట్ల కల్లుతీసే తాడి, ఈతచెట్ల మొవ్వలు నరుకుట, విదేశీ వస్త్రదహనము చేపట్టుట ఈ ఉద్యమములోని అంశాలు. గుంటూరులో ఈ ఉద్యమానికి సారధి గొల్లపూడి సీతారామశాస్త్రి. ఈ ఉద్యమం తక్కువ కాలంలోనే నెల్లూరు, కృష్ణా జిల్లాలకు కూడా వ్యాపించింది. యువక సంఘాల సభ్యులు, మహిళా సత్యాగ్రహులు, విదేశీ వస్త్ర దుకాణాల వద్ద పికెటింగును సాగించేవారు. వీరిలో దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, పాలకోడేటి శ్యామలాంబ మున్నగువారు ముఖ్యులు. శాసనోల్లంఘనపు ఆరంభదశలో గుంటూరు, కృష్ణా జిల్లాలోని వర్తకులు తామంత తాము ముందుకు వచ్చి, ఆరు నెలల వరకు విదేశీ వస్తువులను విక్రయింపకుండ ఉండుటకు అంగీకరించారు. మహిళా వలంటీర్లు ఇంటింటికీ వెళ్ళి ఖద్దరు ప్రచారం చేశారు.

## 13.7 గ్రామోద్యోగుల రాజీనామా :

ఈ ఉద్యమకాలంలో కొంతమంది గ్రామోద్యోగులు తమ పదవులకు రాజీనామాలిచ్చారు. వారిలో మొదటివాడు ఏలూరు కరణమైన పోణంగిరావు, తర్వాత చల్లపల్లి, కోటికి, వీరభద్రాపురం, యలమంచిలిపాడు, ఇంకను కొన్ని ఇతర గ్రామాల కరణాలు కూడా రాజీనామాలిచ్చారు.

## 13.8 ప్రభుత్వం అవలంభించిన ఉద్యమ అణచివేత విధానాలు :

ఏప్రిల్ నెలలో ఉద్యమం సాగుతున్నప్పటికీ ప్రభుత్వం అరెస్టులు జరుపలేదు. మే నెలలో నౌపాడ, విశాఖపట్టణం జిల్లాలోని బాలచెరువు, గుంటూరు జిల్లాలోని కనుపర్తి వద్ద ఉప్పు కొఠారులపై సత్యాగ్రహులు దాడినిచేయగా పోలీసులు కొన్నిచోట్ల సత్యాగ్రహులను అరెస్టు చేయడం, లాఠీచార్జి చేయడం జరిగింది. జూన్ 9 న ఉన్నవ లక్ష్మీబాయమ్మతో సహా అనేకమంది స్త్రీలు పాల్గొనగా వారిని అరెస్టు చేశారు. దానితో జూన్ 10 నుండి ఉప్పుకొఠారులపై దాడిని ఆంధ్ర కాంగ్రెస్ విరమించింది. జూన్ నెలలో గుంటూరు జిల్లాలో కరవదిలో జెండాను ఊరేగించి ప్రతిష్టించినందుకు అనేకమంది అరెస్టయ్యారు. కృష్ణాజిల్లా నూజివీడులో కూడా జెండా ఆవిష్కరణను చూస్తున్న వారిపై లాఠీచార్జి జరిగింది. మే 19 న కృష్ణాజిల్లా గుడివాడలో నిషేధపుటాజ్ఞలు ఉల్లంఘించి, బహిరంగ సమావేశంలో పాల్గొన్న ప్రజలపై కాల్పులు జరిపారు. కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంపై మే 31 వ తేదీన వందమంది పోలీసులు దాడిచేసి సత్యాగ్రహులని అనుమానపడినవారిని అరెస్ట్ చేశారు. జూన్ 24 న ఏలూరులో శాంతియుతంగా సమావేశమైన ప్రజలపై కాల్పులు జరిపారు.

సత్యాగ్రహులకు ఆశ్రయమిచ్చి ఆహారం పెట్టిన గ్రామస్థులను ప్రభుత్వం జైలుపాలు చేశారు. అంతేగాక జూన్ 15 నాటికి సమావేశాలు, ఊరేగింపులు, నిషేదిస్తూ, వలంటీర్ల శిబిరాలను మూసివేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది. అంతేగాక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీని జిల్లా కాంగ్రెసు కమిటీలను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించారు.

కృష్ణాజిల్లా తిరుపూరులో ఖద్దరు ధోవతికట్టి కోర్టుకు వెళ్తున్న న్యాయవాదిని ఒక పోలీసు వివస్త్రుణ్ణి చేశాడు. అంతేగాక సత్యాగ్రహుల ఇళ్ళను సోదాచేసి గాంధీ ఫోటోలు చింపి, ఖద్దరు జెండాలను తగులబెట్టారు. రాట్నాలు విరుగగొట్టారు. ఖద్దరు కొట్లను ధ్వంసం చేశారు. సత్యాగ్రహుల్ని జైళ్ళలో పెట్టడం మానివేసి లాఠీలతో చావబాది, లారీలలో ఎక్కడికో తీసుకెళ్ళి వదిలేసేవాళ్ళు.

సత్యాగ్రహోద్యమాన్ని బలపరుస్తూ గుంటూరు, చీరాల, పెద్దాపురం, తెనాలి, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి మునిసిపల్ కౌన్సిళ్ళు, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లా కోర్టులు, రామచంద్రాపురం తాలూకా బోర్డు సానుభూతి వ్యక్తం చేసాయి. కొన్నిచోట్ల కార్యాలయ భవనాలపై జాతీయ జెండా ఎగురవేశారు. ఉద్యోగస్తుల్ని ఖద్దరు ధరించమన్నారు. పాఠశాలల్లో ప్రతిరోజు జాతీయ గీతాలు పాడవలెనన్నారు.

మద్రాసు ప్రభుత్వం వీటన్నిటినీ అభ్యంతర పెట్టింది. అయితే స్థానిక సంస్థలు ఆర్థికంగా ప్రభుత్వంపై ఆధారపడుట వలన ప్రభుత్వానికి లొంగక తప్పలేదు.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలో 'వీరభారతి' అనే పత్రికను ప్రభుత్వం కళ్ళుకప్పి కొన్ని మాసాలు నడిపారు. సత్యాగ్రహులు హఠాత్తుగా సారాయి దుకాణాల వద్దకు వచ్చి అబ్కారీవేలం అడ్డుపెట్టేవారు. రహస్యంగా ఇళ్ళల్లో కలుసుకొని పథకాలు రూపొందించుకొనేవారు. గుంటూరు జిల్లా కలెక్టర్ గాంధీ టోపీ ధరించడం నిషేధించగా హైకోర్టు అది కొట్టివేసింది. సత్యాగ్రహులలో మేజరు కాని వారిని కూడా కఠిన శిక్షలకు గురిచేసి, బాలనేరస్తులుగా బోర్‌స్టల్ సంస్థలకు పంపారు.

సత్యాగ్రహ ఉద్యమానికి వ్యతిరేకంగా ప్రభుత్వం కరపత్రాలు ప్రచురించి పంచిపెట్టింది. ప్రభుత్వ విధేయులైన గ్రామ మున్సబులు కరణాలను సమావేశపరచి గ్రామీణులలో తగు ప్రచారం చేసి, శాసనోల్లంఘనాన్ని ప్రజలు వ్యతిరేకించునట్లు చేయవలసినదని, అట్టివారికి ప్రభుత్వ సహాయం లభిస్తుందని ఆశపెట్టింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉద్యమాన్ని వ్యతిరేకించుటకై కొన్ని పత్రికలు కూడా నెలకొల్పబడ్డాయి వానిలో 'యదార్థవాది' ఒకటి. అంతేగాక రాజభక్తి సంఘాలస్థాపనకు ప్రభుత్వం ప్రోత్సహించింది.

జైలులో సత్యాగ్రహుల్ని నిర్బంధించిన తర్వాత కూడా, అవకాశం దొరికినప్పుడల్లా వారిపై లాఠీచార్జి తీవ్రంగా సాగించేవారు. గుడివాడ, ఒంగోలులోనేగాక జూన్ 24, 1930 న ఏలూరులో కూడా తుపాకీ కాల్పులు సాగించారు. మచిలీపట్నం చౌరస్తాలో తత్త్వనాథస్వామి జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, మే 6 న పోలీసులు దానిని తొలగించుటకు పూనుకున్నందువల్ల పోలీసులకు, ప్రజలకు తీవ్రసంఘర్షణ జరిగిన్నది. మచిలీపట్నంలో తోట నరసయ్యను పోలీసులు తీవ్రంగా బాదారు. అదిచూచి అక్కడి మునిసిపల్ ఛైర్మన్‌యైన శీలం జగన్నాథరావు, ఆ చౌరాస్తాలోనేగాక, మున్సిపాలిటీ కార్యాలయ భవనంపై కూడా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలనే తీర్మానాన్ని ఆమోదింపచేశారు. అలాగే రాజమండ్రి జైలులో శిక్షననుభవిస్తున్న వెలిదండ్ల హనుమంతరావు తనకిచ్చిన గంజిలో క్రిమికీటకాదులున్నాయని, దానిని తీసుకొనుటకు నిరాకరించగా అతన్ని స్పృహ తప్పేటట్లుగా కొట్టారు.

సత్యాగ్రహ ఉద్యమానికి సానుభూతి చూపిన రైతులకు వ్యవసాయ నీరు సమయానికి అందకుండా ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. ఆర్థికంగా వచ్చిన ఈ ఒత్తిడికి కొందరు రైతులు లొంగిపోయారు. ఆగస్టు నాటికి ఉద్యమం కొంచెం వెనుకబడి, జైలు బయట ఉన్న సత్యాగ్రహులు, విదేశీ వస్త్రబహిష్కరణ, కల్లు దుకాణాల పికెటింగ్, తాడిచెట్లు కొట్టివేయుట కార్యక్రమాలలో నిమగ్నమైనారు.

### 13.9 పెద్దాపురం సంఘటన :

వేరొక పోలీసు దురంతం డిసెంబరు 30, 1930 లో పెద్దాపురంలో జరిగింది. పెద్దాపురంలో లాయర్లలో అగ్రశ్రేణికి చెందిన వాడైన బొక్కా నారాయణ మూర్తి తోటలో వనభోజనాలు, ధనుర్మాస సందర్భంలో ఏర్పాటైనవి. అందుకు పెద్దరికం వహించినవాడు వత్సవాయి జగపతివర్మ. పలువురు ప్రముఖ బ్యాంకర్లు, వ్యాపారులు, భూస్వాములు, డాక్టర్లు ఈ భోజనానికి ఆహ్వానింపబడ్డారు. సాయంకాలం వారందరు, తేనేటిని సేవించే సమయంలో అకస్మాత్తుగా రిజర్వు పోలీసుదళం వారిపై దాడిచేసి, అక్కడ ఉన్నవారినందరిని చెదిరి పోవలసిందిగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదేశించాడు. పోలీసులు విచక్షణ లేకుండా చేతికందిన వారిని కొట్టసాగారు. తుని నివాసియైన కోదాటి రంగాచార్యులకు. ఈ లాఠీ చార్జివలన చేతి ఎముక విరిగింది. నాళం కృష్ణారావుకు కాలిమీద గాయమైంది. కె.వి.ఆర్. స్వామి నాయుడు, డాక్టర్ గోపాలకృష్ణయ్యలను పోలీసులు చితకబాది కాళ్ళతో తన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షురాలైన పెద్దాడ కామేశ్వరమ్మ మీద పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసులకు ఆ సమావేశ ఉద్దేశాన్ని గురించి ఒక దురభిప్రాయం ఏర్పడి ఉన్నందువల్ల ఇలాంటి దురాగతానికి వారు పూనుకున్నారు. ఇది పోలీసు జులుంకు పరాకాష్ఠయని మదరాసు కౌన్సిల్ స్వామి వెంకటాచలం చెట్టి ఖండించారు.

### 13.10 గాంధీ - ఇర్విన్ ఒడంబడిక తర్వాత జరిగిన సంఘటనలు :

మార్చి 5, 1931 న గాంధీ - ఇర్విన్‌ల మధ్య ఒడంబడిక కుదిరినప్పటికి, కల్లు అంగడులవద్ద, విదేశీ వస్త్ర దుకాణాల వద్ద పికెటింగు సాగించే వలంటీర్లను ప్రభుత్వం బాధించుట మానలేదు. అంతేగాక మహాత్మాగాంధీ పటాలను ప్రజలు ఊరేగించుటను కూడా అభ్యంతర పెట్టిన్నది.

మార్చి 6 న గాంధీ - ఇర్విన్ ఒడంబడిక సందర్భంగా, గుంటూరులో జరిగిన ఒక సభలో పోలీసులకు, కాంగ్రెసు వారికి కలహం జరిగింది. అందులో ఉపన్యసించిన కొండా వెంకటప్పయ్యను అరెస్టు చేశారు. మరుసటి రోజు రెండు నిరసన సభలు జరిగాయి. వాటిని చట్ట విరుద్ధమైన సభలుగా పోలీసులు ప్రకటించారు. కొంతమంది కాంగ్రెస్ నాయకుల్ని కూడా అరెస్టు చేశారు. మార్చి 7 న మద్రాసు ప్రభుత్వం జోక్యం చేసుకొని వారిని విడుదల చేసింది. మే 6, 1931 నెల్లూరులో లాఠీచార్జి జరిగింది. ఒక వారం తర్వాత పెద్దాపురం మిషన్ హైస్కూలులో స్త్రీ విద్యను గురించి దువ్వూరి సుబ్బమ్మ మాట్లాడుతుండగా విద్యార్థులపై లాఠీ ఛార్జి జరిగింది.

**13.10.1 వాడపల్లి సంఘటన :** చినవాడపల్లి తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలూకాలోని ఒక గ్రామం. ఇచట ఏటా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ సందర్భంలో రథోత్సవం జరగడం సంప్రదాయం. మార్చి 30 న వాడపల్లిలో ఊరేగింపు జరుగుతుండగా పోలీసులు వచ్చి గాంధీ, నెహ్రూ, సరోజినీ నాయుడు ఫోటోలను తొలగించి, లాఠీచార్జి జరిపి అప్పటికీ లొంగని వారిపై కాల్పులు జరిపారు. అంతట నిగ్రహం కోల్పోయిన కొందరు ప్రజలు పోలీసులపై మట్టిపెళ్ళలు, బురదను వర్షించారు. అప్పుడు పోలీసులు కాల్పులు జరుపగా ఇద్దరు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఇటువంటిదే కృష్ణాజిల్లా, శ్రీకాకుళం రథోత్సవంలో కూడా జరిగింది. అనేక చోట్ల పికెటింగ్ చట్ట సమ్మతమైనా అధికారులు అంగీకరించలేదు.

**13.10.2 ఇతర సంఘటనలు :** బెజవాడ, ఏలూరు వర్తకులు విదేశీ వస్త్రాల అమ్మకం ఆపి స్వదేశీ బట్టల వ్యాపారమే చేయడం ప్రారంభించారు. కాంగ్రెస్‌తో చేతులు కలిపినందువలన వర్తకుల్ని శిక్షిస్తామని కృష్ణాజిల్లా కలెక్టర్ బెదిరించారు. అంతేగాక ఏలూరులో ఒక్కొక్క కొట్టుముందు ఇద్దరికి మించి పికెటింగ్ చేయకూడదని ఉత్తర్వులు జారీ చేశారు. చీరాలలో కొందరు వలంటీర్ల దుష్ప్రవర్తన వలన, పికెటింగ్ నిషేధిస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ విధంగా పికెటింగ్ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. కులంలో తాగే వారిని వెలివేయడానికి చిత్తూరు జిల్లాలో కులపంచాయితీలు ఏర్పరచగా, ప్రభుత్వం అభ్యంతరం చెప్పింది. ఏలూరు, కొవ్వూరులలో అబ్కారీ అమ్మకాల పికెటింగ్‌పై 144 సెక్షను విధించారు. అంతేగాక రాజకీయ ఖైదీలను విడుదల చేయకపోవడం, తొలగించిన గ్రామాధికారులను తిరిగి ఉద్యోగంలో తీసుకోకపోవడం వంటి విధానాల ద్వారా ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ప్రభుత్వం తలపడింది. గూడూరు, సూళ్ళూరుపేట, గోగులపల్లెలో ఉప్పు తయారు చేయడానికి అనుమతి నిరాకరించారు.

ఈ సమయాన, క్రొవ్విడి లింగరాజు, తన సంపాదకత్వంలో వెలువడే 'కాంగ్రెస్' అనే తెలుగు జాతీయ వార పత్రికలో 21-2-1931, 10-5-31 తేదీలలో 'వీరబలి' 'ప్రథమ స్వతంత్ర సమర వర్ధంతి' అనే వ్యాసాలను రాశారు. అందుకై సెక్షన్ 124- ఏ క్రింద ప్రభుత్వం ఆయనపై అభియోగాన్ని తెచ్చి, బెయిల్ శిక్ష విధింప చేసింది. కోర్టులో తానిచ్చిన వాఙ్మూలంలో లింగరాజు ఈ సెక్షన్ క్రింద విచారింపబడుట తనకు గర్వకారణమని, జైలుకు పోవుట ద్వారా తన దేశానికి సేవచేయుట పరమేశ్వరుని ఇచ్ఛ అని చెప్పారు.

కృష్ణా, గోదావరి జిల్లాలలో కొత్త భూమిశిస్తు విధానానికి వ్యతిరేఖంగా పన్నుల నిరాకరణోద్యమాన్ని కాంగ్రెస్‌గాక ఏదైనా రైతు సంస్థ ప్రారంభించాలని గాంధీ సలహా ఇచ్చారు. చిత్తూరు జిల్లాలో ప్రభుత్వం కాంగ్రెస్ వారిని విపరీతంగా హింసించింది. ప్రభుత్వానికి విధేయతగా ఉండాలిగాని కాంగ్రెస్‌కు కాదని స్పష్టంచేసింది. కాంగ్రెస్‌కు సంబంధించిన సమావేశాల్ని నిషేధించమని గ్రామాధికారులకు ఉత్తర్వులిచ్చింది. ఈ విధంగా అడుగడుగునా గాంధీ ఇర్విన్ ఒడంబడికని ఉల్లంఘించి ప్రజల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించింది.

## 13.11 ఉప్పు సత్యాగ్రహ తీరు తెన్నులు :

ఉప్పు సత్యాగ్రహం ప్రజల సహకారాన్ని ఎంతగానో పొందింది. ఎచట సత్యాగ్రహ శిబిరాన్ని నెలకొల్పినను, పరిసరాల ప్రజలు జాతీయోద్యమం పట్ల తమ సానుభూతిని ప్రకటిస్తూ ఆ శిబిరము నిర్వహణకగు ఖర్చును, తగిన ధనసాయాన్ని చందాల ద్వారా స్వచ్ఛందంగా సమకూర్చేవాడు. ఇందుకు ఉదాహరణగా నెల్లూరు జిల్లాలోని పల్లెపాడు శిబిరాన్ని చెప్పవచ్చు. శిబిరపు నిర్వహణకగు ఖర్చును పరిసర గ్రామాల్లోని ధనవంతులగు రెడ్లతోపాటు, పేద ప్రజలు యథాశక్తి భరించేవారు. ఈ ఉద్యమకాలంలోనే ప్రసిద్ధాంధ్ర కవి త్రిపురనేని రామస్వామి చౌదరి రచించిన "వీరగంథం తెచ్చి నారము .... వీరు లెవ్వరో తెలుపుడీ .." అను జాతీయగీతం ప్రజాదరణ పొందింది.

దేశభక్తిని ఉద్దేపింపచేయు ఆ గీతం రాష్ట్రంలో అత్యంత ప్రచారం పొందినది. పశ్చిమ గోదావరి జిల్లాలోని గణపవరం వద్ద నెలకొల్పబడిన ఉప్పుసత్యాగ్రహ శిబిరపు ఖర్చులను, మాధవ స్వామి రైస్ మిల్లు మేనేజ్‌మెంటువారు భరించారు.

ఈ ఉద్యమంలో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారతీదేవి రంగా స్త్రీలకై ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించి, గుంటూరు జిల్లాలో అనేకమంది స్త్రీలను చైతన్యపరచింది. దుర్గాబాయమ్మ, ప్రకాశం భార్య వెంకట సుబ్బమ్మ, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం తల్లి లక్ష్మీనరసమ్మ, ఒరుగంటి వెంకట సుబ్బయ్య భార్య మహలక్ష్మమ్మ ఇంకను పొణకా కనకమ్మ, పాటూరి బాలసరస్వతమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, ఆచంట రుక్మిణీ దేవి, పెద్దాడ కామేశ్వరమ్మ, కాకినాడ నివాసియగు వేదాంతం కమలాదేవి, దువ్వూరి సుబ్బమ్మ విశాఖపట్నం నుండి, దిగుమర్తి జానకీదేవి మున్నగు మహిళలు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అంతేగాక దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ, పాలకోడేటి శ్యామలాంబ మున్నగువారు విదేశీ వస్త్రదుకాణాల వద్ద పికెటింగ్ చేయు ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ విధంగా మహిళలు ఎక్కువగా ఈ ఉద్యమంలో పాల్గొనడానికి గాంధీజీ ఎన్నుకొనిన అహింసాయుత మార్గమే కారణం. గాంధీ పిలుపుకు తరతరాలుగా ఇండ్లలో మగ్గుతున్న స్త్రీలు స్పందించి సముచితమైన పాత్ర వహించారు. 1930-32 మధ్య వేలకొలది స్త్రీలు శాసనాలను ధిక్కరించి శిక్షలను ఆహ్వానించారు. గుడివాడలో పికెటింగు చేసిన నేరానికి ప్రభుత్వం వల్లభనేని సీతామహలక్ష్మమ్మ, ఆమె సహచరులు దిగుమర్తి జానకమ్మ, వేదాంతం కమలాదేవి మున్నగువారికి ఒక సంవత్సరం ఖైదు శిక్ష విధించారు. భారతీదేవి రంగా రేపల్లె, తెనాలి తాలూకాలలో ఉద్యమం ప్రచారం చేసినారని ఆమెకు ఒక సంవత్సరం ఖైదుశిక్ష విధించారు. ఏలూరులో పికెటింగులో పాల్గొన్నందుకు సత్తిరాజు మంగమ్మ, స్వరాజ్యలక్ష్మి అరెస్టు అయినారు. ఇంకా కొన్నిచోట్ల స్త్రీ వలంటీర్లను లారీలలో తీసుకొని దూరప్రదేశాలలో వదిలివేసేవారు. గుంటూరులో మహాసభ నిర్వహింపవలసిన కొండా వెంకటప్పయ్యను ప్రభుత్వం నిర్బంధించగా, ఆయన స్థానంలో వేదాంతం కమలాదేవి సభను నిర్విఘ్నంగా కొనసాగించింది. అందులకు ఆమెకు ఒక సంవత్సరం ఖైదు శిక్ష వేశారు. ఈ విధంగా మహిళలు ఎంతో చురుకుగా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

## 13.12 శాసనోల్లంఘనం రెండవ దశ 1932 - 34 :

ఒక్క ఆంధ్రదేశంలోనే గాక, యావత్ భారత దేశంలో శాసనోల్లంఘనాన్ని అణచుటకు బ్రిటిష్ ప్రభుత్వం యత్నించింది. ఇంగ్లాండ్‌లో లేబర్ ప్రభుత్వం స్థానంలో కన్సర్వేటివ్ పక్షం అధికారంలోకి వచ్చింది. ఫలితంగా ఇండియాలో ఇర్విన్‌కు బదులు విల్లింగ్‌డన్ వైశ్రాయిగా వచ్చాడు. గాంధీ - ఇర్విన్ ఒడంబడికను బ్రిటిష్ ప్రభుత్వం ఉల్లంఘించినా కూడా, గాంధీజీ రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్ళి అది విఫలంకాగా 1931 డిశంబరు 28 న ఇండియాకు తిరిగి వచ్చారు. అప్పటికే దేశంలో నెహ్రూతో సహా ప్రముఖ కాంగ్రెస్ నాయకులందరు అరెస్టు కాబడ్డారు. గాంధీజీ లార్డ్ విల్లింగ్‌డన్‌ను కలుసుకొని మాట్లాడవలెనని ప్రయత్నించారు కాని ఆయన గాంధీజీని చూచుటకు సైతం నిరాకరించారు. అంతట కాంగ్రెస్ కార్యవర్గం సమావేశమై శాసనోల్లంఘనోద్యమానికి పిలుపునిచ్చింది. ఈ విధంగా స్వాతంత్ర్య సమరం మరొక ఘట్టాన్ని చేరుకొన్నది. కాని ఈ పర్యాయం శాసనోల్లంఘనం - కల్లంగళ్ళ పికెటింగు విదేశీ వస్త్ర బహిష్కారము, ప్రభుత్వ వ్యతిరేక రీతిలో ఉత్సవాలను ఊరేగింపులను, ప్రదర్శనలు సాగించుట, ఉప్పు చట్టాల ధిక్కరణ అనువాటికి మాత్రమే పరిమితం చేయబడింది. ఈ విధంగా కాంగ్రెస్ ప్రేరేపించిన ధిక్కరణ చర్యను ఎదుర్కొనుటకై, 1932 జనవరి 4 న గాంధీజీని ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ అరెస్టు దేశ ప్రజలలో ఉద్రేకాన్ని రెచ్చగొట్టింది. గాంధీజీ అరెస్టుకు నిరసనగా కాకినాడ టౌన్‌హాలులో సమావేశమైన బులుసు సాంబమూర్తి, తదితర నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేశారు. సాంబమూర్తిని విపరీతంగా లాఠీలతో కొట్టారు. ఈ సంఘటనను పత్రికలు నిరసించగా శాసనసభలో ప్రస్తావన కూడా వచ్చింది.

## 13.13 శాసనోల్లంఘనోద్యమాన్ని అణచుటకు ప్రభుత్వం అవలంభించిన దమన చర్యలు :

బ్రిటిష్ ప్రభుత్వం తమ పాత అనుభవాలను పురస్కరించుకొని సత్యాగ్రహులను నిర్దాక్షిణ్యంగా అణచుటకు విధానాలను ఏర్పరచుకొన్నది. సత్యాగ్రహులను అదుపులో పెట్టుటకు ఉద్యోగులకు ఆర్డినెన్సుల ద్వారా క్రొత్త అధికారాలను సంతరింపచేసింది. పోలీసు అధికారులు 1932 జనవరి 1 వ తేదీన పోలీసులకు లాఠీలను ప్రయోగించడంలో ప్రత్యేక శిక్షణనీయమని, ఉద్యమాన్ని అణచుటకై లాఠీ చాలకపోతే బాయ్‌నెట్లను ప్రయోగించటమేగాక తుపాకులు పేల్చాలని, ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వం వెనక్కు తగ్గినట్లు కనబడరాదని దీని ఉద్దేశం. దీనివలన పోలీసులు దారినపోయేవారిని కూడా కొట్టసాగారు. జనవరి 4, 1932 న నాలుగు అధికార శాసనాలను (Ordinances)

జారీ చేశారు. 1. అత్యవసర అధికార ఆర్డినెన్సు (Emergency Power Ordinance) 2. చట్టవిరుద్ధ చర్యలను ప్రేరేపించుట గురించి ఆర్డినెన్సు (Unlawful Invertigation Ordinance) 3. అక్రమ సమావేశ నిరోధపు ఆర్డినెన్సు (Unlawful Association Ordinance) 4. అత్యాచారాలను అరికట్టి బహిష్కరణ ఆర్డినెన్సు (Prevention of Molestation and Boycott Ordinance) ఈ నాల్గింటి ప్రకారం ప్రభుత్వం ఎవరినైనా, ఏమైనా చేయవచ్చును.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీని, ఆంధ్రలోను, మద్రాసున ఉన్న జిల్లా కాంగ్రెస్ సంఘాలను, నర్సపూర్, కొవ్వూరు, తణుకు మున్నగు తాలూకా కాంగ్రెస్ సంఘాలను, విజయవాడ, మచిలీపట్నం, విశాఖపట్నం మున్నగు పట్టణ కాంగ్రెస్ సంఘాలను అక్రమ సంఘాలుగా ప్రభుత్వం ప్రకటించింది. అంతేగాక యలమంచలి ఫిర్కా కాంగ్రెస్ కమిటీనీ మద్రాస్ నగర కాంగ్రెస్ కమిటీని అక్రమ సంఘాలుగ ప్రభుత్వం ప్రకటించింది. కాంగ్రెస్‌వారు నడుపుతున్న ఆశ్రమాలను, శిబిరాలను చట్ట విరుద్ధమని ప్రకటించి, ఆ ఆశ్రమాలను, ప్రభుత్వం వశం చేసుకొన్నది. ఇట్టివానిలో సీతానగరం ఆశ్రమం ఖద్దరు ప్రచారానికి ప్రముఖ స్థానం వహించింది. అంతేగాక పత్రికల ముద్రణ స్వాతంత్ర్యాలను అరికట్టడానికి చర్యలు తీసుకొన్నది. మద్రాసులోని ఆంధ్రాపత్రిక నుంచి ధరావత్తు కోరారు. అలాగే గుంటూరు, నెల్లూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని పత్రికలను ధరావత్తు కోరారు. ప్రకాశం గారి 'స్వరాజ్య' పత్రికకు కూడా హెచ్చరిక చేశారు. కాని ప్రకాశం తిరిగి సమాధాన మిచ్చి వారి ఆట కట్టించారు. సీతానగరంలోని 'కాంగ్రెసు', ఏలూరులోని 'సత్యాగ్రహి' పత్రికలు మూతపడ్డాయి. కాని పశ్చిమ గోదావరిలో సైక్లోస్టైయిల్ పత్రికైన "వీర భారతి" చాలకాలం నడిచింది. అంతేకాక జనవరి 20 న ఇనుగుపల్లి, భట్ల పెనుమర్రు, నెల్లూరులలోని సత్యాగ్రహ శిబిరాలను, కృష్ణా జిల్లాలోని కొమరవోలునందలి ఆశ్రమాన్ని ప్రభుత్వం వశం చేసుకొన్నది. శాసనోల్లంఘనోద్యమానికి కేంద్రాలుగా ఉపకరిస్తున్నాయనే అనుమానంతో కొందరు వ్యక్తుల స్వంత ఇళ్ళను కూడా పోలీసులు వశం చేసుకున్నారు. అంగలూరు వాస్తవ్యులైన యేర్నేని సుబ్రహ్మణ్యం, యెర్నేని సూర్యనారాయణ, విశాఖపట్నం వాసియైన నడింపల్లి నరసింహమూర్తి మున్నగు వారి ఇండ్లను వశం చేసుకున్నారు. ఆంధ్రలో కాంగ్రెస్ కార్యాలయాలేగాక ఖద్దరు షాపులనుసైతం వశపర్చుకున్నారు. కాంగ్రెస్ ఆశయసిద్ధికి ఏమీ చేయరాదంటు కె. నాగేశ్వరరావు, తెన్నేటి విశ్వనాధం, కొండా వెంకటప్పయ్య వంటి నాయకులకు ఉత్తర్వులు ఇచ్చారు. బెజవాడ, నెల్లూరువంటి పట్టణాలలో ఊరేగింపులు, ఉత్సవాలు, ప్రదర్శనలు కూడదంటూ నిషేధపుటాజ్ఞలు జారీ చేశారు. కృష్ణా, గోదావరి జిల్లాలలో పెంచిన భూమి శిస్తుకు వ్యతిరేకంగా శాసనోల్లంఘనచేశారని అనుమానించి అరికెపూడి రామకోటయ్య మున్నగు వారిని గృహాలనుండి కదలరాదని ఆజ్ఞ ఇచ్చారు. అయినను ఉత్తర్వులను ఉద్యమకారులు ఉల్లంఘించి శిక్షలను అనుభవించారు. ఉపన్యాసాలిచ్చినందుకు, పికెటింగ్ చేసినందుకు. జాతీయ జెండా ఎగుర వేసినందుకు, ఖద్దరు వస్త్రాలు టోపీలు ధరించినందుకు, కాంగ్రెస్ వలంటీర్లకు భోజనం పెట్టినందుకు, పోరాట సాహిత్యాన్ని పంచినందుకు శిక్షలు అనుభవించిన వారి సంఖ్య వేలల్లో ఉన్నది.

**13.13.1 కాంగ్రెస్ ఆఫీసులకు పోలీసులు తాళాలు వేయుట :** విజయవాడలో కాంగ్రెస్ కమిటీ పనిచేయుచున్న ఆంధ్రరత్న భవనానికి, కాకినాడలోని కాంగ్రెస్ కార్యాలయ భవనానికి పోలీసులు తాళాలు వేసారు. అంతట జూలై 11 న హబిబుల్లా నాయకత్వాన కొందరు కాంగ్రెస్ వలంటీర్లు ఆంధ్రరాష్ట్ర భవనాన్ని తిరగి వశపర్చుకొనుటకై విఫలయత్నాన్ని సాగించిన సందర్భాన 17 మంది వలంటీర్లను ప్రభుత్వం అరెస్టు చేసింది.

**13.13.2 144 సెక్షన్ అమలులోకి తెచ్చుట :** క్రిమినల్ ప్రొసీజరు కోడ్‌లోని 144 సెక్షన్ ను ఆ సమయంలో ప్రభుత్వం అమలులోనికి తెచ్చి దాని ప్రకారం డా॥బి॥ సుబ్రహ్మణ్యం, కళా వెంకటరావు, పెద్దాడ కామేశ్వరమ్మ, దేవులపల్లి సత్యవతమ్మ మున్నగు వారికి నోటీసులు జారీచేసింది. శాసనోల్లంఘనోద్యమానికి ప్రోత్సాహాన్ని కల్గించే రీతిలో మాట్లాడుటకు వారు పూనుకొనరాదని నిషేధించింది. ఇట్టి నోటీసులే విశాఖపట్నాన తెన్నేటి విశ్వనాధం, నెల్లూరులో పొణకా కనకమ్మ, ఓరుగంటి వెంకట సుబ్బయ్య మున్నగు వారికి జారీయైనవి. శాసనోల్లంఘన ఉద్యమ ప్రచారానికి ఎట్టి సమావేశాలు జరపరాదని నిషేధిస్తూ గుంటూరులో కొండా వెంకటప్పయ్య మున్నగు వారికి నోటీసులు ఇచ్చారు. శాసనోల్లంఘన సందర్భాన తమ గ్రామానికి వచ్చిన పొణకా కనకమ్మ, ఓరుగంటి మహాలక్ష్మమ్మలకు ఆ గ్రామపు చిన్నకరణం, గ్రామ మునుసబులు ఆతిధ్యమిచ్చారనే నెపంతో, ఆ గ్రామోద్యోగులను ప్రభుత్వం పదవినుండి తొలగించింది. మహిళా వలంటీర్లలో కొందరికి భోజన వసతి కల్పించారని సూరపనేని గోపాల కృష్ణయ్యకు రూ. 1,000 జరిమానా విధించారు. శాసనోల్లంఘనం పట్ల సానుభూతిని చూపించాడనే నెపంతో రాయవరం గ్రామ మునుసుబును పదవినుండి తొలగించడమేగాక, అతని కుటుంబ సభ్యుల్లో

అందరూ ఆ పదవికి అనర్హులని ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. కాకినాడ, గుంటూరు, తెనాలి, రాజమండ్రి వంటి నగరాలలో సమావేశాలు, ఊరేగింపులు, ప్రదర్శనలు జరుగకుండా ప్రభుత్వం నిషేధాజ్ఞలు జారీ చేసింది.

**13.13.3 నాయకుల అరెస్టులు :** ఈ ఉద్యమ సందర్భాన ప్రముఖ కాంగ్రెస్ నాయకులగు టంగుటూరి ప్రకాశం, దండు నారాయణ రాజు, బులుసు సాంబమూర్తి, డా॥ పట్టాభి, ముట్నూరి కృష్ణారావు, రంగశాయి, చెరుకువాడ నరసింహం, పేట బాపయ్య మున్నగు వారందరిని ప్రభుత్వం అరెస్టు చేసింది. జనవరి 9 న ఏలూరులో మూల్పూరి చెక్కమ్మను నిర్బంధించారు. బెజవాడలో కాళేశ్వరరావు, కె. లక్ష్మయ్య చౌదరి మున్నగు వారిని, పాలకొల్లులో చోపెల్ల సత్యనారాయణమూర్తిని, వై. రామయ్య మున్నగువారిని ఏలూరులో నిర్బంధించారు. ఇంకను కృష్ణాజిల్లాలో కొడాలి ఆంజనేయులు, గొట్టిపాటి బ్రహ్మయ్య మున్నగు వారిని నిర్బంధించారు. జనవరి 16 న మద్రాసులో విదేశీ వస్తువులను విడనాడమంటూ కరపత్రాలు పంచిపెట్టిన కాశీనాధుని నాగేశ్వరరావుకు 6 నెలల శిక్షతో పాటు 250 రూ. లు జరిమానా కూడా విధించారు. జనవరి 18 న జిల్లాబోర్డు కార్యాలయం మూసి వేయడం ద్వారా గాంధీ అరెస్ట్‌కు నిరసన తెలిపిన పళ్ళంరాజును నెలరోజులు జైలులో పెట్టి 200 రూ॥లు జరిమానా విధించారు.

**13.13.4 సత్యాగ్రహుల ఇల్లు సోదాచేయుట :** జనవరి మాసమంతా ప్రభుత్వం సత్యాగ్రహుల ఇళ్ళు సోదాచేయడం ద్వారా వారిని భయకంపితుల్ని చేయాలని ప్రయత్నించింది. జనవరి 5 న తణుకులో జగ్గన్నశాస్త్రి ఇంటిని, జనవరి 9 న గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘకార్యాలయాన్ని, ఇంకను తల్లీవఝుల శివశంకర శాస్త్రి మున్నగు వారి ఇళ్ళను, తెనాలిలో కల్లూరి చంద్రమౌళి ఇంటిని సోదా చేశారు. జనవరి 10 న విశాఖపట్టణంలో తెన్నేటి విశ్వనాధం, కె. సూర్యనారాయణ గుప్తగార్లకు చెందిన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. కేవలం ఇళ్ళు సోదాలేగాక అనేక సందర్భాలలో దాడులకు కూడా పోలీసులు దిగారు. జనవరి 8 న తెనాలిలోని వలంటీర్ల శిబిరంపై 14 న మచిలీపట్నంలోని కాంగ్రెస్ కార్యాలయంపై దాడిచేశారు. కృష్ణాజిల్లా కొమరవోలులో యెర్నేని సుబ్రహ్మణ్యం స్థాపించిన సత్యాగ్రహ శిబిరంపై రెండుమార్లు దాడిచేసి, సుబ్రహ్మణ్యం భార్యతో సహా మరికొందరు స్త్రీలను బస్సులో తీసికెళ్ళి నిర్మానుష్య ప్రదేశంలో వదిలి వేశారు. అంతేగాక సాధారణ దుస్తుల్లో ఉన్న ఒక పోలీసు, రైల్లో స్త్రీల పెట్టెలో ఎక్కి పెద్దాడ కామేశ్వరమ్మను, ఇంకా పరదాలో ఉన్న స్త్రీలను అల్లరిచేశారు. జనవరి 25 న పెద్దాపురంలో కాంగ్రెస్ వలంటీర్లు పంచిన కరపత్రాలు స్వీకరించారనే నెపంతో 12 మందిని కొట్టారు. మచిలీపట్నం నుండి చల్లపల్లి పోతున్న ఒక స్త్రీ ఖద్దరు చీర ధరించిందనే నెపంతో ఒక పోలీసు ఆమెను మధ్యలో దించివేశాడు. కాకినాడలో టి. ఆండాళమ్మ వద్ద జరిమానా వసూలు చేయటానికి ఆమె దూరపు బంధువు ఆస్తిని జప్తు చేశారు. కొడాలి ఆంజనేయులు వద్ద జరిమానాకై అతని సోదరుని ఇంటి సామాన్లు, పాత్రలు, గేదెలు వశం చేసుకున్నారు. కృష్ణాజిల్లాలో గుడివాడ తాలూకా వెంట్రప్రగడ గ్రామంలో శాసనోల్లంఘన ఉద్యమ సందర్భంగా గ్రామస్తులు, వలంటీర్ల కార్యకలాపాలకు సహకరించారనీ పేరిట 2 మాసాలపాటు ఆ గ్రామంలో పోలీసుదళాన్ని ఉంచారు. భీమవరపు రామచంద్రరావును బెజవాడలో లాకప్‌లో కొట్టగా అతను రక్తం కక్కాడు. 1932 జనవరి 30 న ఏలూరు సబ్‌జైలులో 15 మంది నిర్బంధితులను బెత్తంతో కొట్టి వదిలేశారు.

144 సెక్షన్ అమలు పరచినప్పటికీ, ప్రజలలో అంతర్గతంగా ఉండే దేశభక్తిని మాత్రం ప్రభుత్వం అణచలేకపోయింది. ప్రజలు తమంత తామే ముందుకు వచ్చి, విదేశీ వస్త్ర బహిష్కరణ మున్నగు కార్యక్రమాలలో పాల్గొన్నారు. స్వదేశీ వ్రతాన్ని అవలంబించి దీక్షలో కొనసాగించ వలసిందని ప్రజలను ఉద్బోధిస్తూ, సైక్లోస్టైయిల్ కరపత్రాలను వాలంటీర్లు పంచి పెట్టారు. విదేశీ వస్త్ర దహనాలు విరివిగా జరిగాయి. ఆంధ్రదేశమంతటా విదేశీ వస్త్రదుకాణాల వద్ద పికెటింగు కట్టుదిట్టంగా సాగింది. ఈ సందర్భంలోనే నెల్లూరు నగరంలో పికెటింగులో పాల్గొన్నందుకు ఓరుగంటి మహలక్ష్మమ్మ, తంగిరాల సీతమ్మ, దశరధరామిరెడ్డి, పాలకోడేటి శ్యామలాంబ, ఓరుగంటి వెంకటేశ్వర్లు అరెస్టులు, జైలు శిక్షలకు గురైనారు.

**13.13.5 నిషేధింపబడిన పుస్తకాలు :** ప్రెస్ చట్టంక్రింద కలగా సత్యనారాయణ వ్రాసిన 'స్వరాజ్య పథం' ని నిషేధించి రచయితకు సంవత్సరం కఠిన శిక్ష విధించారు. అది ముద్రించిన ప్రెస్ యజమాని ఆర్. వీరభద్రరావుకు 200 రూ॥లు జరిమానా విధించారు. దామరాజు పుండరీకాక్షుడు వ్రాసిన "నవయుగము - గాంధీ విజయము", నాళం కృష్ణారావు రాసిన "గాంధీ మహాత్ముని దశావతార లీలలు", కోనవెంకటరాయ శర్మ రాసిన 'పూర్ణ స్వాతంత్ర్యము', జె.సి. కుమరప్ప గ్రంథానికి అనువాదమైన "ప్రభుత్వధనము - మన

భీషతనము" సి.యస్. ఆండ్రూస్ రచనలకు తెలుగు అనువాదమైన "భారతదేశ స్వాతంత్ర్యము - స్వరాజ్య శరణ్యాము", అనే గ్రంథాలను నిషేధించారు. ఇంగ్లీషు గ్రంథాలను అనుమతించి, వాటి అనువాదాలను మాత్రమే నిషేధించడం గమనార్హం. 'స్ట్రగులింగ్ ఇండియా' వ్రాసిన యం. రామమూర్తిని, అచ్చువేసిన డి. వెంకట సుబ్బారావును శిక్షించబోయి గంజాం మేజిస్ట్రేట్ విముఖత వలన ఆగారు. దానికి పరిచయం వ్రాసిన వి.వి. గిరిని కూడా ప్రాసిక్యూట్ చేయవలసి వస్తుందని అది అభిలషణీయంగాదని మేజిస్ట్రేట్ సలహా ఇచ్చారు. ముదిగంటి జగ్గన్న శాస్త్రి రచించిన 'భారత స్వరాజ్య యుద్ధం' అనే పుస్తకానికి, పశ్చిమ కృష్ణా కాంగ్రెస్ సంఘం వెలువరించిన 'దరిద్ర నారాయణీయమ్' అనే చిన్న పుస్తకానికి సంబంధించిన ప్రతులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ ప్రచురణలను నిషేధించింది.

**13.13.6 సెక్షన్ 144 ధిక్కరించి జరిపిన సమావేశాలు :** సెక్షన్ 144 అప్పటిలో అమలులో ఉన్నా దానిని ఉల్లంఘించి 1932 జూన్ 5 న 'ఆంధ్రరాష్ట్ర రాజకీయ మహాసభ' గుంటూరులో వేదాంతం కమలాదేవి అధ్యక్షతన జరిగింది. శ్రీమతి కమలాదేవి ప్రతినిధులను వెంటతీసుకొని ఊరేగింపును జరుప ప్రయత్నించగా పోలీసులు జోక్యం చేసుకొని, ఊరేగింపును చెదరగొట్టి 220 మందిని అదుపులోనికి తీసుకొని వదిలి వేశారు. జూలై 7న తెనాలిలో తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ అధ్యక్షతన 39 మంది ప్రతినిధులతో మహాసభ జరిగింది. అనంతరం వారంతా ఊరేగింపుగా వెళ్తూండగా కొందరిని అరెస్టు చేశారు. జూలై 16 న నర్సాపురం తాలూకా మహాసభ, జూలై 23 న తల్లా ప్రగడ ప్రకాశరాయుడు అధ్యక్షతన భీమవరం తాలూకా మహాసభ, ఆగస్టు 8 న బాపట్ల తాలుకా మహాసభ, ఆగస్టు 16 న తెనాలి తాలూకా మహాసభ జరిగాయి. ఆగస్టు 26 న విశాఖపట్నం జిల్లా మహాసభ కైలాస పట్నంలో టేకుమళ్ళ బుచ్చి రామాయమ్మ అధ్యక్షతన, నెల్లూరు జిల్లా మహాసభ సెప్టెంబరు 26న భవనం తిరుపోలమ్మ అధ్యక్షతన జరిగింది. నిషేధింపబడిన ఈ సభలన్నింటినీ స్త్రీలు అధ్యక్షత వహించడం విశేషం. జూలై 4 న ఆంధ్రా అంతటా 'అఖిల భారత ఖైదీల దినోత్సవం' పాటించారు.

**13.13.7 ఉమ్మడి జరిమానాలు :** శాసనోల్లంఘనోద్యమానికి ఎక్కువ శ్రద్ధను వెల్లడించిన గ్రామాలమీద అపరాధపు సుంకంగా ఉమ్మడి జరిమానాలను విధించడానికి కూడ ప్రభుత్వం పూనుకొన్నది, ఇట్లాంటి తీవ్రచర్యకు ఫలితంగా వెంట్ర ప్రగడ గ్రామవాసులు 4,000 రూ॥లు జరిమానా చెల్లింపవలసి వచ్చింది. డోకపర్రు గ్రామవాసియైన పామిరెడ్డి వెంకట సుబ్బారావు ఆస్తి పాస్తులు ఇలాంటి జరిమానా వసూలు కొరకై జప్తుచేయబడినవి. ఎండూరి బాపనయ్యకు బ్యాంకులో ఉన్న నిల్వలను ప్రభుత్వం వశపరచుకొన్నది.

**13.13.8 పోలీసుల జులుం :** పెద్దాపురం, రాజమండ్రి, భట్ల పెనుమర్రు వంటి ప్రదేశాలలో పోలీసులు దౌర్జన్య పద్ధతులను అవలంబించారు. ఇట్టి దుండగాలకు పూనుకున్న వారిలో ఇద్దరు పోలీసు ఉద్యోగులు ముస్తఫా ఆలీఖాన్, బి. సుబ్బారావు నాయుడు అనేవారు తక్కిన అందరికంటె మిక్కిలి క్రూరంగా ప్రవర్తించేవారు. ముస్తఫా ఆలీకాన్ రాజమండ్రిలో పోలీస్ డిప్యూటి సూపరింటెండెంట్. సుబ్బారావు నాయుడు సబ్ ఇన్‌స్పెక్టర్, (ఇతన్నే 'డప్పుల సుబ్బారాయుడు' అనే పేరుతో పిలిచేవారు) సత్యాగ్రహులు ఉపన్యాసాలు ఇచ్చేటప్పుడు వారి మాటలు ప్రజలకు వినపడకుండా ఇతను డప్పులు వాయించమనేవాడు. తలపగిలి చివరకు స్పృహతప్పి పడిపోవు ఎరకు బులుసు సాంబమూర్తిపై కాకినాడలో లాఠీఛార్జీ సాగించింది ఇతనే. ఈ సుబ్బారాయుడిని అన్ని విధాల తలదన్నిన వాడు ముస్తఫా ఆలీ. సీతానగరం కేంద్రంగా ఉంచుకొని శాసనోల్లంఘనాన్ని నడుపుతున్న డా॥ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం రాజమండ్రిలోని నాళం భీమరాజు ఇంటిలో బసచేసినాడను విషయం తెలియవచ్చి, తన పోలీసుదళంలో భీమరాజు ఇంటికి వెళ్ళి బయటికి రావలసిందని సుబ్రహ్మణ్యాన్ని పిలిచి వెలుపలికి రాగానే అతనిని లాఠీతో కొడుతూ "నీ గాంధీ ఇప్పుడేమి చేస్తున్నాడురా ! నిన్ను రక్షించడానికి రాడేమిటిరా" అని ఎడతెరపి లేకుండా దెబ్బలతోపాటు దుర్భాషలాడి హింసించాడు. ఈ లాఠీచార్జి ఫలితంగా సుబ్రహ్మణ్యంగారి ప్రక్కటెముకలు విరిగాయి. ఊపిరితిత్తులు కూడా దెబ్బతిన్నాయి. ముస్తఫా ఆలీ నాళం భీమరాజును కూడా వదిలిపెట్టక అతని మీద లాఠీచార్జిని సాగించాడు. చివరికి సుబ్రహ్మణ్యం 1936 లో మరణించాడు. ఇంతకుముందు వాడపల్లి దొమ్మీలో దురుసుగా ప్రవర్తించినదికూడా ఈ ముస్తఫా ఆలీయే. అంతకుముందు ఉప్పు సత్యాగ్రహకాలంలో రామచంద్రపురంలో కొర్ర రాజారావును, అర్థరాత్రి నిద్రలేపి లాఠీ దెబ్బలు కొట్టాడు. తర్వాత అతనిని బూటుకాలుతో తన్నగా రక్తం వాంతి చేసుకొని స్పృహ కోల్పోయినాడు. కొర్రల రాజారావు సహచరుడైన రూపాక తిరుపతిరాజు కూడా లాఠీచార్జీకి గురై భుజంకీలు బద్ద ఎముక విరిగినద్ది. ఇంకను పోలీసుల తీవ్ర చర్యలకు లోనైనవారిలో తూర్పుగోదావరి జిల్లాలోని కాశీభట్ల జగన్నా ౫ కూడా ఉన్నారు. ఇంకను ఆ కాలంలో గాంధీ టోపీలను, జాతీయ జెండాలను విక్రయించే సామాన్య అంగడి వర్తకులు కూడా పోలీసుల దురాగతాలవల్ల, లాఠీ దెబ్బలకు తీవ్రంగా లోనై బాధప

పడ్డారు. వావిలాల గోపాల కృష్ణయ్యను అరెస్ట్‌చేసి, కేసు విచారించే సమయంలో ఆయనను గుంటూరు సబ్‌జైలులో పోలీసులు ఉంచారు. ఆయన అస్వస్థతగా ఉన్నప్పటికీ, ఆయన్ని మంచంమీద గొలుసులతో కట్టివేయడం జరిగింది.

1932 జనవరిలో బరంపురంలో పోలీసుల దురాగతపు సంఘటన ఒకటి జరిగింది. పోలీసుల జులుం ఫలితంగా అక్కడ కొట్లాటలు జరిగాయి. పికెటింగ్ చేస్తున్న సత్యాగ్రహులను పోలీసులు అరెస్ట్ చేసినప్పుడు అక్కడ చేరిన ప్రజానీకంలో కొందరు పోలీసులపై రాళ్ళు రువ్వారు. పోలీసులు లాఠీచార్జి చేయగా ప్రజలు, పోలీసులపై రాళ్ళవర్షం కురిపించారు. అప్పుడు జాయింట్ మేజిస్ట్రేట్, సబ్ మేజిస్ట్రేట్‌లు కూడా ఈ రాళ్ళ దెబ్బలకు గురైనారు. అప్పుడు పోలీసులు కాల్పులు జరుపగా పలువురు ప్రజలు క్షతగాత్రులైనారు.

## 13.14 మహిళల పాత్ర :

1932 వ సంవత్సరం శాసనోల్లంఘనంలో వేల సంఖ్యలో మహిళలు పాల్గొనడం ఈ ఉద్యమంయొక్క ముఖ్యలక్షణం. గుడివాడలో 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ, దానిని లక్ష్యంచేయక వల్లభనేని సీతామహలక్ష్మమ్మ తన సహచరులైన దిగుమర్తి జానకమ్మ, దుగ్గిరాల కమలాంబ, కోటమర్తి కనకమ్మ మున్నగువారితో కలిసి పికెటింగును సాగించగా వారినందరినీ ప్రభుత్వం అరెస్టుచేసి ఒక్కొక్కరికి ఒక సంవత్సరం కారాగార శిక్ష విధించింది. వీరిలో కంభంపాటి మాణిక్యాంబ, ఆరునెలల వయసు నిండని తన బిడ్డను చంకనిడుకొని జైలుకు పోవలసి వచ్చింది జైలులోని మహిళా ఖైదీల పరిస్థితి శోచనీయంగా ఉండేది. ముత్తైదువులగు స్త్రీ ఖైదీలు, గాజుల్ని ధరించుటకుగాని, కుంకుమ ధరించుటను గాని అనుమతించేవారు గాదు. వారానికొకనాడు మాత్రమే తలదువ్వుకొనుటకు నూనె ఇచ్చేవారు. ఉప్పుడు బియ్యపు అన్నం పెట్టేవారు. అన్నంలోకి మజ్జిగ ఇచ్చేవారు కాదు.

1932 ఉద్యమ కాలంలో ప్రముఖపాత్ర వహించిన మహిళ భారతీదేవి రంగా. రేపల్లె, తెనాలి తాలూకాలలోను, పెద్దపల్లి, మంతెనవారిపాలెం పరిసరాలలోను ఆమె జాతీయోద్యమ ప్రచారం విరివిగా సాగించింది. తత్ఫలితంగా ఆమెకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, 500 రూ॥లు జరిమానా, చెల్లించని పక్షంలో అదనంగ 3 నెలల శిక్ష విధింపబడింది.

1932 లో శాసనోల్లంఘనం చేయడానికి, విదేశీవస్త్ర బహిష్కరణను ముఖ్యసాధనంగా కాంగ్రెస్ ఉపయోగించింది. అందువలన అనేక ప్రదేశాలలో శాంతి సైనికులకు శిక్షణ ఇవ్వడానికి, క్రమబద్ధంగా పికెటింగు జరపడానికి శిబిరాలు నిర్వహించారు. శ్రీమతి భారతీదేవి నాయకత్వాన తెనాలిలో ఒక బ్రహ్మాండమైన మహిళా విభాగ శిబిరం వెలిసింది. సంపన్న గృహిణులు నాలుగుగోడలమధ్య వుండడం తప్ప ఏమీ తెలియనివారు, ఎండకన్నెరుగని పరదా స్త్రీలు, వృద్ధులు, పెళ్ళికూతుళ్ళు, అన్ని కులాలవారు అధిక సంఖ్యలో ఈ శిబిరంలో శిక్షణ పొందారు. విదేశీ వస్తు, వస్త్రాలయాల దగ్గర కల్లు, సారా దుకాణాల దగ్గర రోజు 6 గంటలు శాంతి సహనాలతో పికెటింగు చేసేవారు. ఈ విధంగా ఈ శిబిరం ఆంధ్రదేశానికి తలమానికమైనది. ఇంతమంది మహిళలు చక్కగా శిబిరంలో ఉండడం నిరవధికంగా శాసనోల్లంఘనం జరుపుతుంటే నాయకులు చూసి సంకోష ఆశ్చర్యపరులయ్యేవారు. గాంధీజీకి ఆంధ్ర మహిళలపై గౌరవం ఎక్కువైనది. 1931 లో నిడుబ్రోలులో భారతీదేవి ఒక బాలికా ప్రాథమిక పాఠశాలను నెలకొల్పారు. తర్వాత రైతాంగ వేసవి పాఠశాలను నిర్వహించారు. అంతేగాక మహిళలకు రాజకీయ పాఠశాలలు నిర్వహించి, చైతన్యవంతులను చేశారు. చేబ్రోలులో అవి నిర్వహించడానికి సహకరించారు. ఆమె ఆ పాఠశాల కమిటీకి అధ్యక్షురాలిగా ఉన్నారు.

ఆ రోజుల్లో మహిళా వలంటీర్లను అరెస్టుచేసే విషయంలో ప్రభుత్వం కొంత తటపటాయించేది. వారిని ఉంచడానికి జైళ్ళలో స్థలం చాలదని, వారిని రాకుండా చేసే ఉద్దేశ్యంతో స్త్రీ వలంటీర్లమీద లాఠీచార్జీలను సాగించేది. కొండజాతి వారిని స్త్రీ పోలీసులుగ చేర్చుకొని వారిని ఇలాంటి లాఠీచార్జీలకు వినియోగించేది. అంతేగాక స్త్రీ వలంటీర్లను చెదరగొట్టడానికి వారిని అరెస్ట్ చేసిన తర్వాత ఒక పోలీసు వ్యానులో తీసుకెళ్ళి మారుమూల ప్రాంతాలలో విడిచిపెట్టడం చేసేది. ఇన్ని అణచివేత చర్యలకు పూనుకొన్నప్పటికీ వారి ఉద్రేక ఉత్సాహాలను అణచివేయలేకపోయారు. స్త్రీ వలంటీర్ల పట్ల సానుభూతి వహించిన గ్రామోద్యోగులెవరైనా వారికి భోజనాన్ని వండుకునే వసతి కల్పిస్తే వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించేది. అందువలన స్త్రీ వలంటీర్లు పాడుపడ్డ దేవాలయాల్లోను, మఠాల్లోను ఉండి వంటవండుకొని పికెటింగ్‌లో పాల్గొనేవారు.

కల్లు అంగళ్ళ వద్దనో, విదేశీ వస్త్ర దుకాణాలవద్దనో పికెటింగ్ చేయడానికి స్త్రీ సత్యాగ్రహులు చేరడం గమనించిన వెంటనే పోలీసులు అక్కడికి రంగునీటితోనో, మురికి నీటితోనో నింపిన బొక్కెనలను నీటిపంపు గొట్టాలను తీసికొని చేరేవారు. ఈ పంపుల సాయంతో బొక్కెనలోని నీటిని వేగంగా స్త్రీలమీద ప్రయోగించేవారు. ఆ ధాటికి తట్టుకొనలేక స్త్రీలు సొమ్మసిల్లి పడిపోయేవారు. కొన్నిచోట్ల కల్లంగళ్ళ వద్ద పికెటింగు చేసే స్త్రీలమీద కల్లు సీసాలను విసరడానికి కూడా పోలీసులు సాహసించారు. ఈ సీసా దెబ్బలవల్ల కొందరు స్త్రీలు గాయపడగా పోలీసులు ఆసుపత్రులకు చేర్చేవారు. మహిళా లోకంలో నాయకురాలిగా ఖ్యాతినార్జించిన దుర్గాబాయమ్మ కూడా జైల్లో ఎన్నో బాధలకు గురి కావలసి వచ్చింది. మధురలోని జైల్లో ఆమెను ఒంటరిగా ఒక గదిలో నిర్బంధించడం జరిగింది. ఈ రకమైన ఒంటరి శిక్ష నికృష్టమైన నేరాలు చేసిన ఖైదీలకు మాత్రమే విధింపబడేది.

### 13.15 ఇండియాలీగ్ డెలిగేషన్ పర్యటన :

ఆగస్ట్ చివరి వారంలోనూ, సెప్టెంబరు మొదటివారంలోను మద్రాసు రాష్ట్రంలో ఇంగ్లాండునుండి వచ్చిన ఇండియాలీగ్ డెలిగేషన్ సభ్యులు పర్యటించారు. ఈ లీగ్‌కు అధ్యక్షుడు సుప్రసిద్ధ తత్త్వవేత్త బెర్ట్రాండ్ రసెల్. అందులో హెరాల్డు లాస్కీవంటి ప్రముఖులు సభ్యులు. స్వాతంత్ర్య పోరాటంలో భారత పరిస్థితులు పరిశీలించడం వారి ప్రధాన ఉద్దేశం. 1932 సెప్టెంబరు 4 న వారు ఆంధ్రాకు వచ్చారు. బెజవాడ, గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం నగరాలలోను, అనేక గ్రామాలలోను పర్యటించి రైతుల్ని, హరిజనుల్ని కలుసుకున్నారు. కాంగ్రేసేతర ప్రముఖుల్ని, అధికార పోలీసు ఆఫీసర్లను కలిశారు. ప్రతినిధి వర్గం అనేక బహిరంగ సభలలో మాట్లాడారు. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో మాట్లాడుతు, ఇండియాలో జరుగుతున్న దాన్నిబట్టి ఆంగ్ల జాతినంతటినీ నిందింప వద్దని వాట్‌లే చెప్పారు. ఇంగ్లాండు తిరిగివెళ్ళిన ప్రతినిధివర్గం భారతదేశంలో వారు కన్నదంత, విన్నదంత ప్రోదిచేసి 'భారత దేశంలో పరిస్థితి' అనే పేరిట గ్రంథస్థం చేశారు. దీనికి రసెల్ పీఠిక రాశారు.

### 13.16 కమ్యూనల్ అవార్డ్ :

1932 ఆగస్టులో బ్రిటిష్ ప్రధాని ఒక ప్రకటన చేస్తూ హరిజనులకు ప్రత్యేక నియోజక వర్గాలు ఏర్పరచనున్నట్లు ప్రకటించారు. ఇది దేశ ప్రజలను విభజించడానికి పన్నిన కుట్రయని గాంధీజీ సెప్టెంబరు 20 న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ దీక్షను విరమింప చేయుటకై ఉమ్మడి నియోజక వర్గాలకు అనుకూలంగా హరిజనులను ఒప్పించడానికి ప్రయత్నాలు జరిగాయి. అంబేద్కర్, గాంధీజీతో చర్చలు జరిపి ఒక అంగీకారానికి రాగా గాంధీ నిరాహారదీక్ష ముగించారు. 1933 మార్చిలో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు ఆంధ్ర ప్రతినిధులు కూడా వెళ్ళారు. మే 8 న గాంధీ హరిజనోద్ధరణ లక్ష్యంగా ఆత్మశుద్ధి నిరాహార దీక్ష పూనారు. వారిని జైలునుండి విడుదల చేశారు. జూలై 31 న 'వ్యక్తిగత' శాసనోల్లంఘన ప్రారంభించారు. ఆంధ్రలో దుగ్గిరాల బలరామ కృష్ణయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, పట్టాభి సీతారామయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, గాంధీ మార్గాన్ని అనుసరించి శిక్షలు అనుభవించారు. 1934 మే లో సత్యాగ్రహం పూర్తిగా విరమింపబడింది.

ఈ విధంగా 1930 - 34 ల మధ్య జరిగిన సత్యాగ్రహోద్యమం ప్రభుత్వ దమనచర్యలను ఎదిరించి సామూహిక శాసనోల్లంఘనోద్యమంగా, శాంతియుతంగా కొనసాగింది. ఉప్పుశాసనాల ఉల్లంఘనగ మొదలై దేశ స్వాంతంత్ర్యోద్యమంగా రూపొందింది. ఈ కాలంలో ఎందరో నాయకులు ఉద్భవించారు. మహిళలు కూడా పురుషులతోపాటు ఉద్యమంలో పాల్గొనడం, సామాన్య ప్రజలు ఉద్యమంపట్ల చూపిన సానుభూతి సహకారాలు, వలంటీర్లు కనపరిచిన క్రమశిక్షణ, ఉత్సాహం అపురూపమైనది. కాని చివరకు ఎటువంటి ఫలితాలు సాధించకుండానే ఉద్యమం ముగియడం విచిత్రం. 1934 మే 20 న పాట్నాలో సమావేశమైన కాంగ్రెస్ కార్యవర్గం యిక సత్యాగ్రహాన్ని నిలుపుచేశామని ప్రకటించింది. ఆంధ్రాలో కూడా ఈ కారణం చేతనే ఉద్యమం నిలుపు చేయబడింది.

### 13.17 ముగింపు :

ఈ విధంగా శాసనోల్లంఘనోద్యమం కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, నెల్లూరు జిల్లాలలో ముమ్మురంగా సాగింది. అందులో డెల్టా ప్రాంతంనుండి హెచ్చుమంది పాల్గొన్నారు. కృష్ణాలో కాంగ్రెస్ కమిటీలు, రైతు సంఘాల ఆధ్వర్యాన రహస్య సమావేశాలు జరిపి,

పన్నుల నిరాకరణోద్యమానికి పథకాలు వేశారు. చీరాలలో కాంగ్రెస్ వలంటీర్ల శిక్షణ శిబిరం తెరిచారు. శాసనోల్లంఘన ఉద్యమంకూడా కృష్ణాజిల్లా గుడివాడ, బెజవాడ ప్రాంతాల్లో బాగా జరిగింది.

ఈ ఉద్యమ సందర్భంగా గుంటూరునుండి 191 మంది, కృష్ణాలో 112, పశ్చిమ గోదావరిలో 92, నెల్లూరులో 36, తూర్పుగోదావరిలో 35, విశాఖపట్నంలో 19, గంజాంలో 14, అనంతపురంలో 14 మంది జైళ్ళకు వెళ్ళారు.

కలెక్టర్లు పంపిన నివేదికను బట్టి, అనంతపూర్‌లో వకీళ్ళు హెచ్చుగా ఉద్యమానికి సానుభూతి వ్యక్తంచేశారు. పశ్చిమ గోదావరిలో న్యాయవాదులు, ఆంగ్ల విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులుగా ఉన్న యువకులు, ఆర్థికంగా సంపన్నులైన కమ్మ, రెడ్డి, క్షత్రియ కులాల యువకులు, సాంస్కృతికంగా ముందంజ వేసిన బ్రాహ్మణులు, చదువుకున్న కోమట్లు ఉద్యమంలో పాల్గొన్నారు. గుంటూరులో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో కమ్మ కులస్తులు ప్రధానపాత్ర వహించారు. తర్వాత పేర్కొన దగినవారు రాజులు, వెలమలు, బ్రాహ్మణులు, తెలగాలు, రెడ్లు. గుంటూరులో అప్పట్లో విద్యారంగంలో చాలా అభివృద్ధి జరిగింది. వ్యవసాయం కూడా మంచి స్థితిలో ఉన్నది. ఆ కారణంగా హెచ్చుమంది ఉద్యమంలో పాల్గొనగలిగారు. కృష్ణాజిల్లాలో కమ్మవారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరంతా సంపన్న వ్యవసాయ కుటుంబానికి చెందినవారే. తర్వాత పేర్కొనదగ్గవారు బ్రాహ్మణులు. ఇందులో వకీళ్ళు, ప్లీడరు గుమస్తాలు, ప్రభుత్వ పరీక్షలలో తప్పినవారు, సహకార శాఖలో ఉద్యోగులు. నెల్లూరులో కొందరు లాయర్లు, కొద్దిగా చదువుకున్న రెడ్లు, యువకులు పాల్గొన్నారు. గంజాంలో అన్ని రకాలవారు ఉద్యమంలో పాల్గొన్నారు. విశాఖపట్నంలో వకీళ్ళు ఎక్కువగా ఉద్యమానికి సానుభూతి చూపారు. జమీందారులందరు ఉద్యమాన్ని వ్యతిరేకించారు. జస్టిస్ పార్టీకి చెందిన బ్రాహ్మణేతరులు ఇలాగే ప్రవర్తించారు. మహిళలు ఈ ఉద్యమంలో పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు.

**వ్యాసరూప ప్రశ్నలు :**

1. 1930 - 31 జరిగిన ఉప్పు సత్యాగ్రహంపై ఒక వ్యాసం వ్రాయుము.
2. 1932 - 34 మధ్య జరిగిన శాసనోల్లంఘనోద్యమాన్ని, దాని ఫలితాలను సమీక్షింపుము.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. Prof. M.Venkatarangaiya (editor) : The Freedom Struggle, Andhra Pradesh (Andhra) Vol. III. (1921 - 1931 A.D.)
2. Prof. M. Venkatarangaiya (editor) : The Freedom Strugole in Andhra Pradesh (Andhra) Vol IV
3. వెంకటరంగయ్య మామిడిపూడి : భారత స్వాతంత్రోద్యమ చరిత్ర మూడవ భాగం (1919-47)
4. వైదేహి, అల్లాడి : ఆధునిక భారత దేశ చరిత్ర (1757-1947)
5. ఆచార్య సరోజిని రేగాని : ఆంధ్రలో స్వాతంత్రోద్యమ చరిత్ర, తెలుగు అకాడమి
6. ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య యన్. ఇన్నయ్య : ఆంధ్రలో స్వాతంత్ర్య సమరము
7. మారల వీరభద్రరావు : కృష్ణాజిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర
8. డా.జె. దుర్గాప్రసాద్ : ఆంధ్రుల చరిత్ర, తెలుగు అకాడమి ప్రచురణ


డా॥ ఎస్. గిరిజ

పాఠం- 14

# ఆంధ్రలో క్విట్ ఇండియా ఉద్యమం

## 14.1 లక్ష్యం :

బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా భారతీయులు నిర్వహిస్తున్న సుదీర్ఘ పోరాటంలో చివరి ఉజ్జ్వల ఘట్టమే క్విట్ ఇండియా ఉద్యమం 'దీనిని ఆగస్టు తిరుగుబాటు' అని కూడా అంటారు. తొలి అహింసాపూరిత ఉద్యమాల కంటే భిన్నంగా ఈ ఉద్యమం నడిచింది. భారతదేశాన్ని వదిలి వెళ్ళమని గాంధీ ఇచ్చిన నినాదం, డు ఆర్ డై నినాదం ప్రజలను తిరిగి ఉద్యమోన్ముఖులను చేశాయి. అనేక కారణాలు ఈ ఉద్యమ ఆరంభానికి దారితీశాయి.

## విషయ క్రమం


14.2 ఆంధ్రలో వామపక్షాలు

14.3 రెండవ ప్రపంచ యుద్ధం

14.4 వ్యక్తి సత్యాగ్రహము

14.5 క్రిప్స్ రాయబార వైఫల్యం

14.6 క్విట్ ఇండియా తీర్మానం

14.7 కర్నూలు సర్క్యులర్ (ఆంధ్ర సర్క్యులర్)

14.8 ఆంధ్రలో క్విట్ ఇండియా ఉద్యమం

- 14.8.1. తెనాలిలో కల్లోలాలు
- 14.8.2 చీరాల రైల్వేస్టేషన్ ధ్వంసం
- 14.8.3 దుగ్గిరాల, గురజాల
- 14.8.4 గుంటూరు పోస్టాఫీసు, ట్రావలర్స్ బంగళాపై దాడి
- 14.8.5 గుంటూరులో పోలీసు కాల్పులు
- 14.8.6 రైల్వే స్టేషన్లు, పోలీస్ స్టేషన్లపై దాడి

14.9 పోలీసుల దమనకాండ

- 14.9.1 భీమవరంలో తుపాకీ కాల్పులు
- 14.9.2 పెంటపాడు పోస్టాఫీసు దహనం
- 14.9.3 ప్రభుత్వ అణచివేత చర్యలు

14.10 కల్లు సారాదుకాణాల వద్ద పికెటింగ్

14.11 ప్రభుత్వ ఉద్యోగులకు అభ్యర్థన

14.12 ఇతర పరిణామాలు

14.13 గాంధీజీ నిరాహార దీక్ష

14.14 క్విట్ ఇండియా ఉద్యమ స్వభావం

14.15 సమీక్ష

14.16 వ్యాసరూప ప్రశ్నలు

14.17 ఉపయుక్త గ్రంథాలు

## 14.2 ఆంధ్రాలో వామపక్షాలు :

1935 నుండి ఆంధ్రాలో మూడు విధాలైన వామపక్షాలు అభివృద్ధి చెందాయి. అవి కమ్యూనిష్టులు, కాంగ్రెస్ సోషలిస్టులు, యం.యన్. రాయ్ అనుచరులు. పుచ్చలపల్లి సుందరయ్య ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ పితామహుడు. శాసనోల్లంఘనోద్యమాన్ని ఆపినందుకు యన్.జి. రంగాతో సహా వామపక్షాలవారు గాంధీజీని, కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ వర్డీ వ్యాపారస్థులతో, బ్రిటిష్ వారికి అనుకూలమైన పెద్ద వ్యాపారస్థులతో కూడి ఉందని కావుననే డొమీనియన్ స్టేటస్‌తో తృప్తి పడిందని రంగా అభిప్రాయం. ఆంధ్రలో సోవియట్ యూనియన్ గురించి, మార్క్సిజాన్ని గురించి అనేక గ్రంథాలు వెలువడినాయి. శ్రీశ్రీ వ్రాసిన 'మహా ప్రస్థానం' గేయ సంపుటి ప్రచారంలోనికి వచ్చింది. 1934 లో మాక్సిం గోర్కీ నవల 'మదర్'ను క్రొవ్విడి లింగరాజు తెలుగులో ప్రచురించారు. యన్.జి. ఆచార్య సంపాదకత్వాన 'చిత్రగుప్త', 'ప్రజాబంధు' పత్రికలు, రంగా ప్రోత్సాహంతో 'వాహిని' పత్రిక వెలువడ్డాయి. గద్దె లింగయ్య రాసిన విప్లవ వీరులు' గ్రంథాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. అనంతపురం నుండి విద్వాన్ విశ్వం, తరిమెల నాగిరెడ్డి సంపాదకత్వాన 'నవ్య సాహిత్య మాల' ప్రచురణలు అనేకం సోషలిస్టు భావాలను ప్రచారం చేశాయి. ఇందులో లెనిన్, స్టాలిన్ జీవిత చరిత్రలు, విశ్వం వ్రాసిన 'పాపం నాహృదయం' పేర్కొనదగ్గవి. నార్ల వెంకటేశ్వరరావు రాసిన 'నేటి రష్యా' బాగా ప్రచారం పొందినది.

యం.యన్. రాయ్ ప్రభావంతో ఆంధ్రాలో త్రిపురనేని గోపీచంద్, అబ్బూరి రామకృష్ణారావు, యం.వి. శాస్త్రి మున్నగువారు రచయితలుగా, ప్రచారకులుగా ప్రసిద్ధి చెందారు.

తెలుగులో అనేక కొత్త పత్రికలు వెలువడినాయి. 1939లో 'ఆంధ్రప్రభ' దిన పత్రిక, 1936లో 'నవశక్తి', జనవాణి పత్రికలు ప్రారంభింపబడ్డాయి. ఇవన్నీ ఆంధ్రలో వామపక్షాల ప్రగతికి అనేక విధాలుగా తోడ్పడ్డాయి. వామపక్షాలన్నీ కాంగ్రెస్‌లోనే ఇతర భాగంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్‌ను వశపరచుకోవాలని కమ్యూనిస్టుల ధ్యేయం. వామపక్షంలోని యువజన ఉద్యమానికి అన్నా ప్రగడ కామేశ్వరరావు నాయకత్వం వహించారు. కృష్ణా జిల్లా యువజన మహాసభ ఆయన ఆధ్వర్యంలో 1937 సెప్టెంబర్ 2న జరిగింది. అంతేగాక గుంటూరు జిల్లా మంతెనవారిపాలెం లోను, తాళ్ళూరులోను 1938-39 లో కామేశ్వరరావు రాజకీయ పాఠశాలలు నిర్వహించారు. 1939 జనవరి 8న మద్రాసు ప్రెసిడెన్సీ విద్యార్థుల మహాసభకు రంగా అధ్యక్షత వహించారు. అంతేగాక రంగా 1934 నుండి నిడుబ్రోలులో, ఆ తర్వాత రాయలసీమలో కూడ అనేక పాఠశాలలు నిర్వహించారు.

వామపక్షాల ఆధ్వర్యంలో 1938 ఫిబ్రవరిలో 'చీరాల ఇండియన్ టుబాకో డెవలప్‌మెంట్ వారు 1939 ఫిబ్రవరిలో విశాఖపట్నం జిల్లా చిట్టివలస, జనపనార మిల్లులోనివారు, 1939 ఏప్రిల్‌లో కాకినాడ పీచు కార్మికులు జరిపిన సమ్మెలు ముఖ్యంగా చెప్పుకోదగ్గవి. ప.గోదావరి జిల్లా కాశీపట్నంలోను, కృష్ణాజిల్లా మునగాలలోను రైతులు సత్యాగ్రహాలు చేశారు. అంతేగాక జమిందారీ వ్యతిరేక పోరాటాలు రంగా నాయకత్వాన ఆంధ్రాలో ప్రముఖ స్థానం వహించాయి. అందులో 1933 జూలై 13న ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు జరిగిన రైతు యాత్ర ప్రసిద్ధి చెందింది. 45 రోజులపాటు ఈ యాత్రను జరిపి 1938 ఆగస్టు 27న మద్రాసులో ముఖ్యమంత్రి రాజగోపాలాచారికి మెమొరాండం సమర్పించారు. 1939 అక్టోబరు 29న కాంగ్రెసు మంత్రి వర్గం రాజీనామా చేసింది. ఈ తరుణంలో కాంగ్రెస్‌కు వామ పక్షాలకు భేదాభిప్రాయాలు వచ్చాయి. యం.యన్. రాయ్ అతని అనుచరులు ఫాసిజానికి వ్యతిరేకంగా రెండవ ప్రపంచ యుద్ధంలో ఇంగ్లండ్‌ను బలపర్చాలన్నారు. 1940 జనవరి 10న నూజివీడులో జరిగిన జమీందారు రైతు మహాసభలో ప్రకాశం త్వరలో అధికారం చేపట్టి జమిందారీలను రద్దు చేస్తానన్నారు. కాని బ్రిటిష్ వారు కాంగ్రెస్ ఆశయాలను వమ్ము చేశారు. ఆంధ్రలో కాంగ్రెస్ మంత్రి వర్గం రాజీనామా చేసే సమయానికి వామపక్షాలు బాగా పుంజుకున్నాయి. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలోని సుందరయ్య వెనుక కార్యకర్తలు ఎక్కువ మంది ఉన్నారు. కాంగ్రెస్ నుండి చీలిపోయి, సుభాస్ చంద్రబోస్ ఫార్వర్డు బ్లాక్ పెట్టిన తర్వాత ఆంధ్రాలో మద్దూరి అన్నపూర్ణయ్య కార్యదర్శిగా ఒకశాఖ ఏర్పడింది. రంగా నాయకత్వాన కిసాన్ సభ బాగా వ్యాప్తిలోనికి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షులుగా 1940 జనవరిలో ఆంధ్రలో పర్యటించిన సుభాష్ చంద్రబోసు సత్యాగ్రహాన్ని ప్రారంభించమన్నారు. అంతేగాక రాజమండ్రి, ఏలూరు బహిరంగ సభలలో ఉపన్యసించారు. కాని పట్టాభి మున్నగువారు బోసు అభిప్రాయాలను వ్యతిరేకిస్తూ ప్రచారం చేశారు. కిసాన్ నాయకుడుగా 1939 డిశంబరులో రంగా ఆంధ్రాలో పర్యటించి,

సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించాలన్నారు. అంతేగాక చెన్నూరు మొదలగు గ్రామాలలో సత్యాగ్రహానికి అనుకూలంగా ఉపన్యాసాలు చేశారు. బాపట్ల రైతుల మహాసభలో కూడా గోగినేని వెంకట సుబ్బయ్య మున్నగువారు కాంగ్రెస్‌ను విమర్శిస్తూ సత్యాగ్రహాన్ని ప్రారంభించమని ప్రచారం చేశారు. మరొక వైపున ఆంధ్రా రాష్ట్ర రాజకీయ మహాసభ 1940 జనవరి 9న ఏలూరులో సమావేశమై, జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాలు చేపట్టమని తీర్మానాలు చేసింది. 1940 జనవరి 26న ఆంధ్ర అంతటా స్వాతంత్ర్య దినోత్సవం జరిగినప్పుడు. కాంగ్రెస్ పునర్నిర్మాణ కార్యక్రమం పట్ల విశ్వాసాన్ని ప్రకటిస్తూ తీర్మానాలు చేశారు. పాలకొల్లు, బెజవాడ మున్నగు చోట్ల హర్తాళ్ళు జరిగాయి. 1940 మార్చి 26, 27న పలాసలో అఖిల భారత కిసాన్ మజ్దూర్ రాజ్‌ను అంగీకరిస్తూ వచ్చారు. కాని పలాస సభలో స్వాతంత్ర్య సాధనకై కార్మిక దృక్పథం చేపట్టాలని పట్టుబట్టారు. పలాస రైతు సభ అనంతరం రంగాను నిడుబ్రోలులోనే ఉండవలసిందని ప్రభుత్వం విధించిన ఆంక్షను ఆయన ధిక్కరించి అరెస్ట్ అయ్యారు. మందస ఎస్టేట్‌లో జరిగిన అరెస్టులకు నిరసనగా స్త్రీలంతా సంఘటితమై పోలీసులకు అడ్డుపడ్డారు. అప్పుడు జరిగిన కాల్పులలో 5 మంది చనిపోయారు. మందస కాల్పుల బాధితుల రక్షణ సంఘం ఏర్పరచి గౌతులచ్చన్న గ్రామాలలో కొన్ని దళాలను ఏర్పరచి, తర్వాత కాంగ్రెస్ సంఘానికి ఒక నివేదికను సమర్పించారు. కాంగ్రెస్ సంఘం ఏప్రిల్ 13న సమావేశమై కాల్పుల్ని ఖండించింది. పోలీసు నిర్బంధంలోనే జిల్లా నాయకుడైన పుల్లెల శ్యామ సుందరరావు మరణించారు. ప్రకాశంగారు ఈ పోలీసు చర్యల్ని నిరసించారు.

## 14.3. రెండవ ప్రపంచ యుద్ధం :

1939 సెప్టెంబరులో మిత్ర రాజ్యాలకు, జర్మనీకి మధ్య రెండవ ప్రపంచ యుద్ధం మొదలైనది. ఈ యుద్ధంలో గ్రేట్ బ్రిటన్ ప్రముఖ పాత్ర వహించింది. అప్పటి బ్రిటిష్ వైశ్రాయిగా ఉన్న లార్డ్ లిన్‌లిత్‌గో భారతదేశానికి కూడ ఆ యుద్ధంలో ప్రాతినిధ్యం కల్పిస్తూ గెజిట్‌లో తెలియపర్చారు. ఈ విధంగా భారతదేశం బలవంతంగా యుద్ధంలోనికి రావలసివచ్చింది. భారత జాతీయ కాంగ్రెస్‌కు, వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధి మంత్రివర్గాలకు ఇది ఎంతో అవమాన చర్యగా గోచరించింది. కేంద్ర, అసెంబ్లీలో భారత రక్షణ బిల్లును ప్రవేశపెట్టినపుడు, కాంగ్రెస్ సభ్యులు తమ నిరసనను తెలియజేస్తూ అసెంబ్లీ సమావేశంలో పాల్గొనకుండా వైదొలగారు. భారతదేశానికి స్వాతంత్ర్యం కల్పించనిచో యుద్ధంలో సహకరించడం తమకు సాధ్యంకాదని కాంగ్రెస్ భావించింది. యుద్ధం ముగిసిన తర్వాత భారత దేశానికి అధినివేశ ప్రతిపత్తిని ఇవ్వగలమని ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించింది. కాని కాంగ్రెస్‌కు ఇది నచ్చలేదు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్య మివ్వని పక్షంలో బ్రిటిష్ వారికి యుద్ధంలో సహకరించడమనే ప్రసక్తి ఉండదని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి తీర్మానించింది. అంతేగాక అవసరమైతే, శాసనోల్లంఘనాన్ని తిరిగి నడపగలరని ఆకమిటి నిర్ణయించి, దేశ మంతట సత్యాగ్రహ సంఘాలను ఏర్పరచ వలసిందని, దిగువ కాంగ్రెస్ కమిటీలకు ఆదేశాలనిచ్చింది. అంతేగాక సామ్రాజ్య వాద రాజ్యాలు తమకున్న వలసలను, హక్కులను కాపాడుకోవడానికి మాత్రమే ఈ యుద్ధాన్ని వినియోగించుకొంటుంటే అలాంటి యుద్ధంతో భారతదేశానికి సంబంధముండదని విశదీకరించింది. 1939లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటి భారతదేశాన్ని ఒక స్వతంత్ర రాజ్యంగా ప్రకటించవలెనని విశదీకరించింది. అప్పుడు లిన్‌లిత్‌గో గాంధీ, నెహ్రూ, జిన్నా మున్నగు నాయకులను ఆహ్వానించి చర్చలు సాగించారు. అందులో కూడా ఆయన అధినివేశ ప్రతిపత్తి భారతదేశానికి భవిష్యత్తులో కల్పింపబడగలదనే వాగ్దానాన్ని మించి ఏమీ చెప్పలేదు. 1939 అక్టోబరులో వార్థాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సమావేశం జరిపి, కాంగ్రెస్ మంత్రివర్గాలను రాజీనామా చేయవలసినదిగా ఆదేశించింది.

ఈ సమయంలోనే బ్రిటిష్ ప్రభుత్వ మంత్రి వర్గంలో మార్పులు జరిగి చర్చిల్ ప్రధానమంత్రియైనాడు. అతను కరుడు గట్టిన సామ్రాజ్యవాది కాబట్టి భారతీయులకు పరిష్కారం సాధ్యమయ్యే అవకాశం సన్నగిల్లింది. కాంగ్రెస్ మంత్రి వర్గాలు రాజీనామా చేసిన వెంటనే ఆయా రాష్ట్రాలలో గవర్నర్ల పాలన ఏర్పరచి దేశంలో అత్యవసర పరిస్థితులను ప్రకటించింది. యుద్ధ వ్యతిరేక నినాదాలతో పికెటింగ్ చేసే వారినందరిని అరెస్ట్ చేయడానికి ప్రభుత్వం పూనుకొన్నది. సుభాష్ చంద్రబోస్‌ని, అతని ఫార్వర్డ్ బ్లాక్‌లోని కొందరు సభ్యులను 1940 ఏప్రిల్‌లో అరెస్ట్ చేశారు.

పరిస్థితులు దేశంలో ఇలా ఉండగా కాంగ్రెస్ ఉద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా గాంధీజీకి కాంగ్రెస్ అధికారాన్నిచ్చింది. గాంధీజీ వైస్‌రాయ్‌ని కలుసుకొని యుద్ధ వ్యతిరేక ప్రసంగాలను చేయడానికి కాంగ్రెస్ వారికి అనుమతి ఇవ్వవలసిందిగా కోరగా వైశ్రాయి అందుకు ఇష్టపడలేదు. గాంధీజీ అప్పుడు బ్రిటన్ సర్వనాశనం అవడంవలన, భారతీయులు స్వాతంత్ర్యం రావాలని కోరుకోవడం లేదని, కాంగ్రెస్ వాదులను వ్యక్తి సత్యాగ్రహం చేయవలసిందిగా ఆదేశించారు.

## 14.4. వ్యక్తి సత్యాగ్రహము :

ఈ వ్యక్తి సత్యాగ్రహంలో ఆచార్య వినోభాభావే మొదట అక్టోబరు 17న సత్యాగ్రహం చేయవలసిందిగా నిశ్చయించారు. తర్వాత పండిట్ నెహ్రూ, వల్లభాయి పటేల్, రాజేంద్ర ప్రసాద్ మున్నగు ప్రముఖులు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరు బ్రిటిష్ ప్రభుత్వ యుద్ధ కృషికి అంగ, ఆర్థిక, బలరూపంలో సాయం చేయడం అనుచితమని, యుద్ధాన్ని అహింసాయుత నిరోధం వల్ల ప్రతిఘటించడమే సముచిత కార్యమనే నినాదాన్ని ఇచ్చారు. ఈ ఉద్యమంలో రెండవ ఘట్టమైన 'ప్రాతినిధ్య సత్యాగ్రహం' 1940 నవంబరు 17న మొదలైంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర శాసనసభల కాంగ్రెస్ పార్టీ సభ్యులనుండి, అఖిలభారత కాంగ్రెస్ కమిటి సభ్యుల నుండి సత్యాగ్రహులను నిర్దేశించారు. మూడవ ఘట్టం 1941 జనవరి 5న మొదలైంది. ఇందులో స్థానిక కాంగ్రెస్ కమిటీల సభ్యులందరు సత్యాగ్రహంలో పాల్గొనుటకు అవకాశమివ్వబడింది. నాలుగవ ఘట్టంలో కాంగ్రెస్‌కు చెందిన నాలుగణాల సభ్యులందరు పాల్గొనుటకు అనుమతి ఇవ్వబడింది.

ఆంధ్రాలో ఈ ఉద్యమంలో జైలుకుపోయిన వారిలో వావిలాల గోపాలకృష్ణయ్య, శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతి, దండు నారాయణరాజు, గౌతులచ్చన్న, టంగుటూరి ప్రకాశం, అయ్యా దేవర కాళేశ్వరరావు, వి.వి. గిరి, బెజవాడ గోపాలరెడ్డి, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కళా వెంకట్రావు, యన్.బి. రంగా మున్నగు వారున్నారు. మొత్తం మీద ఆంధ్రాలో 882 మంది అరెస్టయినారు. 76, 553 రూ.లు జరిమానాలు వసూలైనవి. ఉద్యమంలో పాల్గొన్న లాయర్ల పట్టాలను ప్రభుత్వం రద్దు చేసింది.

1941 జనవరిలో సుభాష్ చంద్రబోస్ జర్మనీ, జపాను దేశాల సహకారంతో బ్రిటిష్ వారితో పోరాడాలనే ఉద్దేశంతో విదేశాలకు వెళ్ళారు. 1941 డిసెంబరు 7న జపాన్ పెరల్ హార్బర్‌పై దాడిచేసింది. భారతదేశంపై కూడా జపాన్ దాడి చేయవచ్చనే ప్రచారం బయలు దేరింది. దానితో భారతదేశంలో అశాంతి ప్రబలడం గమనించిన బ్రిటిష్‌వారు "ఆగస్ట్ వాగ్దానం" (ఆగస్ట్ ఆఫర్) అను ప్రకటనను వెలువరించారు. దానిలో భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తిని కల్పించే సంకల్పాన్ని బ్రిటిష్ ప్రభుత్వం తెలియజేస్తూ, కొత్త రాజ్యాంగం ఏర్పరచుకోడానికి భారతీయులకు గల హక్కునకు సమ్మతించింది. అంతేగాక అట్లాంటిక్ ప్రకటనలో దేశాలకు గల స్వయం నిర్ణయ హక్కు అందులో గుర్తింపబడింది. కాని బ్రిటిష్ ప్రధానియైన విన్‌స్టన్ చర్చిల్ ఈ సూత్రం భారతదేశానికి వర్తించదని స్పష్టం జేయడం, భారతీయ నాయకులకు ఆందోళన కల్గించింది. బ్రిటిష్ ప్రభుత్వం వ్యక్తి సత్యాగ్రహంలో జైలుకు పంపబడిన సత్యాగ్రహులందరినీ విడుదల చేసింది.

## 14.5. క్రిప్స్ రాయబార వైఫల్యం:

ఈ పరిస్థితులలో భారత నాయకులతో రాయబారం నిర్వహించడానికి, సర్‌స్టాఫర్డ్ క్రిప్స్ నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గాన్ని 1942. మార్చి 22న బ్రిటిష్ ప్రభుత్వం పంపింది. ఈ ప్రతినిధి వర్గం యుద్ధం ముగిసిన తర్వాత, భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తిని కల్పిస్తామని మళ్ళీ చెప్పింది. అంతేగాక బ్రిటిష్ సామ్రాజ్యం నుండి స్వేచ్ఛతో వైదొలగే హక్కుకూడా అప్పుడు భారతదేశానికి ఉండగలదని భారతీయులు తమ రాజ్యాంగ విధానాన్ని రూపొందించుకోవచ్చని తెలిపింది. ఆ సమయంలో ఏ రాష్ట్రమైనా, స్వదేశీ సంస్థానమైనా కొత్తగా ఏర్పడే భారతీయ సమాఖ్యలో చేరుటకు ఇష్టపడకపోతే వేరుగ ఉండి తన ప్రతిపత్తిని గురించి బ్రిటిష్ ప్రభుత్వంతో ఒక ఒడంబడికకు రావచ్చునని ప్రకటించింది. ఈ మార్పులన్నీ యుద్ధానంతరం అమలులోనికి రాగలవని, యుద్ధ కాలంలో మాత్రం గవర్నర్ జనరల్ సర్వాధి పత్యానికి లోబడి భారతీయ నాయకులకు ప్రాతినిధ్యం గల మంత్రి వర్గం యుద్ధ కృషిలో పాల్గొనగలదని విశదం చేసింది. కాని ఈ ప్రతిపాదనలను కాంగ్రెస్ త్రోసి పుచ్చింది. గాంధీజీ ఈ ప్రతిపాదనను దివాలా ఎత్తబోయే బ్యాంకు, రాబోయే తేదీ వేసి ఇచ్చిన ఒక్క చెక్కువంటిదని విమర్శించారు.

జిన్నా కోరినట్లు పాకిస్థాన్ ఇచ్చి వేయాలని రాజగోపాలాచారి ప్రచారం చేశారు. బులుసు సాంబమూర్తి ఇందుకు సుముఖత చూపారు. కాని మదరాసు శాసనసభలో అతని వాదనకు ఎదురు మద్దతుగా నిలబడకపోయే సరికి సభాధ్యక్ష పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దేశ విభజన తగదని ప్రకాశం ప్రచారం చేయగా, జిల్లా కాంగ్రెస్ సంఘాలు ప్రకాశం వాదాన్ని బలపరుస్తూ తీర్మానాలు చేశాయి.

## 14.6. క్విట్ ఇండియా తీర్మానం :

1942 ఏప్రిల్ 6న విశాఖపట్నం, కాకినాడ మీద జపాన్ యుద్ధ విమానాలు బాంబులు వేశాయి. అప్పుడు ఆంధ్ర విశ్వ విద్యాలయాన్ని గుంటూరుకు తరలించారు. మే 1, 1942న అఖిల భారత కాంగ్రెస్ కమిటి అలహాబాద్‌లో సమావేశమై, స్వాతంత్ర్యాన్ని ప్రాతిపదికగా గ్రహించి మాత్రమే భారతదేశం బ్రిటన్‌తోగాని, ఏ ఇతర దేశంతోగాని వ్యవహరించడం సాధ్యమవుతుందని స్పష్టం చేసింది. జూలై 6న వార్ధాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటి గాంధీజీ సలహాతో ఒక తీర్మానాన్ని రూపొందించింది. అందులో భారత భూమిపై బ్రిటిష్ వారి పాలన అంతం కావలెనని, దాస్యబద్ధమగు భారతదేశం తననుగాని, తక్కిన ప్రపంచాన్ని గాని నాజీ వాదం నుండి, ఫాసిజం నుండి సైనిక వాదం నుండి తదితర వీభిన్న సామ్రాజ్య వాదాలనుండి రక్షింప జాలదని స్పష్టం చేసింది. ఆ తర్వాత 1942, ఆగష్టు 8 అఖిల భారత కాంగ్రెస్ కమిటి బొంబాయిలో సమావేశమైంది. ఆ సమావేశంలో గాంధీజీ ప్రసంగిస్తూ 'పోరాటం వల్ల మన స్వాతంత్ర్యాన్ని ఆర్జించి తీరుతామని ఇది తన జీవితంలో తుది పోరాటమని పేర్కొన్నారు. ఆయన ప్రసంగం తర్వాత కాంగ్రెస్ క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించింది. బ్రిటిష్ అధికారం భారత భూమి నుండి వెంటనే వైదొలగాలని, భారత స్వాతంత్ర్యం గుర్తింపబడాలని, భారతదేశం తనను తాను పరిపాలించుకోవడానికి బాధ్యతాయుత స్వతంత్ర ప్రభుత్వం ఏర్పడవలెనని ఆ తీర్మానం వాంఛించింది. అంతేగాక అహింసా సూత్రబద్ధంగా ఒక ప్రజా పోరాటాన్ని కొనసాగించడానికి కావలసిన చర్యలు తీసుకొను అధికారాన్ని వర్కింగ్ కమిటికి ఈ తీర్మానం కల్పించింది. ఈ తీర్మానం ఆమోదింపబడిన వెంటనే సమావేశానికి హాజరైన ప్రముఖ కాంగ్రెస్ నాయకులనేగాక, దేశంలోని ప్రముఖ కాంగ్రెస్ వాదులను ప్రభుత్వం అరెస్టుచేసి, ఖైదీలుగా నిర్బంధించింది.

## 14.7. కర్నూలు సర్క్యులర్ (ఆంధ్ర సర్క్యులర్) :

ఇలాంటి చర్యను ముందుగానే ఊహించిన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ఒక నిర్దేశ పత్రాన్ని (సర్క్యులర్) అఖిల భారత కాంగ్రెస్ కమిటి సమావేశానికి పదిరోజులు ముందుగానే జారీచేసింది. ఈ సర్క్యులర్‌ను 1942, జూలై 29న కళావెంకటరావు రూపొందించారు. ఈ సర్క్యులర్ ప్రతులు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయాలన్నింటికి పంపబడినను కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఆఫీసును శోధించినపుడు మాత్రమే ఈ ప్రతులు లభించినందువలన దీనికి 'కర్నూలు సర్క్యులర్' అని పేరు వచ్చింది. క్విట్ ఇండియా తీర్మానం తర్వాత డిటెన్యూలుగా తీసుకొని పోబడిన వారిలో డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం, తెన్నేటి విశ్వనాథం, బెజవాడ గోపాలరెడ్డి మున్నగువారున్నారు.

కర్నూలు సర్క్యులర్‌లో గాంధీజీ ఉత్తర్వు ఇచ్చిన తర్వాతనే శాసనోల్లంఘనోద్యమం జర్మనుల మెరుపుదాడి రీతిలో మొదలు పెట్టవలెనని ఉన్నది. అహింసా విధానం తు.చ. తప్పకుండా ఆ ఉద్యమంలో అనుసరింపవలెనని ప్రభుత్వం ఏర్పరచిన ఏ చట్టాన్ని ధిక్కరించినా, అహింసా నియమానికి లోబడి ఉండవలెనని అందులో చెప్పబడింది. ఈ సర్క్యులర్ జిల్లా సంఘాలన్నింటికి పంపబడింది. ఆంధ్రా అంతట టెలిఫోన్ తీగలు తెంపడం, గొలుసులాగి రైళ్ళు ఆపడం, కార్మికులు సమ్మెలు జరపడం, టిక్కెట్ లేకుండా ప్రయాణం చేయడం. లాయర్లు కోర్టులను బహిష్కరించడం మున్నగునవి ఎన్నో దీనిలో ఉన్నాయి. ఉద్యమాన్ని దశలవారీగా నడపాలని ఈ సర్క్యులర్‌లో సూచించారు. అవి : నిషేధపుటాజ్ఞలు ఉల్లంఘించడం, ఉప్పు తయారు చేయడం, నిషేధింపబడిన సంఘ సభ్యులు బహిరంగంగా తిరగడం, పన్నుల నిరాకరణ, ప్రభుత్వ భవనాలపై కాంగ్రెస్ పతాకాలు ఎగరవేయడం, కాంగ్రెస్‌వారు కాంగ్రెసేతరులు అని భేదం పాటించకుండా ప్రజలందరిని ఈ ఉద్యమంలో భాగస్వామ్యులు చేయాలన్నారు. ఈ విధంగా క్విట్ ఇండియా ఉద్యమానికి ఆంధ్ర ప్రాంతం సన్నద్ధమైంది. పోరాటాన్ని

తుది వరకు కొనసాగించాలనే ఆదేశాలతో పాటు 'విజయమో - వీరస్వర్గమో' అనేది ఈ పోరాట నినాదంగా ఇవ్వబడింది. ఈ పోరాటంలో పాల్గొనే వారు ఖద్దరు నూలువడికి, ఖద్దరును ధరించేవారై యుండవలెననే నియమాన్ని కాంగ్రెస్ సడలించినందువలన సామాన్య ప్రజలు కూడా ఈ ఉద్యమంలో స్వేచ్ఛగా పాల్గొనే అవకాశం ఇవ్వబడింది.

## 14.8. ఆంధ్రలో క్విట్ ఇండియా ఉద్యమం :

1942, ఆగష్టు 9న బొంబాయిలో కాంగ్రెస్ నాయకులందరినీ అరెస్ట్‌చేసినందుకు నిరసనగా ఆంధ్రలో సమావేశాలు జరిపి ప్రభుత్వ చర్యను ఖండించారు. ఊరేగింపులు, ప్రదర్శనలు జరిపారు. దుకాణాలు మూసివేశారు. దుకాణాలు తెరిచి అందులో వున్న సామానులు అమ్మవలసినదని, పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చినా కూడా వర్తకులు ఖాతరు చేయలేదు. విదేశీ వస్త్రాలు, కల్లు అమ్మకాలకు వ్యతిరేకంగా పికెటింగులు చేశారు. ఆంధ్రాలో ప్రముఖ నాయకులనందరినీ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. క్రమేణా కార్యకర్తలను కూడా కస్టడీలోనికి తీసుకున్నారు. చాలా సందర్భాలలో కేసులు పెట్టలేదు. కాంగ్రెస్ వారు ఇచ్చిన సర్క్యులర్ ధోరణిలోనే ఆంధ్రాలో ఉద్యమం కొనసాగింది. అయితే అనుకున్నంత అహింసాయుతంగా మాత్రం జరగలేదు. ఈ ఉద్యమంలో ఆంధ్రతో సహా యావద్భారత దేశం నలుమూలల్లోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. ముఖ్యంగా ఈ ఉద్యమం విద్యార్థి లోకాన్ని బాగా ఆకట్టుకొన్నది. అందువలన విద్యార్థి సమ్మెలు ఎక్కువగా జరిగాయి. అంతేగాక ప్రభుత్వ ఆస్తులగు రైల్వే స్టేషన్లను, పోలీసు స్టేషన్లను తగులబెట్టడం ఈ ఉద్యమంలో కనిపించే మరో ప్రత్యేక లక్షణం.

**14.8.1 తెనాలిలో కల్లోలాలు :** కాంగ్రెస్ నాయకుల అరెస్టుకు నిరసనగా 1942 ఆగష్టు 12న ఒక సంపూర్ణ సమ్మె తెనాలిలో నిర్వహించారు. ఆగష్టు 11వ తేదీ రాత్రి తెనాలిలోని తాలూకా హైస్కూలు, భారత్ ట్యుటోరియల్ కాలేజీలకు చెందిన విద్యార్థులు ఒక సమావేశం జరిపి పాఠశాలలను బహిష్కరించడానికి, ఆగష్టు 12వ తేదీ నగరంలోని దుకాణాలను, హోటళ్ళను, ఇతర వ్యాపార సంస్థలను మూయించి సంపూర్ణ సమ్మె జరపడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని స్థానిక దుకాణాలవారికి, హోటళ్ళ యజమానులకు, వ్యాపారస్థులకు తెలియజేసారు. అంతేగాక 12వ తేదీ కాంగ్రెస్ వాలంటీర్లు విద్యార్థులు జట్టుగ వెళ్ళి సమ్మె జరగడానికి దుకాణదారుల మద్దతు తీసుకున్నారు.

ఆగష్టు 12 ఉదయం కొందరు నగరంలోని కాఫీ హోటళ్ళు మూతపడి ఉండడం గమనించి, రైల్వేస్టేషనుకు వెళ్ళి అక్కడి రైల్వే ఫలహారశాలలో కాఫీ సేవించారు. ఈ విషయం తెలిసిన కాంగ్రెస్ వాలంటీర్లు, విద్యార్థులు వెంటనే రైల్వేస్టేషన్‌కు వెళ్ళి అక్కడి ఫలాహా[illegible]ను మూసివేయమని, దాని మేనేజర్‌ను కోరారు. అతను కుదరదని చెప్పారు. ఇంతలో గుంటూరుకు పోవలసిన రైలు ఆ స్టేషన్ నుండి బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నది. దానిని ఆపు చేయవలసిందని, ప్రయాణీకులకు టిక్కెట్లు ఇవ్వవద్దని ఆదేశించారు. కాని స్టేషన్ మాస్టర్ అందుకు అంగీకరించక రైలు బండిని పోనివ్వగా, కొందరు సిగ్నల్ పోస్టు వద్దకు వెళ్ళి దానిని ధ్వంసంచేసి, డ్రైవరు మీద రాళ్ళు రువ్వారు. రైలు పెట్టెలను ముక్కలుచేశారు. రైలు స్టేషన్ మీద కిరసనాయలుపోసి, నిప్పు పెట్టే ప్రయత్నం జరిగింది. తర్వాత రైల్వే బుకింగ్ ఆఫీసు తెరిచి అందులోని పుస్తకాలను, కరెన్సీ నోట్ల కట్టలను, రికార్డులను ధ్వంసం చేశారు. ఈ విధ్వంసకాండకు బెదిరి రైల్వే ఉద్యోగులు పలాయనం చిత్తగించారు. ఇంతలో వేరొక బండి మద్రాస్ నుండి స్టేషన్‌లోకి రావడాన్ని గమనించి, దక్షిణ కాబిన్‌లోని సిగ్నల్స్‌ను ధ్వంసంచేసి, ఆ రైలును ఆపి, ఇంజను డ్రైవరును కొట్టారు. తర్వాత మారిస్‌పేట బస్‌స్టాండు వద్ద గుమిగూడారు. అప్పుడు పోలీస్ డిప్యూటి సూపరింటెండెంట్ ప్రభుత్వ గూఢచారులైన చింతమనేని శివరామయ్యను, ప్రయాగ వీరరాఘవయ్యను అక్కడికి తీసుకొని వచ్చారు. వీరిద్దరు ప్రజలను బెదిరిస్తూ వారు అక్కడి నుండి వెళ్ళకపోతే, పోలీసులు కాల్పులు జరుపుతారని బెదిరించారు. అప్పుడు వారు శివరామయ్య అక్కడి నుండి వెళ్తే తాము బయటకు వెళ్తామని చెప్పారు. అప్పుడు జరిగిన పోలీసు కాల్పులలో ఆరుమంది మరణించారు. 11 మంది గాయపడ్డారు. మొత్తం మీద తెనాలి స్టేషన్‌కు 2,50,000 రూ.ల నష్టము వాటిల్లినది.

**14.8.2. చీరాల రైల్వే స్టేషన్ ధ్వంసం :** ఆగష్టు 12న చీరాలలో 500 మంది విద్యార్థులు ఊరేగింపుగా బయలుదేరి సబ్ మేజిస్ట్రేటు కోర్టు వద్దకు వెళ్ళి మూసివేయమన్నారు.భవనాన్ని చాలా వరకు ధ్వంసంచేసి, తర్వాత వారు సబ్ రిజిస్ట్రారు ఆఫీసుమీద, సేల్సుటాక్స్ ఆఫీసు మీద కూడా దాడిచేశారు. అక్కడి నుండి వారు రైల్వే స్టేషన్‌కు వెళ్ళి విద్యార్థులు కాని వారిని కూడా తమతో చేర్చుకొని దాదాపు 1500 మంది టెలిఫోను తీగెలను, సిగ్నెల్ తీగెలను పాడుచేసి తర్వాత స్టేషన్‌కు నిప్పంటించారు. రైల్వే ఉద్యోగులలో ఎవరైనా తమ కార్యక్రమానికి అడ్డువస్తే

వారిని చంపుతామని బెదిరించారు. ఆ సమయంలో వారికి రైలు మార్గంలో ఒక ట్రాలీమీద వస్తున్న సైనిక రిక్రూటింగ్ ఆఫీసరు, రైల్వే పర్మినెంట్ వే ఆఫీసరు (Railway Permanent way Officer) కంటపడినారు. వారిద్దరినీ కొంతమంది అడ్డగించగా వారు "గాంధీజీకి జై" అని గట్టిగా చెప్పిన తర్వాతనే వదిలినారు. పోలీసులు అక్కడికి వచ్చిన వెంటనే మూక చెల్లాచెదురైంది. చీరాల రైల్వే స్టేషన్‌కు దాదాపు లక్ష రూపాయలు నష్టం వచ్చినట్లు తేలింది.

**14.8.3. దుగ్గిరాల, గురజాల :** దుగ్గిరాలలో ఆగష్టు 12వ తేదీన వెయ్యిమంది సత్యాగ్రహులు చేరి నాలుగు వాగన్లను, గార్డ్ వాగన్‌ను, 75,000 రూ.ల విలువగల రికార్డులను ధ్వంసం చేశారు. ఈ విధ్వంస కాండలో జె. సాంబశివరావు, వి. సత్యం ప్రధాన పాత్ర వహించారు. వీరు వాగన్లమీద, ఫర్నిచర్ మీద కిరోసిన్ ఆయిల్ చల్లారు. వీరికి అక్కడి కూలీలు కొంతమంది సాయం చేశారు. తర్వాత గవర్నమెంట్ వీరికి సాయపడిన 47 మంది కూలీలను అరెస్టు చేసారు.

గురజాలలో వావిలాల గోపాలకృష్ణయ్య సహచరుడైన కె. సుబ్బారెడ్డి ఒక మీటింగులో విద్యార్థులను రెచ్చగొడుతూ మాట్లాడారు. దానితో విద్యార్థులు అక్కడి వ్యాపారస్థులను వాళ్ళ కొట్లు మూసివేయమని చెప్పడమేగాక, స్టేషన్‌లో ఉండే టెలిగ్రాఫ్ వైర్లను కత్తిరించారు. అప్పుడు పోలీసులు కె. సుబ్బారెడ్డిని అరెస్ట్‌చేసి, 15 రోజులు జైలులో ఉంచారు. జైలు నుండి రాగానే అతను సెప్టెంబరు 22న గంగవరం దగ్గర రహస్య మీటింగు నిర్వహించారు.

**14.8.4. గుంటూరు పోస్టాఫీసు, ట్రావలర్స్ బంగళాపై దాడి :** నవంబరు 13, జె. నరసింహం, హెడ్‌పోస్టాఫీసు వద్దకు వెళ్ళి పోస్టు బాక్స్‌కు నిప్పంటించడానికి ప్రయత్నించారు. దానిని చూసి పోస్ట్ మాస్టర్ 'గాంధీజీకి జై' అని అరిచారు. కాని తర్వాత పట్నాయక్ అనే సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి అతనిని పట్టుకున్నారు. కాని ఇక్కడ అంతగా నష్టం జరగలేదు. తర్వాత మంగళగిరిలోని ట్రావలర్స్ బంగళామీద దాడిచేసి, దానిని అంటించడానికి ప్రయత్నించారు. కాని వెంటనే అక్కడి వాచ్‌మాన్ చూచి దానిని ఆర్పివేశారు. అంతేగాక దగ్గరలో ఉన్న స్కూలు షెడ్డుకి కూడ నిప్పంటించారు.

**14.8.5. గుంటూరులో తుపాకీ కాల్పులు :** ఆగష్టు 13న 2 వేల మంది విద్యార్థులు గుంటూరు.హిందూ కాలేజి వద్దచేరి, త్రోవలో వెళుతున్న పోలీసులపైన, కార్లపైన రాళ్ళు రువ్వారు. ఎదురుగా ఉన్న గాంధీ పార్కుకు వెళ్ళగా పోలీసులు వారిని వెంబడించారు. అంతకు ముందు లాఠీఛార్జి చేసినా ప్రయోజనం లేనందున గాంధీ పార్కులో కాల్పులు జరిపారు. ఇద్దరు చనిపోగా, అనేక మందికి గాయాలు తగిలాయి. పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు వారం రోజులు విద్యా సంస్థలన్నీ మూసివేశారు. గుంటూరు బార్ అసోసియేషన్ వారు పోలీసుచర్యను ఖండిస్తూ తీర్మానించారు..

**14.8.6. రైల్వే స్టేషన్లు, పోలీస్ స్టేషన్ల మీద దాడి :** పాలకొండ రైల్వే స్టేషన్ మీద కూడా దాడి జరిగింది. అక్కడి సరుకుల చావిడి పూర్తిగా ధ్వంసం చేయబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, కూలీలు, ఇతరులు కలిసి మొత్తం దాదాపు 1500 మంది పాల్గొన్నారు. ఆకివీడు, అత్తిలి, రేలంగి, ఒంగోలు, నిడుబ్రోలు, దెందులూరు, ఉండి, లంకలకోడేరు మున్నగు ప్రదేశాలలో రైల్వే స్టేషన్లు ప్రజల దాడికి లోనైయ్యాయి.

ఆగష్టు 12న భూపతిరాజు సుబ్బరాజు నాయకత్వంలో వేండ్ర, భీమవరం మధ్యలో టెలిగ్రాఫ్ వైరులు కత్తిరించారు. ఆగష్టు 16న 200 మంది వేండ్ర రైల్వేస్టేషన్‌కి వెళ్ళి అక్కడి రికార్డులకు నిప్పంటించారు.

క్విట్ ఇండియా ఉద్యమకారులు రైళ్ళను పట్టాల నుండి తప్పించడానికి కొన్ని ప్రదేశాలలో రైలు మార్గాలను చెడగొట్టారు. విజయవాడ, మచిలీపట్నం లైను మీద, పోలీసులను తీసుకెళ్తున్న ఒక రైలు బండి ఉప్పులూరు వద్ద ఆగష్టు 14న పట్టాలు తప్పింది. ఆగష్టు 21, 22 తేదీలలో పనపాకం, చంద్రగిరి లైనులో ఫిష్ ప్లేట్లను తొలగించడం వలన ఒక రైలు ఇంజను, దానికి తగిలించిన 80 ఖాళీ వాగన్లు తలక్రిందులైనాయి. ఆగష్టు 23న ప్రయాణీకుల రైలొకటి పట్టాలు తప్పింది. ఉద్యమకారులు, కొన్ని సందర్భాలలో కూలి ఇచ్చి నేర్పరులైన వారిచేత ఈ పనులు చేయించడం జరిగింది.

ఈ ఉద్యమంలో ఎక్కువగా పోలీస్ స్టేషన్లే ప్రజల దాడులకు గురైనాయి. ఆగష్టు 17న పాలకొల్లులో ఒక గుంపు సబ్ ఇన్స్పెక్టర్ ఇంటిమీద, పోలీస్ కానిస్టేబుల్ ఇంటిమీద దాడిచేసింది. సబ్‌జైలు వద్ద, సబ్‌ట్రెజరి వద్ద కాపలా ఉన్న పోలీసులను కొట్టి అందులో ఒకరిని తీవ్రంగా గాయపరచి, ఆ పోలీసుల వద్దనున్న తుపాకులను స్వాధీనం చేసుకొంది. పరిస్థితి చేయిదాటి పోతుందని గమనించిన రిజర్వు పోలీసు దళం కాల్పులు జరపగా ఒక వ్యక్తి చనిపోయాడు. తర్వాత రెండు వేల మంది టి. నరసింహాశర్మ, టి. సింహాచలం మున్నగువారి నాయకత్వంలో రైల్వే స్టేషన్ మీద దాడిచేసి అక్కడి స్టోర్ రూమ్‌లోని రికార్డులకు నిప్పంటించారు. అంతేగాక కొంతమంది విద్యార్థులు అక్కడి చెక్క ఫర్నీచర్‌ని స్టేషన్‌లోని పార్శిల్స్ మున్నగు వాటికి నిప్పంటించారు.

ఆకివీడు పోలీసు స్టేషన్ వద్ద రమారమి వందమంది గుమికూడి, అక్కడ ఉన్న ఇద్దరు పోలీసుల నుంచి, తుపాకులను, లాఠీలను తీసుకుని పోవడమేగాక స్టేషన్‌లోని రికార్డులన్నింటిని తగులబెట్టారు.

ఆకివీడు, కళింగపట్టణం వంటి కొన్ని ప్రదేశాలలో పోస్టాఫీసుల మీద కూడ దాడి జరిగి, అక్కడి రికార్డులు మొదలైన వాటిని ధ్వంసం చేశారు. ఆగష్టు 12న బాపట్లలోని సబ్ రిజిస్ట్రారు ఆఫీసు మీద ఒక గుంపు దాడిచేసింది.

కృష్ణా జిల్లాలో ఉరుటూరు వద్ద వైర్లు తొలగించారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ దగ్గర వెయ్యిమంది చేరి ధ్రాళ్ళురువ్వారు. కాని పోలీసులు రంగంలోకి ప్రవేశించి లాఠీ ఛార్జి జరిపారు. ఈ సంఘటనలో 12 మంది విద్యార్థులు గాయపడ్డారు. గుడివాడ దగ్గర విద్యార్థులు టెలిఫోను వైర్లు తొలగించారు. కైకలూరు వద్ద ఆగష్టు 19న వందమంది చేరి రైల్వేలైనులు తొలగించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కురాల భుజంగరావు నాయకత్వాన కొంతమంది యువకులు మోటూరు - గుడివాడల మధ్య రైలు పట్టాలను తొలగించగా వారిపై కేసులు పెట్టి జైలు శిక్ష విధించారు

ఆగష్టు 11న కాకినాడ వద్ద కొంతమంది కలెక్టర్ కార్యాలయంలో టెలిఫోన్ వైర్లను కత్తిరించారు. రెండురోజుల తర్వాత రాజోలు, పోలవరం, ధవళేశ్వరం, రాజమండ్రి మున్నగుచోట్ల పి.డబ్ల్యు.డి. ఆఫీస్‌లో టెలిఫోన్ వైర్లను కత్తిరించారు ఆగస్టు 24 న కొంతమంది సామర్లకోట, కాకినాడ మధ్య ఫిష్ బోల్టులను తీసివేశారు. ఆగస్టు 30న కొంతమంది పోలవరం దగ్గర సెప్టెంబరు 8 న అమలాపురం - రామచంద్రాపురం వద్ద టెలిఫోను వైర్లు కత్తిరించారు. ఈ రకంగా ఇబ్బంది పెట్టారు

నెల్లూరులో బొమ్మా శేషురెడ్డి, సెప్టెంబరు 9 న పద్మనాభసత్రం - పైడేరు మధ్యలోగల పబ్లిక్ శాఖల టెలిఫోను వైర్లను కత్తిరించారు. అంతేగాక సెప్టెంబరు 16న అల్లూరు గ్రామస్థులను అల్లూరు పోలీస్‌స్టేషన్ మీద దాడిచేయమని ప్రోత్సహించారు. ఈ దాడిలో పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు ధ్వంసమైనాయి. అంతేగాక వారు రెండు కార్బైన్స్ తీసుకొని వెళ్ళారు తర్వాత పోలీసులు శేషురెడ్డిని కస్టడీలోనికి తీసుకున్నారు. ఆగస్టు 23 న హనుమంతరావు, గోపాలరావులు కలసి గూడూరు, వెంకటగిరి మధ్య ఆరుజతల రైల్స్ తొలగించారు. సెప్టెంబరు 17 న 50 మంది అల్లూరు పోలీస్‌స్టేషన్ మీద దాడిచేసి అక్కడి బిల్డింగ్‌కు నిప్పంటించారు. నవంబరు 26న నాయుడుపేటలోని ట్రావెలర్స్ బంగళాకు, కోవూరు పోలీసుస్టేషన్‌కు నిప్పంటించారు. నెల్లూరు, మైపాడు మధ్యలో, దుగ్గరాజుపట్నం - నాయుడుపేట మధ్యలో కొన్ని మిలిటరీ టెలిఫోను వైర్లను కత్తిరించారు.

## 14.9 పోలీసుల దమనకాండ :

జగ్గయ్యపేటలో రెడ్‌క్రాస్ నిధికి 'చింతామణి' నాటక ప్రదర్శనం ఏర్పాటు చేయడం జరిగింది. సెప్టెంబరు 20న, కృష్ణాజిల్లా కలెక్టర్ మొహంతి నాటకం చూస్తుండగా, రెండు బాంబులు వచ్చి పడ్డాయి. ఒక బాంబు మహంకాళి వెంకటేశ్వర్ల తొడపై ప్రేలింది. ఈ సంఘటనలో ఆరుగురికి స్వల్పంగా గాయాలు తగిలాయి. ఆ సందర్భంలో 9 మందిని అరెస్ట్‌చేసి, పోలీసులు కేసులు పెట్టారు. తూమాటి యోగానందాచార్యులకు మళ్ళ నాగయ్యకు 7 సంవత్సరాలు శిక్ష విధించారు. దివ్వెల విశ్వనాధంకు నాలుగున్నర సంవత్సరాలు, డా॥ కలువకోలను శోభనాద్రికి మూడేళ్ళు, పెద్దాపురం నాగభూషణం, ఎన్. కృష్ణమూర్తి, అమరవాది శ్రీరామమూర్తులకు సంవత్సరం శిక్ష విధింపబడింది. ఈ కేసులో నిందితుడైన డా॥ శోభనాద్రి జైలునుండి తప్పించుకొనిపోయి, అజ్ఞాతవాసంలో వుండి పనిచేయనారంభించారు. పోలీసులు పట్టుకొని ఆయనకు 6 మాసాలు అదనపు శిక్ష విధించారు.

1943 జనవరిలో ఒంగోలు నగరంలో బాంబులు తయారుచేయవలెనని కొందరు ప్రయత్నించారు. వారిలో ముగ్గురు అరెస్టులు, శిక్షకులోనైనారు.

**14.9.1 భీమవరంలో తుపాకి కాల్పులు** : ఆగస్టు 17 న గోకరాజు శ్రీరామరాజు, గొట్టుముక్కల రామచంద్రరాజు, అయ్యగారి సుబ్బరాయుడు, కపిలజోగి జగన్నాధరావులు భీమవరంలో ఒక ప్రజాసమావేశాన్ని ఏర్పాటుచేశారు. అందులో 2,000 మంది పాల్గొన్నారు. ఉద్యమసందర్భంగా విద్యార్థులు పాఠశాలలను బహిష్కరించవలెనని, అందులో ప్రాతిపదికగా స్థానిక యు.యల్.సి.యం. స్కూల్‌ను మూసివేయాలని ఈ సమావేశం తీర్మానించింది. కాని ఆ స్కూల్‌ను మూసివేయడానికి స్కూలు అధికారులు నిరాకరించారు. అక్కడి విద్యార్థులు స్కూలు బెంచీలను, కుర్చీలను విరగ్గొట్టారు. దానితో గత్యంతరం లేక అధికారులు స్కూలు మూసివేయవలసి వచ్చింది. తర్వాత విద్యార్థులు ఊరేగింపుగా బయలుదేరారు. స్థానిక నాయకులైన వేగేసిన నారాయణరాజు మున్నగువారు ఈ ఊరేగింపులో చేరారు. ఆగస్టు 17 న భీమవరంలో రెండువేల మంది సబ్ మేజిస్ట్రేట్ కోర్టుకు వెళ్ళి కార్యాలయం మూసివేయమన్నారు. ఆ రోజున పని ఏమీ చేయమని అతను హామీ ఇచ్చిన తర్వాత, వారు జిల్లా మునిసిఫ్ కోర్టుకు వెళ్ళారు. అప్పటికే కోర్టుపనిచేయడం లేదని తెలిసి అక్కడికి మైలు దూరంలో ఉన్న రెవిన్యూ డివిజనల్ ఆఫీసుకు వెళ్ళారు. అప్పుడు ఆ జనాన్ని చూసి రెవిన్యూ ఆఫీసర్ తన పనిని ఆపి వెలుపలికి వచ్చారు అప్పుడు జనం అతన్ని రాజీనామా ఇవ్వమన్నారు. కాని దానికి అతను ఒప్పుకోకపోగా, వారు అతనిచేతికి కాంగ్రెస్ పతాకాన్ని ఇచ్చి కొంతదూరం తమతో కూడా నడవమన్నారు. తర్వాత కార్యాలయాన్ని తగులపెట్టాలని, వారు తాళం చెవులు అడిగారు. ఈలోగా కొంతమంది కిటికీలను బద్దలుకొట్టి, లోపలికి వెళ్ళి ఆఫీసు తగులబెట్టారు. అక్కడే వున్న డిప్యూటి ఇన్‌స్పెక్టర్ ఆఫీసు కూడా తగులబడింది, తర్వాత జనం పోలీసుస్టేషన్‌కు వెళ్ళి దానిని చుట్టుముట్టారు. అప్పుడు వారిపై కాల్పులు జరుపమని సబ్ఇన్‌స్పెక్టరు ఉత్తర్వు ఇచ్చారు. పోలీసులు కాల్పులు జరుపుతున్నా లెక్కచేయకుండా, ఆయుధాల వైపుకు పోతున్న జనంపై సబ్ఇన్‌స్పెక్టరు కాల్పులు జరిపారు. కాల్పులు కొనసాగిస్తే అతని భార్యాపిల్లల్ని చంపుతామని బెదిరించారు. కాని అతను దానికి తల ఒగ్గలేదు. రెండుగంటల తర్వాత మరొక పోలీసుదళం వచ్చింది. ఆ కాల్పుల్లో ముగ్గురు చనిపోగా, 5 మంది గాయపడ్డారు. ఈలోగా కొందరు పోలీసుల ఇళ్ళకు వెళ్ళి, నిప్పంటించి కొన్ని వస్తువులను తగులపెట్టారు. సబ్ఇన్‌స్పెక్టరు కుటుంబం మాత్రం తప్పించుకొంది.

**14.9.2 పెంటపాడు పోస్టాఫీసు దహనం** : గాంధీజీతో పాటుగా నిర్బంధంలో ఉన్న మహదేవ దేశాయి ఆకస్మాత్తుగా మరణించిన వార్త తెలియగానే తాడేపల్లి గూడెం సమీపంలోని పెంటపాడులో ఆగస్టు 17న ఒక సంతాపసభ జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న వారిలో కొందరు పెంటపాడు పోస్టాఫీసుకు నిప్పంటించగా, పోలీసులు ప్రజా సమూహం మీద లాఠీచార్జి జరిపి కొందరిని అరెస్ట్ చేశారు. అక్కడి సబ్‌పోస్టాఫీసు మీద దాడిచేసి ఫర్నీచరు, రికార్డులనన్నింటినీ తగులబెట్టారు.

**14.9.3 ప్రభుత్వ అణచివేత చర్యలు** : ఈ క్విట్ ఇండియా ఉద్యమాన్ని అణచివేయుటకై ప్రభుత్వం రెండు ప్రత్యేక ఆర్డినెన్సులు జారీచేసింది. 1. 1942 వ సంవత్సరపు తీవ్ర శిక్షల ఆర్డినెన్సు - దీని ప్రకారం రైల్వేలు, కాలువలు, తంతి, టెలిఫోన్ తీగలు మొదలైన వానికి నష్టం కల్గచేయడం ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడం మొదలైన నేరాలకు, కొరడా దెబ్బలు మొదలుకొని మరణశిక్ష వరకు శిక్షలను విధించే అధికారం జిల్లా మేజిస్ట్రేటుకు ఇవ్వబడింది. 2. సమిష్టి జరిమానాల ఆర్డినెన్సు- దాని ప్రకారం బ్రిటిష్ ఇండియా రక్షణకు భంగం కల్గించే నేరాలు చేసినవారు లేదా యుద్ధనిర్వహణ జరుగకుండ అవరోధం కల్గించినవారు. నివసించే ప్రాంతంలోని ప్రజలందరి మీద సమిష్టిగా రిమానా విధించారు. ఈ అధికారం రాష్ట్రప్రభుత్వాలకు ఇవ్వబడింది. ఈ ఆర్డినెన్సు ఉపయోగించినా ప్రజలు బెదరలేదు. అత్యధిక జరిమానా 3,21,681 రూ॥లు గుంటూరు జిల్లా నుండి వసూలుకాగా, నెల్లూరు జిల్లాలో 500 రూ॥లు వసూలైంది. ఈ ఉద్యమంలో 142 మంది డిటెన్యూలు, 640 మంది శిక్ష పొందిన వారున్నారు. గుంటూరుజిల్లాలో 27 మంది డిటెన్యూలు, 153 మంది శిక్షపొందినవారు, పశ్చిమ గోదావరిలో 17 మంది డిటెన్యూలు, 175 మంది శిక్షపొందిన వారున్నారు. ఇవిగాక అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాలపై సమిష్టి జరిమానాలు విధింపబడ్డాయి. ఎన్నిచేసినా, ప్రభుత్వాన్ని ధిక్కరించి స్వరాజ్యం కోసం పోరాడి దానిని సాధించవలెననే సంకల్పం మాత్రం ప్రజలలో తగ్గలేదు.

**14.10 కల్లు, సారా దుకాణాల వద్ద పికెటింగ్ :** ఈ ఉద్యమం జరుగుతున్నప్పుడు కూడా కల్లు, సారా దుకాణాల వద్ద పికెటింగ్ జరపడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. పికెటింగ్ చేయుచున్న సత్యాగ్రహుల అభ్యర్థనలు ఆయా దుకాణాల యజమానులు త్రోసిపుచ్చినందువల్ల పశ్చిమ గోదావరిలోని లంకలకోడేరు, పాలకొల్లులో గల కల్లు దుకాణాలు ఆగస్టు 17 న దహనం చేయబడ్డాయి. అయితే బాపట్ల మున్నగుచోట్ల ఈ పికెటింగ్ శాంతియుతంగానే జరిగింది. ఇలాంటి పికెటింగ్ సాగించిన వారిని ఎందరినో ప్రభుత్వం అరెస్ట్‌చేసి, వారు మరల ఇలాంటి పికెటింగులు చేయకుండా నిరుత్సాహపర్చడానికి ప్రతి ఒక్కరికి మూడేళ్ళ కఠిన జైలు శిక్ష, 50 రూ॥లు జరిమానా విధించింది.

## 14.11 ప్రభుత్వ ఉద్యోగులకు అభ్యర్థన :

ఈ ఉద్యమకాలంలో కొంతమంది ఒక ప్రత్యేక పద్ధతిని అవలంబించారు. సి. వీరభద్రరావు విశాఖపట్నం జిల్లాకలెక్టరు యొక్క పర్సనల్ అసిస్టెంటుకు, రెవిన్యూ డివిజనల్ ఆఫీసరుకు, పోస్ట్‌మాస్టర్‌కు, విజయనగరంలోని పోలీసు డిప్యూటి సూపరింటెండెంట్టుకు విడివిడిగా ఉత్తరాలు రాశారు. ఆ ఉత్తరాలలో వారిని ప్రతి ఒక్కరినీ ఉద్యోగాలను వదిలి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన వలసిందిగా కోరారు. ఈ విధంగా రాసినందుకు ఆయనకు 500 రూ॥లు జరిమానా, 6 నెలలు కఠినశిక్ష విధింపబడినది. ఇదే విధంగా మద్రాస్‌లోని మేజర్ యఫ్.యం. కాలింగ్ అను వ్యక్తికి, అనకాపల్లిలోని డాక్టరు కోరుకొండ సుబ్బరాజు ఒక ఉత్తరంలో భారతదేశాన్ని విడిచివెళ్ళిపోవలసిందిగా రాశాడు. కళింగపట్నం వాస్తవ్యుడైన కె. సుబ్బారావు, కళింగపట్నం డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌ను స్వాతంత్ర్య పోరాటంలో చేరవలసిందిగా ఆహ్వానిస్తూ ఒక ఉత్తరం వ్రాశారు. ఈ ఇద్దరికి కూడా శిక్షలు విధింపబడ్డాయి. సమావేశాలు, ఊరేగింపులు మొదలైన వాటిని ప్రభుత్వం నిషేధించింది. అలాగే బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటి ఆమోదించిన క్విట్ ఇండియా తీర్మానం పట్ల, తమ సానుభూతిని ప్రకటించిన స్థానిక సంస్థల విషయంలో కూడా ప్రభుత్వం చాలా కఠినంగా ప్రవర్తించింది. తూర్పు గోదావరి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని జిల్లాబోర్డులను, పాలకొల్లు, విజయవాడలోని మున్సిపల్ సభలను ప్రభుత్వం ఆరు నెలల కాలం రద్దుచేసింది.

## 14.12 ఇతర పరిణామాలు :

క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జైళ్ళలో ఉండుటవలన, ప్రజా ఉద్యమాలన్నీ కమ్యూనిస్టుల వశమైనాయి. కొంతవరకు రాడికల్ డెమొక్రటిక్ పార్టీ కూడా ఆంధ్రలో అక్కడక్కడా వెలిసింది. కాంగ్రెస్ నుండి బయటకు వచ్చిన యం.యన్. రాయ్ 1940 లో రాడికల్ డెమొక్రటిక్ పార్టీని స్థాపించారు. రెండవ ప్రపంచయుద్ధం ఆరంభంకాగానే అది ఫాసిస్ట్ వ్యతిరేక ఉద్యమమని, యుద్ధంలో ఇంగ్లాండుకు సాయపడాలని, యుద్ధానంతరం దేశానికి స్వాతంత్ర్యం తప్పదని రాయ్ వాదించి ప్రజాదరణ పోగొట్టుకున్నాడు. 1940 డిశంబరులో బొంబాయిలో జరిగిన రాడికల్ డెమొక్రటిక్ పార్టీ ప్రథమసభకు ఆంధ్రానుండి కోగంటి సుబ్రహ్మణ్యం, ఎ.ఎల్. నరసింహారావు ప్రతినిధులుగా పాల్గొన్నారు. అదే నెలలో ఆంధ్ర రాడికల్ డెమొక్రటిక్ మహాసభ యం.యన్. రాయ్ అధ్యక్షత క్రింద తెనాలిలో జరిగింది. గుంటూరు పురపాలక సంఘం యం.యన్. రాయ్‌కి పౌరసన్మానం చేయగా, ఆ సభలో ఆయన ఫాసిజాన్ని వ్యతిరేకించవలసిన ఆవశ్యకతను గురించి ప్రసంగించారు. తర్వాత కాకినాడలోను, ఆంధ్ర విశ్వవిద్యాలయంలోను రాయ్ ఉపన్యాసాలిచ్చారు. కోగంటి రాధాకృష్ణమూర్తి సంపాదకత్వంలో 'రాడికల్' అనే తెలుగు వారపత్రిక ప్రచురితమైంది. 1941 లో ఫాసిస్ట్ వ్యతిరేక మహాసభ వి.వి. కార్నిక్ అధ్యక్షతన గుంటూరులో జరిగింది. 1942 లో విజయవాడలో జరిగిన ద్వితీయ రాడికల్ డెమొక్రటిక్ పార్టీ మహాసభలో ఆవుల గోపాల కృష్ణమూర్తి, జి. నరహరి, తావు అంకమ్మ, యం.వి. శాస్త్రి పాల్గొన్నారు. 1941 ఫిబ్రవరిలో విశాఖపట్నంలో జరిగిన మహాసభలో యం.యన్.రాయ్ ఫాసిజాన్ని గురించి మాట్లాడారు. అఖిలభారత స్థాయిల్లో యం.యన్.రాయ్ అధ్యయన శిబిరాలు పెట్టి రాజకీయ పాఠాలు బోధించారు. 1940 లో డెహ్రాడూన్‌లో జరిగిన తొలిరాజకీయ శిబిరానికి ఆంధ్రనుండి అనేకమంది వెళ్ళి శిక్షణ పొందారు. 1942 లో లక్నోలో జరిగిన అఖిలభారత డెమొక్రటిక్ పార్టీ ద్వితీయ మహాసభలో ఆవుల గోపాలకృష్ణమూర్తి మున్నగువారు ఆంధ్ర ప్రతినిధులుగా పాల్గొన్నారు. ఆంధ్రలో రాడికల్ డెమొక్రటిక్ సిద్ధాంతాల ప్రచారానికి రాజకీయ పాఠశాలలు నిర్వహించారు. పెసరలంక, ఇంకొల్లు, నాదెండ్ల, గురజాల (గుంటూరుజిల్లా) లో ఇలాంటి రాజకీయ పాఠశాలలు జరిగాయి. అందులో సుబ్బరామయ్య, పి. అచ్యుత రామయ్య మున్నగువారు ప్రధానపాత్ర నిర్వహించారు. తెనాలి, చీరాల, రేపల్లె, గోవాడలలో రాడికల్ విద్యార్థి సంఘాలు స్థాపింపబడ్డాయి. రాడికల్ స్టూడెంట్ అనే తెలుగు వారపత్రిక వి. అచ్యుత్‌రామ్, పి. కృష్ణచౌదరి సంపాదకత్వాన వెలువడింది. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్‌కు

అనుబంధంగా ఆంధ్రలో నెల్లిమర్ల, విశాఖపట్నం మొదలగు చోట్ల కార్మిక సంఘాలు స్థాపించారు. పెమ్మరాజు వెంకటరావు, అబ్బూరి వాణీకుమార్ ఇందులో ప్రధాన పాత్ర నిర్వహించారు. జి. నరహరి సంపాదకత్వాన 'ఆంధ్రలేబర్' అనే తెలుగు వారపత్రిక వెలువడింది. కాంగ్రెస్ నాయకులు జైళ్ళలో ఉండగా కిసాన్ సభ కమ్యూనిస్టుల వశమైనది. అఖిలభారత కిసాన్ సభ సమావేశాలు 1944 మేలో విజయవాడలో జరిగినప్పుడు ఆంధ్రలో అన్ని జిల్లాలనుండి అనేక వేలమంది ఆ సమావేశాలకు హాజరైనారు. వ్యవసాయ కూలీసంఘం, కార్మికసంఘం, విద్యార్థి సంఘం, స్త్రీల సంఘం కమ్యూనిస్టుల అజమాయిషీలోకి వచ్చి పటిష్ట సంస్థలుగా రూపొందాయి.

## 14.13 గాంధీజీ నిరాహారదీక్ష :

ఈ ఉద్యమంలో గాంధీజీ అహింసను విడనాడారని ప్రభుత్వం ఆరోపించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఒక ప్రకటనలో కాంగ్రెస్ సంస్థ గాంధీజీ అక్షరాజ్యాల అనుకూలురని, ఉద్యమకాలంలో సంభవించిన దౌర్జన్యానికంతటికి, గాంధీజీ, కాంగ్రెస్ బాధ్యత వహించాలని ప్రకటించింది. తనపై వేసిన అపవాదులకు గాంధీజీ తీవ్రంగా స్పందించి, తానుగాని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులుగాని హింసను ప్రోత్సహించినట్లయితే వెంటనే తామందరిని న్యాయస్థానాల్లో విచారించమని ప్రభుత్వాన్ని కోరారు. 1942 సెప్టెంబరు 23న గవర్నర్ జనరల్‌కు రాసిన లేఖలో గాంధీజీ దేశంలో జరిగిన హింసాత్మక సంఘటనలకు, తనకుగాని, కాంగ్రెస్‌కు గాని ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. అంతేగాక ఆ లేఖలో ఆయన ఎవరేమి చెప్పినా, కాంగ్రెస్ విధానం మాత్రం అహింసకు కట్టుబడి ఉండడమేనని తెలిపారు. కాంగ్రెస్ నాయకులందరు మూకుమ్మడిగ అరెస్ట్ అవడంతో ప్రజలు నాయకులు లేనివారై, ఆత్మనిగ్రహాన్ని కోల్పోయారని, కాంగ్రెస్ నాయకులందరినీ విడుదలచేసి, ప్రభుత్వంవారు అణచివేత చర్యలను ఆపివేసి, రాజీమార్గానికి రావడం మంచిదని రాశారు. తానురాసిన లేఖకు సరైన సమాధానం రాకపోయేటప్పటికి, గాంధీజీ ఫిబ్రవరి 10 నుండి నిరాహారదీక్ష బూనడం ఆంధ్రాలో చాలామందిని కలవరపరిచింది. చాలచోట్ల విద్యార్థులు, గాంధీజీకి సానుభూతిగా నిరాహారదీక్షలు పూనారు. అంతేగాక ఆంధ్రలో చాలాచోట్ల ఊరేగింపులు జరిపారు. లాఠీచార్జి జరిగింది. అప్పుడు 21 మంది గాయపడ్డారు. అనేకచోట్ల సమావేశాలు జరిగాయి. సానుభూతి తీర్మానాలు చేశారు. గుంటూరు నుండి 1000 సంతకాలు గల ఒక విజ్ఞప్తిని గాంధీజీ విడుదలను వాంఛిస్తూ ప్రభుత్వానికి పంపారు. విద్యార్థి సంఘాలు, వ్యాపార సంఘాలు, వ్యవసాయ కార్మికులు ఒక్కమాటలో చెప్పాలంటే మొత్తం దేశం ముక్తకంఠంతో గాంధీజీ విడుదలను డిమాండ్ చేసింది. విశాఖపట్నంలోని ఎ.వి.యన్. కళాశాల విద్యార్థులు, ఆంధ్రమెడికల్ కాలేజికి చెందిన మహిళా హాస్టల్ విద్యార్థినులు, సామూహిక నిరాహారవ్రతం పూనారు. ప్రొ॥ మామిడిపూడి వెంకటరంగయ్య అధ్యక్షతన సమావేశమైన ఆంధ్రాయూనివర్శిటి అధ్యాపకవర్గం, విద్యార్థుల సంయుక్త సమావేశంలో మహాత్మాగాంధీ ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా వెంటనే బేషరతుగా గాంధీజీని విడుదల చేయాలని కోరుతూ తీర్మానించారు. కాకినాడలో ప్లీడరు గుమాస్తాలు పి.ఆర్.కాలేజి విద్యార్థులు ఇలాంటి ఆందోళననే సాగించారు. గాంధీజీని విడుదలచేయడానికి నిరాకరించిన బ్రిటిష్ ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగ, వైశ్రాయి కార్యనిర్వాహక వర్గం సభ్యత్వానికి ముగ్గురు భారతీయులు రాజీనామా చేశారు. అయినా ఆనాటి బ్రిటిష్ ప్రధానియైన చర్చిల్ మహాత్మాగాంధీని విడిచిపెట్టవలసిన అవసరంలేదని మొండి ధోరణినే ప్రదర్శించారు. ఏ ప్రమాదం లేకుండానే గాంధీజీ, తనకు నచ్చిన వైష్ణవజనతాగీతం, 'లీడ్‌కైండ్లీ లైట్' అను ఆంగ్లగీతం గానం చేస్తున్న సమయంలో గాంధీజీ దీక్ష విరమణ చేశారు. 1943 అక్టోబరు 2 న గాంధీజయంతి అత్యుత్సాహంలో నిర్వహింపబడింది. క్విట్ ఇండియా తీర్మానపు వార్షిక జయంతి 1943. ఆగస్టు 9 న జరిగింది. అదేరోజు, దేశంలో సమ్మె జరిగింది. అయినా మొత్తంమీద 1942 తో పోల్చినప్పుడు 1943 లో రాజకీయ సంబరం అతి ప్రశాంతస్థాయిలోనే ఉన్నదని చెప్పవచ్చు. 1944 నాటికి క్విట్ ఇండియా ఉద్యమం చాలావరకు మందగించింది. అయినా బ్రిటీష్ పాలనపట్ల ధిక్కారభావం మాత్రం ప్రజలలో యధాపూర్వంగానే ఉంది. ఆ సంవత్సరం జనవరి 26న భారతదేశమంతా స్వాతంత్ర్యదినోత్సవం నిర్వహింపబడింది. ఫిబ్రవరి 22న కస్తూరిబా గాంధీ ఆగాఖాను మందిరంలో నిర్యాణం చెందడంతో, దేశం గాఢ సంతాపంతో మునిగింది. 1944 మే 6 న గాంధీజీని నిర్బంధంనుండి ప్రభుత్వం విడుదల చేసింది. గాంధీజీ ప్రభుత్వంలో రాయబారాలు జరిపారు. వెంటనే ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి, కేంద్ర శాసనసభకు బాధ్యత వహించే జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే శాసనోల్లంఘనోద్యమాన్ని విరమించి, బ్రిటిష్ ప్రభుత్వ యుద్ధకృషిలో సాయపడవలసిందిగా కార్యవర్గానికి సలహా ఇవ్వడానికి తాను సంసిద్ధునిగా ఉన్నట్లు జూలై 27న వైశ్రాయికి రాసిన ఉత్తరంలో స్పష్టం చేశారు. అంతేగాక ఉద్యమం సందర్భంలో అజ్ఞాతవాసంలో ఉండి ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను జరుపుతున్న వారందరు వెలుపలికి వచ్చి అరెస్టుకావలెనని ఆయన విజ్ఞప్తిచేశారు. ఆంధ్రలో కాంగ్రెస్‌వారు గాంధీ సలహాపై నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగించారు.

జైలునుండి విడుదలైన ఆచార్య రంగా, కాంగ్రెస్‌కు అనుబంధంగా కిసాన్‌సభలను పునర్వ్యవస్థీకరించడానికి పూనుకొని, కాంగ్రెసు జెండాతోపాటు కిసాన్ జెండానికూడా ఎగురవేయడానికి సంకల్పించారు. క్రొవ్విడి లింగరాజు, నీలం సంజీవరెడ్డి, కల్లూరి చంద్రమౌళి కూడా ఈ కాలంలో జైలునుండి విడుదలై, నిర్మాణ కార్యక్రమాలకు తగిన సంస్థలను రూపొందించడంలో కృషిచేశారు. గ్రామాలలో పర్యటించి, గ్రామోద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి వలంటీర్లకు శిక్షణను కల్పించడానికి శిబిరాలు నెలకొల్పారు. రైతుల, కార్మికుల హరిజనుల ప్రత్యేక సమస్యల విషయంలో శ్రద్ధ వహించడానికి ప్రత్యేక కమిటీలు రూపొందింప బడ్డాయి. 1945 వరకు పరిస్థితులు ఈ రకంగానే కొనసాగాయి.

## 14.14 క్విట్ ఇండియా ఉద్యమ స్వభావం :

క్విట్ ఇండియా ఉద్యమం కూడా గాంధీజీ అంతకుముందు నిర్వహించిన సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లఘనోద్యమంవలె అహింసాయుతంగానే సాగించవలెనని నిర్ణయించినప్పటికీ, ఈ ఉద్యమం కొంత హింసాత్మకంగా మారింది. ఆంధ్రలో నిర్వహింపబడిన క్విట్ ఇండియా ఉద్యమాన్ని పరిశీలిస్తే, పశ్చిమ గోదావరిలో ఈ ఉద్యమం బాగా తారాస్థాయికి చేరినట్లు గోచరిస్తుంది. ఇక్కడ రైల్వేస్టేషన్లమీద దాడి బాగా కనిపిస్తుంది. ఈ ఒక్క జిల్లాలోనే ఆరు రైల్వేస్టేషన్ల మీద దాడి జరిగింది. అవి అత్తిలి, రేలంగి, ఉండి, దెందులూరు, లంకలకోడేరు మరియు వేంద్ర. ఈ జిల్లాలో విద్యార్థులు కూడా ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. పెంటపాడు వద్ద 300 మంది విద్యార్థులు 'గాంధీజీకి జై' అని అరుస్తు పబ్లిక్ వర్క్స్ శాఖ ఆఫీసు మీదికి వెళ్ళి అక్కడి ఆఫీసర్‌ను రిజైన్ చేయమని డిమాండ్ చేశారు. ఆకివీడులో స్కూలు విద్యార్థులు, పోలీస్‌స్టేషన్ మీద దాడిచేయగా 5 మంది పోలీసు కాల్పులలో మరణించారు. పశ్చిమ గోదావరి తర్వాత గుంటూరు జిల్లా క్విట్ ఇండియా ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించింది. ఈ జిల్లాలోనే కొండావెంకటప్పయ్య, యన్.జి. రంగా మున్నగు ప్రముఖ స్వాతంత్ర్య యోధులు పాల్గొన్నారు. ఈ జిల్లాలో కూడ రైల్వేస్టేషన్ల మీద దాడి జరిగి చీరాల, తెనాలి రైల్వేస్టేషన్లు బాగా నష్టపోయాయి. చీరాల దగ్గర రైల్వే ఆస్తికి నష్టం కల్గడమేగాక రైలును కూడా ఆపివేయడం జరిగింది. చీరాలలో విద్యార్థులు పోస్టాఫీస్ మీద దాడిచేశారు. తెనాలిలో సబ్‌మేజిస్ట్రేట్ కోర్టుకు వెళ్ళి, మేజిస్ట్రేట్‌ను రిజైన్ చేయమని అడిగారు. గుంటూరు జిల్లాలో ఈ ఉద్యమంలో 24 మంది దాకా మరణించారు. ఈ జిల్లాలో వడ్లమూడి అన్నపూర్ణమ్మ, చిట్టూరి అన్నపూర్ణాదేవి, సూర్యదేవర అన్నపూర్ణమ్మ, తుమ్మల దుర్గాంబ, సూర్యదేవర రాజ్యలక్ష్మి మున్నగు మహిళలు, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. సూర్యదేవర రాజ్యలక్ష్మి చేబ్రోలులో రాజకీయ పాఠశాలను నిర్వహించారు. భారతీదేవి రంగా కిసాన్ ఉద్యమానికి, రాజకీయ పాఠశాల ఉన్నతికి పాటుపడ్డారు. పశ్చిమగోదావరి, గుంటూరు తర్వాత కృష్ణాజిల్లా ప్రముఖపాత్ర వహించింది. ఇక్కడ కూడ రైల్వేస్టేషన్ల మీద దాడి జరగడమేగాక, కొన్ని రహస్య సమావేశాలు జరిగాయి. ఈ జిల్లాలో డా॥ పట్టాభి, అయ్యదేవర కాళేశ్వరరావు, కాకాని వెంకటరత్నం మున్నగు నాయకులు ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థులేగాక, స్త్రీలు కూడా పాల్గొన్నారు. కృష్ణాజిల్లా, గుడివాడలో 5 మంది మహిళలు మేజిస్ట్రేటు కోర్టుకు వెళ్ళి మేజిస్ట్రేటును పదవీ విరమణ చేయమని కోరారు. బెజవాడలో ఆంధ్ర సత్యాగ్రహిని వివాహమాడిన స్విస్ వనితయైన ఉప్పుల జోలింగర్, కాంగ్రెస్ జెండాను గవర్నమెంట్ ఆఫీసు మీద ఎగురవేసింది. అలాగే కృష్ణాజిల్లాలో గోపరాజు సరస్వతి, ఎర్నేని అమృతమ్మ, రేచర్ల సామ్రాజ్యం మున్నగు మహిళలు ఆ ఉద్యమంలో అంకితభావంతో పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా, "ఆంధ్ర సర్క్యులర్" వలన ఎంతో ప్రాముఖ్యంలోనికి వచ్చింది. ఈ జిల్లాకు చెందిన క్రొవ్విడి లింగరాజు, పళ్లం రాజు, తిరుమలరావు మున్నగువారు బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ కమిటీ మీటింగ్‌కు వెళ్ళి ఆగస్టు 13 న, గోదావరి స్టేషన్‌లో అరెస్టు చేయబడ్డారు. నెల్లూరు జిల్లాలో ఓరుగంటి వెంకటసుబ్బయ్య, బెజవాడ గోపాలరెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య, బొమ్మా శేషురెడ్డి మున్నగువారు, విశాఖపట్నం జిల్లాలో తెన్నేటి విశ్వనాథం, కె.యస్. గుప్త మున్నగువారు ప్రముఖపాత్ర వహించారు. ఆగస్టు 14 న ఆముదాలవలస కళింగపట్నం మధ్యలోని టెలిగ్రాఫ్ లైనులు కత్తిరించారు. మందస, బారువా మధ్యలో మిలిటరీ లేబర్‌ను తీసుకొని వెళ్తున్న రైలు పట్టాలు తప్పింది సెప్టెంబరు 10 న ఇద్దరు కళింగపట్నం పోస్టాఫీసు వద్దకు వెళ్ళి, పోస్ట్‌మాస్టరు దగ్గర తాళాలు తీసుకొని రికార్డులకు నిప్పంటించారు. ఈ రకంగా విశాఖపట్నంలో కూడా ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థను దిగ్బంధం చేయడానికి రకరకాలుగా ప్రయత్నాలు జరిగాయి. నెల్లూరులో బొమ్మాశేషురెడ్డి పద్మనాభసత్రం, పైడేరు మధ్యలో పి.డబ్ల్యు.డి. టెలిఫోన్ వైర్లను ధ్వంసం చేశారు. అంతేగాక అల్లూరువద్ద పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను ధ్వంసం చేయడానికి కొంతమందిని రెచ్చగొట్టారు. ఈ రకంగా నెల్లూరు జిల్లాలోని పట్టణ ప్రాంతాలలోనేగాక, గ్రామాల దగ్గరకూడా ఉద్యమం జరిగింది. రైల్వేస్టేషన్లు, పోస్టాఫీసులు ఉద్యమకారుల విధ్వంసకాండకు గురైనాయి. నెల్లూరు పట్టణంలో ఆగస్టు 13న

కొంతమంది విద్యార్థులు టంకురోడ్డు, తిప్పరాజుసత్రం దగ్గర విద్యుత్ దీపాలను ధ్వంసం చేసి, రోడ్డుకు అవరోధం కల్పించారు. ఆత్మకూరు నెల్లూరు మధ్యలో కొంతమంది టెలిఫోన్ వైర్లను కత్తిరించారు. అంతేగాక నెల్లూరులో స్కూలు విద్యార్థులు, కాలేజి విద్యార్థులు విద్యాసంస్థలను బహిష్కరించారు. ఆగస్టు 28, 1942 లో కావలి డిస్ట్రిక్ట్‌బోర్డు హైస్కూలు విద్యార్థులు హెడ్‌మాస్టర్ గదికి నిప్పంటించడానికి ప్రయత్నించారు.

తిక్కవరపు రామిరెడ్డి, నాల్గవ కుమార్తెయైన శకుంతలాదేవి ఫిబ్రవరి 18, 1943 లో అరెస్టు అయ్యారు. అప్పుడు ఆమె సోదరియైన అనసూయదేవి జడ్జిమెంట్ వినడానికి మద్రాసుకు వెళ్ళి, అక్కడ జాతీయ నినాదాలు చేయగా, అప్పుడు ఆమెను అరెస్టుచేసి, 3 నెలలు జైలు శిక్ష విధించారు.

ఈ విధంగా క్విట్ ఇండియా ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, స్త్రీలు పాల్గొన్నారు.

## 14.15 సమీక్ష :

సాధారణ వ్యక్తులు స్వచ్ఛందంగా స్వాతంత్రోద్యమంలో పాల్గొనడం క్విట్ ఇండియా ఉద్యమం యొక్క విశిష్టత. ఇంతకుముందు నిర్వహించబడిన ఉద్యమంలో ప్రజలు నాయకులను అనురిస్తే, ఈ ఉద్యమంలో నాయకులు అరెస్ట్ అవడం వలన ప్రజలు అత్యంత చొరవ చూపించారు. రెండవ ప్రపంచ యుద్ధంలో అలసిపోయిన ఇంగ్లండ్ భారతదేశాన్ని ఇంకెంతోకాలం తమగుప్పిట్లో పెట్టుకోలేమని గ్రహించింది. అందువలననే 1942 ఉద్యమం అధికార బదిలీని దగ్గరకు తెచ్చిందనుటలో అతిశయోక్తిలేదు.

## 14.16 వ్యాసరూప ప్రశ్నలు

1. ఆంధ్రాలో క్విట్ ఇండియా ఉద్యమం ఏ విధంగా జరిగింది ? వివరింపుడు.
2. క్విట్ ఇండియా ఉద్యమ అణచివేతకు, బ్రిటిష్ ప్రభుత్వం ఎటువంటి ప్రతిచర్యలను తీసుకున్నది ?
3. క్విట్ ఇండియా ఉద్యమం యొక్క స్వరూప, స్వభావాలను పరిశీలింపుము

## 14.17 ఉపయుక్త గ్రంధాలు :


1. Prof. M. Venkatarangaiya (Editor) - The Freedom Struggle in Andhra Pradesh (Andhra). Vol II. Hyderabad 1974.
2. Prof. Ch.M. Naidu - Mahatma Gandhi's leadership and Quit India Movement in Coastal Andhra, Visakhapatnam 1990
3. Dr. S. Girija - Freedom Movement in India (Nellore District). New Delhi. 1990
4. Dr. T. Jayalakshmi - Women Freedom fighters of Andhra Pradesh Kolkata. 2001
5. ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య, యస్. ఇన్నయ్య - ఆంధ్రలో స్వాతంత్ర్య సమరము, హైదరాబాదు 1972.
6. ఆచార్య సరోజిని రేగాని - ఆంధ్రలో స్వాతంత్రోద్యమ చరిత్ర. తెలుగు అకాడమి, హైదరాబాదు, 1998
7. మాదల వీరభద్రరావు - కృష్ణాజిల్లా స్వాతంత్రోద్యమ చరిత్ర. హైదరాబాదు 1983
8. ఎ.వి. కోటిరెడ్డి - ఆధునిక ఆంధ్రదేశ చరిత్ర, తెలుగు అకాడమి, హైదరాబాదు 2000.


డా॥ ఎస్. గిరిజ

పాఠం 15

# తెలంగాణా స్వాతంత్రోద్యమం

## 15.1 లక్ష్యం :

తెలంగాణాలో చైతన్యానికి దారితీసిన పరిస్థితులను, సాంస్కృతికోద్యమ జాగృతిని, స్వాతంత్రోద్యమ పోరాటాన్ని, నిజాం నిరంకుశ అధికారం నుంచి విముక్తి పొందటానికి జరిపిన విముక్తి పోరాటాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం


15.1 లక్ష్యం

15.2 పరిచయం

15.3 చైతన్యవ్యాప్తి

15.3.1 మేధావుల కృషి

15.3.2 ఆర్య సమాజం

15.3.3 గ్రంథాలయోద్యమం

15.3.4 సంస్థలు

15.3.5 పత్రికలు

15.3.6 ఆంధ్ర జన సంఘం స్థాపన 1921

15.3.7 ఆంధ్ర జన కేంద్ర సంఘం (1923-30)

15.4 నిజాం ఆంధ్ర మహాసభ (1930-46)

15.5 తెలంగాణా స్వాతంత్రోద్యమం

15.6 రాజకీయ సభలు

15.6.1 కాకినాడ కాంగ్రెస్ సభ

15.6.2 మొదటి హైదరాబాదు రాష్ట్ర రాజకీయ సభ - కాకినాడ

15.6.3 రెండవ రాజకీయ సభ - బొంబాయి

15.6.4 మూడవ రాజకీయ సభ - పూనా

15.6.5 నాల్గవ రాజకీయ సభ - అకోలా

15.7 స్టేట్ కాంగ్రెస్ స్థాపన

15.8 స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం

15.9 ఉస్మానియా విశ్వవిద్యాలయ వందేమాతరం ఉద్యమం

15.10 స్వాతంత్రోద్యమ ప్రభావం

15.11 జయప్రకాష్ నారాయణ పర్యటన

15.12 కమ్యూనిస్ట్ ఉద్యమ కారణాలు

15.13 కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భావం

15.14 పోరాట ఘట్టాలు

15.15 ప్రభుత్వ అణచివేత

15.16 సాయుధపోరాటం - విజయాలు

15.17 విముక్తి ఉద్యమం

15.17.1 జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం

15.17.2 కమ్యూనిస్ట్ పార్టీ పాత్ర

15.17.3 రజాకారుల దురంతాలు

15.17.4 పత్రికల పాత్ర

15.17.5 నిజాం వైఖరి

15.17.6 యథాతథపు ఒడంబడిక

15.17.7 కె.ఎం. మున్షీ రాయబారం

15.17.8 రజాకార్లకు మద్దతు

15.8 భారత ప్రభుత్వపు పోలీసు చర్య

15.19 సారాంశము

15.20 వ్యాసరూప ప్రశ్నలు

15.21 ఉపయుక్త గ్రంథాలు

## 15.2 పరిచయం :

భారతదేశపు పెద్ద సంస్థానాలలో నిజాం రాజ్యం ఒకటి. దీని వైశాల్యం 82,700 చదరపు మైళ్ళు. పరిపాలన సౌలభ్యంకోసం వరంగల్, మెదక్, ఔరంగాబాదు, గుల్బర్గా అని నాలుగు సుభాలుగా విభజింపబడింది. మెదక్, వరంగల్ సుభాలలో తెలుగు మాట్లాడేవారు అధికంగా ఉండేవారు. మొత్తం నిజాం రాజ్యంలోనే తెలుగు అత్యధిక ప్రజలు మాట్లాడగా, మరాఠీలు, కన్నడిగులు, హిందూస్థానీలు అల్పసంఖ్యాక వర్గాలుగా ఉండేవారు. అయినప్పటికీ, తెలుగుకి గుర్తింపు ఉండేదికాదు. ఉర్దూ రాజ్యభాష.

నిరంకుశ రాజరిక వ్యవస్థ నిజాం రాజ్యంలో ఉండేది. అక్షరాస్యత అతి తక్కువ. సర్దారులు, జాగీర్దార్లు, మొఘుసాధార్లు, పత్తేదార్లు భూస్వాములుగా ఉండేవారు. బానిసవ్యవస్థ, వెట్టిచాకిరీ అమలులో ఉండేవి. స్త్రీలకు రక్షణ లేదు. మారుమూల గ్రామాలలోని ప్రజలు కూడా భయాందోళనలతోనూ, దుర్భర దారిద్ర్యంతోనూ జీవించేవారు. శిస్తు వసూలు అమానుషంగా ఉండేది.

తెలంగాణాలోని వెనుకబాటుతనాన్ని గురించి తెలియజేస్తూ దేవులపల్లి రామానుజం తెలుగు ప్రజలు దుర్బలులుగా, అంధకార అజ్ఞానాలతో జీవితాన్ని గడుపుతున్నారని వ్యాఖ్యానించాడు. మందుముల నరసింహారావు తెలంగాణాలోని తెలుగు వారిని బ్రిటిష్ పరిపాలనలో ఉన్న తెలుగువారితో పోల్చితే, వారు ఏభై సంవత్సరాలు వెనుకబడి ఉన్నారని తెలిపాడు.

## 15.3 చైతన్యవ్యాప్తి :

నిజాం రాజ్యంలోని ప్రజలను జాగృతి పరిచే అనేక సంఘటనలు ఇరవైయ్యవ శతాబ్దంనుంచి జరిగి, తుదకు రాజకీయ చైతన్యానికి దారితీసాయి. అవి:

**15.3.1 మేధావులకృషి :** నిరంకుశ పాలనలో ఉన్న ప్రజలను చైతన్యపరిచే యత్నాన్ని కొందరు మేధావులు 1880 ప్రాంతాల నుంచి చేపట్టారు. ముఖ్యంగా 1883 లో సాగిన చాందా రైల్వే స్కీంపై జరిగిన ఆందోళన ప్రధమ ప్రముఖ యత్నం. భారత ప్రభుత్వానికి, హైదరాబాదు ప్రభుత్వానికి 1870 లో జరిగిన ఒప్పందం ప్రకారం మద్రాసు - బొంబాయి రైల్వేలైనుని హైదరాబాదుకి, దోర్నకల్, ఎల్లందు నుంచి విజయవాడకి, ఉత్తరాన మహారాష్ట్రలోని చాందాకి పెంచాలి. దీనిని, నిర్మించాడానికి ఒక బ్రిటిష్ కంపెనీ ఏర్పడి, నిజాంని అద్వాన్సు ఇవ్వమని ఒత్తిడి చేయసాగింది. సింగరేణిలో బొగ్గుగనులు బయటపడడం వలన, వాటి అవసరం రైల్వేలకు ఉండడం వలననే ఈ విస్తరణ చేపట్టారు. అయితే ఈ స్కీం నిజాం రాజ్యానికి లాభదాయకం కాదనే వార్తలు వ్యాపించడంతో హైదరాబాదులోని మేధావివర్గం ప్రభుత్వాన్ని పూర్తి వివరాలు, బహిరంగంగా తెలియజేయమని కోరారు. వీరిలో నిజాం కాలేజీ ప్రిన్సిపాలగు డాక్టరు అఘోరనాథ్ చట్టోపాధ్యాయ, ముల్లా అబ్దుల్‌ఖయూం ముఖ్యులు. ఈ కోరిక ప్రభుత్వం రీజెన్సీ కౌన్సిల్ అభ్యంతరంగా భావించి, చట్టోపాధ్యాయను సస్పెండ్ చేసి, బహిష్కరణను విధించారు. ఈ బహిష్కరణతో ఆందోళన ఆగినప్పటికి, ప్రముఖ పత్రికలయిన టైమ్స్ ఆఫ్ ఇండియా, బాంబే గెజిట్‌లు ఈ వార్తకు ప్రాధాన్యతనిచ్చి ప్రచారం చేశాయి. దీనితో రెండు సంవత్సరాల తరువాత నిషేధాన్ని తొలగించి, చట్టోపాధ్యాయను ప్రిన్సిపాలుగా కొనసాగించారు. అఘోరనాథ్ చట్టోపాధ్యాయతోపాటు, ముల్లా అబ్దుల్ ఖయూం, రామచంద్ర పిళ్ళేలు సంస్థాన ప్రజలలో చైతన్యం కలిగించడానికి కృషి చేసారు. సంస్థానం నుంచి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరిన మొదటి ముస్లిం నాయకుడు అబ్దుల్ ఖయూం. ఈ విధంగా జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాలపట్ల సంస్థాన ప్రజలు ఆసక్తి చూపసాగారు.

**15.3.2 ఆర్యసమాజం :** హైదరాబాదు నగరంలో 1892 లో ఆర్య సమాజ శాఖ ఆరంభమయింది. ఇస్లాంకి వ్యతిరేకులు కనుకను, వీరి నాయకులు జన్మతః సంస్థాన పౌరులు (ముల్కీలు) కానందునా, వీరిపై ప్రభుత్వ నిఘా ఉండడమేగాక, వేధింపులు కూడా అధికంగా ఉండేవి. నిత్యానంద బ్రహ్మచారి, విశ్వానంద సరస్వతి, మొదలగు వారికి ప్రభుత్వం జైలు శిక్షలు విధించింది. వారి పక్షాన వాదించిన రామచంద్ర పిళ్ళేని సహితం ఇబ్బంది పెట్టింది. ఈ సమాజంలో కేశవరావు కోరాట్కర్, దామోదర్ సాత్వలేకర్ వంటి ప్రముఖులు 1896 లో చేరారు. హైదరాబాదులో 1895 నుంచి ఆరంభమయిన గణేశ్ ఉత్సవాలకు ఆర్యసమాజం కూడా మద్దతునిచ్చేది. పాఠశాలలు, అఖాడా (వ్యాయామశాల) లు అధికంగా స్థాపించారు. వానిలో వివేక వర్ధని పాఠశాల ప్రముఖమైనది.

**15.3.3 గ్రంథాలయోద్యమం :** తెలంగాణా ప్రజలను చైతన్యవంతులను చేయడంలో గ్రంథాలయోద్యమం ప్రముఖమైనది. కొమర్రాజు లక్ష్మణరావు 1901 లో మునగాల జమిందారు రాజానాయని వెంకట రంగారావు, హైదరాబాదు మున్సబ్‌దారు అయిన రావిచెట్టు రంగారావుల సహకారంతో హైదరాబాదులో శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయాన్ని స్థాపించారు. ఇదే తెలంగాణాలో స్థాపించబడిన మొట్టమొదటి గ్రంథాలయం. తెలుగు భాషా వికాసానికి ఈ విధంగా నాంది పలకడమయింది. హనుమకొండలో శ్రీ రాజరాజనరేంద్ర ఆంధ్రాభాషా నిలయం 1904 లో ఆరంభించబడింది. సికింద్రాబాదులో ఆంధ్ర సంవర్ధనీ గ్రంథాలయం 1905 లో నెలకొల్పబడింది.

గ్రంథాలయాల స్థాపనతో తృప్తి చెందక, లక్ష్మణరావు 1906 లో విజ్ఞాన చంద్రికా మండలిని హైదరాబాదులో స్థాపించి, అమూల్యమయిన తెలుగు సాహిత్య గ్రంథాలను ముద్రించి, చౌకగా ప్రజలకు అందించి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని భావించాడు. ఈ సంస్థద్వారా లక్ష్మణరావు తెలుగు సాంస్కృతిక వికాసానికి పునాదులు వేయడమేగాక, ఆంధ్రా - తెలంగాణా ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలను నెలకొల్పాడు. లక్ష్మణరావుతో పాటు మైలవరం నరసింహశాస్త్రి, ఆదిపూడి సోమనాథరావు, శేషాద్రి రమణ కవులు కృషి చేసారు. తెలంగాణాలో మరిన్ని గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి. వరంగల్లు జిల్లాలోని ఎర్రుపాలెంలో 1911 లోనూ, రేమిడిచర్లలో 1913 లోనూ, సూర్యాపేటలో 1917 లోనూ, 1918 లో నల్గొండలోనూ గ్రంథాలయాలు వెలిసాయి.

**15.3.4 సంస్థలు :** కొందరు యువపట్టభద్రులు స్థాపించిన ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ తెలంగాణా చైతన్యానికి చురుకైన పాత్ర పోషించింది. సహీఫా అనే స్థానిక ఉర్దూ దినపత్రిక యజమాని అయిన సర్ అక్బర్ ఆలీ, మీర్జా మహమ్మద్ బేగ్, అబ్దుల్ బాసిత్, మౌల్వీ మహమ్మద్ మూర్తుజా, అక్బర్ సాబిర్ ఆలీ హైదరీలు దీనిలో ప్రముఖ సభ్యులు. ఈ కాన్ఫరెన్స్ కృషి ఫలితంగానే ఉస్మానియా విశ్వవిద్యాలయం 1915 లో ఏర్పడింది.

సాంస్కృతిక పునరుజ్జీవన ఫలితంగా అనేక సంఘాలు ఏర్పడ్డాయి. మాజీ హైకోర్టు జడ్జి అయిన రాయ్ బాలముకుంద్, కలప వర్తకుడయిన లాల్‌జీ మేఘ్‌జీ, ప్రముఖ సంస్కర్త అయిన భాగ్యరెడ్డి వర్మ కృషి ఫలితంగా హ్యూమానిటేరియన్ లీగ్ ఏర్పడింది. సంఘసంస్కరణ, ముఖ్యంగా హరిజనోద్ధరణ వారి లక్ష్యం.

హైదరాబాదు సోషల్ సర్వీస్ లీగ్‌ను కేశవరావు కోరాట్కార్, వామన్ నాయక్ 1915 లో స్థాపించారు. ప్రాథమిక విద్య ఆవశ్యకతను, స్త్రీ విద్యావ్యాప్తిని గురించి, గ్రంథాలయాల విస్తరణ గురించి కృషి చేసింది.

ఈ సభ్యులనుంచే హైదరాబాదు స్టేట్ రిఫార్మ్స్ అసోసియేషన్ అనేది రూపొందింది. దీని ఉపాధ్యక్షుడు కేశవరావు కోరాట్కార్, కార్యదర్శి రాఘవేంద్రరావు శర్మ. సంస్థాన ప్రజల రాజకీయ గుర్తింపుకై పోరాటాన్ని వీరు సాగించారు.

**15.3.5 పత్రికలు :** సంస్థాన ప్రజలను చైతన్యపరచే దిశలో వరంగల్లు నుండి "తెలుగు పత్రిక", నల్లగొండ నుంచి "నీలగిరి పత్రిక" కృషి చేసాయి. రాయచూర్ నివాసి అయిన పండిత తారానాథ్, హిందూపత్రిక హైదరాబాదు విలేఖరి అయిన రామచంద్రపిళ్ళే "హిందూ" పత్రికలో అనేక వ్యాసాలు రాసారు. "హైదరాబాదు రికార్డ్" పత్రిక ప్రజలను జాతీయోద్యమం పట్ల అభిమానితులుగా మార్చింది. హైదరాబాదు రెసిడెంటుని ఆ పత్రిక ఒక సందర్భంలో స్థానిక సీజర్ అని వర్ణించి ఆయన ఆగ్రహాన్ని చూరగొంది. పయోనీర్ పత్రికలో కూడా నిజాం ప్రభుత్వంపై విమర్శలు ప్రచురితమయ్యేవి. తారానాథ్ "ప్రేమ" అనే పత్రికను ప్రచురించడం ఆరంభించి, జాతీయతను, స్వదేశీ అభిమానాన్ని పెంపొందింపజేసాడు. సురవరం ప్రతాపరెడ్డి నడిపిన "గోల్కొండ పత్రిక" కృషి అభినందనీయమయింది. కాకతీయ ప్రగతి, తెలంగాణా శోభ మొదలగు పత్రికలు గొప్పసేవ చేసాయి.

**15.3.6 ఆంధ్ర జన సంఘం స్థాపన (1921) :** తెలంగాణాలో చైతన్యానికి నవంబరు 12, 1921 న ఆవిర్భవించిన ఆంధ్ర జనసంఘం జీవం పోసింది. 1921 నవంబరు 11-12 తేదీలలో హైదరాబాదులో జరిగిన నిజాం రాష్ట్ర సాంఘిక సంస్కరణ సమావేశంలో ఒక సంఘటన జరిగింది. సభలు సాధారణంగా ఉర్దూ, ఇంగ్లీషు, మరాఠీ భాషలలోనే సాగేవి. ఈ సభలో మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగరావు, టేకుమళ్ళ రంగారావు మొదలగువారు పాల్గొన్నారు. తెలుగు ప్రతినిధులలో ఒకరైన అల్లంపల్లి వెంకట రామారావు తెలుగులో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించడానికి యత్నించగా, సభ నుంచి కేకలు వచ్చి, అతని ప్రసంగానికి అంతరాయం ఏర్పడింది. అక్కడి తెలుగు వారందరూ దీనిని అవమానకరంగా భావించి, ఆ రాత్రే వారందరూ సమావేశమై "ఆంధ్ర జన సంఘం" ని ఏర్పాటు చేసారు. అందులోని సభ్యులు అప్పుడు 12 మంది మాత్రమే. వీరిలో మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు ప్రముఖులు. త్వరలోనే ఈ సంఘ సభ్యుల సంఖ్య 100 కి పెరిగింది. దీని ప్రథమ సమావేశం హైదరాబాదులో 1922 ఫిబ్రవరి 14 న కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలోనే ఆంధ్ర జన సంఘం పేరును నిజాం సంస్థాన ఆంధ్ర జన సంఘంగా మార్చడం జరిగింది. ఈ సంఘానికి కార్యదర్శిగా మాడపాటి హనుమంతరావుని ఎన్నుకొన్నారు. కొమర్రాజు లక్ష్మణరావు చూపిన మార్గాన సాగడానికి, తెలంగాణా సాంఘిక సాంస్కృతిక పురోగతిని సాధించడానికి ఈ సంఘం నిర్ణయించింది.

ఈ సంస్థ కార్యకలాపాలలో ప్రముఖపాత్ర నిర్వహించినవారు మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, జమలాపురం కేశవరావు, మందుముల నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావు. వారి కృషి ఫలితంగా తెలంగాణాలోని అనేక ప్రదేశాలలో అటువంటి సంఘములే వెలసి, త్వరితగతిన ఆంధ్రభాష అభివృద్ధి చెందింది.

**15.3.7 ఆంధ్ర జన కేంద్ర సంఘం (1923-30)** : తరువాత **తెలంగాణా** ప్రాంతంలో ఉన్న తెలుగు సంస్థలన్నీ కలిపి ఒకే సంస్థగా రూపొందించుటకు 1923 వ సంవత్సరంలో హైదరాబాద్‌లో ఆంధ్ర జన **కేంద్ర సంఘము**ను ఏర్పాటుచేసి దానికి బారిష్టరు రాజగోపాలాచారి అధ్యక్షులుగాను, మాడపాటి వారు కార్యదర్శిగా నియమింపబడినారు. వారు తెలంగాణాలోని తెలుగు సంస్థలన్నింటిని సంఘటిత పరచి, 1923 జూలై 27 వ తేదీన హైదరాబాదులో ప్రథమ సమావేశం జరిపి సంస్థ ఆశయాలను ప్రకటించారు.

**సంస్థ ఆశయాలు** : 1. తెలంగాణాలోని ప్రతి జిల్లాలో ఆంధ్ర జన సంఘాన్ని స్థాపించుట. 2. జిల్లా గ్రంధాలయాలు పఠన మందిరాలు స్థాపించుట. 3. తెలుగు భాషలో విద్యను బోధించు పాఠశాలలను నెలకొల్పుట. 4. తెలుగు నేర్చుకోవాలనుకునే వారందరికి తెలుగు నేర్పుట. 5. వ్యాయామ క్రీడలు, కళలను ప్రోత్సహించుట. 6. చారిత్రక పరిశోధనలు జరిపి ప్రాచీనాంధ్రుల వైభవాన్ని వెలుగులోనికి తెచ్చుట. 7. ప్రజా సమస్యలపై ప్రామాణిక గ్రంధాలను ముద్రించుట. 8. వెట్టిచాకిరి మొదలగు తెలంగాణా ప్రజల సమస్యలను చర్చించుట. 9. సంఘ ఆదర్శములను వ్యాప్తి చేయుటకు సంచార కార్యకర్తలను నియమించుట. 10. విద్వాంసులను గౌరవించుట; సన్మానించుట 11. ఆంధ్రభాషా ప్రచారానికి కావలసిన ఏర్పాట్లు చేయుట. 12. అనాధులకు అవసరమగు సహాయం చేయుట. 13. కరపత్రాలు, లఘుపుస్తకాలు, ఉపన్యాసాల ద్వారా విజ్ఞానాన్ని వ్యాపింపజేయుట. 14. తాళపత్ర గ్రంధాలు, శాసనాల ప్రతులను సంపాదించి, పరిశోధించి, ప్రకటించుట. 15. విద్యార్థులకు సహాయంచేసి ప్రోత్సహించుట, మొదలగునవి సంస్థ **ఆశయములు**. ఈ సంస్థ హైదరాబాదు, నల్గొండ, ఖమ్మం, సూర్యాపేట, దేవరకొండ మొదలగు ప్రదేశాలలో సమావేశాలు జరిపినది. మధిర, సూర్యాపేటలలో సంస్థ సమావేశములతోపాటు రెండు గ్రంధాలయ సభలు గూడా జరిగాయి.

ఈ సంస్థ సాధించిన కృషిలో పేర్కొనవలసిన అంశాలు : 1. తెలంగాణా అంతటా గ్రంధాలయాలు, పాఠశాలలు స్థాపించబడ్డాయి. 2. ఆంధ్రపరిశోధక సంఘాన్ని స్థాపించింది. తరువాత కాలంలో దీనికి లక్ష్మణరాయ పరిశోధక మండలి అని పేరు పెట్టారు. ఈ సంస్థకు ఆదిరాజు వీరభద్రరావుని కార్యదర్శిగా నియమించారు. అనేక తాళపత్రగ్రంధాలు, శాసనాలు సేకరించి, ప్రచురించారు. 3. కొన్ని గ్రంథాలను ప్రచురించింది. నిజాం ఆంధ్రరాష్ట్ర ప్రశంస, వెట్టి చాకిరి, వర్తక స్వాతంత్ర్యం, నిజాం రాష్ట్ర ఆంధ్రులు వానిలో ప్రసిద్ధములు 4. ఆంధ్ర బాలికా ఉన్నత పాఠశాలను 1925 లో హైదరాబాదులో నెలకొల్పి, స్త్రీ విద్యను ప్రోత్సహించింది. 5. 1930 లో వరంగల్లులో కాకతీయ చరిత్రపై గోష్టిని నిర్వహించి, ఆ వ్యాసాలను "కాకతీయ సంచిక" పేరుతో వెలువరించింది.

ఆంధ్ర జన కేంద్ర సంఘం రాజకీయేతర సంస్థ అయినప్పటికీ, నిజాం పాలనలోని అధిక పన్నులకి, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఆందోళన చేసింది. దానితో నిజాం ప్రభుత్వం సంఘం కార్యక్రమాలపై నిఘావేసి, ప్రభుత్వ అనుమతి లేనిదే ఏ సభలు జరుపరాదని ఆజ్ఞాపించింది.

## 15.4 నిజాం ఆంధ్ర మహాసభ (1930 - 46) :

తెలంగాణా ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా మార్చి స్వాతంత్ర్య సమరాన్ని జరిపిన సంస్థ నిజాం ఆంధ్రసభ. ఆంధ్ర జన కేంద్ర సంఘం ద్వారా ఆంధ్ర భాషాభివృద్ధి సాధించబడి, తెలంగాణా ప్రజలు రాజకీయ కార్యకలాపాల వైపు మరలారు. తత్ఫలితంగా ఆంధ్రజన కేంద్ర సంఘం నిజాం ఆంధ్ర మహాసభగా తెలంగాణా విముక్తి ఉద్యమాన్ని ప్రారంభించింది.

జోగిపేటలో 1930 లో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఆంధ్రజన కేంద్రసభ తనను తాను ఆంధ్ర మహాసభగా ప్రకటించుకుంది. ఈ సభలో వాక్స్వాతంత్ర్యం ఉండవలెనని, వెట్టి చాకిరీని రద్దుచేయాలని, రైతుల స్థితిగతులు మెరుగుపరచాలని, విద్యాసంస్థలు నెలకొల్పాలని, తీర్మానాలు చేసారు. ఆంధ్ర మహాసభతోపాటుగా ఆంధ్ర మహిళాసభ కూడా జరిగింది. ఈ సాంప్రదాయం 1942 వరకూ కొనసాగింది. ధర్మవరంలో ఆంధ్రమహాసభ తొమ్మిదవ సమావేశం జరిగినప్పుడు, మహిళా సభ్యులు తమకోసం ప్రత్యేక సమావేశాన్ని తామే జరుపుకోవడం ఆరంభించారు.

రెండో సమావేశం దేవరకొండలో 1931 లో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో అనేకులు తెలుగులోనే మాట్లాడారు. నిజాం ప్రభుత్వం ఈ సభల తీర్మానాలను, ప్రజా మద్దతును భయాందోళనలతో పరిశీలించడం ప్రారంభించింది.

ప్రభుత్వం 1929 లో ఒక ప్రత్యేక గస్తి నం. 53 ను అమలులోనికి తెచ్చింది. ఏదైనా సమావేశం జరిగేటప్పుడు, పది రోజులకుముందే స్థానిక అధికారులకు నోటీసు ఇవ్వాలని చర్చాంశములను (అజెండా) కూడా తెలుపాలని, అప్పుడే అనుమతి ఇవ్వడం పరిశీలించబడుతుందని స్పష్టం చేసింది. మూడో సమావేశం ఏర్పాటు చేసికోవడానికి మూడు సంవత్సరాలు ఆలస్యమయింది. ఖమ్మంలో 1934 లో, పులిజాల వెంకట రంగారావు అధ్యక్షతన మూడో సమావేశం జరిగింది. నాలుగో సమావేశం సిరిసిల్లలో 1935 లో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. మహిళా సమాజ సభకు ఆయన భార్య అయిన శ్రీమతి మాణిక్యమ్మ అధ్యక్షత వహించారు. ఐదవ సమావేశం షాద్‌నగర్‌లో 1936లో కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆరో సమావేశం నిజామాబాదులో 1937 లోనూ, ఏడో సమావేశం మల్కాపురంలో 1940 లోనూ జరిగింది. ప్రభుత్వం నియమించిన అయ్యంగార్ కమిటీ సూచించిన రాజ్యాంగ సంస్కరణలను బహిష్కరించాలని అతివాది అయిన రావి నారాయణరెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, మితవాదులయిన మాడపాటి హనుమంతరావు, కొండా వెంకటరంగారెడ్డి, మందుముల నరసింహారావు వ్యతిరేకించారు. కాని రావి నారాయణరెడ్డి తీర్మానాన్ని అధికులు బలపరచారు. దానితో ఆంధ్ర మహాసభలో అతివాద, మితవాద వర్గాలు ఏర్పడ్డాయి. చిలుకూరులో 1941 లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఎనిమిదో సమావేశం నుంచి సభ వామపక్ష వాదుల నాయకత్వంలోకి వచ్చింది. తొమ్మిదో సమావేశం 1942 లో ధర్మవరంలోనూ, పదో సమావేశం 1943 లో హైదరాబాదులోనూ జరిగింది. భువనగిరిలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన 1944లో జరిగిన పదకొండో సభలో సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయారు. మితవాదులయిన మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి నాయకత్వంలో 1945 లో 12 వ సభను మడికొండలో జరుపుకొనగా, అతివాదులు అదే సంవత్సరంలో 12 వ సభను ఖమ్మంలో జరుపుకున్నారు. ఆఖరిదయిన 13 వ సభను 1946 లో కంది గ్రామంలో జరుపుకున్నారు. కమ్యూనిస్ట్ పార్టీని 1936 లో నిషేధించడం జరిగింది. మితవాద సభ హైదరాబాదు స్టేట్ కాంగ్రెసులో విలీనంకాగా, అతివాదులు కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులయ్యారు. పదమూడు సభలను నిర్వహించిన ఆంధ్ర మహాసభ అంతరించింది. కాని ఈలోపునే తెలంగాణా ప్రజలను, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చైతన్యపరచి, సాయుధ పోరాటానికి సిద్ధపరచింది.

## 15.5 తెలంగాణా స్వాతంత్ర్యోద్యమం :

కాంగ్రెస్ ఉద్యమ ప్రభావం సంస్థాన ప్రజలపై పడింది. మొదటి కాంగ్రెస్ కమిటీని 1918 లో వామన్ నాయక్ స్థాపించి, అధ్యక్షత వహించాడు. ఇతడు, సంస్థానంలోని కర్ణాటక ప్రాంతాలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడంలో ప్రముఖ పాత్ర వహించాడు. పండిత తారానాథ్, రాయచూర్‌లో జాతీయ పాఠశాలను నెలకొల్పడమేగాక, నిజాం ప్రభుత్వాన్ని హిందూ పత్రికలో తీవ్రంగా విమర్శిస్తూ వ్యాసాలు రాసాడు. నిజాంని "ఇండియన్ డయర్" అని విమర్శిస్తూ, తన శిష్యుడయిన రాజబహదూర్ పేరా ప్రచురించి, ఇద్దరూ నిజాంచే శిక్షలకు లోనయ్యారు.

తారానాథ్ మౌలానా షౌకత్ అలీ వద్దకు వెళ్ళగా, ఆతడు ఖిలాఫత్ ఉద్యమాన్ని సంస్థానంలో ప్రచారం చేయమని కోరారు. తారానాథ్ షౌకత్ అలీని, మహాత్మాగాంధీని వారి దక్షిణ దేశ పర్యటనలో అనుసరించాడు. "ప్రేమ" పత్రిక ద్వారా తారానాథ్ స్వదేశీ ఉద్యమానికి, ముఖ్యంగా నూతన జాతీయ విద్యా విధానానికి శ్రీకారం చుట్టాడు. ఇదే తరువాతి కాలంలో "నయి తాలీం"గా పిలువబడింది.

గాంధీజీ ఆరంభించిన ఖిలాఫత్ ఉద్యమాన్ని హైదరాబాదు సంస్థానం బలపరచింది. చరఖాలతో నూలు వడకడం ఆరంభమయింది. ఖాదీ ఉద్యమ వ్యాప్తి జరిగింది. హిందీభాషా వ్యాప్తి జరిగింది. రాయ్ విశ్వేశ్వరనాథ్, బారిష్టర్ శ్రీ కృష్ణ, మాడపాటి హనుమంతరావు, వామన్ నాయక్‌లు ఈ ఉద్యమాన్ని ఆరంభించారు. తిలక్ స్వరాజ్య నిధికి కేశవరావు కోరాట్కార్, వామన్ నాయక్‌లు సహకరించారు.

పూనా, బొంబాయి, అలీఘర్ వంటి ప్రదేశాలలో విద్యనభ్యసిస్తున్న హైదరాబాదు సంస్థానానికి చెందిన విద్యార్థులు సహాయ నిరాకరణోద్యమానికి ప్రభావితమయి, చదువులను చాలించుకుని ఉద్యమాన్ని బలోపేతం చేసారు. వారిలో జయసూర్య, మీర్ మహమద్ హుస్సేన్, అక్బర్ అలీ ఖాన్, మీర్ మహమ్మద్ హుస్సేన్ ఉన్నారు. సైజమాలను వదలి ఖాదీ ధోవతులను, గాంధీ టోపీలను బద్రుల్ హసన్, జఫార్ హసన్ ధరించేవారు. ఏప్రియల్ 1920 లో షౌకత్ అలీ మద్రాసుకి వెళ్తున్నప్పుడు గుల్బర్గా, రాయచూర్ స్టేషన్లలో ఆయనకు ఘనస్వాగతం లభించింది. హిందూ, ముస్లిం ఐక్యతకు వివేక వర్ధనీ కళాశాల మైదానంలో ఏప్రిల్ 23, 1920 న జరిగిన యూమ్-ఇ-

ఇంతిహాన్ (పరీక్షాదినం) అద్దం పట్టింది. ముస్లిం - హిందూ నాయకులిరువురూ అధ్యక్షస్థానాల్లో ఉండడమేగాక, ఆందోళన కొనసాగించడానికి ఆ సభనుంచే అధికమొత్తం వసూలయింది. మే 5, 1920 న ఐక్యతా దినంగా పాటించబడింది. మే 17, 1920 న మరో ప్రజాసమావేశం విజయవంతంగా జరిగింది.

నిజాంకి ఈ పరిస్థితులు రుచించకపోవడంతో రాజకీయ సమావేశాలు జరపడాన్ని, భారత రాజకీయ నాయకులు సంస్థానంలో ప్రవేశించడాన్ని నిజాం ప్రభుత్వం సెప్టెంబరు 14, 1921 న నిషేధిస్తూ ఫర్మానాను జారీ చేసింది. సంస్థానంలో ఎక్కడయినా సమావేశం జరుపదలచుకుంటే ముఖ్య కార్యదర్శి అజెండాని ఆమోదించినప్పుడు మాత్రమే సాధ్యమని ప్రభుత్వం అసాధారణ గెజట్ నెం. 52 గా ప్రకటించింది. స్వదేశీ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి ప్రయివేటు పాఠశాలల ఏర్పాటును, అఖాడాల (వ్యాయమశాల) ఏర్పాటును నిషేధించింది. బ్రిటిష్ ఇండియాలో ప్రచురితమయ్యే కేసరి, స్వరాజ్య, హితవాద వంటి పత్రికలకు సంస్థానం అనుమతి నిరాకరించి, నిషేధించింది.

## 15.6 రాజకీయ సభలు :

సంస్థానానికి వెలుపల జరిగిన అనేక రాజకీయ సభలు ప్రజల చైతన్యానికి తోడ్పడ్డాయి.

**15.6.1 కాకినాడ కాంగ్రెస్ సభ 1923 :** 1923 లో భారత జాతీయ కాంగ్రెసు మహాసభలు ఆలీ సోదరులలో ఒకరైన షౌకత్ ఆలీ అధ్యక్షతన కాకినాడలో జరుపవలెనని నిర్ణయింపబడింది. అదే సమయంలో భారీవర్షాలు కురిసి తూర్పు కోస్తా రైల్వేలైను తెగిపోయింది. అందువలన కాకినాడ వెళ్ళు రైళ్ళను సికిందరాబాద్ మీదుగా నడుపబడినవి. రైళ్ళ రాకపోకల ఆలస్యం వలన కాకినాడ వెళ్ళు కాంగ్రెసు నాయకులు సికిందరాబాద్‌లో కొంత సమయం వుండవలసి వచ్చింది. ఈ ప్రకృతి వైపరీత్యం తెలంగాణా ప్రజలకు జాతీయ కాంగ్రెసు నాయకులను కలుసుకొనే మంచి అవకాశాన్ని కల్గించింది. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకొని మాడపాటి హనుమంతరావు, ధర్మవీర వామననాయక్, బూర్గుల రామకృష్ణారావు సికిందరాబాద్ స్టేషన్ వద్ద షామియానాలు వేయించి, ఉత్తర హిందూస్థానం నుండి వచ్చు కాంగ్రెసు ప్రతినిధులకు వసతి భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో మౌలానా అహమ్మద్ ఆలీ, షౌకత్ ఆలీ అను ఆలీ సోదరులు, మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాస్ మొ॥గు ప్రముఖనాయకులు హైదరాబాద్ నాయకుల ఆతిధ్యాన్ని పొందారు. స్థానిక నాయకులు వారిని ఉపన్యాసాలివ్వమని కోరారు. సికింద్రాబాద్‌లో మాట్లాడిన వారంతా జాతీయ కాంగ్రెసు నాయకులు గనుక నిజాం వారిపై ఎట్టి చర్య తీసుకొనలేకపోయాడు. జాతీయ నాయకుల ఉపన్యాసాలకు ప్రభావితులై తెలంగాణా ప్రజలలో వందలాది మంది కాకినాడలో జరిగిన కాంగ్రెసు మహాసభలకు హాజరైనారు.

**15.6.2 మొదటి హైదరాబాద్ రాష్ట్ర రాజకీయ సభ - కాకినాడ 1923 :** కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభాసమావేశాలు తిలకించిన హైదరాబాద్ వారికి రాజకీయ ఉత్తేజం కల్గింది. దాని ఫలితంగా వారికి తాముగూడా అట్టి సభను జరుపుకొంటే బాగుండును అను అభిప్రాయం కల్గింది. మొదట ఆ అభిప్రాయం మాడపాటి హనుమంతరావుకి వచ్చింది. వెంటనే వారు వామన నాయక్‌కి తన కోర్కెను తెల్పారు. అందుకు వామన నాయక్ అంగీకరించి, అప్పటికప్పుడు కాకినాడలో తెలంగాణా ప్రజల రాజకీయసభను జరుపడానికి యేర్పాట్లు చేశారు. సభకు బీరారు నివాసి అయిన మాధవరావు ఆణేని సభాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రం నుండి వచ్చిన తెలంగాణా వారు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభలో నాల్గు తీర్మానాలు ఆమోదించారు. మొదటి తీర్మానాన్ని రాఘవేంద్రరావు శర్మ ప్రవేశపెట్టారు. ఆయన హైదరాబాద్ రాజకీయ మహాసభ కాకినాడలో జరుపవలిసి వచ్చిన కారణాలను వివరించి, ఆ సభ ఆశయాలను తెలుపుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని హైదరాబాద్ మాజీ హైకోర్టు న్యాయమూర్తి అయిన రామ బశ్వేశ్వరనాథ్, పాండురంగ జోషి బలపరచారు. రెండవ తీర్మానాన్ని వామన నాయక్ ప్రవేశపెట్టారు. ఆయన తన ప్రసంగంలో అంతకుముందు మూడు సం॥ల నాడు నిజాం జారీచేసిన ఫర్మానాలోని అంశాలు అమలు జరగడం లేదు, కనుక వెంటనే దానిని అమలుజరిపి అందు పేర్కొనబడిన కౌన్సిళ్ళను ఏర్పాటుచేసి భారతదేశంలో అతిపెద్ద సంస్థానమైన హైదరాబాద్ మిగిలిన సంస్థానాలకు ఆదర్శం కావాలని సూచించారు. అంతేగాక 1920 లో నిజాం ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రంలో విస్తృత ప్రాతిపదికన శాసనమండలిని ఏర్పాటు చేయుటకు

నివేదిక సమర్పించమని రాయ్ బాలముకుంద్‌ని నియమించడం, వారు నివేదికను సమర్పించడం జరిగికూడా చాలాకాలమైనది కనుక, ఆ నివేదికను అమలు జరుపవలసినదిగా ఈ సమావేశం కోరుచున్నదని గూడా వామన నాయక్ అన్నారు. మూడవ తీర్మానాన్ని ఔరంగాబాద్‌కు చెందిన వకీలు దిగంబరదాసు ప్రతిపాదించారు. ఇవి నిజాం ప్రజల వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన అతిముఖ్య తీర్మానం, నిజాం ప్రభుత్వం ప్రజాభిప్రాయం తెలుసుకోవడం అవసరమని, అది ప్రభుత్వానికే క్షేమం అని, ప్రబల సంక్షేమంకొరకు ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ యివ్వవలెనని, రాజకీయ సభలపైన, పత్రికలపైన నిర్బంధాలు తొలగించవలెనని ఈ సభవారు కోరుతున్నారని తీర్మానం ప్రవేశపెట్టబడింది. స్వచ్ఛందమైన ప్రజాభిప్రాయాల ప్రకటనకు నిర్బంధాలు హానికరమైనవని నిజాం ప్రభుత్వం సంస్థానంలోనికి అనేక పత్రికలను రానివ్వకుండా చేసినదని, ప్రపంచంలో ఏమి జరుగుచున్నదో తెలుసుకునే హక్కు ప్రజలకున్నదని, అది సహజమైన హక్కని దానిని లేకుండా చేయడం దారుణమని, ప్రజలకు తమ అభిప్రాయాలు ప్రకటించే హక్కు లేకుండా చేయడంవలన దారుణ పరిణామాలకు దారితీయునని తమ ప్రసంగంలో ఉద్ఘాటించారు. చివరకు ఆయన ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. నాల్గవ ప్రతిపాదన బీరారు సమస్యను గురించి బీరారు నివాసి అయిన బాబాసాహెబ్ పరాంజిపే ప్రతిపాదించారు. ఆయన నిజాం బీరారు ప్రజలకు బాధ్యతాయుతమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తే తప్ప బీరారును నిజాం సంస్థానంలో విలీనం చేయడానికి బీరారు ప్రజలు అంగీకరించరని, శుష్క వాగ్దానాలు పనికిరావని, ప్రజాసంక్షేమం కొరకు తగిన చర్యలు తీసుకొంటేనే ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం కుదురుతుందని హెచ్చరిక చేశారు. ఈ విధంగా నిజాం రాష్ట్ర ప్రజలు తమ ప్రాంతానికి కొన్ని వందల దూరంలో ఉన్న కాకినాడలో తమ ప్రథమ రాజకీయ మహాసభను జరుపుకున్నారు. అంతదూరంలో జరిగినా ఈ సభ నిజాం రాష్ట్ర ప్రజలపై తన ప్రభావాన్ని ప్రసరించింది.

**15.6.3 రెండవ రాజకీయ సభ - బొంబాయి 1926 :** రెండవ రాజకీయ సభను హైదరాబాద్ రాష్ట్రంలో జరుపవలెనని ఉద్యమనాయకులు భావించారు. కాని అనుమతి లభించలేదు. మూడు సం॥లు ఎదురుచూసి ఇక తమకు అనుమతి లభించదని నిరాశచెంది చివరకు 1926 నవంబరులో బొంబాయిలో రెండవ రాజకీయ మహాసభను జరిపారు. ఈ సభకు బీరారుకు చెందిన వై.ఎం. కాలే అధ్యక్షత వహించారు. ఆయన తన అధ్యక్షోపన్యాసంలో బీరారు సమస్యను ప్రస్తావించి అక్కడి ప్రజల మనోగతాన్ని ఇలా వివరించారు. బీరారు ప్రాంతాన్ని తన క్రిందికి తెచ్చుకొనవలెనని నిజాం ప్రయత్నిస్తున్నాడు. బీరారు ప్రజలు తిరిగి నిజాం పాలనలోనికి పోతామేమోనని భయపడుతున్నారు. అందువలన నేను, కొందరు మిత్రులు కలసి నిజాం రాజ్యాన్ని దర్శించాము. అచటి ప్రజలు ముఖ్యంగా హిందూ ప్రజలు పడే కడగండ్లను చూశాము. అది చూసిన తరువాత బీరారు ప్రజలు నిజాం పాలనలోనికి వెళ్ళడానికి ఎంతమాత్రం ఇష్టపడడంలేదు. కనుక బీరారు ప్రజలు నిజాం పాలనను అంగీకరించరు అని అన్నారు. అంతేగాక ఆయన హైదరాబాద్ ముస్లింలకు గూడా కొన్ని సూచనలు చేశారు. "రాజు ముస్లిం గనుక పరిపాలన తమదేనని హిందువులను పీడించరాదు. ఇండోరులో హోల్కారు మహారాజు తన రాజ్యంలో ముస్లిం ప్రజలకు కొన్ని యిబ్బందులు కల్గించగా, అచటి హిందువులు తమ మతంవాడని గూడా చూడకుండా తమ రాజుపై ఉద్యమాన్ని నడిపారు. ప్రజలందరికీ సమానహక్కులు యివ్వవలెనని కోరారు. ఇతర రాష్ట్రాలలోని హిందువులు గూడా ఇండోర్ రాజు చర్యలను సమర్థించలేదు. కాని హైదరాబాద్‌లోని ముస్లింల వైఖరి హిందువులకు వ్యతిరేకంగా వున్నది. అంతేకాదు బయట రాష్ట్రాల ముస్లింలు గూడా నిజాం రాష్ట్ర ముస్లింలకు మద్దతు తెల్పుచున్నారు. లాహోరులోని ముస్లింలు ఒక సమావేశం జరిపి నిజాం చర్యలను సమర్థించారు. నిజాం రాష్ట్రంలోని హిందువులను దూషించారు. అంతేగాక అలహాబాద్, లాహోర్ పట్టణాలలోని ముస్లిం పత్రికలన్నీ నిజాంను కీర్తిస్తూ, నిజాం రాష్ట్రంలోని హిందువులు ముస్లింరాజుకు వ్యతిరేకంగా కుట్రలు చేయుచున్నారని వ్యాఖ్యానించినవి. మత పక్షపాతం పనికిరాదు, రాజు అన్ని మతాల ప్రజలను సమదృష్టితో చూడాలి. పరిపాలన అనేది రాజకీయ అంశం, దానికి మతంకి ముడిపెట్టరాదు", అని కాలే తమ అధ్యక్ష ఉపన్యాసాన్ని ముగించారు. బొంబాయిలో జరిగిన ఈ రెండవ సమావేశం గూడా జయప్రదమైంది.

**భారత జాతీయ కాంగ్రెసు స్వదేశ సంస్థానాలపై తీర్మానం :** 1927 లో మద్రాసులో డా॥ అన్సారీ అధ్యక్షతన కాంగ్రెసు సభ జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెసు చరిత్రలో మొదటిసారిగా సంస్థానాలలో రాజకీయ సంస్కరణలు ప్రవేశపెట్టాలని తీర్మానం చేసింది. దేశీయ సంస్థానాలు తమ సంస్థానంలోని ప్రజల సంక్షేమం కొరకు ప్రజా ప్రాతినిధ్య సంస్థలను, బాధ్యతాయుత ప్రభుత్వాలను స్థాపించాలని కాంగ్రెసు కోరింది. ఆ తీర్మానాన్ని గురించి సత్యమూర్తి మాట్లాడుతూ "సంస్థాన ప్రజలేకాదు, సంస్థానాధీశ్వరులు గూడా పరాధీనతలో సమానమేనని

సంస్థానాధీశ్వరునివి బంగారు సంకెళ్ళు, ప్రజలవి ఇనుప సంకెళ్ళు, ఇద్దరికీ తేడా ఏమీ లేదని" వ్యాఖ్యానించారు. 1927 వ సం॥లో బొంబాయిలో మోచర్ల రామచంద్రరావు అధ్యక్షతన దేశీయ సంస్థానాల సభ జరిగింది. శ్రీనివాస అయ్యంగార్ అధ్యక్షతన అట్టిదే మరియొక సభ జరిగింది. ఈ సభలలో దేశీయరాజులు తమ ఆధ్వర్యంలో తమ ప్రజలకు బాధ్యతాయుత ప్రభుత్వాలు ఏర్పాటు చేయవలెనని తీర్మానించారు.

**15.6.4 మూడవ రాజకీయ సభ - పూనా 1928 :** రెండవసభ జరిగిన రెండు సం॥ల తరువాత 1928 లో పూనాలో మూడవ రాజకీయ మహాసభ జరిగింది. ఈ సభకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వచ్చి ఉపన్యసించారు. ఈ సభకు ఎన్.సి. కేల్కార్ అధ్యక్షత వహించారు. సభికులకు స్వాగతం పలుకుతూ స్వాగతోపన్యాసం ఈ విధంగా చేశారు. - స్వజాతీయులు, రక్త సంబంధీకులు పాలించు స్వదేశీ సంస్థానాలలో ప్రజలకు ఎటువంటి హక్కులు లేవు. స్వంతవారే ప్రజల హక్కులను కాలరాశారు. దీనిని బట్టి చూస్తే బ్రిటీషు ఇండియాకు స్వరాజ్యం వచ్చినా, స్వదేశ సంస్థానాధీశులు దానిని నాశనం చేస్తారు. కనుక అట్టి పరిస్థితి రాకుండా దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి ఇప్పటి మండే సంస్థానాలలో ఆందోళనలు జరపడం అత్యంత ఆవశ్యకం అని భోపట్కార్ తన స్వాగతోపన్యాసాన్ని ముగించారు.

ఆ తరువాత నేతాజీ తన గంభీరోపన్యాసం ఈ విధంగా చేశారు - "బ్రిటీషు ఇండియాలో తెల్లదొరతనం, సంస్థానాలలో నల్లదొరతనం, నిరంకుశత్వం సాగుచున్నది. కనుక దేశమంతటా ప్రజాస్వామిక పాలన నెలకొల్పటమే కాంగ్రెసు యేకైక ధ్యేయం. కనుక భారత ప్రజలు తమ జాతికే చెందిన రాజులు, నవాబుల నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరం వున్నది. "సంస్థానాల ప్రజల పట్ల కాంగ్రెసుకు పూర్తి సానుభూతి ఉన్నదని ఈ వేదికనుండి నేను హామీ యిస్తున్నాను. సంస్థానాల ప్రజల కష్టాలు, కోరికలను మేము అర్థం చేసుకున్నాము. ఇకముందు కాంగ్రెసు, సంస్థానాలలో తన శాఖలను నెలకొల్పి సంస్థాన ప్రజలకు అండగా నిలుస్తుంద"ని తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ సభలో మొత్తం 16 తీర్మానాలు ఆమోదింపబడినవి.

**15.6.5 నాల్గవ రాజకీయ సభ - అకోలా 1931 :** నిజాం సంస్థానంలో నాల్గవ సభ జరుపుకోవడానికి కూడా అనుమతి లభించలేదు. కనుక 1931 లో బీరారు ప్రాంతంలోని అకోలాలో నాల్గవ సభ జరిగింది. ఈ సభలో ఉద్యమనాయకులైన మాడపాటి హనుమంతరావు, ఉమ్మెత్తల కేశవరావు నాగులు, పల్ల కోదండ రామారావు, బూర్గుల రామకృష్ణారావులు పాల్గొన్నారు. అధ్యక్షుడు తన అధ్యక్షోపన్యాసంలో హైదరాబాద్ ప్రజలు తమ సరిహద్దులు దాటివచ్చి అకోలాలో తమ రాజకీయసభ జరుపుకుంటున్నందుకు విచారించుచున్నామని, నిజాం రాజ్యంలో భావస్వాతంత్ర్య ప్రకటనకు తావులేనందుకు తాము సిగ్గుపడుతున్నామని అన్నాడు. నిజాం రాజ్యంలో ఉర్దూను బోధనా భాషగా చేసి సాలుకు 80 లక్షల రూపాయలు విద్యాశాఖపై ఖర్చుపెడుతున్నారని, వేలాది సం॥ల నుండి ఈ నిజాంరాజ్యంలో సుసంపన్నమైన సాహిత్యం గల్గివున్న తెలుగు, మరాఠీ, కన్నడ భాషాభివృద్ధికి ఒక్కపైసా ఖర్చుచేయడం లేదని, మాతృభాషలో పాఠశాలలు స్థాపించరాదని ఆంక్షలు విధించి, ఆ భాషలను అణచివేస్తున్నారని తెలిపారు. ఈ సభలో నిజాం రాజ్యంలో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలని, అందుకుగాను నిజాం సిల్వర్‌జూబ్లీ రజతోత్సవ సందర్భంలో శాసనసభను విస్తరించి, ప్రజాప్రతినిధులను నియమించాలని, రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టి వానిని త్వరగా అమలుజరపాలని ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. దాని ఫలితంగా నిజాం ప్రభుత్వం అయ్యంగార్ అధ్యక్షతన రాజ్యాంగ సంస్కరణలను సూచించడానికి ఒక కమిటీని నియమించాడు. ఆ కమిటీ సూచనలను ఆంధ్ర మహాసభ తిరస్కరించింది.

## 15.7 స్టేట్ కాంగ్రెస్ స్థాపన (1938) :

హైదరాబాద్ స్వాతంత్ర్యసమరంలో అతిముఖ్యమైన మలుపు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసును స్థాపించుట. హైదరాబాదు స్వాతంత్ర సమర సమావేశాలను రాష్ట్రం వెలుపల సాగించేకన్నా రాష్ట్రంలోనే సాగించుట ఉత్తమమని ఉద్యమనాయకులు భావించారు. అందువలన హైదరాబాద్ రాజ్యంలోని వివిధ ప్రాంతీయ సంస్థలను ఒకే రాజకీయ సంస్థగా ఏర్పాటు చేయుటకు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసును స్థాపించవలెనని ఉద్దేశించారు. అందుకు స్వామి రామానంద తీర్థ చొరవ తీసుకొన్నాడు. స్థానిక నాయకులైన కాశీనాధరావు వైద్య, రామాచారి జోషి, రామకృష్ణ దూత్, దిగంబరరావు, బూర్గుల రామకృష్ణారావు మొదలగు వారి సహాయంతో 1938 జూలైలో హైదరాబాద్, స్టేట్ కాంగ్రెసును స్థాపించి 12 వేల మందిని ప్రాథమిక సభ్యులుగా చేర్చారు. 1938 సెప్టెంబరులో సర్వసభ్యసమావేశం ఏర్పాటుచేసి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవలెనని నిర్ణయించారు. కాని కాంగ్రెస్ స్థాపన అని తెలియగానే నిజాం ప్రభుత్వం ఆందోళన చెందింది. నాటి దివాన్ అయిన సర్

అక్బర్ హైదర్, బహదూర్ యార్జంగ్, అను ఇత్తేహాదుల్ ముసల్మాన్ సంస్థ అధిపతి కలిసి స్టేట్‌కాంగ్రెస్ సమావేశాన్ని నిషేధించమని నిజాంపై ఒత్తిడి తెచ్చారు. దాని ఫలితంగా స్టేట్ కాంగ్రెస్ నిషేధించబడింది.

విడుదల అయిన తర్వాత స్వామి రామానందతీర్థ స్టేట్ కాంగ్రెసుపై ఆంక్షలు ఉండకూడదని ప్రతివ్యక్తికి పౌరహక్కులు ఇవ్వవలెనని 1940 సెప్టెంబర్ 1 వ తేదీన వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభించారు. అంతట నిజాం ప్రభుత్వం ఆయనను, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్న అచ్యుతరావ్ దేశ్‌పాండే, మోతీలాల్, పాకేశ్వరాచార్య పాండ్యాలను మరల అరెస్టు చేసింది.

## 15.8 స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం 1938 :

హైదరాబాదు సంస్థాన చరిత్రలో 1938 వ సంవత్సరం ప్రముఖమైనది. ఈ సంవత్సరములో వివిధ సంస్థలు ప్రజామద్దతుతో తమ హక్కులకై ఉద్యమించాయి. స్టేట్ కాంగ్రెస్, ఆర్యసమాజం, హిందూ పరిషత్, సివిల్ లిబర్టీస్ యూనియన్ మొదలయిన సంస్థలు తమ హక్కుల పరిరక్షణకై తమ సంస్థల ద్వారా సత్యాగ్రహాన్ని చేసాయి.

స్టేట్ కాంగ్రెస్‌ని మతపరమైన సంస్థగా నిజాం భావించడంతో ఐక్యతా భాషణలు (యూనిటీ టాక్స్) విఫలమయ్యాయి. స్టేట్ కాంగ్రెస్‌పై గల నిషేధాజ్ఞలను తొలగించమని కాంగ్రెస్ సభ్యులు అక్టోబరు 24, 1938 న సత్యాగ్రహ ఉద్యమాన్ని నిర్వహించారు. దీని నిర్వహణలో మొదటి నియంత (డిక్టేటరు) రామానంద తీర్థ కాగా, ఆఖరి నియంత కాశీనాథ వైద్య. నాలుగు వందలమంది, పద్నాలుగు జట్లుగా పాల్గొన్నారు. ఈ ఉద్యమం రెండు నెలలు డిసెంబరు 24, 1938 వరకు కొనసాగింది. ప్రభుత్వంతో రాయబారాలు సాగించినప్పటికి, నిషేధ , తొలగలేదు. కమ్యూనిస్టులు తెలంగాణాలో సాయుధ పోరాటాన్ని 1946 లో ఆరంభించినప్పుడు, స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధాన్ని . నిజా ం ఏప్రిల్ 1946 లో రద్దు చేసాడు.

ఆర్యసమాజానికి చెందిన మహాత్మా నారాయణస్వామి, కేశవరావు కోరాట్కర్, పండిత వినాయకరావు పండిత నరేంద్రజీ మొదలయిన నాయకులను ప్రభుత్వం అనుమానించి, నియంత్రించే ప్రయత్నం చేసింది. ఆర్య సమాజ సమావేశాలను, ఊరేగింపులను, పాఠశాలల ఏర్పాటును, హోమాలను చేయడాన్ని, ఓం పతాకాలను ఎగరవేయడాన్ని నిషేధిస్తూ వారి గ్రంథమయిన సత్యార్థ ప్రకాశిక ప్రతులను వశం చేసుకొంది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిని అరెస్టు చేసింది. ఆర్య సమాజ నాయకులు కొందరు హత్యలకు గురి అయ్యారు. మత స్వాతంత్ర్యం కోసం ఆర్యసమాజం సత్యాగ్రహాన్ని చేపట్టి, మహాత్మా నారాయణ స్వామిని సత్యాగ్రహ నాయకునిగా నియమించింది. వివిధ ప్రాంతాలనుంచి వాలంటీరు సంఘాలు సంస్థానంలోకి ప్రవేశించి ఉద్యమించాయి. మొత్తంమీద ఆర్యసమాజ సత్యాగ్రహంలో 12,000 మంది పాల్గొన్నారు. పండిత వినాయక రావు ఎనిమిదవ నియంతగా ఉన్నప్పుడు జూలై 1939 లో ప్రభుత్వం కొన్ని పరిపాలనా సంస్కరణలను ప్రకటించడంతో, ఆర్యసమాజం తన సత్యాగ్రహాన్ని ఆపివేసింది.

## 15.9 ఉస్మానియా విశ్వవిద్యాలయ వందేమాతర ఉద్యమం 1938 :

1919 ఆగస్టు 2 వ తేదీన హైదరాబాద్‌లో నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ పేరుతో ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించబడింది. ఈ విశ్వవిద్యాలయంలో బోధించబడిన పాశ్చాత్య విద్యాబోధనల వలన హైదరాబాద్ రాజ్య విద్యార్థులలో స్వేచ్ఛా భావాలు జాతీయతా భావాలు పెరిగాయి. విశ్వ విద్యాలయంలో హిందూ విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించటం అలవాటు చేసుకున్నారు. 1938 దసరా ఉత్సవాల సందర్భంగా విశ్వవిద్యాలయంలోని బి. తరగతి హాస్టలులోని హిందూ విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. దీనికి ఆందోళన చెందిన నిజాం ప్రభుత్వం విద్యార్థులందరూ పైజామా, నీలిరంగు షేర్వాని ధరించవలెనని, ఎవరూ వందేమాతరం గీతాన్ని ఆలపించరాదని ఆంక్షలు విధించారు. దానికి వ్యతిరేకంగా 1938 నవంబరు 29 నుండి డిశంబరు 10 వరకు ఆందోళన జరిగింది. విశ్వవిద్యాలయంలో ఎమ్.ఎ. బోధన తెలుగు, మరాఠీ, కన్నడ, హిందీభాషలలో జరుపవలెనని ఆందోళన చేశారు. ఈ ఆందోళన ఔరంగాబాద్, నాందేడ్, బీదర్, మహబూబ్‌నగర్ మొదలగు పట్టణాలలో వ్యాపించింది. నిజాం ప్రభుత్వం ఈ ఆందోళనను అణచివేసి అనేకమంది విద్యార్థులను బహిష్కరించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 350, గుల్బర్గా నుండి 310 మహబూబ్‌నగర్ నుండి 120 మంది

బహిష్కరించబడ్డారు. వారిలో పి.వి. నరసింహారావు, మాకల రామచంద్రారెడ్డి, టి. హయగ్రీవాచారి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, అచ్యుతరెడ్డి ముఖ్యమయినవారు. వారు నాగపూర్ వెళ్ళి చదువుకొని తిరిగివచ్చి స్టేట్ కాంగ్రెస్‌లో చేరి నిజాం స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు.

## 15.10 స్వాతంత్రోద్యమ ప్రభావం :

బ్రిటిష్ ఇండియాలో జరిగే స్వాతంత్రోద్యమ ప్రభావం తెలంగాణాపై కూడా ప్రసరించింది. స్వామి రామానాందతీర్థ, గాంధీజీ అనుమతితో, సెప్టెంబరు 11, 1940 లో సత్యాగ్రహం చేసాడు. సంస్థా రూపంలో స్టేట్ కాంగ్రెస్ లేనప్పటికీ, దాని మూలభావనకు కట్టుబడి, వ్యక్తిగత హోదాలో ఉద్యమం జరుగుతున్నట్లు స్పష్టంచేసాడు.

1942 లో వచ్చిన క్రిప్స్ రాయబారం విఫలం కావటంతో మహాత్మాగాంధీ 1942 ఆగస్టు 8 వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించారు. హైదరాబాద్ సంస్థానంలో కూడా క్విట్ ఇండియా ఉద్యమం మొదలయింది. ఉద్యమం నడిపిన స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు, డా॥ మెల్కోటే, కాళోజీ, పద్మజా నాయుడు మొదలగు వారిని ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇదే సందర్భంలో హైదరాబాదుకు చెందిన అబిద్ హుస్సేన్ సఫాని, ప్రొఫెసర్ సురేష్ చంద్రలు 1942 లో సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరారు.

1946 లో తెలంగాణాలో కమ్యూనిస్టులు సాయుధపోరాటం ప్రారంభించారు. కమ్యూనిస్టుల భయంవలన నిజాం స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధాన్ని ఏప్రియల్ 1946 లో రద్దు చేశారు. అందువలన నైజాం రాజ్యంలోని ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతీయ సభలన్నీ స్టేట్ కాంగ్రెసులో విలీనం చెందినవి. ప్రథమ నిజాం స్టేట్ కాంగ్రెసు సమావేశం 1947 మే లో జరిగింది. దానికి రామానంద తీర్థ ప్రథమ అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.

## 15.11 జయప్రకాశ్ నారాయణ పర్యటన (1947) :

1946 లో వచ్చిన మంత్రిత్రయ రాయబారం భారతదేశానికి స్వతంత్ర్యం ఇవ్వబడునని ప్రకటించింది. నిజాం నవాబు తన రాజ్యాన్ని స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యంగా ప్రకటించుకొనవలెనని బ్రిటీష్ ప్రభుత్వంతో సంప్రదింపులు ప్రారంభించాడు. ఆ సందర్భంలో భారత సోషలిష్టు నాయకుడైన జయప్రకాష్ నారాయణ 1947 మే 7 వ తేదీన సికింద్రాబాద్ వచ్చి, కర్బాలా మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని, నిజాం ఇండియన్ యూనియన్‌లో చేరవలెనని ప్రజలు ఒత్తిడి తీసుకురావలెనని ప్రసంగించారు. ఈ వార్త తెలియగానే ప్రభుత్వం ఆయనను హైదరాబాద్ రాజ్యం నుండి బహిష్కరించింది. ఆయన బహిష్కరణకు నిరసనగా విద్యార్థులు ట్రేడ్ యూనియన్ నాయకులైన డి.ఎస్. మహీరావ్, నరేంద్ర ప్రసాద్ సక్సేనాలు స్టేట్ కాంగ్రెస్ నాయకులైన ఈశ్వరయ్య, రామ్మూర్తి, బి.వి. రావు మొ॥ వారు బహిరంగ సభలు జరిపి తమ నిరసనను తెలియపర్చారు. ప్రభుత్వం వారిపై దమనకాండ జరిపింది. అందు నలుగురు వ్యక్తులు మరణించారు. 317 మంది అరెస్టు చేయబడ్డారు. ఈ విధంగా కాంగ్రెసువారు జాతీయోద్యమాన్ని నడుపుతుండగా అదే సమయంలో కమ్యూనిస్టులు సన్నకారు రైతులు ఉద్యమించారు.

## 15.12 కమ్యూనిస్ట్ ఉద్యమానికి కారణాలు :

తెలంగాణాలో సన్నకారు రైతులు పోరాటం జరపడానికి కమ్యూనిస్టులు బలపడడానికి ఆనాటి నిజాం రాజ్యంలోని అనేక పరిస్థితులు దోహదం చేసినవి. కమ్యూనిస్టు విప్లవం రావటానికి ముందు రష్యాలో ఎట్టి పరిస్థితులుండెనో అట్టి పరిస్థితులే నిజాం రాజ్యంలో నెలకొని ఉన్నాయి.

**నిజాం నిరంకుశ పాలన :** రష్యాలో జార్ చక్రవర్తులవలె నిజాం రాజ్యంలో అసఫ్‌జాహీలు నిరంకుశులు. వారిమాటే శాసనం. రాజ్యంలోని 88% హిందువులకు ఎట్టి హక్కులు లేవు. అధికారమంతా అతి తక్కువ సంఖ్యాకులైన ముస్లింలది. వారు హిందువులపై చేయని దౌర్జన్యం

లేదు. ముస్లిం మతసంస్థ అయిన ఇతేహదుల్ ముసల్మాని హిందువులను హింసించిన తీరు ప్రపంచ చరిత్రలోనే లేదు. అందుకే కమ్యూనిస్టు నాయకుడైన రావి నారాయణరెడ్డి నిజాం రాజ్యం కల్తీలేని మధ్యయుగపు రాచరికం అని వ్యాఖ్యానించారు.

**భూస్వామ్య విధానం :** నిరంకుశ రాచరికానికి తోడు నిజాం రాజ్యంలో మధ్యయుగం నాటి భూస్వామ్య వ్యవస్థ అమలులోనుండేది. రాజ్యంలోని భూమిలో 30% జాగీర్‌దార్ల చేతిలో 10% నిజాం స్వంత ఖర్చులకొరకు మిగుల్చుకున్న సర్ఫేఖాస్ అను భూములు మిగిలిన 60% గద్వాల్, వనపర్తి, జటప్రోలు, అమరచింత, పాల్వంచ మొదలగు జమీందార్లు, ఇంకా ఈ నాందార్లు దేశ్‌ముఖ్ పటేల్ మొదలగు హోదాలు, గల్గిన భూస్వాముల చేతుల్లో వుండేవి. జన్నారెడ్డి, ప్రతాపరెడ్డి మొదలగు భూస్వాములకు లక్షలాది ఎకరాలుండేవి. సూర్యాపేట దేశ్‌ముఖ్‌కు ఆనాడు 20,000 ఎకరాలుండేదట. వారు తమ భూములను కౌలుకిచ్చి రైతులను పీల్చి పిప్పి చేసేవారు.

**ఆర్థిక పరిస్థితులు :** సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితి కడుదుర్భరంగా వుండేది. భూస్వాములు, దేశ్‌ముఖ్‌లకు వెట్టి చాకిరీ చేస్తే తప్ప వారికి జీవనోపాధి లేదు. నీ కాళ్ళు మొక్కుతా, నీ బాంచన్ని దొరా అని వారికి వెట్టి చాకిరీ చేస్తూ హీనాతిహీనంగా జీవించేవారు.

**నాగు అను వడ్డీ వ్యాపారం :** కడు దరిద్రులైన రైతులు, సామాన్య ప్రజానీకం వెట్టి చాకిరీ చేసినా కడుపునిండక బాకీలు పడుతుండేవారు. ఆనాడు నిజాం రాజ్యంలో వడ్డీ వ్యాపారాన్ని నాగి అనేవారు. దాని ప్రకారం ఒక బస్తా ధాన్యం అప్పు తీసుకుంటే ఆరునెలల తరువాత అప్పుదారునికి 1 1/2 బస్తాలు చెల్లించవలెను. అనగా సం॥నికి బస్తాకు బస్తా వడ్డీ అయ్యేది. ఆ బాకీ తీర్చడం ఆ వ్యక్తి తరం అయ్యేదికాదు. ఆ వడ్డీ తీర్చటానికి వెట్టి చాకిరీ చేస్తూ వుండేవాడు.

**నిజాం ఆంధ్ర మహాసభలు :** ఆంధ్ర భాషాభివృద్ధికై ఏర్పడిన ఆంధ్ర మహాసభ రైతుల స్థితిగతులు మెరుగుపరచుటకు వెట్టిచాకిరీని, నిర్మూలించడానికి ప్రయత్నిస్తూ రాజకీయ సభగా మారింది. దీనిలో కమ్యూనిస్టులు ప్రవేశించి, దానిని కమ్యూనిస్టు సభలుగా మార్చారు. మితవాద భావాలు కలిగిన మాడపాటి హనుమంతరావు మొదలగువారు ఆంధ్ర మహాసభని విడిచి స్టేట్ కాంగ్రెస్‌లో చేరడంతో ఈ సభ కమ్యూనిస్టుల వశమయింది.

## 15.13 కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావం :

రజాకారులు, కాశిం రజ్వీ ఆధ్వర్యంలో దమనకాండ సాగిస్తున్న సమయంలోనే కమ్యూనిస్ట్ పార్టీ తెలంగాణా ప్రాంతంలోని గ్రామీణ ప్రజానీకాన్ని ఆకట్టుకొని పటిష్టమవడం ఆరంభమయింది. కామ్రేడ్స్ అసోసియేషన్ 1940 లో నెలకొల్పబడింది. ఆచార్య రంగా ఆధ్వర్యంలో కంకిపాడులో 1939 లో నడిచిన రాజకీయ పాఠశాలలో రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, పి. హనుమయ్య అధ్యయనం చేసారు. వీరు, ఇతర ప్రముఖ నాయకులయిన మక్దూం మొయినుద్దీన్, రాజబహదూర్ గౌడ్, ఆల్వార్‌స్వామి, ఆంధ్రా కమ్యూనిస్టు పార్టీ నాయకులయిన పుచ్చలపల్లి సుందరయ్యతో సంప్రదించి కార్యక్రమాలు చేపట్టేవారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని 1944 లోనే ఆరంభించారు. అక్టోబరు 1946 నుంచి ఉద్యమాన్ని తీవ్రతరం చేసి వరంగల్లు జిల్లాలోని జనగాం తాలూకాలోనూ, నల్గొండ జిల్లాలోని భోనగిరి తాలూకాలోనూ ఉధృత రూపంలో సాగించారు. నిజాం స్టేట్ రైల్వే ఉద్యోగుల సమ్మె, ఉస్మాద్ షాహీ ఆజాం జాహీ మిల్లు ఉద్యోగుల సమ్మెలకు కారణం కమ్యూనిస్టుల మద్దతే. మొదటగా హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్‌తో కలిసి, గ్రామాలలో ఆధిపత్యానికై పార్టీ కృషి చేసింది. గ్రామప్రాంతాలలో వాలంటీర్ల దళాలను నెలకొలిపి, సుంకపు ఠాణాలను (కస్టమ్స్ హౌసెస్) పడగొట్టడం, ధనవంతులనుంచి లెవీలను వసూలు చేయడం ఆరంభించారు. ఒక గ్రామాన్ని వశపరచుకోగానే అక్కడ జండాని ప్రతిష్టించేవారు. రజాకార్ల అమానుషకృత్యాలు ఎక్కువ అవుతున్నప్పుడు, గ్రామీణులు కమ్యూనిస్టులను ఆహ్వానించి, నాయకత్వం వహించమని కోరడం జరిగింది.

## 15.14 పోరాట ఘట్టాలు :

తెలంగాణాలో కమ్యూనిస్టులు సాయుధ పోరాటానికి పిలుపు నివ్వకముందే భూస్వాములు పెట్టు బాధలు పడలేక రైతులు చెదురుమదురుగా భూస్వాములను ఎదిరించారు. 1936-44 సంవత్సరముల మధ్య అటువంటి సంఘటనలు కొన్ని జరిగాయి. 1936 లో ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి కొలనుపాకలో జాగీర్దారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. 1944 లో భువనగిరిలోని

రైతులు నాగువడ్డీని చెల్లించుటకు నిరాకరించారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి సహాయంతో దావూద్‌రెడ్డి జనగాం తాలూకాలోని విసునూర్ గ్రామ దేశ్‌ముఖ్‌పై తిరుగుబాటుచేసి, అతని భూమిని, పరిసరాలలోని బంజరు భూమిని ఆక్రమించాడు. దావూద్ రెడ్డికి అండగా నిలచిన రామచంద్రారెడ్డిని భూస్వాములు చంప ప్రయత్నించారు. కాని అది ఫలించలేదు. అట్లే ముంద్రాయి గ్రామానికి చెందిన పెద్ద భూస్వామి అయిన కతారి రామచంద్రరావు గ్రామంలోని లంబాడీల భూమిని హరించాడు. పొరుగు గ్రామాల ప్రజలు భూస్వాములను ఎదిరించి లంబాడీల పొలాన్ని కాపాడారు.

ఇట్టి స్థితిలో నల్గొండ జిల్లా జనగాం తాలూకాలో గల పాలవర్తి వద్ద ఒక సంఘటన జరిగింది. పోలమ్మ అను రజకస్త్రీకి చెందిన భూమిని రామచంద్రారెడ్డి అను దేశ్‌ముఖ్ ఆక్రమించాడు. కమ్యూనిస్టులు పోలమ్మకు మద్దతునిచ్చి, పోలమ్మ పొలం కాపాడారు. కమ్యూనిస్టులు మొదటిసారిగా ఈ సంఘటనలో పాల్గొని, తెలంగాణాలో సాయుధపోరాటానికి నాంది పలికారు. పరాజయం పొందిన రామచంద్రారెడ్డి పోలీసులతో తిరిగివచ్చి ఉద్యమకారులపై కాల్పులు జరిపించగా దొడ్డి కొమరయ్య అను కామ్రేడ్ మరణించాడు. ఈ వార్త నల్గొండ, వరంగల్లు, ఖమ్మం మొదలగు అన్ని జిల్లాలకు వ్యాపించింది. అన్ని గ్రామాలలోని రైతులు భూస్వాములను సాంఘిక బహిష్కరణ చేశారు. భూస్వాముల దాడులనుంచి తమ్ముతాము రక్షించుకొనుటకు గ్రామ రక్షణ సంఘాలుగా ఏర్పడి కర్రసాము మొదలగు, ఆత్మరక్షణ విద్యలు నేర్చారు. ఈ గ్రామ సంఘాలను కమ్యూనిస్టు నాయకులు నడిపారు.

## 15.15 ప్రభుత్వ అణచివేత :

ఉద్యమం తీవ్రరూపం దాల్చడంతో నిజాం ప్రధానమంత్రి సర్ మీర్జా ఇస్మాయిల్ నూతన ఆయుధాలను సమకూర్చుకొని, పోలీసు దళాలను ఉద్యమకారులపై పంపాడు. పన్నులు చెల్లించలేదని మాచిరెడ్డిపల్లి, ఆకునూరు ప్రజలను నిజాం పోలీసులు హింసించి, హిందూస్త్రీలపై అత్యాచారాలు జరిపారు. పోలీసుల దురంతాలను పద్మజానాయుడు గాంధీకి తెలియజేశారు. అక్టోబరు 1946లో బాలెముల గ్రామంపైన, నవంబరులో సూర్యాపేట, పులిగిరి, దేవకుప్పల కామారెడ్డి గూడెంలపైన, డిశంబరులో మల్లారెడ్డిగూడెం పైన పోలీసులు దాడులుచేసి నరసాని నరసయ్య, మందడి సోమిరెడ్డి, గోలి సాపిరెడ్డి మొదలగు కామ్రేడులను కాల్చి చంపారు. అనేకమందిని హింసించారు. డిశంబరు 1946 నాటికి ఒక్క నల్గొండ జిల్లాలోనే 390 మంది రైతులు చంపబడ్డారు. 64 మంది స్త్రీలు అత్యాచారానికి గురైనారు. ఒకవైపు భూస్వాములను, మరొకవైపు నిజాం పోలీసుదళాన్ని కమ్యూనిస్టులు ఒకేసారి ఎదిరించవలసి వచ్చింది.

## 15.16 సాయుధపోరాటం - విజయాలు :

భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వబడునని తెలియగానే, నిజాం నవాబు జూన్ 12, 1947 న తాను సర్వస్వతంత్రుడుగా మూడో రాజ్యంగా ఉంటానని ప్రకటించాడు. భారత్, పాకిస్థాన్ రాజ్యాలలో చేరక, స్వతంత్ర రాజ్యంగా కొనసాగాలని భావించాడు. తన అధికారాన్ని సుస్థిరం చేసుకొనే నిమిత్తమై నిజాం కమ్యూనిస్టులపై దాడిని ఉధృతం చేశాడు. వారిపై రజాకార్లను ప్రోత్సహించాడు. రజాకార్లు ఒకవైపు కమ్యూనిస్టులపై దాడులు చేస్తూ, గ్రామాలను దోచుకుంటూ, హిందువులను హింసించసాగారు. అట్టి స్థితిలో కమ్యూనిస్టులు సెప్టెంబరు 11, 1947 వ తేదీన తెలంగాణాలో సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు.

కమ్యూనిస్టులు తమ పోరాట ఆశయాలను విధానాలను ఈ విధంగా ప్రకటించారు. అవి 1. భూస్వాముల, పోలీసుల రజాకార్ల వద్దనున్న ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం 2. భూస్వాముల భూమిని పేదలకు పంచడం 3. ప్రభుత్వ ఆఫీసులు, కోర్టులు బహిష్కరించడం 4. పన్నులు చెల్లించకుండా ప్రభుత్వాన్ని స్తంభింపచేయడం 5. ప్రజల రక్షణకై జిల్లా, ఫిర్కా గ్రామస్థాయిలలో రక్షణ దళాలను ఏర్పాటు చేయడం 6. జాతీయ జెండాని కమ్యూనిస్టు పతాకాన్ని ఎగురవేసి విముక్తి చెందినట్లు ప్రకటించడం మొదలయినవి.

కమ్యూనిస్టులు తమ ఆశయసాధనకు ఏకకాలంలో రజాకార్లను, భూస్వాములను, నిజాం పోలీసు దళాన్ని ఎదిరించి అనేక విజయాలు సాధించారు. కామ్రేడ్ ఎస్. భూపతిరెడ్డి, ఎ. ప్రభాకరరావుల నాయకత్వంలో జనవరి 1948 లో కరీంనగర్ జిల్లాలో అనేక విజయాలు సాధించారు. ఇల్లంతకుంట పోలీసు స్టేషన్‌పై మార్చి 12 న దాడిచేసి, ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. కృష్ణాగూడెం,

తాడికొండ, వెల్లకుదురు మొదలగు గ్రామాలలో కామ్రేడులు విజయాలు సాధించారు. వరంగల్లు జిల్లాలోని తిమ్మాపూర్, వల్లపూర్‌ల జాగీర్దారుడయిన అక్బరుపాషాకు సహాయంగా వచ్చిన రజాకార్లను పారద్రోలారు. బీచ్‌పల్లి, సోమారం, కొంకపాక మొదలగు గ్రామాల ప్రజలు జాగీర్దార్లను ఎదిరించారు. కమ్యూనిస్టులు వేలాది ఎకరాల భూమిని రైతులకు పంచి పెట్టారు.

## 15.17 విముక్తి ఉద్యమం :

స్టేట్ కాంగ్రెస్ ఒకవైపు, కమ్యూనిస్టులు మరోవైపు సాగిస్తున్న పోరాటాలతోబాటు, భారత ప్రభుత్వ పోలీసు చర్యవలన, తెలంగాణా నిజాం అధికారం నుండి విముక్తిచెంది, భారతదేశంలో విలీనమయింది.

1947 ఆగస్టు 7 వ తేదీన నిజాం ఇండియన్ యూనియన్‌లో చేరవలెనని పిలుపునిచ్చి స్టేట్ కాంగ్రెస్ హైదరాబాద్ దినోత్సవాన్ని జరిపింది. అందుకు ప్రభుత్వం రామానందతీర్థని, జమలాపురం కేశవరావుని, కృష్ణాచారి జోషిని, మాణిక్‌చంద్ పహాడేని పోలీసులు దారుణంగా కొట్టారు. దానితో ఉద్యమం తీవ్రమై అన్ని దిక్కులకు విస్తరించి స్త్రీలు యువకులు వేలాదిగా విముక్తి పోరాటంలో పాల్గొన్నారు.

**15.17.1 జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవం :** 1947 ఆగస్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున హైదరాబాదులో రామానంద తీర్థ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి జాతీయ పతాకావిష్కరణ చేయమని పిలుపునిచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ రామానందతీర్థకు బహూకరించిన జాతీయ పతాకాన్ని సుల్తాను బజారులో మోతీలాల్ మంత్రి ఆవిష్కరించారు. అట్లే సంస్థానం అంతటా స్త్రీ పురుష భేదం లేకుండా జాతీయపతాకాలు ఎగురవేసి ఊరేగింపులు, బహిరంగ సభలు జరిపారు. కృష్ణాచారి జోషి, మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు, బూర్గుల రామకృష్ణారావు, మేల్కొటే, రామానంద తీర్థ మొదలగు వారిని అరెస్టు చేసి, ప్రభుత్వం కర్ఫ్యూ విధించింది. అట్టి స్థితిలో కర్ఫ్యూను ధిక్కరించి, విమలాబాయ్ మేల్కొటే, ఊహాపాంగనీకర్, అహల్యాబాయి, జ్ఞానకుమారి హైడా మొదలగు స్త్రీలు ముందుకు వచ్చి జాతీయ పతాకాలు ఎగురవేసి లాఠీ దెబ్బలు తిన్నారు.

**15.17.2 కమ్యూనిస్టు పార్టీ పాత్ర :** కమ్యూనిస్టు నాయకులైన బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, కాళోజి, పి. హనుమంతరావు, దాశరథి, కోదాడ నారాయణరావు ఆంధ్రకమ్యూనిస్టు నాయకులైన పుచ్చలపల్లి సుందరయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు తమ పూర్తి సహకారాన్ని అందించారు. ఈ సందర్భంలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నిజాం ఉస్మాన్ అలీఖాన్ పై బాంబువేసి హత్యా ప్రయత్నం చేశాడు. ఈ ఉద్యమకాలంలో ప్రభుత్వం 21 వేల మందిని అరెస్టు చేసింది.

**15.17.3 రజాకారుల దురంతాలు :** హైదరాబాదు సంస్థానంలో 1927 లో నవాబు సదర్ అలీజంగ్ అధ్యక్షతన ముస్లింల హక్కులు రక్షించుటకు ఇత్తేహాదుల్ ముసల్మాన్ అను సంస్థకు నిజాం నవాబు అండదండలు ఉండేవి. 1940 లో ఈ సంస్థ శాఖలు నిజాం సంస్థానం అంతటా నెలకొల్పబడ్డాయి. దానికి అనుబంధంగా వాలంటీర్లదళం కూడా ఏర్పాటు చేయబడినది. వారు కాకీచొక్కా, కాకీపాంటు వేసుకొని మిలటరీ దళంవలె అభివృద్ధి చెందారు. ఈ సంస్థ ఒకవైపు ముస్లిం సంస్కృతిని కాపాడుతూ, నిజాం రాజ్యంలో జరుగు స్వాతంత్రోద్యమాన్ని వ్యతిరేకిస్తూ నిజాం ప్రభువుకు అండదండలుగా నిలబడింది. 1946 లో కాశిం రజ్వీ ఈ సంస్థకు అధ్యక్షుడు అయ్యాడు. అతడు 5 లక్షలమంది వాలంటీర్లను తయారుచేసి నిజాం రాజ్యాన్ని కాపాడుటకు నడుంకట్టాడు. అందుకతడు హిందువులపై, స్వాతంత్రోద్యమకారులపైన కమ్యూనిస్టులపైనా దురంతాలకు దిగాడు. రజాకార్లు గ్రామాలను దోచుకోవడం, స్త్రీలపై అత్యాచారాలు జరపటం, ఎదిరించిన వారిని హత్య చేయుటం మొదలగు దుర్మార్గాలకు పాల్పడ్డారు. అందువలన హైదరాబాద్ నగరంలో ఎవరి ప్రాణాలకూ భద్రత లేని భయంకర పరిస్థితులను రజాకార్లు సృష్టించారు. వారి బారినుండి ప్రజలను రక్షించుటకు అప్పటికే తెలంగాణాలో సాయుధపోరాటం ప్రారంభించిన కమ్యూనిస్టులు ఒకవైపు, కాంగ్రెస్ సంస్థ మరోవైపు పాటుపడ్డారు. గ్రామాలలోని ప్రజలు తేమనుతాము రక్షించుకొనుటకు ముఠాలుగా ఏర్పడి, రాత్రులు తమ గ్రామాల్ని కాపలా కాశారు.

**15.17.4 పత్రికలు నిర్వహించిన పాత్ర :** విముక్తి పోరాటంలో తెలంగాణా పత్రికలు సముచిత పాత్ర నిర్వహించాయి. "సారథి", హైదరాబాదు వారపత్రిక, "తెలుగుదేశం" "ఇమ్రోజ్" మొదలగు పత్రికలు నాటి పోలీసు దౌర్జన్యాలను, రజాకారుల దురంతాలను, ఖండించి, ప్రజలకు నైతిక బలాన్ని కలిగించాయి. పత్రికల ప్రచారంతో విముక్తి ఉద్యమం తారాస్థాయికి చేరింది.

**15.17.5 నిజాం వైఖరి :** ప్రజా ఉద్యమం ఒకవైపు, కమ్యూనిస్టుల సాయుధపోరాటం మరోవైపు రజాకార్ల దురంతాలు మరియొకవైపు నిజాం రాజ్యాన్ని కుదిపివేయుచుండగా, నిజాం తన ప్రజల పరిస్థితులను మెరుగుపరచుటద్వారా ప్రజాభిమానం పొందాల్సింది పోయి, ఉద్యమాన్ని ఎదుర్కోడానికి రజాకార్లపై ఆధారపడ్డారు. ఇతైహాదుల్ పార్టీకి తన పూర్తి సహకారాన్ని ఇచ్చి, వారు చేయు దురాగతాలను కొనసాగనిచ్చాడు. దానివలన తమ పరిస్థితి మెరుగుపడకపోగా, ఇంకా దిగజారింది. పాకిస్తాన్ సహాయం కొరకు ప్రయత్నించాడు. కాని జిన్నా తన అశక్తతను తెల్పాడు.

**15.17.6 యథాతథపు ఒడంబడిక (1947) :** అట్టి పరిస్థితిలో తను స్వతంత్రుడిగా కొనసాగ లేనని గ్రహించి, నిజాం భారతదేశంలో 1947 నవంబరు 29 న యథాతథపు ఒడంబడిక చేసుకున్నాడు. ఈ ఒప్పందం ప్రకారం 1. హైదరాబాద్ రాజ్యం ఇండియన్ యూనియన్‌తో అనుబంధరాజ్యంగా ఉంటుంది. 2. రాజ్య భవిష్యత్తు ప్రజలకు వదలివేయాలి. 3. ఒక సం॥లోపల హైదరాబాద్ భవిష్యత్తు నిర్ణయింపబడుతుంది. 4. నిజాం రాజ్యాన్ని పాకిస్థాన్‌లో విలీనం చేయరాదు. ఇండియా పాకిస్థాన్‌లకు యుద్ధం సంభవిస్తే తటస్థంగా వుండాలి. 5. హైదరాబాద్ రాజ్యరక్షణ, రవాణా, విదేశీ వ్యవహారాలు భారతదేశ పర్యవేక్షణలో ఉండాలి. 6. హైదరాబాద్ ఇండియన్ యూనియన్‌లో చేరు అంశంపై అవసరమైతే అంతర్జాతీయ సంస్థల పర్యవేక్షణలో ప్రజాభిప్రాయం సేకరింపవచ్చును. 7. స్టేట్ కాంగ్రెసు నాయకులందరిని విడుదల చేయాలి. 8. హైదరాబాద్ సంస్థానంలో రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటుచేసి ప్రజాప్రభుత్వాన్ని నెలకొల్పాలి. 9. ప్రజలకు సభా వాక్ స్వాతంత్ర్యాలు ఇవ్వవలెను. 10. ప్రజలపై ఎట్టి దౌర్జన్యాలు జరుగరాదు అను షరతులతో ఒడంబడిక చేసుకున్నారు. కాని ఈ ఒడంబడికను కాశీ రజ్వీ వ్యతిరేకించాడు. స్టేట్ కాంగ్రెస్ కమ్యూనిస్టులు ఈ ఒడంబడికను నిరసించారు.

**యథాతథపు ఒడంబడికను ఉల్లంఘించుట :** నిజాం తప్పనిసరి పరిస్థితులలో ఒడంబడికను చేసుకున్నాడే కాని దానియందు చిత్తశుద్ధిలేదు. కేవలం కాలవ్యవధిని సంపాదించి, ఆయుధాలు, విదేశీ సహాయం సంపాదించి ఇండియాను ప్రతిఘటించవలెననే ఉద్దేశ్యమే అంతరంగంలో ఉంది. దాని ప్రకారమే అతడు నడచుకొని ఒడంబడికను ఉల్లంఘించే చర్యలకు పాల్పడ్డారు 1. 1947 డిశంబరు 18 న జరిగిన ఎన్నికలలో లాయక్ ఆలీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాడు 2. కాని స్టేట్ కాంగ్రెసుకు ప్రాతినిధ్యం ఇవ్వలేదు. రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటుచేయలేదు. 3. పాకిస్థాన్ సహాయం కొరకు రహస్యంగా లాయక్ ఆలీని పంపాడు. 20 కోట్ల రూపాయల హైదరాబాద్ సంస్థాన ఆస్తులను పాకిస్థాన్‌కు ఇచ్చాడు. 4. నవీన ఆయుధాలు కొనుటకు అమెరికా, ఇంగ్లాండ్, పోర్చుగల్ మొ॥ ఐరోపా రాజ్యాలకు తన ప్రతినిధులను పంపాడు. 5. గోల్కొండ వద్ద ఖాదర్‌బాగ్, మోతీమహల్‌ల వద్ద స్వయంగా ఆయుధాల ఫ్యాక్టరీని స్థాపించాడు. 6. గోవా రేవుతోను హకింపేట విమానాశ్రయాలతో దక్కన్ ఎయిర్‌లైన్స్‌తోను సంబంధాలు పెట్టుకున్నాడు. 7. భారత కరెన్సీ తన రాజ్యంలో చెల్లదనీ ప్రకటించాడు. 8. ప్రజల రక్షణకు చర్యలు తీసుకొనలేదు.

**15.17.7 కె.ఎమ్. మున్షీ రాయబారం :** ఒడంబడిక షరతులను ఉల్లంఘించినందుకు, భారత ప్రభుత్వం కె.ఎం. మున్షీని సంప్రదింపులకు పంపింది. మున్షీ రజాకార్ల, కమ్యూనిస్టుల దురాగతాలు అరికట్టమని కోరాడు. గవర్నర్ జనరల్ మౌంట్‌బాటిన్ గూడా శాంతి భద్రతలు కాపాడమని నిజాంను కోరాడు. కాని అవన్నీ వ్యర్థమైనవి. భారతదేశ ంవలన తనకు భయం లేదనుకొని నిజాం నిర్భయంగా కమ్యూనిస్టులను ప్రజలను అణచడానికి పెద్దఎత్తున దాడులు ప్రారంభించాడు.

**15.17.8 రజాకార్లకు మద్దతు :** అంతేగాక రజాకార్లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాడు. ఆయుధాలు సేకరించుటకు వారికి 5 కోట్ల రూపాయలు ఇచ్చాడు. వారి ఇష్టారాజ్యంగా దోపిడీలు, మానభంగాలు చేయసాగారు. 1948 జనవరి 19 న బీబీనగర్ రైల్వే స్టేషన్‌పై దాడిచేసి అడ్డగించిన వారిని స్త్రీలను పసిపిల్లలను వదించి దోచుకున్నారు. వారి దురాగతాలు పత్రికలో వ్రాసినందుకు 1948 ఆగస్టు 21 న బూర్గుల వారి

ఇంటినుండి వచ్చు ఇమ్రోజ్ పత్రిక సంపాదకుడైన షోయబుల్లా ఖాన్‌ను వధించారు. గ్రామాలను దోచుకొనారంభించారు. భువనగిరి, మీనవోలు, పాతర్లపహాడ్, కూటిగల్లు, గుండ్రంపల్లి, బెహరాంపల్లి, మహబూబ్‌నగర్, వరంగల్లు, ఖమ్మం జిల్లాలలో అనేక గ్రామాలపై దాడులు చేసి, వేలాది అమాయక ప్రజలను వధించారు. గ్రామ ప్రజలు తమను తాము రక్షించుకోడానికి, దళాలుగా ఏర్పడి, రజాకార్లను ప్రతిఘటించారు. రజాకార్ల దురంతాలను గర్హిస్తూ హైదరాబాద్‌లోని వర్తకులు, లాయర్లు తమ వృత్తులు వదలివేశారు. అదే సమయంలో కమ్యూనిస్టుల సాయుధదళాలు గెరిల్లా దళాలు. నిజాం బలగాలను ఓడించి 3000 గ్రామాలను విముక్తిచేసి 12 లక్షల ఎకరాలను పంచిపెట్టించారు. నిజాం పరిపాలనా యంత్రాంగం స్తంభించిపోయింది. నిజాం అధికారం కుప్పకూలిపోయింది.

ఇట్టిస్థితిలో కాశిం రజ్వీ ఛలోఢిల్లీ అను నినాదం చేసి ఢిల్లీ ఎర్రకోటపై అసఫ్‌జాహీ పతాకం ఎగురవేయగలమని ప్రకటించాడు. నెహ్రూ, పటేల్‌లను దూషించాడు.

నిజాం సైనిక సహాయాల కొరకు లైకాలిని పాకిస్తాన్‌కి పంపాడు. ఇంగ్లండు, అమెరికాలకు తన దూతను పంపాడు. ఐక్యరాజ్యసభలో ఫిర్యాదు చేయుటకు 1948 సెప్టెంబరు 10 వ తేదీన మెయిన్ నవాజ్‌జంగ్ నాయకత్వంలో ఒక బృందాన్ని పంపాడు. అదేరోజున నిజాం నవాబును రజాకార్ల చర్యలను నిషేధింపమనికోరుతూ వి.పి. మీనన్‌ను హైదరాబాద్ పంపింది. నిజాం సమాధానం ఇవ్వలేదు, కాని ప్రధానమంత్రి లాయక్ ఆలీ నిజాం రాజ్యం సర్వస్వతంత్రరాజ్యమని తన ఇష్టానుసారంగా నడచుకుంటుందని సమాధానం చెప్పాడు.

## 15.18 భారత ప్రభుత్వ పోలీసుచర్య (1948) - హైదరాబాదురాష్ట్రం ఇండియన్ యూనియన్‌లో చేర్చుట :

ఇట్టిస్థితిలో నిజాంను లొంగదీయుట ఒక్కటే మార్గమని భారత ప్రభుత్వం భావించింది. ఆ సందర్భంలో సర్దార్ పటేల్ హైదరాబాద్ భారతదేశ గర్భంలో రాచపుండు అని వ్యాఖ్యానించాడు. అందువలన సెప్టెంబరు 13 వ తేదీన జనరల్ జె.ఎన్. చౌదరి నాయకత్వంలో భారతసేనలు హైదరాబాద్‌ను చుట్టుముట్టాయి. స్టేట్ కాంగ్రెసు విమోచన దళాలు భారత సైన్యానికి స్వాగతం పలికాయి. నిజాం సైన్యం భారత దళాలను ప్రతిఘటించి, సులభంగా ఓడిపోయింది. 1948 సెప్టెంబరు 17 వ తేదీన నిజాం లొంగిపోయాడు. అతని ప్రధాని లాయక్ ఆలీ రాజీనామా చేసి పాకిస్తాన్ వెళ్ళిపోయాడు. సెప్టెంబరు 22 న నిజాం టెలిగ్రాం ద్వారా ఐక్యరాజ్యసమితికి తానుచేసిన ఫిర్యాదును ఉపసంహరించుకున్నాడు. ఈ విధంగా 14 నెలల విముక్తి పోరాటం తరువాత నిజాం ప్రజలు నిరంకుశ పాలన నుండి విముక్తి చెందారు.

జె.ఎన్. చౌదరి 1949 డిశంబరు వరకు హైదరాబాదు రాజ్యానికి సైనిక పాలకునిగా కొనసాగి రజాకార్లను అణచివేశాడు. కమ్యూనిస్టు పార్టీ నిషేధింపబడింది. హైదరాబాద్ రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పాడు. ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు.

1950 జనవరిలో సైనిక పాలనను తొలగించి, ఐ.సి.యస్. అధికారి ఎమ్.కె. వెల్లొడిని హైదరాబాద్ ముఖ్యమంత్రిగా నియమించాడు. రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు చేయబడింది. తరువాత 1952 మార్చిలో ప్రథమ సార్వత్రిక ఎన్నికలు జరిగి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యారు. నిజాం రాజ్యం బి. తరగతి రాష్ట్రంగా ఏర్పడి, నిజాం ఉస్మాన్ ఆలీఖాన్ రాజ ప్రముఖ్‌గా నియమించబడ్డాడు. ఈ విధంగా సాగిన నిజాం రాజ్య విముక్తి ఉద్యమం ఆధునిక ఆంధ్రదేశ చరిత్రలో ఒక ప్రముఖ ఘట్టం అయింది.

## 15.19 సారాంశము :

హైదరాబాదు సంస్థానంలో సాంస్కృతిక పునరుజ్జీవనం జరిగి, స్వాతంత్ర్యోద్యమంలో కలసి, నిజాం నిరంకుశ అధికారాన్ని ఎదిరించి, స్వతంత్ర ప్రజారాజ్యంగా ఏర్పడి చివరకు భారత యూనియన్‌లో విలీనమయింది.

## 15.20 వ్యాసరూప ప్రశ్నలు :

1. హైదరాబాదు సంస్థానంలో ప్రజలు చైతన్యవంతులు కావడానికి దోహదం చేసిన పరిస్థితులను తెలుపుము.
2. హైదరాబాదులో ఆంధ్రమహాసభ ఏర్పాటును, దాని కృషిని వివరింపుము.
3. హైదరాబాదు స్టేట్ కాంగ్రెస్ నిర్వహించిన పాత్రను వివరించుము.
4. కమ్యూనిస్టుల సాయుధ పోరాటం గురించి ఒక వ్యాసం వ్రాయుము.
5. నిజాంకి వ్యతిరేకంగా సాగిన విముక్తి ఉద్యమాన్ని వర్ణించుము.
6. హైదరాబాదు సంస్థానం ఇండియన్ యూనియన్‌లో చేరిన విధానం తెలియజేయండి.

## 15.21 ఉపయుక్త గ్రంథాలు :


1. Narayana Rao, K.V : The Emergence of Andhra Pradesh
2. Sarojini Regani : Highlights of The Freedom Movement in Andhra Pradesh.
3. Venkatarangaiah, M.(Ed) : The Freedom Struggle in Hyderabad State Vol. I-IV
4. Sarojini Regani : ఆంధ్రలో స్వాతంత్రోద్యమ చరిత్ర
5. P.R. Rao : Hritory of Modern Andhra Pradesh.

పాఠం : 16

# ఆంధ్రోద్యమం

విషయ క్రమం


16.1 పరిచయం
16.2 మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల స్థితిగతులు
16.3 భావనా దశ
16.4 ఉద్యమానికి దోహదం చేసిన పరిస్థితులు
16.5 నిడదవోలు సమావేశం
16.6 బాపట్ల ప్రథమాంధ్ర మహాసభ
16.7 రెండవ ఆంధ్రసభ - విజయవాడ
16.8 విశాఖపట్నం - గుంటూరు జిల్లాల సభలు
16.9 మూడవ ఆంధ్ర మహాసభ - విశాఖపట్టణం
16.10 నాల్గవ ఆంధ్ర మహాసభ - కాకినాడ
16.11 ఐదవ మహాసభ - నెల్లూరు
16.12 ఆంధ్ర మహాసభ రాయబారం
16.13 ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెస్ సంఘం ఏర్పాటు
16.14 మరుగున పడిన దశ 1920-30
16.14.1 జస్టిస్ పార్టీ వైఖరి
16.14.2 శాసనసభలో తీర్మానం
16.14.3 సైమన్ కమీషన్ బహిష్కరణ
16.14.4 మోతీలాల్ నెహ్రూ కమిటీ
16.14.5 లండన్‌కు రాయబారాలు
16.15 రాయలసీమ సభలు
16.16 విజయవాడ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సభ
16.17 రాయలసీమలో మరల సభలు
16.18 ఆంధ్ర రాష్ట్రోద్యమం 1937 - 44
16.19 బెజవాడ రజతోత్సవ ఆంధ్రమహాసభ
16.20 శ్రీబాగ్ ఒప్పందం
16.21 మద్రాసు శాసనసభలో తీర్మానం
16.22 స్తబ్దత

16.23 సర్ విజయ
16.24 రాయలసీమ సభలు
16.25 స్వాతంత్ర్యానంతర ఆందోళన
16.26 థార్ కమీషన్
16.27 జె.వి.పి. కమిటీ
16.28 విభజన సంఘం
16.29 ప్రకాశం అసమ్మతి
16.30 స్వామి సీతారాం అమరణ దీక్ష
16.31 1952 ఎన్నికలు - కాంగ్రెస్ ఓటమి
16.32 పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ
16.33 కైలాసనాథ్ వాంచూ కమిటీ
16.34 ఆంధ్రరాష్ట్ర అవతరణ
16.35 సమీక్ష
16.36 వ్యాసప్రశ్నలు
16.37 ఉపయుక్త గ్రంధాలు
16.38 ఆంధ్ర మహాసభలు - అధ్యక్షులు

## 16.0 లక్ష్యం :

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ, నడిపిన ఉద్యమాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 16.1 పరిచయం :

బ్రిటిష్ పరిపాలనలో భిన్న భాషా సంస్కృతులకు చెందిన ప్రజలు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండడం జరిగింది. స్థానికులుగా ఉండడంవలన తమిళులకి ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. ప్రత్యేక సంస్కృతి గల తమకు, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని ఆంధ్రులు ఉద్యమాన్ని 1913 లో ఆరంభించారు. రాష్ట్రసిద్ధి 1953 లో జరిగింది.

## 16.2 మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రుల స్థితిగతులు :

మద్రాసు ప్రెసిడెన్సీలోని భూభాగంలో 80 వేల చ. మైళ్ళ విస్తీర్ణంతో 58% ఆంధ్ర ప్రాంతాలుండేవి. ఆంధ్ర జనాభా రెండు కోట్లుండేది. మద్రాసు రాష్ట్రపు మొత్తం జనాభాలో తెలుగువారు 40% వుండేవారు. తమిళ, కన్నడ, మళయాళ ప్రాంతాలతో పోల్చితే ఆంధ్రులది ప్రథమస్థానం. కాని రాష్ట్రంలో వారికి తగిన గౌరవమర్యాదలు లేవు. ఆంధ్రులకు ప్రత్యేక గుర్తింపు లేదు. తమిళులతో పోల్చితే తెలుగువారు చాలా వెనుకబడి వున్నారు. ఆంధ్రదేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యతనివ్వలేదు. ప్రభుత్వ ఉద్యోగాలలో, సైన్యంలో, విద్యారంగంలో ఆంధ్రులకు సముచిత స్థానం లేదు. 1911 లెక్కల ప్రకారం మద్రాసు రాష్ట్రంలోని 56 మంది ఉన్నతోద్యోగులలో 8 మంది మాత్రమే తెలుగువారు. 19 మంది న్యాయమూర్తులలో ఆంధ్రుడు ఒక్కడు కూడా లేడు. నల్గురు సబ్ కలెక్టర్‌లలో ఒకరు; 60 మంది డిప్యూటి కలెక్టర్లలో 21 మంది. 123 మంది డిస్ట్రిక్టు మున్సిఫ్‌లలో 30 మంది. 19 మంది జిల్లా రిజిస్ట్రార్‌లలో ఇద్దరు. 33 మంది విద్యాశాఖాధికారులలో 5 గురు మాత్రమే తెలుగువారుండేవారు. అంతేగాక గుంటూరు, బాపట్ల,

బందరు, రాజమండ్రి, విశాఖపట్టణం మొదలగు ప్రాంతాల కాలేజీల ప్రిన్సిపాల్స్‌గాను, హైస్కూళ్ళ హెడ్‌మాస్టర్లుగా తమిళులు నియమింపబడేవారు. తెలుగు ప్రాంతంలో గూడా తెలుగువారికి ఉన్నతోద్యోగాలు ఇచ్చేవారుకాదు. ఆంధ్రదేశంలో గవర్నమెంటు స్కూళ్ళు చాలా తక్కువ వుండేవి. క్రీ.శ. 1915 లో ప్రెసిడెన్సీ మొత్తంలో 31 కాలేజీలుండేవి. వాటిలో 8 మాత్రమే ఆంధ్రదేశంలో వుండేవి. సెకండరీ స్కూళ్ళు ఆంధ్రదేశంలో 163 మాత్రమే వుండేవి. ఇతర ప్రాంతాలలో 583 స్కూళ్ళుండేవి. మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీలు ఒక్కటి గూడా ఆంధ్రదేశంలో లేవు. పారిశ్రామిక పాఠశాలలు రాష్ట్రం మొత్తంలో 3800 వుండేవి. అందు కేవలం 400 మాత్రమే ఆంధ్రదేశంలో వుండేవి. ఆంధ్ర విద్యార్థులు వున్నత విద్యకై మద్రాసు వెళ్ళేవారు. కాని అందరికీ సీట్లు లభించేవి కావు. ఈ కాలంలో 11 వేల ఆంధ్ర విద్యార్థులుండేవారని నాటి లెక్కలు తెల్పుచున్నవి. వారిలో 2 వేలమంది మాత్రమే మద్రాసులో చదివారు. మిగిలిన 9 వేల మంది వేరే రాష్ట్రాలకు వెళ్ళి ఎంతో ఖర్చుపెట్టుకొని అనేక ఇబ్బందులు పడి చదువుకున్నారట. ముఖ్యంగా వృత్తి, సాంకేతిక విద్యలో సీట్లు లభించక ఆంధ్ర విద్యార్థులు అనేక అగచాట్లు పడేవారు. ఇక పరిశ్రమల విషయానికొస్తే రాష్ట్ర రాజధాని మద్రాసులోనే ఎక్కువ పరిశ్రమలు, కాలేజీలు కేంద్రీకృతమై వుండేవి. రైల్వేలు వేయడంలో గూడా తమిళదేశానికే అధిక ప్రాధాన్యతనివ్వబడింది. తమిళదేశంలోని అన్ని ప్రాంతాలు మద్రాసుతో కలుపుతూ రైల్వేమార్గ నిర్మాణాలు జరిగాయి. ఒక్కకోస్తా ప్రాంతాన్ని తప్ప మిగిలిన ప్రాంతాలను మద్రాసుతో అనుసంధానం చేయలేదు. కోస్తా లైను గూడా ఇంగ్లీషు వారు కలకత్తాను కలుపుతూ వారి ప్రయోజనాల కొరకు వేశారే తప్ప తెలుగువారి ఉపయోగం కొరకు వేసింది కాదు. నౌకాశ్రయంగా మద్రాసునే అభివృద్ధి చేశారు. కాని ఆంధ్రదేశంలోని మచిలీపట్నానికి, విశాఖపట్టణానికి ఎట్టి ప్రాముఖ్యతనివ్వలేదు. ఆంధ్రులు స్టీమర్లలోనే ప్రయాణించేవారు. పెద్ద ఓడలు ఆంధ్రరేవులలో లేనేలేవు. పారిశ్రామికంగా, విద్యాపరంగా తమిళదేశం బాగా అభివృద్ధి చెందింది. ఆంధ్రదేశం యేవిధంగాను అభివృద్ధికి నోచుకోలేదు. ఆంధ్రదేశం నుండి వచ్చే ఆదాయం ఎక్కువ. కాని సౌకర్యాలు తక్కువ. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, సాంఘిక, సంక్షేమ నీటిపారుదల, సహకారాది రంగాలలో ఆంధ్రప్రాంతానికి అన్యాయం జరుగుతుండేది. ఆంధ్రప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు నామమాత్రంగా చేపట్టేవారు. మద్రాసు రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో అధికభాగం తమిళ ప్రాంతం అభివృద్ధికి ఖర్చుచేసేవారు. అంతేగాక ఆంధ్రులు ఒకవైపు తమిళులచేత, మరియొక వైపు ఇంగ్లీషు వారిచేత అవహేళనకు గురి అవుతుండేవారు. వారి నిరసన భావాల వలన క్రమేపి ఆంధ్రులలో ఆత్మాభిమానం మేల్కొన్నది. అదే చివరకు ఆంధ్రోద్యమంగా మారింది. ప్రత్యేక రాష్ట్రంతోనే తాము అభివృద్ధి చెందగలమని, ఆంధ్రుల సంస్కృతి ప్రాభవం రక్షింపబడగలవని ఆంధ్రులు భావించారు. దాని ఫలితంగా ఆంధ్రోద్యమమని వ్యాఖ్యానించారు. పట్టాభి సీతారామయ్య ఇది ఉద్యోగాల కొరకు సాగించినది కాదని, ఆంధ్రులు తమ ప్రత్యేక ప్రతిపత్తిని పొందుటకు సాగించిన ఉద్యమమని, భారత జాతీయోద్యమానికి ఇది ఉపజాతీయోద్యమమని వ్యాఖ్యానించారు.

ఆంధ్ర రాష్ట్ర సముపార్జనకు జరిగిన ఆంధ్రోద్యమాన్ని నాలుగు దశలుగా విభజించవచ్చు. అవి : భావనా దశ (క్రీ.శ. 1900 - 1912), ప్రచార దశ (1913 - 1920), ఉద్యమం మరుగున పడిన దశ (క్రీ.శ. 1920 - 1934), ఆచరణ దశ (క్రీ.శ. 1935 - 53).

## 16.3 భావనా దశ క్రీ.శ. 1900 - 1912 :

ఆంధ్ర రాష్ట్రం అను భావం మొట్టమొదట క్రీ.శ. 1903 లో గుంటూరులో అంకురించింది. గుంటూరులో 1903 లో యంగ్‌మెన్ లిటరరీ అసోసియేషన్ లేక యువజన సాహితీ సమితి అను సంస్థను జొన్నావిత్తుల గురునాథం స్థాపించాడు. అతడు గుంటూరు క్రిస్టియన్ కాలేజీలో అధ్యాపకునిగా పనిచేసాడు. కురుపాం రాజాగారికి కార్యదర్శిగా కూడా పనిచేశాడు. తరువాత కేంద్ర శాసనమండలి సభ్యులుగా నియమింపబడ్డారు. ఈ సమితి మొట్టమొదటి సమావేశంలోనే అతడు ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావలెననే భావం వెలువరించాడు. ఆ తరువాత అతడు హిందూ పత్రికలో తెలుగువారి వెనుకబాటు తనంపై అనేక వ్యాసాలు వ్రాసి, ఆంధ్రోద్యమ భావనకు బీజం నాటాడు. ఉన్నవ లక్ష్మీనారాయణ, చల్లా శేషగిరిరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి మొదలగువారు ఈ సాహిత్య సమితిలో సభ్యులు. కొండా వెంకటప్పయ్య కూడా ఈ సమితి సమావేశాలకు హాజరయ్యేవారు. ఈ సమితి సమావేశాలు వింజమూరి భావనాచారి ఇంట్లో జరిగేవి.

బందరులో 1907 లో ఒక ఆంధ్రమహాసభను జరిపారు. ఈ సభకు నిజాం రాష్ట్రంలోని ఆంధ్రులు కూడా హాజరయ్యారు. పట్టాభి సీతారామయ్య ఈ సభలో ప్రముఖపాత్ర వహించారు.

## 16.4 ఉద్యమానికి దోహదం చేసిన పరిస్థితులు :

ఆంధ్రోద్యమానికి అనేక కారణాలు దోహదపడ్డాయి.

1. సాంఘిక సంస్కరణ ఉద్యమాలు ఆంధ్రులను చైతన్యవంతులుగా చేసాయి. ఆ చైతన్యమే మద్రాసు రాష్ట్రంలో తెలుగువారికి జరిగే అన్యాయాలను గ్రహించగల శక్తిని, ఎదిరించగల ఆత్మవిశ్వాసాన్ని కల్గించింది.

2. ఇరవైయ్యవ శతాబ్ద ఆరంభంలో ఆంధ్రదేశ చరిత్రపై జరిగిన పరిశోధనలు ప్రాచుర్యాన్ని పొందాయి. ఆంధ్రుల చరిత్రను విజ్ఞాన చంద్రికామండలి ప్రచురించింది. ఆంధ్రులు ఏ ఇతర జాతికన్నా తక్కువవారు కాదని, వారికీ గొప్ప వారసత్వం ఉన్నదని తెలియజెప్పింది. ఇది తెలిశాక ఆంధ్రులు తమ పూర్వ వైభవాన్ని పునరుద్ధరించుకోడానికి ప్రత్యేక రాష్ట్రం అవసరమని గుర్తించారు. దేశాభిమాని, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక మొదలగు తెలుగు పత్రికలు కూడా ఆంధ్రోద్యమంవైపు నడిపించాయి.

3. వందేమాతరం ఉద్యమం 1910 నుంచి క్షీణించింది. క్రీ.శ. 1911 లో బెంగాలు విభజన రద్దు చేయడంలో వందేమాతరం ఉద్యమం అంతమయింది. కాని బెంగాలీలు సాధించిన బెంగాలు విభజన రద్దు ఆంధ్రులకు ఉత్సాహాన్నిచ్చింది. జాతీయ రాజకీయాలలో ఏర్పడిన స్తబ్దత ఆంధ్రులను ఈ ఉద్యమంవైపు ప్రేరేపించింది.

4. ఇట్టి స్థితిలో దేశాభిమాని అనే ఆంగ్లో ఇండియన్ వారపత్రిక 19.1.1911 న ఒక పెద్ద సంపాదకీయం వ్రాస్తూ ఆంధ్రుల ప్రత్యేక సమస్యలను ప్రస్తావించింది. ఆ సమస్యలను ఆంధ్రులందరూ సమైక్యంగా ఆలోచించడానికి ఒక రాజకీయ సదస్సు ఏర్పాటు చేయడం మంచిదని సూచించింది. అప్పటినుండి పత్రికలలో ఆంధ్రరాష్ట్రాన్ని గురించి వ్యాసాలు వ్రాయడం ప్రారంభమయింది.

5. పత్రికలలో వ్యాసాలు : 1911, 1912 సంIIలలో దర్బారు, దేశాభిమాని పత్రికలలో చల్లాశేషగిరి రావు, ఎస్. నారాయణరావు వ్యాసాలు వ్రాశారు. జొన్నావిత్తుల గురునాథం ప్రత్యేక రాష్ట్ర నిర్మాణావశ్యకతను గురించి ఆంగ్లంలో కొన్ని వ్యాసాలు వ్రాశారు. 1911 డిశెంబర్ 12 వ తేదీన "ఆంధ్రకేసరి" పత్రికలో ఆంధ్రరాష్ట్రం కావాలని కోరడం జరిగింది.

తెలుగుభాష మాట్లాడేవారు 2 కోట్ల 10 లక్షలమంది వున్నారు. ఒక్క మద్రాసు రాష్ట్రంలోనే ఒక కోటి 50 లక్షలమంది ఆంధ్రులు వున్నారు. వీరికి సుదీర్ఘ చరిత్ర వుంది. దక్షిణాదిలో కంటే ఆంధ్రప్రాంతంలో విద్యాలయాలు చాలా తక్కువ. రాకపోకల సౌకర్యాలులేక ఆంధ్రులు ఉన్నత విద్యకు నోచుకోలేదు. ఆంధ్రులకు తెలివితేటలు తక్కువని కాదు. తగిన అవకాశాలు సమకూరిస్తే ప్రభుత్వంలో ఉన్నతోద్యోగ బాధ్యతలు నిర్వహించగలరు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడినట్లయితే ఆంధ్ర ప్రయోజనాలను పెంపొందించే విధంగా ఆ ప్రభుత్వం తగు చర్యలు తీసుకొనేందుకు సాధ్యపడుతుంది. అని 1912 జనవరి 31 దర్బార్ పత్రిక వ్రాసింది. 1912 లో ఆంధ్రపత్రిక ఉగాది సంచిక సంపాదకీయంలో కాశీనాధుని నాగేశ్వరరావు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు వాదనలను సమర్థిస్తూ ఇలా వ్రాశారు.

తరుణమాసన్నమైనప్పుడు చెన్నాపురి రాష్ట్రంలోని ఆంధ్ర మండలంబులు ప్రత్యేక రాష్ట్రముగ నేర్పాటు చేయుట ముఖ్యమని తోచుచున్నది. ఈ రాష్ట్ర నిర్మాణము వలన ఆంధ్రదేశంలోనొక ముఖ్యపట్టణ మేర్పడగలదు. ఇది భాషాభివృద్ధికిని, వాణిజ్యాభివృద్ధికిని నిలయము కాగలదు. అప్పుడు ఆంధ్రుల వెనుకబాటుతనం అంతరిస్తుంది. జాతీయ దృష్టి కలిగినవారు కొందరు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు, జాతీయ సమైక్యతకు హానికరమని అంటున్నారు. కాని ఆ వూహలో వాస్తవం లేదు, అని వ్రాస్తున్నారు.

చల్లా శేషగిరిరావు దేశాభిమాని పత్రికలో స్వరాష్ట్రంకోసం ఆందోళన ప్రారంభించాలని కోరారు. అంతేగాక రాష్ట్రం కావాలని కోరినంతమాత్రాన అది రాదని అందుకు సభలు, సమావేశాలు జరిపి తమ కోరికను ప్రభుత్వం దృష్టికి తేవాలని, కనుక మార్చి 22 వ తేదీన నిడదవోలులో జరగబోయే కృష్ణా, గుంటూరు మండల మహాసభలలో ఈ విషయాన్ని చర్చించాలని విజ్ఞప్తి చేశారు. అంతేగాక తెలుగు పత్రికలో ప్రపంచ రాజకీయాలకు ప్రాముఖ్యతను ఇవ్వకుండా ఆంధ్రుల మంచి చెడ్డలను గురించిన వార్తలపట్ల ఎక్కువ శ్రద్ధ చూపాలని కోరారు. చల్లా శేషగిరిరావు ఈ వ్యాసాన్ని 1912 ఫిబ్రవరి 24 వ తేదీన దేశాభిమాని పత్రికలో ప్రకటించారు. చల్లా శేషగిరిరావు మరియొక వ్యాసంలో హిందూ దేశపు సహాయ కార్యదర్శి అయిన సర్. టి. డబ్ల్యు. జహోల్డర్నెస్, రాష్ట్రములు భాషాభేదాలను

బట్టి దేశాన్ని విభజింపవలసి వుంటుందని కోరాడని వ్రాశారు. అట్లే సర్జాన్ స్ట్రాచి, జాన్ పుల్లర్, కర్జన్ ప్రభువులు కూడా రాష్ట్రాలను భాషా ప్రాతిపదికమీద, జాతి ప్రాతిపదికమీద ఏర్పాటు చేయటం మంచిదని అభిప్రాయపడ్డారని వివరించారు. ఇంకా ఆదేవ్యాసంలో చెన్నపురి ఆంధ్రదేశానికి వెలుపల వున్నదని అచట ఆంధ్రేతరుల అధికార ప్రాబల్యం అధికంగా వున్నదని అచట ఆంధ్రుల బుద్ధి వికాసాన్ని చూసేవారు లేక అది తుప్పుపట్టి పోవచున్నదని అందువలన కొంతకాలానికి ఆంధ్రజాతి అడుగంటిపోవునేమోనని భయం కలుగుచున్నదని కనుక ఆంధ్రులకు నూతనోజ్జీవనం కలిగించటానికి ప్రత్యేక రాష్ట్రం అవసరమని ఉద్ఘాటించారు. ఈ విధంగా ఆనాటి ఆంధ్రోద్యమ వైతాళికులు ఆంధ్రులకు స్వరాష్ట్రం ఏర్పడితే ఆంధ్రభాషా సంస్కృతులు అభివృద్ధి చెందగలవని తమ అభిప్రాయాలను పత్రికలలో వ్యాసాలుగా వ్రాస్తూవుండేవారు. అట్టివారి వ్యాసాలు చర్చలు ఆంధ్రరాష్ట్రం అనే భావనకు బలాన్ని చేకూర్చాయి.

6. ఇదే సందర్భంలో 1911 లో ఒక రైలు ప్రయాణంలో ఒక తమిళుడు ప్రయాణం చేస్తూ కాలక్షేపంకొరకు తోటి తెలుగు ప్రయాణీకులతో సంభాషణ మొదలుపెట్టి ఆంధ్రులు వెనుకబడినవారని, భాష్యం అయ్యంగార్, ముత్తుస్వామి అయ్యంగార్ వంటి గొప్ప వ్యక్తులు తెలుగువారిలో లేరని అపహాస్యం చేశాడు.

7. అట్లే 1911 లో గుంటూరులోని ఒక న్యాయస్థానంలో ఒక డఫేదారీ ఉద్యోగానికి ప్రకటన వెలువడింది. ఆ ఉద్యోగానికి అనేకమంది తెలుగువారు దరఖాస్తు చేశారు. ఆ ఉద్యోగం ఇవ్వడానికి అధికారం గల్గిన సబ్‌జడ్జి తమిళుడు. అతడు తెలుగువారి దరఖాస్తులన్నింటిని తిరస్కరించి ఆ ఉద్యోగాన్ని తన స్వస్థలమైన కుంభకోణానికి చెందిన తమిళునకు ఇచ్చాడు. అది తెలిసి చాలామంది ముఖ్యంగా గుంటూరు సాహితీ సమితి సభ్యులు ఆగ్రహం చెందారు.

8. 1911 లోనే జోన్నావిత్తుల గురునాధం, ఉన్నవ లక్ష్మీనారాయణ మొదలైనవారు ఆంధ్రరాష్ట్రం అను గ్రంథాన్ని ప్రచురించారు. దానితోపాటే నిజాం, మైసూరు, కర్నాటక, మధ్య పరగణాలలోని తెలుగు ప్రాంతాలన్నింటిని కలిపే ఒక ఆంధ్ర రాష్ట్ర పటాన్ని తయారు చేశారు. ఇవన్నీ ఆంధ్రరాష్ట్ర భావనకు ఇంకా ధృఢత్వాన్ని కల్గించాయి.

## 16.5 నిడదవోలు సమావేశం 1912 మే నెల :

1912 మే నెలలో నిడదవోలులో కృష్ణా, గోదావరి జిల్లాల సంయుక్త సభలు జరిగాయి. ఆ సభలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని గురించి తీర్మానం ప్రవేశపెట్టాలని గుంటూరు జిల్లా ప్రతినిధులు ప్రయత్నించారు. సూర్యనారాయణ అనునతడు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాని అది ఆంధ్రులు అందరికీ చెందిన విషయం గనుక జిల్లా సమావేశంలో చర్చించడం తగదని ఆ తీర్మానాన్ని తిరస్కరించారు. సభ అయిపోయిన తరువాత గుంటూరు ప్రతినిధులు తిరిగి వచ్చి ఒక స్థాయీ సంఘాన్ని ఏర్పాటుచేసి కొండా వెంకటప్పయ్యని కార్యదర్శిగా నియమించారు. ఈ స్థాయి సంఘం ఆంధ్రరాష్ట్ర సమస్యను బాగా ప్రచారం చేసింది. 1912 సెప్టెంబరులో ఒక సర్క్యులర్‌ని జారీ చేసి 1913 మే 26 వ తేదీన బాపట్లలో ప్రథమాంధ్ర సభ జరుగుతుందని ప్రకటించారు. హైదరాబాదు, నాగపూరు మొదలగు ప్రాంతాలలోని ఆంధ్రులకు కూడా ఆహ్వానాలు పంపి బాపట్లలో సభ జరపడానికి సన్నాహాలు చేశారు.

ఈ విధంగా ఆరంభమయిన ఆంధ్రోద్యమం స్వాతంత్ర్య పూర్వమేగాక, స్వాతంత్రానంతరంకూడా సాగించవలసి వచ్చింది.

## 16.6 బాపట్ల ప్రథమాంధ్ర మహాసభ (1913) :

వారి కృషి ఫలితంగా 1913 మే నెల 26 వ తేదీన బాపట్లలో ప్రదమాంధ్ర మహాసభ బయ్యా నరసింహేశ్వరశర్మ అధ్యక్షతన జరిగింది. ఆహ్వానసంఘ అధ్యక్షులుగా వుండి కొండావెంకటప్పయ్య మహాసభ నిర్వహణ బాధ్యత వహించారు. యావదాంధ్రదేశం నుండి 800 మంది ప్రతినిధులు వచ్చి సభలో పాల్గొన్నారు. నిజాం సంస్థానం నుండి కూడా అనేకమంది తెలుగువారు సభకు హాజరయ్యారు.

సభాధ్యక్షత వహించిన బి.ఎన్. శర్మ ఇలా ప్రసంగించారు. భారతదేశంలోని జాతులలో ఆంధ్రజాతి గొప్ప స్థానాన్ని కల్గి వున్నదని, ఆంధ్ర సంఘాభివృద్ధికి కావలసిన అంశాలను గుర్తించి వారు ఆర్థికంగా, విద్యా విషయకంగా, పురోభివృద్ధి చెందునట్లు ఏర్పాటు

చేయాలని, తెలుగు వారినందరిని ఒకచోట కేంద్రీకరించి తెలుగువారి అభివృద్ధిని సాధించటం ఆంధ్ర మహాసభ విధి అని వివరించారు. అంతేకాక ఆంధ్రుల అభివృద్ధికి ఒక ఆంగ్లేయ దినపత్రిక అవసరమని, ఆంధ్రదేశంలో విశ్వవిద్యాలయాన్ని స్థాపించవలసిన అవసరం వున్నదని, కళాశాలలలోను పాఠశాలలలోను ఆంధ్ర భాషాభ్యాసం జరగాలని ఈ అంశాలను ఈ సభవారు బాగా చర్చించి తీర్మానించాలి అని కోరారు. అయితే ఆయన ఆంధ్రరాష్ట్రాన్ని సమర్థించలేదు. ముందు మనం భారతీయులం తరువాతనే తెలుగువారమని ఆయన జాతీయ భావానికే ప్రాధాన్యతనిచ్చారు.

ఈ సభలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యను గురించి అనుకూల ప్రతికూల వాదనలు జరిగాయి. తెలుగుజిల్లాలను కలిపి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని వేమవరపు రామదాసు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దానిని వల్లూరు సూర్యనారాయణ బలపరచారు. ఆ తీర్మానాన్ని న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్రరావు, గుత్తి కేశవపిళ్ళై, దేశపాండే సుబ్బారావు మొదలగు ప్రముఖులు వ్యతిరేకించారు. దత్త మండలాలవారు ప్రత్యేక ఆంధ్రారాష్ట్రానికి వ్యతిరేకమని కేశవపిళ్ళే, దేశపాండే సుబ్బారావు ప్రభృతులు ప్రసంగించారు.

ఈ తీర్మానాన్ని స్వదేశ సంస్థాన మాజీ దివాన్ - దివాన్ బహుదూర్ ఎం ఆదినారాయణయ్య వ్యతిరేకించి, రాబోవు సభకు ఆ అంశాన్ని వాయిదా వేయమని ఆయన కోరాడు. రావుసాహెబ్ గంటి వెంకటరామయ్య ఆయనను సమర్థించారు. అయితే ప్రజాభిప్రాయాన్ని సమీకరించేందుకు ఈ అంశాన్ని స్థాయి సంఘానికి నివేదించాలని వెంకటప్పయ్య సవరణన ప్రతిపాదించారు. దానిని అందరూ అంగీకరించారు.

ఈ సమయములోనే మే 28 వ తేదీన గుంటూరు మండల మహిళాసభ శ్రీమతి కొటికలపూడి సీతమ్మ అధ్యక్షతన జరిగింది. చోరగుడి సీతమ్మ ఆహ్వాన సంఘాధ్యక్షురాలిగా వ్యవహరించారు. కనుపర్తి వరలక్ష్మమ్మ, లక్ష్మీకాంతమ్మ ప్రభృతులు సభలో ప్రసంగించారు. 200 మంది మహిళలు సభకు హాజరయ్యారు.

సభ చివరలో ఆంధ్ర మహాసభకు కొండా వెంకటప్పయ్యని కార్యదర్శిగా, చల్లా శేషగిరిరావుని సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

**ప్రచార బృంద సభలు :**

బాపట్ల సభలో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు వచ్చిన వ్యతిరేకతను గ్రహించి రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు సాధించడానికి కొండా వెంకటప్పయ్య, డా॥ పట్టాభి, ముట్నూరి కృష్ణారావు, వల్లూరి సూర్యనారాయణ ఒక ప్రచార బృందంగా ఏర్పడి దత్త మండలాలు, కోస్తా ఆంధ్రప్రాంతాలు పర్యటించాలని నిర్ణయించారు.

**తెలుగు ప్రాంతాల పర్యటన :**

కొండా వెంకటప్పయ్య అధ్యక్షతన ఏర్పడిన సంఘం మొదట రాయలసీమను దర్శించారు. వారు నంధ్యాల, గుత్తి, అనంతపురం, హిందూపూర్, పెనుగొండ, బళ్ళారి, చిత్తూరు, కడప, నెల్లూరు మొదలగు ప్రదేశాలు దర్శించి అనేక బహిరంగ సభలు జరిపి ఆంధ్రరాష్ట్ర ఆవశ్యకతను గురించి వివరంగా ఉపన్యాసాలిచ్చారు. వారి పర్యటనలో రాయలసీమ ప్రజలు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు అనుకూలురని గ్రహించారు. చిత్తూరులో తమిళ లాయర్లు మాత్రం మద్రాసు పట్టణంతో తమకు సంబంధాలు తెగిపోతాయేమోనని భావించి ఆంధ్రరాష్ట్ర యేర్పాటును వ్యతిరేకించారు. తరువాత ఈ సంఘం ఉత్తరాంధ్రను పర్యటించింది. రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్టణం, బరంపురాలను దర్శించి బహిరంగ సభలలో ప్రసంగించారు. వారి పర్యటన వివరాలు కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రికలు ప్రచురించి ఆంధ్రరాష్ట్రాన్ని సమర్థించాయి. ఈ సమయంలో పట్టాభి సీతారామయ్య స్కాట్లాండు, ఐర్లండు ఉద్యమాలను ఉదహరించి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు దేశభక్తికి ఆటంకంకాదని హిందూపత్రికలో వ్యాసాలు వ్రాశారు.

## 16.7 రెండవ ఆంధ్రసభ - విజయవాడ క్రీ.శ. 1914 ఏప్రియల్ 11 వ తేదీ :

రెండవ ఆంధ్రసభ 1914 ఏప్రియల్ 11 వ తేదీన విజయవాడలో జరిగినది. ఈ సమావేశానికి ప్రజలు బాగా వచ్చారు. అంతేగాక కందుకూరి వీరేశలింగం, తిరుపతి వెంకట కవులు గూడా హాజరైనారు. రాజకీయనాయకులే గాక సాహిత్య, సాంఘిక రంగాల

నాయకులు కూడా హాజరయ్యారు. అయ్యంకి వెంకటరమణయ్య, పెద్దిభొట్ల వీరయ్యలు ప్రధానపాత్ర వహించారు. ఈ సభకు 1600 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశం నుండి ఆంధ్రసభలను ఆంధ్ర మహాసభలుగా వ్యవహరించారు. ఈ సభలో పురాణపండ వెంకట సుబ్బయ్య ఆహ్వానసంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సభకు న్యాపతి సుబ్బారావుగారు అధ్యక్షత వహించారు. ఆయన అధ్యక్షోపన్యాసం సభికులకు నచ్చలేదు. కారణమేమన 1913 బాపట్ల సమావేశం జరిగిన తరువాత కొండా వెంకటప్పయ్య నేతృత్వంలో తెలుగు జిల్లాలు పర్యటించి చేసిన ప్రసంగాలు వారు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆంధ్రప్రజలను ఒప్పించటానికి చేసిన కృషి ఊరికేపోలేదు. వారి కృషి ఫలించి చాలామంది ఆంధ్రరాష్ట్ర స్థాపనవైపు మొగ్గారు. కనుక రెండవ సభనాటికి ఆంధ్రుల అభిప్రాయం ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరుచున్నది. మారివున్న ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోకుండా సభికుల మనోభావాలకు వ్యతిరేకంగా న్యాపతి సుబ్బారావు చేసిన ప్రసంగం సభికులకు నచ్చలేదు. ఈ సభలో మంధా సూర్యనారాయణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయవలెనని తీర్మానం ప్రవేశ పెట్టారు. వేమవరపు రామదాసు పంతులు ఆ తీర్మానాన్ని బలపరచారు. కాని నెల్లూరు కడప జిల్లాల ప్రతినిధులు తీర్మానాన్ని వ్యతిరేకించారు. యస్. కృష్ణారావు, పట్టాభి రామారావులు తీర్మానాన్ని వాయిదా వేయమన్నారు. అయినా తరువాత ఓటింగు జరిగినది. అందు తీర్మానం పెద్ద మెజారిటీతో గెలిచింది. దానితో ప్రత్యేక ఆంధ్రోద్యమానికి జీవం వచ్చింది. గుంటూరు జిల్లా ప్రతినిధులు తమకృషి ఫలించినందుకు చాలా సంతోషించారు. ఆంధ్రరాష్ట్రం కావాలనే కోరికను, ఆంధ్రోద్యమాన్ని ఈ రెండవసభ బలపరచింది.

## 16.8 విశాఖపట్నం - గుంటూరు జిల్లాల సభలు - 1914 మే నెల :

• విజయవాడ సభ తరువాత విశాఖపట్నం జిల్లా సభ భూపతి వెంకటపతి రాజుగారి అధ్యక్షతన 1914 మే నెలలో జరిగింది. రాజు తన అధ్యక్షోపన్యాసంలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలని నాయకులందరూ అంగీకరించినందుకు తనకు చాలా సంతోషం కల్గినదని, ఒకసారి అంగీకరించామంటే అది ఆదర్శంగా మారినదని అర్థం అని, ఆదర్శాన్ని వాయిదా వేయరాదని, వాయిదావేస్తే అది అవివేకం అవుతుందని సభికులను కార్యోన్ముఖులను చేయడానికి ప్రయత్నించారు. క్రీ.శ. 1914 జూన్‌లో గుంటూరులో కూడా ఇటువంటి సభ జరిగినది. ఆ సమావేశంలో అందరూ ఏకగ్రీవంగా ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మొత్తంమీద 1914 సం॥ చివరికల్లా ఆంధ్ర జిల్లాలన్నింటిలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలనే వాంఛ ధృడపడినది. కొండా వెంకటప్పయ్య 1911 లో రచించిన ఆంధ్రోద్యమం, పట్టాభి సీతారామయ్య, కొపెల్ల హనుమంతరావు కలసి రచించిన 'ఆంధ్రరాష్ట్రం' అను గ్రంథం ప్రజలు ఆంధ్రోద్యమంలో పాల్గొనేటట్లు చేయడానికి బాగా ఉపయోగపడినవి. ఆంధ్రోద్యమానికి చేసిన కృషికిగాను కొండా వెంకటప్పయ్యకి ఆంధ్రోద్యమ పితామహుడు అని పేరు వచ్చింది. అంతేగాక ఒకవైపు ఈ నాయకుల ఉపన్యాసాలు, మరియొకవైపు పత్రికలలో ప్రచురితమయ్యే వ్యాసాలు, విశాఖపట్టణం, నెల్లూరు, బాపట్ల మొదలగు ప్రదేశాలలో జరిగిన సభలు ప్రజలలో ఆంధ్రారాష్ట్రం కావాలనే కోరికను బాగా బలపరచినవి. 1914 వరకు ఆంధ్రపత్రిక బొంబాయి నుండి వెలువడేది. 1914 లో మద్రాసుకు తరలింపబడి దినపత్రికగా మార్చబడింది. ఈ పత్రిక కాశీనాధుని నాగేశ్వరరావు సారధ్యంలో ఆంధ్రోద్యమానికి గొప్ప సేవ చేసింది. అట్లే ముట్నూరి కృష్ణారావు సంపాదకులుగా ఉన్న కృష్ణా పత్రిక గూడా సేవ చేసింది. అట్లే 1921 లో ప్రకాశం పంతులు స్థాపించిన స్వరాజ్య పత్రిక అనే ఇంగ్లీషు పత్రిక గూడా ఆంధ్రోద్యమానికి నిరుపమానమైన సేవచేసింది. ఈ పత్రిక ఆర్థిక యిబ్బందులను తట్టుకొంటూ 8 సం॥ లు నడిచింది. ఈ విధంగా తెలుగు పత్రికలు ఆంధ్రోద్యమానికి జీవం పోసినవి.

## 16.9 మూడవ ఆంధ్ర మహాసభ క్రీ.శ. 1915 మే నెల - విశాఖపట్టణం :

మూడవ ఆంధ్రమహాసభకు 1915 మే నెలలో విశాఖపట్టణంలో భూపతి వెంకటపతిరాజు ఆహ్వానసంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. పానుగల్లురాజా, పానుగంటి రామరాయణింగారిని సభాధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఆనాటి తెలుగు ప్రముఖులలో పానుగంటి రాజా చాలా ప్రముఖులు. అప్పటివరకు ఆయన ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి వ్యతిరేకులు. ఈ సభలో ఆయన ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సమర్థిస్తూ మాట్లాడారు. ఆయన సమర్థించడంతో ఆంధ్రరాష్ట్ర సమస్యకు మరింత బలం చేకూరినది. మద్రాసు రాష్ట్రంలోని 11 తెలుగుజిల్లాలను కలిపి ప్రత్యేక రాష్ట్రం ఏర్పరచడం న్యాయం అని, ఆవశ్యకత అనిగూడా తీర్మానించారు. ఈ సభలో

ఈ విధంగా కోరడమేగాక మరికొన్ని తీర్మానాలు చేశారు. సెకండరీ స్కూళ్ళలో మాతృభాషలో అనగా తెలుగు బోధనాభాషగా వుండవలెనని ఆంధ్రసభ సమావేశాలు తెలుగులోనే నిర్వహించవలెనని గూడా తీర్మానించారు. అప్పటినుండి అన్ని ఆంధ్రోద్యమ సభలలో తెలుగులోనే ప్రసంగించే ఆచారాన్ని అందరూ పాటించారు. మద్రాసు నుండి వెలువడే స్వదేశమిత్ర అను తమిళ దినపత్రిక మాతృభాషను బోధనాభాషగా చేయవలెనని ఈ సభచేసిన తీర్మానాన్ని బలపరుస్తూ వ్రాసింది.

## 16.10 నాల్గవ ఆంధ్రమహాసభ - 1916 మే నెల - కాకినాడ :

నాల్గవసభ 1916 మే నెలలో కాకినాడలో జరిగింది. ఈ సభకు ముట్నూరి కృష్ణారావు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. మోచర్ల రామచంద్రరావు గూడా న్యాపతి సుబ్బారావువలె ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి వ్యతిరేకులు. ఆయన ఈ సమావేశంలో ఆంధ్రరాష్ట్రాన్ని సమర్థించారు. ఆంధ్రరాష్ట్ర వ్యతిరేకులు చాలామంది రాష్ట్ర ఆవశ్యకతను గుర్తించి తమ అభిప్రాయాలను మార్చుకున్నారు. ఈ సభలో విశాఖపట్టణానికి చెందిన సి.వి.యస్. నరసింహరాజు తెలుగు జిల్లాలన్నింటిని కలిపి ఒక ప్రత్యేక స్వయంపాలనాధికారాలుగల రాష్ట్రం ఏర్పాటు చేయడం అవశ్యకం, హేతుబద్ధం అని తీర్మానాన్ని ప్రతిపాదించారు. అవి మొదటి ప్రపంచయుద్ధం జరిగే రోజులు. కనుక ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత వీలయినంత త్వరగా ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ప్రార్థించడమైనది అని మరియొక సవరణ చేశారు. ఈ తీర్మానాన్ని నెల్లూరువాసి అయిన ఎం.యస్. కృష్ణారావు, కడప వాస్తవ్యుడు నెమలి పట్టాభి రామారావులు వ్యతిరేకించారు. మూడు సంవత్సరాల క్రితం ప్రత్యేకరాష్ట్ర తీర్మానాన్ని వ్యతిరేకించిన బరంపురం వాస్తవ్యుడు గాదె రాఘవరావు ఈ తీర్మానాన్ని బలపరచారు. అనంతపురం ప్రతినిధి శంకరరావు గూడా బలపరచారు. తీర్మానం నెగ్గినది. ఈ సభలోనే సైనిక శాఖలలో ఆంధ్రులను చేర్చుకొనవలెనని సి.వి.యస్. నరసింహరాజు, ఎ.యస్. పాత్రో, కె. వెంకటరెడ్డినాయుడు మాట్లాడారు. దేశాన్ని భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పాటు చేయవలెనని ఒక విజ్ఞాపన పత్రాన్ని 1917 ఏప్రియల్ నెలలో ఆమోదించారు. బి.యన్. శర్మగారి నాయకత్వంలో ఆంధ్ర రాజకీయసమితి గూడా ఏర్పాటుచేయబడింది.

## 16.11 ఐదవ మహాసభ 1917 జూన్ 1 వ తేదీ - నెల్లూరు సభ :

ఐదవసభ సమావేశం 1917 జూన్ 1 వ తేదీన కొండా వెంకటప్పయ్య అధ్యక్షతన నెల్లూరులో జరిగినది. ఈ సమావేశానికి వస్తాదు కోడిరామమూర్తి హాజరయ్యారు. ఒంగోలు వెంకటరంగయ్యగారు ఆహ్వానసంఘ అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో తీవ్రస్థాయిలో చర్చలు జరిగినవి. రాయలసీమ, నెల్లూరు జిల్లాలవారు అంతగా ఆసక్తి చూపలేదు. మద్రాసు పట్టణం ఆంధ్రరాష్ట్రంలో చేరే అవకాశం లేదు. కనుక ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే తమకు మద్రాసు నగరంతో సంబంధాలు తెగిపోవునని వారి బాధ. కనుక నెల్లూరు జిల్లావారు రాష్ట్ర తీర్మానాన్ని బలపరచలేదు అట్లే రాయలసీమలో నాయకత్వం తమిళుల చేతిలో వుండేది. తమిళదేశం నుండి వలస వచ్చి గుత్తి, అనంతపురాలలో ప్రముఖుడైన కేశవపిళ్ళే నంద్యాల, కర్నూలులలో ప్రముఖుడైన ఏకాంబర్ అయ్యర్‌లు ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే తమ ఆధిక్యత పోతుందని ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించారు. అయితే కర్నూలుకు చెందిన హరిసర్వోత్తమరావు ప్రత్యేక రాష్ట్రాన్ని సమర్థించారు. నాల్గవ సభలో ప్రత్యేకరాష్ట్ర తీర్మానం నెగ్గడంతో ఈ సమావేశంలో ఎట్లయినా ప్రత్యేకరాష్ట్ర తీర్మానాన్ని ఓడించాలని నెల్లూరు జిల్లావారు గట్టిగా ప్రయత్నించారు. సభకు హాజరైన 740 మంది సభ్యులలో 480 మంది నెల్లూరువారు. అందుచేత తీర్మానం ఓడిపోయేటట్లుగా వున్నదని గ్రహించిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఓటింగు జిల్లాల ప్రాతిపదికన జరగాలని, అనగా ఒక్కొక్క జిల్లాకు ఒక్కొక్క ఓటు మాత్రమే వుంటుందని, ప్రకటించారు. అదే సమయానికి సర్కారు జిల్లాలనుండి పెద్దసంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. దానితో రాయలసీమ నెల్లూరువారు గూడా సర్వోత్తమరావు ప్రతిపాదనను అంగీకరించారు. ప్రత్యేకరాష్ట్ర తీర్మానం నెగ్గింది.

### నెల్లూరు టౌన్‌హాలు సమావేశం :

ప్రత్యేక రాష్ట్ర తీర్మానం నెగ్గినందుకు రాష్ట్ర వ్యతిరేకవాదులు నిరాశకు గురి అయినారు. వారు నెల్లూరు టౌన్‌హాలులో ప్రత్యేక సమావేశం జరిపి మద్రాసు నగరంతో కూడిన ఆంధ్రరాష్ట్రం అయితేనే తమకు సమ్మతం అని తీర్మానం చేశారు. బి.యన్.శర్మ,

మరికొందరు నాయకులు వారిని కలిసి వారి అనుమానాలు, సందేహాలు, అపోహలను తీర్చారు. అందువలన వారు మరురోజు సమావేశానికి హాజరయ్యారు. నెల్లూరు పట్టణ ప్రముఖులైన ఎ.యస్. కృష్ణారావు మరికొందరు ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించారు. అయినప్పటికి చివరకు రాష్ట్రం కావాలనే తీర్మానం విజయం సాధించింది. ఆంధ్రరాష్ట్రానికి మద్రాసు రాజధానిగా వుండవలెనని ప్రవేశపెట్టిన సవరణగూడా వీగిపోయింది. ఈ సమావేశంలో తీర్మానం నెగ్గినప్పటికి, రాయలసీమ సభ్యులు హృదయపూర్వకంగా రాష్ట్రాన్ని సమర్థించలేదని అర్థమయిపోయింది. కనుక రాయలసీమ ప్రజల అపోహలను తొలగించడం సర్కారు నాయకుల తక్షణ కర్తవ్యం అని గ్రహించారు.

## 16.12 ఆంధ్ర మహాసభ రాయబారం 1917 డిశంబర్ :

ఆ కాలంలో 1917 డిశంబర్‌లో మాంటెగూ - ఛెమ్స్‌ఫర్డు రాజ్యాంగ సంస్కరణల కమిటి భారతదేశం వచ్చింది. న్యాపతి సుబ్బారావు నాయకత్వంలో ఆంధ్రమహాసభ ప్రతినిధి వర్గంవారు మాంటేగూ చెమ్స్‌ఫర్డు కమిటి సభ్యులను కలుసుకున్నారు.

భారతదేశ రాష్ట్రాలను భాషా ప్రయుక్త ప్రాతిపదికపైన పునర్నిర్మాణం చేయాలని, మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలను ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఆంధ్ర మహాసభ రాయబార వర్గం, ఆ రాజ్యాంగ సంస్కరణల కమిటీకి విజ్ఞప్తి చేసింది. కాని ఆ కమిటీ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సిఫార్సు చేయలేదు.

### బి.ఎన్. శర్మ తీర్మానం :

కనుక 1918 ఫిబ్రవరి ఆరవ తేదీన బి.యస్. శర్మగారు భాషా రాష్ట్రాల నిర్మాణాల కొరకు ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దానిని రంగస్వామయ్యంగార్ బలపరిచారు. మహమ్మదాలీ జిన్నా, శ్రీనివాస శాస్త్రి మొదలైనవారు తీర్మానాన్ని వ్యతిరేకించారు. తీర్మానం వీగిపోయింది.

### ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెస్ సంఘం ఏర్పాటు :

జాతీయ కాంగ్రెస్ 1885 లో స్థాపించబడినప్పటి నుండి ఆంధ్రులు కాంగ్రెస్ సభలలో పాల్గొంటూ వచ్చారు. నాగపూర్ సభ 1891 లో జరగగా, దానికి తెలుగువారయిన పి. ఆనందాచార్యులు అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. గుత్తి కేశవపిళ్ళే కాంగ్రెస్ కార్యదర్శి అయ్యారు. 1914 లో మద్రాసులో జరిగిన కాంగ్రెసు సభలో ఆంధ్రులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని గురించి చర్చించడానికి ప్రయత్నించారు. దానిని తమిళులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళుల ధోరణి చూసిన తెలుగువారు తమకు ప్రత్యేక కాంగ్రెసు కమిటి ఉండాలని అట్టి సంఘం ఉంటే ఆంధ్రరాష్ట్ర స్థాపన కృషికి బాగా ఉపయోగపడుతుందని భావించారు. అట్టి సమయంలో 1917 డిశంబరులో కలకత్తా నగరంలో కాంగ్రెసు మహాసభ జరిగింది. ఆంధ్రప్రాంతం నుండి వెళ్ళిన కాంగ్రెసు ప్రతినిధులు భాషా ప్రాతిపదికపై ఆంధ్రకు, ఆంధ్ర కాంగ్రెసు సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. లోకమాన్య బాలగంగాధర తిలక్ వీరి కోర్కెను సమర్థించారు. ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెసు కమిటి ఏర్పాటుకు కాంగ్రెసు మహాసభ 1918 లో ఆమోదం తెల్పింది.

అప్పటివరకు మద్రాసు కాంగ్రెసు కమిటీలోనే కలిసి ఉన్న ఆంధ్ర కాంగ్రెస్‌ను వేరుచేసి, ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వాధికారం ఉన్నట్లయితే, అప్పుడే భాషా ప్రయుక్త రాష్ట్రాలను కూడా ఏర్పరచి ఉండేదని, అప్పట్లో ఆంధ్రోద్యమాన్ని నిర్వహిస్తూ ఉన్న డా॥ పట్టాభి, కొండా వెంకటప్పయ్య వంటి కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు.

1920 లో నాగపూర్‌లో సేలం విజయ రాఘవాచారి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ మహాసభలో భాషా ప్రయుక్త రాష్ట్ర సిద్ధాంతాన్ని ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఆ తీర్మానం ఆంధ్ర రాష్ట్రోద్యమానికి బలం చేకూర్చింది.

## 16.14 మరుగున పడిన దశ 1920-30 :

1920 నుండి గాంధీ కాంగ్రెసుకు నాయకత్వం వహించారు. 1921 నుండి సహాయ నిరాకరణోద్యమం ప్రారంభం అయింది. ఆ సమయంలో ఆంధ్రోద్యమాన్ని వదిలివేసి ఆంధ్రనాయకులు జాతీయోద్యమంలో పాల్గొన్నారు. కనుక ఆంధ్రోద్యమం మరుగున

పడిపోయింది. అయితే ఆంధ్రసభలను వదలలేదు. ఆంధ్ర కాంగ్రెస్ సభలకు అనుబంధంగా 1920 నుండి 1930 వరకు ఆంధ్ర మహాసభలను జరిపారు.

## 16.14.1 జస్టిస్ పార్టీ వైఖరి :

ఈ దశలో 1917 లో హోంరూలు ఉద్యమకాలంలో దేశంలో బ్రాహ్మణేతర ఉద్యమం బయలుదేరింది. విద్యావంతులైన కొందరు బ్రాహ్మణేతరులు ప్రభుత్వోద్యోగాలలో తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఒత్తిడిచేయడం ప్రారంభించారు. కొల్హాపూర్ మహారాజా వీరికి అండగా నిలచారు.

మద్రాసులో కూడా "సౌత్ ఇండియన్ పీపుల్స్ అసోసియేషన్" ఏర్పడింది. డాక్టర్ టి.యం. నాయర్, డా॥ సి. నటేశన్ మొదలియార్, పానుగల్లు రాజా, పి. త్యాగరాయశెట్టి మున్నగువారు బ్రాహ్మణేతర ఉద్యమానికి నాయకత్వం వహించారు. వీరంతా "హోంరూల్" ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ బ్రిటిషు ప్రభుత్వానికి తమ విధేయతను ప్రకటించారు. బ్రిటిషు పాలకుల అధికారాన్ని ఆధిపత్యాన్ని తగ్గించే ఎలాంటి చర్యను తాము సమర్థించబోమని వారు ప్రకటించారు.

హోంరూలు ఉద్యమంలో ఆంధ్ర నాయకులు కొందరు ప్రముఖపాత్ర నిర్వహించారు. జస్టిస్ పార్టీవారు, పీపుల్స్ అసోసియేషన్‌వారు, స్వపరిపాలన కావాలని ఆందోళన చేసిన "హోంరూలు" ఉద్యమాన్ని వ్యతిరేకించినందువలన బ్రిటిషు ప్రభుత్వం ఈ బ్రాహ్మణేతర ఉద్యమాన్ని పరోక్షంగా ప్రోత్సహిస్తూ వచ్చింది. జాతీయోద్యమానికి వ్యతిరేకంగా వీరిని చేరదీయడానికి ప్రయత్నించింది. ఆ కాలంలో జస్టిస్ పార్టీ అధికారంలోనికి రావడానికి గూడ ప్రభుత్వం తోడ్పడింది. అందువలన జస్టిస్ పార్టీ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును తిరస్కరించింది.

## 16.14.2 శాసన సభలో తీర్మానం :

1927 మార్చి 14 వ తేదీన మద్రాసు శాసనసభలో డాక్టర్ సుబ్బరాయన్ మంత్రివర్గ హయాములో పిల్లల మర్రి ఆంజనేయులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తీర్మానం ప్రవేశ పెట్టాడు. తీర్మానానికి అనుకూలంగా 40 మంది, వ్యతిరేకంగా 32 మంది ఓటు వేశారు. ఆరుగురు తటస్థంగా ఉన్నారు. తెలుగు ప్రాంత ప్రతినిధులలో 17 మంది అనుకూలంగా 5 గురు వ్యతిరేకంగా 6 గురు తటస్థంగా ఉన్నారు. జస్టిస్ పార్టీవారు అందరూ తటస్థంగా ఉన్నారు. "మద్రాసు రాష్ట్రంలోని 11 తెలుగు జిల్లాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలనే" తీర్మానం నెగ్గింది. ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులనుండే ముఖ్యంగా తీర్మానానికి వ్యతిరేకత వచ్చింది.

1928 మార్చి 19 వ తేదీన అయ్యదేవర కాళేశ్వరరావు ఆదాయ వ్యయపట్టిక చర్యలలో పాల్గొంటూ, ఆంధ్రరాష్ట్రం కావాలని ఒక కోత తీర్మానం (Cumotion) ప్రతిపాదించారు. కోత తీర్మానం శాసన సభలో గెలిచింది. 44 మంది అనుకూలంగా, 20 మంది వ్యతిరేకంగా, 29 మంది తటస్థంగా ఉండిపోయారు.

మద్రాసు ప్రభుత్వం ఆ తీర్మానాన్ని ఎట్టి వ్యాఖ్యానం చేయకుండా కేంద్రానికి పంపింది. దానిపై కేంద్రం ఎటువంటి చర్య తీసుకోలేదు. అందువలన ఆంధ్రులు రాజ్యాంగ నిర్ణాయక సంఘం వారివద్దకు రాయబారం వెళ్ళి ఆంధ్ర రాష్ట్ర వాంఛను వెల్లడించి విశదీకరించారు. కాని బ్రిటిషువారు ఆంధ్రులకోర్కెను మన్నించలేదు.

## 16.14.3 సైమన్ కమీషన్ బహిష్కరణ :

1919 భారత రాజ్యాంగ సంస్కరణలను గురించి సమీక్షించటానికి బ్రిటీష్ ప్రభుత్వం సైమన్ కమీషన్‌ను నియమించింది. 1928 లో సైమన్ కమీషన్ రాకను ఆంధ్రులు బహిష్కరించారు.

సైమన్ కమీషన్ సభ్యుల రాక సందర్భంలో ఆంధ్రులు సౌమ్యంగా వ్యవహరించి ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయమని ప్రభుత్వాన్ని ప్రార్థించి వున్నట్లయితే ఆ విషయాన్ని వారు సానుభూతితో పరిశీలించి ఉండేవారని "మద్రాసు మెయిల్" వంటి పత్రికలు కొన్ని

పాఠం - 17

# ఆంధ్రప్రదేశ్ అవతరణ

విషయక్రమం


17.0 లక్ష్యం
17.1 పరిచయం
17.2 తొలి ఆశలు
17.3 కమ్యూనిష్టుల కృషి
17.4 విశాలాంధ్ర సభలు
17.5 కేంద్ర కాంగ్రెస్ వ్యతిరేకత
17.6 1952 ఎన్నికలు - కమ్యూనిష్టుల విజయం
17.7 రెండవ విశాలాంధ్ర మహాసభ 1954
17.8 ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటి సమర్థన
17.9 ఇతర ప్రదేశ్ కాంగ్రెస్ సంస్థల తీర్మానాలు
17.10 ముస్లింల సమర్థన
17.11 పత్రికల పాత్ర
17.12 కమ్యూనిష్టుల తీవ్ర ప్రచారం
17.13 స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమీషన్
17.14 తెలంగాణా నాయకుల వైఖరి
17.15 ఫజల్ ఆలీ కమీషన్ హైదరాబాదు రాక
17.16 విభజన కమీషన్ సిఫార్సులపై విమర్శ
17.17 కమ్యూనిష్టుల సభలు
17.18 పెద్ద మనుషుల ఒప్పందం
17.19 ఆంధ్రప్రదేశ్ అవతరణ
17.20 సరిహద్దు సమస్యలు
17.21 సమీక్ష
17.22 వ్యాసరూప ప్రశ్నలు
17.23 ఉపయుక్త గ్రంధాలు

| | | |
|---|---|---|
| 1918 - | కడప - | నెమలి పట్టాభిరామారావు |
| 1919 - | అనంతపురం - | గాడిచెర్ల హరి సర్వోత్తమ రావు |
| 1920 - | మహానంది - | ఎ. రంగనాథ మొదలియార్ |
| 1921 - | బరంపురం - | గంపలగూడెం రాజాకోటగిరి వెంకట కృష్ణారావు. |
| 1922 - | చిత్తూరు - | వేదం వెంకటరాయ శాస్త్రి |
| 1924 - | మద్రాసు - | కట్టమంచి రామలింగారెడ్డి |
| 1925 - | మచిలీపట్నం - | సామి వెంకటాచలంశెట్టి |
| 1926 - | ఏలూరు - | ఉయ్యూరు జమిందారు రాజా మేకా వెంకట రంగయ్యాప్పారావు |
| 1927 - | అనంతపురం - | ఓ. లక్ష్మణ స్వామి |
| 1927 - | నంధ్యాల - | సర్వేపల్లి రాధాకృష్ణ |
| 1929 - | బెజవాడ - | వి.వి. యస్.నరసింహరాజు |
| 1930 - | గుంటూరు - | వి.వి. జోగయ్య |
| 1931 - | మద్రాసు - | కడప కోటిరెడ్డి |
| 1932 - | బెజవాడ - | కె.వి. రెడ్డినాయుడు |
| 1934 - | విశాఖపట్నం - | దేశపాండే సుబ్బరావు |
| 1936 - | కాకినాడ - | వేమవరపు రామదాసు పంతులు |
| 1937 - | బెజవాడ (రజతోత్సవం) - | కడప కోటిరెడ్డి |
| 1938 - | మద్రాసు - | సర్వేపల్లి రాధాకృష్ణ |
| 1939 - | గుంటూరు - | అనంతశయనం అయ్యంగార్ |
| 1941 - | విశాఖపట్నం - | విజయనగర రాజకుమారుడైన విజయానంద గజపతి |
| 1943 - | బళ్ళారి - | "సర్ విజయ" |
| 1951 - | మద్రాసు (ప్రత్యేక మహాసభ) - | ఉయ్యూరు కుమార రాజా, ఎం.ఆర్. అప్పారావు |
| 1951 - | గుంటూరు - | గాడిచర్ల హరి సర్వోత్తమరావు. |

డా. ముప్పాళ్ళ హనుమంతరావు

ప్రకాశం పి.ఎస్.పి. కి రాజీనామాచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి పదవీ స్వీకారానికి అంగీకరించారు. చివరకు రాయలసీమలోని కర్నూలు రాజధానిగా ప్రకాశం ముఖ్యమంత్రిగా, నీలం సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రిగా నిర్ణయించబడ్డారు. 1953 అక్టోబరు 1 వ తేదీ ప్రధాని నెహ్రూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశారు. నలభై ఐదు సంవత్సరాల ఆంధ్రోద్యమం ఫలించి ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రుల చిరకాల వాంఛ నెరవేరింది.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే తిరుపతి క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయ స్థాపన జరిగింది. దీనితో రాయలసీమకు విశ్వవిద్యాలయ కొరత తీరింది. గుంటూరులో ఆంధ్రరాష్ట్ర హైకోర్టు ఏర్పడింది. బెజవాడ వద్ద కృష్ణా బ్యారేజి "ఆంధ్రకేసరి" ప్రకాశం పేరున నిర్మాణం జరిగింది. గవర్నర్ త్రివేది కాలంలో నందికొండ వద్ద నాగార్జున సాగర్‌కు నెహ్రూ శంకుస్థాపన చేశారు. ఇవన్నీ అనతికాలంలో అమలు జరిగి ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచింది.

## 16.35 సమీక్ష :

ఈ విధంగా 1913 లో ఆరంభమయిన ఆంధ్రోద్యమం 1953 వరకు కొనసాగి, స్వరాష్ట్ర సిద్ధి జరిగింది. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతోనే నూతన రాష్ట్రం ఏర్పడింది.

## 16.36 వ్యాసరూప ప్రశ్నలు :

1. ఆంధ్రోద్యమానికి దారితీసిన పరిస్థితులను వివరింపుము.
2. ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఏర్పడిన అడ్డంకులను తెలియజేయుము.

## 16.37 ఉపయుక్త గ్రంథాలు :


1. కొండా వెంకటప్పయ్య : ఆంధ్రోద్యమం (1913)
2. అయ్యదేవర కాళేశ్వరరావు : నా జీవిత చరిత్ర - నవ్యాంధ్రము
3. కొండా వెంకటప్పయ్య : స్వీయ చరిత్ర
4. వావిలాల గోపాలకృష్ణయ్య : ఆంధ్ర రాష్ట్రం
5. మాదల వీరభద్రరావు : ఆంధ్రోద్యమ చరిత్ర
6. డా.ముప్పాళ్ళ హనుమంతరావు : సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి 4 వ భాగం


## 16.38 ఆంధ్ర మహాసభలు-అధ్యక్షులు :

| సంవత్సరం | సభలు | అధ్యక్షులు |
|---|---|---|
| 1913 | బాపట్ల | బి.ఎన్. శర్మ |
| 1914 | బెజవాడ | న్యాపతి సుబ్బారావు |
| 1915 | విశాఖపట్నం | పానగల్లు రాజా |
| 1916 | కాకినాడ | దివాన్ బహదూర్ మోచర్ల రామచంద్రరావు |
| 1917 | నెల్లూరు | కొండా వెంకటప్పయ్య |
| 1917 | గుంటూరు (ప్రత్యేక మహాసభ) | కాశీనాధుని నాగేశ్వరరావు |

మరణించింది. నెల్లూరులో ఐదుగురు, అనకాపల్లిలో ముగ్గురు, తాడేపల్లిలో ఇద్దరు, రాజమండ్రిలో ఇద్దరు మొత్తం 12 మంది కాల్పుల్లో మరణించారు. ఆవేశంలో రెచ్చిపోయిన ప్రజలు తెనాలి, గుంటూరు, విజయవాడ రైల్వే స్టేషన్లను ధ్వంసం చేశారు. 50 లక్షల రూపాయల రైల్వే ఆస్తులు నష్టమైనవని ప్రభుత్వం ప్రకటించింది. నెల్లూరులో కాల్పులలో చనిపోయిన 5 శవాలను 5 గంటలసేపు వూరేగింపు జరిపారు. లక్షమంది ప్రజలు ఆ ఊరేగింపులో పాల్గొన్నారు. చాలా చోట్ల కేంద్రప్రభుత్వ ఆస్థులు ధ్వంసం చేయబడ్డాయి. కేంద్రప్రభుత్వ వైఖరికి నిరసనగా పి.వి.జి. రాజు, సి.వి. సోమయాజులు, తెన్నేటి విశ్వనాథం, దంతులూరి నారాయణరాజు, వి. సీతారామయ్యగార్లు తమ శాసనసభ, కౌన్సిళ్ళ సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు.

## 16.33 కైలాసనాధ వాంఛూ కమిటీ - 1953 ఫిబ్రవరి 7 - మార్చి 25 :

ఆంధ్రదేశంలో జరిగిన హింసాత్మక సంఘటనలతో కేంద్రప్రభుత్వం మేలుకొన్నది. ప్రధాని నెహ్రూ 1952 డిశంబరు 19 న శ్రీరాములు త్యాగపురుషులని ప్రశంసించి మద్రాసు మినహా, మిగిలిన నిర్వివాద ఆంధ్ర ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించినదని పార్లమెంటులో ప్రకటించారు. ఆంధ్రరాష్ట్ర యేర్పాటులో ఎదురయ్యే సమస్యలను పరిశీలించడానికి రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ కైలాసనాధ వాంఛూను ప్రత్యేక అధికారిగా 1953 ఫిబ్రవరి 7వ తేదీన నియమించారు. వాంఛూ కమిటీ ఆంధ్ర ప్రాంతంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ప్రముఖులను కలసి వారి అభిప్రాయాలను సేకరించి, 1953 మార్చి 25 వ తేదీన తన నివేదికను సమర్పించింది. కేంద్రప్రభుత్వం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నదని 1953 మార్చి 25 వ తేదీన నెహ్రూ ప్రకటించారు. ఆంధ్రరాష్ట్ర రాజధాని మద్రాసులో వుండే ప్రశ్నేలేదని నూతన రాష్ట్రంలోనే రాజధానిని ఏర్పాటు చేసుకోనవలెనని ఆంధ్రప్రాంతంలో ఎచట రాజధానిని నెలకొల్పుకోవాలో ఆంధ్రశాసన సభ్యులే నిర్ణయించుకోవలెనని 1953 అక్టోబరు ఒకటో తేదీన ఆంధ్రరాష్ట్రం యేర్పడుతుందని ప్రకటించారు. ఈ నూతన రాష్ట్రంలో శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటురు, నెల్లూరు, చిత్తూరు కడప, అనంతపూరు, కర్నూలు జిల్లాలు, బళ్ళారి జిల్లాలోని ఆలూరు, ఆదోని, రాయదుర్గ తాలూకాలు చేరుతూ ఉంటాయి. బళ్ళారి తాలుకా గూడా తెలుగువారికి రావాలని కొందరు అడుగగా దాని విషయం తరువాత పరిశీలింపబడునని తేల్చారు. మిగిలిన బళ్ళారి తాలూకాలను మైసూరు రాష్ట్రంలో విలీనం చేశారు. బళ్ళారి తాలూకా విషయం తేల్చడానికి హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ లక్ష్మీ శంకర మిశ్రాను నియమించారు. ఆయన బళ్ళారిని మైసూరు రాష్ట్రంలో కలపవలెనని సిఫార్సు చేశాడు. ఆయన సిఫార్సును భారతప్రభుత్వం అంగీకరించింది. బళ్ళారి మైసూరు రాష్ట్రంలో కలసిపోయింది. ఏమైనా ఆంధ్రులు మద్రాసు పట్టణాన్ని దాని పరిసర ప్రాంతాలను కోల్పోయి ఆంధ్రరాష్ట్రాన్ని పొందారు. 55 కోట్ల రూపాయల మిగులు పోయినది. అపుడు ఇస్తామన్న 30% వాటా పోయింది. తత్ఫలితంగా ఆంధ్రులు 16 1/2 కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు.

శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయవలెనని రాయలసీమ నాయకులు పట్టుబట్టారు. దానితో రాయలసీమ సర్కారు ప్రాంతాలమధ్య అభిప్రాయభేదాలు తలెత్తాయి. నెహ్రూ ప్రకటన తరువాత ఆంధ్రరాష్ట్రానికి రాజధానిని నిర్ణయించుకోవడానికి మద్రాసు అసెంబ్లీ స్పీకరు 1953 జూన్ 1 వ తేదీన ఆంధ్ర శాసన సభ్యులను సమావేశ పరచాడు. ఆ సమావేశానికి ప్రకాశం అధ్యక్షత వహించారు. ఆ సమావేశంలో శ్రీబాగ్ ఒప్పందం యధాతధంగా అంగీకరించాలని కొందరు అంగీకరిచనవసరంలేదని మరికొందరు వాదించుకున్నారు. చివరకు ప్రకాశంనే రాజధానిని నిర్ణయించమని కోరారు. ఆయన కర్నూలును రాజధానిగా నిర్ణయించారు. దానితో రాజధాని సమస్య పరిష్కారం అయింది. కర్నూలును నిర్ణయించినందుకు కొందరు అసంతృప్తి చెందారు. అందుకు ప్రకాశంగారు కర్నూలు శాశ్వత రాజధాని కాదు త్వరలో ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతుంది. నూతన రాజధాని ఏర్పడుతుంది అని సమాధానపరచారు.

## 16.34 ఆంధ్ర రాష్ట్రావతరణ :

తరువాత ప్రధాని నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణ, నీలం సంజీవరెడ్డి, టంగుటూరి ప్రకాశంతో సంప్రదింపులు జరిపి నూతన ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వుండమని కోరారు. కాంగ్రెస్ నుండి వైదొలగి అప్పటివరకు ప్రజా సోషలిష్టు పార్టీ నాయకుడుగా వున్న

## 16.32 పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ - ఆంధ్రరాష్ట్ర అవతరణ :

ఈ పరిస్థితులలో ఆంధ్రుల ప్రయోజనాలను కాపాడేది ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు ఒక్కటేనని పొట్టి శ్రీరాములు భావించి 1952 అక్టోబరు 19 వ తేదీన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. నిరాహార దీక్ష ప్రారంభించడానికి ముందు 15-9-1952 వ తేదీన శ్రీరాములు మద్రాసులో న్యాయవాద వృత్తి చేసే బి. లక్ష్మీనారాయణకి తన వుద్దేశ్యాలను తెలుపుతూ ఒక లేఖ వ్రాశారు. అందులో "ఆంధ్రరాష్ట్రాన్ని గురించి గత కొన్నాళ్ళుగా ఆలోచిస్తూ వున్నాను. మన పెద్దలు ఒక అభిప్రాయానికి వస్తారని నేను భావిస్తున్నాను. నేను యే పార్టీకి చెందినవాడను గాదు. నాకు అనుచరులు లేరు. నేను ఎక్కడవున్నా ఏమిచేసినా నేను తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి వుండగలను. నన్ను ఎవరూ మార్చలేరు. మన నాయకులు ఎవరికి వారే తమ వాదనలను సమర్థించుకుంటూ ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. రాష్ట్రం ఏర్పాటు అనేక సమస్యలను సృష్టించింది. అధికారంలో వున్నవారు తమ వైఖరిని విడువరు. ఈ పరిస్థితులలో నా జీవితాన్ని త్యాగం చేయడం ఒక్కటే పరిష్కారమార్గమని భావిస్తున్నాను. నాకురాగ ద్వేషాలులేవు. ధృడమైన సంకల్పం వున్నది." అని వ్రాశాడు. శ్రీరాములు తాను జన్మించిన వీధిలోని ఒక ధర్మసత్రంలో తన దీక్షను ప్రారంభించాలనుకున్నారు. కాని ఆ వీధిలోని తమిళులు ఆయనకు ఆశ్రయం ఇవ్వలేదు. కనుక శ్రీరాములు సెయింట్ జార్జి కోట గుమ్మం వద్ద నిరాహార దీక్ష ప్రారంభించారు. కాని ఆ కోటగుమ్మం స్థలం క్షేమకరం కాదని నిరాహారదీక్షకు తగిన స్థలం కాదని ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి భావించారు. అందువలన బులుసు సాంబమూర్తి మైలాపూర్‌లోని తన ఇంటికి తీసుకువెళ్ళారు. ఆయన ఇంటి ఆవరణకు యజ్ఞశాల అని పేరు పెట్టి అచట శ్రీరాములు నిరాహారదీక్షకు ఏర్పాటు చేశారు. ఆ యజ్ఞశాలలో శ్రీరాములు 1952 అక్టోబర్ 19 వ తేదీన తన నిరాహార దీక్ష ప్రారంభించారు. మొదట ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. కాని రోజులు గడిచేకొలది ప్రజల స్పందన బాగా పెరిగింది. నవంబరు దాటి డిశంబరులో ప్రవేశించేటప్పటికి ఆంధ్రప్రాంతం అంతా స్పందించింది. శ్రీరాములు ప్రాణాలు కాపాడాలని ఆంధ్రప్రజలు ఎలుగెత్తి చాటడం మొదలు పెట్టారు.

శ్రీరాములు దీక్షను గురించి శాసనసభలో ప్రసక్తి వచ్చినపుడు రాజాజీ చాలా చులకనగా మాట్లాడారు. కాని రోజులు గడిచేకొలది చెన్న పట్నంలోను, ఆంధ్రశాసన సభ్యులలోను, ఆంధ్రజిల్లాలలోను శ్రీరాములు ఏమవుతారోనని ఆందోళన ప్రారంభం అయింది. ఆనాటి ఉప రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణ జోక్యం చేసుకొనవలెనని మద్రాసునుండి శాసన సభ్యులు, పెద్దలు ఆయనకు టెలిగ్రాంలు ఇవ్వసాగారు. కాని ఆయన అనునయ వాక్యాలు చెప్పడం తప్ప యేమీ చేయలేకపోయారు. దీక్ష నెలరోజులు సాగేటప్పటికి ప్రజలలో వేడి పుట్టింది. విద్యార్థులలోను కార్మికులలోను గూడా శ్రీరాములు ప్రాణాలను గురించి ఆవేదన పడసాగారు. శాసనసభలో ప్రసక్తి వచ్చినప్పుడెల్లా ముఖ్యమంత్రి రాజగోపాలాచారి తేలికగా మాట్లాడేవారు. 50 రోజులు జరిగేటప్పటికి మద్రాసు పట్టణంలో ప్రజల మనసులు తపన పడసాగినవి. కేంద్రప్రభుత్వ వైఖరికి అందరూ నిరసన తెలియచేశారు. ఆంధ్రదేశం అంతటా విద్యార్థులు ప్రజలు సమ్మెలు హర్తాళ్ళు చేశారు. శ్రీరాములు ప్రాణాలు కాపాడండి అని కేంద్రప్రభుత్వానికి వేలకొలది టెలిగ్రాములు ఇచ్చారు. పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీ, ప్రజాసోష్లలిస్టు పార్టీ, నేషనల్ డెమొక్రటిక్ పార్టీ స్వతంత్ర సభ్యులు వాకౌట్లు చేశారు. మద్రాసు అసెంబ్లీలో గూడా వాకౌట్లు జరిగాయి. అయినప్పటికీ కేంద్రప్రభుత్వం తన మొండి పట్టుదల వదలలేదు.

58 వ రోజు రాత్రి అనగా 1952 డిశంబరు 15 వ తేదీరాత్రి ఆయన ప్రాణాలు అనంతవాయువులలో కలసిపోయాయి. శ్రీరాములు మరణించారన్న వార్త దావానలంగా ఆంధ్రపదేశం అంతటా వ్యాపించింది. ఆంధ్రదేశం ఉవ్వెత్తున లేచింది. ఆ రోజు సాయంత్రంవరకు ఆయన భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనం కొరకు ఎత్తైన వేదికపై వుంచారు. సాయంత్రం మైలాపూర్ నుండి రెండెడ్ల బండిపై ఆయన భౌతికకాయాన్ని మౌంటురోడ్డు నుండి జార్జిటౌన్ మీదుగా అనేక వీధులను దాటుకొంటూ లక్షలమంది జనం వెంటరాగా ఎనిమిది గంటలు ఊరేగింపుగా దహన భూమికి చేరింది. ఆ బండిపై ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి కూర్చున్నారు. ఆయన ఆత్మత్యాగం ఆంధ్రరాష్ట్రాన్ని తీసుకురావడమే కాదు; భారతదేశానికి భాషాప్రయుక్త రాష్ట్రాలను గూడా తెచ్చింది.

ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆంధ్ర శాసనసభ్యులు కొందరు తమ సభ్యత్వానికి రాజీనామాలు చేశారు. రాష్ట్రం అంతటా హర్తాళ్ళు, బందులు జరిగాయి. రైళ్ళు ఆగిపోయాయి. ఆఫీసులు, కోర్టులు మూతబడ్డాయి. 4 రోజులు దేశం స్తంభించిపోయింది. ప్రజలను ఆపడం ఎవరి తరం కాలేదు. లాఠీఛార్జీలు, కాల్పులు జరిగాయి. వాల్తేరు కాల్పులలో 15 మంది గాయపడ్డారు. ఒక స్త్రీ

సభలో పాల్గొని అనేకమార్లు జైలుకు వెళ్ళి శిక్ష అనుభవించాడు. గొప్ప నిర్మాణ దక్షత కలిగిన వ్యక్తి. రాజకీయ నాయకులవలన ఆంధ్రరాష్ట్రం రాదని ఆయన గ్రహించాడు. కనుక సత్యాగ్రహం, నిరాహారదీక్ష ద్వారా రాష్ట్రాన్ని సాధించవలెనని నిర్ణయించుకొని 1951 ఆగస్టు 15 న అనగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున కావూరు విమానాశ్రయంలో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. ఆయనతో పాటు అనేకమంది సాముహిక నిరాహార దీక్ష చేపట్టారు. 1951 అక్టోబరు 2 వ తేదీలోపల ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలెనని, మద్రాసు నగర భవిష్యత్తును మూడు సంవత్సరాల తువాత నిర్ణయించవచ్చని, అంతవరకు ఆంధ్రులు, తమిళులు ఎవరు గూడా మద్రాసు నగరంపై హక్కును కోరరాదని సీతారాం ప్రకటించారు. రాజ్యాంగేతర పద్ధతిద్వారా ప్రభుత్వన్ని లొంగదీసే పద్ధతి అని నెహ్రూ ఆయన నిరాహార దీక్షను తిరస్కరించారు. సీతారామశాస్త్రి రాష్ట్రం అంతటా పర్యటించారు. ఆయన పర్యటనకు ఆనందయాత్ర అని పేరు వచ్చింది. సీతారామ స్వామి పర్యటన, నిరాహరదీక్ష రాష్ట్రంలో గొప్ప సంచలనాన్ని కల్గించినది. కొన్ని అవాంఛనీయ సంఘటనలు గూడా జరిగాయి. సీతారాం దీక్ష పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చింది. అపుడు ప్రధాని నెహ్రూ ఆంధ్ర, తమిళ, కర్నాటక ప్రదేశ్ కాంగ్రెసు కమిటీలు మద్రాసు రాష్ట్రప్రభుత్వం జె.వి.సి. నాయకత్రయ కమిటీ నివేదికను అంగీకరించి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని అందుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అందువలన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ సెప్టెంబరు 14 వ తేదీన నెల్లూరులో సమావేశమై నాయకత్రయ నివేదిక ప్రాతిపదికపై ఆంధ్రరాష్ట్ర నిర్మాణం చేయవలెనని కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసింది. అదే సమయంలో వినోభాభావే సీతారాంని కలిసి తను నెహ్రూ, రాజేంద్రబాబులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నానని, వారు ఆంధ్రరాష్ట్రాన్ని యేర్పాటు చేస్తారని కనుక దీక్ష విరమించవలసినదని సీతారాంని కోరారు. వినోభాభావే కోరికను మన్నించి సీతారాం 1951 సెప్టెంబర్ 20వ తేదీన తన ఉపవాప దీక్షను విరమించారు. వినోభా కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రరాష్ట్రంని యేర్పాటు చేయమని కోరుతూ వినతి పత్రాన్ని పంపారు. కాని నెహ్రూ ప్రభుత్వం చలించలేదు. ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయలేదు. సీతారాం నిరాహార దీక్షవలన ఆంధ్రరాష్ట్రం రాలేదుకాని ఆంధ్రప్రజలకు కాంగ్రెసుపై ద్వేషం కల్గింది. దానిఫలితం 1952 ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అనుభవించింది. ఎన్నికల తరువాత 1952 జూన్ నెలలో సీతారాం మరలా భీమవరంలో సత్యాగ్రహం ప్రారంభించారు. కాని అది గూడా త్వరలోనే విరమింపబడింది.

## 16.31 1952 ఎన్నికలు - కాంగ్రెసు ఓటమి :

ఇట్టి స్థితిలో 1952 లో ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో భాషా ప్రయుక్త రాష్ట్రాల అంశం ప్రధాన అంశం అయింది. కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా ఈ సమస్యను ప్రచారం చేసింది. మద్రాసు రాష్ట్రంలోని 11 జిల్లాలు మూడు తాలూకాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలనే నినాదాన్ని కమ్యూనిస్టు పార్టీ బాగా ప్రచారం చేసింది. కాంగ్రెసువారి ఊగిసలాటకు ప్రజలు విసిగిపోయి ఈ ఎన్నికలలో తమ ప్రతాపం చూపించారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రతిజ్ఞ చేసినవారికే ఓటు వేయాలని ఆంధ్ర మహాసభ గూడా పిలుపు నిచ్చింది. దానితో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయింది. మద్రాసు రాష్ట్ర శాసనసభలోని 375 స్థానాలలో 152 స్థానాలలో మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. ఆంధ్రలో 140 స్థానాలకుగాను 43 మాత్రమే వచ్చినాయి. కాంగ్రెసులోని మహానాయకులైన సంజీవరెడ్డి, కళావెంకట్రావు, బెజవాడ గోపాలరెడ్డి మొదలగువారు ఓడిపోయారు. కిసాన్ మజ్దూర్ పార్టీ 20 స్థానాలు గెల్చుకున్నది. కమ్యూనిస్టులు 41 సీట్లతో గెల్చారు. కమ్యూనిస్టుల మద్దతుతో ప్రకాశం యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంటును(U.D.F) ఏర్పాటు చేశారు. ఆయనకు 164 మంది సభ్యులు మద్దతునిచ్చారు. కాని గవర్నర్ కాంగ్రెసు నాయకుడైన రాజగోపాలాచారిని ఆహ్వానించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమన్నారు. రాజగోపాలాచారి నాయకత్వంలో కాంగ్రెసు అధికారాన్ని హస్తగతం చేసుకున్నది. రాజగోపాలాచారి ఆంధ్రరాష్ట్రాన్ని వ్యతిరేకించడమేగాక ఆంధ్రకు చేకూరవలసిన ప్రయోజనాలను తమిళ దేశానికి ఉపయోగపడేటట్లు చేయసాగాడు. కృష్ణా పెన్నారు ప్రాజెక్టును ప్రారంభించి కృష్ణానది నీటిని మద్రాసుకు చేరవేసే పథకాన్ని ప్రారంభించాడు. ఈ ప్రాజెక్టుకు విరుద్ధంగా ఆంధ్రలో బ్రహ్మాండమైన ఉద్యమం జరిగింది. ఆ ప్రాజెక్టు సాంకేతిక విషయాలు పరిశీలించడానికి భారతప్రభుత్వం భోస్లా కమిటీని నియమించింది. ఆ కమిటీ కృష్ణా పెన్నారు ప్రాజెక్టు ప్రారంభించరాదని దానికి బదులు నందికొండ ప్రాజెక్టు నిర్మించవచ్చని సిఫార్సు చేసింది. మొత్తంమీద రాజాజీ చర్యలు ఆంధ్రప్రజలకు కంటగింపుగా ఉన్నాయి. ఇట్టి స్థితిలో పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రాన్ని సాధించడానికి నిరాహార దీక్ష ప్రారంభించారు.

## 16.27 జె.వి.పి కమిటి :

వారి పేర్లలోని మొదటి అక్షరాలతో ఈ కమిటీకి J.V.P కమిటి అని పేరు వచ్చింది. ఈ త్రిసభ్య కమిటీ 1949 ఏప్రియల్ 9వ తేదీన కాంగ్రెసు వర్కింగ్ కమిటీకి తన నివేదికను సమర్పించింది. ఈ కమిటి కూడా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును కొన్ని సం॥లు వాయిదా వేయవలెనని సిఫార్సు చేసింది. కాని ఆంధ్రుల ఆలజడిని నిరోధించడానికి ఆంధ్రులు మద్రాసు నగరాన్ని వదులుకుంటే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయడానికి ఎట్టి అభ్యంతరాలు లేవని ప్రకటించింది. మద్రాసు నగరాన్ని వదులుకోవడానికి రాయలసీమ ప్రజలు అంగీకరించరని, కనుక రాయలసీమ ప్రజలకు విరుద్ధంగా మద్రాసు లేకుండా సర్కారు ప్రజలు ఆంధ్రరాష్ట్రాన్ని కోరలేరని, కనుక ఆంధ్రరాష్ట్రం ఆందోళన జరుగదని కమిటీ సభ్యులు భావించారు. కాని అందుకు విరుద్ధంగా ఆంధ్రరాష్ట్ర ఆందోళన ప్రారంభం అయింది. కనుక కేంద్ర ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై తన సూచనలు చేయమని మద్రాసు ప్రభుత్వాన్ని కోరింది. మద్రాసు ప్రభుత్వం ఆంధ్రరాష్ట్ర సరిహద్దులను నిర్ణయించడానికి ముగ్గురు సభ్యులు గల కమిటీని నియమించవలెనని, ఆ కమిటీలో ఒకరు హైకోర్టు జడ్జీ అయి ఉండాలని, ముగ్గురు సభ్యులు మద్రాసు, ఒరిస్సా రాష్ట్రాలకు చెందినివారై వుండవలెనని మద్రాసు ప్రభుత్వం 6-12-1949 న కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసింది.

## 16.28 విభజన సంఘం :

కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి ఒక విభజన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఆనాటి మద్రాసు ముఖ్యమంత్రి కుమార రాజా అధ్యక్షుడు. ఈ కమిటీ 1950 జనవరి 4 వ తేదీన తమ నివేదికను సమర్పించారు. ఈ నివేదికను ఒక్క ప్రకాశంగారు తప్ప మిగిలిన వారందరూ అంగీకరించారు. ప్రకాశంగారు ప్రత్యేకంగా తన నివేదికను సమర్పించారు.

## 16.29 ప్రకాశం అసమ్మతి :

ఆంధ్రరాష్ట్రానికి నూతన రాజధాని ఏర్పాటు చేసుకునేవరకు మద్రాసు తాత్కాలిక రాజధానిగా వుండాలి. మద్రాసు నగరం చీఫ్ కమీషనర్ ప్రాంతంగా వుండాలా లేక తమిళ రాష్ట్రానికి చెందాలా అనే విషయం తేలేవరకు నగరంలోని భవనాల విలువను రెండు రాష్ట్రాలకు పంచగూడదు. ఆంధ్ర రాష్ట్రానికి జమగా ఇచ్చే 10 కోట్ల రూపాయలు కాక ఇంకా అదనంగా ఇవ్వాలి ఆంధ్ర రాష్ట్రంలో ఆంధ్రేతరులకు ఉద్యోగాలు యివ్వవలెనను నిబంధన ఉండరాదు.

1950 జనవరి 4 వ తేదీన మద్రాసులో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ గూడా ఆంధ్రరాష్ట్రం రాజధానిని ఏర్పాటు చేసుకునేవరకు ఆంధ్రరాష్ట్రానికి మద్రాసే రాజధానిగా ఉండాలని తీర్మానం చేసింది. ఈ తీర్మానం ప్రకాశం అభిప్రాయంతో ఏకీభవించింది అయినప్పటికీ కాంగ్రెసులో ముఠాల వలన ఏకాభిప్రాయం లేకుండా పోయింది. దానిని ఆసరాగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం 1950 జనవరి 26 వ తేదీ లోపల ఆంధ్రరాష్ట్రాన్ని యేర్పాటు చేయడం అసాధ్యమని జనవరి 16 వ తేదీన మద్రాసు రాష్ట్రానికి తెలియజేసింది అందుకు కొన్ని కారణాలను గూడా చూపింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే రెండు కోట్ల రూపాయల లోటు బడ్జెటు ఏర్పడుతుంది. ఆంధ్ర హైకోర్టు ఎచట ఏర్పాటు చేసేది ఆంధ్ర నాయుకులు నిర్ణయించలేదు. ఆంధ్రేతర ఉద్యోగులను ఆంధ్రరాష్ట్రంలో ఉంచ గూడదన కోరిక, ఆంధ్రేతర ఉద్యోగులకు భద్రతను లేకుండా చేయుచున్నది. బళ్ళారి జిల్లాను గురించి బేదాభిప్రాయాలున్నవి. కనుక ఈ సమస్యలన్నీ పరిష్కరించడానికి సమయం చాలదు. కనుక 1950 జనవరి 26 వ తేదీ నాటికి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు వీలుకాదు అని కేంద్ర ప్రభుత్వం తన వాదనను సమర్థించుకొన్నది. కాని వాస్తవానికి కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయడం యిష్టంలేదు ప్రకాశం అసమ్మతి వ్యాఖ్యను సాకుగా తీసుకుని అధ్యంతాలను చూపెట్టింది.

## 16.30 స్వామి సీతారాం ఆమరణ దీక్ష :

అట్టి స్థితిలో ఆంధ్రరాష్ట్రాన్ని సాధించాలని స్వామి సీతారాం ముందుకు వచ్చారు. ఆయన రాష్ట్రాన్ని సాధించడానికి గాంధీ మార్గం మంచిదని భావించారు. పూర్వాశ్రమంలో ఈయన పేరు గొల్లపూడి సీతారామశాస్త్రి. ఆయన బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర

1946 ఎన్నికలలో మద్రాసు రాష్ట్రంలో మరలా కాంగ్రెసు గెల్చింది. ప్రకాశం పంతులుగారు మద్రాసు ముఖ్యమంత్రి అయ్యారు. 1946 చివరలో అనారోగ్యం వలన సర్ విజయ ఆంధ్ర మహాసభ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా తరువాత ఎవరూ ముందుకు వచ్చి ఆంధ్రోద్యమాన్ని నడపలేదు.

1946 సెప్టెంబరులో ఢిల్లీలో నెహ్రు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అప్పటివరకు భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలంగా వున్న కాంగ్రెసు కేంద్ర అధిష్టాన వర్గం తన అభిప్రాయాలను మార్చుకున్నది. కాగితాలమీద, సిద్ధాంత పరంగా అంగీకరించారు గాని హృదయాలలో ఆంధ్రరాష్ట్రాన్ని యేర్పాటు చేయవలెనని సంకల్పం లేదు.

1941 ఏప్రియల్‌లో ఉయ్యూరు కుమార రాజా, యం. ఆర్. అప్పారావుగారి అధ్యక్షతన గుంటూరులో ఆంధ్ర మహాసభ జరిగింది. ఆ సభలో ఆంధ్రరాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేయకపోతే రాజ్యాంగ సభలోని ఆంధ్ర సభ్యులు రాజీనామా చేయవలెనని తీర్మానించారు.

ఇట్టి స్థితిలో ఉత్తర హిందూ స్థానంలో హిందూ ముస్లిం సంఘర్షణలు దేశాన్ని దహించివేశాయి. మరలా దేశంలో జాతీయ సమస్యలు అధిక ప్రాధాన్యతను పొందాయి. హిందూ ముస్లింల మధ్య సామరస్యాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం తలమునకలై పోయినది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం ఆంధ్రోద్యమం పూర్తిగా మరుగున పడిపోయింది.

## 16.25 స్వాతంత్ర్యానంతరం ఆందోళన :

1947 ఆగస్టు 15 వ తేదీన స్వాతంత్ర్యం వచ్చింది. అంతకు ఒకరోజు ముందు 1947 ఆగస్టు 14 వ తేదీన భారత రాష్ట్ర రాజ్యాంగం ప్రకారం 1935 ఇండియా యాక్టు అందలి మొదటి షెడ్యూలులోని గవర్నర్ల పాలనా, రాష్ట్రాల జాబితాలో ఆంధ్ర రాష్ట్రం పేర్కొనబడింది. 1935 గవర్నమెంటు ఇండియా యాక్టులోని 290 సెక్షను క్రింద ఆంధ్ర రాష్ట్రం ఏర్పడునని గూడా అభిప్రాయం వెలువరించారు. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ప్రజా ఉద్యమాలను గమనించి నెహ్రూ ఈ ప్రకటన చేశారు. రాష్ట్రాలను భాషా సంస్కృతుల ప్రాతపదికమీద పునర్నిర్మించడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం కొరకు చేసే ఉద్యమం న్యాయ సమ్మతమైనదేనని, నూతన రాజ్యాంగంలో ఆంధ్ర రాష్ట్రం విషయం పొందుపరచబడునని నెహ్రూగారు ప్రకటించారు. కనుక స్వతంత్ర భారతదేశంలో తమ చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్రం త్వరలో ఏర్పడుతుందని ఆంధ్రులు ఆశించారు. కాని రాజ్యాంగ పరిషత్తుకు చెందిన 10 మంది తమిళ సభ్యులు ప్రత్యేక తమిళ రాష్ట్రం కావాలని కోరడంతో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును వదలివేశారు. కాని భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును పరిశీలించడానికి ఒక కమిషన్ వేయబడునని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

## 16.26 ధార్ కమిషన్ 17 జూన్ 1948 :

నవంబరు నాటి ప్రభుత్వపు ప్రకటన ప్రకారం రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడు 1948 జూన్ 17 వ తేదీన భాషా ప్రయుక్త రాష్ట్రాల కమీషనును నియమించాడు. ఈ కమీషన్‌కు హైకోర్టు మాజీ న్యాయమూర్తి యస్.కె.ధార్ అధ్యక్షులుగా నియమింపబడినారు. కనుక అతని పేరుతోనే ఈ కమీషన్‌కు ధార్ కమీషన్ అని పేరు వచ్చింది. ఈ కమీషనులో రిటైర్డ్ ఐ.సి.యస్ ఉద్యోగి డా॥ పన్నాలాల్, రాజ్యాంగ పరిషత్తు మెంబర్ జగత్ నారాయణ లాల్‌లను, సభ్యులుగా నియమించారు. దేశంలో నూతనంగా యే రాష్ట్రాలు యేర్పాటు చేయాలి, ఆ ఏర్పాటు వలన పరిపాలనాపరంగా, ఆర్థిక పరంగా తలయెత్తే పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించ వలసినదిగా ప్రభుత్వం ఆదేశించింది. కాని ఈ కమీషన్ భాషా ప్రయుక్త రాష్ట్రాల యేర్పాటును తిరస్కరించింది. దేశంలో కమీషన్ రిపోర్టుపై నిరసన వెల్లువెత్తింది. కాంగ్రెసు పార్టీ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును పరిశీలించడానికి 1948 జయపూర్ జాతీయ కాంగ్రెసు సమావేశంలో మరియొక కమీటిని నియమించింది. ఆ కమీటిలో జవహర్ లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్, సీతారామయ్యలను ఈ కమీటిలో సభ్యులుగా నియమించింది.

అధిక ప్రాధాన్యత నివ్వాలి. (3) జనాభాతో నిమిత్తం లేకుండా శాసనసభా స్థానాలు జిల్లాల వారిగా సమానంగా వుండేటట్లు చూడాలి. (4) రాష్ట్ర హైకోర్టు రాష్ట్ర రాజధానులు ఒకేచోట కాకుండా ఒకటి కోస్తా ప్రాంతంలోను ఒకటి రాయలసీమ ప్రాంతంలోను వుండాలి. ఏది కావాలో రాయలసీమవారే కోరుకుంటారు. ఈ అంశాలలో మార్పులు చేయాలంటే ఇరుపక్షాలు అంగీకరించాలి. కాశీనాధుని నాగేశ్వరరావుగారు తమ ఇంటికి శ్రీబాగ్ అని పేరు పెట్టుకున్నారు. ఆ ఇంటిలో ఒప్పందం జరిగింది. కనుక దానికి శ్రీబాగ్ ఒప్పందం అని పేరు వచ్చింది.

## 16.21 మద్రాసు శాసనసభలో తీర్మానం - 1937-38 :

శ్రీబాగ్ ఒడంబడికపై సంతకాలు చేసిన తరువాత మద్రాసు శాసనసభలోని ఆంధ్ర సభ్యులు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి రాజగోపాలాచారిని కోరారు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకి అయిన రాజగోపాలాచారి మద్రాసు రాష్ట్రాన్ని ఆంధ్ర, మైసూరు, కేరళ, మద్రాసు రాష్ట్రాలుగా ఏర్పాటు చేయవలెనని ఒక సమగ్రతీర్మానాన్ని మద్రాసు శాసనసభలో ప్రతిపాదింపజేసి ఆ తీర్మానాన్ని ఆమోదింపచేయించి తెలివిగా ఆంధ్రులను మోసం చేశాడు. దానితో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయడానికి వీలులేకుండా పోయింది. ఆ తీర్మానం ప్రకారం మొదటి చర్యగా ఆంధ్రరాష్ట్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కె.వి. రెడ్డినాయుడు సవరణ తీర్మానం చేశారు. కాని ఆ తీర్మానం తిరస్కరించబడింది. రాజగోపాలాచారి చేయించిన తీర్మానాన్ని 1938 ఏప్రియల్ 21 వ తేదీన కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు పంపబడింది. రాజాజీ 1939 మార్చి 25 న ఆంధ్రరాష్ట్ర తీర్మానాన్ని ఇండియా సెక్రటరీ తిరస్కరించాడని మద్రాసు శాసనసభకు తెలియజేశాడు. ఇట్టి స్థితిలో 1939 సెప్టెంబరులో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభం అయింది. కాంగ్రెసు మంత్రి వర్గాలు 1939 నవంబరులో రాజీనామాలు చేసినవి. దానితో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సమస్య మరోమారు మరుగున పడిపోయింది.

## 16.22 ఉద్యమం మరియొకసారి స్తబ్దత :

1938 లో కాంగ్రెసువారి ధోరణి మారింది. కేంద్ర కాంగ్రెసు నాయకులు ఆంధ్రరాష్ట్ర సమస్యను చాలా చిన్నది అని, స్వాతంత్ర్య లక్ష్యానికి ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. కనుక ముందు దేశ స్వాతంత్ర్యం తరువాత ఆంధ్రరాష్ట్రం అని క్రొత్త నినాదాన్ని యిచ్చారు. అందువలన ఆంధ్రోద్యమం మరియొకసారి స్తబ్దత చెందింది.

## 16.23 సర్ విజయ - ఆంధ్ర మహాసభలు :

1941 నవంబరులో ఆంధ్ర మహాసభ విశాఖపట్టణంలో వార్షిక సమావేశాన్ని జరిపారు. ఈ సభకు బెనారస్‌లో నివాసం వుండే విజయనగర వంశానికి సర్ విజయానంద్‌ను అధ్యక్షునిగా ఆహ్వానించారు. ఆయనను అందరూ సర్ విజయ అని పిలిచేవారు. సర్ విజయను ఆంధ్రోద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా అందరూ కోరారు. అందువలన ఆయన ఆంధ్ర మహాసభకు అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం మరలా జీవం పోసుకున్నది. శ్రీబాగ్ ఒప్పందం తరువాత చాలామంది రాయలసీమవాసులు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి తమ మద్దతును తెల్పారు. కాని ఇంకా కొందరు ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకించుతూనే ఉన్నారు. అట్టివారు మరలా రాయలసీమ మహాసభలను ఏర్పాటు చేశారు.

## 16.24 రాయలసీమ సభలు :

యన్. యమ్.శాస్త్రి, ఆర్. సూర్యనారాయణరావు మొదలగు బళ్ళారి నాయకులు ఆంధ్రరాష్ట్రాన్ని యింకా వ్యతిరేకించు చున్నారు. వారు 1938 లో మరియొక రాయలసీమ మహాసభను ఏర్పాటు చేశారు. ఈ నూతన రాయలసీమ సభ మొదటి సమావేశం ఆదోనిలో జరిగింది. ఈ సభ ఆంధ్రరాష్ట్రాన్ని వ్యతిరేకించినది. అందుకు వారు కొన్ని ఆర్థిక, రాజకీయ కారణాలను చూపారు. ఈ సభల ప్రభావం వలన రాయలసీమలో ఇంకా వ్యతిరేకత వున్నదని అర్థమయింది. ఆంధ్ర మహాసభల అధ్యక్షతను చేపట్టిన తరువాత సర్ విజయ మొదట రాయలసీమ ప్రజల భయ సందేహాలను తొలగించవలెనని నిర్ణయించుకొని రాయలసీమ అంతటా పర్యటించాడు. అచట కరువు తాండవించుచుండగా చూసి కరువు బాధితుల సహాయార్థం విరాళాలు వసూలు చేసి వారికి సహాయం చేశాడు.

కాలేదు. రెండవ రాయలసీమ సభ 1935 సెప్టెంబర్ మొదటి వారంలో కడపలో జరిగింది. ఈ సభను గూడా నరసింహారెడ్డి, సుబ్రమణ్యం మొ॥ వారే జరిపారు. ఈ సభలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించవలెనని తీర్మానించారు. ఈ సమావేశానికి కడప కోటిరెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, పప్పూరి రామాచారి మొదలైన ప్రముఖ రాయలసీమ కాంగ్రెసు నాయకులు హాజరుకాలేదు. ప్రజలు గూడా ఈ సభలయందు పెద్దగా ఆసక్తిని చూపలేదు. 1937లో జరిగిన ఎన్నికలలో రాయలసీమ సభలను జరిపిన నరసింహారెడ్డి, సుబ్రమణ్యం మొదలగువారు పోటీ చేసి కాంగ్రెసు అభ్యర్థుల చేతిలో ఓడిపోయారు. అందువలన రాయలసీమ సభల వలన ఎట్టి ప్రయోజనం జరగలేదు.

## 16.18 ఆంధ్ర రాష్ట్రోద్యమం 1937 - 1944 :

1937 ఎన్నికలు జరిగాయి. మద్రాసు రాష్ట్రంలో జస్టిస్ పార్టీ ఓడిపోయింది, కాంగ్రెస్ గెలిచింది. రాజగోపాలాచారి మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాడు. ఆ నాటికే తెలుగువారిలో ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించవలెనన్న కోరిక అన్ని చోట్లవున్నది. ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించడానికి రాయలసీమ ప్రజల సహకారం గూడా కావాలని గ్రహించారు. ఆంధ్ర నాయకులు చేసే ప్రయత్నాలను మద్రాసు ముఖ్యమంత్రి రాజగోపాలాచారి గమనించాడు. అతనికి ఆంధ్ర రాష్ట్రం ఇవ్వడం ఇష్టంలేదు కనుక సర్కారు రాయలసీమ ప్రాంతాల మధ్య భేదాన్ని సృష్టించడానికి రాయలసీమవారికి ఒక్కరికి గూడా మంత్రి పదవి ఇవ్వలేదు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన బెజవాడ గోపాల రెడ్డి, ప్రకాశం పంతులు, వి.వి.గిరిని తన మంత్రివర్గంలో మంత్రులుగా తీసుకున్నాడు. తమకు మంత్రివర్గంలో స్థానం కల్పించడానికి సర్కారు నాయకులు ఎట్టి ప్రయత్నాలు చేయలేదని వారి స్వార్థం వారు చూసుకున్నారని రాయలసీమ నాయకులు భావించారు. దానితో రాయలసీమ సర్కారు జిల్లాలమధ్య మరలా అభిప్రాయభేదాలు వచ్చాయి.

## 16.19 బెజవాడ రజితోత్సవ ఆంధ్ర మహాసభ - 1937 అక్టోబరు :

తమిళ నాయకుల ఎత్తుల వల్ల నిరాశ, సందేహాలతో వున్న ఆంధ్ర నాయకులు 1937 అక్టోబరు చివరి వారంలో బెజవాడలో ఆంధ్ర మహాసభ రజతోత్సవాలను ప్రారంభించారు. ఈ సమావేశానికి రాయలసీమ నాయకులను ఆహ్వానించారు. రాయలసీమ నాయకులు మద్రాసు శాసనసభ్యులు అయిన హల హర్వి సీతారామరెడ్డి సభను ప్రారంభించగా, కడప కోటిరెడ్డి సభకు అధ్యక్షత వహించాడు. వీరిద్దరూ రాయలసీమ ప్రజల భయ సందేహాలను వివరించి రాయలసీమవారి భయాలను పోగొట్టవలసిన బాధ్యత సర్కారు నాయకుల పై వున్నదని చెప్పారు. అంతేగాక రాయలసీమవారికి కొన్ని ప్రత్యేక హామీలనిచ్చి వారి విశ్వాసాన్ని పొందవలెనని గూడా వారు సర్కారు నాయకులకు సలహానిచ్చారు. ముఖ్యంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలో రాజధాని మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం, తుంగభద్ర మొదలగు నీటి పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో తీసుకొనవలసిన చర్యలను గురించి వారు మాట్లాడారు. సర్కారు నాయకులు గూడా రాయలసీమ ప్రజల భయాలను అర్థం చేసుకున్నారు. కనుక వారికి కొన్ని ఖచ్చితమైన హామీలను ఇవ్వాలని తీర్మానించుకున్నారు.

## 16.20 శ్రీబాగ్ ఒప్పందం :

శ్రీబాగ్ ఒప్పందం - 16-11-1937

బెజవాడ సభలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఉభయ ప్రాంత నాయకులు మద్రాసులో దేశోద్ధారక నాగేశ్వరావు శ్రీబాగ్ భవనంలో 1937 నవంబరు 16 వ తేదీన సమావేశమయ్యారు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి రాయలసీమ సర్కారు ప్రాంతాలవారు అంగీకరించి ఒప్పందం కుదుర్చుకున్నారు.

**అంశాలు :**

(1) ఆంధ్ర దేశంలో విజ్ఞానాభివృద్ధికి విద్యా కేంద్రాలను విస్తరించాలి. సాంఘిక, సాంస్కృతిక విషయాలలో ఆంధ్రులు పరస్పర సహకారం అందించుకోవాలి; ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యం క్రింద వాల్తేరులో ఒకటి అనంతపురంలో ఒకటి రెండు విశ్వవిద్యాలయ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. (2) కృష్ణా, తుంగభద్రా, పెన్నా నదులపై ప్రాజెక్టుల నిర్మాణంలో పదేండ్ల వరకు రాయలసీమ ప్రాంతానికి

హాజరయ్యారు. తరువాత జరిగిన ఆంధ్ర మహాసభలలో అత్యధికులు ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని బలపరచారు. అట్టి సందర్భంలో కేశవపిళ్ళై వ్యతిరేకతను చూపాడు. కనుక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు విషయంలో అభిప్రాయ భేదాలు ప్రారంభం అయ్యాయి. రాయలసీమ ప్రజల భయాందోళనలను తొలగించడానికి ఆంధ్ర నాయకులు రాయలసీమలో విస్తృతంగా పర్యటించారు. క్రమేపి రాయలసీమ ప్రజలు కూడ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా మారసాగారు. 1915 లో జరిగిన రెండవ కర్నూలు జిల్లా సభలో 1916 లో జరిగిన కడప జిల్లా సభలో ఆంధ్ర రాష్ట్ర నిర్మాణాన్ని బలపరచారు. 1916 లో జరిగిన మూడవ కర్నూలు జిల్లా సభలో మదనపల్లి మహాసభలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును సమర్థించాయి. కాని రాయలసీమకు వలస వచ్చి, బాగా సంపాదించి, ప్రముఖులై రాయలసీమ రాజకీయాలలో ప్రముఖ పాత్ర నిర్వహించే కేశవపిళ్ళై వంటి తమిళ పిళ్ళైలు, అయ్యారులు ఆంధ్రోద్యమాన్ని బలపరుచలేదు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే దేశ ఐక్యతకు భంగం వాటిల్లునని వాదించసాగారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే వారి ప్రాముఖ్యం తగ్గిపోతుందని వారి భావం. అందువలన వారు వ్యతిరేకించారు. వారి వాదన తప్పని దేశ ఐక్యతకు ఎట్టి భంగం కలగదని ఒక విలేఖరి ఆంధ్ర పత్రికలో వ్రాశాడు.

1917 లో నెల్లూరులో జరిగిన మహాసభలో ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని ఓడించడానికి నెల్లూరులో రాయలసీమ సభ్యులు ప్రయత్నించారు. చివరకు తీర్మానం నెగ్గింది. అయితే రాయలసీమ ప్రజల సందేహాలు తీర్చవలసిన అవసరం వున్నదని ఆంధ్ర నాయుకులు గుర్తించారు. మాంటేగు మద్రాసును దర్శించినప్పుడు సర్కారు రాయలసీమ నాయకులు ఐక్యంగా రాష్ట్రాన్ని కోరారు. మాంటేగును కలసిన 27 మంది సభ్యులలో 10 మంది రాయలసీమవారు. ప్రత్యేక ఆంధ్ర కాంగ్రెసు శాఖ ఏర్పడిన తరువాత రెండు ప్రాంతాలమధ్య సదవగాహన ఏర్పడింది.

## 16.16 విజయవాడ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సభ - 1924 :

కాని 1924 లో విజయవాడలో జరిగిన ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలో అధ్యక్ష పదవికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు పేరును ప్రతిపాదించగా సర్కారు ప్రతినిధులు ఆ ప్రతిపాదనను ఓడించారు. దానితో మరలా రాయలసీమ సర్కారు ప్రాంతాల మధ్య విభేదాలు మొదలైనవి. సర్కారువారు మనలను వేగనివ్వరని కనుక రాయలసీమకు ప్రత్యేక కాంగ్రెసు కమిటి వుండాలి అని అభిప్రాయం వ్యక్తమైంది. 1926 - 27లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పడిన తరువాత ఈ రాయలసీమ సర్కారు విభేదాలు తీవ్రతరం అయ్యాయి. రాయలసీమవారికి సర్కారు వారిపై అపనమ్మకాలు ఏర్పడ్డాయి. 1931 లో ఈ విభేదాలు యింకా పెరిగాయి. 1931 లో మద్రాసులో ఆంధ్రమహాసభ ప్రత్యేక సమావేశాలు జరిగాయి. ఈ సభకు రాయలసీమకు చెందిన కడప కోటిరెడ్డి అధ్యక్షత వహించాడు. ఆంధ్ర శాసనసభలో రాయలసీమకు ప్రత్యేక ప్రాతినిధ్యం వుండవలెనని కల్లూరి సుబ్బారావు వాదించాడు. అసలు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పడవలెనని మరియొక రాయలసీమ సభ్యుడైన సుబ్రమణ్యం ఆ తీర్మానానికి సవరణను ప్రతిపాదించాడు. ఇవన్నీ రాయలసీమవారికి సర్కారు జిల్లా వారిపై వున్న అపనమ్మకానికి నిదర్శనాలని చెప్పవచ్చును.

## 16.17 రాయలసీమలో మరల సభలు క్రీ. శ 1934 - 1935 :

ఆంధ్ర విశ్వవిద్యాలయం అనంతపురంలో నెలకొల్పకుండా విశాఖపట్టణానికి తరలించడంతో రాయలసీమవారిలో సందేహాలు కలిగాయి. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంలో తమకు తగినంత ప్రాతినిధ్యం, ప్రాధాన్యత లభించకపోవచ్చునని భయ సందేహాలు కల్గినవి. కనుక రాయలసీమ ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి కె. సుబ్రమణ్యం, సి. యల్. నరసింహారెడ్డి మొదలగు లాయర్లు 1934 లో రాయలసీమ మహాసభ అను సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘం 1934 జనవరి 28 వ తేదీన మద్రాసులో మొదటి సమావేశం జరిపినది. ఈ సమావేశానికి నెమలి పట్టాభిరామారావు అధ్యక్షత వహించాడు. ఆంధ్ర రాష్ట్రాన్ని వ్యతిరేకించిన సత్యమూర్తి సమావేశాన్ని ప్రారంభించాడు. రాయలసీమ ప్రాంతాలను ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిధిలోనికి తీసుకురావలెనని సర్కారు జిల్లాల ప్రతినిధులు ముఖ్యంగా బయ్యా నరసింహస్వామి అంతకుముందు కోరి వున్నారు. ఈ సమావేశం ఆ కోర్కెను తిరస్కరించింది. మరియొక తీర్మానం చేసి తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీని స్థాపించాలని కోరారు. ఈ సమావేశానికి కాంగ్రెసు పార్టీ సభ్యులు హాజరు

ఆంధ్రులకు సలహా యిచ్చాయి. అప్పట్లో సైమన్ కమీషన్ వారికి స్వాగతం చెప్పి వినతి పత్రాలను సమర్పించిన ఒరిస్సా వారికి, సింధీయులకు ఒరిస్సా, సింధూ రాష్ట్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఆంధ్రనాయకులు, ప్రజలు, సైమన్ కమీషన్‌ను పూర్తిగా బహిష్కరించి స్వరాష్ట్రం కావాలని వారికి మహజరులివ్వలేదు సరికదా "గోబాక్ సైమన్" అంటూ నిరసన ప్రదర్శనలు జరిపారు. అందువలన ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు వారు సిఫార్సు చేయలేదు. కాని రాష్ట్రాల పునర్‌నిర్మాణం చేయడానికి ఒక కమీషన్‌ని నియమించాలని సూచించింది.

## 16.14.4 మోతీలాల్ నెహ్రూ కమిటి :

డా॥ అన్సారి అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సభ నూతన భారత రాజ్యాంగ సూత్రాలను సిఫార్సు గావించేందుకుగాను మోతీలాల్ నెహ్రూ కమిటి నొకదానిని నియమించింది. 1928 లో ఈ కమిటివారు ఒక సమగ్ర నివేదికను తయారు చేశారు. అందులో ప్రజలు మాట్లాడే భాష, ప్రజాభిప్రాయము ఈ రెండూ రాష్ట్ర పునర్విభజన సందర్భంలో ముఖ్యమైనవని పేర్కొన్నారు.

వారు బ్రిటీషు పాలిత రాష్ట్రాలను గురించి వ్రాస్తూ "దేశం యొక్క నైసర్గిక స్వరూపము గాని, దేశ చరిత్ర గాని, ఆర్థిక కారణాలు గాని, భాష గాని ప్రస్తుత రాష్ట్రాల నిర్మాణమునకు కారణములై వుండలేదని, పరిపాలనా సౌకర్యాలను బట్టి ఆలోచించినా కూడా, ఈనాటి రాష్ట్రాలు సరియైనవి కావని" అన్నారు. కనుక భాషా ప్రాతిపదికగా రాష్ట్రాలుండాలని కోరేవారి కోరికను పరిశీలించాలని అన్నారు. అంతేగాక ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని అంగీకరించారు.

తదనంతరం గాంధీజీ నాయకత్వాన 1930-32 మధ్యకాలంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో కూడా ఆంధ్రులు ప్రముఖ పాత్ర వహించారు.

## 16.14.5 లండన్‌కు రాయబారాలు :

1931 జూన్‌లో ఆంధ్ర రాష్ట్ర రాజకీయ మహాసభ జరిగింది. ఆ సభానంతరం డాక్టర్ పట్టాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి లండన్ వెళ్ళబోయే గాంధీగారిని కలిసి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును గురించి కూడా బ్రిటిష్ ప్రభుత్వానికి విన్నవించమని కోరారు. కాని గాంధీగారు బ్రిటిషు ప్రభుత్వానికి ఎట్టి విన్నపము చేయలేదు.

కనుక బొబ్బిలి రాజా, మోచర్ల రామ చంద్రరావు, ఎ.పి. పాత్రో, వి.వి.గిరితో కూడా కలిసి వి.వి. జోగయ్య లండన్ వెళ్ళి సెక్రటరీ ఆఫ్ స్టేట్ అండర్ - సెక్రటరీగా వున్న లార్డు లోధియన్‌కు ఆంధ్రులు కోరుతున్న ప్రత్యేక రాష్ట్ర వాంఛను వివరించారు. "ఒరిస్సా, సింధూ, పశ్చిమోత్తర పరగణాలకు వర్తింపజేసే సూత్రాన్నే ఆంధ్రాకు సైతం వర్తింప చేయదగునని" ఈ ప్రతినిధులు కోరారు. ఈ విధంగానే 1932 లో లండన్‌లో వున్న కూర్మా వెంకటరెడ్డి నాయుడు, బొబ్బిలి రాజా ప్రభృతులు కూడా ప్రభుత్వానికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు.

కె. ఎల్. నరసింహారావు, పి.వి. సుబ్బారావు, కె.వి.ఎల్ నరసింహారావు, సి. సాంబమూర్తి అనువారలు ఇంగ్లాండుకు వెళ్ళి ప్రభుత్వానికి మహజరు సమర్పించారు. తిరిగి వచ్చిన ఆ రాయబార వర్గానికి మద్రాసులో 1935 జూన్ 27 వ తేదీన కాశీనాధుని నాగేశ్వరరావు, గద్దె రంగయ్యనాయుడు, వేమవరపు రామదాసు పంతులు మున్నగువారు స్వాగతం పలికారు. కాని ఆంధ్రుల రాయబారాలేవి ఫలప్రదం కాలేదు.

## 16.15 రాయలసీమ సభలు 1913-17 :

రాయలసీమ ప్రజలు మొదటినుండి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును గురించి పెద్దగా ఆసక్తి చూపలేదు. బాపట్ల ఆంధ్ర మహాసభ జరగకముందే 1913 లో కర్నూలు జిల్లాలోని మహానందివద్ద రాయలసీమ జిల్లాల సభ జరిగినది. ఈ సభకు 800 మంది ప్రతినిధులు 2 వేలమంది సభ్యులు హాజరయ్యారు. గుత్తికి చెందిన కేశవపిళ్ళై అను లాయరు ఈ సభకు అధ్యక్షత వహించాడు. అతడు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును సమర్థిస్తూనే అది ఆచరణ యోగ్యంకాదని మాట్లాడాడు. బాపట్ల ఆంధ్రసభకు రాయలసీమ జిల్లాలనుండి కొద్దిమంది సభ్యులే

## 17.0 లక్ష్యం :

1953 లో ఏర్పడిన ఆంధ్రరాష్ట్రం, 1948 లో విముక్తి చెందిన హైదరాబాదు రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతం కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడిన విధానాన్ని వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## 17.1 పరిచయం :

తెలంగాణాలోని స్వదేశీ సంస్థానంలోని తెలుగువారు, కోస్తా ప్రాంతంలోని బ్రిటిష్ ఏలుబడిలో ఉన్న తెలుగువారు ఎవరి ప్రాంతంలో వారు ఉద్యమాలు నడిపి, భాషా ప్రయుక్త రాష్ట్రంగా, విశాలాంధ్రగా ఏర్పడ్డారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంనుంచి తెలుగువారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కొరకు సుదీర్ఘ ఉద్యమం చేసి, ఆంధ్రరాష్ట్రాన్ని ఎట్టకేలకు 1953 లో సాధించుకున్నారు. స్వదేశీ రాజ్యమయిన నిజాం రాజ్యంలోని తెలుగువారు తమ భాషా సంస్కృతులను అభివృద్ధి చేసుకోవడానికి, నిజాంకి వ్యతిరేకంగా ఒక ఉద్యమం నడిపారు. వారిమీద నిజాం ప్రభుత్వం అనేక నిర్బంధాలు, నిషేదాజ్ఞలు జారీ చేసింది. అయినప్పటికీ నిజాం ఆంధ్రులు భాషా సమైక్యతను చాటి, సాంస్కృతికంగా అభివృద్ధి చెందారు. నిజాం రాజ్యంలో ఆంధ్రోద్యమం బలపడే కొలది, నిజాం సంస్థాన రద్దును, బాధ్యతాయుత ప్రభుత్వ ఏర్పాటుని ప్రజలు కోరారు. వారు విముక్తి ఉద్యమాన్ని ప్రారంభించి 14 నెలల పోరాటానంతరం సెప్టెంబరు 17 వ తేదీ 1948న, నిజాం నిరంకుశ పాలననుంచి విముక్తి పొందారు. ఈ విధంగా ఉభయ ప్రాంతాల తెలుగు ప్రజలకు స్వేచ్ఛ లభించినా, 1956 వరకు రెండు రాష్ట్రాలలో వేరు వేరుగా ఉండిపోయారు. ఆ విధంగా వేర్వేరుగా ఉన్న ఉభయ ప్రాంతాలను సమైక్యం చేసి, ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేసుకోవడానికి ఉభయప్రాంతాల ప్రజలు ఉద్యమాన్ని నడిపారు. ఆ ఉద్యమానికి కమ్యూనిష్టులు విశాలాంధ్ర ఉద్యమమని పేరు పెట్టారు.

## 17.2 తొలి ఆశలు :

సమైక్య ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలనే కోరిక మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రులకు మొదటినుండి ఉన్నది. అట్టి ఆశను మొదట వెలువరించినవారు ఆంధ్ర కాంగ్రేసు నాయకులైన కొండా వెంకటప్పయ్యగారు. మద్రాసు రాష్ట్రంలో ఆంధ్రోద్యమం ప్రారంభం కాకముందే 1911 వ సం॥లో కొండా వెంకటప్పయ్య గారు అఖిలాంధ్ర దేశ పటాన్ని తయారు చేశారు. అందులో మద్రాసు రాష్ట్రంలో కలిసి ఉన్న ఆంధ్ర ప్రాంతాలతోపాటు హైదరాబాదు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాల సరిహద్దు జిల్లాలైన మైసూరు, బీహారు, ఒరిస్సా, మహారాష్ట్రాలలో తెలుగువారు నివసించు ప్రాంతాలను కలిపి అఖిలాంధ్ర దేశ చిత్రపటాన్ని తయారుచేశాడు. తరువాత ఆంధ్రరాష్ట్రం అను గ్రంధాన్ని కూడా రచించారు. కాని తెలంగాణా ప్రాంతం నిజాం రాజ్యంలో ఉన్నందున అట్టి అఖండ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయడానికి వీలుకాదని భావించి, ఆ కోరికను వదులుకున్నారు. అందువలన మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్రప్రాంతాలను చీల్చి, ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు చేయవలసినదిగా ఉద్యమం నడిపారు. అట్లే తెలంగాణాలో ఆంధ్రోద్యమం మొదలైన తొలిదశలో ఆంధ్రసభ అని పేరుపెడితే మద్రాసు ఆంధ్రసభలకు, తమ సభకు సంబంధాలున్నవని నిజాం ప్రభుత్వం అనుమానిస్తుందని భావించి, మద్రాసు ఆంధ్రసభకు, తమ సభకు ఎట్టి సంబంధాలు లేవని నిరూపించుకోవడానికి వారు తమ సంస్థకు నిజాం ఆంధ్రజన సంఘం అని పేరు పెట్టుకున్నారు. సభలో తన పేరును మార్చినప్పుడు గూడా వారు ఆంధ్ర అను పదానికే ప్రాముఖ్యతనిచ్చారు. తెలుగు లేక తెలంగాణాసభ అనిపేరు పెట్టడానికి ఇష్టపడలేదు. ఆంధ్ర అనే పదాన్ని ఉపయోగించి ఆంధ్ర మహాసభ అని పేరు పెట్టుకున్నారు. అంతమాత్రంచేత అఖండ ఆంధ్రరాష్ట్ర స్థాపనే వారి ధ్యేయం అని చెప్పరాదు. ఆంధ్రజాతి, ఆంధ్రభాషా సంస్కృతుల మీద వారికున్న గాఢ అభిమానం అట్టిది. కనుక ఆంధ్ర మహాసభ అని పేరు పెట్టుకున్నారు ఏమైనా ఆ కాలంలో అనగా స్వాతంత్ర్యానికి ముందు కోస్తా ఆంధ్ర ప్రాంతాలు కలిసి సమైక్య ఆంధ్ర రాష్ట్రం ఏర్పడునని ఎవరికి నమ్మకం లేదు.

కాని 1931 సం॥లో బ్రిటీషు ప్రభుత్వం భారతదేశంలోని రాష్ట్రాలు, స్వదేశీ సంస్థానాలు మొత్తానికి సమ్మేళన రాజ్యాంగం ఏర్పాటు చేయటం తమ లక్ష్యమని ప్రకటించారు. దానితో అనేక రాష్ట్రాలలో వున్న ఆంధ్రులంతా ఒకే పరిపాలనలోకి వచ్చే అవకాశం

వున్నదని ఆశలు చిగురించాయి. కనుక తెలంగాణాతో కూడిన ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని ఆంధ్రా కాంగ్రెస్ స్వరాజ్య పార్టీలు ప్రకటించాయి. 1937 లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంధ్ర అభ్యుదయ సభలు జరిగాయి. ఆ సభలో అనాటి వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలిం. రెడ్డి భాషా ప్రాతిపదికపై దక్షిణ భారతదేశంలో ఫెడరేషన్లు ఏర్పాటుచేయాలని కోరారు. అదే సభలో మామిడిపూడి వెంకటరంగయ్య ప్రసంగిస్తూ తెలుగు ప్రజలందరూ కలసిపోయే అవకాశం వున్నదని ఆశాభావాన్ని ప్రకటించారు. 1940 లో కడప కోటిరెడ్డి గూడా అట్లే ఆశించారు. 1942 లో ఆంధ్రసభ అధ్యక్షుడైన సర్ విజయ గూడ సమైక్య ఆంధ్రరాష్ట్రం ఏర్పాడాలని ప్రకటించారు. ఈ విధంగా ఆంధ్రరాష్ట్రం రాకముందే సమైక్య ఆంధ్రరాష్ట్రం కావాలని కోరడం జరిగింది.

విశాలాంధ్రోద్యమం ప్రారంభము, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించడానికి అనేక పరిస్థితులు దోహదం చేశాయి. వానిలో కమ్యూనిస్టుల కృషి, ఆంధ్ర మహాసభల కృషి, అనేక నాయకుల కృషి ఇమిడి ఉన్నాయి.

## 17.3 కమ్యూనిస్టుల కృషి :

విశాలాంధ్ర అను భావాన్ని ప్రప్రథమంగా కల్గించినవారు ప్రముఖ కమ్యూనిస్టు నాయకులైన పుచ్చలపల్లి సుందరయ్య. నిజాం పాలన నుండి తెలంగాణా విముక్తి చెందక ముందే, ఆంధ్రరాష్ట్రం ఏర్పడక ముందే తెలుగు ప్రాంతాలన్నింటిని కలిపి విశాలాంధ్ర ఏర్పాటు కావలెనని ఆయన 1945 లోనే ఆకాంక్షించారు. 1946 నుండి విశాలాంధ్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆయన తన పార్టీ దినపత్రికకు విశాలాంధ్ర అను పేరు పెట్టారు. అంతేగాక 1946 లో "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" అను పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. దానిలో విశాలాంధ్రను ఏర్పాటు చేయడమే తమ ధ్యేయమని కమ్యూనిస్టు పార్టీకూడా ప్రకటించింది. ఆ ప్రకటన చేసిన తరువాత చివరి వరకు కమ్యూనిస్టు పార్టీ ఆ లక్ష్యానికే కట్టుబడి ఉన్నది. విశాలాంధ్ర భావం క్రమేపి ఉబయ ప్రాంతాలలో వ్యాపించి, విద్యా సంస్థలలో కూడా ప్రవేశించింది. ఆంధ్రాభ్యుదయ ఉత్సవాలలో పలువురు ఆ భావాన్ని వ్యక్తం చేశారు.

## 17.4 విశాలాంధ్ర సభలు :

కమ్యూనిస్టులు ప్రారంబించిన విశాలాంధ్రోద్యమం చాలా మందిని ఆకర్షించింది. అంతేగాదు, తెలంగాణాలో పోలీసు చర్య జరిగి నిజాం రాష్ట్రం భారతదేశంలో విలీనం అయిన తరువాత సర్కారు జిల్లాలలో విశాలాంధ్ర కోర్కె బాగా పెరిగింది. తెలంగాణాలో కూడా విశాలాంధ్ర ఏర్పాటుకు మద్దతు పెరగసాగింది. ముఖ్యంగా కమ్యూనిస్టులకు అభిమానులు విశాలాంధ్ర ఏర్పాడాలని కోరసాగారు. సర్కారు జిల్లాలలో కాంగ్రెసు నాయకుడైన అయ్యదేవర కాళేశ్వరరావు గూడా విశాలాంధ్ర భావానికి ఆకర్షితులై 1949 నవంబరు 26 వ తేదీన విజయవాడలో విశాలాంధ్ర మహాసభను ఏర్పాటు చేశాడు. విశాలాంధ్ర మొట్టమొదటి సభ 1950 లో వరంగల్లులో జరిగినది. ఈ సభకు టంగుటూరి ప్రకాశం పంతులు, కోదాట రామలింగం, హయగ్రీవాచారి, టి.యస్. మూర్తి మొదలగు ఉభయ ప్రాంతాల నాయకులు హాజరైనారు. అనగా ఉభయ ప్రాంత ఆంధ్ర నాయకులు ఒక వేదిక మీదకు వచ్చారు. వారంతా హైదరాబాదు రాజధానిగా ఆంధ్రా, తెలంగాణా ప్రాంతాలు కలిసి విశాలాంధ్ర ఏర్పడవలెనని తీర్మానించారు. ఈ సభలో విశాలాంధ్ర నిర్మాణానికి తెలంగాణాలోనే పునాది పడింది.

## 17.5 కేంద్ర కాంగ్రెస్ వ్యతిరేకత :

మొదట కాంగ్రెసు నాయకులు విశాలాంధ్ర ఉద్యమాన్ని పట్టించుకోలేదు. పైగా విశాలాంధ్ర భావం కమ్యూనిస్టుల నుండి వెలువడింది. కనుక తాము సమర్థించరాదన్నట్లు ఉదాశీనంగా వ్యవహరించారు. ముఖ్యంగా కేంద్రకాంగ్రెసు వారికి ఆంధ్రరాష్ట్రం యివ్వడమే యిష్టంలేదు. ఇక విశాలాంధ్రను ఏర్పరచే ఉద్దేశ్యమే లేదు. ముఖ్యంగా స్వతంత్ర భారత దేశానికి చివరి గవర్నర్ - జనరల్‌గా పని చేసిన చక్రవర్తి రాజగోపాలాచారికి, నెహ్రూకి సుతారాము యిష్టంలేదు. 1949 లో రాజగోపాలచారి హైదరాబాద్‌ని దర్శించారు. హైదరాబాదు రాష్ట్రం ఏర్పడాలని అన్నారు. హైదరాబాదు రాజధానిగా, విశాలాంధ్ర ఏర్పడితే దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద రాష్ట్రంగా

ఏర్పడుతుందని గ్రహించి అది యిష్టం లేక ఆయన అట్లా మాట్లాడారు. అట్లే 1951 జూలై నెలలో బెంగుళూరులో జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశంలో అయ్యదేవర కాళేశ్వరరావు హైదరాబాదు ఆంధ్రాలను కలిపి విశాలాంధ్ర నిర్మించాలని ప్రస్తావించగా, అది విని నెహ్రూ అనవసర విషయాలు ప్రస్తావించవద్దని, అధిక ప్రసంగం చేస్తే ఆంధ్రరాష్ట్రం కూడా రాకుండా పోతుందని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సంఘటనలన్నీ కేంద్రకాంగ్రెసు నాయకులకు మద్రాసు రాష్ట్రాన్ని చీల్చి ఆంధ్రరాష్ట్రం యివ్వవలెననిగాని, విశాలాంధ్రను ఏర్పాటు చేయవలెననిగాని లేదని తేల్చాయి. అయ్యదేవర కాళేశ్వరరావు, ప్రకాశం పంతులు వంటి కొద్దిమంది మాత్రమే విశాలాంధ్రోద్యమాన్ని బలపరిచారు. కాని రాష్ట్రంలో కూడా అందరు కాంగ్రెసు వారు, విశాలాంధ్ర విషయాన్ని పట్టించుకోలేదు. 1952 వరకు ఆ విషయం వ్యక్తిగత అభిప్రాయంగానే వుండిపోయింది. 1953 అక్టోబరులో విశాలాంధ్ర ఉద్యమం ఆంధ్రుల సామ్రాజ్యవాదమని నెహ్రూ విమర్శించారు.

## 17.6 1952 ఎన్నికలు - కమ్యూనిష్టుల విజయం :

ఇట్టి స్థితిలో 1952 లో సార్వత్రిక ఎన్నికలు జరిగినాయి. ఈ ఎన్నికలలో హైదరాబాదు రాష్ట్రంలోని తెలంగాణాలో కమ్యూనిష్టులు ఎక్కువ సీట్లు గెల్చుకున్నారు. అట్లే మద్రాసు రాష్ట్రంలోని కోస్తా జిల్లాలలో కూడా ఎక్కువ సీట్లు గెల్చారు. ఆ రోజులలో ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో కమ్యూనిష్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. ఆ జిల్లాలకు ఎర్ర జిల్లాలని గూడా పేరున్నది. ఈ ఎన్నికలలో కమ్యూనిష్టులు అటు మద్రాసు, ఇటు హైదరాబాదు శాసనసభలలో మంచి బలాన్ని సంపాదించారు. కమ్యూనిష్టుల విజయానికి కాంగ్రెసు వారు హడలిపోయారు. విశాలాంధ్ర ఉద్యమ ప్రభావమే కమ్యూనిష్టులకు అధిక సీట్లు సంపాదించి పెట్టినదని, సమైక్య ఆంధ్రరాష్ట్రంలో వారు తిరుగులేని ఆధిక్యతను సంపాదిస్తారని కాంగ్రెసు వారు భయపడ్డారు. దానితో కాంగ్రెసు వారు తమ విధానాన్ని మార్చుకొని, విశాలాంధ్ర ఉద్యమాన్ని బలపరిచారు. కనుక 1953 వ సం॥ జనవరిలో గోల్కొండ సమీపంలోని నానల్‌నగర్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభ సమావేశంలో హైదరాబాదు సంస్థానాన్ని తక్షణమే తెలుగు, కన్నడ, మహారాష్ట్ర ప్రాంతాలను ఆయా పరిసర రాష్ట్రాలలో విలీనం చేయవలెనని తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడినది. ఈ తీర్మానం విశాలాంధ్రభావాన్ని పూర్తిగా బలపరచడమే గాక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు గూడా కాంగ్రెసు వారు సుముఖులగునట్లు చేసినది. తరువాత 1953 అక్టోబరు 1 వ తేదీన ఆంధ్రరాష్ట్రం ఏర్పడినది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత విశాలాంధ్ర నిర్మాణానికి మరింత బలం చేకూరింది. కనుక విశాలాంధ్ర ఉద్యమం మరింత ఊపునందుకున్నది.

## 17.7 రెండవ విశాలాంధ్ర మహాసభ 1954 :

ఇట్టి స్థితిలో 1954 జూన్ 13 - 14 తేదీలలో శ్రీరంగం శ్రీనివాసరావు అధ్యక్షతన హైదరాబాద్‌లో రెండవ విశాలాంధ్ర మహాసభ జరిగినది. అంతవరకు సమైక్య ఆంధ్ర రాష్ట్రం గురించి తెలంగాణా నాయకులుగాని, ప్రజలుగాని పెద్దగా పట్టించుకోలేదు. ఈ సభలో తెలంగాణా వారిలో అభిప్రాయభేదాలు పొడచూపాయి. కొందరు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలని అభిప్రాయపడినారు. ఆ సందర్భంలో స్వామి రామానంద తీర్థ విశాలాంధ్రను సమర్థించారు. అంతేగాక ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే అది బలహీనంగా ఉంటుందని, తెలంగాణాలోని కొన్ని స్వార్థపరశక్తులకు తెలుగువారిని అణచివేసే అవకాశం లభించునని, ప్రత్యేక తెలంగాణా వాదన భావావేశంతో కూడుకున్నదని విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడితే తెలంగాణాలోని స్వార్థపరశక్తులు అణిగిపోతాయని, భారత రిపబ్లిక్ ఐక్యతకు విశాలాంధ్ర రాష్ట్రం తోడ్పడుతుందని ఉద్ఘాటించి, విశాలాంధ్రను బలపరిచారు. ఈ సభలో మాడపాటి హనుమంతరావు పాల్గొని, విశాలాంధ్ర ఉద్యమం కొత్తది కాదని, అది 50 సం॥ల నాటి భావం అనగా, 1903 నుంచి ఉన్న భావమేనని తెలిపారు.

## 17.8 ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటి సమర్థన :

రాష్ట్ర కాంగ్రెసు నాయకులు కూడా మొదట విశాలాంధ్ర భావాన్ని పట్టించుకోకపోయినా, 1949 నుండి కమ్యూనిష్టుల బలం పెరగడం చూసి తమ పద్ధతిని మార్చుకొని, విశాలాంధ్రను సమర్థించసాగారు. అందువలన 1949 లో హైదరాబాద్‌లో రాజాజీ చేసిన ప్రసంగం వలన కాంగ్రెసుకు రాష్ట్రంలో నష్టం జరుగునని గ్రహించి, ఆంధ్ర కాంగ్రెసు శాఖ, హైదరాబాదు రాజధానిగా విశాలాంధ్ర

ఏర్పడవలెనని కోరింది. అప్పటికి ఆంధ్రరాష్ట్రం ఏర్పడలేదు. ఆంధ్రరాష్ట్రం బదులు ఏకంగా ఒకేసారి విశాలాంధ్ర ఏర్పడాలని భావించారు. అట్లే 1950 మార్చిలో నిజామాబాదులో జరిగిన హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు మహాసభలో "హైదరాబాదు రాష్ట్రాన్ని భాషా ప్రాతిపదికన మూడు భాగాలుగా విభజించి, పరిసర భాషా రాష్ట్రాలలో కలిపి వేయాలని కోరుతూ" తీర్మానించారు. నిజాం నవాబు, రాజ ప్రముఖ్ పదవులను కూడా రద్దు చేయాలని కోరారు. తర్వాత హైదరాబాదులో జరిగిన సభలో కూడా ఈ తీర్మానాన్ని పునరుద్ఘాటించారు. నగర కార్పొరేషన్, ఆంధ్ర మహాసభ మొదలగు ప్రజాసంస్థలేగాక పలువురు విద్యావేత్తలు కూడా విశాలాంధ్ర కోర్కెను బలపరిచారు.

## 17.9 ఇతర ప్రదేశ్‌కాంగ్రెసు సంస్థల తీర్మానాలు :

కర్నాటక, మహారాష్ట్ర కాంగ్రెసు సంఘాలు కూడా భాషా ప్రయుక్త రాష్ట్రాలకు అనుకూలంగా తీర్మానాలు చేశాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల వాదం మైసూరు, తిరువాన్ కూరు, కొచ్చిన్ సంస్థానాలలోనికి కూడా వ్యాపించింది. అందువలన విశాలాంధ్ర నినాదంతోబాటు సంయుక్త కర్నాటక, బృహత్ మహారాష్ట్ర, మహా గుజరాత్ రాష్ట్ర అందోళనలు తీవ్రతరమై శాసనసభలలోను, బయట ప్రధాన రాజకీయ సమస్యగా, శాంతిభద్రతల సమస్యగా మారాయి. ఆంధ్రరాష్ట్ర భావన పుట్టిన నాటినుండే విశాలాంధ్ర భావం గూడా వున్నదన్నట్లు మాట్లాడి మాడపాటి వారు విశాలాంధ్ర ఉద్యమాన్ని బలపరచారు. దానితో తెలంగాణా వారిలో గూడా విశాలాంధ్ర ఏర్పడితేనే బాగుంటుందనే భావానికి బలం చేకూరింది. తరువాత దేవులపల్లి రామానుజారావు, కోదాటి రాజలింగం, హయగ్రీవాచారి, పాగా పుల్లారెడ్డి మొ॥గు తెలంగాణా నాయకులు విశాలాంధ్ర ఉద్యమాన్ని బలపరచి ప్రచారం చేశారు. దేవులపల్లి రామానుజంగారు విశాలాంధ్ర ఆవశ్యకతను తెల్పుచూ కరపత్రాలు, పుస్తకాలు ప్రచురించి ప్రచారం చేశారు. పాగా పుల్లారెడ్డిగారి నాయకత్వంలో ఒక ప్రతినిధి వర్గం ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు పర్యటించి విశాలాంధ్ర భావానికి గొప్ప ప్రచారం కల్గించారు. ఇంకా మహదీ నవాబ్‌జంగ్ అను ముస్లిం ప్రముఖుడు, పండిత నరేంద్రజీ, మందుముల నరసింగరావు మొదలగు తెలంగాణా ప్రముఖులు విశాలాంధ్ర ఏర్పడటం సంస్థాన ప్రజలకు శ్రేయస్కరమని ప్రకటనలు చేశారు.

## 17.10 ముస్లింల సమర్థన :

అదే సమయంలో తెలంగాణాలోని విద్యావంతులైన ముస్లింలు గూడా విశాలాంధ్రను సమర్థించారు. అట్టివారిలో హైదరాబాద్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అయిన మీర్ మహమ్మద్ ఆలీఖాన్, ట్రేడ్ యూనియన్ నాయకులైన మక్దూరి మొహియుద్దీన్, మొహిది నవాజ్ జంగ్ మొదలగు వారు ప్రముఖులు.

## 17.11 పత్రికల పాత్ర :

విశాలాంధ్ర భావాన్ని ప్రచారం చేయుటలో తెలంగాణా పత్రికలు గణనీయమైన పాత్రను నిర్వహించాయి. ఆంధ్ర జనత, తెలుగుదేశం, కాకతీయ మొదలగు పత్రికలు విశాలాంధ్ర ఉద్యమంపై ప్రత్యేక సంచికలు, ఎడిటోరియల్స్‌ను ప్రచురించి విశాలాంధ్ర ఉద్యమాన్ని ప్రచారం చేసారు. అందువలన అంతకు ముందు విశాలాంధ్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉన్న వారిలో కూడా కొంత మార్పు వచ్చింది.

## 17.12 కమ్యూనిష్టుల తీవ్ర ప్రచారం :

కమ్యూనిష్టులు కూడా తీవ్రంగా విశాలాంధ్ర ఉద్యమాన్ని ప్రచారం చేయసాగారు. 1952 వ సం॥లో జరిగిన ఎన్నికలలో మద్రాసు, హైదారాబాదు రాష్ట్రాల శాసనసభలలో మంచి బలాన్ని సాధించినప్పటికీ వారు ఏ రాష్ట్రంలో గూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. అందుకు కారణమేమనగా హైదరాబాదు రాష్ట్రంలోని తెలంగాణాలో కమ్యూనిష్టులకు అధికసీట్లు వచ్చినా, మిగిలిన మరాఠా, కన్నడ ప్రాంతాలలో కాంగ్రెసు ఎక్కువ స్థానాలు గెల్చినది. అంధువలన బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడింది. అట్లే మద్రాసు రాష్ట్రంలో కూడా కమ్యూనిష్టులు ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోయారు. 1953 అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినది. ఆంధ్ర శాసనసభలో గూడా కృషికార్ లోక్ పార్టీ కాంగ్రెసును బలపరచినది. దానితో కాంగ్రెసు మద్దతుతో ప్రకాశం పంతులు ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. కమ్యూనిష్టులు ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేక పోవడంతో నిరాశపడ్డారు. కనుక విశాలాంధ్ర ఏర్పడితే తమకు మంచి రాజకీయ భవిష్యత్తు ఉంటుందని, నూతన రాష్ట్రంలో తాము తప్పకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలమని వారికి గట్టి నమ్మకం కల్గినది. కనుక వారు గొప్ప దీక్షతో విశాలాంధ్ర ఉద్యమాన్ని ప్రచారం చేశారు. ఈ విధంగా ఉభయ ప్రాంతాలలో విశాలాంధ్ర ఏర్పడవలెనని కోరిక బలపడసాగింది. అయినప్పటికీ తెలంగాణాలో కొందరు ప్రత్యేక తెలంగాణా కావలెనని కోరుతూనే ఉన్నారు. ఇట్టి స్థితిలో కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై నివేదిక సమర్పించవలెనని రాష్ట్రాల పునర్విభజన కమీషన్‌ను నియమించినది.

## 17.13 స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమిషన్ :

1953 అక్టోబరు 1 వ తేదీన ఆంధ్ర రాష్ట్రం భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు భావనకు పూర్తి బలాన్ని చేకూర్చినది. అందువలన ఆంధ్రరాష్ట్ర అవతరణ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినదని చెప్పవచ్చును. బలపడిన భాషా ప్రయుక్త రాష్ట్రాల భావనను గ్రహించిన కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చినది. అందువలన దేశాన్ని భాషాప్రాతిపదికన పునర్విభజన చేయడానికి పరిశీలించవలసిన అంశాలను నిష్పక్షపాతంగా పరిశీలించడానికి రాష్ట్రాల పునర్విభజన కమీషన్‌ను ఏర్పాటు చేయునట్లు 1953 డిశంబరు 22 వ తేదిన భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ లోక్‌సభలో ప్రకటించారు. ఈ ప్రకటన చేసిన వారం రోజులకు అనగా డిశంబరు నెలాఖరుకు సయ్యద్ ఫజిల్ ఆలీ అధ్యక్షుడిగా హెచ్.ఎన్. కుంజ్రూ, కె. ఎమ్ ఫణిక్కర్‌లు సభ్యులుగా స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమీషన్ నియమింపబడినది. ఈ కమీషన్‌ను నియమించడంతో ఆంధ్రులు తమ హర్షాన్ని ప్రకటించారు. హైదరాబాదు రాష్ట్ర ప్రజలు తమ రాష్ట్రాన్ని భాషా ప్రాతిపదికపై తెలుగు, కన్నడ, మహారాష్ట్ర అను మూడు ప్రాంతాలుగా విభజించడానికి తమ ఇష్టాన్ని ఏకగ్రీవంగా వ్యక్తం చేశారు. కనుక ఆంధ్రులు తాము చిరకాలం నుండి కలలుగనే విశాలాంధ్ర ఏర్పడుతుందని సంతోషించారు. హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు వారే గాక, తమిళనాడు, మైసూరు, ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లలోని తెలుగు ప్రాంతాలుగూడా విశాలాంధ్రలో కలుపుతారని కూడా ఆశపడ్డారు.

## 17.14 తెలంగాణా నాయకుల వైఖరి :

ఫజల్ ఆలీ కమీషన్ నియామకానికి ఆంధ్ర ప్రజలు, నాయకులు సంతోషిస్తే తెలంగాణా నాయకులు తమ భవిష్యత్తును గురించి ఆందోళనకు గురి అయినారు. కొందరు హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర ఏర్పడటానికి తమ సంసిద్ధతను వెల్లడించగా, మరికొందరు విశాలాంధ్రలో కలవడానికి ఇష్టపడలేదు. వారు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడాలని వాంఛించారు. దానితో తెలంగాణా నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఎవరి వాదనలను వారు సమర్ధించుకోసాగారు. దానికి తగినట్లే నెహ్రూ 1953 అక్టోబరులో విశాలాంధ్ర ఉద్యమం ఆంధ్రుల సామ్రాజ్యవాదమని విమర్శించినందువలన ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం కొంతబలం పుంజుకున్నది. హైద్రాబాద్‌లో మహదేవ్ సింగ్ మొ॥గు ప్రజా సోషలిష్టు పార్టీ నాయకులు ప్రత్యేక తెలంగాణాను సమర్థించారు. 1953 వరకు విశాలాంధ్రను బలపరచిన కొండా వెంకటరెడ్డి 1954 లో తెలంగాణా ప్రదేశ్‌కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. వెంటనే తాను ప్రత్యేక తెలంగాణా వాదినని ప్రకటించారు. ఆయనతోపాటు ఆయన మేనల్లుడు మర్రి చెన్నారెడ్డి గూడా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కావాలని అన్నారు. 1953 జూన్ నెలలో హైద్రాబాద్ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటి సర్వసభ్య సమావేశంలో హైద్రాబాద్ రాష్ట్రాన్ని విభజించి విశాలాంధ్ర, సంయుక్త మహారాష్ట్ర, సంయుక్త కర్నాటక రాష్ట్రాలను ఏర్పాటు చేయవలెనని తీర్మానించినది. కాని 1954 లో ఆ తీర్మానాన్ని హైద్రాబాద్ కాంగ్రెసు కమిటి తిరస్కరించింది. అంతేగాక ఆయా భాషా రాష్ట్రాల ఏర్పాటును గురించి వారి ప్రతినిధులే సమావేశమై నిర్ణయించవలెనని ప్రకటించినది. అందువలన మరట్వాడా ప్రతినిధులు మహారాష్ట్రలో చేరడానికి, కర్నాటక ప్రతినిధులు ఐక్య కర్నాటక రాష్ట్రాన్ని నిర్మించుకోవడానికి నిర్ణయించుకున్నారు. తెలంగాణాలో కమ్యూనిష్టులు పూర్తిగాను, కొద్దిమంది కాంగ్రెసు వారు మాత్రమే విశాలాంధ్రను

సమర్థించారు. హైద్రాబాద్ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు కూడా ఊగిసలాటలోనే ఉన్నారు. ముఖ్యంగా కొండా వెంకటరెడ్డి, ఆయన మేనల్లుడు మర్రి చెన్నారెడ్డి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయవలెనని గట్టి పట్టుపట్టారు. అంతవరకు ప్రత్యేక తెలంగాణా కావాలని కోరికతో ఊగిసలాడే బూర్గుల రామకృష్ణారావు విశాలాంధ్ర వైపు మొగ్గారు. అందుకు కొండా వెంకటరెడ్డి బూర్గులని ఆక్షేపించారు. తాను ఢిల్లీ వెళ్ళినప్పుడు గోవింద వల్లభా పంత్ ప్రభావం వలన బూర్గుల విశాలాంధ్రవాదిగా మారారని వెంకటరెడ్డి ఆక్షేపించారు. ఆ ఆక్షేపణలను లెక్క చేయకుండా బూర్గుల విశాలాంధ్రను బలపరిచారు.

అట్లే ఆంధ్ర ప్రాంతంలో గూడా కొద్దిమంది విశాలాంధ్ర లేకపోయినా ఫరవాలేదని అన్నారు. అట్టివారిలో ఆచార్య రంగా ముఖ్యులు. ఆయన రెండు రాష్ట్రాలు ఉంటే తప్పులేదన్నారు. హ్యూమనిస్టు ఆవుల గోపాలకృష్ణమూర్తి ఆంధ్ర, తెలంగాణాలను కలపవద్దన్నారు. గుంటూరు వాస్తవ్యులు నడింపల్లి నరసింహారావు, దరువూరి వీరయ్య గుంటూరులో సభను ఏర్పాటుచేసి తీర్మానాలు చేశారు. తరువాత వారు తెలంగాణాలోని సూర్యాపేటలో మరియొక సభ జరిపి రెండు తెలుగు రాష్ట్రాలు వుండవచ్చునని, తప్పులేదని ఉపన్యసించారు. వారు తప్ప మిగిలిన ఆంధ్రానాయకులంతా, ఆంధ్రరాష్ట్ర ప్రజలందరు విశాలాంధ్రను సమర్థించారు. అదే సమయంలో ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం నిజాంను గవర్నర్‌గా నియమిస్తూ విశాలాంధ్రను ఏర్పాటు చేయవలసినదిగా కోరుతూ రాష్ట్రాల పునర్విభజన కమీషన్‌కు విజ్ఞాపనపత్రాన్ని సమర్పించింది. ఈ లోపల కొందరు తెలంగాణా వేరుగా వుంటే ముస్లింల ఏర్పాటువాదం పెరుగుతుందని, మరికొందరు కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరుగుతుందని నెహ్రూకి చెప్పారు. ఈ భయంవల్లనే బూర్గుల రామకృష్ణారావు గూడా ప్రత్యేక తెలంగాణా వాదాన్ని విడిచి విశాలాంధ్రను సమర్థించారని అంటారు.

## 17.15 ఫజల్ ఆలీ కమీషన్ హైదరాబాదు రాక :

ఇట్టి అనిశ్చిత స్థితిలో 1954 లో రాష్ట్రాల పునర్విభజన సంఘం హైదరాబాద్‌ను దర్శించినది. వివిధ సంస్థలు, రాజకీయపార్టీలు, ప్రముఖ వ్యక్తుల అభిప్రాయాలను తెలుసుకొని వారినుండి విజ్ఞాపన పత్రాలను స్వీకరించినది. హైద్రాబాద్ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజింపవలెనని అన్ని పక్షాల వాదనలు విని, వారి విజ్ఞాపన పత్రాలు స్వీకరించి, అన్ని విషయాలు పరిశీలించి, కమీషన్ 1955 సెప్టెంబరు 30 వ తేదీన తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినది. హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించాలని సిఫార్సు చేసింది. కొందరు హైదరాబాదు రాష్ట్రాన్ని విభజించరాదని, 200 సం॥ల నుండి దక్కను ప్రాంతానికి ఒక ప్రత్యేక సంస్కృతిని ఈ రాష్ట్రం ఏర్పరచినదని, కనుక హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించరాదని మహాజరును సమర్పించారు. వారి వాదనను కమీషన్ త్రోసివేసినది. అంతేగాక హైద్రాబాద్ రాష్ట్రాన్ని ఏర్పరచింది. హైదరాబాదు రాష్ట్రాన్ని విభజించి కన్నడ ప్రాంతాలను మైసూరు రాష్ట్రంలోను, మరాఠీ ప్రాంతాలను బొంబాయి రాష్ట్రంలోను విలీనం చేయవలెనని ఈ సంఘం సిఫార్సు చేసినది. అంతేగాక విశాలాంధ్ర ఏర్పడితే వుండే ప్రయోజనాలను గూడా కమీషన్ వివరించినది.

1953 లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణాలోని తెలుగు జిల్లాలు చేరి విశాలాంధ్రగా అవతరిస్తే 32 మిలియన్ల జనాభాతో దక్షిణ దేశంలో పెద్దరాష్ట్రంగా మారుతుంది. ముడి సరుకులు జలసంపద, విద్యుత్ వనరులు, ఖనిజ సంపదతో ఆర్థికంగా కూడా పరిపుష్టమైన రాష్ట్రం అవుతుంది. హైద్రాబాద్, సికిందరాబాద్ జంట నగరాలు రాష్ట్రానికి రాజధాని అయి, రాజధాని సమస్య కూడా పోతుంది. కృష్ణా, గోదావరి నదీ జలాలపై ఒకే ప్రభుత్వానికి అధికారం సంప్రదిస్తుంది. విశాలాంధ్ర ఏర్పడితే, సాంకేతికంగా, పరిపాలనపరంగా మంచి అభివృద్ధి జరుగుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలంగాణా అనేక ప్రయోజనాలు పొందుతుంది. కనుక తెలంగాణాను ఆంధ్రరాష్ట్రంలో కలిపి విశాలాంధ్ర ఏర్పాటు చేయడం చాలా అవసరం అని కమీషన్ తన అభిప్రాయాన్ని తెల్పినది. కరువు కాటకాలప్పుడు తెలంగాణాలో ఆహార కొరత ఉంటుంది. అప్పుడు ఆంధ్రరాష్ట్రంలోని మిగులు ఉత్పత్తి తెలంగాణాకు ఉపయోగపడుతుంది. అదే విధంగా ఆంధ్రరాష్ట్రంలో బొగ్గు నిక్షేపాలు లేవు. తెలంగాణాలోని సింగరేణిలో బొగ్గు నిల్వలున్నాయి. ఇవి రాష్ట్రాభివృద్ధికి తోడ్పడతాయి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే పరిపాలనా ఖర్చు ఎక్కువగా ఉంటుంది. తెలంగాణా ఆదాయంలో అధికభాగం పరిపాలనా నిర్వహణకే సరిపోతుంది. అభివృద్ధి పథకాలకు ఆదాయం చాలదు. ఆంధ్ర రాష్ట్రంలోను, తెలంగాణాలోను కూడా విశాలాంధ్ర

ఏర్పడవలెనను కోరికలు బలంగా ఉన్నవి. హైద్రాబాద్ శాసన సభ్యులలో అధికులు కూడా విశాలాంధ్రను సమర్థించారు. కనుక విశాలాంధ్రను ఏర్పాటు చేయడం చాలా సమంజసమని కమీషన్ భావించినది.

అయితే ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయవలెనను వారి వాదనను గూడా సంఘం పరిశీలించినది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటినుండి ఆర్థిక యిబ్బందులను ఎదుర్కొనుచున్నది. ఆంధ్రరాష్ట్ర ఆదాయాన్ని తెలంగాణాతో పోల్చితే ఆంధ్ర రాష్ట్రపు సగటు ఆదాయం తెలంగాణా కంటే తక్కువ. తెలంగాణాలో సాలుకు 5 కోట్ల ఎక్సైజ్ ఆదాయం వచ్చుచున్నది. ఇంకా భూమి శిస్తు రేటు అధికం అయినందువలన అధిక భూమి శిస్తు వసూలు అగుచున్నది. కనుక విశాలాంధ్ర ఏర్పడితే తెలంగాణా మిగులు నిధులు ఆంధ్రప్రాంతం ఉపయోగించుకుంటుందేమోనని తెలంగాణా వారికి భయసందేహాలున్నవి. హైద్రాబాద్ రాష్ట్రంలో తెలంగాణా కూడా అభివృద్ధి చెందిన ప్రాంతంగా పరిగణింపబడేది. కనుక విశాలాంధ్రలో చేరినందువలన పాలనాపరంగా తెలంగాణాకు ప్రత్యేకంగా ఒరిగేదియేమిలేదు. కనుక విలీనంవల్ల తెలంగాణాకు ఎటువంటి కొత్త ప్రయోజనాలు కలగవు, అని కొందరు తెలంగాణావారు భావించారు. అభివృద్ధి పథకాలలో కూడా విశాలాంధ్రలో తెలంగాణాకు ప్రాధాన్యత లేకపోవచ్చును, అను భయంకూడా తెలంగాణా వారికున్నది. కృష్ణామీద నందికొండ, గోదావరినది మీద కృష్ణాపురం ప్రాజెక్టులు భారతదేశంలోనే గొప్ప ప్రాజెక్టులు. అవి రెండూ తెలంగాణాలోనే వున్నవి. ఈ జలాలు కోస్తాలోని డెల్టా ప్రాంతాలకు గూడా వినియోగించే ప్రతిపాదన ఉన్నది. అందువలన కృష్ణా, గోదావరి నదుల నీటిని ఉపయోగించుకోవడంలో తమకు వున్న స్వతంత్ర హక్కులను వదులుకోవడానికి తెలంగాణా ప్రజలకు యిష్టంలేదు. అంతేగాక విశాలాంధ్రను వ్యతిరేకించడానికి మరియొక కారణం కూడా వున్నది. అన్ని విధాల అభివృద్ధి చెందిన కోస్తావారు తెలంగాణా ప్రాంతాన్ని అనేక విధాలుగా దోపిడీ చేయవచ్చును. కోస్తావారు విద్యావిషయాలలో బాగా అభివృద్ధి చెందినవారు. తెలంగాణాలోని ఉద్యోగాలన్నీ వారు పొందవచ్చును. వారితో తెలంగాణావారు పోటీపడలేరు. అదే తెలంగాణా రాష్ట్రం వేరుగా వుంటే, కొద్ది చదువు కల్గిన తెలంగాణా వారికే ఉద్యోగాలన్నీ లభిస్తాయి. హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాలలో తప్ప మిగిలిన తెలంగాణా ప్రాంతాలలో విద్య చాలా తక్కువ. విద్యాధికులైన ఆంధ్రప్రాంతం వారికి తెలంగాణా వలసగా తయారయ్యే ప్రమాదం వున్నదని తెలంగాణా వారికి భయం వున్నది. ఈ విధంగా తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా వుండాలని చెప్పేవారి వాదనలను పరిశీలించి అందు కొంత వాస్తవం ఉన్నప్పటికీ, విశాలాంధ్ర ఏర్పాటు వలన ఉభయ ప్రాంతాలకు కల్గే ప్రయోజనాలు చాలా ఎక్కువ గనుక విశాలాంధ్ర ఏర్పాటుకు ఎట్టి అటంకాలు కల్గించరాదని రాష్ట్ర విభజన కమీషన్ భావించింది. అంతేగాక కమీషన్ మరియొక సలహా గూడా ఇచ్చినది. ఆంధ్ర తెలంగాణా ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని ప్రస్తుతానికి తెలంగాణా రాష్ట్రాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసి, హైదరాబాద్ రాష్ట్రంగా పేరు పెట్టవచ్చును. మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్లు, ఖమ్మం, కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, బీదర్ మొత్తం 10 జిల్లాలతో హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటు చేయవచ్చును. ఈ జిల్లాలతోపాటు కృష్ణాజిల్లాలోని మునగాల జమీందారీ ప్రాంతాన్ని గూడా హైదరాబాద్ రాష్ట్రంలో చేర్చాలి. మునగాల పూర్వం నల్లగొండ జిల్లాకు చెందినది. కాని ఇది ఆంధ్రరాష్ట్రంలో భాగం అయినది. 1961 లో జరిగే ఎన్నికల ద్వారా ఏర్పడే హైద్రాబాద్ అసెంబ్లీలో 2/3 వంతు మెజారిటీ ఆంధ్ర రాష్ట్రంతో కలిసి పోవడానికి అంగీకరిస్తే విశాలాంధ్రను ఏర్పాటు చేయవచ్చును అని రాష్ట్ర విభజన కమీషన్ వివరించినది.

## 17.16 విభజన కమీషన్ సిఫార్సులపై విమర్శ :

కమీషన్ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలెనని చేసిన సూచన చాలామంది విమర్శకు గురి అయినది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర వాదులైన కొండా వెంకటరెడ్డి, మర్రి చెన్నారెడ్డి కమీషన్ సిఫార్సును అభినందించారు. కాని మిగిలిన వారందరూ తీవ్రంగా విమర్శించారు. కమ్యూనిష్టులు ఈ విషయంలో రాజీనామా చేసి మరలా ఎన్నికలకు సిద్ధమేనని ప్రకటించారు. తెన్నేటి విశ్వనాథం కమీషన్ వాదనని విశాలాంధ్రకు అనుకూలంగా చెప్పి, డిక్రీని ప్రత్యేక తెలంగాణాకు ఇచ్చారని తీవ్రంగా దుయ్యబట్టారు. తెలంగాణా ఆంధ్ర రెండు ప్రాంతాలలో కమీషను నిర్ణయం గొప్ప చర్చనీయాంశం అయినది. తెలంగాణా నాయకులు కూడా కమ్యూనిష్టులకు వంతపాడారు. తెలంగాణాలోని 10 జిల్లాల కాంగ్రెసు కమిటీలలో 7 కమిటీలు విశాలాంధ్రను బలపరిచినవి. హైద్రాబాద్ శాసనసభలో విశాలాంధ్ర ప్రస్తావన వచ్చినప్పుడు 174 మంది సభ్యులలో 147 మంది తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. వారిలో 103 మంది

విశాలాంధ్రకు మద్దతునిచ్చారు. 29 మంది ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేయవలెనని కోరారు. 15 మంది తటస్థంగా ఉండిపోయారు. ఇక ఆంధ్రరాష్ట్రంలోని నాయకులందరూ అన్ని పార్టీలవారు విశాలాంధ్ర ఏర్పడాలని అన్నారు. అంతకుముందు వ్యతిరేకతను తెల్పిన ఆచార్య రంగా గూడా విశాలాంధ్రకు మద్దతు తెలిపారు.

## 17.17 కమ్యూనిష్టుల సభలు :

ఇదే సందర్భంలో విశాలాంధ్రను బలపరుస్తూ కమ్యూనిష్టులు కూడా సదస్సులు జరిపారు. ఫజులాలీ కమీషన్ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలెనని చేసిన సిఫార్సు ప్రత్యేక తెలంగాణావాదుల వాదనకు బలాన్ని సమకూర్చినది. ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని ప్రముఖ నాయకులైన మామా అల్లుళ్ళు అనగా కొండా వెంకటరెడ్డి, మర్రి చెన్నారెడ్డి మరింత తీవ్రం చేశారు. వారికి ఆనాటి విద్యార్థులు కొందరు తోడ్పడ్డారు. ప్రతేక తెలంగాణా వాదానికి అంతకు పూర్వం నిజాం రాష్ట్రంలో జరిగిన ముల్కి ఉద్యమాని కంటే కొంత ఎక్కువ స్పందన వచ్చినప్పటికీ వారు ఎంత ప్రయత్నించినా తెలంగాణా ఉద్యమం గ్రామాలకు ప్రాకలేదు. వారు ఆశించినంత బలం రాలేదు. అందువలన విశాలాంధ్రను బలపరచే సభలు యేమైనా జరిగితే ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని బలపరచే విద్యార్థులు విశాలాంధ్ర సభలకు వచ్చి నాటిని భగ్నంచేసే ప్రయత్నాలు చేసేవారు.

అట్టిస్థితిలో ప్రత్యేక తెలంగాణా వాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి కమ్యూనిష్టులు నడుంబిగించారు. అందుకు వారు సికిందరాబాద్‌లో మొదట బహిరంగసభను జరిపారు. ఆ సభలో రావి నారాయణరెడ్డి ప్రధాన ఉపన్యాసకులు. ఇంకా అనేకమంది ఉపన్యసించి ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ఖండించి విశాలాంధ్రను బలపరిచారు. తరువాత హైదరాబాద్ ఎగ్జిబిషన్‌లో జరిగిన సభ రెండవది. ఈ సభకు శ్రీశ్రీ అధ్యక్షుడు. బద్దం ఎల్లారెడ్డి ఆహ్వాన సంఘ అధ్యక్షులు. రావి నారాయణరెడ్డి ఆహ్వాన సంఘ కార్యదర్శి. ఈ సదస్సులో ఆంధ్ర, తెలంగాణా ఉభయప్రాంతాలనుండి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. తరువాత పాతపట్నంలో మరియొక సదస్సు కూడా కమ్యూనిష్టులు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ రెండు సదస్సులు కూడా విశాలాంధ్రను బలపరచాయి. ఇంకా అనేక సదస్సులు జరిగినవి.

ఈ సందర్భములో మరియొక ముఖ్య బహిరంగ సభ హైదరాబాదులోని వివేక వర్ధని గ్రౌండ్స్‌లో జరిగినది. ఈ సభను విశాలాంధ్రను బలపరచే కాంగ్రెసు వాదులు, కమ్యూనిష్టులు ఉభయులు కలిసి ఏర్పాటు చేశారు. ఈ సభలో కొందరు ప్రత్యేక తెలంగాణా వాదులు అల్లర్లు లేవదీశారు. ఆ సభలోని విశాలాంధ్ర వాదులు వారికి దేహశుద్ధి చేశారు. సభను భగ్నం చేయడానికి విద్యార్థులు కూడా వచ్చి అవాంతరాలు కల్పించారు. పోలీసులు వారికి బుద్ధి చెప్పారు. అంతవరకు హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు తన ప్రత్యేక తెలంగాణా వాదాన్ని విరమించుకొని ప్రత్యేక తెలంగాణా వాదులనుండి సభను కాపాడవలసినదని పోలీసులకు ఆదేశాలు యిచ్చారు. పోలీసులు వచ్చి అల్లరిచేసే విద్యార్థులను అదుపులోనికి తెచ్చారు. దానితో సభ జయప్రదంగా జరిగినది. ఈ కాలంలో హైద్రాబాదు రాష్ట్రంలో పర్యటించుచున్న నెహ్రూగారు విశాలాంధ్ర ఏర్పడుతుందని ప్రకటించారు. దానితో ప్రత్యేక తెలంగాణావాదుల ఉద్యమం చల్లబడి పోయింది. అయినప్పటికీ నాయకులు తమ ప్రయత్నాలు మానలేదు. దాని ఫలితంగా పెద్ద మనుషులు ఒప్పందం అనివార్యమయింది.

ఆంధ్రరాష్ట్రంలోలాగానే విభజన సంఘం సిఫార్సులను భారతదేశంలోని ఇతర రాష్ట్రాలలో గూడా చాలామంది వ్యతిరేకించారు. ఒక్క కేరళ, మైసూరు రాష్ట్రాలు తప్ప మరెవ్వరూ కమీషన్ సిఫార్సులను ఆమోదించలేదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలని ప్రజలు హింసాత్మక సంఘటనలకు పాల్పడ్డారు. పశ్చిమబెంగాలు, బీహారు రాష్ట్ర ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలను ఏకంచేసి ద్విభాషా రాష్ట్రంగా ఏర్పాటు చేయమని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. కొందరు వారి కోరిక దేశ ఐక్యతకు దోహదం చేస్తుందని, బెంగాలు, బీహారు ముఖ్యమంత్రులను అభినందించారు. చక్రవర్తి రాజగోపాలచారి మద్రాసు, మైసూరు, కేరళ రాష్ట్రాలను కలిపి దక్షిణ ప్రదేశ్‌గా రూపొందించాలని సూచించాడు. బీహారు, బెంగాలు రాష్ట్ర ముఖ్యమంత్రులు, రాజగోపాలచారి సలహాలు దేశంలో ఇంకా హింసాత్మక సంఘటనలకు దారితీశాయి. దానితో కేంద్ర ప్రభుత్వం ద్విభాషా, బహుబాషా రాష్ట్రాల ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకున్నది.

ఈ విధంగా దేశ వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలతో కాంగ్రెసు కేంద్ర అధిష్ఠాన వర్గం తన వైఖరిని మార్చుకొని విశాలాంధ్రను ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. హైద్రాబాదు రాష్ట్ర ప్రజలుగూడా విశాలాంధ్రను బలపరచినందున దాని ప్రభావం కేంద్ర కాంగ్రెసు అధిష్ఠాన వర్గంపై ప్రసరించింది. కాని ప్రత్యేక తెలంగాణా వాదులైన కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి తమ వైఖరిని మార్చుకోలేదు. అట్టి క్లిష్టపరిస్థితులలో ముఖ్యమంత్రిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు విజ్ఞతను ప్రదర్శించి ఢిల్లీ వెళ్ళి విశాలాంధ్రను ఏర్పాటు చేయడానికి కేంద్ర నాయకులను ఒప్పించారు. అందువలన ఆంధ్ర, తెలంగాణా ప్రాంత నాయకుల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను తొలగించి విశాలాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలెనని కాంగ్రెసు అధిష్ఠానవర్గం నిర్ణయించింది. అందుకుగాను ఉభయ ప్రాంతాల నాయకులతో సంప్రదింపులు జరపడానికి 1956 ఫిబ్రవరి 20 వ తేదీన ఢిల్లీలోని హైద్రాబాద్ అతిథిగృహంలో సమావేశం ఏర్పాటు చేసి ఒక ఒప్పందాన్ని రూపొందించింది. ఈ ఒప్పందాన్నే పెద్దమనుష్యుల ఒప్పందం అని అన్నారు. ఈ సమావేశానికి ఆంధ్ర తెలంగాణా నాయకులు హాజరయ్యారు.

## 17.18 పెద్దమనుషుల ఒప్పందం :

1. నూతన రాష్ట్రంలో పరిపాలనా ఖర్చును ఆంధ్ర తెలంగాణా నిష్పత్తిలో భరించాలి. తెలంగాణా మిగులు నిధులు ఐదు సం॥ల వరకు తెలంగాణా అభివృద్ధికే వినియోగించాలి. తెలంగాణ సభ్యులు కోరితే కాలపరిమితిని మరియొక ఐదేళ్ళకు పొడిగించాలి.
2. తెలంగాణా సభ్యులు అంగీకరిస్తే తెలంగాణాలో మద్యపాన నిషేదం చేయాలి.
3. తెలంగాణాలో సాంకేతిక విద్యతోపాటు విద్యాసౌకర్యాలు అన్నీ తెలంగాణావారికే ఇవ్వాలి లేదా రాష్ట్రంలోని అన్ని విద్యా సౌకర్యాలలో తెలంగాణావారికి మూడవవంతు కేటాయించవలెను.
4. ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల విలీనం వల్ల ఉద్యోగాలు తగ్గించవలసి వచ్చినచో, ప్రాంతాల నిష్పత్తి ప్రకారమే తగ్గించవలెను.
5. భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే ఉద్యోగాలన్నిటిని నిష్పత్తి ప్రకారమే నియమించవలెను.
6. తెలంగాణాలో పరిపాలనా భాషగా ఉర్దూ 5 సం॥ల వరకు కొనసాగవలెను. ప్రస్తుతం ఉద్యోగాలు చేయుచున్న తెలంగాణా వారిని తెలుగు నేర్చుకొనవలెనని నిర్బంధం చేయరాదు.
7. తెలంగాణా నిష్పత్తి ఉద్యోగాలలో ఉద్యోగాలు పొందవలెనన్న వారికి తెలంగాణాలో 12 సం॥ల నివాస యోగ్యత వుండవలెను.
8. తెలంగాణా ప్రాంతం అభివృద్ధి చేసుకోవడానికి ఒక ప్రాంతీయ సంఘం వుండాలి. ఆ సంఘంలో 20 మంది సభ్యులు ఉండాలి. వారిలో ప్రతిజిల్లానుండి ఒక శాసనసభ్యుడు వుండవలెను. ఆ సభ్యుని ఆ జిల్లా శాసన సభ్యులు ఎన్నుకొందురు. అట్లా 9 జిల్లాలనుండి 9 మంది ప్రాంతీయ సంఘంలో సభ్యులగుదురు. అట్లే తెలంగాణా, పార్లమెంటు, శాసనసభ్యులు అందరూకలసి వారిలో మరియొక ఆరుగురిని ఎన్నుకొందురు. తెలంగాణా శాసన సభ్యులందరూ కలసి ఇతర ప్రాంతాల నుండి మరియొక 5 గురిని ఎన్నుకొందురు. మొత్తం 9+6+5 =20 మంది సభ్యులు తెలంగాణా ప్రాంతీయ సంఘంలో సభ్యులుగా వుండవలెను.
9. ప్రాంతీయ సంఘానికి రాజ్యాంగబద్ధత ఇవ్వవలెను. రాజ్యాంగంలోని 371 నిబంధన ప్రకారం ఈ సంఘాన్ని రాష్ట్రపతి ధృవపరచును.
10. ప్రాంతీయసంఘం తెలంగాణా ప్రాంతానికి చెందిన ప్రణాళికా రచన, నీటిపారుదల సౌకర్యాలు, పారిశ్రామికాభివృద్ధి తెలంగాణాలోని ఉద్యోగ నియామకాలు, ప్రజాసంక్షేమం విద్యా ఆరోగ్య వ్యవహారాలను నిర్ణయించును. ఆ సంఘ నిర్ణయాలనే రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపవలెను.
11. తెలంగాణాలోని భూముల అమ్మకాలు కొనుగోళ్ళు ప్రాంతీయమండలి పర్యవేక్షణలోనే జరుగవలెను.
12. రాష్ట్రమంత్రివర్గంలో ఆంధ్రప్రాంతానికి 60 శాతం, తెలంగాణా ప్రాంతానికి 40 శాతం వుండవలెను.

13. ముఖ్యమంత్రి పదవికి ఆంధ్ర ప్రాంతంవారు ఎన్నికైతే తెలంగాణాకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వవలెను. తెలంగాణా వ్యక్తి ముఖ్యమంత్రి అయితే ఆంధ్రప్రాంతం వ్యక్తికి ఉపముఖ్యమంత్రి పదవిని ఇవ్వవలెను.

14. హైదరాబాద్ ప్రదేశ్‌కాంగ్రెస్ 1962 వరకు తెలంగాణా ప్రదేశ్‌కాంగ్రెస్ సంఘంగా కొనసాగాలి.

ఈ నియమాలతో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందం మీద ఆంధ్ర ప్రాంతంనుండి నాటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గసభ్యులు నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, తెలంగాణా ప్రాంతం నుండి నాటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, తెలంగాణా నాయకులైన కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావు మొ॥ వారు సంతకాలు చేశారు. పెద్దమనుషుల ఒప్పందం తరువాత ఆంధ్రరాష్ట్ర శాసనసభ కర్నూలులో సమావేశమై ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల ఏకీకరణ వెంటనే చేయాలని తీర్మానం చేసింది. ఆ సందర్భంలో ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డిగారు సమైక్య ఆంధ్రరాష్ట్రం భాషాపరంగానేకాక, ఆర్థికంగా, సాంస్కృతికంగా ఎన్నో ప్రయోజనాలు పొందునని వక్కాణించారు.

ఈ పెద్ద మనుషుల ఒప్పందంలోని అంశాలను స్టేట్ రీ ఆర్గనైజేషన్ యాక్టు అనగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో చేర్చి భారత ప్రభుత్వం దానికి చట్టబద్ధతను కల్పించింది. తర్వాత రాష్ట్ర ఏర్పాటుకు పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టారు. భారత పార్లమెంటుకు సమర్పించే ముసాయిదా బిల్లులో రాష్ట్రానికి ఆంధ్ర - తెలంగాణా అని పేరు పెట్టారు. విశాలాంధ్ర అను పేరు కమ్యూనిష్టులు ప్రతిపాదించినది. కనుక కేంద్రంలోని కాంగ్రెసు వారు ఈ పేరును ఆమోదించలేదు. అందువలన వారు ఆంధ్ర - తెలంగాణా అని పేరు పెట్టారు. కాని ఆ పేరులో రెండు ప్రాంతాలలోని భేదం స్పష్టంగా కన్పించుచున్నది. ఆంధ్ర ప్రాంత ప్రతినిధులు దానికి అభ్యంతరం తెలిపారు. అందువలన రాష్ట్ర బిల్లును సెలక్టు కమిటీకి నివేదించారు. సెలక్టు కమిటి 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం' అని పేరు మార్చింది. పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదించబడి 1956 నవంబరు 1 వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరించింది. విశాలాంధ్ర అని పేరుమార్చి 'ఆంధ్రప్రదేశ్' అని పేరు మార్చినందువలన రాష్ట్రానికి లాభమే కలిగింది. అందువలన అక్షరక్రమంలో భారతదేశపు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ రాష్ట్రం అయింది.

## 17.19 ఆంధ్రప్రదేశ్ అవతరణ :

ఈ విధంగా 1956 నవంబరు 1 వ తేదీన సి.ఎం. త్రివేదిగారు గవర్నరుగా, నీలం సంజీవరెడ్డిగారు ముఖ్యమంత్రిగా, హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భారత ప్రధానమంత్రి పండిట్ జవహార్‌లాల్ ప్రారంభించారు. ఆంధ్రుల చిరకాలవాంఛ నెరవేరింది. వేలాది సం॥గా విడివిడిగా వున్న ఆంధ్రజాతి సమైక్యం చెందినది.

## 17.20 సరిహద్దు సమస్యలు :

అయితే అనేక తెలుగు ప్రాంతాలు పొరుగు రాష్ట్రాలలో కలిసిపోయాయి. గంజాం, కోరాపుట్, బరంపురం, జయపురం సంస్థాన భాగాలు 1936 లో ఒరిస్సాలో కలిపివేశారు. అట్లే సేలం జిల్లాలోని తెలుగు భాషా ప్రాంతాలైన హోసూరు, వేపనపల్లి, కృష్ణగిరి ఫిర్కాలు మున్నగునవి తమిళనాడు రాష్ట్రంలోకిపోయాయి. అదేవిధంగానే బళ్ళారి, మోపా, రూపన్‌గుడి, కోలారు మున్నగు తెలుగు ప్రాంతాలు కర్నాటక రాష్ట్రంలో చేర్చబడ్డాయి. చాందావరకు బస్తరు మొదలగు తెలుగు ప్రాంతాలు మధ్యప్రదేశ్‌లో కలిపివేయబడినవి. ఇవన్నీ భాషా ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్‌కు చెందవలసిన తెలుగు భూభాగాలు. సరిహద్దు సమస్యల పరిష్కారం న్యాయసమ్మతంగా జరగలేదు. శాసన సభలో ఈ సమస్యలు అప్పుడప్పుడు ప్రస్తావనకు వచ్చినప్పటికి వాటిని పొందడానికి ప్రజాందోళన జరగలేదు. ఉత్తర ఆంధ్ర సరిహద్దులలో పర్లాకిమిడి ప్రాంతాలు, దక్షిణ సరిహద్దులలో హోసూరు కృష్ణగిరి ప్రాంతాలు, కోలారు జిల్లా తెలుగు ప్రాంతాలు ఆంధ్రరాష్ట్ర విస్తీర్ణంలోకి రావాలని అప్పటి ఆంధ్రప్రభుత్వం ప్రయత్నించింది. కాని మద్రాసు తదితర రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు సముఖత వెల్లడించకపోవడంతో ఆ ప్రయత్నం ఫలించలేదు.

## 17.21 సమీక్ష :

మొత్తంమీద చాలా తెలుగు ప్రాంతాలు పొరుగు రాష్ట్రాలలో చేర్చబడ్డాయి. ఇరవై జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

## 17.22 వ్యాసరూప ప్రశ్నలు :

1. ఆంధ్రప్రదేశ్ అవతరణలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్రను వివరింపుము.
2. ప్రత్యేక తెలంగాణావాదుల వైఖరిని గురించి వ్రాయుము.
3. పెద్దమనుషుల ఒప్పందంలోని అంశాలను వ్రాయుము.

## 17.23 ఉపయుక్త గ్రంథాలు :


1. పుచ్చలపల్లి సుందరయ్య - విశాలాంధ్రలో ప్రజారాజ్యం
2. వావిలాల గోపాలకృష్ణయ్య - విశాలాంధ్ర - చారిత్రక పునరాలోచనం
3. దేవులపల్లి రామానుజరావు - విశాలాంధ్ర రాష్ట్రం
4. మాదల వీరభద్రరావు - విశాలాంధ్రోద్యమం
5. K.V. Narayana Rao - The Emergence of Andhra Pradesh
6. డా. ముప్పాళ్ళ హనుమంతరావు - సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి 4 వ భాగం


డా. ముప్పాళ్ళ హనుమంతరావు

పాఠం-18

# కమ్యూనిస్టు ఉద్యమం

## విషయక్రమం


18.1 లక్ష్యం

18.2 పరిచయం

18.3 ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమదశలు

18.4 తొలిదశ 1932-35

18.5 రెండవ దశ 1936-42

18.5.1 కమ్యూనిస్టు పార్టీ ప్రథమసభ

18.5.2 సోషలిస్టు పార్టీలో చేరిక

18.5.3 రాజకీయ పాఠశాలలు

18.5.4 రాష్ట్ర సోషలిస్టు పార్టీ సభలు

18.5.5 రంగా రైతుయాత్ర

18.6 కమ్యూనిస్టు పత్రికలు - గ్రంథాలు

18.7 మూడవ దశ 1942 - 1948

18.7.1 మూడవ పార్టీ మహాసభ

18.7.2 1946 ఎన్నికలు

18.7.3 తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం

18.7.4 ఆంధ్రా కమ్యూనిస్టు పార్టీతో అనుబంధం

18.8 నాలుగవ దశ 1947 - 64

18.8.1 తెలంగాణాలో

18.8.2 ఆంధ్రాలో

18.8.3 ఎన్నికలలో పాల్గొనుట

18.8.4 ఐదవ పార్టీ మహాసభ

18.8.5 తెలంగాణా కమ్యూనిస్టు ప్రథమ మహాసభ

18.9 సమీక్ష

18.10 వ్యాసరూప ప్రశ్నలు

18.11 ఉపయుక్త గ్రంథాలు

## 18.1 లక్ష్యం

ఆంధ్రాలోనూ, తెలంగాణాలోనూ కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావాన్ని గురించి, ఆ పార్టీ కార్యక్రమాల గురించి, ఆ పార్టీకి చెందిన వివిధ దశల గురించి తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## 18.2 పరిచయం

ప్రపంచాన్ని ప్రభావితం చేసిన సిద్ధాంతాలలో కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రముఖమయింది. కారల్ మార్క్స్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం రష్యాలో 1917లో విజయం సాధించింది. రష్యాలో నవంబరు 1917లో లెనిన్ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. రష్యా విజయం తరువాత కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రపంచంలో త్వరితగతిని వ్యాపించింది.

భారతదేశంలో 1920 దశకంలో కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రవేశించింది. పెద్ద నగరాలయిన బొంబాయి, కలకత్తా, లాహోరు, మద్రాసులు ముందు ఈ ప్రభావానికి గురి అయ్యాయి. కమ్యూనిస్టు సాహిత్యం అందుబాటులోకి వచ్చింది. భావసారూప్యత కలిగిన ప్రజలు 1920 నుండి కమ్యూనిస్టు గ్రూపులను ఏర్పాటు చేశారు. డిసెంబరు 1921 అహమ్మదాబాదులో జరిగిన కాంగ్రెస్ సభలో కార్మిక వర్గ దృక్పథం కలిగిన యువకులు కొందరు అహమ్మదాబాదు కాంగ్రెస్, కమ్యూనిస్టు ప్రణాళిక పేరుతో కరపత్రాలను పంచి పెట్టారు. అప్పటికి ఈ భావాలు యువతను ఆకర్షించసాగాయి. పెషావరు కుట్ర కేసు 1922-24, కాన్పూరు కుట్ర కేసు ఈ సిద్ధాంత ప్రచారానికి మరింత దోహదపడ్డాయి.

ప్రభుత్వం కుట్ర కేసులు పెడుతూనే ఉన్నా దేశంలోని కమ్యూనిస్టులందరూ కలసి డిసెంబరు 26, 1925 వ తేదీన కాన్పూరులో సమావేశమయి అఖిల భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. గాంధీ అహింసా సిద్ధాంతాన్ని వ్యతిరేకించే వారందరూ ఈ పార్టీలో చేరసాగారు.

నానాటికి బలపడుతున్న కమ్యూనిస్టు పార్టీని జూలై 23, 1934 న బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. దానితో రహస్యంగానూ, నూతన వ్యూహాలతోనూ పార్టీని నాయకులు నడుపసాగారు. వలస రాజ్యాలలో జాతీయ విముక్తికి పోరాడే స్థానిక శక్తులతో కలసి పని చేయాలని, దీనితోపాటే వర్గ పోరాటాన్ని కొనసాగించాలని, తద్వారా పార్టీ నిర్మాణం సాగించాలని వ్యూహ రచన చేసారు. దీని ప్రకారం భారతీయ కమ్యూనిస్టులు కాంగ్రెస్ వారితో కలసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. సోషలిస్ట్ పార్టీ ఏర్పడ్డాక దానిలోనూ చేరసాగారు.

## 18.3 ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమదశలు

ఆంధ్రదేశంలో కూడా 1930 దశకంలోనే కమ్యూనిస్టు భావాలు వ్యాపించాయి. ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని స్థూలంగా నాలుగు దశలుగా విభజించవచ్చు. అవి : (1) తొలిదశ 1932-1935 (2) రెండవ దశ - కాంగ్రెస్ - సోషలిస్టు పార్టీ దశ 1936-42 (3) మూడవ దశ 1942-1948 (4) నాల్గవ దశ 1948-1964.

## 18.4 తొలిదశ 1932-1935

ఆంధ్రలో కమ్యూనిస్టుల భావాలు ఏర్పడటం తొలిదశ అని చెప్పవచ్చును. వారిలో భావాంకురాలు మూడు విధాలుగా జరిగాయి: 1932-34 సంవత్సరాల మధ్య ఉప్పు సత్యాగ్రహ కాలంలో ప్రభుత్వం కాంగ్రెసు వారిని విశాఖపట్టణం, రాజమండ్రి, బళ్ళారి, రాయవెల్లూరు, తిరుచ్చినాపల్లి జైళ్ళలో నిర్బంధించారు. ఆ జైళ్ళలో అంతకుముందే నిర్బంధంలో ఉన్న మీరట్, లాహోర్ కుట్ర కేసు ఖైదీలతోను, బెంగాలు విప్లవకారులతోను వారికి పరిచయమైంది. వారితో జరిగిన చర్చలవల్ల వారు సోషలిజంవైపు ఆకర్షితులయ్యారు. అచట వారికి సోషలిస్టు సాహిత్యం లభించింది. మద్దుకూరి చంద్రశేఖర రావు, అల్లూరి సత్యనారాయణ, కృత్తివెంటి కుటుంబరావు, గద్దె లింగయ్య, గారపాటి సత్యనారాయణ, ఉద్దంరాజు రామం, బొవ్వలగడ్డ రామలింగయ్య, చలసాని జగన్నాధరావు, కానూరు బలరామయ్య, తనికెళ్ళ

చలపతి, కొసరాజు శేషయ్య మొదలగు యువకులకు అచట లభించిన వామపక్ష సాహిత్యం చదివి, దాని భావానికి లోనయ్యారు. జైళ్ళు కమ్యూనిస్టులకు శిక్షణాలయాలుగా ఉపయోగపడ్డాయి. జైలునుండి విడుదల కాగానే వారు కమ్యూనిస్టు ఉద్యమంవైపు అడుగులు వేశారు.

అదే కాలంలో అనగా 1930-34 మధ్య కాలంలో ఆంధ్రానుండి బెనారస్ విశ్వ విద్యాలయం, కాశీ విద్యాపీఠంలో విద్యాభ్యాసం చేయడానికి కొందరు విద్యార్థులు వెళ్ళారు. వారు చండ్ర రాజేశ్వరరావు, దర్శి చెంచయ్య, పొన్నం వీర రాఘవయ్య, పోరిపెద్ది నరసింహమూర్తి, నండూరి ప్రసాదరావు, తుమ్మల వెంకట్రామయ్య ముఖ్యులు. అప్పటికే అక్కడున్న కమ్యూనిస్టులతో వారికి పరిచయాలు ఏర్పడ్డాయి. ఆచట లభించిన కమ్యూనిస్టు సాహిత్యాన్ని చదివి కమ్యూనిస్టు భావాలకు లోనయ్యారు. ఫ్రెడరిక్ ఏంగెల్స్ వ్రాసిన గ్రంథాన్ని చదివి చండ్ర రాజేశ్వరరావు ప్రభావితుడయ్యాడు. షేర్ ఉడ్ ఎడ్డి రచించిన 'ది ఛాలెంజ్ ఆఫ్ రష్యా అండ్ రష్యా టుడే' అనే గ్రంథం చదివి కమ్యూనిస్టునయ్యానని దర్శి చెంచయ్య స్వయంగా చెప్పుకున్నాడు. ఆనాటి యువకులపై మాక్సిమ్ గోర్కి, పెరల్ బక్, జాన్ స్ట్రాచీ, మొదలగు వారి రచనలు వామపక్ష భావాలు కలిగించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించాయి. చండ్ర రాజేశ్వరరావు 1931లో యంగ్ కమ్యూనిస్టులీగ్‌లో చేరాడు. వీరంతా కలసి మిగతా విద్యార్థులను కూడా కమ్యూనిస్టు ఆశయాలవైపు ఆకర్షించడానికి కృషి చేశారు. బెనారస్ విశ్వ విద్యాలయంలో ఆర్. ఎస్. ఎస్. కు చెందిన విద్యార్థులు కూడా వుండేవారు. 1925 లో డా॥ హెడ్గెవార్ నాగపూర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనే సంస్థను స్థాపించాడు. 1930 నాటికి ఈ సంస్థ గూడా ఉత్తర భారత దేశంలో వ్యాపిస్తూ ఉంది. బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో గూడా ఆర్. ఎస్. ఎస్. ప్రవేశించింది. ఆర్. ఎస్. ఎస్. విద్యార్థులకు, కమ్యూనిస్టు భావాలుగల వారికి చర్చలు, వాదోపవాదాలు జరిగి, సంఘర్షణలు వస్తూ వుండేవి. ఆ ఘర్షణలలో చండ్ర రాజేశ్వరరావు ప్రధాన పాత్ర వహించేవారు. అందువలన 1936 లో విశ్వవిద్యాలయ అధికారులు రాజేశ్వర రావుకి టి.సి. యిచ్చి పంపివేశారు. ఆయన ఆంధ్రాచేరి, కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి పూనుకున్నారు.

1929 లో జరిగిన మీరట్ కుట్ర కేసు ముద్దాయిలలో ఒకరైన అమీర్ హైదర్‌ఖాన్ అరెస్టు కాకుండా తప్పించుకొని ఆ పార్టీ ఆదేశంపై మద్రాసు వచ్చారు. అచట అతడు కమ్యూనిస్టు బీజాలు నాటాడు. కార్మికులలో, విద్యార్థులలో వామపక్ష భావాలు ప్రచారం చేసి వారిని ప్రభావితం చేశాడు. వారి సహకారంతో యంగ్ వర్కర్స్‌లీగ్‌ను స్థాపించారు. అందలి సభ్యులచేత కమ్యూనిస్టు ప్రణాళిక మొదలైన మార్క్సిస్టు గ్రంథాలు చదివించారు. ఈ సంస్థలో క్రమేపి సభ్యులు పెరిగారు. అనేకమంది తెలుగు, తమిళ యువకులు చేరారు. వారిలో పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణలు అతి ముఖ్యులు. 1930-32 మధ్యకాలంలో వారు యంగ్ వర్కర్స్ లో సభ్యులైనారు.

ఈ విధంగా మూడు విధాలుగా ఆంధ్ర యువకులు కమ్యూనిస్టు భావాలకు ప్రభావితులయ్యారు. మూడు స్రవంతులుగా కమ్యూనిస్టు భావాలను జీర్ణించుకున్న ఆంధ్రాలో కమ్యూనిస్టు ఉద్యమానికి నడుం కట్టారు.

1920 నుండి గాంధీ నాయకత్వంలో కాంగ్రెసు త్వరితగతిన అభివృద్ధి చెందసాగింది. యువకులంతా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారే, మొదట కాంగ్రెసు వారే అయితే వారు అతివాద భావాలు గల యువకులు. గాంధీ నాయకత్వంలోని బలహీనతల వలన క్రమేపి అతివాద భావాలు గల కొందరు కమ్యూనిస్టు, సోషలిస్టు ఉద్యమాలలోనికి వెళ్ళారు. ఆ విధంగా వెళ్ళినవారే వీరందరూ. 1934 జూలై 23 వ తేదీన భారత ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. అమీర్ హైదర్‌ఖాన్ మద్రాసులో స్థాపించిన యంగ్ వర్కర్స్ లీగ్ కమ్యూనిస్టు భావాలను ప్రచారం చేస్తున్నదని గ్రహించిన మద్రాసు ప్రభుత్వం 1934 సెప్టెంబరు 20 వ తేదీన దానిని గూడా నిషేధించింది. కనుక వారు కాంగ్రెసులోనే కొనసాగుతూ 1930 లో రహస్యంగా ఆంధ్రా కమ్యూనిస్టు పార్టీని స్థాపించుకున్నారు. అయినప్పటికి వారు కాంగ్రెసులోనే వుంటూ వర్గ పోరాటాన్ని కొనసాగించాలని తీర్మానించుకున్నారు.

**కమ్యూనిస్టు పార్టీ స్థాపన 1934 సెప్టెంబరు - విజయవాడ :** మద్రాసు ప్రభుత్వం యంగ్ వర్కర్స్ లీగ్‌ను నిషేధించిన, 1934 సెప్టెంబరు నెలలోనే బెజవాడలోని పడమటలో కాట్రగడ్డ నారాయణరావు తోటలో కమ్యూనిస్టులు రహస్య సమావేశాలు జరిపారు. ఈ సమావేశంలోనే కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటి ఏర్పడింది. ఆ కమిటీకి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

ఆయనతో పాటే ఏడుగురు సభ్యులు గల కార్యవర్గం ఏర్పడింది. ఈ కమిటీ ఏర్పాటే ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు పార్టీ జననం అని చెప్పవచ్చును.

ఈ సమావేశంలో ఆంధ్ర ప్రాంతంలోని వివిధ జిల్లాలలో పార్టీ శాఖలు నిర్మించాలని, అతి భావాలుగల యువకులను, విద్యార్థులను సమీకరించి, చైతన్యపరచి కమ్యూనిస్టు ఉద్యమంలోనికి తీసుకురావాలని, రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక సంఘాలు నిర్మించాలని, కార్మికులలో విప్లవ భావాలను ప్రచారం చేయాలని తీర్మానించారు. మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం అప్పటికే యంగ్ వర్కర్స్ లీగ్‌ను నిషేధించింది. కనుక కూలీ రక్షణ సమితులు, కూలీ సంఘాలు అను పేరుతో కార్మిక సంఘాలను ఏర్పాటుచేశారు. గుంటూరు, బెజవాడ, బందరు, ఏలూరు, భీమవరం, తెనాలి, నెల్లూరు, రాజమండ్రి, విశాఖపట్టణాలలో కూలీ రక్షణ సమితులు ఏర్పరచి, వాటిద్వారా పనిచేయసాగారు. కూలీ రక్షణ సమితులు పార్టీకి బహిరంగ వేదికలయ్యాయి. దీనితో మొదటి దశ ముగిసింది. ఈ దశలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించడం, కార్మిక సంఘాలు నిర్మాణం చేయడం జరిగింది. ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఈ విధంగా ప్రారంభం అయింది. ఇవన్నీ కాంగ్రెసు పార్టీలో కొనసాగుతూనే చేశారు. పార్టీకి ఇది ప్రాథమిక దశ.

ఈ సంవత్సరంలోనే (1934) గాడిచెర్ల హరి సర్వోత్తమరావు స్వరాజ్య పార్టీని, ఆచార్య రంగా సోషలిస్టు పార్టీని స్థాపించారు.

## 18.5 రెండవ దశ - 1936-1942

ఈ దశలో కొన్ని ప్రముఖ ఘట్టాలు జరిగి పార్టీ ఆదరణీయమయింది. అవి :

**18.5.1 కమ్యూనిస్టు పార్టీ ప్రథమ సభ, జనవరి 29, 1936 :** 1936 జనవరి 29 వ తేదీన కాకినాడ అన్నదాన సమాజంలో ఆంధ్ర రాష్ట్ర యువజన మహాసభ జరిగింది. ఆ సభలో పాల్గొనటానికి వచ్చిన కమ్యూనిస్టులు, ఆ రాత్రి రహస్యంగా సభను జరుపుకున్నారు. అప్పటికి పార్టీలో 40 మంది సభ్యులున్నారు. ఈ మహాసభకు కేంద్ర కమిటి ప్రతినిధి ఘాట్ హాజరయ్యారు. అప్పటికే రాష్ట్ర కార్యదర్శిగా వున్న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పార్టీ విధానంలో వచ్చిన మార్పును గురించి తెలిపారు. దత్తు, బ్రాడ్లీ థీసిస్ ప్రకారం జాతీయ, కాంగ్రెసును, సామ్రాజ్య వాద వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటనగా రూపొందించాలన్నదే ఆ మార్పు అని చెప్పారు. అట్లే ఎం.ఎన్. రాయ్ ప్రచారం చేస్తున్న డి-కోలనైజేషన్ సిద్ధాంతం తప్పని సుందరయ్య ఘాట్‌లు ఈ సభలో వివరించారు. ఈ సభలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య మర్లా పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సభ తీర్మానం ప్రకారం కమ్యూనిస్టులు కాంగ్రెసులోను, సోషలిస్టు పార్టీలోను కొనసాగుతూ, పార్టీని అభివృద్ధి చేయాలని తీర్మానించారు. అందువలన ఆంధ్రాలో ఆచార్య రంగా స్థాపించిన సోషలిస్టు పార్టీలో చేరి పని చేయాలని కూడా వారు నిర్ణయించుకున్నారు. ఈ సభ ప్రత్యేకత ఏమిటంటే అంతవరకు కాంగ్రెస్ పట్ల ఎం.ఎన్. రాయ్ ప్రతిపాదించిన సెక్టేరియన్ నైఖరిని అనుసరిస్తూ ఉన్నారు. ఈ సభలో ఆ నైఖరిని విడనాడి కాంగ్రెసును సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటనగా గుర్తించారు. అందువలన అందులో చేరి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. దానితోపాటే ఆంధ్రాలో ఆచార్య రంగా స్థాపించిన సోషలిస్టు పార్టీలో చేరాలని గూడా తీర్మానించుకున్నారు.

**18.5.2 సోషలిస్టు పార్టీలో చేరిక 1936-39 :** రంగా ఏర్పరచిన సోషలిస్టు పార్టీలో చేరినట్లయితే కమ్యూనిస్టు సిద్ధాంతాలను త్వరిత గతిన వ్యాప్తి చేసుకోవచ్చునని తలచి అంతవరకు కాంగ్రెసుతో కలసి పని చేయుచున్న పుచ్చలపల్లి సుందరయ్య, కంభంపాటి సత్యనారాయణ, చండ్ర రాజేశ్వరరావు మొదలగు కమ్యూనిస్టులు సోషలిస్ట్ పార్టీలో చేరారు. రంగాతో కలసి రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో సోషలిస్టు పార్టీ శాఖలు స్థాపించారు.

**18.5.3 రాజకీయ పాఠశాలలు :** అంతేగాక సోషలిస్టు భావాల గోష్టులు నిర్వహించడానికి, కార్యకర్తలకు శిక్షణ యివ్వడానికి రాజకీయ పాఠశాలలు స్థాపించారు. 1936 లో కొత్త పట్నంలోను, 1938-39 సం॥ల మధ్య అన్నాప్రగడ కామేశ్వరరావు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తుళ్ళూరు, నిడుబ్రోలు, మంతెనవారి పాలెంలో రాజకీయ పాఠశాలలను నిర్వహించారు.

**18.5.4 రాష్ట్ర సోషలిస్టు పార్టీ సభలు 1936-37 :** 1936 సెప్టెంబరు 26, 27 తేదీలలో రాజమండ్రిలో కమ్యూనిస్టులు, సోషలిస్టులు కలసి సమైక్యంగా ఆంధ్ర రాష్ట్ర సోషలిస్టు పార్టీ రెండవ మహాసభ జరిపారు. రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ అధ్యక్షులుగా మద్దూరి అన్నపూర్ణయ్య, సంయుక్త కార్యదర్శులుగా, క్రొవ్విడి లింగరాజు, బసవరాజు రంగశాయి, పుచ్చలపల్లి సుందరయ్య, కార్యవర్గ సభ్యులుగా పుల్లెల శ్యామసుందర రావు, డా॥ ఎం.వి కృష్ణారావు, దరిశి సుభద్రమ్మ, మహీధర జగన్మోహన రావు, అల్లూరి సత్యనారాయణ, తణికెళ్ళ వెంకట చలపతి, కాశీపట్నం శేషసాయి, ఇంటూరి వెంకటేశ్వర రావు, చలసాని వాసుదేవరావు, దుర్భా కృష్ణమూర్తి, పులుపుల శివయ్య, చుండి జగన్నాధ రావు, పోలిపెద్ది నరసింహామూర్తి ఎన్నికయ్యారు. వీరిలో మద్దూరి అన్నపూర్ణయ్య అంతకుముందే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. ఈ సభ జరిగిన మొదటిరోజు అనగా సెప్టెంబరు 26 వ తేదీ సాయంత్రం శ్రద్ధానంద ఘాట్‌లో జరిగిన బహిరంగ సభలో పుచ్చలపల్లి సుందరయ్య చేసిన ప్రసంగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నదని అరెస్టు చేసి, కాకినాడ జిల్లా కలెక్టర్ కోర్టులో హాజరు పరచగా రెండు సంవత్సరాల కఠిన కారగార శిక్ష విధించబడింది. అందువలన కమ్యూనిస్టు పార్టీకి ఆయన స్థానంలో పోలిపెద్ది నరసింహామూర్తిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాజమండ్రి సభ తరువాత కమ్యూనిస్టులు రాష్ట్రం మొత్తములో కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకొనగల్గారు. సోషలిస్టులతో కలసి పని చేసినందువలన వారికి ఈ ప్రయోజనం కలిగింది.

నవంబరు 1937లో పాలకొల్లులో రాష్ట్ర సోషలిస్టు పార్టీ మూడవ మహాసభ జరిగింది. ఆనాటికి సుందరయ్యను విడుదల చేశారు. కనుక ఆయనను మరలా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యవర్గంలో 14 మంది సభ్యులను నియమించారు. వారిలో ఇద్దరు తప్ప మిగిలిన వారంతా కమ్యూనిస్టులే. 1938 జూన్‌లో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ రెండవ మహాసభను బెజవాడలో జరుపుకున్నారు. ఆ సభ గవర్నరుపేటలోని కాట్రగడ్డ వారి మేడలో అనగా నవశక్తి కార్యాలయంలో జరిగింది. అప్పటికి పార్టీ సభ్యులు రెండు వందలకు పెరిగారు. ఆ సభకు 60 మంది హాజరయ్యారు. కేంద్ర కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా పి.సి. జోషి పాల్గొన్నారు.

**18.5.5 రంగా రైతు యాత్ర 1938-39 :** ఇదే కాలంలో ఆచార్య రంగా ఆంధ్రప్రదేశ్ రైతులను చైతన్య పరచడానికి రైతు యాత్ర జరిపారు. ఈ యాత్ర 1938 జూలైలో శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురంనుండి ప్రారంభమై 1500 మైళ్ళు చుట్టి, 525 గ్రామాలను సందర్శించి, 1939 లో మద్రాసు చేరింది. రంగా యాత్రలో చలసాని వాసుదేవరావు, పుల్లెల శ్యాంసుందర రావు, జొన్నలగడ్డ రామలింగయ్య మొదలగు కమ్యూనిస్టులు పాల్గొన్నారు. ఈ రైతు యాత్ర రంగా సోషలిస్టు భావాలు ప్రచారం కావటానికి బాగా సహకరించాయి. కాని అంతకంటే ఈ రైతు యాత్ర కమ్యూనిస్టులకు యింకా ఎక్కువగా ఉపయోగపడింది. ఈ యాత్రలో వారు అనేక గ్రామాలలో ప్రజలను కలుసుకొని సోషలిస్టు సిద్ధాంతాలతో పాటు తమ కమ్యూనిస్టు సిద్ధాంతాలను గూడా ప్రచారం చేసుకున్నారు. కోస్తా ఆంధ్రా మొత్తంలో కమ్యూనిస్టు భావాలు వ్యాప్తి కావటానికి ఈ యాత్ర బాగా ఉపయోగపడింది. అంతేగాక సోషలిస్టు పార్టీలో దాదాపు అందరిని కమ్యూనిస్టులుగా మార్చగల్గారు. 1939 నాటికి ఆంధ్రా సోషలిస్టు పార్టీ కమ్యూనిస్టు పార్టీగా మారిపోయింది. దానితో కమ్యూనిస్టు పార్టీ బాగా బలపడింది.

## 18.6 కమ్యూనిస్టు పత్రికలు - గ్రంథాలు :

ఇదే సమయంలో కొన్ని కమ్యూనిస్టు పత్రికలు ప్రారంభమయ్యాయి. కమ్యూనిస్టు సాహిత్యం వెలువడింది. దీనివలన కమ్యూనిస్టు భావాలు బాగా వ్యాప్తి చెందాయి. రాజమండ్రి సభ జరిగే నాటికే తూర్పు గోదావరి జిల్లా ముంగొండనుండి మహీధర సోదరులు విశ్వ సాహిత్య మాల అను సంస్థను నెలకొల్పి సోషలిస్టు సాహిత్యాన్ని ప్రచురించటం ప్రారంభించారు. వారు అప్పటి కమ్యూనిస్టు కార్యదర్శి పోలిపెద్ది నరసింహామూర్తితో సంబంధాలు పెట్టుకొన్నారు. మహీధర రామ్మోహన రావు, జగన్మోహన్, క్రిష్ణమోహన్‌లు ఈ గ్రంధమాలను స్థాపించారు. గోర్కి ప్రఖ్యాత నవల అయిన మదర్‌ను క్రొవ్విడి లింగరాజు 1932 లో జైల్లో వుండగానే అనువదించాడు. గద్దె లింగయ్య స్థాపించిన ఆదర్శ గ్రంధ మండలి ఈ నవలను ప్రచురించగా, ప్రభుత్వం నిషేధించింది. ఈ నవల ఆ రోజులలో సోషలిస్టు భావాలను బాగా వ్యాప్తి చేసింది. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వార్తాపత్రిక "నవ శక్తి" రాజమండ్రినుండి 1937 డిశంబరు 15 వ తేదీన ప్రారంభమైంది. ముద్దూరి అన్నపూర్ణయ్య, మద్దుకూరి చంద్రశేఖర రావు, తుమ్మల వెంకట్రామయ్య తదితరులు దానికి సంపాదక వర్గంగా వ్యవహరించారు. ఆ తరువాత నవ శక్తి బెజవాడకు తరలించబడింది. 1939 లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయిన తరువాత ఈ పత్రిక ప్రెస్‌తో

సహా అంతర్ధానమయింది. ఇదే కాలంలో మరికొన్ని గ్రంథాలు, వార్తా పత్రికలు గూడా కమ్యూనిస్టు ఉద్యమాన్ని బాగా వ్యాప్తిలోనికి తెచ్చాయి. శ్రీ శ్రీ వ్రాసిన 'మహాప్రస్థానం', గద్దె లింగయ్య 'విప్లవ వీరులు', విద్యాన్ విశ్వం 'పాపం నా హృదయం', నార్ల వెంకటేశ్వరరావు 'నేటి రష్యా', ముల్క్‌రాజ్ 'ఆనంద్ కూలీ', అన్‌టచబుల్ మొదలైన గ్రంథాలు కమ్యూనిస్టు భావాలను ప్రచారం చేసాయి. కాప ధర్మారావు నడిపిన జనవాణి; ఎన్. జి. రంగా ప్రచురించిన చిత్రగుప్త ప్రజాబంధు, వాహిని ; మద్దూరి అన్నపూర్ణయ్య ప్రచురించిన కాంగ్రెసు, కొంపెల్ల జనార్ధనరావు నడిపిన ఉదయని మొదలగు పత్రికలు 30 వ దశాబ్దంలో ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు భావాలను బాగా వ్యాప్తి చేశాయి. అట్లే కేంద్ర కమ్యూనిస్టు పార్టీకి చెందినది, రహస్యంగా నడిచిన పత్రిక అయిన కమ్యూనిస్టు ఏజ్ అనే మాస పత్రిక, నేషనల్ ఫ్రంట్ అనే మరియొక పత్రిక గూడా కమ్యూనిస్టు భావాలను ప్రచారం చేశాయి. ఈ పత్రికలు, గ్రంథాలు చదివి యువకులు విరివిగా కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అందువలన 1940 నాటికి విస్తరించింది.

## 18.7 మూడవ దశ - 1939-1948 :

1939 లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. మొదట కమ్యూనిస్టులు యుద్ధాన్ని సామ్రాజ్యవాదుల యుద్ధం అని, దానిని బహిష్కరించాలని అన్నారు. కాని 1941 జూన్ 1 వ తేదీన హిట్లర్ రష్యాపై దండెత్తాడు. వెంటనే కమ్యూనిస్టులు యుద్ధాన్ని ప్రజా యుద్ధం అని ప్రచారం చేసి మిత్రపక్షాలను బలపరచారు. 1942 లో మహాత్మాగాంధీ క్విట్ ఉద్యమం ప్రారంభించి బ్రిటిషు ప్రభుత్వానికి మద్దతు యివ్వరాదన్నారు. కాని కమ్యూనిస్టులు బ్రిటిషు ప్రభుత్వానికి మద్దతు యివ్వాలని ప్రకటించారు. వారి ద్వంద్వ వైఖరితో కమ్యూనిస్టులు జాతీయ జీవన స్రవంతికి దూరమయ్యారు. అయితే బ్రిటిషు ప్రభుత్వం 1934 లో వార్పిపై విధించిన నిషేధ ఉత్తర్వును 1942 జూలై 23 వ తేదీన రద్దు చేసింది. అందువలన వారు బాహాటంగా తమ పార్టీ కార్యక్రమాలు నిర్వహించి త్వరలోనే పార్టీని విస్తరించుకున్నారు. జాతీయ కాంగ్రెసు క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించినందువలన బ్రిటిషువారు కమ్యూనిస్టులపై ఆధారపడ్డారు. రేషన్ షాపులు నిర్వహించే కార్యక్రమం వారికే అప్పగించారు. రైళ్ళను కాంగ్రెసువారు ఆపుతారేమోనని కమ్యూనిస్టులను కాపలా కాయమన్నారు. కాంగ్రెసువారి కార్యకలాపాలపై నిఘా పెట్టించి, తమ సి.ఐ.డి./లుగా ఉపయోగించుకున్నారు. అంతవరకు కాంగ్రెసు వారితో కలసి రైళ్ళు, ప్రభుత్వ ఆఫీసులను బహిష్కరించిన కమ్యూనిస్టులు, బ్రిటిషు ప్రభుత్వానికి అండగా నిలబడ్డారు. రైలు పట్టాల దగ్గర కాపలా కాశారు. కాంగ్రెసు వారంతా జైళ్ళలో ఉండగా కమ్యూనిస్టులు బయట వుండి, స్వేచ్ఛగా వారి పార్టీని ప్రచారం చేసుకున్నారు.

**18.7.1 మూడవ పార్టీ మహాసభ - 1943 జూలై 8-15 :** పార్టీమీద నిషేధం తొలగించిన తరువాత కమ్యూనిస్టులు 1943 జూలై 8-15 తేదీల మధ్య విజయవాడలో మూడవ కమ్యూనిస్టు మహాసభను జరుపుకున్నారు. పార్టీ పుట్టిన తరువాత జరిగిన మొట్ట మొదటి బహిరంగ సభ యిదే. 1940 లో 700 మంది సభ్యులు. 450 మంది కాండిడేట్ సభ్యులతో వున్న పార్టీ సభ్యత్వం. 1942 లో 1176 కు 1943 లో తృతీయ పార్టీ మహాసభలు జరిగేనాటికి 3250 మందికి పెరిగింది. పూర్తి కాలం విప్లవోద్యమానికి పనిచేసే కార్యకర్తలు 650 మంది వరకు పెరిగారు. ఈ కాలంలో అనేకమంది పార్టీ ప్రముఖులు, సభ్యులు అభిమానులు తమ యావదాస్థిని అమ్మి, పార్టీకి విరాళంగా యిచ్చి ఎంతో ఆదర్శం చూపారు. 1942 జూన్ 17 వ తేదీన రెండు వేల ప్రతులతో ప్రారంభమైన పార్టీ వార పత్రిక "ప్రజాశక్తి" సర్క్యులేషన్ సంఖ్య 9500కి పెరిగింది. రాష్ట్రంలోని 1900 గ్రామాలకు ఈ పత్రిక వెళ్ళేది. అప్పటివరకు నవశక్తి, స్వతంత్ర భారత్ పత్రికలు రహస్యంగా ప్రచురించేవారు. పార్టీ నిధికి రెండు లక్షల రూపాయలు వసూలయ్యాయి. రాష్ట్రమంతటా ప్రజా సంఘాలు కూడా విపరీతంగా పెరిగాయి. రైతు సంఘంలో 70 వేలమంది చేరారు. వ్యవసాయ కార్మిక సంఘంలో 24000 మంది సభ్యులయ్యారు. రైల్వే కార్మిక సంఘంలో 10,000 మంది ఉండేవారు. యువజన సంఘం బాలల సంఘాలలో 40 వేల మంది ఉండేవారు. పార్టీపై నిషేధం ఎత్తివేసినందువల్ల పార్టీ బహిరంగ ప్రచారం చేసుకున్నందువల్ల ప్రజలలో కమ్యూనిస్టు పార్టీ బాగా వ్యాప్తి చెందింది. కాంగ్రెసు పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగింది. ఈ సభలో అప్పటివరకు జరిగిన పార్టీ కార్యక్రమాలు సమీక్షించుకొని ప్రజా సంఘాల విస్తరణ కొరకు అవసరమైన కార్యక్రమాలు రూపొందించుకున్నారు. ఈ సభలో చండ్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా, 7గురుతో నూతన రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవ పున్నయ్య, మద్దుకూరి చంద్రశేఖర రావు, చలసాని వాసుదేవరావు సభ్యులుగా ఎస్. వి. కె. ప్రసాద్, కడియాల గోపాలరావు కాండిడేట్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

1943-45 సం॥ల మధ్యకాలంలో పార్టీ నిర్విరామంగా కృషి చేసింది. ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ ఆంధ్రాపై దాడి చేస్తుందేమోనని ప్రజలను కాపాడడానికి ప్రజా రక్షణ దళాలను ఏర్పాటు చేసింది. విమాన దాడులనుండి రక్షణ పొందే శిక్షణను ప్రజలకు యిచ్చింది. మహిళా సంఘాలు ఏర్పాటు చేసి, వారికి రాజకీయ, సామాజిక అంశాలపై శిక్షణ యిచ్చారు. 1945 లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసింది. తరువాత వారు 1945 లో విశాలాంధ్ర ఉద్యమాన్ని ప్రారంభించి ఆంధ్ర తెలంగాణాలు కలసిపోవాలని ప్రచారం చేశారు. ఇది కూడా వారికి గొప్ప గుర్తింపును తెచ్చింది. తరువాత ఆంధ్ర ప్రాంతంలోని జమీందారీ, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. తెలంగాణాలో కమ్యూనిస్టులు ప్రారంభించిన సాయుధ పోరాటానికి పూర్తి మద్దతునిచ్చారు.

**18.7.2 1946 ఎన్నికలు :** రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 1946 లో కేంద్ర శాసన సభలకు ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో కమ్యూనిస్టులు విశాలాంధ్ర నినాదంతో పాల్గొన్నారు. కాని యుద్ధ కాలంలో వారు అనుసరించిన జాతి వ్యతిరేక విధానాన్ని ఏవగించుకున్న ప్రజలు వారిని ఓడించారు. అంతట వారు విప్లవంద్వారా అధికారం సంపాదించాలని హింసాత్మక చర్యలకు దిగారు. పరిశ్రమలలో కార్మికుల సమ్మెలకు మద్దతునిచ్చారు. చిట్టివలస మిల్లు కార్మికుల సమ్మె, కాళహస్తి బీడీ కార్మికుల సమ్మె జరిగాయి. 1947 జనవరిలో ప్రకాశం ముఖ్యమంత్రిగా గల మద్రాసు ప్రభుత్వం ప్రజా ఆర్డినెన్సు జారీ చేసి, కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధ విధానాన్ని ప్రవేశపెట్టి, అనేకమంది కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేసి, జైళ్ళకు పంపింది. 1947 జనవరి 20-28 తేదీలలో కమ్యూనిస్టులు కృష్ణాజిల్లాలోని బుద్ధవరంలో నాల్గవ కమ్యూనిస్టు మహాసభలను జరుపుకున్నారు. ఈ సభ తరువాత చాలామంది కమ్యూనిస్టులు జైళ్ళకు వెళ్ళారు. ఇంతలో 1947 ఆగస్టు 15 వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చినందుకు సంతోషంగా జైళ్ళలోని ఖైదీలను విడుదల చేశారు. దానితో జైళ్ళలో నిర్బంధించబడిన కమ్యూనిస్టు నాయకులు తిరిగి విడుదల అయ్యారు. మొత్తం మీద మూడవ దశలో కమ్యూనిస్టు పార్టీ బాగా విస్తరించింది.

1948 సెప్టెంబరు 26 వ తేదీన మద్రాసు ప్రభుత్వం సాయుధ విప్లవానికి పిలుపునిచ్చిన కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం పిలుపునివ్వటం యిష్టం లేనందువలన వావిలాల గోపాల కృష్ణయ్య, అల్లూరి సత్యానారాయణ రాజు, ముక్కామల నాగభూషణ రావు, జి.సి. కొండయ్య, కొమ్మరాజు వెంకట రామశాస్త్రి మొదలగు కమ్యూనిస్టు పార్టీ నుండి వైదొలిగారు.

**18.7.3 తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం :** ఆంధ్రాలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన తరువాత తెలంగాణాలో కూడా కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభం అయింది. సాంస్కృతిక ఉద్యమం, కాంగ్రెస్ కార్యక్రమాలు, ఉస్మానియా విశ్వ విద్యాలయంలోని వందేమాతరం సంఘటనలు తెలంగాణాలోని విద్యార్థులను, యువకులను స్వాతంత్ర్య సమరంవైపు మళ్ళించాయి. యువకులలో తీవ్రవాద భావాలు కల్గినవారు కమ్యూనిజం వైపు ఆకర్షింపబడ్డారు. అందువలన తెలంగాణాలో కూడా కమ్యూనిజం 1930 వ దశాబ్దంలోనే ప్రారంభం అయింది. ఆంధ్ర దేశంలోని కమ్యూనిస్టులు రంగా ఆరంభించిన సోషలిస్టు పార్టీలో చేరి చివరకు దానిని కమ్యూనిస్టు పార్టీ మార్చినట్లు, తెలంగాణాలో కూడా కమ్యూనిస్టు భావాలు కల్గినవారు ఆంధ్ర మహాసభలలో పాల్గొని చివరకు దానిని కమ్యూనిస్టు మహాసభగా మార్చారు. రావి నారాయణ రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర రావు, సి. హనుమయ్య, బద్దం ఎల్లారెడ్డి మొదలగువారు నిజాం ఆంధ్ర మహాసభలలో పాల్గొని కమ్యూనిస్టు భావాలు వ్యాప్తి చేశారు. ఆంధ్రాలో కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభం కాగానే తెలంగాణాలో కూడా కమ్యూనిస్టు ఉద్యమం అభివృద్ధి చెందింది. ఉభయులు సంబంధాలు పెట్టుకున్నారు. 1939 లో కంకిపాడులో ఆచార్య రంగా నిర్వహించిన రాజకీయ పాఠశాలలో రావి నారాయణ రెడ్డి, సి. హనుమయ్య, బద్దం ఎల్లారెడ్డి శిక్షణ పొందారు. అదే సంవత్సరంలో తెలంగాణాలోని వివిధ కమ్యూనిస్టు గ్రూపులన్నింటిని కలిపి నిజాం స్టేట్ కమ్యూనిస్టు కమిటీగా ఏర్పాటు చేశారు. హైదరాబాదులోని విద్యార్థులు కమ్యూనిస్టు సాహిత్యం చదివి దాని ప్రభావానికి లోనై ముఖ్దుం మొయినుద్దీన్, రాజా బహద్దూర్ గౌడ్ మొదలగు వారి నాయకత్వంలో 1939 లో కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించారు. అట్లే వి. దేశ్ పాండే చంద్రగుప్త చౌదరీలతో నిజాం రాజ్యంలోని మహారాష్ట్ర ప్రాంతాలలో కమ్యూనిస్టు పరిషత్తులను నెలకొల్పారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో యువకులలో పఠనాశక్తి పెరిగింది. ప్రపంచ రాజకీయాలు, ఫాసిజం లాంటి విషయాలు మొదటిసారిగా యువకుల ఆలోచనలోనికి వచ్చాయి. అంతకుముందు భారత దేశంలో జరిగే జాతీయ ఉద్యమం తెలంగాణా ప్రజలపై

ప్రభావాన్ని చూపి యువకులను చైతన్యపరచింది. వాటితో పాటే రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు బాగా ప్రాచుర్యం పొందిన సోషలిస్టు - కమ్యూనిస్టు భావాలు కూడా యువకుల ఆలోచనా ప్రవంతిలో ప్రవేశించాయి. సోషలిస్టు భావాలు కలిగిన వారికి రష్యాపై అభిమానం పెరగ సాగింది. ఆ విధంగా కమ్యూనిస్టు భావాలు కల్గిన వారిలో ముఖ్యులు మొయిన్ ఉద్దీన్, సయ్యద్ అలంఖడి మీర్, జువ్వాది రజ్వీ మీర్జా హైదర్ హుస్సేన్, అసన్ అలీ మీర్జా, సయ్యద్ ఇబ్రహీం, గులాం హైదర్, షానూర్ అలీ వీరు తరచూ ఆబిడ్స్‌లోని ఇండియా కాఫీ హౌస్‌లో కలుసుకుంటూ సోషలిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతాలను చర్చిస్తూ వుండేవారు. క్రమేపి, వారిలో కమ్యూనిస్టు భావాలు బలపడ్డాయి. అట్లా సోషలిస్టు భావాలు ఏర్పడి ఈ యువకులు, మరికొందరు కలిసి కామ్రేడ్స్ అసోసియేషన్ అనే పేరుతో 1939 డిశంబరులో ఒక సంస్థను స్థాపించుకున్నారు. దాని ప్రధమ సమావేశం 1939 డిశంబరు 13 వ తేదీన హనుమంత్ గంజ్ లోని మార్వారీ పాఠశాలలో జరిగింది. ఈ సంస్థను స్థాపించినవారు ముఖ్దుం మొయినుద్దీన్, సయ్యద్ ఇబ్రహీం, ఆలంఖుంద్ మీర్, రాజా బహదుర్ గౌడ్ మొదలగువారు. ఈ సంస్థకు బూర్గుల రామకృష్ణారావు ప్రోత్సాహం కూడా ఉండేది. ఇందలి ప్రధాన సభ్యుడైన ముఖ్దూం మంచి రచయిత. హైదరాబాద్‌లో వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్నవారిలో గూడా కొందరికి సోషలిస్టు భావాలు వుండేవి. అట్టివారిలో దేవులపల్లి వెంకటేశ్వర రావు, సర్వ దేవభట్ల రామనాథం ముఖ్యులు. ఆంధ్ర మహాసభలో పనిచేసే వారిలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల సోదరులు ముఖ్యులు. అట్లే మహారాష్ట్ర పరిషత్తులో పనిచేసే వారిలో ఔరంగాబాదుకు చెందిన చంద్రగుప్త చౌదరి, హబుద్దీన్, వి.డి. దేశ్ పాండే లాంటి యువకులకు సోషలిస్టు భావాలుండేవి.

ఈ నాలుగు గ్రూపులు కలిసి 1939 చివరిలో నిజాం సంస్థాన కమ్యూనిస్టు కమిటీగా అవతరించాయి. ఈ సంస్థ అవతరించడానికి ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ కమిటీ ప్రోత్సాహం ఉన్నది. ఆ రోజులలో మొత్తం భారత దేశంలోనే ఆంధ్రా కమ్యూనిస్టు కమిటీ చాలా బలంగా వుండేది. తెలంగాణాలో వారి చొరవతోనే కమ్యూనిస్టు పార్టీ కమిటి ఏర్పడింది. మొదట ఆంధ్ర కమ్యూనిస్టులే వారి వెనుక నుండి నడిపారు. తెలంగాణా కమ్యూనిస్టు కమిటి ఏర్పడిన తరువాత వారికి మొదటి రాజకీయ తరగతులను చండ్ర రాజేశ్వరరావు నిర్వహించారు. ఈ విధంగా తెలంగాణాలో 1939 లో కమ్యూనిస్టు పార్టీ అవతరించింది.

తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడడానికి స్థానిక సమస్యలేగాక జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు గూడా దోహదం చేశాయి. నెహ్రూ పుస్తకాలు చదవడం వల్ల కొందరిలో సోషలిస్టు భావాలు ఏర్పడ్డాయి. అప్పటికే రష్యాలో రెండు పంచవర్ష ప్రణాళికలు అమలు జరిగి రష్యా పారిశ్రామిక అభివృద్ధిని సాధించింది. ఐరోపాలో 1929-30 సం॥ల మధ్య వచ్చిన ఆర్థిక సంక్షోభం రష్యాపై ఎట్టి ప్రభావం చూపలేదు. రష్యాలో నిరుద్యోగం నిర్మూలన అయింది. ఇవన్నీ ఆనాటి యువకులను అకర్షించాయి. యుద్ధం చివరిలో జర్మనీపై రష్యా విజయం సాధించింది. అది గూడా సోషలిస్టు భావాలు గలిగిన యువకులకు గొప్ప ఉత్సాహాన్ని యిచ్చింది. ఇవే కాక తెలంగాణాలో ఆనాడు అనేక సమస్యలు ఉండేవి. వాటిలో ధాన్యపు లెవీ అతి ముఖ్యమైనది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పంటలు పండినా, పండకపోయినా రైతులు ఎకరానికి ఇంత అని నిర్బంధ లెవీ యివ్వాలి. పెద్ద భూస్వాములు తప్పుడు లెక్కలు చూపి తప్పించు కునేవారు. కాని పేద రైతువద్ద అధికారులు ఖచ్చితంగా వసూలు చేసేవారు. ఆంధ్ర మహాసభ కార్యకర్తలు గ్రామాలలో పర్యటించి లెవీలలో చిన్న రైతులకు జరిగే అన్యాయాలను ఎదుర్కొనేవారు. అట్లే పట్టణాలలో రేషనింగ్ దుకాణాలవద్ద నిలబడి బీదలకు సక్రమంగా నిత్యావసర వస్తువులు అందేటట్లు చూసేవారు. రైతులవద్ద వారి శక్తికి మించి యుద్ధ వసూళ్ళు చేయకుండా అడ్డుపడేవారు. మునగాల రాజా ఆ రోజులలో తన సంస్థానంలోని రైతులను, ఇతర వర్గాల ప్రజలను అనేక విధాలుగా బాధించేవాడు. అతనికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఉద్యమం నడిపారు. ఈ విధంగా తెలంగాణాలోని పేద వర్గాలకు కమ్యూనిస్టులు ఆపద్బాంధవులుగా కనిపించారు.

ఇదే కాలంలో కామ్రేడ్ మఖ్దూం విద్యార్థులను సమీకరించి విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాడు. ఓంకార ప్రసాదు, జవ్వాది రజ్వీ లాంటివారు విద్యార్థి సంఘాల నిర్మాణంలో ప్రముఖ పాత్రను నిర్వహించారు. తెలంగాణా విద్యార్థి సంఘాలు అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్‌కు అనుబంధ సంస్థలయ్యాయి. అట్లే ట్రేడ్ యూనియన్ సంఘాలు గూడా నిర్మింపబడ్డాయి. మఖ్దూం 1943 లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి తన పూర్తి కాలాన్ని ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని నిర్మించడానికి అంకితం చేశాడు. పట్టభద్రులైన రాజ్ బహదూర్ గౌడ్, సాంబమూర్తి, గులామ్ హైదర్, శ్రీనివాస లాహోట్, లింగారెడ్డి ట్రేడ్ యూనియన్ రంగం విస్తరించడానికి బాగా కృషి చేశారు. వారంతా తమ పూర్తి కాలాన్ని కార్మిక సంఘాల నిర్మాణానికి అంకితం చేశారు. తెలంగాణాలో ఉద్యమాన్ని అన్ని స్థాయిలలో

నిర్మించటానికి ఆంధ్ర కమిటీ అనుభవజ్ఞులను పంపుతూ ఉండేది. అట్టి వారిలో కామ్రేడ్. ఎస్.కె.వి ప్రసాద్ అతి ముఖ్యులు. ఆయన ఆంధ్ర కమిటి తరపున ఆర్గనైజర్‌గా వచ్చి అచట వుండి తెలంగాణా ఉద్యమాన్ని నిర్మించటానికి చాలా కృషి చేశారు. ఆ రోజులలో ప్రజానాట్య మండలి ద్వారా గూడా కమ్యూనిస్టు భావాలు ప్రచారం చేశారు. అట్టి వాటిలో నాజర్ బుర్రకథ ప్రసిద్ధమయింది. ఇవన్నీ తెలంగాణాలో కమ్యూనిస్టు ఉద్యమం త్వరితగతిన వ్యాప్తి చెందడానికి దోహదం చేశాయి. తెలంగాణా కమ్యూనిస్టు పార్టీని నిర్మించిన నాయకులలో ప్రముఖులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దుం మొయినుద్దీన్, రాజాబహుద్దూర్ గౌడ్ పి.హనుమయ్య, వి.ఆళ్వారుస్వామి, హేమాద్రి డి.హెచ్. దేశాయి దొడ్డా నరసయ్య ముఖ్యులు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీకంటే తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ అద్భుతాలు చేసి ప్రపంచ ప్రఖ్యాతి గాంచినది. తెలంగాణాలోని సమస్యలయిన నిజాం నిరంకుశ పాలనను, భూస్వాముల దౌర్జన్యాలను వెట్టిచాకిరీని వీరోచితంగా ఎదుర్కొని, విముక్తి పోరాటాన్ని సాగించింది.

**18.7.4. ఆంధ్రా కమ్యూనిస్టు పార్టీతో అనుబంధం :** 1994 నాటికి తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రాలోని కమ్యూనిస్టు పార్టీతో గట్టి అనుబంధాన్ని పెంచుకొంది. ఆంధ్ర కమ్యూనిస్టు నాయకుల సహకారంతో 1946 లో సాయుధ పోరాటం నిర్వహించింది. 1946 జూలై 4 వ తేదీన ప్రారంభమైన తెలంగాణా సాయుధ పోరాటం దున్నేవానిదే భూమి అను నినాదంతో తెలంగాణాలో ఒకవైపు భూస్వాములతో, మరియొక వైపు నిజాం పోలీసులతో మరోవైపు రజాకార్లతో సాహసంగా పోరాటం జరిపింది. నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించి ప్రజలను కాపాడటానికి గ్రామరక్షణ కమిటీలను ఏర్పరచి, రజాకార్ల దౌర్జన్యాల నుండి తెలంగాణా ప్రజలను కాపాడింది. నల్లగొండ, వరంగల్లు, కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన 16000 చదరపు మైళ్ళ విస్తీర్ణంగల 4000 గ్రామాలను ఆక్రమించి 12 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచింది. అందువలన తెలంగాణా ప్రజలలో కమ్యూనిస్టు పార్టీ మంచి పట్టును సంపాదించింది.

## 18.8 వాల్గవ దశ - 1947-1964 :

ఇట్టి పరిస్థితులలో 1947 ఆగస్టు 15 వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్యానంతరం ఆంధ్రాలోని కమ్యూనిస్టులను జైళ్ళనుండి విడుదల చేశారు. అంతట వారు తమ కార్యక్రమాన్ని నిర్ణయించుకోవటానికి 1948 లో కలకత్తాలో సమావేశమయ్యారు. అందు ఆంధ్ర నాయకుడైన చండ్ర రాజేశ్వరరావు, ఆంధ్రా థీసిస్ అనే పేరుతో తన విధానాన్ని వివరించాడు. ఆ థీసిస్ ప్రకారం మావోసేదుంగ్ పద్ధతి అనుసరించాలని, భారత దేశం కూడా వ్యవసాయక గ్రామీణ దేశం కావున గ్రామాలలో వ్యవసాయక విప్లవం ప్రారంభించి, గ్రామాలపై ఆధిపత్యం సంపాదించి, తరువాత విప్లవాన్ని పట్టణాలకు వ్యాపింప చేయవలెనని తద్వారా దేశ వ్యాప్తంగా మావోసేదుంగ్ ప్రవచించిన నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడుతుందని వివరించాడు. కాని ఆనాటి అఖిలభారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రణదివె, రాజేశ్వరరావు ఆంధ్రా థీసిస్‌ను తిరస్కరించి తెలంగాణాలో అప్పటికే కొనసాగుచున్న సాయుధ పోరాటాన్ని దేశవ్యాప్తంగా కొనసాగించి అధికారం హస్తగతం చేసుకొనవలెనని తీర్మానించారు. దానితో ఆంధ్ర, తెలంగాణా రెండు ప్రాంతాలలో కమ్యూనిస్టులు సాయుధ పోరాటం ప్రారంభించారు.

**18.8.1 తెలంగాణాలో :** 1948 సెప్టెంబరు 17 వ తేదీన పోలీసు చర్య వలన నిజాం భారతదేశానికి లొంగిపోయాడు. తెలంగాణాలో కమ్యూనిస్టులు ప్రభుత్వాధికారాన్ని గూడా లెక్క చేయకుండా సాయుధ పోరాటాన్ని సాగించారు. పటేల్ వారిని అణచడానికి భారత సైన్యాన్ని ఉపయోగించారు. కమ్యూనిస్టులు గ్రామాలు వదిలి అరణ్యాలలో తలదాచుకున్నారు. తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీని ప్రభుత్వం నిషేధించింది.

**18.8.2 ఆంధ్రాలో:** ఆంధ్ర దేశంలో కమ్యూనిస్టులు గ్రామాలపై దాడులు చేసి కొందరు భూస్వాములను హత్యలు చేసి, దోపిడీలు చేసి హింసాత్మక చర్యలకు దిగారు. అంతట మద్రాసు ప్రభుత్వం 1949 సెప్టెంబరు 26 వ తేదీన కమ్యూనిస్టు పార్టీని, దాని అనుబంధ సంస్థలుగా పనిచేయుచున్న కార్మిక సంఘాలను నిషేధించింది. అయినప్పటికీ కమ్యూనిస్టులు రహస్యంగా తమ కార్యకలాపాలను కొనసాగించారు. కృష్ణాజిల్లాలోని "చిన ఓగిరాల", వెమలి, వెలమర్రు గ్రామాలను దోచుకున్నారు. ప్రజలు ఎవరికి వారే తమ గ్రామాలు

కాపాడుకోడానికి సంఘాలుగా ఏర్పడి కమ్యూనిస్టులను ఎదిరించారు. మరియొక వైపున ప్రభుత్వం కమ్యూనిస్టుల కొరకు గాలింపు చర్యలు మొదలుపెట్టి కొంతమందిని పట్టుకొని కాల్చి చంపింది. కమ్యూనిస్టులు సాయుధ పోరాటం ద్వారా ప్రజా విరోధులు అవటం తప్ప తాము సాధించేది ఏమిలేదని గ్రహించి, 1951 అక్టోబరు 21 వ తేదీన తమ సాయుధ పోరాటం విరమించారు. అందువలన మద్రాసు రాష్ట్రంలో కమ్యూనిస్టులపై నిషేధం రద్దు అయింది. "రణదీవె" విధానం విఫలం అయింది. 1951 లో చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శి అయ్యారు. ఆయన రాజ్యాంగ పద్దతి ద్వారా అధికారం సాధించాలని తీర్మానించారు.

**18.8.3 ఎన్నికలలో పాల్గొనుట :** ఈ తీర్మానం ప్రకారం 1952 లో జరిగిన ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ పోటీ చేసింది. ఆ ఎన్నికలలో ఆంధ్ర ప్రాంతంలో గల 140 స్థానాలకు పోటీ చేసి 41 స్థానాలు సంపాదించింది. వారు బలపరచిన 8 మంది అభ్యర్థులు గెలిచారు. మొత్తం 21% సీట్లు వారికి లభించాయి. 1953 లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ప్రకాశంకి కమ్యూనిస్టులు మద్దతు నిచ్చారు. అందువలన ఆయన ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యారు.

తెలంగాణాలో మాత్రం పార్టీపై నిషేదం రద్దు కాలేదు. అందువలన కమ్యూనిస్టులు 'పీపుల్స్ డెమొక్రాటిక్' ఫ్రంట్ అనే పేరుతో ఎన్నికలలో పాల్గొన్నారు. ఎన్నికలు జరిగిన 105 స్థానాలలో వారు 42 స్థానాలు సాధించారు.

అదే సంవత్సరంలో కేంద్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో రావి నారాయణరెడ్డికి దేశంలో ఎవరికీ, ఆఖరికీ భారత ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూకు గూడా రానంత మెజారిటీ వచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ గారికి 2 లక్షల మెజారిటీ రాగా, నారయణరెడ్డికి 3 లక్షల పై చిలుకు మెజారిటీ వచ్చింది. ఆయన పార్లమెంటు సభ్యులు అయ్యారు. తెలంగాణాలో ప్రముఖ నాయకులైన మాడపాటి హనుమంతరావు, జమలాపురం కేశవరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలగు వారంతా కమ్యూనిస్టుల చేతులలో ఘోర పరాజయం పొందారు. అయినప్పటికీ 93 సీట్లు సాధించి కాంగ్రెసు ప్రభుత్వాన్ని నెలకొల్పింది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రి అయ్యారు.

ఆంధ్ర రాష్ట్రంలో తిరిగి ఎన్నికలు జరిగితే కాంగ్రెసు పార్టీని ఓడించవచ్చని ప్రకాశం మంత్రి వర్గంపై కమ్యూనిస్టులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రభుత్వాన్ని పడగొట్టారు. అందువలన 1955 లో తిరిగి ఎన్నికలు జరిగాయి. కాని కమ్యూనిస్టులు ఆశించినట్టు జరగలేదు. ఎన్నికలలో ప్రకాశం, రంగా, కాంగ్రెస్‌లో కలిసిపోయారు. కమ్యూనిస్టులు 196 స్థానాలకు పోటీచేసి చిత్తుగా ఓడిపోయారు. 15 సీట్లు మాత్రమే గెలిచారు.

**18.8.4 ఐదవ పార్టీ మహాసభ, తణుకు - 1953 జూన్ :** పార్టీమీద నిషేధం తొలగించిన తరువాత 1953 జూన్ 3-14 తేదీలలో కమ్యూనిస్టు పార్టీ తణుకులో ఐదవపార్టీ మహాసభ జరుపుకున్నది. ఆ సభలో తెలంగాణా కమ్యూనిస్టు యోధులకు సన్మానం చేశారు. 1948-1951 సం॥లలో పార్టీ చేపట్టిన సాయుధ పోరాటం గురించి ఆత్మవిమర్శ చేసుకున్నారు. 1956 ఫిబ్రవరి 17-23 తేదీలలో గుంటూరు జిల్లాలో రేవేంద్రపాడులో ఆరవ కమ్యూనిస్టు పార్టీ మహాసభ జరిగింది.

**18.8.5 తెలంగాణా కమ్యూనిస్టు ప్రథమ మహాసభ 1954 ఆగస్టు 1-9 :** తెలంగాణా కమ్యూనిస్టు పార్టీ పుట్టిన తరువాత ఒక్కసభ కూడా జరుపుకోలేకపోయినా ఆంధ్ర మహాసభలలో పాల్గొంటూ పార్టీని విస్తరించారు. ప్రత్యేకంగా కమ్యూనిస్టు పార్టీ సభ అంటూ జరుగలేదు. తెలంగాణాలో పార్టీపై నిషేదం ఎత్తివేసిన తరువాత 1954 ఆగస్టు 1-9 తేదీలలో హైదరాబాదులో మొట్టమొదటి మహాసభ జరుపుకున్నారు. ఆంధ్ర కమ్యూనిస్టులు తణుకు సభలో ఆత్మ విమర్శన చేసుకున్నట్లే ఈ మహాసభలో తెలంగాణావారు కూడా తాము చేపట్టిన తెలంగాణా సాయుధ పోరాటాన్ని గురించి ఆత్మ విమర్శన చేసుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత తెలంగాణా, ఆంధ్రా కమ్యూనిస్టు శాఖలు విలీనమయి, రాష్ట్రానికంతా ఒకే ఒక కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. సోవియట్ రష్యా భారతదేశంలోని నెహ్రూ ప్రభుత్వంతో స్నేహపూర్వకముగా ఉండడంతో కమ్యూనిస్టుపార్టీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగానే ఉండవలసి వచ్చింది. కృశ్చేవ్ 1956 లో చేసిన భారత పర్యటన ఈ సంబంధాలను మరింత పటిష్టపరచింది. పాల్ఘాట్‌లో 1956 లో జరిగిన సి.పి.ఐ. సమావేశం నెహ్రూ ప్రభుత్వం పట్ల స్నేహపూర్వక వైఖరిని ప్రకటించింది.

కాని ఈ వైఖరి అందరికి అంగీకారం కాలేదు. ఆంధ్రా నాయకులగు సుందరయ్య, బసవపున్నయ్య మొదలగువారు కాంగ్రెస్‌తో స్నేహవైఖరిని వ్యతిరేకించారు. కమ్యూనిస్టు పార్టీలో విభేదాలు స్పష్టమయ్యాయి. చైనా కమ్యూనిస్టు రాజ్యంగా ఏర్పడడంతో కొందరికి రష్యాస్థానంలో, చైనా ఆదర్శప్రాయమయింది. విజయవాడలో 1961 లో జరిగిన సి.పి.ఐ. మహాసభలో ఈ విభేదాలు స్పష్టమయ్యాయి. చివరకు 1964 లో కమ్యూనిస్టు పార్టీ సి.పి.ఐ అనీ సి.పి.ఐ.ఎమ్.గా విడిపోయింది. ఆంధ్రాలో కూడా ఈ విభజన ప్రభావాన్ని చూపింది. రాజేశ్వరరావు, రావి నారాయణరెడ్డి సి.పి.ఐ లోనే కొనసాగగా, ఆంధ్రా నేతలగు సుందరయ్య, బసవపున్నయ్యలు సి.పి.ఐ.ఎమ్.లో చేరారు.

తిరిగి 1969 లో కొత్త శాఖ సి.పి.ఐ. (ఎమ్.ఎల్) ఆవిర్భవించింది. దీనిలోని ప్రముఖ సభ్యుడు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కొల్లా వెంకయ్య ఇతర ప్రముఖులు.

## 18.9 సమీక్ష :

ఈ విధంగా ఆంధ్రాలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ యువతనాకర్షించి, చారిత్రాత్మక పాత్రని పోషించింది. ఆంధ్రా ప్రాంతంలో రైతులలో చైతన్యాన్ని తీసికొని వచ్చి, జమీందారీ వ్యతిరేక దిశలో నడపగలిగింది. తెలంగాణాలో నిజాం నిరంకుశ పాలనను, భూస్వాముల కిరాతక చర్యలను ఎదిరించి, స్థానిక ప్రజలను విముక్తి పోరాటంలో నడపగలిగింది. విశాలాంధ్ర నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి కృషి చేసింది.

## 18.10 వ్యాసరూప ప్రశ్నలు :

1. ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావాన్ని తెలియజేయండి.
2. కమ్యూనిస్టు పార్టీతో జరిగిన వివిధ దశలను వివరించండి.
3. తెలంగాణాలో కమ్యూనిస్టు పార్టీ ఏ విధంగా ఏర్పడిందో తెలియజేస్తూ, అక్కడ సాధించిన విజయాలను పేర్కొనండి.

## 18.11 ఉపయుక్త గ్రంథాలు :


1. P.R. Rao : History of Modern Andhra Pradesh
2. ఆళ్వారు స్వామి (సం.) : తెలంగాణా
3. రావి నారాయణరెడ్డి : వీర తెలంగాణా
4. పి. సుందరయ్య : విశాలాంధ్రలో ప్రజారాజ్యం
5. దేవులపల్లి రామానుజరావు : విశాలాంధ్ర వచ్చింది
6. B. Kesava Narayana : Political and Social Factors in Andhra
7. కంభంపాటి సత్యనారాయణ : ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర - Vol. I
8. ఎ.వి. రమణయ్య : భారత జాతీయ విముక్తి పోరాటంలో వామపక్షాల పాత్ర

పాఠం - 19

# రైతు ఉద్యమాలు

## 19.1 లక్ష్యం :

ఒకప్రక్క బ్రిటిష్ పాలనకు, విధానాలకు వ్యతిరేకంగానూ, మరోవంక స్వదేశీ భూస్వాములగు జమీందారులకు వ్యతిరేకంగాను రైతులు సమైక్యతతో సాగించిన పోరాటాలను తెలియజేయడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయ క్రమం


19.1 లక్ష్యం
19.2 పరిచయం
19.3 తొలి గుర్తింపు
19.4 కాంగ్రెస్ నాయకత్వం
19.5 ఆర్థిక మాంద్యం
19.6 అఖిలభారత కిసాన్ సభ ఏర్పాటు 1936
19.7 ఆంధ్రప్రాంతంలో రైతు ఉద్యమాల పుట్టుక
19.8 రైతు సంఘాల ఆవిర్భావం
19.9 కమ్యూనిస్టుల ప్రవేశం
19.10 రైతు రక్షణ యాత్ర
19.11 ప్రకాశం కమిటీ
19.12 జమీందారీ వ్యతిరేక పోరాటాలు
19.12.1 మునగాల
19.12.2 వెంకటగిరి
19.12.3 కాళీపట్నం
19.12.4 చల్లపల్లి
19.12.5 విశాఖపట్టణం - శ్రీకాకుళం
19.13 సమీక్ష
19.14 నమూనా ప్రశ్నలు
19.15 ఉపయుక్త గ్రంథాలు


## 19.2 పరిచయం :

బ్రిటిష్ వ్యవసాయ విధానాలు రైతులను కష్టనష్టాలకు గురిచేశాయి. శాశ్వత శిస్తు విధానంలో జమీందార్ల ప్రత్యక్ష దోపిడికి రైతులు గురికాగా, దత్త మండల జిల్లాలలో ప్రవేశపెట్టిన రైత్వారీ పద్ధతిలో ప్రభుత్వమే రైతులను ప్రత్యక్ష దోపిడికి గురిచేసింది. ఇంగ్లండ్‌లోని పారిశ్రామికోత్పత్తికి కావలసిన ముడి సరుకుకోసం వ్యవసాయంలో 'వ్యాపారీకరణ'ను ప్రవేశపెట్టారు. దీనితో వాణిజ్య పంటలకు ప్రాధాన్యత

ఏర్పడి, ఆహార ధాన్యాల ఉత్పత్తి కుంటుపడింది. వ్యవసాయానికి సరైన నీటిసరఫరా వంటి వసతులు, ప్రభుత్వ సహాయం లేకపోవడంతో తరచు కరువులు వస్తూ ఉండేవి. గ్రామీణ స్వయం పోషక స్థితి విచ్ఛిన్నమై, మార్కెట్లకై వ్యవసాయం కొనసాగేది.

మధ్యయుగాల ఆర్థిక వాతావరణంలో జీవనం సాగిస్తున్న గ్రామీణ రైతాంగం ఒక విధంగా విముక్తి చెంది, ఆధునిక కాలపు పెట్టుబడిదారీ భూ సంబంధాల్లోకి ప్రవేశించడం, కారల్‌మార్క్స్ భావనలో, బ్రిటిష్‌వారు సాధించిన సామాజిక విప్లవం. అయినప్పటికి మాతృదేశ సౌభాగ్యానికే వలసలను సిద్ధాంతం వలన భారతదేశం ముడి వస్తువులను కోల్పోతూ, తయారయిన వస్తువులకు మార్కెట్టుగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లోని చేతివృత్తులు అంతరించసాగాయి. పారిశ్రామిక క్షీణత వలన అనేకమంది జనులు జీవనాధారాన్ని కోల్పోయి, బ్రతుకుతెరువు కోసం వ్యవసాయ రంగంలోకి ప్రవేశించారు. అప్పటికే కిక్కిరిసి వున్న వ్యవసాయరంగం వీరి ప్రవేశంతో మరింత ఒత్తిడికి గురయి, కనీస జీవన స్థాయికి దిగజారింది. భారమైన శిస్తు వలనా ఋణబాధ వలనా రైతులు తమ భూకమతాలను మధ్యవర్తులకు, అంటే, చిన్న పెట్టుబడిదారులకు, వడ్డీ వ్యాపారులకు దాఖలు పరచి, వ్యవసాయ కూలీలుగా మార్పు చెందారు. శిస్తు నగదు రూపంలో చెల్లించాలనే నిబంధన కూడా రైతులను మరింత కృంగదీసింది. తరచూ సంభవించే కరువులు రైతుల బాధలను అధికం చేశాయి.

## 19.3 తొలి గుర్తింపు :

నూతన విద్యాధిక మధ్యతరగతి వర్గం మిగిలిన అన్ని అంశాలతోబాటు రైతాంగ సమస్యలని కూడా గుర్తించారు. గాజుల లక్ష్మీనరసు చెట్టి మద్రాసులో స్థాపించిన మద్రాసు నేటివ్ అసోసియేషన్ సమర్పించిన మెమొరాండంలో రైతులకు సంబంధించిన అధిక శిస్తులు, శిస్తు వసూలులోని క్రూరపద్ధతులు, సౌకర్యాల లేమిని ప్రస్తావించింది. ఈ విధంగా ప్రభుత్వ దృష్టికి రైతుల సమస్యలను తొలుతగా 1850 దశకంలో తీసికొని వచ్చింది. అలాగే 1870 దశకం నాటి కాకినాడ లిటరరీ అసోసియేషన్ గోదావరి డెల్టాలోని రైతు సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసింది. వలస పాలనలో రైతులు అత్యంత కఠినమైన పరిస్థితులలో జీవిస్తున్నట్లు తెలుస్తోంది.

## 19.4 కాంగ్రెస్ నాయకత్వం :

గాంధీ నాయకత్వంలో 1921-22 లలో జరిగిన సహాయ నిరాకరణోద్యమం ప్రధానంగా రైతులను ఆకర్షించింది. దీనికి కారణం పన్నుల నిరాకరణ దీని ముఖ్య నినాదమవడమే. భూమి శిస్తులు, అటవీ ప్రాంతాల్లోని పుల్లరి పన్ను, సాముదాయక భూములయిన బీళ్ళు, బంజర్లు రైతాంగాన్ని కదలించాయి.

చీరాల - పేరాల ఉద్యమం మున్సిపాలిటీ పన్నులకు వ్యతిరేకంగా వచ్చినప్పటికీ, ఉద్యమంలో గాని, రామదండులోని వారుగాని రైతులే. పర్వతనేని వీరయ్య చౌదరి నాయకత్వంలో జరిగిన పెదనందిపాడు ఉద్యమంలో భూమిశిస్తు ప్రధానాంశం. పెంచిన నీటి తీరువా దీనికి తోడయ్యింది. నూరు గ్రామాలకు సోకిన ఉద్యమంతో పన్నుల చెల్లింపు పూర్తిగా ఆగిపోయింది. నాలుగు వేల మంది వాలంటీర్లతో ఒక దళం ఏర్పడింది. గ్రామాధికారుల రాజీనామా ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ప్రభుత్వ చర్యలయిన అరెస్టులకు, శిస్తు వసూలు ప్రత్యామ్నాయ చర్యలకు, దమన కాండకు రైతులు వెరువలేదు. గ్రామాల్లో దించిన సైనిక దళాలకు అయ్యే ఖర్చుని ఆ గ్రామ ప్రజలనుంచే వసూలు చేసేవారు. పెదనందిపాడు ఉద్యమాన్ని ఏకపక్షంగా నిలిపివేయడంతో, రైతులు తీవ్ర నిరాశకు గురి అయ్యారు. పల్నాడులోని పుల్లరి సత్యాగ్రహంలో రెవెన్యూ, అటవీ అధికారుల సామాజిక బహిష్కరణకు గురి అయ్యారు. నివేదిక తయారు చేయడానికి వచ్చిన ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి వేదాంతం లక్ష్మీనరసింహాచారీలను అరెస్టు చేయడంతో, సత్యాగ్రహం తీవ్రమయింది. కన్నెగంటి హనుమంతు నాయకత్వంలో మించాలపాడు సంఘటన జరిగింది. ఈ విధంగా 1920 దశకానికే ఆంధ్ర రైతాంగం చైతన్యవంతమయింది. రాజకీయ పోరాటంలో సహితం ప్రముఖపాత్ర వహించే స్థితికి చేరింది. రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నా, వారి సమస్యలకు ఉద్యమంలో ప్రత్యేక చోటులేదు. అప్పటికింకా జాతీయోద్యమానికి ప్రత్యేకించి రైతుల గూర్చిన స్పష్టమైన ఎజెండాలేదు. దేశీయ పరిశ్రమల స్థాపన ఇంగ్లండ్‌కి తరలించుకుపోతున్న సంపదను ఆపడం, మధ్యతరగతికి సంబంధించిన ఉద్యోగాలు వగైరా కోర్కెలతోనే ఉద్యమం కొనసాగుతూ ఉంది.

రైతాంగంలో ఉన్న అసంతృప్తిని సంఘటిత ఉద్యమ రూపంలో సరైన నాయకత్వంలో 1930వ దశకంలో అఖిలభారత స్థాయిలో, కిసాన్ సభ ఆవిర్భవించింది.

## 19.5 ఆర్థిక మాంద్యం :

ప్రపంచ వ్యాప్తంగా 1929 లో ఆర్థికమాంద్యం ఏర్పడింది. ఈ సంక్షోభం రైతులను మరింత బలహీనపరచింది. పంటల ధరలు పూర్తిగా పడిపోయినప్పటికి, రైతులు చెల్లించాల్సిన కౌలు రేట్లు, అప్పులపై వడ్డీలు తగ్గలేదు. ఋణభారాన్ని భరించలేక రైతులు తమకున్న కొద్దిపాటి కమతాల్నీ అమ్ముకుని వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. చేతివృత్తులవారు తమ వృత్తులను పోగొట్టుకుని నిరుద్యోగులయ్యారు. శాసనోల్లంఘనోద్యమం (1930-34) విరమణ తరువాత ప్రజలు, ముఖ్యంగా రైతులలోని నిరాశను పోగొట్టే ప్రయత్నాన్ని వామపక్షాలు చేపట్టాయి.

## 19.6 అఖిల భారత కిసాన్ సభ ఏర్పాటు 1936 :

జాతీయ కాంగ్రెస్ ఏప్రిల్ 1936 న లక్నోలో సమావేశమయ్యింది. అనేక ప్రాంతాలనుంచి రైతు సంఘాల ప్రతినిధులు అక్కడ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్కడే అఖిల భారత కిసాన్ సభ ఏర్పడింది. ఈ ప్రథమ మహాసభకు హాజరయిన ప్రముఖులలో బీహారునుంచి స్వామి సహజానంద సరస్వతి, ఆంధ్రానుంచి ఎన్.జి. రంగా, పంజాబ్‌నుంచి సోహన్‌సింగ్ జోష్, గుజరాత్ నుంచి ఇందులాల్‌యాగ్నిక్ ఉన్నారు. వీరితోపాటు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి చెందిన జయప్రకాశ్ నారాయణ, రామమనోహర్ లోహియా, జవహర్లాల్ నెహ్రూలు ఉన్నారు.

స్వామి సహజానందను కిసాన్ సభ అధ్యక్షునిగానూ, ఆచార్య ఎన్.జి. రంగాను కార్యదర్శిగానూ ఎన్నుకొన్నారు. భూస్వాముల, జమీందారుల దోపిడి నుంచి రైతులను విముక్తులను చేయాలని, వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన ప్రతినిధులను వారి ప్రాంతాల్లో అనుబంధ శాఖలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అఖిల భారత కిసాన్ సభ రెండో మహాసభ డిసెంబరు 26, 27, 1936 లో మహారాష్ట్రలోని ఫైజ్‌పూర్‌లో జరిగింది. దీనికి ఎన్.జి. రంగా అధ్యక్షత వహించారు. ప్రత్యేకించి రైతు సమస్యలపై దృష్టిసారించే సంస్థ ఏర్పడడం, దానికి కాంగ్రెస్, ప్రముఖులు మద్దతు ప్రకటించడంతో కాంగ్రెస్ తన ఎజెండాలో వ్యవసాయ సంబంధిత కార్యక్రమాన్ని భాగంగా చేసుకొంది. 1937 లో జరగనున్న ఎన్నికల వాగ్దానాలలో వీటిని చేర్చింది కూడా.

## 19.7 ఆంధ్రప్రాంతంలో రైతు ఉద్యమాల పుట్టుక :

బ్రిటిష్ పాలనలో కోస్తా ప్రాంతంలో జమీందారీ భూమి శిస్తు విధానాన్ని, దత్తమండలాల్లో రైత్వారీ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ రెండు విధానాలు రైతుల ప్రయోజనాలను కాపాడలేకపోయాయి. రెండు ప్రదేశాలలోనూ భూస్వాములు బలంగా ఎదగడం, వారికి చేదోడు వాదోడుగా వడ్డీ వ్యాపారస్తులు నిలవడం కనిపిస్తుంది. రైతులు తమ వ్యతిరేకతను జిల్లా మహాసభల ద్వారా వ్యక్తపరచేవారు. ఈ జిల్లా మహాసభలు రైతాంగ సమస్యలను తెలియజేయడం కూడా ఆనకట్టల ద్వారా సుసంపన్నమయిన గోదావరి, కృష్ణా, ప్రాంతాల్లోనే జరిగింది. ఆ ప్రాంతాల్లో సాంప్రదాయక పంటలతోపాటు వ్యాపార పంటలు కూడా అభివృద్ధి చెంది, ఆర్థికంగా రైతాంగం బలపడి, సమాజంలో విద్యాధిక మధ్యతరగతి వర్గంలో వచ్చిన చైతన్యమే ఈ విధంగా వ్యక్తమయింది. పంటకాలువల రిపేర్లు, గ్రామాలకు రవాణా సౌకర్యాలు, విద్యా సౌకర్యాల కోసం మహాసభల్లో తీర్మానాలు చేయసాగారు. డెల్టాప్రాంతపు రైతులు నీటి తీరువా పన్ను హెచ్చింపుపై సమీకృతమవ్వడం ఇప్పుడే జరిగింది.

కృష్ణాజిల్లా మహాసభ 1892 లో ఏలూరులో జరిగింది. రైతుల్లో కనిపించిన ప్రభుత్వ వ్యతిరేక స్పృహ రైతు సంఘాల నిర్మాణానికి పునాది అయింది.

## 19.8 రైతు సంఘాల ఆవిర్భావం :

కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలో నూజెండ్ల గ్రామంలో 1905 లో మొదటిసారిగా రైతులు తమ సమస్యలను చర్చించడానికి సమావేశమయ్యారు. రైతు సంఘాల నిర్మాణానికి ఈ సమావేశం నాంది పలికింది. ఎన్.జి. రంగా, మాగంటి బాపినీడు, దండు నారాయణ రాజు మొదలగువారు రైతు ఉద్యమాలకు అండగా నిలబడ్డారు.

నెల్లూరు జిల్లాలో వ్యవసాయక సంఘం 1908 లో ఏర్పాటు అయింది. వ్యవసాయ పద్ధతులలో మేలైనవి ఎంపిక చేసి, వాటి గురించిన ప్రచారంతో పాటు, ప్రభుత్వానికి మహజర్లు సమర్పించడం, రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లు తెప్పించి ఇవ్వడం వారి కార్యక్రమాల్లో భాగమయ్యాయి. నీటి వసతులు పెంచాలని, క్లిష్ట పరిస్థితులలో శిస్తు రెమిషన్ ఇవ్వాలనీ, అటవీ సంపదపై హక్కు ఉండాలనీ తీర్మానాలు చేశారు.

1920 దశకంలో జరిగిన కృష్ణా, గోదావరి, గుంటూరు జిల్లాల మహాసభల్లో జమీందారీ ప్రాంతాల్లోని రైతుల సమస్యలను చర్చించి తీర్మానాలు చేశారు. జమీందార్ల భూములను ప్రభుత్వం పరిహారమిచ్చి వశపరచుకోవాలని, ఆ విధంగా రైతులను జమిందార్ల బారినుంచి కాపాడవచ్చని సూచించింది. ప్రభుత్వం విచారణ కమిటీలను వేయాలని ఈ సంస్థలు కోరేవి.

త్రిపురనేని రామస్వామి చౌదరి తెనాలి నుంచి 1920 లో "రైతు" అను ప్రతికను నడిపేవారు. ఇదొక ముఖ్యమజిలీ. రైతు సమస్యలపై కృషి చేయడానికి 1920 నాటికే తాలూకా, ఫిర్కా స్థాయిలో సంఘాలు ఆంధ్రాలో ఏర్పడ్డాయి.

గుంటూరు జిల్లా రైతు సంఘం 1923 లో అప్పికట్లలో ఏర్పడింది. పాతూరు వెంకటప్పయ్య ఇక్కడ జరిగిన రైతుసభకు అధ్యక్షత వహించారు. రైతాంగానికి రాజకీయాధిపత్యం కావాలనే నినాదాన్ని ఆచార్య రంగా ఆ సభలోనే ఇచ్చారు.

ఇరవై దశకంలోనే ఒంగోలు ప్రాంతంలో ఒక రైతు సంఘం ఏర్పడింది.

జాతీయ కాంగ్రెస్ ఉద్యమంలో చురుకుగా పని చేస్తున్న మాగంటి బాపినీడు, దుగ్గిరాల సూర్యప్రకాశరావు మొదలగువారు రైతు సంఘాలను మారుమూల ప్రాంతాలలో సహితం స్థాపించాలని, వాటిని రాష్ట్రస్థాయి రైతు సంఘానికి అనుసంధించాలని ప్రచారం చేసారు. ఈ సంఘాలన్నీ నాటి ముఖ్య సమస్యలయిన ఋణాలు, ఎరువులు, విత్తనాలు, రీసెటిల్‌మెంట్ సమస్యలను శాసనసభ దృష్టికి తీసుకెళ్ళాలని నిర్ణయించారు. మాగంటి బాపినీడు 1928 లో "రైతు సంఘాలెందుకు" అను కరపత్రాన్ని ప్రచురించాడు.

ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం 1928 లో తన ప్రథమ మహాసభను గుంటూరులో జరుపుకుంది. అధ్యక్షుడు బిక్కిన వెంకటరత్నం, మాగంటి బాపినీడు, నరసింహదేవర సత్యనారాయణ, ఎన్.జి. రంగా, కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు. రీసెటిల్‌మెంట్ రిపోర్టు ఆధారంగా పెంచిన భూమిశిస్తు గురించి ఈ మహాసభ చర్చించింది.

రెండవ రాష్ట్ర రైతు మహాసభ విజయవాడలో 1929 లో జరిగింది. దీనికి అధ్యక్షుడిగా ఉన్న ఎన్.జి. రంగా రైతులకు పూర్తి రక్షణ కావాలని, రైతు రాజ్యస్థాపన జరగాలని కోరారు. ఈ కోరిక ద్వారా స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన రైతు సమస్యలు పరిష్కారం కావేమోనన్న అనుమానం వ్యక్తమయింది.

మూడవ ఆంధ్రరాష్ట్ర రైతు మహాసభ బాపట్లలో 1931 లో జరిగింది. వేమవరపు రామదాసు పంతులు అధ్యక్షుడుకాగా, ఎన్.జి.రంగా కార్యదర్శి. ఈ సభ నాటికి రైతాంగ ఉద్యమం తన పోరాటాన్ని రీసెటిల్‌మెంట్‌కి వ్యతిరేకంగా సాగించింది.

కొత్త శిస్తు 1928 నుంచి రావలసి ఉండగా, రైతుల ఎదిరింపు దృష్ట్యా ప్రభుత్వం మందకొడిగా ఈ విధానాన్ని అమలుపరచ యత్నించింది. భూమి శిస్తును రూపాయకు మూడు అణాలు పెంచాలనే నిర్ణయాన్ని వ్యతిరేకించసాగారు. ఈ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ 1928 లో జూలైలో సమావేశమయినప్పుడు, టంగుటూరి ప్రకాశం భూమిశిస్తు పెరుగుదలకు వ్యతిరేకంగా గ్రామగ్రామాన సభలు నిర్వహించమని పిలుపునిచ్చారు.

గోదావరి, కృష్ణా జిల్లాల రైతులు ఒక ఐక్యకమిటీగా ఏర్పడి దండు నారాయణరాజు నాయకత్వంలో రీ సెటిల్‌మెంటుకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగించారు. దీనితో ప్రభుత్వం ప్రజా ప్రతినిధులతో కూడిన ఆర్థిక విచారణ కమిటీని ఏర్పరచింది. దీనికి కార్యదర్శి ఆచార్య రంగా. ఈ కమిటీ మూడు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి, భారీసంఖ్యలో హాజరయిన ప్రజలతో సంభాషించి, అవసరమైతే ప్రత్యక్ష చర్య

చేపట్టాలన్న తీర్మానానికి వచ్చింది. ఈ కమిటి తన నివేదికలో రైతుల స్థితిని తెలియజేసి, ఉద్యమాన్ని బలపరచింది. వ్యవసాయ ఖర్చులు పెరిగాయని, రైతుల ఆదాయం వారి జీవనోపాధికి కూడా చాలడం లేదని, రుణభారం ఎక్కువై వారు భూములను కోల్పోతున్నారని తెలిపింది.

బార్డోలీ, ఖేడా, ఖైరాలలో జరుగుతున్న రైతాంగ ఉద్యమాలు సత్ఫలితాలను సాధించడంతో కృష్ణా, గోదావరి జిల్లాల రైతులు ఉత్సాహితులయ్యారు. ఆర్థిక మాంద్యం 1929 లో ఆరంభమయి రైతుల స్థితిని మరింత దిగజార్చింది. వ్యవసాయ వస్తువుల ధరలు, భూముల ధరలు కూడా బాగా క్షీణించాయి. ఋణభారం, సత్యనాథన్ కమిటీ రిపోర్టు ప్రకారం, 103 కోట్ల రూపాయిలు దాటింది. వడ్డీ వ్యాపారస్థులు, భూస్వాములు రైతుల భూములను చౌకగా కొనుక్కున్నారు. భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగానూ, ఋణాలను రద్దుచేసి ప్రభుత్వం మారుటోరియం ప్రకటించాలని రైతాంగం కోరసాగింది. రైతు ఉద్యమం ఆంధ్రాలో వ్యాపించడంతో, ప్రభుత్వం దిగివచ్చి 1935 భారత ప్రభుత్వ చట్టం అమల్లోని వచ్చేంతవరకూ పన్ను వసూళ్ళను ఆపేయాలని నిర్ణయించుకుంది.

ఈ రీసెటిల్‌మెంట్ వ్యతిరేక ఉద్యమం రైతాంగ ఉద్యమ విజయంగా భావించవచ్చు. రైతు సమస్యలపై ప్రజలను చైతన్యపరచడమే గాక, ఉద్యమకారులను తయారు చేసుకొని, సంస్థలను పటిష్టంగా నిర్మించుకోగలిగింది.

డిసెంబరు 1934 లో నాలుగవ ఆంధ్రరాష్ట్ర రైతు మహాసభ విశాఖ పట్నంలో జరిగింది. దీనికి ఆచార్య రంగా అధ్యక్షుడు; కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి కార్యదర్శి. రాష్ట్రరైతు సంఘం 1936 లో అధికారికంగా రిజిష్టరు అయింది.

నిడుబ్రోలులో 1936 లోనూ, 1937 లోనూ రైతు మహాభ జరిగింది. ఈ సభల్లో వడ్డీ వ్యాపారస్థుల బారినుంచి రైతులను విముక్తి చేయడానికి రుణ విమోచన చట్టం కావాలని కోరిక వ్యక్తమయింది. నిడుబ్రోలులో 1937 లో జరిగిన సభలో కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అధ్యక్షునిగా, చలసాని వాసుదేవరావు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. జమీందారీల రద్దుని, శిస్తు రేట్ల తగ్గింపుతోపాటు బకాయిలను కూడా రద్దు చేయాలనే కోర్కెలు ముందుకొచ్చాయి.

జాతీయ కాంగ్రెస్ 1937 ఎన్నికలలో గెలిచి, భూస్వామ్య వ్యవస్థకు ప్రతినిధులయిన జస్టిస్ పార్టీని, పీపుల్స్ పార్టీని ఓడించింది. రైతు సమస్యలను పరిష్కరించడంలో నిర్దుష్ట వైఖరిని కాంగ్రెస్ ఎన్నికల తరువాత చూపకపోవడంతో రైతులు నిరుత్సాహపడ్డారు.

వెంకటగిరి జమీందారీ వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహిస్తున్న వెంకట్రామనాయుడు జమీన్‌దారీ రైతు పత్రికను మార్చి 1930 వ సంవత్సరంలో ఆరంభించడం కూడా ఒక ముఖ్య మలుపు. దీనినే 1934 నుంచి "జమీన్‌రైతు" అని పేరు కొద్దిగా మార్చి కొనసాగించారు.

## 19.9 కమ్యూనిస్టుల ప్రవేశం :

రైతాంగ ఉద్యమంలో ప్రధాన పాత్ర ధనిక, మధ్యతరగతి రైతులే 1930 దశకం వరకు నిర్వహించారు. ఉద్యమ పునాదికూడా వారిదే. దేశ స్వాతంత్ర్యంతో పాటు పీడిత ప్రజానీకాన్ని ఆర్థిక దోపిడీనుంచి విముక్తి చేసే ఉద్దేశ్యంతో రైతాంగ ఉద్యమాన్ని సంఘటితపరచి, పునాదిని విస్తరించే ప్రయత్నాన్ని కమ్యూనిస్టులు చేశారు. రైతాంగంలోని వివిధ వర్గాలను గుర్తించి, వర్గ సమస్యలను చేపట్టి, వారిని ఉద్యమాలలోకి తీసికొనివచ్చారు. వీరు 1935 నుంచి రాష్ట్రమంతటా కూలీ రక్షణ సమితులను స్థాపించారు. కాకినాడలో 1935 లో ఆంధ్రరాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ సమావేశం ఒక నిర్ణయాన్ని తీసికొంది. దాని ప్రకారం కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ప్రవేశించి, దానిలోనే ఎన్నికయే పదవుల ద్వారా ప్రజల్లోకి వెళ్ళాలని నిర్ణయించారు. రైతు యాత్రల్లో వీరు విరివిగా పాల్గొనసాగారు.

కమ్యూనిస్టుల ప్రవేశం ద్వారా రైతాంగ ఉద్యమానికి సంఘ ఏర్పాటులలోనూ, విస్తృతిలోనూ, పునాదిలోనూ మార్పు వచ్చింది. ఆఫీసులను నిర్వహించే పుల్‌టైం కార్యకర్తలు వచ్చారు. అయితే ఆంధ్రరాష్ట్ర రైతు సంఘం పూర్తిగా కమ్యూనిస్టులకే అంకితం కాలేదు. అయితే వారు ప్రధాన పాత్ర వహించి, ఉద్యమానికి కీలకమయ్యారు.

### 19.10 రైతు రక్షణయాత్ర - 1937 :

గాంధీజీ నిర్వహించిన దండియాత్ర స్ఫూర్తిగా, రైతుయాత్రలు ఆరంభమయ్యాయి. ఆచార్య రంగా, భారతీ రంగా, ఆచంట ాగయ్య, ఎన్.వి. సుబ్బయ్యలచే 1931 లో గుంటూరులో రైతుయాత్రలు ఆరంభమయ్యాయి. కలెక్టరు వద్దకు రైతులు విజ్ఞాపనలతో

వెళ్ళేవారు. అనేక జిల్లాలలో వార్షిక యాత్రలలో పాల్గొన్న ప్రముఖులలో న్యాపతి సుబ్బారావు, మోచర్ల రామచంద్రరావు, దండునారాయణ రాజు, మాగంటి బాపినీడు, పుల్లెల శ్యాం సుందరరావు, కల్లూరి సుబ్బారావు మొదలగువారు బీహారులో స్వామి సహజానంద సరస్వతి లక్షమంది రైతులను సమీకరించి, నిర్వహించిన యాత్ర జాతీయ స్థాయిలో మన్ననలను పొందింది.

అఖిలాంధ్ర రైతు రక్షణ యాత్రకు ఇది భూమిక అయింది. రైతాంగ సమస్యలపై ప్రభుత్వ దృష్టిని మరల్చడానికి, జమీందారీ వ్యవస్థ రద్దు ప్రధాన కోరికలు. కాంగ్రెస్ 1937 ఎన్నికలలో విజయం సాధించడం కూడా ఈ యాత్రకు కారణమయింది. అప్పుడు ఆంధ్రరాష్ట్ర రైతు సంఘానికి కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అధ్యక్షుడు, ఇతడు కాంగ్రెస్‌వాది. చలసాని వాసుదేవరావు కమ్యూనిస్టు సభ్యుడేగాక ఉపనాయకునిగా రైతు యాత్రకి వ్యవహరించాడు.

రైతుయాత్ర జూలై 3 వ తేదీ 1937 న ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం నుంచి ఆరంభమయింది. రంగా ఈ యాత్రకి ప్రారంభోత్సవం చేయగా గౌతు లచ్చన్న ప్రముఖ పాత్ర వహించారు. విశాఖజిల్లా దాటిన తరువాత తూర్పుగోదావరి జిల్లాలో ప్రవేశించినప్పుడు ఇనుగంటి నారాయణరావు స్వాగతం చెప్పారు. ఈ జిల్లా యాత్రా విజయం మహీధర రామమోహనరావుకి చెందుతుంది. యాత్ర తణుకు వచ్చినప్పుడు సోషలిస్టు పార్టీ నాయకుడయిన మద్దూరి అన్నపూర్ణయ్య ఉపన్యసించారు. మద్దుకూరి చంద్రశేఖరరావు పాల్గొన్నారు. ఆచంటవద్ద అల్లూరు సత్యనారాయణ భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు, ఉద్దరాజు రామం చేరారు. కృష్ణాజిల్లాలో అఖండ ప్రతిస్పందన వచ్చింది. సైసాఫండ్ వసూలు అధికమయింది. గుంటూరు జిల్లాకి సంబంధించి యాత్ర పర్యటనలో ప్రధాన పాత్రను వావిలాల గోపాల కృష్ణయ్య, మాదల వీరభద్రరావులు పోషించారు. ఒంగోలులో బాచిన సుబ్బారావు, ఎం. జయరామ నాయుడు నాయకత్వం వహించారు. తరువాత యాత్ర రాయలసీమలో ప్రవేశించింది. కర్నూలు, నెల్లూరు, కావలిలు దాటి మద్రాసు చేరుకొని, అక్కడ అసెంబ్లీకి మెమొరాండం సమర్పించారు. ఈ యాత్ర ఇచ్ఛాపురంలో జూలై 3, 1937 న ఆరంభమయి మార్చి 27, 1938 కి మద్రాసు చేరింది విశాఖ, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చెంగల్పట్టు తాలూకాలు, రాయలసీమ ముఖ్యంగా కర్నూలు జిల్లాలో సంచరించింది. 525 గ్రామాలను సందర్శించి, 500 గ్రామసభలు, 60 ఫిర్కాస్థాయి సభలు నిర్వహించింది. 25,000 సంతకాలతో 800 దరఖాస్తులను స్వీకరించి, 130 రోజులు పర్యటించింది. మొత్తం మీద నాలుగు లక్షల ఏభైవేలమంది రైతులు, ప్రజలు సభల్లో పాల్గొన్నారని అంచనా వేయబడింది.

రైతు రక్షణ యాత్ర సమర్పించిన మెమొరాండం సుదీర్ఘమయిందీ, సమగ్రమయిందీ కూడా. అందరు రైతులు ఎదుర్కొనే సామాన్య సమస్యలతో పాటు కొన్ని జిల్లాల్లోని, కొన్ని గ్రామాల్లోని ప్రత్యేక సమస్యలను కూడా ప్రస్తావించింది.

యాత్ర ఫలితం రైతుల్లో ఇది కలిగించిన చైతన్యం. అప్పటి రెవెన్యూ మంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆధ్వర్యంలో నియమించబడిన జమీందారీ విచారణ కమిటీ దీని మరో సత్ఫలితం. మూడోఫలితం 1938-40 ల మధ్య జరిగిన రైతాంగ పోరాటాలు మునగాల వెంకటగిరి, కాళీపట్నం, మందస, చల్లపల్లి మొదలగు చోట్ల జరిగిన జమీందారీ వ్యతిరేక పోరాటాలు దీని ఫలితాలే.

## 19.11 ప్రకాశం కమిటీ :

రైతులలో వచ్చిన చైతన్యం కారణంగా జమీందారీలలో సహితం జమిందారీ రైతు సంఘాలు ఏర్పడి, జమీందారీ వ్యతిరేక పోరాటాలు సాగించాయి. జమీందారీ రద్దుని అవి కోరేవి. కాంగ్రెస్ వారి కోర్కెను తీవ్ర చర్యగా పరిగణించేది. మునగాల, వెంకటగిరి, కాళీపట్నం చల్లపల్లి, శ్రీకాకుళం మొదలగు ప్రదేశాలలో వచ్చిన పోరాటాల తీవ్రతను గమనించి, కాంగ్రెస్ 1935 చట్టం ద్వారా జరిపే ఎన్నికలలో పన్ను తగ్గింపును తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. కాంగ్రెస్ విజయంతో రైతు ఉద్యమం బలపడింది. మద్రాసు ఎస్టేట్ లాండ్ చట్టాన్ని ప్రతిపాదించి, దానికి కావలసిన సవరణలు చేయవలసిందిగా, సెప్టెంబరు 10, 1937 న రెవెన్యూమంత్రి టంగుటూరి ప్రకాశం అధ్యక్షతన విచారణా కమిటీని నియమించింది. దానికి తెన్నేటి విశ్వనాథం కార్యదర్శి.

ఆ కమిటీకి సూచించిన మార్గదర్శక సూత్రాలలో ప్రముఖమైనవి : 1. న్యాయశాస్త్రరీత్యా రైతులకు - జమీందార్ల సంబంధాలు 2. శిస్తు రేటు, వసూలు, రాయితీలు 3. సర్వే, నీటి హక్కులు - శిస్తు నిర్ధారణ 4) శిస్తు గాక రైతులు చెల్లించే పన్నులు 5) గ్రామాలలోని సహజ వనరుల వాడకం 6. నీటి వసతులను భద్రపరచడం, వృద్ధి చేయడం.

ప్రకాశం కమిటీలోని ఇతర సభ్యులలో ఎం. పల్లం రాజు, రంగస్వామి అయ్యంగార్, పి.ఎస్. కుమారస్వామి రాజా, వి.వి. జోగయ్య పంతులు, మీర్జాపురం జమీందారు మహమ్మద్ ఆలీబేగ్ ప్రముఖులు. కమిటీ విచారణ నిమిత్తం ప్రముఖ ప్రదేశాలను దర్శించి, ప్రశ్నావళుల ద్వారా అభిప్రాయ సేకరణ చేసింది. నవంబరు 6 వ తేదీ 1938 న రిపోర్టు తయారు చేసింది. ఆ రిపోర్టు 19 సంపుటాలుగా, 5769 పేజీలతో సమర్పించబడింది.

ఆ రిపోర్టులో వారు రైతు మాత్రమే భూమికి హక్కుదారుడని, జమీందారు కేవలం ప్రభుత్వం తరుపున శిస్తు వసూలు అధికారి మాత్రమే అని, తేల్చారు. రైత్వారీ ప్రాంతాలలో రైతులకు భూములపై ఎట్టి హక్కులున్నాయో, జమీందారీలలో కూడా రైతులకు అట్టి హక్కులే ఉంటాయని పేర్కొంది. పొలాలను జమీందారులు జప్తుచేయడానికి గాని, వేలం వేయడానికిగాని హక్కులేదని, సాముదాయిక భూములపైన రైతులకు సమిష్టి హక్కులుండాలని చెప్పింది. పోరంబోకులు, అడవులు, కొండలు, అటవీ సంపదపై కూడా రైతులకే పూర్తి హక్కులుండాలని కమిటీ తెల్పింది.

ప్రకాశం కమిటీ రిపోర్టు వెలువడగానే జమీందార్లలో కలకలం బయలుదేరింది. తమ జమీలలోని సామూహిక భూములు, బంజరు భూములను అమ్మివేయసాగారు. శిస్తువసూలుని వేగం చేసి, శిస్తు చెల్లించనివారి భూములను స్వాధీనం చేసికోడం ప్రారంభించారు. రైతులకు అనుకూలమైన ఈ నివేదిక, మంత్రివర్గ రాజీనామాతో అప్పుడు చట్టరూపం దాల్చలేదు. కాంగ్రెస్ పార్టీ తిరిగి 1946 ఎన్నికలలో అధిక మెజారిటీతో గెలిచింది. కాని మార్చి 1947 లో అవిశ్వాస తీర్మానం వలన ఆ ప్రభుత్వం పడిపోయింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మరలా జమీందారీ రద్దు సమస్య ప్రాముఖ్యతను పొందింది. జమీందార్లు పరాన్న భుక్కులని, వారివల్లనే వ్యవసాయరంగం వెనుకబడిందని, అందుకని జమీందారీలను రద్దు చేయాలని కమ్యూనిష్టులు ప్రచారం చేశారు. భారత ప్రభుత్వం 1949 లో జమీందారీ వ్యవస్థను రద్దు చేసింది.

## 19.12 జమీందారీ వ్యతిరేక పోరాటాలు :

జమీందారీ వ్యతిరేక పోరాటాలు ఆంధ్రాలు జరిగాయి. కారణాలు అధిక శిస్తులు, భూస్వాముల దౌర్జన్యాలు, పేద రైతాంగం చేయవలసిన ఉచిత సేవలు, చాకిరీలు, ఉమ్మడి ప్రాంతాలపై జమీందారుల హస్తగతం మొదలయినవి.

**19.12.1 మునగాల :** మునగాల కృష్ణాజిల్లాలో నందిగామ తాలూకాలోని ఎస్టేటు. నిజాం ఆలీ సర్కారు జిల్లాలను 1766లో ఇంగ్లీషువారికి ఇచ్చినప్పుడు మునగాల సంస్థానం బ్రిటీషువారి ఆధిపత్యంలోనికి వచ్చింది. సంస్థానం వైశాల్యం 110 చ॥ మైళ్ళు. వీటిలో రెండు ముఖాసా గ్రామాలున్నాయి. నెలమఱ్ఱి, రత్నవరం, తెల్లబెల్ల, కీసరవారి గ్రామాలు. క్రీ.శ. 1687 నుండి 1888 వరకు ఈ సంస్థానాన్ని కీసరవారు ఐదారు తరాలు పాలించారు. కీసరవారి రాజధాని శిరిపురం. ఈ సంస్థానానికి నాయని వెంకట రంగారావు దత్తుగా వచ్చి 1900 నుండి సంస్థానం రద్దు అయ్యేవరకు అనగా 1948 వరకు పాలించాడు. ఆయన రాజధానిని శిరిపురం నుండి నడిగూడెంనకు మార్చాడు.

జమీపాలన విషయంలో వెంకటరంగారావు విధానాలు ఆయనకు చాలా అపకీర్తిని తెచ్చాయి. జమీపాలనలో, అతడు కఠినంగా, నిరంకుశంగా వ్యవహరించి తెలంగాణా దేశ్‌ముఖ్‌ల విధానాలను అనుసరించాడు. పన్నులు పెంచడమేగాని నీటిపారుదల సౌకర్యాలు కలుగజేయలేదు. తన ఎస్టేటులోని 42 గ్రామాలలో 2 వేల మంది ప్రజలు సంవత్సరానికి లక్షా ముప్పయివేల రూపాయలు చెల్లించేవారు. మంచి భూములు ఏదో పేరుతో జమీందారు స్వంతం చేసుకొనేవాడు. జమీందారు నౌకర్లు, గుండాలు ప్రజలపై దౌర్జన్యాలు చేస్తుండేవారు. నడిగూడెం కరణం అక్కిరాజు మట్టుపల్లిరావును ఉద్యోగం నుండి తీసివేసి, అతని భూములను ఆక్రమించాడు. ఆకుపాముల కరణం వెలిదండి రంగారావు ఇల్లు పడగొట్టించాడు. మాధవరపు గ్రామ మునసబు కొల్లు అచ్చయ్యను చెరువు గట్టుమీద స్పృహ తప్పిపోయే వరకు కొట్టించాడు. అతడు బెజవాడ సబ్ కలెక్టర్ శివశంకర్‌కు రిపోర్టు చేయగా, ఆయన జమీందారుకు ఎవరైనా ఎదురుతిరిగితే బ్రతకడం దుర్లభం అని తీర్పులో వ్రాశాడు. రేపాలకు చెందిన ఒక బీద బ్రాహ్మణునిపై జమీందార్ డిస్ట్రిక్ మున్సిఫ్ కోర్టులో ఓ.ఎస్.నెం. 370/35 కేసు వేశాడు. కోర్టు విచారణలో బీద బ్రాహ్మణుడు జమీందార్ తెల్లకాగితం మీద సంతకాలు చేయించుకున్నాడని, అవి తన ఇష్టపూర్వకంగా

చేసిన సంతకాలు కాదని వాఙ్మూలం యిచ్చాడు. కేసు విచారించిన మున్సిఫ్, వాది బలవంతుడైన జమీందారని, అతడు బీదబ్రాహ్మణుని చేత బలవంతంగా సంతకాలు చేయించగల శక్తిగలవాడని మరువరాదని వ్రాశాడు.

ఇక శిస్తు వసూళ్ళ విషయంలో అతి అమానుషత్వం వుండేది. శిస్తులు చెల్లించకపోతే వాకిట్లో రేగుకంప కొట్టేవారు. రైతు మెడకు పలుపువేసి దూలానికి కట్టివేసేవాళ్ళు. శిస్తు కట్టేదాక రైతుని ఎర్రని ఎండలో నిలబెట్టి, వంగబెట్టి వీపుమీద బండలెత్తేవారు. చాకలి - మంగలి, దళితుల భార్యలు జమీలో పనులు చేయాలి. దళితులు రోజుకు 40 మైళ్ళు నడచిపోయి నడిగూడెం దివాణానికి నీళ్ళు తేవాలి. జమీందారీ ఉద్యోగులు గ్రామాలకు వచ్చినప్పుడు వర్తకులు కూరగాయల్లు, బియ్యం సరుకులు ఉచితంగా యివ్వాలి. సంస్థానంలో ఎవరైనా చనిపోతే వారి ఆస్థిని జమీందార్ స్వాధీనం చేసుకొనేవాడు. రైతుల పశువులను బందెల దొడ్డిలో పెట్టి బందె వసూలు చేసేవాడు, జరిమానాలు విధించేవాడు. గడిలోనికి పిలిపించి జరిమానా విధించేవాడు. లేక కొట్టించేవాడు. ఈ పద్ధతులన్నీ ఆ కాలంలో నిజాం రాజ్యంలో వుండేవి. నిజాం రాజ్యాన్ని ఆనుకొని వున్న మునగాల జమీందారీలో నిజాం రాజ్య పద్ధతులన్నీ అమలులో ఉండేవి. ప్రజలు, రైతులు, అనేక బాధలు పడుతుండేవారు.

ఇటువంటి పరిస్థితులలో మునగాల ఎస్టేట్‌లో రైతు ఉద్యమం ప్రారంభం అయింది. కోదాటి వెంకట నరసింహారావు, వెలిదండ్ల రంగారావు, కొల్లు పిచ్చయ్య, కొండపల్లి రామచంద్రరావు, ఇమ్మడి పాపయ్యల నాయకత్వంలో జమీన్ రైతు సంఘం 1936 లో ఏర్పడింది.

కలుకోవ అను గ్రామంలో జమీందారుకు 22 ఎకరాల మాగాణి ఉన్నది. వరికోతలప్పుడు ఎకరానికి 80 శేర్ల ధాన్యం కొలుస్తానని పనిచేయించుకొని తరువాత నడిగూడెంలోని తన పాతర్లలో ముక్కిపోయిన ధాన్యాన్ని 60 శేర్లు కొలుస్తానని అన్నాడు. దానితో కూలీలు నండూరి ప్రసాదరావు నాయకత్వంలో సత్యాగ్రహం చేశారు. జమీందార్ పోలీసులను పంపాడు. ఈ లోపల సబ్ కలెక్టర్ జోక్యం చేసుకొని జమీందారుచేత మొదట అన్నప్రకారం 80 శేర్లు కూలీని కొలిపించాడు. ఈ విజయంతో ఉద్యమకారులలో ఆత్మస్థైర్యం వచ్చింది. ఉద్యమం అన్ని గ్రామాలలోకి వ్యాప్తి చెందింది.

మునగాల ఎస్టేటులో పరిస్థితి ఉద్రేకస్థితికి చేరిందని తెలిసి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శి గొట్టిపాటి బ్రహ్మయ్య జోక్యం చేసుకొని రైతుకూలీ నాయకులకు జమీందార్ ఉద్యోగులకు మధ్య రాయబారాలు జరిపి ఒక ఒప్పందం కుదిర్చాడు. జమీందారు పక్షాన కుమారరాజా రామకృష్ణారెడ్డి, వ్యవసాయ కూలీల తరుపున వెలిదండ్ల రంగారావు, కోదాటి వెంకటరంగారావు, నండూరి ప్రసాదరావు, నల్లపాటి వెంకట నరసయ్య, కందుల రాములు సంతకాలు చేశారు. ఈ ఒప్పందానికి బ్రహ్మయ్య అవార్డు అని పేరు వచ్చింది. ఈ అవార్డులో జమీందారు పేదల భూములు ఆక్రమించరాదని, అధిక శిస్తులు వసూలు చేయరాదని నిర్ణయించబడింది. కాని ఆ తరువాత కూడా జమీందారు తన విధానాలను కొనసాగించాడు.

**స్త్రీల సత్యాగ్రహం** : మునగాల ఉద్యమంలో అనేకమంది స్త్రీలు పాల్గొనడం అతిముఖ్య విశేషమని చెప్పాలి. 1939 జనవరి 15 వ తేదీన బ్రహ్మయ్య అవార్డు మీద సంతకాలు జరిగాయి. కాని ఆ మరునాటినుండే జమీందారు పేచీలు పెట్టి అమలు జరగనీయకుండా చేశారు. 1939 జూన్ 2 వ తేదీన జమీన్ రైతు సంఘం నడిగూడెంలో ఆనాటి రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి గొట్టిపాటి బ్రహ్మయ్య నాయకత్వంలో బ్రహ్మయ్య అవార్డును అమలు జరుపడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని విఫలమయ్యారు. 1930 లో జమీందారు ఆక్రమించిన ఇమ్మడి పాపయ్య భూమిని జమీన్ రైతుసంఘం ఆక్రమించడానికి నిర్ణయించింది. జమీన్ సంఘ ఉపాధ్యక్షులు ఉప్పల రామయ్య నాయకత్వంలో 8 మంది కార్యకర్తలు అరకులు కట్టుకొని భూమిలో ప్రవేశించారు. వెంటనే వారిని పోలీసులు అరెస్టుచేసి తీసుకొనిపోయారు. తరువాత జమీన్ రైతు సంఘ నాయకులైన నండూరి ప్రసాదరావు, మోటూరి పరంధామయ్య, వేములపల్లి ఆంజనేయులు, జోస్యభట్ల సత్యనారాయణ, నల్లపాటి రామనర్సయ్యలను పోలీసులు అరెస్టుచేసి తీసుకొని వెళుతుండగా రామాపురం, బిలాఖత్ గూడెం, నారాయణ గూడెంలకు చెందిన 300 మంది స్త్రీలు పోలీసులను అడ్డగించి నాయకులను తీసుకు వెళ్ళనియ్యమన్నారు. నాయకులే తమను తీసుకువెళ్ళనివ్వమని చెప్పిన తరువాత వారు అడ్డు తొలిగారు. 1939 జూన్ 4, 5, 6 తేదీలలో సత్యాగ్రహులపై లాఠీచార్జీ చేసి 98 మందిని అరెస్టు చేశారు. 35 మందికి గాయాలయ్యాయి. అరెస్టు చేసిన వారిలో 77 మందికి జగ్గయ్యపేట మేజిస్ట్రేట్ 6 మాసాలు శిక్ష విధించాడు. స్త్రీలు ప్రతిగ్రామంలో ఉద్యమంలో పాల్గొన్నారు. వారిపై జమీందారుల గూండాలు దాడులు కూడా చేశారు. ఆకుపాముల, కోడిపుంజుల గూడెం, నేలమర్రి

గ్రామాలలో స్త్రీలపై అత్యాచారాలు జరిగాయి. అయినా భయపడక స్త్రీలు మునగాల ఉద్యమంలో విశేషంగా పాల్గొన్నారు. ఈ ఉద్యమకాలంలో చాకలి, మంగలి మొదలైన పనివారు జమీందారు కుటుంబానికి సేవలు చేయడం మానివేశారు. నవశక్తి, జమీన్ రైతువాహిని పత్రికలు ఉద్యమాన్ని సమర్థిస్తూ వ్యాసాలు, సంపాదకీయాలు వ్రాశాయి.

ఈ విధంగా మునగాల ఎస్టేట్‌లో ఉధృతంగా ఉద్యమం జరుగుతుండగా మద్రాసు రాష్ట్ర రెవిన్యూ మంత్రి టంగుటూరి ప్రకాశం, రైతు నాయకుడు ఆచార్య రంగా 1939 జూన్ 18 వ తేదీన మునగాలను దర్శించి రైతు సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యమాన్ని విరమించాలని భావించారు. దానితో ఆ రోజు రాత్రే అనగా 1939 జూన్ 18 వ తేదీన రాత్రి ఆంధ్ర రైతు సంఘం కృష్ణా జిల్లా రైతు సంఘాలు బెజవాడలో సంయుక్తంగా సమావేశం జరిపి మునగాల ఉద్యమం విరమించడానికి తీర్మానించాయి. దానితో జూన్ 19 వ తేదీన మునగాల సత్యాగ్రహం విరమించబడింది.

**19.12.2 వెంకటగిరి :** ఆంధ్ర ప్రాంతంలోని సంస్థానాలలో విజయనగరం అతి పెద్దది. కాగా, దాని తరువాత స్థానం వెంకటగిరి సంస్థానానిది. విస్తీర్ణంలో రాబడిలో పేష్కస్‌లలో విజయనగర జమీందారీకి వెంకటగిరి జమీందారీకి కొద్ది తేడా మాత్రమే ఉండేది. ఈ జమీందారీలో 730 గ్రామాలుండేవని, ఎస్టేట్ ఆదాయం రూ. 7,80,475/- అని, సాలుకు ప్రభుత్వానికి చెల్లించే పేష్కస్ రూ. 4,03,901-7-0 అని 1873 నాటి నెల్లూరు జిల్లా మాన్యువల్ పేర్కొన్నది. జమీందారీ కమిటీ రిపోర్టులో వెంకటగిరి జమీందారీ రాబడి 14,46,222/- అని పేష్కస్ 2,68,711/- అని నమోదు అయింది. ఇది 1937 నాటి అంకె అయివుంటుంది.

సంస్థానంలో పరిపాలన చాలా నిర్లక్ష్యంగా ఉండేది. రైతులకు జిరాయితీ హక్కులుండేవి కావు. అందువలన జమీందారు భూములపై హక్కులను తరచూ మార్చుతూ వుండేవాడు. పంటలు పండినా, పండకపోయినా, కరువు కాటకాలు వచ్చినా శిస్తులు చెల్లించాల్సిందే. జమీందారీ కమిటీ రిపోర్టులో ఎస్టేట్‌లో 428540 ఎకరాలు పశువుల బీడు అని, దానిపై 63418/- ఫీజు వస్తుందని, రిజర్వుడు ఫారెస్టు 90,000 ఎకరాలు వుండేదని, అందు 35000 ఎకరాలలో పశువులు మేత మేసేవని, కంచె పద్ధతి ఎక్కువగా వుండేదని వ్రాయబడింది. కంచె పద్ధతి అనగా బీడు భూములమీద ఏ సంవత్సరానికా సంవత్సరం కౌలు హక్కును వేలం వేసేవారు. దానినే కంచె పద్ధతి అనేవారు. మొదట కంచెలలో అనగా బీడు భూములలో రైతులు పశువులను ఉచితంగా మేపుకొనేవారు. తరువాత పుల్లరి విధింపబడింది. శిస్తురేట్లు అధికంగా వుండేవి. కనుక ఎస్టేట్ వారు సర్వే చేయించారు. దానితో జిరాయితీల పరిమితి పెరిగి శిస్తులు గూడా పెరిగాయి. ఎస్టేట్‌లో 200 అగ్రహారాలుండేవి. ఆ గ్రామాలనుండి జోడి అను ఆదాయం వచ్చేది.

వెంకటగిరి ఎస్టేట్‌లో వర్షాలు పడి చెరువులు నిండితేగాని పంటలు పండవు. కాని తరచుగా అనావృష్టికి గురయ్యేది. ఒక వేళ వర్షాలు అధికంగా పడితే నాల్గు పదున్ల వాన పడితే చాలు చెరువుల కట్టలు తెగేవి. దానికి తగినట్లు జమీందారు శిస్తును కోరుధాన్యపు పద్ధతిలో వసూలు చేసేవాడు, ఈ పద్ధతిలో పంట పండినా, పండక పోయినా ఎకరానికి మూడోవంతుగాని, నాల్గోవంతుగాని రొఖ్ఖం శిస్తుగా చెల్లించాలి. నవంబరు, ఫిబ్రవరిలలో అడవులలో బాగా గడ్డి పట్టేది. కాని రైతులు పశువులకు మేపుకోకూడదు. జమీందారుకు వేట అంటే మహాప్రీతి. జమీందారు వేటకు వెళ్ళిన సమయంలో అడవిలోని మృగాలను రైతులు పారద్రోలాలి. అంటే క్రూర మృగాలను జమీందారు వేటాడటానికి అనువుగా అతడు మాటువేసిన చోటికి త్రోలాలి. ఈ త్రోలటంలో ఒకప్పుడు క్రూరమృగాలయిన పులులు, చిరుతల బారిన పడి మరణించేవారు.

వెంకటగిరి జమీందారు మద్రాసు రాష్ట్ర జమీందార్ల సంఘానికి అధ్యక్షుడు. 1937 దాకా మద్రాసు శాసనసభలో సభ్యుడు. ప్రజాసంక్షేమానికి పాటుపడలేదు.

1929 అక్టోబరులో నెల్లూరు జిల్లా జమీందారీ రైతుసంఘం స్థాపించబడింది. దొడ్ల రామిరెడ్డి, దువ్వూరు రామకృష్ణారెడ్డి, పెళ్ళకూరు కోదండరామిరెడ్డి, దేశిరెడ్డి శేషురెడ్డి, నెల్లూరు వెంకట్రామానాయుడు సంఘాన్ని నిర్మించడంలో మంచి కృషి చేశారు. సంఘం మొదటి సమావేశం 1929 అక్టోబరు 19 వ తేదీన దొడ్ల రామిరెడ్డి స్వంత ఇంట్లో జరిగింది. ఈ సమావేశం వెంకటగిరి జమీందారీ ఉద్యమానికి నాంది పల్కింది. ఈ సంఘం ఏర్పడిన దగ్గరనుండి జమీందారీ ప్రాంతంలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తూ జమీందారీ రైతులలో చైతన్యం తెచ్చింది.

**నెల్లూరు జిల్లా జమీన్ రైతు సంఘం :**

జమీందారీ రైతుసంఘంకాక నెల్లూరు జిల్లా జమీన్ రైతు సంఘం అని మరియొక సంఘం కూడా ఉండేది. దానికి వెన్నెలకంటి రాఘవయ్య, కాటూరి వెంకట నరసప్ప నాయుడు, పొట్టిపల్లి గురప్ప నాయుడు, వేమాటి వెంకటరెడ్డి, దేశిరెడ్డి శేషురెడ్డి కార్యవర్గ సభ్యులుగాను, నెల్లూరి వెంకట్రామానాయుడు కార్యదర్శిగాను ఎన్నికయ్యారు. వెంకటగిరి జమీందారీ వ్యతిరేక పోరాటంలో జమీన్ రైతు పత్రికను ప్రారంభించడం ఒక పెద్ద మలుపు. ఈ పత్రిక రైతు సమస్యలను బాగా ప్రచారం చేసి సమస్యకు మంచి ప్రతిస్పందనను తెచ్చింది. ఆ పత్రిక మొదటి సంపాదకుడు పబ్లిషర్ నెల్లూరు వెంకట్రామానాయుడు. మొదటి సంచిక -1930 మార్చిలో విడుదల అయింది. జమీందారీల పాలనను అంతం చేయడమే ఈ పత్రిక ప్రధాన లక్ష్యం. వెంకట్రామానాయుడు కవి. అతడు స్వాతంత్ర్యోద్యమాన్ని ఇతివృత్తంగా తీసుకొని అనేక గీతాలు, రైతు భజన గీతాలు వ్రాశాడు. వాటిలో గరిమెళ్ళ సత్యనారాయణ వ్రాసిన మాకొద్దీ తెల్లదొరతనం బాణిలో మా కొద్దీ జమీందార్ల పొందు అనే గేయం చాలా ముఖ్యమైంది. అది జమీందారీ రైతులలో మంచి చైతన్యాన్ని రగులుగొల్పింది. జమీన్ రైతు పత్రికకు జమీందారీ రైతు ఉద్యమం స్వాతంత్ర్యోద్యమం రెండుకళ్ళుగా వుండేవి.

నెల్లూరు జిల్లా రైతుసంఘ తొలి ఆంధ్రరాష్ట్ర జమీందారీ రైతు సదస్సును 1931 సెప్టెంబరులో ఏర్పాటు చేసింది. ఈ సదస్సులో వెంకటగిరి జమీందారుని, అతని కుమారుల దురాగతాలను తీవ్రంగా విమర్శించారు. కంచె, పుల్లరి విషయాలలో ఎన్.జి.రంగా జమీందారుకు, రైతులకు మధ్య మధ్యవర్తిత్వం జరపడానికి ప్రయత్నించాడు. కాని ప్రయోజనం కలుగలేదు. 1931 నవంబరునుండి మోపూరు మొదలైన గ్రామాలలో రైతులు సత్యాగ్రహం ప్రారంభించారు. అపుడు నెల్లూరు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని రైతులకు జమీందారుకు రాజీ కుదిర్చాడు. కాని జమీందారు తన ప్రవర్తనను మార్చుకోలేదు. రైతుల శిస్తులను మాఫీ చేయకపోవడం, అటవీ సంపదను రైతులను, రైతు కూలీలను అనుభవించనీయకుండా చేయడంతో మరలా రైతులకు జమీందారుపై ఆగ్రహం కల్గింది.

**పాలెంకోట సత్యాగ్రహం - 1933 మార్చి 20 :**

వెంకటగిరి రైతు ఉద్యమాలలో కల్లా 1933 మార్చి 20 వ తేదీన వెంకటగిరి తాలూకా పాలెంకోటలో జరిగిన రైతు ఉద్యమం అతి తీవ్రమైంది. పాలెంకోటకు చెందిన పనపకోన అనే అడవిలో అనాదిగా రైతులు పశువులను, మేకలను మేపుకొనేవారు. అచటి రైతులు ఎన్నికలలో జమీందారుకు వ్యతిరేకంగా ఓటు చేశారని పగబట్టి అడవిలో పశువులను మేపరాదని కట్టడి చేశాడు. పోలీసులను కాపలా పెట్టాడు. పాలెంకోట, తీర్థంపాడు అను గ్రామాల రైతులు వెట్లూరి గోవిందారెడ్డి నాయకత్వంలో అడవిలోనికి పశువులను త్రోలవలెనని నిర్ణయించుకొన్నారు. అది తెలిసి జమీందారు పోలీసులను పాలెంకోట గ్రామం వద్ద మోహరించాడు. డిప్యూటీ సూపరింటెండెంట్ కూడా వచ్చాడు. వారికి సహాయంగా ఎస్టేట్ సిపాయిలు కూడా వచ్చారు. రైతులు తోలిన పశువులను పోలీసులు మళ్ళించి బందెల దొడ్లోకి తోలాలని ప్రయత్నించారు. ఆ సమయంలో యాదగిరి అనే గర్భిణి స్త్రీ నాయకత్వంలో ఆ రెండు గ్రామాల స్త్రీలు వచ్చారు, వారు కారం, చీపురుకట్టలు, చెప్పులు, వేడినీళ్ళు తీసుకొని వచ్చారు. వారు పశువులకు అడ్డం వచ్చి వాటిని తోలే పోలీసుల కళ్ళలో కారంకొట్టి చీపుళ్ళతో, చెప్పులతో బాదారు. వేడినీళ్ళు పైన చల్లారు. దానితో పోలీసులు ఎటువాళ్ళు అటు పరుగెత్తారు. తరువాత పోలీసులు కొంతమంది రైతుల మీద స్త్రీలమీద కేసులు పెట్టారు. ఈ కొట్లాట జరిగేటప్పుడు సంస్థానంవారు సినిమా తీయించి సాక్ష్యంగా ఉపయోగించారు. కాని అది వారికే వ్యతిరేకంగా ఉంది. దానితో జడ్జి కేసును కొట్టివేశాడు. చెల్లెమ్మ అనే ఒకే ఒక్క స్త్రీకి 15 రూపాయలు జరిమానా విధింపబడింది. ఈ పోరాటం జమీలో గొప్ప సంచలనాన్ని కల్గించింది. 1933 డిశంబరు 20 వ తేదీన గాంధీ వెంకటగిరిలో పర్యటించాడు. ఆ సమయంలో ఆయనను అనుసరించిన ఆచార్య రంగా శాసనం ద్వారా జమీందారీ వ్యవస్థను నిర్మూలించాలి అని ప్రకటించాడు. కాని వెంటనే గాంధీ సత్యాగ్రహం ద్వారా ఎందుకు సాధించగూడదు. అని ఎదురుప్రశ్న వేశారు. జమీందారీలలో అప్పటికే సత్యాగ్రహాలు జరుగుతున్నాయి.

1937 లో ఎన్నికలు జరిగాయి. బద్దెపూడి వెంకట నారాయణరెడ్డి మహారాజాపైన, బత్తిన పెరుమాళ్ళనాయుడు కుమార్‌రాజా పైన పోటీచేశారు. రాజాలిద్దరూ ఓడిపోయారు. ఈ సందర్భంలో జమీన్‌రైతు పత్రిక ఎన్నికల ప్రచారం బాగా చేసింది. కాంగ్రెసు పార్టీ గెలిస్తే శాసనం ద్వారా జమీందారీ వ్యవస్థ రద్దు అవుతుందని కాంగ్రెసువారు ప్రచారం చేశారు. అందువలన జమీ ప్రజలు తమ రాజ్యాలకు వ్యతిరేకంగా ఓటు వేసి వారిని ఓడించారు. ఆ విజయం రైతుల విజయంగా భావించబడింది.

ఎన్నికల తరువాత మద్రాసు రాష్ట్రంలో కాంగ్రెసుపార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాని ప్రకాశం కమిటీ రిపోర్టు యిచ్చినా జమీందారీ విధానాన్ని రద్దు చేయలేకపోయింది. దానితో మహారాజా కుమార్ తనను ఓడించిన రైతుల పై మరలా విజృంభించాడు. ఆ సమయంలో గూడవల్లి రామబ్రహ్మం రైతుబిడ్డ సినిమా తీశాడు. ఆ సినిమా వెంకటగిరిలోని హాలులో ప్రదర్శించబడింది. జమీందారు ఆ హాలుపై దాడి చేయించి హాలును తగులబెట్టించాడు. ఈ విధంగా మరికొద్దికాలం జమీందార్ల అధికారం చెల్లింది.

### 19.12.3 కాళీపట్నం జమీందారి :

పశ్చిమ గోదావరి జిల్లాలో కాళీపట్నం అనే జమీందారీ ఉండేది. కాళీపట్నం రైతులలో చాలామంది భూములకు గట్లు వేసుకొని చేపలు పట్టి జీవించేవారు. ఎవరి మళ్ళను వారు వంశపారంపర్యంగా అనుభవించే హక్కు వారికి ఉండేది. జమీందారు 1928 లో ఒక ప్రాజెక్టును నిర్మించాలని తలపెట్టి ఆ భూములను తీసుకున్నారు. ప్రాజెక్టు నిర్మింపబడింది. ఆ సందర్భంలో తాను తీసుకొన్న భూములకు ప్రత్యామ్నాయంగా 800 ఎకరాల భూమిని యిస్తానని వాగ్దానం చేశాడు. కాని యివ్వకపోగా రైతులు సాగుచేసుకొనే మరియొక 4000 ఎకరాలను కాజేయడానికి జమీందారు ప్రయత్నించాడు. దానితో కాళీపట్నం జమీలో రైతులకు, జమీందారుకు వివాదం మొదలైంది. 1938 జూన్‌లో కాంగ్రెసు నాయకులు, రైతులు కలసి నర్సాపూర్ సబ్ కలెక్టర్‌ను కలుసుకొని తమ భూములలోనికి వెళ్ళడానికి అనుమతించాలని, అచట జమీందారు కోర్కెపై విధించిన 144 వ సెక్షన్‌ను ఎత్తివేయాలని ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. కాని ఫలితం లేకపోయింది. దానితో నర్సాపూర్ కాంగ్రెసు కమిటీ కాళీపట్నం రైతులకు అందరూ మద్దతు ప్రకటించాలని కోరింది. నర్సాపూరు కాంగ్రెసు కమిటీ ఆధ్వర్యంలో కాళీపట్నంలో ఒక స్వచ్ఛంద సేవకుల శిబిరం ఏర్పాటు చేయబడింది. ఈ ఉద్యమాన్ని గురించి ఆనాడు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షునిగా వున్న భోగరాజా పట్టాభి సీతారామయ్య, కాళీపట్నం రైతుల పోరాటం సోషలిస్టుల సారధ్యంలో నడుస్తున్నదని గాంధీకి తెలియజేశారు. దానితో 1938 రైతు ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ హరిజన పత్రికలో ఒక వ్యాసం పడింది. దానికి రైతు సంఘం అధ్యక్షుడు సమాధానం చెపుతూ ఒక ప్రకటన చేశాడు. అందులో భూమికోసం, భుక్తికోసం దౌర్జన్యమార్గం అవలంబించాలా, దౌర్జన్యరహిత మార్గాన్ని అనుసరించాలా అనే విషయం రైతుల ఆవేదన, మానసిక స్థితిమీద ఆధారపడి ఉంటుందని వివరించాడు.

కాంగ్రెసు నాయకులు ఉద్యమాన్ని సమర్థించకపోవడంతో జమీందారు రైతుల భూములను కొలిపించి అమ్మకానికి పెట్టాడు. దానితో తప్పనిసరి పరిస్థితులలో 1939 మార్చి 7 వ తేదీన రైతులు సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. జమీందారు పోలీసు బలగాలను దించాడు. వారు విచక్షణా రహితంగా లాఠీఛార్జి చేసి, జిల్లా రైతుసంఘ అధ్యక్షుడైన భూపతిరాజు లక్ష్మీనరసింహరాజును అరెస్టు చేశారు. సత్యాగ్రం, జరుగుతుండగా రెవిన్యూ మంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు కాళీపట్నం దర్శించి సత్యాగ్రహాన్ని నిలుపుచేయమని కోరారు. నాటి ముఖ్యమంత్రి రాజగోపాలాచారి, కాంగ్రెసు అధ్యక్షుడు పట్టాభి సీతారామయ్యలు గూడా సత్యాగ్రహాన్ని నిలిపివేయమని కోరారు. దానితో సత్యాగ్రహం నిలిచిపోయింది.

ఈ సందర్భంలో కాంగ్రెసులో ఒక వివాదం వచ్చింది. కాంగ్రెస్ అనుమతి లేకుండా సత్యాగ్రహం చేసినందుకు నాటి, కాంగ్రెసు కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరాజు కొందరికి సంజాయిషీ నోటీసులు యిచ్చాడు. దానికి సమాధానంగా ఆంధ్రరాష్ట్ర రైతు సంఘ అధ్యక్షుడు కొరటాల సత్యనారాయణ మూర్తి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య, కాంగ్రెసు సంస్థ అనుమతితోనే సత్యాగ్రహాలు జరగాలనే నిబంధనను తాము అనుమతించమని, అట్టి నిబంధన వుంటే దానిని ఉపసంహరించాలని కోరారు. 1930 జూన్ 5 వ తేదీన ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం కూడా అట్లే కోరింది.

### 19.12.4 చల్లపల్లి :

కృష్ణాజిల్లా చల్లపల్లి ఎస్టేట్‌లో జమీందారుకు, రైతులకు అనేక వివాదాలు తలెత్తి ఉద్యమాలకు దారితీసింది. బంజర్లు, లంక భూములు, సాముదాయ భూములను వశపరచుకొని అమ్మడం, వెట్టిచాకిరీ చేయించుకోవడం, ప్రతీదానికి రకరకాల పన్నులు విధించడం వలన తగాదాలు వచ్చాయి. మంగళాపురం, పోతర్లంక, గాజులంక, ఘంటసాల, మువ్వ, కాజా మొదలైన గ్రామాల రైతులు ఏకమై జమీందారుకు వ్యతిరేకంగా ఉద్యమాలు సాగించారు. దివి తాలూకా జమీందారీ రైతుసంఘ సమావేశం 1930 జూన్‌లో జరిగింది. ఈ

సమావేశం జమీందారుకున్న వందలాది ఎకరాల భూమిని భూములు లేని పేద రైతులకు పంచాలని, అధికారులు తీసుకొనే లంచాలు అరికట్టాలని కోరింది. దివి తాలూకా రైతుసంఘ అధ్యక్షుడు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య 1937 లో అనేక గ్రామాలు పర్యటించి రైతులను ఉద్యమాలకు సిద్ధం చేశాడు. ఆ సమయంలో జమీందారు చేసిన పట్టా మార్పిళ్లు, బంజరు భూముల ఆక్రమణ, జమీందారు అతని ఉద్యోగుల వేధింపులను గురించి రైతులు అనేక ఫిర్యాదులు చేశారు.

అదే సందర్భంలో 1937 సెప్టెంబరులో చల్లపల్లి, మంగళాపురం మొదలైన గ్రామాలకు చెందిన 1400 ఎకరాలను జమీందారు అమ్మివేశాడు. అందుకు ఎస్టేటులోని రైతులందరికీ ఆగ్రహం కలిగింది. ఈ విషయాన్ని 1938 జూన్‌లో దివి తాలూకా రైతు సంఘం రెవెన్యూ మంత్రి ప్రకాశం పంతులు దృష్టికి తెచ్చింది. అట్లే పోతర్లంక, గాజులలంక గ్రామాలలోని సాముదాయక భూములను మంగళాపురంలోని అడవి బంజరును అమ్మజూపాడు. 1939 డిశంబరులో చల్లపల్లి ఎస్టేట్‌లోని శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు దేవాలయానికి చెందిన 600 ఎకరాల భూమిని వశపర్చుకున్నాడు. ప్రజలు ఎక్కడికక్కడే తిరగబడ్డారు. గాజుల్లంకలో ఒక రైతు పంటను జప్తుచేయటానికి జమీందారీ ఉద్యోగులు వెళ్ళగా ప్రజలందరూ ప్రతిఘటించారు.

1942 జూలైలో చండ్ర రాజేశ్వరరావు, పేట బాపనయ్యల నాయకత్వంలో బీద రైతుకూలీలు జమీందారీ వ్యతిరేకోద్యమం మొదలుపెట్టారు. రైతు నాయకులను పోలీసులు జైళ్ళలో పెట్టారు. కాని ఉద్యమం ఆగలేదు. మరలా కమ్యూనిస్టు నాయకుడైన చల్లపల్లి నారాయణరావు నాయకత్వంలో ఉద్యమం ప్రారంభించారు.

ఇట్టి సందర్భాల్లో కూడా జమీందారు తన దుశ్చర్యలను మానలేదు. 1946 అక్టోబరులో కిష్కిందపాలెం రైతులకు చెందిన 340 ఎకరాల భూమిని గుంటూరు జిల్లాకు చెందిన వారికి అమ్మివేశాడు. తరువాత గాజుల్లంక పొలాల పంటలను ధ్వంసం చేయడానికి జమీందార్ రిజర్వు పోలీసులను పంపాడు. రైతులు అడ్డుకోగా కాల్పులు జరిగి ఒక మహిళతో సహా నలుగురు మరణించారు. ఇటువంటి సంఘటనలకు రెచ్చిపోయిన రైతులు, రైతుకూలీలు 1947 జూలైలో జమీందారు భూములలోనికి ప్రవేశించి గట్టువేసుకొని ఆక్రమించారు.

### 19.12.5 విశాఖపట్టణం - శ్రీకాకుళం జిల్లాలలో జమీందారీ రైతు ఉద్యమాలు :

1946 - 47 విశాఖపట్టణం జిల్లాను విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలుగా విభజించారు. అంతకుముందు ఆ ప్రాంతం మొత్తాన్ని ఉత్తర - దక్షిణ విశాఖలుగా పిలిచేవారు. ఆనాటి జిల్లాల్లో రెండు మూడు తాలూకాలు తప్ప మిగిలిన ప్రాంతం అంతా జమీందారులు, మోఖాసాలు, ఇనాములుగా ఉండేది. బొబ్బిలి, మందసా, చీకటి, చెముడు, కురుపాం, పర్లాకిమిడి జమీందారీలు. వీరి దోపిడిక్రింద ప్రజలు నలిగిపోతుండేవారు. ఒక్క విజయనగరంలో మాత్రం ఎట్టి దోపిడి లేక మంచి ప్రజారంజక పరిపాలనుండేది.

ఈ జమీందారీ ప్రాంతాలలో నీటివనరులున్నాయి. చిన్న చిన్న నదులున్నాయి. కాని జమీందారులు ప్రాజెక్టులు కట్టి రైతులకు మేలుకల్గించే పనులు చేపట్టలేదు. అందువలన రైతులు అతివృష్టి, అనావృష్టి, ఋణభారాలతో కృంగిపోయారు. దానితో కొందరు బర్మా, అండమాన్, మలయాలకు వెళ్ళిపోయారు. రైతులకు ఎట్టిమేలు చేయకపోయినా వారిపై విపరీతంగా పన్నులు విధించేవారు. బొబ్బిలిలో ఎకరానికి రూ. 70/- శిస్తుగా వుండేది. కోతల సమయంలో మొఖాసాదారులు, ఇనాందారులు గ్రామాలమీద పడి అంబారాలు వసూలు చేసేవారు. అవి చెల్లించలేని వారికి శిక్షలు విధించేవారు. అధికారులకు రైతులు కాయగూరలు, పాలు సమర్పించుకోవాలి.

ఇట్టి పరిస్థితులలో 1929 నవంబరు 3 వ తేదీన విశాఖపట్టణం జిల్లా తొలి జమీన్ రైతుసభ విశాఖపట్టణంలో జరిగింది. ఈ సభలో వేములకొండ రామదాసు, బచ్చు విశ్వనాధదాసు, విశాఖపట్టణానికి చెందిన న్యాయవాది భూపతి వెంకటపతిరాజు, పి. పట్టాభిరామారెడ్డి, మునగపాగకు చెందిన పెంటకోట శ్రీరాములు నాయుడు ప్రముఖపాత్ర నిర్వహించారు. ఎస్టేట్ ల్యాండ్ చట్టంలో మౌళిక మార్పులు తీసుకురావాలని ఈ సభలో ప్రసంగించారు. అంతేగాక జమీందారీ రైతు ఉద్యమాన్ని బలపరచాలంటే ప్రచారానికి మంచి పత్రిక అవసరం అని కూడా భావించారు. పత్రికను స్థాపించడానికి జిల్లా అంతటా చందాలు వసూలు చేశారు. కొందరు బర్మావెళ్ళారు. అచటి ఆంధ్రులు జమీందారీ వ్యతిరేక ఉద్యమాన్ని అభినందించి సహాయం చేశారు. ఆ ధనంతో ప్రజావాణి వెలువడింది. దానికి మొదటి సంపాదకుడు గరిమెళ్ళ కృష్ణమూర్తి.

పుల్లెల శ్యామసుందరరావు, చెలసాని వాసుదేవరావు, క్రొమ్మారెడ్డిల నాయకత్వంలో 1937 లో రైతు రక్షణయాత్ర ఇచ్ఛాపురం నుండి బయలుదేరి అనేక సభలు, ప్రదర్శనలు జరుపుకొంటూ అధికారులకు విజ్ఞప్తులు చేస్తూ సాగింది. ఈ యాత్ర రైతులలో గొప్ప కదలికను తెచ్చింది. జిల్లా మొత్తంలో జమీందారీ వ్యవస్థ రద్దుకావాలనే నినాదం వినిపించింది. విశాఖపట్నంలోని రెండు భాగాల రైతులు, ప్రతినిధులు ప్రకాశం కమిటీకి వివిధ జమీందారీలలోని రైతుల పరిస్థితిని గురించి సాక్ష్యం యిచ్చారు.

1937 - 38 లో మందేశ్వరశర్మ నాయకత్వంలో దక్షిణ విశాఖ జిల్లాలో గిరిజనోద్యమం ప్రారంభం అయింది. 1938 నవంబరు 15, 16 తేదీలలో మాడుగులలో మొట్టమొదట కొండజాతుల సభ జరిగింది. ఈ సభకు వెయ్యిమంది హాజరయ్యారు. ముఠాదార్ల నిరంకుశత్వానికి వ్యతిరకంగాను, వెట్టిచాకిరీని రద్దుచేయాలని, పోరాటం ప్రారంభించాలని నిర్ణయించింది. ఆ కాలంలో అచట గొత్తి నౌకరి అమలులో వున్నది. రుణదాతకు బాకీలు చెల్లించకపోతే వంశపారంపర్యంగా వెట్టిచేసే నౌకరీని గొత్తి నౌకరి అని అంటారు. దానిని వెంటనే రద్దుచేయాలని మాడుగుల సభ డిమాండ్ చేసింది. అందుకు స్పందించి ప్రభుత్వం 1940 జూలై 14 న గొత్తి నౌకరీని రద్దుచేసింది. ఇది గిరిజనులలో ఉత్సాహం రేకెత్తించింది.

1940 మార్చి 27, 28 తేదీలలో పలాసాలో స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షతన అఖిల భారత రైతు మహాసభ పెద్దఎత్తున జరిగింది. బంకించంద్ర ముఖర్జీ, ఇందులాల్ యాగ్నిక్, గద్దర్ నాయకుడు సోహన్‌సింగ్ భాక్నా ఈ సభలో పాల్గొన్నారు.

**మందసా కాల్పులు :**

పలాస సభ తరువాత కొందరు రైతులు మందసా ఎస్టేట్‌లో రిజర్వు అడవిని కొట్టారు. కాని ఎస్టేట్ దారుడు కలెక్టర్, పోలీసు అధికారులకు టెలిగ్రాంలు పంపాడు. డి.ఎస్.పి. లాల్ నాయకత్వంలో 25 మంది పోలీసులు వచ్చి ఎస్టేటులోని రామాపురానికి చెందిన తొమ్మిదిమందిని అరెస్టు చేశారు. అది తెలిసి చుట్టు ప్రక్కల గ్రామాలనుండి ప్రజలు వచ్చి పోలీసులను త్రోసివేసి వారిని విడిపించారు. ప్రజలను అదుపులో పెట్టడానికి అదనపు పోలీసు బలగాలు వచ్చాయి. 1940 ఏప్రియల్ 1 వ తేదీన పోలీసులు కాల్పులు జరిపారు. ఐదుగురు రైతుకూలీలు, ఒక కానిస్టేబుల్ అక్కడికక్కడే మరణించారు. మరణించిన వారిలో పూసుమాను గున్నమ్మ అనే స్త్రీ కూడా ఉంది. ఆ తరువాత ఆమె వీరనారిగా పేరుపొంది ఆమె పేరుతో గేయాలు, జానపద గేయాలు వెలువడ్డాయి. మందసా కాల్పుల తరువాత జమీందారు తన ఉద్యోగులను పంపి మదనపురం అనే గ్రామంలో శిస్తులు చెల్లించని వారి వస్తువులు జప్తు చేయించాడు. అనేకమంది కార్యకర్తలను అరెస్టు చేయించాడు. అట్టివారిలో 42 మందిపైన సెషన్స్ కోర్టులో కేసు పెట్టారు. వారి తరుపున వాదించడానికి భారతీ రంగా అధ్యక్షురాలిగా డిఫెన్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. దానికి వెంకట్రామా నాయుడు ఉపాధ్యక్షుడు. కరుణాకరం సుబ్బారావు, మక్కా సూర్యనారాయణ కార్యదర్శులు. వాదించటానికి విశాఖపట్టణ లాయర్ బుర్రా హ్యామశాస్త్రి వకాల్తా పుచ్చుకున్నాడు. ఆయనకు సహాయకులుగా పార్థసారధి కె.ఎన్. గుప్తా. కె. బ్రహ్మాజీగావులు పనిచేశారు. 42 మంది ముద్దాయిలలో 10 మందిని కోర్టు విడుదల చేసింది. హైకోర్టు అప్పీలులో మరికొందరు విడుదల అయ్యారు. చివరకు ముగ్గురికి శిక్షలు పడ్డాయి. కేసు 1942 దాకా నడిచింది. మందసా సంఘటన రాష్ట్రమంతటా గొప్ప సంచలనం సృష్టించింది. ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం అధ్యక్షుడు పి. శ్యామసుందరరావు మందసా కాల్పులపై విచారణ జరపాలని డిమాండ్ చేశాడు. ఆయనను ఇచ్ఛాపురంలో నిర్బందించారు. నిర్బంధంలోనే అతడు మరణించాడు. తరువాత టంగుటూరి ప్రకాశం, తెన్నేటి విశ్వనాథం మందసాను దర్శించి, నిందితుల కుటుంబాలకు సహాయం చేశారు. ఇది జరిగిన తరువాత 1945 లో ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యవర్గం మందసా పరిసర జమీందారీలలోని పరిస్థితులను సమీక్షించి నివేదిక సమర్పించాలని ఒక ఉపసంఘాన్ని నియమించింది. ఉత్తర విశాఖ జిల్లాలోని రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని ఉపసంఘం నివేదిక సమర్పించింది. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో నిర్బంధ ధాన్య సేకరణ వలన ఒకవైపు, జమీందారు పీడనతో మరియొకవైపు జమీందారీ ప్రజలు అనేక బాధలు పడ్డారు. ఎస్టేట్‌లో సర్వే జరగలేదు. రైతులకు ఎంతభూమి వుందో, ఎంత శిస్తు చెల్లించాలో తెలియని పరిస్థితి వున్నది. ఈ పరిస్థితిలో వై. విజయకుమార్, కొడువగంటి గోవిందరావు, ఘళ్ళ నరసింహారావు, పెంటకోటి శ్రీరాములు, అనకాపల్లి తాలూకాలో మొదటి రైతు సభను జరిపారు. పరిసర గ్రామాల నుండి 60 మంది ప్రతినిధులు హాజరయ్యారు. సభ రైతు సమస్యలన్నింటిని చర్చించింది. 1945 లో ఉత్తర విశాఖలో తీవ్రమైన గాలివాన వచ్చి పెద్ద క్షామం ఏర్పడింది. పనులు లేక కోస్తా ప్రాంతం అంతటా ఆకలి చావులు సంభవించాయి. ప్రభుత్వం ప్రజలకు ఎట్టి సహాయం చేయలేదు. జమీందార్లు పట్టించుకోలేదు. ఈ సందర్భాన ప్రముఖ చిత్రకారుడు అక్కడి పరిస్థితులను చిత్రాలలో చిత్రించాడు.

పైడిరాజా గోవిందరావు రైతుల బాధలను గురించి కరపత్రాలు వెలువరించాడు. క్షామనివారణ సంఘం ఏర్పడింది. దానికి కె.ఎస్. గుప్తా అధ్యక్షుడు. కె. గోవిందరావు కార్యదర్శి. ఈ సంఘం మందులు, బట్టలు, డబ్బు సేకరించి బాధితులకు అందించింది.

జమీందారీల రద్దును గురించి ప్రకాశం కమిటీ రిపోర్టు వెలువడగానే జమీందార్లు, మొఖాసాదార్లు, ఇనాందార్లు బంజర్లను ఎంతో కాలంగా కౌలు చేసుకుంటున్నవారిని తొలగించి ఆ భూములు, అడవులు కొట్టించి ఆ భూములను, బంజరులను అమ్మివేశారు. ఆ చర్యలకు ప్రతిఘటించిన ఆలమండ, అన్నవరం గ్రామాల రైతులపై కాల్పులు జరిగాయి. ఆలమండలో ముగ్గురు, అన్నవరంలో ఒక వ్యక్తి మరణించారు. చివరకు 1949 లో ఇండియా ప్రభుత్వం జమీందారీ వ్యవస్థను రద్దు చేసింది.

## 19.13 సమీక్ష :

రైతాంగ సమీకరణ 1930 వ దశకంలో ఆరంభమయి, సమాజ దృష్టిని ఆకర్షించింది. అధిక శిస్తు, భూస్వాముల అక్రమాలను ఓర్వలేని రైతాంగం బ్రిటిష్ ప్రభుత్వాన్ని, జమీందారులని ఎదిరించింది. శిస్తు తగ్గింపుని 1947 లోనూ, జమీందారీ రద్దుని, 1949 లో చట్టపరంగా సాధించగలిగింది.

## 19.14 నమూనా ప్రశ్నలు :

1. జమీందారీలలో జరిగిన రైతాంగ ఉద్యమాలను తెలియజేయండి.
2. రైతాంగ ఉద్యమంలోని ప్రముఖ ఘట్టాలను వివరించండి.
3. రైతాంగ పోరాటంలో పాల్గొన్న వివిధ సంస్థలను, వాటి కృషిని, రైతుయాత్రను విశదీకరించండి.
4. జమీందారీ వ్యతిరేక పోరాటాలను వర్ణించండి.

## 19.15 ఉపయుక్త గ్రంథాలు :


1. Dr. M.P.R. Reddy - Peasant and State in Modern Andhra History
2. వై.వి. కృష్ణారావు - ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు - పోరాటాలు
3. వి. రామకృష్ణ - చరిత్రాత్మక ఆంధ్రరైతు రక్షణ యాత్ర

పాఠం - 20

# ఆధునిక ఆంధ్రప్రదేశంలో సాహిత్య, సాంస్కృతిక పరిణామాలు

## 20.1 లక్ష్యం :

ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తెలుగు సాహిత్య, సాంస్కృతిక పరిణామాలను వివరించడమే ఈ పాఠం లక్ష్యం.

## విషయక్రమం


20.1 లక్ష్యం

20.2 పరిచయం

20.3 సాహిత్యరంగం

- 20.3.1 మార్పునకు దోహదపడిన కారణాలు
- 20.3.2 పదకవితలు, పాటలు
- 20.3.3 నవలలు
- 20.3.4 కథలు
- 20.3.5 సాహిత్యధోరణలు

20.4 సాంస్కృతిక రంగం

- 20.4.1 సంగీతం
- 20.4.2 చిత్రకళ
- 20.4.3 తోలుబొమ్మలాట
- 20.4.4 బుర్ర కథలు
- 20.4.5 ఆధునిక నాటకం
- 20.4.6 తెలుగు సినిమా రంగం

20.5 సమీక్ష

20.6 వ్యాసరూప ప్రశ్నలు

20.7 ఉపయుక్త గ్రంథాలు


## 20.2 పరిచయం :

ఆధునిక ఆంధ్రదేశ చరిత్రలో అనేక నూతన మార్పులు సాహిత్యంలోనూ, సాంస్కృతిక మాధ్యమాల్లోనూ ప్రవేశించాయి. రాజాదరణతో అంతవరకు వర్థిల్లిన తెలుగు సాహిత్యం, రాజాస్థానాలను వదలి సామాన్యుల దరి చేరసాగింది. సాహిత్య ప్రయోజనం రసానందమే గాక సమాజ శ్రేయస్సే అని భావింపబడడంతో శైలిలోనూ, వస్తువులోనూ మార్పులు వచ్చాయి. సులభ వచన రచన అనేక నూతన ప్రక్రియలకు దారితీసింది. నూతన దృక్పధాలు సాహిత్యంలో ప్రతిఫలించ సాగాయి. అలాగే కళా ప్రక్రియలలో కూడా నూతన మార్పులు జరిగాయి. పూర్వపు జానపద కళారూపాలతో పాటు, నాటకరంగం, సినిమా రంగం అభివృద్ధి చెందాయి.

## 20.3 సాహిత్యరంగం :

ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యం నూతన మార్పులకు లోనయింది. సాహిత్యం వివిధ రూపాలతో పరిపుష్టమయింది. మధ్యయుగాలలో కొద్దిమందికే పరిమితమయిన కవిత్వం ఆధునిక యుగంలో ఎక్కువ మందికి అందుబాటులోకి వచ్చింది. కవిత్వం కాలక్షేపానికి కాక, సమాజ ప్రయోజనాలను ఉద్దేశించే సాధన రూపమయింది. కాల్పనిక జీవిత చిత్రణను వదలి, వాస్తవిక అంశాలను, రావలసిన మార్పులను సూచించే మాధ్యమంగా రూపొందింది.

**20.3.1 మార్పునకు దోహదపడిన కారణాలు** : తెలుగు సాహిత్యాన్ని ఆధునిక యుగంలో మలుపు తిప్పడానికి అనేక కారణాలు దోహదం చేశాయి. బ్రిటిష్ వారి రాకతోపాటు, వివిధ స్థానికాంశాలు దానికి తోడ్పడ్డాయి. అవి :

**a. బ్రిటిష్ ప్రభావం** : బ్రిటిష్ రాకతో, ఆంగ్లం రాజభాష అయింది. పాశ్చాత్య విద్యా ప్రభావం తెలుగు సాహిత్యంపై ప్రసరించింది. (1). ఆంగ్ల ప్రక్రియలయిన నవల, నాటిక, పత్రికలు, ఆత్మకథలు మొదలయిన రూపాలు తెలుగు సాహిత్యంలో ప్రవేశించియి. (2). ఆంగ్ల సాహిత్యంలోని రొమాంటిక్ పొయిట్రీ తెలుగు భాషలో భావకవిత్వ రూపాన మన్ననలను పొందింది. రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, శ్రీశ్రీ, జాషువా మొదలగు తెలుగు కవులు సాంప్రదాయ కవిత్వానికి భిన్నంగా ఛందస్సులోను, వస్తువులోను వైవిధ్యాన్ని చూపారు. (3). బ్రిటిష్ ఉద్యోగులు తెలుగు సాహిత్యానికి చేసిన కృషిని ప్రముఖంగా పేర్కొనాలి. ముఖ్యంగా ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ **తెలుగు కావ్యాలను**, శతకాలను సేకరించి, శుద్ధ ప్రతులను ముద్రింపజేసి, సాహిత్య సేవ చేశాడు. తెలుగు - ఆంగ్ల నిఘంటువులను అచ్చు వేయించాడు. ఆంధ్రదేశ చరిత్ర తెలుసుకునే ఆధారాలను మెకంజీ క్రైఫియత్తులను పదిలపరచాడు.

**b. వ్యవహారిక భాషోద్యమము** : తెలుగు సాహిత్యాన్ని ఆధునికంగా మార్చటానికి ముఖ్యకారణం 20 వ శతాబ్దంలో సాగిన వ్యవహారిక భాషా ఉద్యమము. అంతకుముందు ఛందోబద్ధంగా కవులకు మాత్రమే అర్థమయ్యే రీతిలో ఆంధ్ర సాహిత్యం వ్రాయబడేది. కాని గిడుగు రామమూర్తి ఆ పద్ధతులకు వ్యతిరేకంగా వ్యవహారిక భాషలో రచనలను ప్రారంభించాడు. ఆయన కృషి ఫలితంగా తెలుగు సాహిత్య రచనలలో నూతన మార్పులు వచ్చాయి.

**c. సాంఘీక సంస్కరణ ప్రభావం** : సాంఘీక సంస్కరణ ప్రభావం వల్ల గూడా సాహిత్యంలో నూతన పోకడలు ఏర్పడ్డాయి. సాంఘీక దురాచారాలను ఇతివృత్తంగా తీసుకొని కవితలు, గ్రంధాలు వ్రాయసాగారు. కన్యాశుల్కం, మాలపల్లి ఈ కోవకు చెందిన రచనలు.

**d. జాతీయ భావ ప్రభావం** : విక్టోరియా మహారాణి వరకు ఆంధ్ర కవులు, రాజభక్తులు. ఆమె కుమారుడు ఎడ్వర్డు పట్టాభిషేక కాలంలో తిరుపతి వెంకట కవులు ఎడ్వర్డు పట్టాభిషేక నాటకాన్ని రచించారు. స్వాతంత్ర సమరం ముమ్మరమైన తరువాత ఆంధ్రకవులు తమ కవిత్వానికి దేశభక్తి, జాతీయవాదం ఇతివృత్తంగా తీసుకున్నారు. అనేక పాటలు, కవిత్వాలు, పద్యాలు, జీవితచరిత్రలు రాసారు. రాయప్రోలు సుబ్బారావు ప్రాచీనాంధ్ర ఔన్నత్యాన్ని ఇతివృత్తంగా తీసుకొని అనేక గీతాలను రచించారు. గరిమెళ్ళ సత్యనారాయణ స్వాతంత్ర గీతాన్ని వ్రాశారు. గడియారం వెంకట శేషశాస్త్రి శివభారతం, ఏటుకూరి వెంకటనరసయ్య వీరభారతం, దర్భాక రాజశేఖర శతావధాని రాణా ప్రతాప చరిత్ర దేశభక్తి, ప్రేరేపిత రచనలే.

అట్లే చిలకమర్తిగారు వ్రాసిన భరతఖండంబు చక్కని పాడియావు, గరిమెళ్ళ సత్యనారాయణ వ్రాసిన మా కొద్దు ఈ తెల్లదొర తనము, త్రిపురనేని రామస్వామి చౌదరి వ్రాసిన వీరగంధము తెచ్చినాము వీరులెవ్వరో తెలుపుడు అను దేశ భక్తిగీతాలు నాటి ప్రజలను ఉర్రూతలూగించాయి. జాతీయ నాయకులైన గాంధీ, అహింస, సత్యం మొ॥ సిద్ధాంతాలకు ఆకర్షింపబడి కరుణశ్రీ అను కీర్తి వహించిన జంధ్యాల పాపయ్య శాస్త్రి కరుణశ్రీ కావ్యం జాతీయ దృక్పధంతో నిండివున్నది. కొందరు ప్రకృతి రమణీయతలు, కొందరు వాస్తవిక ధోరణులను ఇతివృత్తాలుగా మర్మకవిత్వం వ్రాసినారు. దువ్వూరి రామిరెడ్డి, కవికొండల వెంకట్రావు ప్రకృతి వర్ణనలు చేయగా కొంపెల్ల జనార్ధనరావు వాస్తవిక ధోరణితో మర్మకవిత్వం వ్రాశారు. మరియొకవైపున ఈ యుగంలో తిరుపతి వెంకటకవులు సాంప్రదాయ పద్ధతిలోనే నాటకాలు వ్రాసి ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించారు.

౮. భావ ప్రచారం :

తెలుగు సాహిత్యంలో భావ ప్రచారానికై కొన్ని కవితలు వచ్చాయి. ప్రధానంగా హేతువాద దృష్టితో పురాణ, ఇతిహాసాలను ప్రశ్నించిన త్రిపురనేని రామస్వామి రచనలు, వామ పక్ష భావాలను ప్రచారం చేసిన శ్రీశ్రీ రచనలు, పేర్కొనవచ్చు.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన వారిలో కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, శ్రీరంగం శ్రీనివాసరావు ముఖ్యులు.

**20.3.2 పద కవితలు, పాటలు** : ఇరవైయ్యవ శతాబ్ది ఆరంభం నుండి పదకవితలు నూతన పంథాలో పయనించాయి. గురజాడ అప్పారావు "ముత్యాలసరాలు" ముద్రణతో వ్యావహారిక భాష కవుల భాషగా మారింది. భాషా, ఛందస్సు, వస్తువు కూడా మార్పులకు లోనయ్యాయి.

పద్యానికి బదులు పదకవితలు, ఖండికలు నూతన కవితలుగా మారాయి. భావకవుల ఖండ కవితలనుంచి అభ్యుదయ కవుల కాద్యమగు శ్రీశ్రీ మహాప్రస్థానం వరకు భావగాంభీర్యం గల పద కవితే ప్రజారంజకమయింది.

పాటలలో నండూరి సుబ్బారావు ఎంకిపాటలు, కృష్ణశాస్త్రి లలిత గీతాలు, అనేక భక్తిగీతాలు, విశ్వనాధ సత్యనారాయణ కిన్నెరసాని పాటలు ఆదరణ పొందాయి.

**20.3.3 నవలలు** : ఆధునిక సాహిత్య రూపం నవల. పందొమ్మిదవ శతాబ్దపు ద్వితీయార్థం నుంచి ఈ ప్రక్రియ ఆదరణ పొందసాగింది. పరవస్తు చిన్నయసూరి (1806-1862) "నీతి చంద్రిక"ను రచించి, గద్యాన్ని ప్రజారంజకం చేసాడు.

వీరేశలింగం "రాజశేఖర చరిత్ర" అను తొలి నవలను రచించాడు. ఆంగ్లంలో గోల్డ్ స్మిత్ రచించిన వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్ దీనికి మూలం. చిలకమర్తి లక్ష్మీనరసింహం అనేక నవలలను రచించాడు. వానిలో రామచంద్ర విజయం, హేమలత, సౌందర్య తిలక ప్రముఖమైనవి.

ఉన్నవ లక్ష్మీనారాయణ 1921 లో మాలపల్లి నవలను రచించాడు. హరిజన అంశాన్ని కథావస్తువుగా స్వీకరించాడు. బ్రిటిష్ ప్రభుత్వ నిషేధానికి ఈ నవల గురి అయింది.

విశ్వనాథ సత్యనారాయణ రచించిన "వేయిపడగలు", "ఏకవీర" ప్రసిద్ధ నవలలు. బుచ్చిబాబు "చివరకు మిగిలేది" ప్రఖ్యాతిగాంచిన నవలలో ఒకటి.

గుడిపాటి వెంకటాచలం రచించిన నవలలు సాహిత్యంలో దుమారాన్ని సృష్టించాయి. ముఖ్యంగా "మైదానం", "అమీనా" స్త్రీల అంశాలను, సమస్యలను ప్రస్తావించాయి.

బెంగాలీలో శరత్ చంద్ర రచించిన నవలలు తెలుగులోకి అనువదింపబడి, ప్రజారంజకమయ్యాయి.

**20.3.4 కథలు** : నవల వలెనే చిన్న కథలు కూడా తెలుగు సాహిత్యంలో ఆదరణీయమయ్యాయి. పందొమ్మిదవ శతాబ్దంలో "తాతాచారి కథలు", "కాశీమజిలీల కథలు" ప్రచారంలో ఉండేవి.

ఆధునీకరించబడిన కథ "దిద్దుబాటు". ఇదే తొలి కథగా భావించవచ్చును. దీనిని 1910 లో గురజాడ అప్పారావు రాశారు. పత్రికా రంగ విస్తరణతో కథలు ప్రజారంజకమయ్యాయి. చింతా దీక్షితులు, మల్లాది రామకృష్ణశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావుల కథలు జనరంజకమయ్యాయి. మునిమాణిక్యం "కాంతం కథలు" ప్రజాదరణ పొందాయి. పద్మరాజు కథ అయిన "గాలివాన" అంతర్జాతీయ ఖ్యాతి పొందింది.

**20.3.5 సాహిత్య ధోరణులు** : రాయప్రోలు సుబ్బారావు (1892-1984) భావకవిత్వ రచనకు ఆద్యుడయ్యాడు. ప్రకృతిని ఆరాధించడం, స్త్రీ పాత్రను మహోన్నతంగా తీర్చిదిద్దడం భావకవిత్వ లక్షణాలు. స్త్రీ ప్రేమ మూర్తిగా, ఆరాధించబడే వ్యక్తిగా భావకవులు

భావిస్తారు. ఈయన రచనలలో "రమ్యాలోకం", "జడకుచ్చులు" " తృణకంకణం" ప్రముఖమైనవి. ఈయన ప్రతిపాదించిన అమలిన శృంగారాన్ని ఇతర భావకవులు కొనసాగించారు. ఇతర భావ కవులలో కృష్ణ పక్షం రచించిన దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి, ప్రాణేశ్వరి రచించిన తల్లావఝుల శివశంకరశాస్త్రి ప్రముఖులు.

భావకవులు చాలామంది దేశభక్తి రచనలను కూడా రచించారు. రాయప్రోలు సుబ్బారావు 'ఆంధ్రావళి' ని, 'తెనుగుతేట' అను రెండు ఖండకావ్యాలు రచించారు. తుమ్మల సీతారామమూర్తి, త్రిపురనేని రామస్వామి జాతీయోద్యమ కవితలను రాసారు.

వామపక్ష భావాలు 1930 నుంచి ఆకర్షించడంతో ఆ ప్రభావంతో కొన్ని రచనలు వచ్చాయి. మాక్సిం గోర్కీ రచన అయిన "మదర్", ఇతర వామపక్ష రచనలు తెలుగులోకి అనువదించబడ్డాయి. వామపక్ష ధోరణిలో సాహిత్య కృషి చేసిన వారిలో "అసమర్థుని జీవయాత్ర" రచించిన గోపీచంద్ ప్రసిద్ధుడు. కొడవగంటి కుటుంబరావు అనేక నవలలు ఈ దృక్పథంతో రాసారు. ప్రజానాట్యమండలి ప్రదర్శించిన "ముందడుగు", "మా భూమి" నాటికలు వామపక్ష భావాలను పెద్దఎత్తున ప్రచారం చేశాయి. ఇరవైయ్యవ శతాబ్దం నాది అని చాటిన శ్రీరంగం శ్రీనివాసరావు తన "మహాప్రస్థానం" ముద్రణతో అభ్యుదయ సాహిత్య ధోరణికి శ్రీకారం చుట్టాడు. అతడు 1934 నుంచి 1941 వరకు రచించిన కవితలను పుస్తక రూపంలో ముద్రించడంతో అదే ఈ ధోరణికి మార్గదర్శకమయింది.

ఆధునిక సాహిత్యం కందుకూరి వీరేశలింగంతో ఆరంభమయి, గురజాడ అప్పారావుతో కొనసాగింది. అనేక ప్రక్రియలు సాహిత్యంలో నూతనంగా ప్రవేశించాయి. పాత ప్రక్రియలయిన పద్యం కూడా మార్పులకు లోనయింది. త్రిపురనేని రామస్వామి భావ విప్లవాన్ని తీసికొనిరాగా, శ్రీశ్రీ శతాబ్దాన్నే తనదిగా భావించాడు.

## 20.4 సాంస్కృతిక రంగం :

సాహిత్యంలో వలెనే సాంస్కృతిక రూపాల్లో కూడా నూతన మార్పులు ప్రవేశించాయి. . జానపద కళారూపాలయిన తోలుబొమ్మలాటలు, తప్పెటగుళ్లు, సిద్ధుల నృత్యం, చిందు భాగవతంలతో పాటు సాంకేతిక విలువలతో కూడిన నాటకాలు, సినిమాలు ఆదరణీయమయ్యాయి.

**20.4.1 ఆంధ్ర సంగీతం** : ఆధునిక యుగంలోని ఆంధ్ర సంగీతాన్ని ప్రభావితం చేసిన ఖ్యాతి సంగీత మూర్తిత్రయమయిన త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రిలకు చెందుతుంది. వారు తెలుగులో అనేక కీర్తనలు రచించారు.

తెలుగులో మొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. ఇతడు 32,000 సంకీర్తనలు రచించాడు. నారాయణ తీర్థుల తరంగాలు, మునిపల్లె సుబ్రహ్మణ్య కవి రచించిన ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, సిద్ధేంద్రయోగి భామాకలాప కీర్తనలు, భద్రాచల రామదాసు రచించిన భక్తి కీర్తనలు, క్షేత్రయ్య పదాలు ఆంధ్ర సంగీతంలో ప్రసిద్ధి చెందాయి.

ఆదిభట్ల నారాయణదాసు, హరినాగభూషణం, మైసూరు వాసుదేవాచారి, హరికథాగానం చేసే విధంగా సంగీతాన్ని మలిచారు ఓగిరాల వీర రాఘవశర్మ, ఈదర నాగరాజు సంగీత విద్వాంసులుగా పేరొందారు. వయోలిన్ విద్వాంసులుగా ద్వారం వెంకటస్వామి నాయుడు, వీణ విద్వాంసులుగా ఈమని శంకరశాస్త్రి ప్రసిద్ధులు. బాల మురళీకృష్ణ అతి పిన్న వయసులోనే సంగీత కళాకారునిగా గుర్తింపు పొందాడు. టంగుటూరి సూర్యకుమారి, రావు బాలసరస్వతి లలిత సంగీత కళాకారిణిలుగా పేరొందారు.

**20.4.2 చిత్రకళ** : 18-19 శతాబ్దాలలో చిత్రకళ జానపదకళగా మారింది. బందరు కలంకారీ పనులలోను, కాశీ కావడిపటాలలో, తోలుబొమ్మల అలంకారంలలో, దశావతారాల బిళ్ళలలో, నిర్మల్ పెయింటింగులలో, కొండపల్లి బొమ్మల, పోచంపల్లి, గద్వాల్, వెంకటగిరి, గుంటూరు పట్టు, నూలువస్త్రాల్లో ప్రతిబింబించినది, ఇవన్నీ స్థానికమైన కళలు. అయినా అంతర్జాతీయ కీర్తిని సాధించినవి. ఈ రూపం ధరించినందువలన అది లలిత కళగా కాక జానపద కళగా గుర్తింపు పొందినది. ఇటీవల చిత్రకారులలో పి.టి.రెడ్డి, యస్.వి. రామారావు, చంద్రసంజీవదేవ్, బాపూలు కొత్త ఒరవడిని సృష్టించారు. బాపుచిత్రాలు గొప్ప సంచలనాన్ని కల్గించినవి, బాపు సినిమా డైరెక్టరుగా కూడా పనిచేసి కీర్తి పొందారు.

20 వ శతాబ్దంలో సాంస్కృతిక పునరుద్ధరణతో చిత్రకళ నూతన చైతన్యాన్ని పొందినది. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కూల్డ్రే, బందరులో ప్రమోద్ కుమార్ చటోపాధ్యాయ చిత్రకళను ప్రోత్సహించారు. వారి ప్రోత్సాహంతో అనేకమంది చిత్రకారులు నూతన ఉత్సాహంతో చిత్రకళకు జీవం పోశారు. వారు భిన్న విధాలుగా దానిని అభివృద్ధి చేశారు. అట్టివారిలో వడ్డాది పాపయ్య, దామెర్ల రామారావు, అడవి బాపిరాజు, వి.వి. భగీరధ, సి.ఎస్. వెంకటరావులు ప్రముఖులు. వారిలో దామెర్ల రామారావు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించారు. అడవి బాపిరాజు చిత్రించిన తిక్కన కవి చిత్రానికి ఆంధ్ర విశ్వకళా పరిషత్తు బహుమతిని ప్రకటించింది. చిత్రకళలలో బోధన గూడా ప్రారంభం అయింది. రాజమండ్రిలో రామరాయ కళాశాల హైదరాబాద్‌లో గవర్నమెంటు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, పెనుగొండలో రాయలసీమ ఆర్ట్స్ అకాడమీ, మద్రాసులో అభ్యుదయ చిత్రకార సంఘం చిత్రకళను బోధిస్తున్నాయి.

**20.4.3 తోలుబొమ్మలాట** : ఆంధ్రదేశంలో శతాబ్దాల తరబడి ప్రజలకు వినోద విజ్ఞానాలను కల్గించిన కళ తోలుబొమ్మలాట. కవిత్వం, సాహిత్యం, సంగీతం, చిత్రకళలన్నీ ఇందు మిళితమైవున్నాయి. కడుపుబ్బ నవ్వించే హాస్యం వుంటుంది. వెనుకనుండి బొమ్మనాడించే వ్యక్తిని సూత్రదారుడంటారు. బళ్ళారిలో బలిజులు, గోదావరి జిల్లాలో తెలుగుగొల్లలు, విశాఖ జిల్లాలో ఈటిబొందిలి వారు ఈ ప్రదర్శనలిస్తారు. ఆంధ్ర దేశంలో తోలుబొమ్మలాట వాళ్ళు కుటుంబాలు విశాఖ జిల్లాలోని సర్వసిద్ధి, శృంగవరపుకోట, కళ్ళేపల్లి అగ్రహారం, గోదావరి జిల్లాలో మండపేట, అంగర, తణుకు, అనంతపురం జిల్లాలో కడమలకుంట, ఆవులన్న, జరుట్ల రామాపురం, బళ్ళారి జిల్లా సొండూరు, తోరణగల్లు, బొమ్మలాటపల్లి, నెల్లూరు జిల్లాలో సింగరాయకొండ, కర్నూలు జిల్లాలో రాయదుర్గం, బెళగళ్ళు మొదలగు ప్రదేశాలలో నివశిస్తున్నారు. తోలుబొమ్మలాటకు భారత, రామాయణగాధలే ఇతివృత్తాలు. అందు లంకాదహనం మైరావణ చరిత్ర, ఇంద్రజిత్తువధ, యయాతికథ, కీచకవధ, దుశ్శాసనవధ, ప్రహ్లాద చరిత్ర, రంగనాధ రామాయణం ఘట్టాలు అద్భుతంగా ప్రదర్శిస్తారు. పురాణకథలేగాక దేశింగురాజుకథ, కుమార రాముకథ, పలనాటి వీర చరిత్ర మొదలగు చారిత్రక కథలను కూడా ప్రదర్శిస్తారు. తోలుబొమ్మలాట వారి సాహిత్యం అంటూ యేమీలేదు. వారు యక్షగానాలనే బొమ్మలాట సాహిత్యంగా ఉపయోగించుకున్నారు. 1893 లో పర్లాకిమిడి వద్దనున్న పాతపట్నానికి చెందిన కోట వెంకటప్పయ్య బాణాసుర నాటకాన్ని వ్రాశారు. ఆయన ఆ నాటకాన్ని తోలుబొమ్మలాట వారికి వ్రాసినట్లు పీఠికలో చెప్పుకున్నారు. అట్లే వాణె సుబ్బరాజు, గాజుల వెండ్లూరి శేషగిరి రాజు అనే ఇద్దరు కవులు సంతవేలూరు కుశలవుల నాటకాన్ని రచించారు. అది ఆరురాత్రుళ్ళు ప్రదర్శించడానికి వీలుగా వ్రాశారు. దానిని వీధి నాటకంగాను, యక్షగానంగాను, బొమ్మలాటగాను ప్రదర్శించడానికి ఉపయోగించారు. మేక, దుప్పి, జింక చర్మాలను శుద్ధిచేసి బొమ్మలు తయారు చేసి వాటికి రంగులు పూసి తెరవెనుక ఆడించేవారు. చక్కనిపాటలు, అష్టావధానాలతో సాగేవి. శతాబ్దాలుగా ఆంధ్రప్రజలను తోలుబొమ్మలాటలు అలరించాయి. జుట్టుపోలుగాడు, బంగారక్క పాత్రలతో ప్రజలను కడుపుబ్బ నవ్వించేవారు.

**20.4.4 బుర్రకథలు :**

ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం పొందినవి బుర్రకథలు. వాస్తవానికి ఈ బుర్రకధలు చాలా ప్రాచీనమైనవి. పూర్వం వాటిని జంగంకథలు అని అనేవారు. జంగం దేవరులు వీరశైవ మతానికి చెందినవారు. వారు శివగాథలను గానం చేస్తూ ప్రచారం చేసుకొనేవారు. వీరశైవులు ఆవేశపరులు. కనుక తమ మతప్రచారాన్ని కూడా ఆవేశంతో ప్రచారం చేసుకొనేవారు.

జంగంకథలలో ప్రధానకథకుడు తంబురాను ధరించి శృతిని మీటుకుంటూ, చేతి అందెలతో తాళంవేస్తూ, కాళ్ళతో నృత్యం చేస్తూ కథను ప్రారంభిస్తాడు. రెండు ప్రక్కలావున్న వంతదార్లు రెండు గుమ్మెటలను తగిలించుకొని తద్దిమిత తద్దిమిత అంటూ దరువు వేస్తూ తధిగిణతోం తధిగిణతోం అంటూ, మధ్యమధ్య అరెరె, భళిభళి అంటూ కథకునికి హుషారు కల్గిస్తూ చుట్టూ తిరుగుతుంటారు. కథకుడు కథను వివరిస్తే, వంతదారుడు ప్రేక్షకులకు వచ్చే అనుమానాలను హాస్యధోరణిలో కథకుని ప్రశ్నించి, సున్నిత హాస్యంతో ప్రజలకు అర్థమయ్యేటట్లు చేసి, కథను ముందుకు నడిపిస్తారు. కథకునికి, వంతదారులకు జరిగే సంభాషణలతో కథాగమనం సాగుతుంది. ఒక్కచేతిగుడ్డను వూపుకుంటూ రెండో చేతితో తంబురాను మీటుతూ కాళ్ళగజ్జెలు ఘల్లు ఘల్లుమనేటట్లు నృత్యం చేస్తూ చేతులు ఊపుకుంటూ సాత్విక, ఆంగిక చలనాదులతో హంగామా చేస్తూ ప్రేక్షకులను కళ్ళు త్రిప్పనివ్వకుండా కట్టిపడవేస్తారు. ఈ కళారూపాన్ని వీరబసవని అనుయాయులైన జంగాలు ప్రారంభించి వుండవచ్చును. కాకతీయ యుగం చివరలో రచించబడిన

క్రీడాభిరామంలో తందాన ప్రస్తావనవున్నది. కనుక క్రీడాభిరామంలో బుర్రకథ గానరూపంలో వున్నదని తిరుమల రామచంద్రరావు జయంతి పత్రికలో వ్రాశారు. ఈ జంగమ కథలనుండే యక్షగానాలు, వీధినాటకాలు జన్మించినవని కొందరంటారు. శారదకాండ్రు అని పేరు గల తెలంగాణాలో నివశించే కులంవారు దీనిని ప్రధాన వృత్తిగా స్వీకరించారు. వీరి జట్టులో పురుషుడు ఒక కథ చెబితే స్త్రీలు వంతపాడుతారు. సాధారణంగా వారు భార్య భర్తలైవుంటారు. ఒక్కోక్కప్పుడు ఒక్కస్త్రీయే ఢక్కాకొడుతుంది. దానిని డమ్కీ అనేవారు. శారదకాండ్రు చారిత్రాత్మక గేయాలు పాడుతారు. తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన సదా శివారెడ్డి కథ, సర్వాయి పాపారాయుడు కథలను వీరావేశంతో చెబుతారు. వీరంతా శైవమతస్థులే. వారికి ఎల్లమ్మ, పోచమ్మ దేవతలు. జంగం కులం నుండే శారదకాండ్రు కులం వేరైనదని భావిస్తారు. జంగం కథలలో ప్రధాన కథకుడు తంబురాను వాయిస్తాడు. అది బుర్రవలె వుంటుంది. కనుక వారి కథకు బుర్రకథ అని పేరు వుండవచ్చని పండితుల అభిప్రాయం. తంబురాకథ అనిగూడా పిలుస్తారు. వంతదార్లు వాడే గుమ్మెట్లకు గూడా ఢక్కలని, బుర్రలని పేర్లున్నవి. కనుక బుర్రకథ అని పేరుపొంది వుంటుంది.

బుర్రకథను సామాజిక ప్రయోజనం కోసం కమ్యూనిస్టు పార్టీ ఉపయోగించింది. ప్రజానాట్య మండలి కళాకారులు ఈ కళ ద్వారా ప్రజలను సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా చైతన్యపరచారు. ఈ కళలో ప్రసిద్ధి గాంచిన వారిలో మోటూరు ఉదయం, షేక్ నాజర్ ముఖ్యులు.

**20.4.5 ఆధునిక నాటకం** : క్రీ.శ. 1860 వరకు మధ్యయుగపు నాటక రూపాలయిన వీధి నాటకాలు, యక్షగానాలే నాటక రూపాలుగా ప్రజలకు వినోద విజ్ఞానాలను అందించాయి. 1835 లో ఇంగ్లీషు విద్యను ప్రవేశ పెట్టినప్పటినుండి భారతీయ సంస్కృతిపై ఇంగ్లీషు భాషా సాంప్రదాయాల ప్రభావం పడింది. దాని ఫలితంగా నాటకరంగం గూడా ప్రభావితమైంది. 1860 నుండి ఇంగ్లీషు, సంస్కృత నాటకాల ఆధారంగా తెలుగు నాటక రచన ప్రారంభం అయింది. 1860 లో కోరాడ రామచంద్ర శాస్త్రి "మంజరీ మధుకరీయం" అనే నాటకాన్ని వ్రాశారు. అదే తెలుగులో ప్రప్రథమ నాటకం. అదే సమయంలో ధార్వాడ నాటక సమాజంవారు ఆంధ్రదేశంలో హిందీ నాటకాలను ప్రదర్శించడం ప్రారంభించారు.

అనేక పట్టణాలలో ముఖ్యంగా రాజమండ్రి, బళ్ళారి పట్టణాలలో నాటక సమాజాలు స్థాపించబడ్డాయి. మొదట స్వతంత్ర నాటకాలు రచించలేదు. సంస్కృతం, ఇంగ్లీషు నాటకాలకు అనువాదాలు చేశారు. 1880 దశకంలో స్వతంత్ర నాటకాల రచన ప్రారంభం అయింది. 1880 లో ధర్మవరం రామకృష్ణాచార్యులు చిత్ర నళీయం, సారంగధర స్వతంత్ర నాటకాలుగా రచించారు. ఈయన సమకాలికుడు బళ్ళారికి చెందిన శ్రీ కోలాచలం శ్రీనివాసరావు చాంద్‌బీబీ, మైసూరు రాజ్యం అను స్వతంత్ర నాటకాలు వ్రాశారు. ఈయన 30 నాటకాలు రచించారు అందు విజయనగర సామ్రాజ్య పతనం చాలా పేరు ప్రఖ్యాతులు పొందింది. ఈయన చారిత్రక నాటక రచనపైన తన దృష్టిని కేంద్రీకరించారు. ఈ నాటకాలన్నీ ప్రదర్శించడం ప్రారంభించారు. దానితో స్వతంత్ర తెలుగు నాటకరంగం ప్రారంభమయింది.

వీరేశలింగం, వేదం వెంకట రామశాస్త్రి, వడ్డాది సుబ్బారాయుడు, ఇమ్మానేని హనుమంతరావు, మానపల్లి రామకృష్ణ కవి, చిలకమర్తి లక్ష్మీనరసింహం మొదలగువారు నాటకరచన చేపట్టి గొప్ప నాటకాలు వ్రాశారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు రచించిన పాదుకా పట్టాభిషేకం, వేదం వెంకట రామశాస్త్రి రచించిన ప్రతాపరుద్రీయం చాలా ప్రఖ్యాతి చెందిన నాటకాలు. చిలకమర్తి రచించిన గయోపాఖ్యానం, ప్రసన్నయాదవం, పారిజాతాపహరణం గొప్ప ప్రజాదరణ పొందాయి. ఈ నాటకాలలో టంగుటూరి ప్రకాశంపంతులు స్త్రీ పాత్రలు ధరించేవారు. బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన హరిశ్చంద్ర ప్రఖ్యాతి పొందింది. ఈ కాలంలో సురభి నాటకరంగం, రామాంజనేయ నాటక సమాజం, బాలభారతి సమాజాలు నాటకాలను గొప్పగా ప్రదర్శించి ప్రజల మన్ననలను పొందాయి. బళ్ళారి రాఘవ, స్థానం నరసింహారావు, శ్రీహరి ప్రసాదరావు, యడవల్లి సూర్యనారాయణ, అద్దంకి శ్రీరామమూర్తి, వేమూరి గగ్గయ్య మొదలగు మహానటులు వెలుగులోకి వచ్చారు. వారిలో బళ్ళారి రాఘవ సాటిలేని మేటినటుడిగా కీర్తి పొందాడు. తెలుగులోనేగాక ఇంగ్లీషు నాటకాలలో గూడా గొప్ప ప్రజ్ఞను చాటాడు. మద్రాసు బెంగుళూరులలో అతడు షైలాక్, బదెల్లో పాత్రాలలో అద్భుత కౌశల్యం చూపి ప్రేక్షకులను రంజింపచేశాడు. దానితో ఆయన కీర్తి ఇంగ్లండ్ వరకు ప్రాకింది. ఇంకా నాటకాలలో విశ్వనాధవారి వేనరాజు, నర్తనశాల,

తిరుపతి వెంకట కవుల పాండవోద్యోగ విజయాలు, త్రిపురనేని రామస్వామిగారి ఖూనీ, శంబుకవధ ముఖ్యమైనవి. వీటిలో తిరుపతి వెంకట కవులు రచించిన పాండవోద్యోగ విజయాలలోని పద్యాలు పామరుల నోళ్ళలో నాట్యం చేస్తాయి. విద్యాగంధంలేని మారుమూలపల్లె ప్రజలు గూడా పౌరాణిక సినిమాలు గూడా ఈ నాటక ప్రభావానికి లోనయ్యాయి.

క్రమేపి సాంఘిక నాటకాలు ప్రారంభం అయ్యాయి. సాంఘిక నాటకాలలో అగ్రస్థానం గురజాడ అప్పారావు వ్రాసిన కన్యాశుల్కానికి దక్కుతుంది. అది సమాజంలోని బాల్యవివాహం, వితంతు సమస్యలకు అద్దం పట్టింది.

గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం అత్యుత్తమ నాటకంగా ప్రసిద్ధి చెందింది. గురజాడ, విజయనగర జమీందారైన పూసపాటి ఆనంద గజపతిరాజు ప్రోత్సాహంతో ఈ నాటకాన్ని రచించారు. కన్యాశుల్కం తీసుకొని పసికందులను సహితం వృద్ధులకిచ్చి వివాహాలు చేసేవారు. దానిని నిరసిస్తూ ఈ నాటకాన్ని ఆయన 1897 లో రచించారు. మరలా దానిలో కొన్ని మార్పులు చేర్పులు చేసి 1909 లో మరలా వ్రాశాడు. ఈ నాటకం వ్యవహారిక భాషలో వ్రాయడంవలన మంచి ప్రాచుర్యం పొందింది. ఇందులోని గిరీశం, మధురవాణి పాత్రలు ఆనాటి సాంఘిక జీవితానికి అద్దం పట్టాయి.

నాటకాలలో సంఘ సంస్కరణ ప్రధాన లక్ష్యంగా ప్రహసన ప్రక్రియ ప్రారంభం అయింది. 1920 నుండి దీర్ఘనాటకాలు కాక చిన్న నాటికలు. ఏకాంకికలు, రచనలు ప్రారంభమయి గొప్ప ప్రజాదరణ పొందాయి. రాజమన్నారు రచించిన తప్పెవరిది, ఏమి మగవాళ్ళు బాగా ప్రచారం పొందాయి. 1943 తరువాత నాటికలు వ్రాసిన వారిలో బుచ్చిబాబు, ఆచార్య, ఆత్రేయ, నార్ల వెంకటేశ్వరరావు మొదలనవారు ప్రముఖులు. వారిలో ఆత్రేయ రచించిన ఎన్.జి.వో. అనే నాటిక ప్రభుత్వ ఉద్యోగాలలో చాలీచాలని జీతాలతో జీవించే గుమస్తాల జీవితాలను చిత్రించింది. 1930 తరువాత భారతదేశంలోను, ఆంధ్రదేశంలోను సినిమాయుగం ప్రారంభమైంది. దానితో నాటకరంగాలు చెల్లాచెదురైనవి.

ఆధునిక నాటకాల ప్రధాన ఇతివృత్తాలు వివిధ సాంఘిక, ఆర్థిక సమస్యలు. రసానందానికి, కాలక్షేపానికి కాక, విజ్ఞాన జాగృతిని కల్గించటం ఈ ఆధునిక నాటకాల లక్ష్యం. దామరాజు పుండరీకాక్షుడు రచించిన అనేక నాటకాలలో పాంచాలీ పరాభవం, జలియన్ వాలాబాగ్ ఇతివృత్తంగా రచించిన నాటకం స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చింది.

**కమ్యూనిస్టు నాటకాలు** : కమ్యూనిస్టులు తమ సిద్ధాంతాల ప్రచారం కొరకు శక్తివంతమైన నాటకాలు రచించారు. సుంకర సత్యనారాయణ రచించిన "మా భూమి", "ముందడుగు" ఆనాడు గొప్ప సంచలనాన్ని సృష్టించాయి. మా భూమి నాటకం భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు జరిపిన పోరాటాన్ని చిత్రించింది. 1942-46 సంవత్సరాల మధ్యకాలంలో కమ్యూనిస్టులు తమ సాంస్కృతిక సంస్థ అయిన ప్రజానాట్యమండలి ద్వారా ఈ నాటకాలను ప్రదర్శించి తమ పార్టీ సిద్ధాంతాలను ప్రచారం చేసుకొన్నారు. మా భూమి నాటకాన్ని నిజాం ప్రభుత్వం కొన్నాళ్ళు నిషేధించింది.

**నిషేధించిన నాటకాలు** : ఈ రెండు నాటకాలేగాక 1919-1948 సం॥ల మధ్య 28 నాటకాలు నిషేధింపబడ్డాయి. నాటకాల రచయితలతోబాటు నటించిన వారిని గూడా జైలుకు పంపారు. సోమరాజు రామానుజరావు 1919 లో వ్రాసిన తిలక్ రాయబారం నిషేధానికి గురయిన మొట్టమొదటి రాజకీయ నాటకం. చిచ్చరపిడుగు, మహారాణి ఝాన్సీలక్ష్మీబాయి, జమీన్‌రైతు, కష్టజీవి నిషేధించబడిన వాటిలో అతిముఖ్యమైన నాటకాలు. నాటక రచయితలు సినిమా రచయితలుగా మారిపోయారు. నాటకాలలో నటించే నటులు గూడా సినిమావైపు మళ్ళిపోయారు. దానితో నాటక కళ క్షీణించి పోయింది.

**20.4.6 తెలుగు సినిమా రంగం** : సమాజాన్ని శక్తివంతంగా ప్రభావితం చేయగల కళారూపం సినిమా. ఇది ఫొటోగ్రఫి నుండి ఆవిర్భవించినట్లుగా భావించవచ్చు. భారతీయ సినిమాకే ఆద్యుడు రఘుపతి వెంకయ్య. ఫొటోగ్రఫి మీద ఆసక్తితో ఇతడు మద్రాసులో ఫొటో స్టూడియోతో తన జీవితాన్ని ప్రారంభించాడు. ఇంగ్లాండు నుంచి శక్తివంతమైన యంత్రాన్ని తెప్పించి 1909 లో ఒక మూకీ చిత్రాన్ని నిర్మించి మద్రాసుల్లోని విక్టోరియా హాలులో ప్రదర్శించారు. ప్రజల స్పందనను గమనించిన ఆయన 1910 లో మద్రాసులో టెంట్ సినిమా హాలు నిర్మించి చిత్రాలను ప్రదర్శించాడు. ఈయన సినిమా నిర్మాతేగాక ప్రప్రథమ తెలుగు సినిమా ప్రదర్శకుడు.

భారతదేశంలో తొలి సినిమా నిర్మాతగా, సినిమా పరిశ్రమకు ఆద్యుడుగా చరిత్ర ప్రసిద్ధుడయ్యాడు. ఇతడు సంఘసంస్కర్త అగు రఘుపతి వెంకటరత్నం నాయుడి తమ్ముడు.

సినిమా పరిశ్రమ త్వరితగతిన అభివృద్ధి చెందటంతో సినిమాహాళ్ళ నిర్మాణం కూడా ఆరంభమైంది. ఆంధ్రలో రాజమండ్రిలో నిడమర్తి వారు కృష్ణా పిక్చర్‌పాలెస్ అను సినిమాహాలును 1924 లో నిర్మించారు. రఘుపతి వెంకయ్య పన్నెండు చలన చిత్రాలను బందరు టౌన్ హాలులో ప్రదర్శించారు.

రఘుపతి వెంకయ్య తరువాత తెలుగు సినిమారంగ అభివృద్ధికి పాటుపడిన వారిలో సి. పులయ్య, హెచ్. ఎం. రెడ్డి, ఎల్.వి. ప్రసాద్, చిత్రపు నరసింహారావు ప్రముఖులు. సినిమా పరిశ్రమ అభివృద్ధిని సాంకేతికంగా రెండు దశలుగా విభజించవచ్చు. మొదటి దశ మూకీ దశ. ఇది 1909 నుండి 1930 వరకు కొనసాగింది. ఈ దశలో రఘుపతి వెంకయ్య పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు. రెండవ దశ 1930 నుండి 1940 వరకు సాగిన టాకీ దశ. హెచ్. ఎం. రెడ్డి టాకీ సినిమాల శకానికి నాంది పలికాడు. గూడవల్లి రామబ్రహ్మంగారు 'రైతుబిడ్డ' 'మాలపిల్ల' మొ॥ సాంఘిక చిత్రాలు నిర్మించటం ద్వారా ప్రసిద్ధ దర్శకులుగా రూపొందారు.

నిర్మాణపరంగా సినిమా రంగాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. మొదటి దశ 1931 నుండి 1936 వరకు సాగింది. ఈ దశలో నాటక రంగానికి చెందిన పౌరాణిక చిత్రాలు నిర్మించబడ్డాయి. రెండవ దశ 1936-42 వరకు కొనసాగిన దశ. ఈ దశలో సాంఘిక సంస్కరణ చిత్రాలు వచ్చాయి. మూడవ దశ 1942 నుండి 1950 ల వరకు కొనసాగిన దశ. ఈ కాలంలో భక్తిరస చిత్రాలు, జానపద చిత్రాలు నిర్మించబడ్డాయి.

**మొదటిదశ 1931-1936 నాటకరంగ చిత్రాలు** : ప్రారంభదశలో అనగా 1931 నుండి 1936 వరకు 4 లేక 5 సం॥లు వరుసగా నాటకరంగానికి చెందిన చిత్రాలు వచ్చాయి. మొదటి టాకీ భక్త ప్రహ్లాద ధర్మవరపు కృష్ణమాచార్యులు రచించిన నాటకమే. ఆ నాటకం ఆనాడు ప్రదర్శించబడుతూ వుండేది. ఈ దశలో నటించిన నటులందరూ నాటకరంగానికి చెందినవారే. మాధవపెద్ది వెంకట్రామయ్య, వేమూరి గగ్గయ్య, కొచ్చర్లకోట, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, బళ్ళారి రాఘవ, కన్నాంబ మొ॥న రంగస్థల నటులు నటించేవారు. 1932లో రెండు చిత్రాలు విడుదలయినవి - పాదుకాపట్టాభిషేకం, శకుంతల. ఈ రెండు చిత్రాలు రంగస్థలంలో ప్రాచుర్యం పొందినవే. ఈ రెండు చిత్రాలలో ఎడవల్లి, సురభి కమలాబాయి నాయిక, నాయకలుగా నటించారు. 1933 లో ఆరు చిత్రాలు వచ్చాయి. అవిగూడా అటువంటివే. రామదాసు, సావిత్రి, చింతామణి, పృధ్వీపుత్ర అను చిత్రాలు తీయబడ్డాయి. సి.ఎస్.ఆర్, రామతిలకం నటించిన 'రామదాసు' చిత్రం బాగా పేరు తెచ్చుకుంది. నాటక రంగంలో సి.యస్.ఆర్.కి మంచి పేరుతెచ్చిన పాత్ర అదే. సావిత్రిలో వేమూరి గగ్గయ్య యమధర్మరాజుగా అద్భుతంగా నటించి గొప్పపేరు సంపాదించుకున్నాడు. అట్లాగే పృధ్వీపుత్రలో రఘురామయ్య, పారుపల్లి సత్యనారాయణలు నటించి పేరుపొందారు. వీరితోపాటే ఆ కాలంలో కీర్తిపొందిన మరికొంతమంది రంగస్థల నటీనటులుండేవారు. రామతిలకం, పులిపాటి వెంకటేశ్వర్లు, పారుపల్లి సుబ్బారావు, అద్దంకి, తంగల చలపతి, కన్నాంబ మొ॥వారు. వీరంతా నాటకరంగంనుండి సినిమారంగానికి తరలివచ్చారు. దానితో నాటకరంగం అదృశ్యమై సినిమారంగం దినదిన ప్రవర్ధమానమైనది. నాటకరంగ నటులే సినిమా నటులైనందువలన ఈ దశలో చిత్రీకరణలో నాటకీయత పాలు ఎక్కువగా వుండేది. నాటకాలలాగే సినిమాలలో గూడా దాదాపు అవే పద్యాలు, పాటలూ పాడేవారు. నాటకరంగానికి సంబంధం లేకుండా సినిమారంగంలో ప్రవేశించి మంచి గాయకుడుగా పేరు తెచ్చుకున్నవాడు సాలూరి రాజేశ్వరరావు. అతడు బాల గాయకుడుగా వేల్స్ పిక్చర్సువారి రెండవ చిత్రమైన సీతాకళ్యాణం ద్వారా సినిమారంగంలో ప్రవేశించారు. అతడు అందులో కృష్ణపాత్ర ధరించిన వేమూరి గగ్గయ్యతో కలిసి పాడిన పద్యాలు, పాటలు గ్రామఫోను రికార్డులుగా ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించాయి. ఈ దశలో ద్రౌపది ఇతివృత్తంగా రెండు సినిమాలు తీశారు. ఒకటి మాన సంరక్షణ, రెండవది వస్త్రాపహరణం ఈ రెండు చిత్రాలు పోటాపోటీగా విడుదలయి సంచలనం సృష్టించాయి. వాటిలో సి.ఎస్.ఆర్, కన్నాంబ నటించిన వస్త్రాపహరణం బాక్సాఫీసు బద్దలు చేసింది. ఈ దశలోనే 1934 లో సి. పుల్లయ్య తీసిన లవకుశ, శ్రీకృష్ణ తులాభారం, అట్లే కొచ్చర్లకోట రంగారావు నటించిన అహల్య, కుచేల. అద్దంకి, కన్నాంబలు నటించిన హరిశ్చంద్ర ఇవన్నీ నాటకరంగం నుండి తెచ్చుకున్నవే కనుక మొదటిదశ సినిమాలన్నీ నాటకరంగపు పౌరాణిక చిత్రాలని చెప్పవచ్చును.

**రెండవ దశ 1936 - 1942 - సాంఘిక సంస్కరణల ఇతివృత్తం :** ఈ విధంగా నాటకరంగానికి చెందిన పౌరాణికాలు తీస్తున్న దశలో క్రమేపి మార్పువచ్చి, సాంఘికాలవైపు దృష్టి మళ్ళింది. అందుకు కారణం ఆనాడు నడుస్తున్న స్వాతంత్ర్య సంగ్రామం. దేశమంతటా దేశభక్తి ప్రధానాంశంగా మారింది. స్వాతంత్ర్య సమరంతో పాటు సాంఘిక దురాచారాలను గూడా ఆ రోజులలో ఎత్తిచూపటం జరిగింది. ముఖ్యంగా 1932 నుండి గాంధీ హరిజనోద్యమాన్ని ప్రారంభించారు. డా॥ అంబేద్కర్ దళిత హక్కుల కొరకు పోరాటం మొదలుపెట్టి 1935 లో కమ్యూనల్ అవార్డును సాధించాడు. ఈ పరిణామాల ప్రభావం సినిమారంగం మీదపడి సాంఘిక సంస్కరణల లక్ష్యంతో నూతన ఇతివృత్తాలను తీసుకొని సినిమాలు తీశారు. ఈ నేపధ్యంలో 1936 వ సం॥లో కృత్తివెన్ను నాగేశ్వరరావు ప్రేమ విజయం అనుపేరుతో సామాజిక ప్రయోజనంతో చిత్రం నిర్మించారు. అదే మొదటి సాంఘిక చిత్రం. ఆ చిత్రంలో నటించిన ప్రబల కృష్ణమూర్తి తొలి సాంఘిక హీరో అనుకోవాలి. 1937 లో కె. సుబ్రమణ్యం నిర్మించిన బాలయోగిని ఇదే కోవకు చెందినది. హెచ్.ఎం. రెడ్డి. మద్యపాన దురాచారాన్ని దృష్టిలో పెట్టుకొని రోహిణీ పిక్చర్ బ్యానర్‌పై నిర్మించిన గృహలక్ష్మి గూడా గొప్పసాంఘిక చిత్రమే. తెలుగు చలన చిత్రపు అసలైన తొలిహీరోగా ప్రసిద్ధిచెంది, అశేషంగా ప్రఖ్యాతిగాంచిన చిత్తూరి నాగయ్య ఈ చిత్రం ద్వారానే సినిమారంగంలోనికి అడుగుపెట్టాడు. గూడవల్లి రామబ్రహ్మం 1938 లో కులవ్యవస్థ ఇతివృత్తంతో మాలపిల్ల చిత్రాన్ని నిర్మించాడు. అది ఆనాడు గొప్ప సంచలనాన్ని సృష్టించిన సాంఘిక చిత్రంగా పేరు పొందింది. ఈ చిత్రంలో కాంచనమాల తారాస్థాయికి ఎదిగింది. గోవిందరాజుల సుబ్బారావు కూడా ఈ చిత్రం ద్వారానే పరిచయ్యమైనాడు. ఈ చిత్రం హరిజనోద్ధరణ అస్పృశ్యత నివారణ వంటి గాంధేయ సిద్ధాంతాలకు అద్దం పట్టింది. 1939 లో సి. పుల్లయ్య వరకట్న దురాచారం మీద వరకట్నం అనే పేరుతో మరొక సాంఘిక చిత్రాన్ని నిర్మించాడు. అట్లే బి.ఎన్.రెడ్డి నిరుద్యోగ సమస్య మీద వందేమాతరం అను పేరుతో మరోక చిత్రం నిర్మించాడు. వితంతు వివాహంపై వై.వి.రావు చిత్రాన్ని నిర్మించాడు. బి.ఎన్.రెడ్డి మళ్ళీపెళ్ళి, సుమంగళి అను చిత్రాలను, గూడవల్లి రామబ్రహ్మం రైతుబిడ్డ అను చిత్రాలు నిర్మించారు. బ్రిటిషు వారి రెవెన్యూ విధానాలు, జమిందారీలోని రైతులు పడే బాధలను రైతుల కడగండ్లను రైతుబిడ్డ సినిమా అద్భుతంగా చిత్రించి ఆనాడు రాష్ట్రంలో గొప్ప సంచలనాన్ని రేకెత్తించింది. అందువలన అనేకమంది జమిందార్లు ఆ సినిమాను నిరసించారు. ముఖ్యంగా వెంకటగిరి సంస్థానంలో ఆ సినిమా ప్రదర్శన నిషేధింపబడింది. ఆ సినిమా ప్రదర్శించిన హాలుపై దాడి జరిగింది. 1938 లో జయా బ్యానర్ జీవన జ్యోతి తీశారు. అందులో సి.హెచ్. నారాయణరావు పరిచయం అయ్యాడు. ఇతడు నాటకరంగ ఒరవడికి భిన్నంగా డైలాగులు చెప్పి, ప్రత్యేకతని నిలుపుకున్నాడు.

**మూడవ దశ 1942-1950 :** 1942 లో కె.వి.రెడ్డి సినిమారంగంలోనికి ప్రవేశించాడు. ఆయన ప్రముఖుల జీవిత చరిత్రలపై సినిమాలు తీసే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఆయన 1942 లో భక్తపోతన చిత్రాన్ని తీశాడు. అందులో చిత్తూరు నాగయ్య భక్తపోతనగా నటించాడు. ఈ చిత్రంలో తనకు వచ్చిన పేరుతో నాగయ్య స్వయంగా చిత్ర నిర్మాణం చేపట్టి తానే పాత్రధారిగా 1946 లో త్యాగయ్య సినిమా నిర్మించాడు. ఈ రెండు సినిమాలు ఆంధ్రదేశంలో భక్తి రసాన్ని కురిపించాయి. ఘంటసాల బలరామయ్య ప్రతిభా సంస్థను స్థాపించి 1944 లో శ్రీ సీతారామ జననం తీశాడు. ఈ సినిమాలో అక్కినేని నాగేశ్వరరావు నాయక పాత్ర ధరించారు. ఈ సినిమాతోనే అక్కినేని నాగేశ్వరరావుకు సినిమా జీవితం ప్రారంభమైనది. 1944 నుండి సాంఘిక సినిమాలు తగ్గిపోయాయి. ఈ కాలంలో జానపద సినిమాలకు చాలా ప్రాచుర్యం వచ్చింది. బాలరాజు, కీలుగుర్రం సినిమాలు కనకవర్షం కురిపించాయి. ఈ రెండు సినిమాలలో అక్కినేని నాగేశ్వరరావు నటించి గొప్ప పేరు సంపాదించుకున్నారు. ఇదే సమయంలో అదృష్టదీపుడు, ప్రతిజ్ఞలాంటి జానపదాలు వచ్చాయి. ఈ సినిమాల కాలంలో కత్తియుద్ధాలకు మంచి స్పందన వచ్చింది. ఇదే సమయంలో విజయ బ్యానర్ చిత్రరంగంలోకి ప్రవేశించినది. అక్కినేని ప్రవేశించిన 5 సం॥లకు అనగా 1949 లో ఎన్.టి. రామరావు మనదేశం అను సినిమాలో ఒక చిన్న పాత్ర ద్వారా సినిమారంగంలోకి ప్రవేశించాడు. ఈ సినిమాకు ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వం వహించాడు. అనగా ఘంటసాల బలరామయ్య అక్కినేని నాగేశ్వరరావును ఎల్.వి. ప్రసాద్ ఎన్.టి. రామరావును సినిమారంగంలోనికి తీసుకువచ్చారు. విజయా బ్యానరుపై అనేక చిరస్మరణీయమైన చిత్రాలు వచ్చాయి. 1949 లో వాహిని బ్యానర్‌వారు కె.వి. రెడ్డి దర్శకత్వంలో గుణసుందరి కథ నిర్మించారు. ఇది గొప్ప లాభాలనార్జించింది. 1950 లో విజయా బ్యానర్‌పై షావుకారు వచ్చింది. ఈ చిత్రం ద్వారా జానకి చిత్రరంగానికి పరిచయమయ్యారు. కె.వి. రెడ్డి, బి.ఎన్.రెడ్డి రేవతి స్టూడియోను కొని తమ బ్యానర్లైన వాహిని, విజయాలను కలి[illegible] యవాహినిగా మార్చారు. అప్పటినుండి అది స్టూడియోగా

అభివృద్ధి చెందినది. ఈ విధంగా తెలుగు సినిమా ఈ మూడవ దశలో నిలద్రొక్కుకున్నది. ఈ విధంగా అన్ని విధాల తెలుగు సినిమా 1950 నాటికి బాగా స్థిరపడింది.

## 20.5 సమీక్ష :

సాహితీ, సాంస్కృతిక రంగాలలో 1950 తరువాత అనేక నూతన మార్పులు ప్రవేశించాయి. సాహిత్యంలో విప్లవ దృక్పథం, దళిత దృక్పథం, స్త్రీవాద దృక్పథం ప్రవేశించాయి. సాంస్కృతిక రంగంలో సినిమారంగం అభివృద్ధి చెందింది. సాంకేతిక పరంగా వస్తున్న మార్పుల వలన అది ప్రజలకు చేరువ అవడంతో, ఇతర కళాప్రక్రియలు వెనుకంజ వేయసాగాయి.

## 20.6 వ్యాసరూప ప్రశ్నలు :

1. తెలుగు సాహిత్యంలో మార్పులు రావడానికి దోహదం చేసిన కారణాలను, నూతన సాహిత్య ధోరణులను వివరించండి.
2. ఆంధ్ర సాంస్కృతిక కళారూపాలను విశదీకరించండి.
3. ఆధునిక ఆంధ్రదేశంలో ఆవిర్భవించిన నాటక, సినిమారంగాలను వివరించండి.

## 20.7 ఉపయుక్త గ్రంథాలు :


1. పి. రఘునాథరావు : ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర
2. సి. నారాయణ రెడ్డి : ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు
3. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి : తెలుగువారి జానపద కళారూపాలు
4. తిరుమల రామచంద్ర : తెలుగు పత్రికల సాహిత్య సేవ
5. నటరాజ రామకృష్ణ : ఆంధ్రనాట్యం
6. నామాల విశ్వేశ్వరరావు : తెలుగు సినిమా


డా: ముప్పాళ్ళ హనుమంతరావు.